

## ఈ గ్రంథమును గూర్చి



మహనీయులను గూర్చి ఎంత విస్తృతంగా తెలుసుకుంటే మన భక్తిశ్రద్ధలు అంత బాగా ఉంటాయి. మహనీయునికి నమస్కరించేటప్పుడు ఒక్కొక్కరి శ్రద్ధ, భక్తి ఒక్కొక్క విధంగా ఉంటుంది. ఆ మహనీయుని నుండి ప్రత్యక్షంగా అనుభవం పొందినవారు, ఆ మహనీయుని గూర్చి గ్రంథం చదివిన వారు, ఎవరో ఆ మహనీయుని గూర్చి చెప్పగా విని వచ్చినవారి శ్రద్ధాభక్తులు వివిధంగా ఉంటాయి. కనుక ఈ మహనీయుని గూర్చి మనం చదివినదంతా మరలా మరలా మననం చేసి మన శ్రద్ధను పెంచుకొని నమస్కరించి వారినుండి దివ్యమైన అనుభవములు ప్రతి ఒక్కరూ పొందవలెననే ఉద్ధేశ్యముతో వీలైనన్ని ఎక్కువ లీలలు వ్రాయడం జరిగింది. అలాంటి అనుభవాలు ఇవ్వాలంటే వారెట్టి దివ్యస్థితిలో ఉండాలో ఎవరికివారే యోచించుకోవలసినది. మానవులపై అనంతమైన కరుణతో భగవంతుడే శ్రీ స్వామివారి రూపంలో మన దగ్గరికొచ్చారు. వారి సన్నిధిని సద్వినియోగ పరచు కొందుముగాక. జై సద్గురురాయా!

ప్రకాశకులు

దైవం మానుష రూపేణ

సద్గురు శ్రీశ్రీశ్రీ దర్గాస్వామి గారు

# దైవం మానుష రూపేణ

## సద్గురు శ్రీశ్రీశ్రీ దర్గాస్వామి గారు

(నేడు మన మధ్య నడిచే దైవం)

02-03-2018

నీలకంఠ రావు పేట, కడప జిల్లా



పర్యవేక్షణ - పెసల సుబ్బ రామయ్య

# దైవం మానుష రూపేణ

## సద్గురు శ్రీశ్రీశ్రీ దర్గాస్వామి గారు

(నేడు మన మధ్య నడిచే దైవం)

(02-03-2018)



**ప్రకాశకులు:** శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్

## అంకితము



శ్రీ భరద్వాజ మాస్టారు గారి పాద పద్మములకు

రెండవ ముద్రణ: 2018
సేకరణ : ప్రసాద్ మరియు రాజీవ్
పర్యవేక్షణ : శ్రీ పెసల సుబ్బరామయ్య

కాపీలకొరకు ఈ క్రింది అడ్రస్సులో సంప్రదించగలరు:
శ్రీ సాయి మాస్టరు సేవా ట్రస్టు
గొలగమూడి, వయా సర్వేపల్లి,
నెల్లూరు జిల్లా - 524 321
వెల: రూ. 50-00

Please visit www.saimastersevatrust.org

ఈ గ్రంథ రచనకు సహకరించిన వారందరికీ హృదయపూర్వక నమస్కారములు

# సూచిక


| | | పేజి సంఖ్య |
|---|---|---|
| ముందుమాట | | ii |
| దైవం మానుష రూపేణ | | iv |
| మహనీయులను ఎలా సేవించుకోవాలి | | v |

**అధ్యాయములు :**

| | | |
|---|---|---|
| 1 | శ్రీ స్వామి వారి జీవితము – పూర్వభాగము | 1 |
| 2 | శ్రీ స్వామి వారి జీవితము – ఉత్తరభాగము | 26 |
| 3 | సర్వజ్ఞుడు | 47 |
| 4 | సర్వ వ్యాపకుడు | 64 |
| 5 | సర్వ సమర్థుడు | 80 |
| 6 | భూత నియంత | 106 |
| 7 | సకల సాధు, దేవతా స్వరూపము | 110 |
| 8 | స్వామి దర్శన, ఆశీస్సుల మాహాత్మ్యము | 127 |
| 9 | ఆశ్రిత కల్పవృక్షము | 142 |
| 10 | భక్త చింతామణి | 176 |
| 11 | స్వామి సూక్తులు | 213 |
| 12 | స్వామి బోధ | 216 |
| 13 | బోధనా దక్షత | 230 |
| 14 | స్వామి ప్రసంగములు | 243 |
| 15 | అమ్మయ్యగారు | 271 |
| 16 | సద్ధర్మ సంరక్షకుడు | 284 |
| 17 | దర్బార్ నగరంలో నిత్య కార్యక్రమములు | 303 |
| 18 | ఉపసంహారము | 313 |
| | అనుబంధం | 315 |
| | దర్బార్ నగరంలో ఉత్సవాలు | 320 |

# ముందుమాట

సామాన్య భక్తులు నిరంతరము ధ్యానస్థితియందు మనస్సు నిలుపలేరు. ఇట్టివారికి మహనీయుల దివ్యలీలా చింతన చేయమని శ్రీ షిర్డీ సాయి ఆదేశించారు. ఒక మహనీయుని గూర్చి వారెంతటి గొప్పవారో తెలియకనే అందరూ నమస్కరిస్తుంటే, మనమూ నమస్కరించడం కాకుండా, ఆ మహనీయుడు వివిధ భక్తులకు ఇచ్చిన దివ్యానుభవాలను తెలుసుకుంటే పెల్లుబికి పొంగుచున్న భక్తిభావముతో నమస్కరిస్తాము. అందుకొరకు శ్రీ దర్గాస్వామివారు నన్నొక పరికరముగా చేసుకొని ఈ చిన్న గ్రంథమును మీకందిస్తున్నారు. ఈ గ్రంథమును నవలలాగా చదివి ప్రక్కన పడేసినట్లుగాక, ప్రతిలీలను బాగా హృదయగతం చేసుకొని సద్విమర్శ, మననం చేసి ఆ మహనీయుని స్థితిని విమర్శించుకుంటే వారి ఎడల నిజమైన భక్తిభావం ఏర్పడుతుంది. నిజమైన నమస్కారం చేయగల్గుతాము. ఇందుకు నిత్య సత్సంగము కనీసం వారమున ఒకసారైన భక్తులందరూ కలసి సత్సంగం చేసి చర్చించుకొనడం, భజన, నామస్మరణలు చేయడం అత్యంత అవసరం. శ్రీ దర్గాస్వామి దర్శనమునకు వెళ్ళేవారు ఈ గ్రంథమును దర్గాల దగ్గర పారాయణ చేయడం ద్వారా శ్రీ దర్గాస్వామి కృప విశేషంగా పొందగలరు. ఆ ప్రాంగణములో ఉన్నంత వరకు లౌకిక చర్చలు మాని ప్రదక్షిణలు, పారాయణ, నామస్మరణలతో గడిపి శ్రీ స్వామివారి ఆశీస్సులు పొందగలరు.

ఆచార్య శ్రీ భరద్వాజ మాష్టరు హైదరాబాద్ భక్తురాలితో "అమ్మా! నీకున్న ఆర్థిక వనరుల ద్వారా నిజమైన స్వామిసేవ చేయడమంటే- మహనీయుల గ్రంథాలు నీ బంధుమిత్రులకు పంచు. అట్టి దానము వల్ల ముల్లోకాలు దానమొసంగిన ఫలితమొస్తుంది" అని చెప్పారు. పుస్తకం చదివి అందరూ మహనీయులు కానక్కరలేదు. చదివినవారి హృదయాలలో మంచి సంస్కారములు నాటిన పుణ్యం ఆ గ్రంథమిచ్చినవారికి దక్కుతుంది. ఆ సంస్కారములు ఈ జన్మలోకానీ,

మరుసటి జన్మలో కానీ మొలకెత్తక మానవు. మనస్సును భగవంతుడు కోరినట్లు ఉపయోగించిన వారమౌతాము.

ఇంతటి గొప్ప మహనీయుడు మన మధ్య వున్నా వారినుండి పొందదగినంత కృప పొందకపోవడం ఎంత దురదృష్టమో! మనలాంటి మానవుడుగా పుట్టి దేవుడయ్యేందుకు వారేమి చేశారో స్పష్టంగా తెలుస్తుంది. "ఆశపోతే అంతా పోతుండ్లాయ్యా" అన్న శ్రీ వెంకయ్యస్వామివారి మాటను వీరెంత చక్కగా పాటించారో చూడండి. ఈనాటి విలువల ప్రకారం కోట్లు విలువ చేసే ఆస్తిని భగవంతునకు కర్పూరం వలె నివేదించారు. స్కూలు, అన్నదానం నిర్వహిస్తున్నారు. కఠోర బ్రహ్మచర్యం వహించి జీవితాంతం ఒకే ఇంట్లో భార్యాభర్తలు నివసించారు. కేవలం తల్లీబిడ్డలవలె మసలుకొన్నారు. ఎన్ని దేవాలయాలు, ఎందరి వివాహాలు, ఎంతమందికి విద్యాదానాలు చేశారో ఈ మహనీయుని జీవితం నుండి నేర్చుకోవాలి. రోజుకొక్క గ్లాసు పాలు గాని, టెంకాయనీళ్ళు గాని తీసుకొని జీవించడం ఈ మహనీయునికే చెల్లింది. ఇదే వారి జీవితం మనకు నేర్పే గొప్ప పాఠం.

**పెనల సుబ్బరామయ్య**

**గమనిక:** 'దైవం మానుష రూపేణ' అనే ఈ గ్రంథాన్ని 2011లో ప్రథమ ముద్రణ చేయటం జరిగింది. ఈ మొదటి ముద్రణ సుబ్బరామయ్యగారి కృషి, పట్టుదల వలన సాధ్యపడింది. కాలాంతరంలో 2017 జూన్ 9వ తేదీన శ్రీ సుబ్బరామయ్యగారు సమాధి చెందారు. మొదటి ముద్రణ ప్రతులన్నీ వితరణ జరిగి, ప్రస్తుతము ప్రతులు లభ్యం కావటం లేదు. సుబ్బరామయ్యగారి అనుమతి ప్రకారం, ఈ గ్రంథాన్ని 2017 సం॥లో విస్తరించి రెండవ ముద్రణ చేయటం జరిగింది.

**ప్రసాద్ (బెంగుళూరు) మరియు రాజీవ్ (హైదరాబాద్)**

# దైవం మానుష రూపేణ

దేవుణ్ణి తెలుసుకునే మార్గం చెప్పమన్న భక్తులతో భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారు అంటారు: "నీయాల్నే (నీలాగే) వస్తే నీవేమి కనుక్కుంటావయ్యా". ఇది ఈనాడు కడప జిల్లా నీలకంఠరావుపేట వాస్తవ్యులు శ్రీ శ్రీ శ్రీ దర్గాస్వామిగారి ఎడల అక్షరాలా నిజమైంది. వారు మానవ రూపంలో మన ముందున్న భగవంతుడే అని భక్తుల అనుభవాలు నిరూపిస్తున్నాయి. ఇది తెలియక కొందరు వీరిని ప్రశ్నలు చెప్పేవారుగా తలిస్తే, మరికొందరు ధర్మప్రభువుగా తలిస్తే, మరికొందరు మరొకవిధంగా తలంచుచున్నారు. మరి కొంతమందికి తమలోని బలహీనతలు శ్రీ స్వామివారిలో కనిపించి వారిని మానవాకారం ధరించిన భగవంతుడుగా గుర్తించలేకున్నారు. వివిధ భక్తులకు వారితో గల అనుభవాలు చాలా స్వల్పంగా వివరించాను. ఈ అనుభవాల దృష్ట్యా వారు భగవంతుని ప్రతిరూపమేనని రూఢి అవుతుంది.

వారెంతటి మహనీయులో తెలియనిదే హృదయ పూర్వకమైన భక్తిశ్రద్ధలతో నమస్కరించలేము. అందరూ నమస్కరిస్తున్నారు గనుక మనమూ నమస్కరిస్తాము. వారెంతటి గొప్ప మహనీయులో తెలియజేసి వారి ఎడల మన హృదయాలలో తగు విధమైన భక్తిశ్రద్ధలు ఏర్పడునట్లు చేయడమే ఈ చిన్ని పుస్తకం ఆశయము.

భగవంతునికి మూడు లక్షణాలు చెప్పారు.

1. **సర్వవ్యాపకుడు** : అందుగలడిందులేడని సందేహము వలదు అన్నట్లు విశ్వమందంతటనూ ఉన్నవాడు.

2. **సర్వజ్ఞుడు:** సర్వ విషయములు తెలిసినవాడు. సృష్టిలోని ప్రతిదాని గురించి భూత, భవిష్యత్, వర్తమానములన్నీ తెలిసినవాడు.

3. **సర్వసమర్థుడు:** ఏమైనా చేయగల సామర్థ్యము గలవాడు.

శ్రీ శ్రీ శ్రీ దర్గాస్వామివారు భక్తులకనుగ్రహించిన అనుభవాలలో పై మూడు లక్షణాలు వారికున్నట్లు తెలుస్తుంది. గనుకనే వారిని మానవాకారం ధరించిన భగవంతుడని చెప్పగలుగుచున్నాను.

\- **పెనల సుబ్బరామయ్య**

# మహనీయులను ఎలా సేవించుకోవాలి

సమస్త జీవరాశి తెలిసో తెలియకో శాశ్వతమైన తృప్తి, శాంతి, ఆనందాల కోసం మాత్రమే జీవిస్తున్నది. చాలామంది ధనం వల్లనో, అధికారం వల్లనో మరే ఇతర వాటి వల్లనో ఈ తృప్తి, శాంతి, ఆనందాలు పొందవచ్చని భ్రమపడుతుంటారు. చాలా కొద్దిమంది మాత్రమే ఆత్మజ్ఞానం వలన లభ్యమవుతుందని విశ్వసించి అందుకు ప్రయత్నిస్తున్నారు. ఇటువంటి సాధకులకు మహనీయుల కృప చాలా ముఖ్యము. వీరిని ఉద్ధరించడానికి భగవంతుడే వివిధ మహనీయుల రూపాలలో వచ్చి సరైన మార్గంలో నడుపుతారు. మరి ఈ మహనీయులను ఎలా గుర్తించాలో, వారిని ఎలా సేవించాలో ఆచార్య భరద్వాజగారు వివరించారు, ఆచరించి చూపారు.

కడపజిల్లా రాయచోటి సమీపంలో ఉన్న దర్బార్ నగరంలో నివసిస్తున్న దర్గాస్వామివారు ఇటువంటి మహనీయుల కోవకు చెందినవారు. ఇటువంటి సద్గురువును సేవించి, వారి మార్గదర్శనంలో నడచి, మన సాధనా మార్గంలో ప్రగతి సాధించుకుందాం. ఈ గ్రంథ పారాయణ చేసిన తర్వాత ఎవరైనా సాధకులు ప్రేరణ పొంది దర్గాస్వామివారి ఆశ్రమాన్ని దర్శిస్తే వారికి కొన్ని సూచనలు:

1. దర్గాస్వామి సన్నిధిలో వీలైనంతసేపు గడపాలి. **"తడి గుడ్డలతో నిప్పు దగ్గరున్న వ్యక్తి నా గుడ్డల చెమ్మ పోగొట్టమని"** ఆ అగ్నిని ప్రార్థించనక్కరలేదు. మనము సాధనతో నిర్మూలించుకోలేని దుష్టసంస్కారాలన్నీ ఆయన సన్నిధిలో కూర్చున్నంత మాత్రాన వాటికై అవే మననుండి దూరమౌతాయి.

ఆచార్య భరద్వాజగారు ఫిబ్రవరి 8, 1963లో షిరిడీ సాయిబాబా సమాధి దగ్గర సమాధి స్థితి పొందిన తరువాత కూడా వారానికొకసారి

ఎన్ని ఇబ్బందులు ఎదురైనా చీరాలస్వామి దర్శనానికి వెళ్ళేవారు. ఆ రోజుల్లో విద్యానగర్ నుండి చీరాల వెళ్ళటానికి కనీసం 6 గంటలైనా పట్టేది. శనివారం కాలేజీ అయిన తర్వాత ప్రయాణించి ఆదివారం స్వామి సన్నిధిలో గడిపి మరలా సోమవారం ఉదయం కాలేజీకి వెళ్ళేవారు. రాను పోను ప్రయాణపు ఖర్చులు 100 రూపాయలు. వారి జీతము 940 రూపాయలు మాత్రమే!

2. దర్గాస్వామివారి ఆశ్రమానికి వెళ్ళిన తరువాత లౌకిక వ్యవహారములు మాట్లాడటం మాని దర్గాలకి ప్రదక్షిణలు, అమ్మయ్యగారి సమాధికి ప్రదక్షిణలు, నామస్మరణ, సద్గ్రంథ పఠనంలో కాలము గడపాలి. ఏమీ చేయలేని పక్షంలో మౌనంగా ఉండటం ఉత్తమం.

3. ప్రపంచంలో అత్యంత విలువైనది మన మనస్సు. దానిని పవిత్రంగా, ఎటువంటి దుర్గుణములు చేరకుండా నిత్యమూ పరమాత్మ స్మరణకు వినియోగిస్తే శ్రీ స్వామివారు ప్రసన్నులౌతారు.

4. మనము ఏదైనా ఒక స్థానానికి కొత్తగా వెళ్ళినప్పుడు అక్కడవారు పాటించే నియమాలను అర్థం చేసుకుని, అక్కడ వున్న వారితో వాదించకుండా, ఆ నియమాలను అనుసరించడం మంచిది. ఆశ్రమ నియమాలను గౌరవించి వాటిని అనుసరించటం ఉత్తమ లక్షణం.

పాకలపాటి గురువుగారు చెప్పినట్లు "ఎంతో పుణ్యముంటే గానీ సద్గురు దర్శనం కాదు. ఇంకా ఎంతో పుణ్యముంటే తప్ప ఆయన చెప్పినట్లు ఆచరించలేము." మనము కూడా స్వామి చెప్పినట్లు తు॥చ॥ తప్పక ఆచరించాలంటే ఏమి చేయాలి?

1. సద్గురు దర్శనం పుణ్యం - స్పర్శనం పాపనాశనం అని చెప్పినట్లు **వీలైనంత సేపు దర్గాస్వామి సాన్నిధ్యంలో గడపాలి.**

2. దర్గాస్వామివారి సాన్నిధ్యంలో మనకు కలిగిన అనుభవాలను ప్రతిరోజూ ఆత్మావలోకనం చేసుకోవాలి.

3. మనమే పని చేస్తున్నా అది పరమాత్ముని సేవ అనే భావంతో క్షుణ్ణంగా ఆ పని చేయాలి.

4. భోజనం వండేటప్పుడు, తినేటప్పుడు నామస్మరణ చేయాలి.

5. భోజనం చేసే ముందర మనకు ఆహారం ప్రసాదించిన పరమాత్మను స్మరించి కాకబలి సమర్పించాలి.

## సద్గురువును గుర్తించడమెలా?

1. ఎవరి సమక్షములో మన మనస్సు ప్రశాంతత పొంది, ఆలోచన నిలబడిపోతుందో అది సద్గురు సన్నిధి అని తెలుసుకోవాలి.

2. ఒక మహనీయుని ప్రథమ దర్శనంలో జరిగే సంభాషణలు కానీ సంఘటనలు కానీ చాలా జాగరూకతతో గమనించి గుర్తు పెట్టుకోవాలి. ఆ దర్శనం తర్వాత, జరిగిన సంఘటనలను నెమరు వేసుకుని మన హృదయంలో కలిగే భావాలను గమనించుకోవాలి. ఒక మహనీయుని సాంగత్యం వలన సాధకుని హృదయం ఉన్నతమైన భావాలవైపు, పరమాత్ముని పట్ల ఆకర్షింపబడుతుంది. అతని హృదయంలో శ్రద్ధా భక్తులు దృఢపడతాయి.

3. నిజమయిన మహనీయులెవ్వరు కూడా తమ పూర్వ చరిత్ర వారి నోటివెంట బయటపెట్టుకోరు. సన్నిహితులైన భక్తులు మరలా మరలా అర్థించినప్పుడు "కక్కిన కూటికి ఆశ పడతామా?" అన్న సందర్భాలున్నాయి. షిరిడీ సాయి, అక్కల్‌కోట స్వామి వంటి మహనీయులైతే కొందరికి మాదిగవారమని, మరికొందరికి సద్బ్రాహ్మణులమని, మరికొందరితో ఆ విషయం అడిగితే చెప్పుతో కొడతానని అన్నారు.

4. వారు భక్తులనుండి ఏమీ ఆశించరు. భక్తులమీద ఎనలేని ప్రేమను అనుక్షణం కురిపిస్తుంటారు. వారి అన్నపానీయాల పోషణ, పాలన భగవంతుడే చూడాలి.

5. మనకేదైన ఆపద రాబోతుంటే పరోక్షంగా మనలను హెచ్చరించి ఆ ఆపదను తొలగిస్తారు.



శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయినాథాయ నమః

# దైవం మానుష రూపేణ

## అధ్యాయము - 1

## శ్రీ సద్గురు దర్గాస్వామి వారి జీవితము - పూర్వభాగము

ఆంధ్రరాష్ట్రంలో రాయలసీమ ప్రాంతం ఒకప్పుడు రతనాల సీమ. నేడు యోగి రతనాల సీమ. ఈ ప్రాంతంలో ఎందరో మహనీయులు జన్మించి ఆయా కాలాలకు అనుగుణంగా ధార్మిక మార్గ ప్రబోధం చేసి, ప్రజలను సంస్కరించి, సరైన మార్గంలో నడిపారు. వీరిలో శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి, బమ్మెర పోతనామాత్యులు, కడప అవధూతేంద్రస్వామి, తాటిపర్తి నారాయణ అవధూత, కల్లూరు అవధూత రామిరెడ్డి తాత, కాశిరెడ్డి నాయన, అన్నమయ్య, శ్రీ కృష్ణయ్యస్వామి (ప్రొద్దుటూరు) మొదలైనవారు కొందరు. కొంతమంది కేవలం తత్త్వబోధ చేసారు, కొందరు గుళ్ళు గోపురాలు కట్టించినారు, జీర్ణోద్ధరణ చేయించినారు, ఇంకొందరు యజ్ఞయాగాదులు చేయించినారు. ఒక్కొక్కరిది ఒక్కొక్క మార్గం. ఎవరిది ఏ మార్గమైనా ధర్మరక్షణ, ఆర్తజన పరిరక్షణ, సంఘసంస్కరణ వారి లక్ష్యం. ఈ కోవకు చెందినవారే శ్రీ సద్గురు దర్గాస్వామి. వీరు గృహస్థ ధర్మంలో ఉండి ఎందరో గృహస్థులను, ఆర్తులు, జిజ్ఞాసువులను సరైన మార్గంలో నడిపిస్తున్నారు. ఇది వీరి స్ఫూర్తిదాయకమైన జీవితగాథ.

కడప జిల్లా, ప్రొద్దుటూరు మండలం, గోపాయపాళెం గ్రామంలో గంగిశెట్టి పెద్ద చలమయ్య - సుబ్బమ్మ అనే పుణ్య దంపతులకు ముగ్గురు కుమారులు. వారు వరుసగా వెంకట సుబ్బయ్య, సంజీవయ్య, సత్యనారాయణ. వారిలో ప్రథముడైన వెంకట సుబ్బయ్య మన కథానాయకుడు. వీరే తర్వాతి కాలంలో దర్గాస్వామిగా ప్రపంచానికి సుపరిచితులు. వీరు జులై 6వ తేది, 1931 వ సం॥ లో జన్మించారు. తెలుగు పంచాంగం ప్రకారం - ప్రజోత్పత్తి నామ సంవత్సర అధిక ఆషాఢ బహుళ షష్ఠి, సోమవారం వారి జనన కాలం. స్వామి జన్మ నక్షత్రం ఉత్తరాభాద్ర మొదటి పాదం. వారిది మీన రాశి, మకర లగ్నం. వీరిది

నందీశ్వరుని అంశ. వ్యవహారంలో వీరిని సుబ్బారాయుడుగారు అని పిలిచేవారు.



స్వామివారి తల్లిదండ్రులు (గంగిశెట్టి పెద్ద చలమయ్య , సుబ్బమ్మ గార్లు)

స్వామివారి మొదటి గురువు వారి తల్లి. ఆమె శిక్షణలో వారు 5వ సంవత్సరం వచ్చేటప్పటికే సూర్యాష్టకం, ఆంజనేయ స్తోత్రం, శివ స్తోత్రం, లక్ష్మీ, రాజరాజేశ్వరి స్తోత్రాలు, రామాయణ భారతభాగవతాదులు, నారాయణ శతకం నేర్చుకున్నారు. దర్గాస్వామి అమ్మగారు ఉదయం 5 గంటలకే స్వామిని నిద్ర లేపి, స్వామి చేత ప్రార్థన చేయించేవారు. స్వామి ఉదయమే నదికి వెళ్ళి, స్నానం చేసి, ఇసుకతో శివలింగం చేసి, అర్చించి అనంతరం నదిలో నిమజ్జనం చేసి వచ్చేవారు.

సాయంత్రంపూట ఒక కాయకు సూదితో కన్నం పెట్టి, అందులో గుజ్జు తీసివేసి, వత్తిపెట్టి, నూనె పోసి, దీపం వెలిగించి, ఆ దీపం మీదుగా ఆంజనేయస్వామిని చూస్తూ ధ్యానం చేసేవారు. అలా చేస్తే వాళ్ళ అమ్మగారు రోజూ ఒక గోధుమ రొట్టె, నెయ్యి పెడతానని చెప్పేవారు. చిన్నప్పుడు వాటిమీద ఇష్టం వల్ల స్వామి అలా చేయడం మొదలుపెట్టారు.

స్వామి జన్మించింది పెద్దశెట్టిపల్లెలో, పెరిగినది గోపాయపాళెంలో. పెరిగిన గ్రామంలోనే ప్రాథమిక విద్యను పూర్తి చేసారు. సత్యహరిశ్చంద్ర

నాటకం అప్పటికే చూశారు. 1939 నుండి విద్యాభ్యాసం ప్రొద్దుటూరులో సాగింది. స్వామి 1947వ సం॥లో యస్.యస్.యల్.సి పాసై అదే సంవత్సరంలో మద్రాసు పచ్చయప్ప కళాశాలలో యఫ్.ఎ (ఫాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ - ఇప్పటి ఇంటర్మీడియట్‌కు సమానం) చేరి, మొదటి సంవత్సరం పూర్తి చేశారు. కళాశాలలో చదివేటప్పుడు రోజూ నుదుట కుంకుమ బొట్టు పెట్టుకుని, అమ్మవారి పూజ చేసుకుని వెళ్ళేవారు. కళాశాలలో వీరిని 'కోమటి బ్రాహ్మణుడు' అని ఆప్యాయంగా పిలిచేవారు.

చిన్నతనంలో స్వామి వద్ద ఒక సాయిబాబా పటం వుండేది. ఆ పటం పైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల బొమ్మలు వుండేవి. స్వామి ఆ పటాన్ని తదేకంగా చూస్తుండేవారు. ఆయనకు ఏమైనా కావలసి వస్తే మట్టితో సూదులు చేసేవారు. వాటితో సాయిని సాధించి సంపాదించుకునేవారు.

స్వామివారికి విద్యార్థి దశలో ఒక సాధువు తారసపడి దగ్గరకు పిలిచి నీకు ఒక గుర్రం, ఒక ఖడ్గం, ఒక వజ్రం ఇస్తాను అవి నీకు మేలు చేస్తాయి అని చెప్పారు. స్వామికి అప్పటికి ఆ మాటల అంతరార్థం అర్థం కాలేదు. **"గుర్రం అంటే మనస్సని, ఖడ్గం అంటే వైరాగ్యమని, వజ్రమంటే ప్రకాశిస్తున్న ఆత్మజ్యోతియని, మనస్సని, ఇంద్రియాలను ఖడ్గంతో ఖండించినచో శుద్ధ చైతన్య రూపమైన ఆత్మ అనే వజ్రం ప్రకాశిస్తుంది"** అని తరువాతి కాలంలో తెలుసుకున్నారు. ఆ స్థాయికి చేరినవారు ఇతరుల మనస్సులలోని విషయాలను, కష్టనష్టాలను గమనించి వారి బాధలను తొలగించగల తపశ్శక్తి సంపన్నులు అయి ఉంటారు. ఆ శక్తిసామర్థ్యాలు మన దర్గాస్వామికి సంపూర్ణంగా ఉన్నాయని ఎందరో భక్తుల ప్రత్యక్ష అనుభవం. ఈ విధంగా దర్గాస్వామిగారి బాల్యము, విద్యాభ్యాసము గడిచినాయి.

1951 ప్రాంతంలో స్వామివారికి హంపి క్షేత్రంలో తుంగభద్రా నదిపై కడుతున్న భద్రావతి ఆనకట్ట ప్రాజెక్టులో సూపర్‌వైజరుగా ప్రభుత్వోద్యోగము వచ్చినది. స్వామివారు అక్కడ వున్న ఆంజనేయస్వామి పూజ చేస్తూ ధ్యానంలో గంటల తరబడి నిమగ్నులైనందువలన ఆఫీసుకు సకాలంలో వెళ్ళలేక పోయేవారు. అయినప్పటికీ పై అధికారులు స్వామిని ఏమీ

అనకుండా మర్యాదగా చూసేవారు. ఇది అలా వుండగా ఒకరోజు స్వామి తన ఇద్దరు స్నేహితులతో వెళ్ళుతుంటే ఒక పెద్ద సర్పం వారిని అడ్డగించింది. స్వామి "నాలో, నీలో, అందరిలో ఉన్న పరమాత్మా! ఎందుకు అడ్డగిస్తున్నావు?" అని అడిగారు. ఆ సర్పం దారినుండి తప్పుకోక అలానే ఉండే సరికి స్వామికి తను వేసుకున్న బెల్టు, బూట్లు, చొక్కా ఒక్కొక్కటి తీసేసిన తర్వాత ఆ సర్పం వెళ్ళిపోయింది. తరువాత ధ్యానం చేసుకుంటుంటే స్వామి అంతర్వాణి 'ఇది నీ స్థానం కాదు. నువ్వెళ్ళి పో!" అని చెపుతోంది. స్వామి ఎక్కడో చెప్పమంటే మరలా అంతర్వాణి "ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి మీ ఊరికి వెళ్ళు. త్వరలో తగిన ఉద్యోగం యిస్తాము" అని చెప్పింది. అంతర్వాణి ప్రకారం స్వామివారు ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రొద్దుటూరు చేరుకున్నారు. ప్రొద్దుటూరు వచ్చాక స్వామి తల్లిదండ్రులు స్వామికి వివాహం చేయాలని నీలకంఠరావుపేట వాస్తవ్యులు శ్రీ కొణిజేటి అనంతయ్య గారి కుమార్తె రంగనాయకమ్మగారిని చూసారు.

నీలకంఠరావుపేట వాస్తవ్యులు శ్రీ కొణిజేటి అనంతయ్య, సుబ్బమ్మగార్లది సంపన్న వైశ్య కుటుంబం. వీరు చాలాకాలం సంతానం లేక యెన్నో పుణ్యక్షేత్రాలను దర్శించి సేవించి, తుదకు పండరి క్షేత్రం వెళ్ళి శ్రీ పాండురంగస్వామిని కొంతకాలం సేవించారు. తత్ఫలితంగా 1935వ సంవత్సరంలో శ్రావణమాసంలో ఆఖరి శనివారంనాడు ఒక ఆడబిడ్డ జన్మించింది. శ్రీ పాండురంగని అనుగ్రహం వలన పుట్టిన బిడ్డయని తల్లిదండ్రులు 'రంగనాయకమ్మ' అని పేరు పెట్టి, పెంచి పెద్ద చేశారు. ఈమె ఒక్కరే బిడ్డ అయినందున చాలా గారాబంగా సాకారు. ప్రాథమిక విద్యను చెప్పించారు.

రంగనాయకమ్మ బాల్యం నీలకంఠరావుపేటలో గడిచింది. ఆ తల్లి ఊరిలోని ప్రాథమిక పాఠశాలలోనే ఐదవ తరగతి వరకు మాత్రమే చదివింది. **చదువు** స్కూళ్ళలో నేర్చుకునేది. **విద్య** స్కూళ్ళలోగానీ, కాలేజీలోగానీ, పుస్తకాలతోగానీ వచ్చేది కాదు. మానవుడికి, మానవుడికి మధ్య సత్సంబంధాన్ని పెంపొందించేది, మానవుడిని భగవంతుడికి దగ్గరగా తీసుకెళ్ళేదే నిజమైన విద్య. తనలో నిబిడీకృతమై ఉన్న దివ్యత్వాన్ని

మానవుడికి తెలియజెప్పేదే నిజమైన విద్య. బహుకొద్దిమందికి మాత్రం అది జన్మత: పూర్వజన్మ సంస్కార విశేషం వలన అప్రయత్నంగానే అబ్బుతుంది. అటువంటివారి కోవకు చెందిన నారీరత్నం రంగనాయకమ్మ. ధర్మనిరతి, స్వార్థత్యాగం, కారుణ్యదృష్టి, సర్వజీవ సమభావం లాంటి సద్గుణాలు ఆమెకు పుట్టుకతోనే అంకురించినాయి.

తరువాత అమ్మమ్మగారింట్లో ఉండి కొంతకాలం సంగీతం నేర్చుకున్నది. ఆట పాటలలో కూడా చురుకుగానే పాల్గొనేది. తల్లికి ఇంటిపనులలో సహాయం చేసేది. అల్లరి చేయడం అనేది రంగనాయకమ్మ ఎన్నడూ యెరుగదు. హాస్యానికైనా అబద్ధమాడదు. తగవులాడటం, పరుషముగా మాట్లాడటం ఆమె తత్త్వం కాదు. పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్లు సుగుణాలు బాల్యంలోనే ద్యోతకమయినాయి.

1951 డిసెంబరులో స్వామివారికి, రంగనాయకమ్మగారికి పెళ్ళిచూపులు జరిగాయి. అప్పటికి రంగనాయకమ్మగారికి సుమారు 17 సంవత్సరాల వయస్సు. రంగనాయకమ్మగారు స్వామికి వరుసకు మేనరికం అవుతారు. స్వామి అమ్మగారు ఆమెను చేసుకోమని స్వామికి చెప్పారు. తరువాత ధ్యానంలో సాయిబాబా స్వామికి కనిపించి "నీవు ఆ అమ్మాయిని వివాహం చేసుకో. ఆమె ఆంజనేయుని అంశ" చెప్పారు.

పెళ్ళి చూపులు అయినాక రంగనాయకమ్మగారు అదే పనిగా ఏడుస్తున్నారు. అప్పుడు స్వామివాళ్ళ అమ్మగారు 'ఎందుకమ్మా ఏడుస్తున్నావు?' అని అడిగితే "మా అవ్వ, తాత నన్ను సాకారు. వాళ్ళు పెళ్ళిచూపులకు రాలేకపోయారు" అని చెప్పారు. అప్పుడు స్వామి అమ్మగారు 'దానికోసం ఏడవడం ఎందుకు? ఇక్కడకు అయితే మీ అవ్వ, తాత మాత్రమే వస్తారు. మిగిలిన బంధువులు చూడడం కుదరదు. నేను మా వాడిని పంపిస్తాను. అప్పుడు అక్కడున్న మీ వాళ్ళందరూ చూడవచ్చు' అని అనునయంగా చెప్పారు. తరువాత స్వామి రంగనాయకమ్మగారి తాత, అవ్వ వాళ్ళ ఊరు వెళ్ళి వాళ్ళని పలకరించి వచ్చారు. స్వామి తిరిగి వచ్చేవరకు రంగనాయకమ్మగారు మిద్దె మీద స్వామి కొరకు ఎదురు చూచినారు.



వివాహమైన కొత్తల్లో స్వామి, అమ్మయ్యగార్లు

స్వామికి, రంగనాయకమ్మగారికి తే॥ 31-1-1952 న (మాఘ శుద్ధ పంచమి గురువారం నాడు) నీలకంఠరావుపేటలో వివాహం జరిగింది. ఈ రంగనాయకమ్మగారిని వివాహమైన తర్వాతి కాలంలో స్వామి "అమ్మయ్య" అని పిలిచేవారు. అమ్మయ్యగారు విష్ణు సంజాతురాలు. స్వామిది శివాంశ. అమ్మయ్యది జలతత్వం. స్వామిది అగ్నితత్వం. అగ్నితత్వాన్ని భరించగలిగింది జలతత్వమే.

వివాహం జరిగిన కొత్తలో స్వామీజీ అమ్మగారిని ఒక ప్రశ్న అడిగారు: **"ఎవరు ఎవరిని కాపాడుతారు?"** అని. ఆ ప్రశ్నకు అమ్మగారు ఇచ్చిన సమాధానం **"అందరినీ కాపాడే వాడు ఆ పరమాత్మ, అందరికీ అతడే రక్షకుడు"** అని. అటువంటి జవాబు ఇవ్వగలగడం కేవలం మహాయోగినులకే సాధ్యం.

వివాహమైనాక రెక్కలు గలిగిన దేవదూత వచ్చి నీ భార్యతో శారీరక సంబంధం శాశ్వతంగా నిషేధిస్తూ పై వాళ్ళు ఆజ్ఞాపించారు. అది నీకు చెప్పడానికే వచ్చాను అని అన్నాడు. "భలేవాడివయ్యా! నేను అంగీకరించినా ఆమె ఎంత నిరాశ చెందుతుంది" అని శ్రీ దర్గాస్వామివారంటే 'ఆమె హనుమంతుని అంశావతారం, ఆమెనడిగి చూడు' అన్నాడు దేవదూత. ఆమెగారినడిగితే "అంతకంటే మహాభాగ్యమా" అని అన్నారు. నాటి నుండి తల్లీబిడ్డలవలె ఒకే చోట, ఒకే ఇంట్లో జీవితాంతం నివసించారు. **"ఏకాంతమున ప్రియురాలిని గాంచి మాతృభావమున మరలు వాడే ఘనుడు"** అన్నారు పెద్దలు.

స్వామి పరమాత్ముని ప్రతిరూపం, ఆమె ప్రకృతి స్వరూపిణి. వారి దాంపత్య జీవితం ఆనాటి నుండి కేవలం సామాజిక సత్సంప్రదాయ పరిరక్షణకు, కర్మానుష్టానానికి మాత్రమే. కామకళంకం లేశమైనా అంటని పవిత్ర అలౌకిక ఆత్మానుబంధం వారిది. వారి జీవితాలు ఈశ్వరార్పితమైనవి. ఆశయాలు ఉదాత్తమైనవి. శ్రీ రామకృష్ణ పరమహంస, శారదామాతలవలె దివ్యదాంపత్య జీవితం వారిది. కఠోర బ్రహ్మచర్య వ్రతాన్ని ఆచరిస్తూ ఆ దంపతులు దైవస్వరూపులైనారు.

శ్రీ రామకృష్ణ పరమహంసగారు, శారదాదేవిగారు కూడా అలా ఒకచోట ఉన్నారు. శ్రీ శారదామాతగారు పరమహంస దగ్గరికి వచ్చేసరికే

పరమహంసగారికి అమ్మ దర్శనమై పిచ్చివాడుగా విరాజిల్లుచున్నారు. ఇక్కడ శ్రీ దర్గాస్వామివారు కొన్ని క్షణాలలో మధురమైన మొదటి రాత్రికి సిద్ధమైయున్న సమయములో దేవదూత రావడం, శాశ్వతంగా భార్యను తల్లిగా ఆరాధించుటకు ప్రారంభం కావడం జరిగింది. ఇది మానవమాత్రులు చేయలేని త్యాగం. అందుకే వారు **"దైవం మానుష రూపేణ"** అయినారు.

వివాహానంతరం అమ్మయ్యగారు ప్రొద్దుటూరులో అత్తవారింట్లో ఉండేవారు. ఒకరాత్రి వెన్నెలలో మేడ మీద కుటుంబ సభ్యులందరూ కూర్చుని వుండగా స్వామివారి తండ్రిగారు 'తమ్ముని వివాహం ఎప్పుడు?' అని ప్రశ్నించగా, స్వామి "ఏడు రోజులలో జరుగుతుందని" చెప్పారు. అప్పటికింకా వివాహ సంబంధం ఏదీ కుదరలేదు. స్వామి చెప్పిన విధంగానే ఏడు రోజులలో వివాహం జరిగింది. వివాహ సందర్భంగా ఇంట్లో శ్రీ సత్యనారాయణస్వామి వ్రతం జరిగింది. వ్రతం పూర్తి అయిన తర్వాత అమ్మయ్యగారు స్మృతి తప్పి పడిపోయినారు. డాక్టరును పిలిపించగా, ఆయన వచ్చి పరీక్షించి, ఆమె మరణించిందని చెప్పి వెళ్ళిపోయారు. అప్పుడు స్వామి అమ్మయ్య శరీరాన్ని భుజంపై వేసుకుని వ్రతం జరిగిన స్థలంలో కూర్చొని నిశ్చల మనస్సుతో పరమాత్మను ప్రార్థించగా మరునాడు 4 గంటలకు ఆమె స్పృహలోకి వచ్చింది. ఆ తర్వాత క్రమేణా కొద్దిరోజులలో మాములు స్థితికి చేరుకున్నది. లోకకళ్యాణం కొరకు అమ్మయ్య ద్వారా జరగవలసిన పనులు చాలా ఉన్నందువలన స్వామి ఆమెను మరలా భువికి రప్పించారు. ఈ అద్భుతకార్యం స్వామివారి తపశ్శక్తి, దీక్ష, భగవద్భక్తి వలన మాత్రమే సాధ్యమైంది.

స్వామివారి తండ్రిగారు లక్షాధికారి. వారికి బంగారం అంగడి వుండేది. వివాహమైనాక స్వామి కొంతకాలం వారి తండ్రిగారి అంగడిలో పనిచేసినారు. ఒకరోజు ఉదయం అంగడికి వెళుతుండగా, జాగ్రత్తగా తీసుకువెళ్తున్న సంచీలో ఉన్న 30 ఉంగరాల గుత్తి కనిపించలేదు. స్వామి ఈ విషయం అంగడికి వెళ్ళిన తర్వాత గమనించుకున్నారు. తర్వాత వచ్చిన దారిలో వెతకగా ఆ ఉంగరాలు కనపడలేదు. స్వామి

తండ్రిగారు, తమ్ముళ్ళు ఎవరికో దానం చేసి ఉంటాడని భావించారు. కానీ స్వామిని ఏమీ అనక మౌనంగా ఉన్నారు. కుటుంబ సభ్యులు, అంగడిలో పనిచేసేవారు ఆ దారినంతా వెతికారు. ఎవరికీ కనపడలేదు. స్వామి విచారంతో ఇంటికి చేరుకున్నారు. అప్పుడు అమ్మయ్య "మన సొమ్ము అయితే నడివీధిలో పడినా ఎక్కడికీ పోదు" అని చెప్పారు. సాయంకాలం స్వామి మరలా ప్రయత్నించగా ఆ ఉంగరాలు నడివీధిలోనే దొరికాయి. ఉదయం నుండి సాయంత్రం వరకు ఆ వీధిలోనే ఎంతోమంది తిరిగివుంటారు. దొరికిన ఉంగరాలు పరిశీలించి చూడగా, ఒక ఉంగరం తప్ప పోయిన మిగిలిన వస్తువులన్నీ దొరికాయి. అది ఓంకారం చెక్కిన ఉంగరం. తర్వాతి కాలంలో స్వామి ఈ సంఘటనను చాలాసార్లు నెమరువేసుకునేవారు.

మే 31 వ తేదీ, 1953న సాయంత్రం 6 గంటలకు స్వామివారి తల్లి పరమపదించారు. వారి అమ్మగారు ఆఖరి రోజులు వచ్చినప్పుడు స్వామితో 'ఇక నా రోజులు అయిపోతున్నాయి. నువ్వుగానీ, మీ గురువు సాయిబాబా గానీ నన్ను రక్షించలేరు' అని చెప్పారు. ఆమె అన్నట్లుగానే కొద్దిరోజులలో పరమపదించారు. అప్పటినుంచి స్వామికి, సాయిబాబాకు మధ్య మాట లేదు. సాయినాథునిది సుమారు ఒక అడుగు విగ్రహం ఉండేది. స్వామి దానిని చూపుతోనే పగలగొట్టాలని తదేకంగా చూచేవారు. ఇంతలో స్వామికి నిద్ర వచ్చింది. ఆ మత్తులో ఒక గమ్మత్తు జరిగింది. బాబా, స్వామి, మధ్యలో ఇంకొక పెద్దాయన మధ్యవర్తిత్వం చేస్తున్నారు. బాబా మధ్యవర్తిత్వం చేస్తున్న ఆ పెద్దాయనతో "ఎందుకు నాపై కోపం పెట్టుకుంటాడు? నేను అతని తల్లిని రక్షించలేదని ఎందుకు బాధపడతాడు? తనను రక్షించమని అతని తల్లి నన్ను అడుగలేదు. అతను కూడా ఆమెను బ్రతికించమని అడుగలేదు. ఆమె వచ్చిన పని పూర్తయింది, కాబట్టి ఆమెను తీసుకు వెళ్ళాను. ఆమె ఎల్లప్పుడూ అతని కంటి చూపులోనే ఉండి అతను చేసే కార్యాలను గమనిస్తుంటుంది" అని చెప్పారు. వెంటనే స్వామి తన మనోనేత్రంతో వారి తల్లిని దర్శించగలిగారు.

తరువాతి కాలంలో పై అనుభవాన్ని గుర్తు చేసుకున్నప్పుడు స్వామి "ప్రతి ఒక్కరూ ఒక పని మీద ఇక్కడకు వస్తారు. తను వచ్చిన పనులన్నీ



సత్యాన్వేషణలో స్వామి

పూర్తయితే తృప్తిగా వెళ్ళటానికి ఉంటుంది” అని చెప్పేవారు.

స్వామివారి జీవితంలో మాతృనిర్యాణం ఒక ముఖ్యమైన మలుపు. ఆనాటినుండి స్వామి సత్యాన్వేషణలో దేశ సంచారానికి బయలుదేరినారు. వారి నిజతత్వం అర్థంకాని వారు చూసి ఆయనకు పిచ్చి పట్టిందనుకున్నారు. వారిది మతిభ్రమణం కాదు. సత్యాన్వేషణ, ఆత్మ సాక్షాత్కారానికై తపన అని గ్రహించలేకపోయారు. స్వామి సంచారంలో అనేక నదులు, క్షేత్రాలు, స్మశానాలు, మహాత్ముల సమాధులను దర్శించారు.

స్వామికి మతిస్థిమితంగా లేదని అమ్మయ్యగారు పట్టుదలతో స్వామిని షోలింగర్‌కి తీసుకువెళ్ళి పూజలు, రుద్రాభిషేకం చేయించారు. షోలింగర్ నారసింహ క్షేత్రం. అక్కడ అమ్మవారి పేరు అమృతవల్లి. ఈ క్షేత్రం ఒక కొండ మీద ఉంది. దాని ప్రక్కనే ఇంకొక కొండమీద యోగాంజనేయస్వామి ఉన్నారు. స్వామి, అమ్మయ్యలు కొంతకాలం ఆ క్షేత్రంలో నివసిస్తూ సాధన కొనసాగించారు. వారు భక్తితో నరసింహస్వామిని, అమృతవల్లిని సేవించారు. ప్రతిరోజూ కొండ మీదకి వెళ్ళి అక్కడ 108 ప్రదక్షిణలు చేసేవారు. స్వామికి ఇక్కడ కొన్ని అనుభవాలు, దర్శనాలు అయ్యాయి. అమృతవల్లి అమ్మవారు వచ్చి స్వయంగా స్వామికి దోసెలు వేసి పెట్టారు. తర్వాతి కాలంలో స్వామి అమృతవల్లిని ప్రతిరోజు తలచుకునేవారు. స్వామివారికి ఇక్కడ ఆంజనేయస్వామి పిలిస్తే పలికేవాడు తర్వాత కాలంలో ఒకసారి ఇది గుర్తు చేసుకుని స్వామి ఈ క్రింది పద్యం చెప్పినారు.

**తోకదిప్పుచు నాముందు దోపుమయా।**
**మనుజులంగన దొరేయ వజ్రకాయ॥**
**అమరమునిగేయ ఘటికాద్రి ఆంజనేయ।**

అయితే ఎక్కడకు వెళ్ళినా స్వామి మనస్సు సమాధానపడలేదు. స్వామివారికి వివాహం కాక ముందునుంచీ తరచుగా స్వప్నంలో ఇద్దరు మనుషులు కనిపించి ‘మాకు దీపం పెట్టు నిన్ను పోషిస్తాము’ అని చెప్పేవారు. వివాహమయ్యాక శ్రీ అమ్మయ్యగారికి, శ్రీ స్వామివారికి ఇద్దరికీ అలాగే కనిపించి చెప్పసాగారు.

స్వప్నంలో కనిపించే మహనీయుల కొరకు వెతుకుతూ కడపలో అమీన్‌పీర్ దర్గా వద్ద కొంతకాలం, రాయచోటి దీవానేసాహెబ్ దర్గా వద్ద కొంతకాలం గడిపారు. దీవాన్‌సాహెబ్ స్వామికి కనిపించి “నేను కూడా నీలకంఠరావుపేట మహనీయుల దగ్గరనుండి వచ్చినవాడినే. నీవు అక్కడికే వెళ్ళు” అని చెప్పారు. ఆ సమయంలో స్వామిని చూచినవారు ‘దీవానా’ (పిచ్చివాడు) అని పిలిచేవారు. ఒక తత్వజ్ఞానిని గుర్తించటం మరొక తత్వజ్ఞానికే సాధ్యం. సామాన్యుల దృష్టికి వారు పిచ్చివారిలాగే కనిపిస్తారు. స్వామి నీలకంఠరావుపేటకి వచ్చి దర్గాల వద్దకు రెండుసార్లు వెళ్ళినా ఏ అనుభూతి కలుగలేదు.

మూడవసారి స్వామి దర్గాల దగ్గరకు వెళ్ళేటప్పుడు సాంబ్రాణి కడ్డీలు తీసుకువెళ్ళారు. అంతకుముందు రెండుసార్లు ఎలాంటి అనుభవం లేకపోయేసరికి దర్గాలలోని మహనీయుల పైన ఆయనకు ఎలాంటి పూజ్య భావము లేదు. “మీలో శక్తి వుంటే ఈ కడ్డీలు వెలిగించే మార్గం చూపండి” అని స్వామి చెప్పుకున్నారు. మరుక్షణంలో అక్కడ అంతకు ముందు లేని ఒక అగ్గిపుల్ల, అగ్గిపెట్టెకు ప్రక్కనుండే చెక్కు వారి కంట పడ్డాయి. వాటితో సాంబ్రాణి కడ్డీలు వెలిగించారు. రెండవసారి ఊరకనే వెళ్ళి నమస్కరించి వచ్చారు. మూడవసారి వెళ్ళి అక్కడే వుండసాగారు. పదిహేను రోజులు కేవలం నీళ్ళతోనే జీవించారు.

1957 జనవరి 29వ తేదీన సమర్థ సద్గురువు కృప వలన, ఆ ముస్లిం మహాత్ముల సేవయే తమ కర్తవ్యమని వారి అంతరాత్మకు ప్రబోధం అయింది. అందువలన తమ నివాసానికి, తమ తపస్సుకు అది అనువైన ప్రదేశం అని నిశ్చయించుకుని అప్పటినుండి అక్కడ స్థిరపడినారు. ఈ ప్రదేశం రామాపురం మండలంలో నీలకంఠరావుపేట పల్లెకు సుమారు మైలు దూరంలో వున్న పవిత్ర స్థానం. ఈ విధంగా వారు చేరవలసిన స్థలం నిర్దేశితమై వారి సత్యాన్వేషణా పరిభ్రమణం ముగిసింది. భర్త తోడే లోకమని భావించిన అమ్మయ్యగారు కూడా అదే సంవత్సరంలో అక్కడకు చేరుకున్నారు.

స్వామి, అమ్మయ్యలు దర్గా వద్ద నివసించటం మొదలు పెట్టిన కొత్తల్లో దర్గా వెనుకనే ఉన్న రాతి స్థంభాల మంటపంలో ఉండేవారు.

రాత్రి పూట ఒక చిన్న నూనె దీపం మాత్రమే ఉండేది. మాతాజీ వచ్చిన తర్వాత మండపానికి నాలుగు వైపులా తాటాకులు కట్టి దానిని ఒక చిన్న గదిగా చేసుకున్నారు. మొదట మూడు నెలల కాలం అక్కడ మాతాజీ ఏక వస్త్రంతోనే గడిపారు. స్వామీజీ కౌపీనం ధరించి జడలు కట్టిన జుత్తుతో తన సాధన కొనసాగిస్తూ ఉండేవారు. ఈ రాతి మండపంలో నివసించే కాలంలో, స్వామి ఉదయం తూర్పు దిక్కుగా తలపెట్టి విశ్రమించేవారు. ఆ సమయంలో ఒక నాగుపాము వచ్చి పడగ పట్టి స్వామికి ఎండ తగలకుండా నిలబడేది.

స్వామివారు తమ ఆశ్రమానికి దర్బార్ నగరము అని పేరు పెట్టారు. నీలకంఠరావుపేట గ్రామంలో సుమారు ఐదు వందల గడపలు ఉంటాయి. ఈ గ్రామంలో అన్ని కులాలవారు, అన్ని మతాలవారు నివసిస్తున్నారు. ఇక్కడ రామాలయం, శ్రీ కన్యకా పరమేశ్వరి గుడి, ఆంజనేయస్వామి గుడి మరియు ఒక మసీదు ఉన్నాయి. ప్రజలకు ప్రధానవృత్తి వ్యవసాయం. నీలకంఠుడు (శివుడు) ఇక్కడ పార్వతీదేవికి రామశబ్దం ఉపదేశించాడని ఇతిహాసమున్నది. ఆ పవిత్ర రామశబ్దం నీలకంఠునిచే ఉపదేశింపబడిన స్థలం కాబట్టి ఆ గ్రామానికి ఆ పేర్లు వచ్చాయని ప్రజల విశ్వాసం.

అటువంటి పుణ్యస్థలంలో చాలా కాలం క్రిందట "దుర్గ" అనే ఆధ్యాత్మిక జిజ్ఞాసువు ముక్తి సాధనకై ప్రస్తుతము దర్గా వున్న ప్రదేశంలో తపస్సు చేసిందని, ఆ దుర్గయే మన మాతాజీగా జన్మించిందని పెద్దల నమ్మకం. అలాగే ఈ దర్బారు నగరం చుట్టూ తొమ్మిది శివక్షేత్రాలున్నాయని కూడా పెద్దల నానుడి. 1958 నుండి మాతాజీ, స్వామీజీల నివాస స్థానమై మరింత పవిత్రతను సంతరించుకున్నది. అప్పటినుండి స్వామివారికి శ్రీ దర్గాస్వామీజీ అని, రంగనాయకమ్మగారికి శ్రీ దర్గామాతాజీ అని నామధేయాలు స్థిరపడ్డాయి. వారి అసంఖ్యాక భక్తకోటికి దర్బార్‌నగరం పుణ్యక్షేత్రం అయింది. నేడది వేలాది భక్తులకు యాత్రాస్థలం.

స్వామివారికి ఋణానుబంధం వలన భౌతిక గురువుగారు లభ్యమయ్యారు. 1957 జనవరి 29వ తేదీన ఆయన తమ పాదాన్ని



**స్వామి భౌతిక గురువుగారు**

స్వామి గుండెలపై పెట్టారు. నుదుటిపై ముద్దు పెట్టుకున్నారు. శరీరమంతా తడిమారు. వారి నోటిలో నమిలిన పదార్థాన్ని తీసి స్వామి నోటిలో పెట్టారు.

మరునాడు ఆ గురువుగారు కనపడలేదు. అప్పుడు దానికి స్వామి చాలా బాధపడుతుంటే వాళ్ళ గురువుగారు **"అంతరాత్మనై నేను ఎక్కడ లేను? అంతటా ఉన్నాను"** అని స్వామికి అంతర్వాణిగా చెప్పారు. తరువాత కొంత సమయం స్వామికి ఎవరిని చూచినా కూడా వారి గురువుగారి ముఖమే కనపడేది. ఈ అనుభవం ద్వారా స్వామి గురువుగారు చెప్పిన వాక్యం ఆయన మనస్సులో దృఢపడింది. ఆ తరువాత స్వామి, అమ్మయ్యలు తిరుమలకు వెళ్ళి శ్రీ వేంకటేశ్వరునికి వెంట్రుకలు సమర్పించి వచ్చారు. స్వామి గురువుగారు ఉర్దూలో వ్రాసిన ఆరు ఆకులు ఇచ్చారు. అవి అరిషడ్వర్గాలకు సంకేతం.

అమ్మయ్య ఒక సందర్భంలో భక్తులతో మాట్లాడుతూ "స్వామికి వారి గురువు దగ్గర ఒక్కరోజు మాత్రమే వుండగలిగే అవకాశం కలిగింది. మనం చాలా అదృష్టవంతులం స్వామితో ఎక్కువసేపు వుండగలిగే అవకాశం భగవంతుడు ఇచ్చాడు. ఆ అవకాశాన్ని మనం సద్వినియోగం చేసుకుందుము గాక!" అని జాగరూక పరిచారు.

ఒకసారి అమ్మయ్యగారితో దర్గాస్వామి వాళ్ళ నాన్నగారు 'అమ్మా! మా వాడికి నీతో వివాహం కాకుంటే ఈ పాటికి ఏ అడవిలో ఏ పుట్టక్రింద తపస్సులో ఉండేవాడో! మాకు దక్కేవాడు కాదు. 1948లో గాంధీ మహాత్ముడు మరణించినప్పుడు, మహాత్ముల జీవితాల గురించి ఆలోచిస్తూ స్మశానాలలోనే గడిపేవాడు' అని చెప్పారు. అప్పుడు అమ్మయ్యగారు "ఇప్పుడిక మనకు అలాంటి భయం లేదు, ఆయనకు సద్గురువు దొరికారు. సరైన సాధనా మార్గం లభించింది" అని చెప్పారు.

స్వామివారు కట్టుబట్టలతో వచ్చి దర్గాల వద్ద నివసించటం వారి తండ్రిగారికి ఇష్టముండేది కాదు. ఈ విషయమై స్వామికి, ఆయనకు వాదం జరుగుతూ వుండేది. స్వామి తండ్రిగారు 23 రోజులలో చనిపోతారనగా, స్వామి తన తమ్ముని దగ్గర 10 రూపాయలు తీసుకుని ఆయనకు ఇచ్చి పితృఋణం తీర్చుకున్నారు. ఆయనను తమ బిడ్డగా చేసుకుని జ్ఞానం ఉపదేశించారు. భృకుటిలో గట్టిగా అదిమిన తర్వాత 20 రోజులు సమాధిలో ఉన్న పిమ్మట ఆయనకు జ్ఞానం కలిగింది. స్వామి ఉత్తరాభిముఖంగా పద్మాసనం వేసుకుని కూర్చుంటే తండ్రిగారు స్వామి ఒడిలో తలపెట్టుకుని విదేహముక్తినిపొందారు.

సంపన్న కుటుంబంలో జన్మించిన తల్లి భౌతికమైన భోగభాగ్యాలను ఆశింపక స్వామి తోడిదే లోకమని భావించెను. ఆ తరుణంలో దర్గాలో చిన్న కుండలో అన్నం వండుకునే వారు. అప్పుడప్పుడు బియ్యం లేకుండేవి. అలాంటి సందర్భాలలో వారికి నిరాహారమే. ప్రక్క గ్రామం నుంచి ఒకామె పాలు తెచ్చియిస్తే అవి త్రాగి కాలం గడిపే వారు. ఒకనాడు పదిమైళ్ళ దూరంలో గల గ్రామం నుంచి ఒకామె సజ్జ రొట్టెలు, కారం తెచ్చి ఇస్తే అవి తిని కొన్నాళ్ళు గడిపారు. అయితే ఇదిలేదు అన్న భావన వారిద్దరిలో ఎవరికీ ఎన్నడూ రాలేదు. ఆకలి దప్పులకు

శీతోష్ణ పరిస్థితులకు ఆధ్యాత్మిక సంపన్నులైన ఆ దివ్య దంపతులు పూర్తిగా అతీతులు.

ఇక్కడి దర్గాల సమీపాన ఒక చెట్టు వుంది. ఆ చెట్టునుండి రెండు పాములు బయటకొచ్చి దర్గాలకు ప్రదక్షిణలు చేసి ఆ చెట్టులోకి పోయేవి. ఒకరోజు కొందరు గ్రామస్తులు ఆ చెట్టును కొట్టాలని గొడ్డళ్ళు తీసుకువచ్చారు. ఆ రెండు పాములు వారిపైన పడడంతో వాళ్ళు గొడ్డళ్ళు అక్కడ పారేసి దూరంగా వణుకుతూ నిలుచున్నారు. వాళ్ళబాధ చూచి శ్రీ స్వామివారే తిరిగి ఆ గొడ్డళ్ళను తీసుకుపోయి ఇస్తే నమస్కరించి వెళ్ళారు.

ఒకసారి శ్రీ స్వామివారు దర్గాల వద్ద లేనప్పుడు అమ్మయ్యగారు సమాధుల దగ్గర దీపం పెడుతున్నారు. అప్పుడొక దుర్మార్గుడు ఆమెకు హాని చేసే తలంపుతో అమ్మయ్యకు 10 అడుగుల దూరం వరకు వచ్చాడు. సమాధులలో వుండే ఒక మహనీయుడు ఆ దుర్మార్గుని చెంపమీద కొట్టడంతో అతడు క్రిందపడి దభేలుమని శబ్దమైంది. ఈ శబ్దం ఏమిటా అని అమ్మయ్యగారు వెనక్కు తిరిగి చూచారు. అప్పుడతడు లేచి పరుగెత్తి పోతున్నాడు. అది మొదలు ఎవ్వరూ ఇలాంటి దుష్ట తలంపులతో ఆ నిర్జన ప్రదేశంలోకి వచ్చేవారు కాదు. ఆ విధంగా ఆ సమాధులలోని మహనీయులు వారిని అనుక్షణం కాపాడుతున్నారు.

స్వామివారు కడపకు వెళ్ళినప్పుడు కానీ, షోలింగర్‌లో తపస్సు చేయటానికి వెళ్ళినప్పుడు కానీ మాతాజీ, మాతాజీ తల్లిగారు మాత్రమే ఆ నిర్జన ప్రదేశంలో ఉండేవారు. అమ్మయ్యగారే దర్గాల వద్ద దీపాలు వెలిగించేవారు. దర్గాలోని గురువులకు భక్తులు తెచ్చినవి చదివింపులు చేసేవారు. దర్గాకు వచ్చిన భక్తులు హుండీలో డబ్బులు వేస్తే ఆ డబ్బు దీపాలకు నూనె కొరకు ఖర్చు చేసేవారు. భయం అనేది మాతాజీ ఎరుగరు. మాతాజీ బంధువులు కొందరు అమ్మా ఈ అడవిలో నిర్జన ప్రదేశంలో ఉండడానికి నీకు భయం లేదా? అని అడిగారు. దానికి మాతాజీ **"భయమా? అది ఎలా ఉంటుంది. చూపించు"** అని అన్నారు. మాతాజీ కేవలం గృహిణి మాత్రమే కాదు. స్వామీజీ లాగే ఆధ్యాత్మిక మార్గంలో పరిణతి సాధించిన మహాయోగిని. అయితే తన శక్తిని, నిజతత్వాన్ని ప్రయత్న పూర్వకంగా మరుగు పరుచుకొని సాధారణ

గృహిణిలాగే ప్రవర్తించారు.

ఒకరోజు మాతాజీ పూలు కట్టుకుంటూ కూర్చుని ఉన్నది. అమ్మగారి మేనమామ చూడడానికి వచ్చాడు. ఆయన ఒక ఫర్లాంగు దూరంలో ఉండగానే మాతాజీ చుట్టూ ఒక దివ్య జ్యోతి వ్యాపించి ఉండటం చూశాడు. దగ్గరకు వచ్చే కొద్దీ ఆ వెలుగు మరింత ప్రకాశం కావడంతో ఆయనకు చాలా భయం వేసింది. చాలాసేపు ఆయన మామూలు స్థితికి రాలేక పోయాడు. ఇంకొక సందర్భంలో మాతాజీ ఆశ్రమంలో ఒక గోనెపట్టపై కూర్చుని ఉంది. ఆ పట్ట క్రింద రెండు పెద్ద పాములు ఉన్నాయి. మాతాజీ లేవగానే ఆ రెండు పాములు ప్రశాంతంగా బయటకు వచ్చి జరజరా వెళ్ళిపోయాయి. మాతాజీ ఏ మాత్రం కంగారు పడలేదు, చలించలేదు. మాములుగానే ఉన్నారు.

దర్గా అంటే సూఫీ మహాత్ముడి సమాధి మందిరం. ఉరుసు అంటే పరిమితమైన సాధకుని చైతన్యం అనంతమైన పరమాత్మ చైతన్యంలో ఐక్యమవటం. ప్రతి సంవత్సరం మహనీయుని సమాధి అయిన రోజున ఉత్సవం చేసుకుంటారు. విద్యుద్దీపాలతో దర్గాను అలంకరిస్తారు. స్వామి దర్గాకు రాకముందర సమాధుల మీద వస్త్రములుగానీ, చుట్టూ గోడలుగానీ లేవు. స్వామి వచ్చిన తర్వాత దర్గాలో సమాధిలో వున్న సిద్ధపురుషులను ఎంతో ప్రార్థన చేస్తే చాలా కాలానికిగానీ వారు గోడలు కట్టటానికి అంగీకరించలేదు. సూఫీ సంతులలో కూడా సూక్ష్మమైన సంప్రదాయభేదాలు ఉన్నాయి. కొంతమంది హిందూమతంలోని శైవ సంప్రదాయాన్ని, మరికొంతమంది వైష్ణవ సంప్రదాయాన్ని పోలివుంటారు. వారి సంప్రదాయాలను అనుసరించి వారి దర్గాలు కూడా నిర్మితమై ఉంటాయి. కొన్ని దర్గాలు నిరాడంబరంగా, పై కప్పులేకుండా ఉంటాయి. మరికొన్ని దర్గాలు గుమ్మటపు కప్పు(డోమ్) కలిగి ఆడంబరంగా వుంటాయి. ఆధ్యాత్మికమార్గంలోప్రగతి సాధించాలనుకున్నవారు ఇటువంటి దర్గాల దగ్గర నివసిస్తూ సాధన చేసుకుంటారు. దర్గా సంరక్షకులు వార్షికంగా దర్గాలోని సిద్ధపురుషుల సమాధి చెందిన రోజులలో ఉరుసు అనే ఉత్సవం జరిపిస్తారు.

స్థల పురాణం ప్రకారం 1474వ సంవత్సరంలో అరేబియా దేశస్తులైన శ్రీ సద్గురు హజరత్ దర్బారు ఆలీషావలీ వారి గురువు దాదాకలంధర్ గారు. వారి గురువు అలీషవలీగారికి ఎండిపోయిన ఒక జువ్వి, ఒక నేరేడు కొమ్మలు ఇచ్చారు. “ఈ రెండు కొమ్మలు ఏ ప్రదేశంలో నాటిన ఒక్కరోజులో చిగురిస్తే అది నీ స్థానం” అని వారి గురువుగారు ఉత్తరువు ఇచ్చారు.

గురువు ఆదేశం ప్రకారం దేశ సంచారం చేస్తూ నీలకంఠరావుపేట ప్రదేశానికి వచ్చారు. దర్బారు అలీషావలీ వారు ప్రస్తుతం దర్గా ఉన్న ప్రాంతంలో ఆ రెండు కొమ్మలని అక్కడికి చేరిన రాత్రి నాటారు. ఆ రెండు కొమ్మలు మరునాటి ఉదయానికి చిగురించాయి. ఆ సంకేతంతో గుర్వాజ్ఞ మేరకు వారు అక్కడే ఉండి భక్తుల సమస్యలకు పరిష్కారం చేస్తూ, అక్కడే సమాధి అయ్యారు. అ జువ్విచెట్టు ఇప్పటికీ సజీవంగా ఉంది. దానినుండి ఓంకార నాదం వినబడుతుందని ప్రజల నమ్మకం.

చుట్టుప్రక్కల పల్లెజనం కొంతమంది ప్రతిరోజు పాలు అమ్ముకునేందుకు దర్గామీదుగా నీలకంఠరావుపేట వెళ్ళేవారు. వారిలో ఒకామె దర్గా వద్ద పక్షులను చూచింది. అవి అక్కడ ధాన్యం గింజలు తిని బలంగా, ఆరోగ్యంగా ఉండటం గమనించింది. ఆ పక్షులను వండుకుని తింటే తన పిల్లలకు ఆహారంగా బాగుంటాయనుకుంది. మధ్యాహ్నం ఇంటికి తిరిగి వెళ్ళేటప్పుడు ఆ పక్షులన్నీ దర్గా సమీపంలో చనిపోయి నేలపై పడి వుండటం గమనించింది. ఆనందంగా వాటిని తన బుట్టలో వేసుకుని ఇంటికి వెళ్ళింది. ఇంటికి వెళ్ళగానే అక్కడి దృశ్యం చూసి నోట మాట రాక నిశ్చేష్టురాలైంది. తన పిల్లలు కూడా ఆ పక్షులలాగే విగతజీవులై నేలపై పడివున్నారు. ఆమె భోరుభోరున ఏదవటం మొదలు పెట్టింది. అప్పుడు అటుగా వెళ్తున్న ఒక ఫకీరు వచ్చి విషయం తెలుసుకుని దర్గాలలో పక్షులను పెట్టి ప్రార్థన చేయమన్నారు. ఆమె ఆ ఫకీరు చెప్పిన విధంగా చేయగా, పక్షులన్నీ ప్రాణం వచ్చి ఎగిరిపోయాయి. అదే సమయానికి ఆమె ఇంటి వద్ద పిల్లలు కూడా సజీవులైనారు. ఈ మహత్తు చూచిన ఆ ఫకీరుకి దర్గాలో ఉన్న మహనీయుని మీద గురుత్వం ఏర్పడి అక్కడే నిలబడిపోయారు.



ఆయనే సద్గురు హజరత్ జలీల్ మస్తాన్ వలీ. ఆయన అక్కడకు సుమారు (హజరత్ దర్బార్ అలీషావలీ గారు సమాధి అయిన 200 ఏండ్లకు) 1674లో దర్గాల దగ్గరకి వచ్చారు.

ఇద్దరూ దత్త సంప్రదాయానికి చెందిన మహిమాన్వితులు. వారి సమాధుల నుండి ఈనాటికి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు జరుగుతుంటాయి. అందువలననే ఆ సమాధుల చుట్టూ ఎన్నిసార్లు సిమెంటు పూత వేయించినా వెంటనే సన్నని పగుళ్ళు ఏర్పడతాయి. ఇక్కడి వాతావరణం చాలా ప్రశాంతంగా ఉంటుంది. పరిసర నైసర్గిక దృశ్యం చాలా అందంగా ఆహ్లాదకరంగా ఉంటుంది. పవిత్రత, ప్రశాంతత, ప్రకృతి సౌందర్యాలు వచ్చినవారికి ఆనందాన్ని ఇవ్వటమే కాక వారి ఆధ్యాత్మిక సాధనకు తోడ్పడతాయి.

ఆ జువ్వి వృక్షాలు స్వామి వచ్చిన తర్వాతికాలంలో విస్తారంగా ఎదిగి దర్గాలమీద పచ్చని పందిరి కట్టినట్టుగా వుంటాయి. దర్గాలకు ఆగ్నేయంలో ఒక చెరువు ఉంది. వర్షాలు పుష్కలంగా పడిన సంవత్సరంలో ఈ చెరువు పూర్తిగా నిండి పరిసరాలు మరింత ఆహ్లాదకరంగా ఉంటాయి. అప్పట్లో దర్గాప్రాంతం ఒక విధంగా అరణ్యమే. దూరంగా తూర్పు కనుమల కొండలున్నాయి. వాటికింద పంటపొలాలు ఉన్నాయి. అయితే అప్పట్లో జనసంచారం బహుస్వల్పం. ఎండా వానల నుండి రక్షణ ఏమాత్రం లేదు. అప్పుడప్పుడు విషజంతువులు కనపడుతూ ఉండేవి. దర్గా వద్దకు వచ్చాక, స్వామి, అమ్మయ్యలు ఇద్దరూ తీవ్రమైన సాధన చేసారు.

ఈ దర్గాకు, దర్గా మహత్తునకు సంబంధించి ప్రచారంలో ఉన్న ఐతిహ్యాలు: స్వామి, అమ్మయ్యలు దర్గా వద్ద స్థిరపడటానికి కొద్దికాలం ముందు జరిగిన సంఘటన ఇది. దర్గా ప్రక్కగా ఒక కాలిబాట ఉండేది. ఈ కాలిబాట గుండా ప్రజలు నీలకంఠరావుపేట నుండి వచ్చిపోతుండేవారు. ఒకసారి నీలకంఠరావుపేటలో ఒకాయన రామాపురం నుండి దర్గా మీదుగా వస్తూండగా, ఒక ఆజానుబాహువు, పొడవైన వృద్ధుడు దర్గా వద్ద కనపడి నీలకంఠరావుపేట గ్రామం దాకా తోడు వచ్చినాడు. గ్రామం వద్దకు వచ్చినాక అతను 'నాకు కొంచెం బెల్లం పెడతారా?' అని అడిగాడు. ఆ గ్రామస్తుడు ఆలోచించి తిరిగి చూచేలోపు ఆ వృద్ధుడు కనపడలేదు. ఇది ఆ దర్గాలోని మహనీయుడు దర్బార్ ఆలీషావలి "మమ్ము కనిపెట్టుకుని పోషణ చేస్తారా?" అని అడిగినదానికి సూచనగా తోస్తుంది. తర్వాతికాలంలో స్వామి, అమ్మయ్యలు దర్గాలో స్థిరపడి, ఆ మహనీయులను సేవించినందు వల్ల ఆ మహనీయుల గొప్పదనం అందరికీ తెలిసింది..

ఒకసారి ఉరుసు ఉత్సవానికి దర్గాల దగ్గరకు ఎక్కడ నుండో ఒక మహాత్ముడు వచ్చాడు. అప్పుడు స్వామి "వేరే చోట్ల ఉరుసు ఉత్సవం ఎంతో ఆడంబరంగా జరుగుతూ వుంటే మీరు ఇక్కడకు ఎందుకు వచ్చారు?" అని అడిగారు. అప్పుడు ఆ మహాత్ముడు **"అక్కడ ఎంతో ఆర్భాటంగా జరుగుతుంది. కానీ అక్కడ వెలుగు లేదు. ఇక్కడ**

**ఆ వెలుగు ఉండటం వలన ఇక్కడకు వచ్చాను"** అని చెప్పారు. "ఈ దర్గాలోని మహాత్ములే నన్ను నిర్భయుణ్ణి చేసారు" అని స్వామి చెప్పారు. ఇలాంటి ఉత్సవాలలో **భగవంతుని మెప్పించేది భక్తి, శ్రద్ధ (వెలుగు)** కానీ అట్టహాసం కాదు అని ఆ మహనీయుడు బోధిస్తున్నాడు.

ఒకప్పుడు అవధూత ఒకామె దర్గాల వద్దకు వచ్చి వుంటుండేవారు. స్వామి నీలకంఠరావుపేట వాసవీమాత మందిరంలో పూజారి శ్రీ లక్ష్మీ నారాయణశర్మగారిని పిలిచి ఆమెకు అన్నం పెట్టమని చెప్పారు. అతడు స్వామి మాట కాదనలేక అలానే తీసుకు వెళ్ళాడు. అప్పుడామె "అందరి వద్ద అడుక్కుని నాకు తెచ్చావు. అదైనా అన్నయ్య తెమ్మన్నాడని తెచ్చావు కదూ!" అన్నారు. అతడు స్వామి వద్దకు వెళ్ళి ఈ విషయం చెప్పగా "ఆమె అన్నదాంట్లో తప్పేమీ లేదు. నీవు పూజారివి. అందరి వద్ద అడిగి తీసుకుంటూ వుంటావు. అలానే నేను చెప్పడం వల్లనే కదా నీవు ఆమె వద్దకు పోయావు. లేకుంటే వెళ్ళేవాడివి కాదు కదా!" అన్నారు.

ఈ విధంగా దర్గా వద్ద స్వామి స్థిరపడి సమాధులను సేవిస్తుంటే, హిందువులు వచ్చి ముస్లిమ్ సమాధులను సేవించడం అక్కడి ముస్లింలకు గిట్టలేదు. అందుచేత ఒకసారి ఆ ముస్లిములు రాత్రి సమయంలో వచ్చి శ్రీ స్వామివారిని మంచంతో సహా ఎత్తుకుపోయారు. శ్రీ స్వామివారు నవ్వుకుంటూ సమాధులలో వుండేవారికి ఏది ఇష్టమైతే అదే జరుగుతుందని తలచారు. ఆ ముస్లింలకు పాములు తమపై పడ్డట్టు అనుభవం కలగడంతో తిరిగి మంచంతో సహా శ్రీ స్వామివారిని తెచ్చి సమాధుల చెంత చేర్చారు.

ఒకసారి ఒక మంత్రగాడు దర్గాల వద్దకు వచ్చి స్వామి చేతి మీద సర్పంతో కాటు వేయించాడు. స్వామి స్పృహ తప్పి పడిపోయారు. అతడు గర్వంతో చుట్టుప్రక్కల వున్న ఊళ్ళ నుండి వెడుతూ, తనకు ఎదురుపడ్డ వాళ్ళతో 'నేను స్వామిని పడగొట్టేశాను. ఇక ఆయన లేవరు' అని గర్వంగా చెప్పుకుంటూ వెళ్ళిపోయాడు. అది విన్న వారు ఆత్రంగా స్వామిని చూడటానికి దర్గాల వద్దకు వెళ్ళేటప్పటికి, స్వామి దర్జాగా కాలు మీద కాలు వేసుకుని మాట్లాడుతూ వున్నారు. ఆ మంత్రగాడు

స్వామిని ఏమీ చేయలేక పోయాడు.

దర్గాలో ప్రతి సంవత్సరం ఫాల్గుణ పౌర్ణమినాడు దర్గాలోని సిద్ధపురుషులకు మూడురోజులపాటు ఉరుసు ఉత్సవం జరుగుతుంది. దీనికి కుల, మత, భాష, ధనిక, బీద తేడాలు లేకుండా భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. 1959వ సం॥లో జరిగిన ఉరుసుకు భక్తులు అసంఖ్యాకంగా హాజరైనారు. ఆ ఉరుసు ద్వారా స్వామివారికి చాలా డబ్బు వచ్చి ఉంటుందని నీలకంఠరావుపేటలోని ముస్లింలు కొందరు భావించారు. ఆయన హిందువు, ముస్లింకాదు. అది నెపంగా ఉరుసు ఆయన నిర్వహించరాదని వారు అభ్యంతరం లేవదీశారు. ఆయన హిందువు. ఆయనకు ఉపనయనం ముస్లిం సాంప్రదాయం ప్రకారం జరుగలేదు. ఆయన భార్య హిందూ పద్ధతిలో బొట్టుపెట్టుకుంటుంది. ఇవీ వారి ప్రధాన అభ్యంతరాలు. అందుకు వారితో స్వామీజీ "నేను సమాధిలోని మహాత్ముల ఆదేశానుసారమే సేవ చేసుకుంటున్నాను. తద్వారా నేనేమీ డబ్బు సంపాదించుకొనడం లేదు. భక్తుల సమస్యలకు ఆ మహాత్ములు సూచనలు, పరిష్కారాలు నా ద్వారా ఇస్తున్నారు" అని చెప్పారు. అయితే వారు ఈ సమాధానాన్ని అంగీకరించలేదు.

1960వ సంవత్సరం ఉరుసుకు తాడిపత్రిలోని పెద్దలను పిలిపించి వారి ఆధ్వర్యంలో ఉత్సవం జరపాలని నిశ్చయించుకున్నారు. అలానే రెండు సంవత్సరాలు వారి ఆధ్వర్యంలోనే ఉరుసు జరిగింది. ఉత్సవం ద్వారా వచ్చిన ఆదాయాన్ని వారు తీసికొని వెళ్ళిపోయేవారు. స్వామీజీ మాత్రం నిర్విచారంగా దర్గా వద్దనే తమ ఆశ్రమంలో ఉంటూ ఆ మహనీయుల సేవ కొనసాగించారు.

1961వ సంవత్సరం ఉరుసు ప్రారంభమైంది. పెద్దలందరూ ఆసీనులై ఉన్నారు. ఒక ముస్లిం యువకుడు ఆవేశంగా స్వామీజీని నోటికి వచ్చినట్లు తిట్టడం ప్రారంభించాడు. అతనిని ఎవ్వరూ వారించలేదు. స్వామీజీ మాతాజీలు ఇద్దరూ మౌనంగా ప్రశాంతంగా కూర్చొని ఉన్నారు. మాతాజీకి ఆ యువకుడు వాడుతున్న అసభ్యభాష వలన బాధగా ఉన్నా పైకి ఏమీ చలించకుండా నామజపం చేసుకుంటూ మౌనంగా ఉండిపోయారు. ఉన్నట్లుండి ఆ యువకుడు ఎవరో వెనుక నుంచి తనను బలంగా కాలితో

తన్నినట్లు క్రింద పడి మూర్ఛపోయాడు. అందరూ భయపడ్డారు. అక్కడున్న పెద్దలు ఎంత ప్రయత్నించినా ఆ యువకుడికి స్పృహ తెప్పించలేకపోయారు. అప్పుడు వారికి జ్ఞానోదయమైంది. తమ తప్పు తెలుసుకున్నారు. ఆ యువకుడిని కరుణించవలసిందని స్వామివారిని ప్రార్థించారు. స్వామీజీ వారితో "నాదేమీలేదు, దర్గాలోని మహాత్ములను ప్రార్థించండి" అన్నారు. వారు అలాగే చేశారు. అప్పుడు ఆ యువకునికి స్పృహ వచ్చింది. "సమాధిలో ఉన్న హజరత్ దర్బార్ ఆలీషావలీ వారు నన్ను వెనుక నుంచి బలంగా తన్నడం వలన నేను క్రిందపడి స్పృహ కోల్పోయాను" అని చెప్పుకున్నాడు. ఆనాటి నుండీ నేటి వరకు ఆ ఉరుసును స్వామివారే జరిపిస్తున్నారు. దిగ్విజయంగా జరుగుతోంది. తమను దూషిస్తున్నా, ప్రతిఘటించకుండా మౌనంగా నామజపంలో ఉండటం స్థితప్రజ్ఞ లక్షణం.

స్వామి దర్గా చుట్టు ప్రక్కల వున్న పొలాలలో రైతులతో కలసి స్వయంగా అరక వేసి వ్యవసాయం చేసారు. స్వామి కాలానుగుణంగా వరి, శెనక్కాయ, ఆవాలు, రాగి, సజ్జ మొ॥ పంటలు పండించారు. ఆ పంటను ఇప్పుడు అమ్మయ్య సమాధి ఉన్న ప్రదేశం వద్ద ఆరబెట్టి, తర్వాత బస్తాలు కట్టి మార్కెట్‌లో రేటు వచ్చాక ఆ పంటను అమ్మేవారు. ఆ వచ్చిన డబ్బుతో స్వామి జీవనం, ఉత్సవాలు జరిపేవారు. ఏనాడూ స్వామి భక్తుల వద్ద డబ్బు ఆశించలేదు.

స్వామి వార్షిక ఉత్సవం గ్యార్మి పండుగకు మెహబూబ్ సుభాన్‌స్వామి పేరు మీద చాలా పొడవైన (సుమారు 35 అడుగుల) జెండా కర్రను ఒక్కరే అరచేతితో నిలిపి నడిచేవారు. భక్తులందరూ స్వామి బలానికి అబ్బురపడేవారు. స్వామి దర్గాలకొచ్చిన మొదట్లో అక్కడ చేసే ఉత్సవాలకి స్వామి గుంజలు నాటటానికి త్రవ్వుతుంటే అమ్మయ్య చేత్తో మట్టిని తీసేవారు. ఎంతమంది భక్తులు వచ్చినా అమ్మయ్య స్వయంగా వంట చేసేవారు. స్వామి, అమ్మయ్యలు కూడా వడ్డించేవారు. ఈ రకంగా చాలా సంవత్సరాలు ఉరుసు ఉత్సవం జరిపినాక ఒకసారి దర్గాలోని మహనీయులు "మీరొక్కరే ఉరుసు ఉత్సవానికి సేవ చేయటం కాకుండా వచ్చే భక్తులను కూడా ఈ పవిత్ర

కార్యంలో పాల్గొనే అవకాశం కలిగించండి" అని ప్రేరణ చేసారు. ఆ తర్వాత నుండి స్వామి, అమ్మయ్యలు భక్తుల సహకారంతో ఉత్సవాలు జరిపించటం మొదలుపెట్టారు.

1961 ప్రాంతాలలో జరిగిన ఒక సంఘటన: నీలకంఠరావుపేటలో ఒక ముస్లిం కుర్రవానికి చాలా కాలంగా మాటలు రాలేదు. వాళ్ళొచ్చి శ్రీ స్వామివారిని ప్రార్థించారు. శ్రీ స్వామివారు అతని నాలుకపై వ్రాసినాక అతనికి మాటలు వచ్చాయి. ఈ విషయం అచ్చటి ముస్లింలు నమ్మలేదు. 'ఆ కోమటాయన వచ్చి నాలుక మీద వ్రాస్తే మాట వచ్చిందా?' అది వట్టిదేనన్నారు. కొద్ది రోజుల తర్వాత సమాధుల దగ్గర ఒక కార్యక్రమం జరుగుతుంటే ఆ మాటలు వచ్చిన ముస్లిం యువకుడు తన మిత్రులతో అక్కడ సేవ చేశాడు. పని పూర్తయిన తర్వాత చేతులు, ముఖము కడుక్కోవటానికి దర్గా ఎదురుగా వున్న దిగుడు బావిలోకి దిగారు. అక్కడొక మూరెడు లోతు నీళ్ళు వున్నాయి. కానీ ఆ నీటిలో ఆకు రాలి, ముండ్లతో కప్పబడి, బాగా పురుగులు పట్టి ఉన్నాయి. శ్రీ స్వామివారికా సంగతి చెప్పారు. దానికి స్వామి "పురుగులు లేవు, ఏమీ లేవు పోయి ఆ ముండ్లు తీసేసి కడుక్కో"మన్నారు. వారు వెళ్ళి ముండ్లు తీసేసి, పైనున్న నీళ్ళు ప్రక్కకు తోయగానే, క్రిందనుండి పరిశుభ్రమైన నీళ్ళు వచ్చాయి. వాళ్ళు కాళ్ళు, చేతులు, ముఖం కడుక్కోవటమే గాక కడుపారా నీరు త్రాగి వెళ్ళారు.

ఈ జరిగిన అనుభవాల దృష్ట్యా తర్వాతి కాలంలో స్వామి దర్గా ఉన్న భూమి, సమీపంలో ఆశ్రమానికి కొంత భూమి కొనుగోలు చేసి పక్కాగా రిజిస్ట్రేషన్ చేయించినారు. ఆ భూమి కొనుగోలు చేయటానికి తలుపుల మల్లిఖార్జున్ అనే స్వామి భక్తుడు ఆ రోజుల్లో 300/- రూపాయలు ఇచ్చినాడు. తర్వాత స్వామి చాలాకాలం కడపటౌన్‌లో ఉన్న తలుపుల మల్లిఖార్జున్ గారింట్లో భక్తులకు ప్రశ్న చెప్పారు. వారంలో కొన్ని రోజులు కడపలో ఉండి దర్గాకి వచ్చేవారు. స్వామి ఆశ్రమంలో లేని సమయంలో అమ్మయ్యగారు దర్గాలోని కార్యక్రమాలు యథావిధిగా నిర్వర్తించేవారు. తలుపుల మల్లిఖార్జున్ గారి భార్యపేరు అనసూయ. స్వామి ఈవిడయందు చాలా వాత్సల్య భావనతో ఉండి "అమ్మా" అని

సంబోధించేవారు.

ఈ అధ్యాయంలో, 1931లో స్వామివారు జన్మించిన తర్వాత వారి బాల్యము, విద్యాభ్యాసము, వివాహము, ఆధ్యాత్మిక సాధన వివరాలు గురించి తెలుసుకున్నాము. ఎన్నో ఆటుపోట్ల తర్వాత స్వామివారు సాధనలో ఉత్తీర్ణులై దర్గా వద్ద మహనీయుల సేవకు 1958లో స్థిరపడ్డారు. చాలామంది మహనీయులు ఏకాంతంగా దుర్గమ ప్రదేశాలలో ఏకాంతంగా నివసించటానికి ఇష్టపడతారు. కానీ దర్గాస్వామి తాము జ్ఞానాన్ని పొందిన తర్వాత కూడా తమను ఆశ్రయించిన వారిని సరైన మార్గంలో నడిపించి కాపాడుతున్నారు. ఒకనాడు ఇంగ్లీషు విద్య అభ్యసించినా దర్గాలోని గురువుల మాట ప్రకారం

- నిర్జనమైన అరణ్యంలో కట్టుకున్న భార్యతో కలిసి తపస్సు చేసారు
- కట్టుకున్న భార్యను జీవింతాంతం మాతృమూర్తిగా ఆరాధించారు
- ఆశ్రయించి వచ్చిన భక్తులను స్వంతబిడ్డలలాగా కాపాడారు
- తమకున్న ఆస్థి మొత్తాన్ని పరుల శ్రేయస్సుకు ఉపయోగించారు

స్వామి తమ జీవితం గురించి క్లుప్తంగా చెపుతూ ''భోగి-త్యాగి-యోగి'' అని ప్రస్తావించారు. ఈ అధ్యాయంలో చెప్పబడినదంతా దానికి ప్రతిరూపమే!



శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయినాథాయ నమః

# దైవం మానుష రూపేణ

## అధ్యాయము - 2

## శ్రీ సద్గురు దర్గాస్వామి వారి జీవితము - ఉత్తరభాగము

ఈ అధ్యాయంలో 1960 తర్వాత స్వామివారి జీవితంలో జరిగిన వివరాలు తెలిసినంత వరకు పొందుపరచటమైనది. స్వామివారు 1958లో దర్గాలో స్థిరపడినాక, గురువులకు 60 సంవత్సరములు సేవ చేసుకుంటానని చెప్పుకున్నారు. స్వామివారి చరిత్ర వ్రాసే సమయానికి 1990 తర్వాత వచ్చిన భక్తులు చాలామంది ఉన్నారు. వారందరినీ కలసి విషయసేకరణ చేసి ముద్రించటం జరిగింది. అట్లాగే స్వామివారు కూడా 1953 నుండి 1958దాకా వారి సాధనాపర్వంలో జరిగిన విషయాలను భక్తులతో నెమరువేసుకునేవారు. అయితే 1960 నుండి 1990 లోపల జరిగిన విషయాలు ఎప్పుడూ ప్రస్తావించలేదు. ఆ కాలంలో వచ్చిన భక్తుల వివరాలు కూడా ఈ గ్రంథానికి విషయసేకరణ చేసే సమయానికి ఎక్కువ లభించలేదు.

మెహబూబ్ సుభాన్ స్వామి వృక్షం వద్ద స్వామి, అమ్మయ్యలు సాధన చేసేవారు. ఒక సమయంలో వారికి ఆ వృక్షం నుండి దత్తాత్రేయస్వామి చిన్న బాలుడి రూపంలో దర్శనమిచ్చి, వెళ్ళి దర్గాలోని సమాధులలో అదృశ్యమైనాడు. శ్రీ మెహబూబ్ సుభాన్ స్వామి విషయంలో స్వామి ఈ క్రింది వృత్తాంతాన్ని చెప్పేవారు.

మెహబూబ్ సుభాన్ గారు ఉన్న ప్రాంతంలో ఒకప్పుడు ఒక స్త్రీకి సంతానం కలుగలేదు. ఆమె ఆ ప్రాంతంలో ఉన్న ఒక సిద్ధపురుషుని ఆశ్రయించి ప్రార్థన చేయగా, ఆయన ఆమె తరపున పరమాత్మను ప్రార్థన చేసి ఆ స్త్రీకి సంతానయోగం ఉందా అని అడిగాడు. సృష్టికర్త ఆమెకు సంతానయోగం లేదని తెలిపాడు. ఆ సిద్ధపురుషుడు అదే విషయాన్ని ఆ స్త్రీకి తెలియచేసాడు. కొంతకాలం గడిచినాక ఆ స్త్రీ సుభాన్ స్వామిని ఆశ్రయించి సంతానం కొరకు ప్రార్థించింది. మెహబూబ్ సుభాన్‌స్వామి కొంత సమయం మౌనంగా ఉన్నాక ఆ స్త్రీతో "అమ్మా! నీకు ఒక మగబిడ్డ

కలుగుతాడు'' అని చెప్పారు. ఆ స్త్రీ, ఆమెతో వచ్చినవారు సంభ్రమాశ్చర్యాలకు లోనై మగబిడ్డ పుడతాడా? అని బిగ్గరగా అడుగగా, "అమ్మా! నీకిద్దరు పిల్లలు పుడతారు" అని అన్నాడు ఆయన. ఈ హఠాత్ పరిణామానికి వారు ఆశ్చర్యంగా 'ఇద్దరు పిల్లలా?' అని అనగా "అమ్మా! నీకు ముగ్గురు పిల్లలు పుడతారు, తల్లీ!'' అని చెప్పారు. వారు తేరుకుని జరుగుతున్న విషయాన్ని అర్థం చేసుకుని, తాము మాట్లాడితే ఇంకొక బిడ్డనిస్తాడేమోనని భయపడి, మౌనంగా ఆయనకు ప్రణమిల్లి అక్కడ నుండి నిష్క్రమించారు.

ఒక సంవత్సరం తర్వాత ఆ స్త్రీకి ప్రసవం అయి ఒక మగబిడ్డ జన్మించినాడు. వారు కృతజ్ఞతా సూచకంగా ఆ బిడ్డనెత్తుకుని మెహబూబ్ స్వామి ఆశీస్సులకు ఉత్సవంగా బయలుదేరి వెళ్ళారు. దారిలో వారికి మొదట సంప్రదించిన సిద్ధపురుషుడు తారసపడ్డాడు. అతను ఆ స్త్రీకి మగబిడ్డ పుట్టాడని తెలుసుకుని ఆశ్చర్యంగా సృష్టికర్తకు ప్రార్థన చేసి అది ఎట్లా సాధ్యమని విచారించాడు. అప్పుడు సృష్టికర్త "నాయనా! నీవు ఆ స్త్రీకి సంతానయోగం ఉందా? లేదా? అని మాత్రం అడిగావు, కానీ మెహబూబ్ సుభాన్ తన తపోశక్తిని ధారపోసి ఆ స్త్రీకి సంతానాన్ని ప్రసాదించాలని గట్టిగా ప్రార్థన చేసాడు. అందువలన అతని ప్రార్థనను మన్నించి ఆ స్త్రీకి సంతానయోగం లేకపోయినా బిడ్డను ప్రసాదించాను'' అని చెప్పారు. ఈ ఒక్క వృత్తాంతం మెహబూబ్ సుభాన్ స్వామి దయార్ద్ర హృదయానికి నిదర్శనము. ఆర్తితో ఆశ్రయించిన వారి సమంజసమైన కోరికలు తీర్చటానికి తమ తపోశక్తిని ధారపోసి, వారి తరపున సృష్టికర్తను ప్రార్థన చేసి, వారి కోర్కెలను తీర్చటమనేది గురువులకు గురువుకి మాత్రమే సాధ్యం. అందుకే ఆయనను పీరానేపీర్ అంటారు.

1964లో ఏలూరు నుంచి భార్యాభర్తలు ఇరువురు దర్బారు నగరం వచ్చారు. వారి వద్ద ఉండే బంగారు వడ్డాణాన్ని మాతాజీకి ఇవ్వాలని భర్త ఉద్దేశ్యం. ముమ్మిడివరం బాలయోగికి ఇవ్వాలని భార్య ఉద్దేశ్యం. నాలుగు సంవత్సరాలుగా వారి మధ్య ఆ వివాదం జరుగుచుండేది. చివరగా మాతాజీకే ఇవ్వాలని నిర్ణయించుకొని మాతాజీని అడిగారు. ఆమె వెంటనే "బంగారం, బంగారు ఆభరణాలు

మాకెందుకు?" అని తిరస్కరించారు. భార్య భర్తలు కడపలో ఉన్న స్వామీజీ వద్దకు వెళ్ళి వారినడిగారు. "మాతాజీ ప్రకృతి స్వరూపిణి, ఆమె నిరాకరించిన తర్వాత నాకెందుకు!" అని స్వామి అన్నారు. వారికే స్వామీజీ ఇలా చెప్పారు: "మాతాజీ ముక్తి కాంత, ఆదిశక్తి ప్రతిరూపం" అని. మనసా, వాచా, కర్మణా మాతాజీ, స్వామీజీలు అభేదరూపాలు.

1965-66 ప్రాంతంలో ఒక సంవత్సరం పెద్ద కరువు వలననో, పాకిస్తాన్‌తో యుద్ధం వలననో, బియ్యం ధర చాలా పెరిగి పోయింది. ప్రతి సంవత్సరం ఫాల్గుణ పూర్ణిమనాడు దర్గాలో మూడు రోజులు ఉరుసు ఉత్సవం జరుగుతుంది. దానికి భక్తులు అసంఖ్యాకంగా వస్తారు. వచ్చిన వారందరికీ స్వామీజీ, మాతాజీలు భోజనం పెడతారు. కరువు వల్ల మాతాజీ బంధువు ఒకాయన 'ఈ సంవత్సరం కూడా భక్తులకు భోజనాలు పెడతారా?' అడిగాడు. దానికి మాతాజీ ఇచ్చిన జవాబు: "ఒక్కొక్క బియ్యపుగింజ ఒక్కొక్క రూపాయైనా భోజనాలు పెట్టడం మానము" అని. మాతాజీ ధృడ సంకల్పానికి, కార్యదీక్షకు ఈ జవాబు చక్కని ఉదాహరణ. మరొక సంవత్సరం నీలకంఠరావుపేటలో అగ్నిప్రమాదం సంభవించింది. చాలా మంది ప్రజలు సర్వం కోల్పోయి నిరాశ్రయులైనారు. వారు మాతాజీ వద్దకు వచ్చి తమ గోడు విన్నవించుకున్నారు. మాతాజీ వారందరినీ ఓదార్చి ఒక్కొక్క కుటుంబానికి పదిశేర్ల బియ్యం, యాభై రూపాయలు రొక్కం ఇచ్చి పంపారు. మరుసటిరోజు ఉగాది పర్వదినం. భోజనాలకు బియ్యం కావాలి. మాతాజీ అవేవీ ఆలోచించలేదు. కష్టాల్లో ఉన్నవారిని ఎలా ఆదుకోవాలనేదే ఆమె తపన, ధ్యాస. ఉదారత్వానికీ, త్యాగశీలతకు, సానుభూతికి మాతాజీ మరోపేరు.

సుమారు 1965-1970 సంవత్సరాల మధ్యలో జరిగిన కొన్ని అంశాలు: కడపజిల్లాలోని చెన్నూరు సమీపంలోని పల్లెలో కొండారెడ్డి అనే ఒక అవధూత ఉండేవారు. ఈయనకు, దర్గాస్వామివారికి మంచి మైత్రి సంబంధం ఉండేది. కొండారెడ్డిగారు దర్గావద్ద ఆశ్రమానికి వచ్చిపోయేవారు. ఆయనకు పొగ త్రాగే అలవాటు ఉండేది. స్వామి సమక్షంలో ఆయన గుప్పుగుప్పున పొగ త్రాగుతున్నప్పుడు ప్రక్కనున్న

భక్తులు స్వామివారితో 'ఇదేంటి స్వామి! మీ ముందరే ఇలా త్రాగుతున్నారు?' అని అడిగితే "ఫరవాలేదు నాయనా! ఆయనకు ఇష్టమున్నట్లు ఉండనివ్వండి" అని చెప్పేవారు. అదే సమయంలో ఎప్పుడైనా అమ్మయ్యగారు అటుప్రక్కగా వస్తే కొండారెడ్డిగారు సిగరెట్‌ను గబుక్కున ఆర్పివేసి అమ్మయ్యకు దండం పెట్టి 'అమ్మా! జగన్మాతా!!' అనేవారు. వయస్సులో కొండారెడ్డిగారు దర్గాస్వామికన్నా కొంచెం పెద్దవారు.

1971లో సంపూర్ణ రామాయణం సినిమా విడుదల అయిన కాలంలో, ఒకసారి కొండారెడ్డిగారు స్వామితో ఆశ్రమంలో ఉండగా, కడప వెళ్ళి సినిమా చూద్దామని చెప్పారు. ఆశ్రమం నుండి బస్సు ఎక్కవలసిన మెయిన్ రోడ్డుకు సుమారు మూడు కిలోమీటర్ల దూరం ఉంటుంది. కొండారెడ్డిగారు తమ విద్యతో వాతావరణంలో అకస్మాత్తుగా మార్పు కలిగించి జడివాన కురిపించినారు. ఇంత వానలో ఆయన తడవకుండా క్షణాలలో మెయిన్ రోడ్డుకు వచ్చి బస్సు ముందు ద్వారం నుండి ఎక్కారు. అప్పట్లో బస్సులకు రెండు ద్వారాలు ఉండేవి. బస్సు కండక్టరుతో "మా అబ్బాయి వస్తున్నాడు. బస్సు నిలబెట్టు" అని చెప్పారు. ఆ కండక్టరు 'మీ అబ్బాయి ఎప్పుడో వచ్చి బస్సులో వెనుక నుండి ఎక్కి కూర్చున్నాడు' అన్నాడు. కొండారెడ్డిగారు బస్సులో వెనుకకి వెళ్ళి చూడగా దర్గాస్వామివారు కూర్చుని నమస్కారం చేశారు.

కడపజిల్లా కమలాపురం సమీపంలోని పైడికాలువ గ్రామం నుండి నాగిశెట్టిగారు స్వామి దర్శనం చేసుకుంటూండేవారు. ఈయన ఆధ్యాత్మికంగా పరిణతి సాధించిన వ్యక్తి. ఆశ్రమంలో ఉన్నప్పుడు భక్తులందరూ స్వామి సమక్షంలో కూర్చొని ఉంటే నాగిశెట్టిగారు వీరందరికీ కొంచెం దూరంగా కూర్చొని ఉండేవారు. ఎవరైనా నాగిశెట్టిగారిని 'అదేమిటయ్యా! స్వామి అక్కడ కూర్చొని ఉంటే, నువ్వొక్కడవే దూరంగా ఇక్కడ కూర్చున్నావు?' అని అడిగితే 'ఆయన దృష్టిని మన మీదకు మరల్చేంత అవసరమేముంది!' అనేవారు. కాలాంతరంలో ఆయనకు అంత్య ఘడియలు సమీపించినాక ఆయన కుటుంబ సభ్యులతో తనను ఇంటిప్రక్కనున్న స్థలంలో సమాధి

చేయమని చెప్పి కాలం చేసారు. ఇది గ్రామస్తులకు ఆమోదయోగ్యం కాక వారు రచ్చ చేసినారు. స్వామి పైడికాలువకు వెళ్ళి వారిని విచారించి, సమ్మతింపచేసారు. ఆయనను అక్కడ సమాధి చేసినాక స్వామి గ్రామస్తులకు "మీకు ఏ కష్టం వచ్చినా ఈయన సమాధి చుట్టూ తిరగండి. సమస్యలు తీరతాయి" అని చెప్పారు.

స్వామి తల్లిగారు కాలం చేయటం వల్ల తమ తమ్ముళ్ళిద్దరికీ స్వామి, అమ్మయ్య వాళ్ళే దగ్గరుండి వివాహం చేయించారు. తరువాతి కాలంలో వారికి పిల్లలు పుట్టినారు. ఈ పిల్లలు చిన్న వయస్సులో ఎప్పుడైనా దర్గాకు వచ్చినప్పుడు సరదాగా ఆడుకుంటుండేవారు. స్వామివారు దర్గాలలో ప్రశ్న చెప్పి తిరిగి ఆశ్రమంలోకి వచ్చేటప్పుడు కొన్నిసార్లు ఉగ్రంగాను, కొన్నిసార్లు శాంతంగాను ఉండేవారు. సమయానుకూలంగా అది గ్రహించి అమ్మయ్య పిల్లలతో శాంతంగా ఉంటే "నాయనా! పెద్దస్వామి వస్తున్నాడు" అనీ, ఉగ్రంగా ఉంటే "చిన్నస్వామి వస్తున్నాడు" అనీ హెచ్చరించేవారు. దానికి అనుగుణంగా పిల్లలు మసలుకునేవారు. ఆ కాలంలో స్వామి దయ్యాలు, భూతాలు పట్టినవారు వస్తే వదిలించేవారు. వాటిని వదిలించే సందర్భంలో స్వామివారు ఉగ్రంగా ఉండేవారు.

ఆ సంవత్సరాలలో స్వామివారు దేవీ నవరాత్రులు వస్తే తొమ్మిది రోజులు ఎక్కడా బయటకి వెళ్ళకుండా ఆశ్రమంలోనే ఉండేవారు. తొమ్మిది రోజులు ఉపవాసం ఉండి కేవలం నీరు మాత్రమే ఆహారంగా తీసుకునేవారు. స్వామివారు శ్రీ విద్యా ఉపాసకులు. స్వామివారు ఏదైనా అనారోగ్యం చేస్తే మందులు వేసుకోవటానికి ఇష్టపడేవారు కాదు. శరీరానికి ఎంత అనారోగ్యం వచ్చి కష్టపడినా దానిని ఓర్పుతో తగ్గేదాకా భరించేవారు.

1962లో స్వామి కడపకు వెళ్ళినప్పుడు అమ్మయ్య ఒకరోజు ఆశ్రమం ముంగిట ఒక అశ్వత్థ వృక్షాన్ని నాటినారు. కొంతకాలం తర్వాత ఆ అశ్వత్థవృక్షం ప్రక్కనే స్వామి ఒక వేప చెట్టును నాటినారు.

1974లో ఆ రావిచెట్టుకు, వేపచెట్టుకు స్వామి, అమ్మయ్యలు మూడు రోజులు వివాహం జరిపించారు. ఆనాటినుండి నేటివరకు కూడా వాటి మూలంలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం నెయ్యితో



**1974లో అశ్వత్థనారాయణుని వివాహ సందర్భంలో**

దీపం పెడతారు. వాటిని అమ్మ+అయ్య = అమ్మయ్యగా భావించి భక్తులు వాటికి ప్రదక్షిణ చేస్తూ వుంటారు. భక్తులందరూ మాతాజీని అమ్మయ్య అని పిలిచేవారు. అశ్వత్థ నారాయణునికి ప్రదక్షిణలు చేయటం వల్ల భక్తులకు ఆటంకాలు తొలగి అనుకున్న పనులు సఫలంగా జరుగుతాయి. ఆశ్రమ నిర్మాణ సమయంలో ఈ అశ్వత్థ నారాయణుని కొమ్మ ఒకటి అడ్డుగా ఉంటే దానిని కొట్టించినారు.

1970 ప్రాంతాలలో దర్గాల వద్ద ఒక గర్భవతి స్త్రీ వచ్చి ఉంటుండేది. ఆమెకు కలగబోయే బిడ్డకు జ్ఞానాన్ని ప్రసాదించి, తమ తదనంతరం ఆశ్రమ విషయాలు ఆ బిడ్డకు అప్పగించాలని అమ్మయ్యగారు తలచారు. ఈ సంకల్పంతో అమ్మయ్యగారు ఒక రొట్టెను తయారుచేశారు. ప్రహ్లాదుడికి గర్భంలో వుండగానే నారాయణ జపం వలన జ్ఞానం కల్గినట్లు, ఆ గర్భవతిచే ఈ రొట్టె తినిపించడం ద్వారా ఆమె కడుపులో ఉన్న బాబుకు జ్ఞానం ప్రసాదించాలని అమ్మయ్యగారు సంకల్పించారు. ఆ రొట్టె ఆమెకు ఇవ్వాలని దానిని ఒక కవరులో

చుట్టి దానిపై ఇంకొక కవరు తొడిగి దానిపై మరలా ఒక కాగితం చుట్టి, బొడ్డులో దోపుకొనే డబ్బు సంచిలో పెట్టుకున్నారు. ఇదంతా చూస్తూ ఉన్న స్వామివారు, నవ్వుతూ ఏమిటి అని అడుగగా అమ్మయ్య వివరించారు. అప్పుడు స్వామి నవ్వుతూ "అలా నీవు అనుకున్నట్టు ఏమీ జరుగదు. దానిని నీ నుండి కడప స్వామి తీసుకుని తింటారు చూడు" అన్నారు. కొద్దిసేపటికి కడపలో దిగారు. ఎక్కడనుండి వచ్చారో తెలియదుగానీ దిగిన వెంటనే కడపస్వామి వచ్చి దోపుకున్న సంచి పట్టుకుని విడువలేదు. అప్పుడు అమ్మయ్యగారు దర్గాస్వామివారివైపు చూడగా ఆయన పకపకా నవ్వుతూ "నీవు ఆ రొట్టెను ఆయనకు ఇవ్వక తప్పదు లేకుంటే ఆయన ఇక్కడ నుండి కదలరు" అని చెప్పగా, అమ్మగారు ఆ రొట్టె కడపస్వామివారికి ఇచ్చేశారు. ఆయన ఆ రొట్టె తిని వెళ్ళిపోయారు. దీని గురించి దర్గాస్వామి చెపుతూ "కడపస్వామి అలా రొట్టెను స్వీకరించి మాకు జ్ఞానాన్ని ప్రసాదించారు" అని అన్నారు.

**మనం తినే ఆహారం హృదయపూర్వకమైన నామస్మరణతో తయారు చేస్తే ఆ ఆహారం తిన్నవారికి భక్తిశ్రద్ధలు అబ్బుతాయని, సత్వగుణం వృద్ధియగుతుందన్నది సందేశం. నామస్మరణతో చేసిన ఆహారమంటే భగవంతునికెంతో ఇష్టము.**

ఆ తరువాత కొంతకాలానికి ఆ గర్భవతికి మగ పిల్లవాడు పుట్టాడు. ఆ పిల్లవాడిని "బాబు" అని ముద్దుగా పిలుచుకుని అల్లారుముద్దుగా అమ్మయ్యగారే పెంచారు. స్నానం చేయించటం మొదలు అన్నీ అమ్మయ్యగారే స్వయంగా చేసేవారు. పిల్లవానికి తగురీతిగా విద్యాబుద్ధులు గరిపి విద్యావంతుని చేసినారు. విద్యాభ్యాసం పూర్తి చేసిన తర్వాత స్వామివారే చీటి వ్రాసి ఇచ్చి బ్యాంకులో ఉద్యోగం వేయించారు. కొన్నాళ్ళకు అతను తన తల్లిదండ్రుల వద్దకు వెళ్ళిపోతానని చెప్పి ఆశ్రమం నుండి వెళ్ళిపోయాడు. అతను లౌకికమైన విషయాలలో పడిపోయాడు గానీ ఎంత చెప్పినా సరే అదృష్టం లేక జ్ఞానం అబ్బలేదు. అంటే గర్భవతులుగా వున్నప్పుడు చేసే భగవంతుని సేవ వలన పుట్టబోయే బిడ్డ సంస్కారము తేలికగా మారగలదని, పుట్టిన తర్వాత చేసే దాని ఫలితము కష్టతరమని మనం గుర్తించాలి.

1988 ప్రాంతాలలో స్వామివారు కొట్టాలలో నివసిస్తుండగా ఒకసారి దర్గా వద్ద ఉన్న కోతులు వచ్చి చాలా అల్లరి చేసినాయి. స్వామివారు ఎంత ప్రయత్నించినా అవి తగ్గలేదు. ఇది దర్గాలలో ఉన్న గురువుల ఆజ్ఞగా భావించి, దర్గాకు వాయువ్యంగా ఉన్న మహబూబ్ సుభాన్ స్వామి ప్రక్కగా ఉన్న భూమి కొనుగోలు చేసి అనంత కళ్యాణ మండప ఆశ్రమ నిర్మాణం జరిపించినారు. ఆశ్రమానికి ఈశాన్యంలో ఒక బావిని త్రవ్వించారు. ఈ బావిలోని నీరు మధురంగా ఉండి ఆశ్రమ అవసరాలన్నిటినీ తీరుస్తుంది. అప్పటినుండి స్వామి అమ్మయ్యలు ఆ కళ్యాణ మండపంలో నివసించసాగినారు. ఈ సంవత్సరాలలో స్వామివారు భక్తుల ఇండ్లకు కూడా వెళ్ళి వారికున్న సమస్యలు తీర్చారు. అనంత కళ్యాణ మండపంలో చాలామందికి వివాహాలు, ఉపనయనాలు, నామకరణాలు, అన్నప్రాసనలు, విద్యాభ్యాసాలు, షష్ఠిపూర్తి కార్యక్రమాలు స్వామి తమ సొంత ఖర్చు మీద చేయించినారు.

1992లో ఒకరోజు ఒక దుస్సంఘటన జరిగింది. ఆరోజు మాతాజీ స్వామివారితో "స్వామీ, ఈరోజు నాకేదో జరగబోతోంది" అని అన్నారు. స్వామి "లేదు లేదు, అది నా వెంటబడింది, నాకే వస్తుంది" అన్నారు. అయినా ఆ రోజు స్వామివారు మాతాజీ వెంటనే ఉన్నారు. సాయంకాలం మాతాజీ ఆవు దగ్గర పాలు తీస్తున్నారు. ఉన్నట్టుండి ఆవు మాతాజీని కాలితో తన్నింది. మాతాజీ కిందపడ్డారు. అప్పుడు స్వామీజీకి ఒక నల్లని ఆకారం కనిపించింది. వెంటనే స్వామీజీ మాతాజీ వీపుపై ఒక దెబ్బ వేసి, "నేనుండగా నీవెట్లా వస్తావు" అని అన్నారు. మాతాజీ "స్వామీ, అది వచ్చింది, పోయింది, నా కాలు కీలు తొలగింది. లేపండి" అని చెప్పారు. చూడగా మాతాజీకి తుంటి ఎముక విరిగిపోయింది. రెండుసార్లు కాలికి ఆపరేషన్ చేయవలసి వచ్చింది. ఆ తర్వాత స్టిక్ స్టాండ్ సహాయంతో నడుస్తూ ఉండేవారు. అప్పటినుండి మాతాజీ పక్కకు ఒత్తిగిలి పడుకోడం వీలుపడక వెల్లకిలా పడుకునేవారు.

1998లో మద్రాసులో మూడవసారి ఆపరేషన్ జరిగింది. ఆ తర్వాత ఏ సహాయం లేకుండా నడవగలిగినా మునుపటిలాగా నడవలేకపోయారు. పైగా మోకాళ్ళ నొప్పులు కూడా ఎక్కువగా ఉండేవి.

1998లో దర్బార్ సాయినాథుని ఆశ్రమ ప్రతిష్ఠాపన సందర్భంగా ముద్రించిన ఆహ్వాన పత్రం



శ్రీ సమర్థ సద్గురు షిరిడి సాయి నాథుని విగ్రహ ప్రతిష్ఠ

**కుంభాభిషేక మహోత్సవ ఆహ్వాన పత్రిక**

శ్లో॥ సదానింబ వృక్షస్య మూలాధివాసాత్
సుధాస్రావిణం తిక్తమప్య ప్రియంతం
తరుం కల్ప వృక్షాధికం సాధయంతం
నమామీశ్వరం సద్గురుం సాయినాథం॥

స్వస్తిశ్రీ బహుధాన్యనామ సంవత్సర జ్యేష్ఠ శుద్ధ దశమి గురువారము సరియగు **4-6-98** హస్త నక్షత్ర యుక్త 9-05 ని॥ పైన కటకలగ్న పుష్కరాంశమున పరమేశ్వర స్వరూపుడు పరమాత్ముడు సర్వజీవకోటికి ప్రాణదాత పిలిచిన పలికే పరబ్రహ్మ స్వరూపుడు అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు పుట్టంబేవి మానవాకారమున బాల ఫకీరు రూపమున శ్రీ షిరిడిలో ప్రత్యక్షమై నమ్మినవారిని కన్న బిడ్డలుగా చూస్తూ కులమతములకు అతీతుడై సర్వ మత మూలసారమై వెలుగుచున్న శ్రీ షిరిడిసాయి సాదుడు శ్రీసద్గురు హజరత్ దర్బారుకారికపై కరుణా ప్రేమ దయామయుడు సర్వరక్షకుడైన శ్రీ సద్గురు షిర్డి సాయినాథుడు ధర్మవరపురము భక్తులచేత నిర్మించిన సమర్థ సద్గురు దర్బారు సాయి మందిరమున **4-6-98** తేది ప్రతిష్ఠించబడును. కన్నతల్లి కాపాడిన రీతిగా రక్షించి కాపాడగలరని మా గట్టి నమ్మకము. "రాజాధిరాజ యోగిరాజ పరబ్రహ్మ సచ్చిదానంద సమర్థ సద్గురు సాయి మహరాజ్" మూడు రోజులు కనుమరుగై 3 రోజుల తర్వాత సజీవుడై మనందరిలో మెలగుచూ కాపాడు సాయినాథుని కృపా కటాక్షము సర్వులు పొందవలసినదని మా ఆశయము.

**1-6-98** నుండి పూజలు జరిపి **4-6-98** ప్రతిష్ఠ జరుగును. పై రోజులలో భోజన వసతి సర్వులకు కలదు.

ఇట్లు

( శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయిభక్తులు )

కార్యక్రమముల వివరములు

**1-6-1998** సోమవారం ఉదయము.

శ్రీ మహా గణపతి పూజ. గంగా భాగీరథ పూజ, వాద్య ఘోష సమేతముగా యాగశాల ప్రవేశము స్వస్తి పుణ్యాహ వాచనము పంచగవ్య ప్రాశనము, అఖండ దీపారాధనము, యాగశాల మండపార్చనము, ఋత్విగ్వరణము జలాధివాసము అష్టావధానము మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగము.

**1-6-1998** సోమవారం సాయంత్రము.

వేదపారాయణము, ఋత్విక్కులచే జపములు, మృత్సంగ్రహణము, అంకురారోపణము, అగ్ని ప్రతిష్ఠ, గణపతి హోమము, అగ్ని పంచగవ్య ప్రాయశ్చిత్త హోమము, రక్షోఘ్న హోమము, బలి అష్టావధానము, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగము.

**2 6-1998** మంగళవారము ఉదయము.

వేదపారాయణము, ఋత్విక్కులచే జపములు, దేవానాంది, సూర్య నమస్కారములు, నవగ్రహారాధనము, కలశస్థాపనము కల్పోక్త పూజలు, గణపతి హోమము, నవగ్రహ హోమము, క్షీరాధివాసము, మహా మంగళ హారతి, తీర్థప్రసాద వినియోగము.

1996లో పవని నిర్మల ప్రభావతి అనే సుప్రసిద్ధ తెలుగు నవలా రచయిత్రి, ఆమె భర్త పవని శ్రీధరరావు ఒక పర్యాయం ఆశ్రమాన్ని దర్శించారు. ఆ రాత్రి నిద్ర చేసి మరుసటి ఉదయం అనంత కళ్యాణమండపంలో కూర్చుని ఉన్నారు. ఇంతలో మాతాజీ కుర్చీలో కూర్చుని ఉండగా స్వామీజీ ఒక బిందెతో ఆమె శిరస్సు మీద ధారగా నీళ్ళు పోస్తున్నారు. మాతాజీ మెల్లగా తమ చేతులతో తమ కాళ్ళను, చేతులను రుద్దుకుంటున్నారు. స్నానం అయినాక అమ్మయ్యగారు చీర మార్చుకుని వాకర్ సహాయంతో మంచం వద్దకు వచ్చి కూర్చున్నారు. ప్రభావతిగారు ఈ దృశ్యాన్ని చూచి ఆమె భర్తకు చెప్పారు. శ్రీధర్‌రావుగారు నవ్వి 'ఇది ఎన్నో ఏళ్ళుగా జరిగే దృశ్యం అయ్యి ఉంటుంది' అన్నారు.

1998లో దర్గాలోని సిద్ధపురుషుల కోరిక మేరకు, శ్రీ సమర్థ సద్గురు దర్బార్ షిర్డీ సాయినాథుని మందిర ప్రతిష్ఠాపన జరిగింది. జూన్ 1వ తేదీ నుండి 4వ తేదీ వరకు ప్రతిష్ఠాపన కార్యక్రమాలు జరిగినాయి. సాయినాథుని పంచలోహ విగ్రహాన్ని మందిరంలో ప్రతిష్ఠించినారు. ఈ నీలకంఠరావుపేట దర్గా క్షేత్రానికి సద్గురు హజరత్ శ్రీ దర్బార్ అలీషావలీ క్షేత్రాధిపతి. శ్రీ సమర్థ సద్గురు దర్బార్ షిర్డీ సాయినాథుడు క్షేత్రపాలకుడు అని స్వామి ఒక సందర్భంలో చెప్పారు.

స్వామి ప్రతిరోజు దర్గాల దగ్గరకిగానీ, దర్బార్ సాయి మందిరంలో ఆరతికి వెళ్ళేటప్పుడుగానీ ఆశ్రమం హాలు బయటకు వచ్చే ముందర తప్పకుండా అమ్మయ్యతో "అమ్మయ్యా! దర్గాల దగ్గరకి (మందిరానికి) వెళ్ళి వస్తాను" అని చెప్పిన తర్వాతనే వెళ్ళేవారు. ఆ కాలంలో స్వామి మధ్యాహ్న ఆరతికి వచ్చిన భక్తులెవరైనా పూలదండ తెస్తే దర్బార్ సాయినాథునికి (మూలవిరాట్) వేసేవారు. వచ్చినవారు ఏమైనా పదార్థాలు తెస్తే స్వామి ఎన్నడూ తీసుకునేవారు కాదు. వారినే స్వయంగా తమ చేత్తో మిగిలిన భక్తులకు పంచమని చెప్పేవారు. మధ్యాహ్న ఆరతికి ఉన్న భక్తులను ఆశ్రమంలో తప్పకుండా భోజనం చేసి వెళ్ళమని చెప్పేవారు.

మందిర ప్రతిష్ఠాపన తర్వాత ఒకసారి మందిరంలో ఒక తెల్లటి సర్పం వచ్చి చాలారోజులు ఉన్నది. అది భక్తులెవరినీ ఏమీ చేయలేదు.

అన్నిరోజులూ స్వామి, భక్తులు యథావిధిగా ఆరతులు, భజన, సత్సంగాలు జరిపినారు. ఈ సర్పాన్ని చాలామంది భక్తులు చూచారు. సాధారణంగా తెల్లటి సర్పాలు కనపడటం చాలా అరుదు. వీటిని దేవతా రూపాలుగా భావిస్తారు.

దర్బార్ సాయినాథుని ప్రతిష్ఠ తర్వాత సాయినాథునికి ఒక వెండి కిరీటం చేయించినారు. ఆ కిరీటం మీద పడగతో నాగేంద్రుని ప్రతిమ ఉంది. దానిని ఒక గురువారం దర్బార్ సాయినాథునికి అలంకరించారు. ఆ రోజు ఆశ్వయుజ శుద్ధ దశమి. దసరా పండుగరోజు. మందిరంలో ఆరతికి స్వామి తర్వాత భక్తులందరూ మందిరంలోనికి వచ్చారు. మందిరంలో ఒక పెద్ద నాగుపాము ఉంది. అది ఒకచోట స్థిరంగా కూర్చుని మెల్లగా తల ఆడిస్తూ ఉన్నది. భక్తులందరూ సంభ్రమాశ్చర్యాలతో ఆరతి చేసారు. ఆ పాము భక్తుల సంచారం గమనించి ఏమాత్రం భయపడలేదు. యధావిధిగా గురువారం జరిపే మెరవణి ఉత్సవం దాకా ఆ పాము అట్లే ఉన్నది. సాయంత్రం మందిరం నాలుగు వాకిళ్ళు తెరచి మెరవణికి ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మయ్యగారు "అమ్మా! భక్తులు భయపడుతున్నారు. ఇంక పోమ్మా!" అని చెప్పారు. అమ్మయ్యగారు చెప్పిన కొద్దిసేపట్లో, అంతమంది భక్తులు నాలుగు వాకిళ్ళ వద్ద ఉండగా, వారు గమనించేలోపే ఆ పాము కనపడలేదు (వెళ్ళిపోయిందా? లేదా అదృశ్యమైందా?).

2000 సం॥ తర్వాత ఆశ్రమాన్ని ఆనుకుని ఉన్న ఇప్పటి వంటశాల మరియు భోజనశాలను స్వామి దగ్గరుండి కట్టించినారు.

2002లో ఆశ్రమానికి అనుబంధంగా ఉచిత రెసిడెన్షియల్ పాఠశాల స్థాపించినారు. దర్బార్ నగరంలో కళ్యాణమండపం హాలు వెనుక ఈ స్కూలు భవనం నిర్మింపబడింది. రెండు అంతస్థులు కలిగిన ఈ భవనంలోని ప్రతి అంతస్థులో 12 తరగతి గదులు, ఒక ధ్యాన మందిరం ఉన్నాయి. ఒకటవ తరగతి నుండి 10వ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ స్కూలుకు ప్రభుత్వ గుర్తింపు ఉన్నది. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఉచిత మధ్యాహ్న భోజనం పెడతారు. స్కూలు బస్సు చుట్టుప్రక్కల గ్రామాలనుండి విద్యార్థులను

తీసుకువస్తుంది. సాయంత్రం మరలా ఇంటివద్ద విడిచి పెడుతుంది.

సాధారణంగా అమ్మయ్య ఎక్కడికైనా వెళ్ళినప్పుడు అమ్మయ్య గారి వెంట ముగ్గురు లేక నలుగురు మహిళా భక్తులు ఉండేవారు. అయితే 2004 మే నెలలో నెల్లూరు జయశ్రీ గారింటికి స్వామి, అమ్మయ్య వెళ్ళినప్పుడు అమ్మయ్యతో పాటు ఎవ్వరూ లేరు. ఈ విషయం అమ్మయ్యను అడిగితే అమ్మయ్య "జయశ్రీ! ఇక మీద నాకు ఎవ్వరితో అవసరం లేదు. నేను నెల్లూరు రావడం ఇదే చివరిసారి. ఇకమీద స్వామి ఒకరే వస్తారు" అని చెప్పారు. తర్వాత విశ్రాంతి తీసుకుని సాయంత్రం కడపకు వెళ్ళిపోయారు. ఆ తర్వాత కొద్దిరోజులకే అమ్మయ్యగారి నిర్యాణ వార్త విన్న జయశ్రీకి అమ్మయ్య ఆనాడు అన్నమాట అంతరార్థం అప్పుడు అవగతమైంది.

మద్రాసు వాస్తవ్యులు గోవర్ధన్‌గారు స్వామిభక్తులు. వారు చెన్నైలో విల్లివాకంలో సాయిబాబా మందిరం కట్టించారు. విగ్రహ ప్రతిష్ఠకు ముహూర్తం దగ్గరలో  లేనందున షిర్డీసాయి పటం పెట్టి సత్సంగం జరపాలని సంకల్పించి దానికి స్వామివారిని ఆహ్వానించారు. సెప్టెంబరు 5వ తేదీన స్వామీజీ, అమ్మయ్య మద్రాసు వచ్చారు. కార్యక్రమానికి వచ్చిన భక్తులలో ఒక డాక్టరు దంపతులు మాతాజీకి పాద నమస్కారం చేస్తూ ఆమె పాదాలు వాచి ఉండటం చూశారు. మాతాజీని తమ నర్సింగ్‌హోమ్‌కు తీసుకొనిపోయి పరీక్షచేసి పంపుతామని స్వామీజీ అనుమతితో తీసికొని వెళ్ళారు. రెండురోజులు తమతో ఉంచుకొని పరీక్షలు చేసి పాదానికి మోకాళ్ళకు మధ్య ఎముక మరలా విరిగి సద్గురుకృపవలన అతుక్కొనినదని వారు స్వామివారికి చెప్పారు. ఆ తర్వాత స్వామీజీ, మాతాజీలు దర్బారునగరం వచ్చేశారు.

మద్రాసులో నర్సింగ్‌హోమ్ మొత్తం ఎ.సి. చేసియుండటం వలన మాతాజీకి ఊపిరితిత్తులలో నిమ్ముచేరి ఆయాసం వచ్చింది. మాతాజీ అక్కడ ఉన్నప్పుడు చాలా ఇబ్బందిపడ్డారు. సెప్టెంబరు 9వ తేదీ గురువారం అయినందున మాతాజీ శ్రీ సమర్థ సద్గురు సాయినాథునికి నైవేద్యం యథావిధిగా చేసి పెట్టారు. మాతాజీ ఆ రోజు ఆహారం ఏమీ తీసుకోలేదు. ఆయాసం వలన గుండెలో నొప్పి వచ్చింది. తరువాత

రాత్రి 10 గంటలకు మాతాజీకి మూత్రవిసర్జన కానందున నొప్పి, ఆయాసం ఎక్కువైనాయి. స్వామీజీ సంకల్ప బలం వలన 11 గంటలకు అన్నీ సర్దుకున్నాయి. అయితే ఉదయం 5 గంటలకు మరలా ఆయాసం ఎక్కువైంది. రాయచోటిలోని డాక్టరు బయారెడ్డి గారికి ఫోన్ చేయగా వారు 6 గంటలకు వచ్చి స్వామీజీవారి అనుమతితో మాతాజీని రాయచోటికి తీసుకొనివెళ్లారు. మాతాజీ ఎక్కడికైనా ఒంటరిగా వెళ్లడం అదే ప్రథమం.

రాయచోటిలో చికిత్స చేసిన తర్వాత ఆయాసం కొద్దిగా తగ్గింది. అప్పుడు మాతాజీ కొద్దిగా ఇడ్లీ తిన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు మరలా గుండెలో నొప్పిరాగా డాక్టర్లు ఆమెను కడపకు (కార్డియాలజిస్టు వద్దకు) తీసుకెళ్లాలని నిశ్చయించారు. అయితే స్వామి అనుజ్ఞ లేనిదే తానెక్కడికీ రానని ఫోన్ చేసి వారి అనుజ్ఞ తీసుకొన్నారు. రాయచోటి నుండి కడపకు కారులో వెళ్తూ దారిలో రామాపురంలో ఆగారు. ఆ సమయానికి చాలా పెద్ద వర్షం పడింది. ఆశ్రమం నుండి స్వామి టి.వి.సుబ్రహ్మణ్యంగారి ద్వారా రెండు పుస్తకాలు అమ్మయ్యగారికి పంపారు. తర్వాత కారు కడపకు వెళ్లిపోయింది. కడపలో మాతాజీ రాత్రి 12 గంటలకు రాయచోటి సత్యమయ్యగారితో "దర్గాలో ఒక లోటా పాలు, ఒక లోటా నీళ్ళు పెట్టిరా" అన్నారు. ఆ మాటల అంతరార్థం అప్పుడు ఎవ్వరికీ అవగతం కాలేదు. దర్గాలో పాలు, నీళ్ళు పెట్టడం అంటే స్వామివారికి ప్రతిదినమూ మరచిపోకుండా ఒక గ్లాసు పాలు, ఒక గ్లాసు నీళ్ళు ఇవ్వడం. అందువలన స్వామీజీ అప్పటి నుండి వారంలో రెండు రోజులు అశ్వత్థవృక్షం వద్ద ఒక గ్లాసు పాలు, ఒక గ్లాసు నీళ్ళు పోస్తారు. మాతాజీ మాటల అంతరార్థం ఆ విధంగా ప్రకటితమైంది.

తెల్లవారురఝామున 3 గంటలకు మాతాజీకి ఆయాసం ఎక్కువైంది. బి.పి. తగ్గిపోయింది. తాను సద్గురువు సన్నిధికి పోయే సమయం ఆసన్నమైందని అవగతమైంది. వెంటనే చిన్ముద్రతో ధ్యాన సమాధిలోకి వెళ్ళిపోయారు. ఉదయం 7గం. 45ని॥లకు మాతాజీ శ్రీ సమర్థ సద్గురు సాయినాథుని నిరంతర సన్నిధికి చేరుకున్నారు.

ప్రకృతి పురుషులు మరలా ఏకమైనారు. ఆనాడు శనివారం, సెప్టెంబరు 11, 2004 శ్రావణ బహుళ ద్వాదశి. ఆరోజు శ్రావణ మాసంలో ఆఖరు శనివారం. మాతాజీ ఆవిర్భావం (జననం) కూడా శ్రావణ మాసం ఆఖరు శనివారం నాడే, మహాత్ములకు జనన మరణాలు అభేదం!

అమ్మయ్యగారు మద్రాసులో ఉన్నప్పుడు ఆశ్రమం నుండి టి.వి. సుబ్రహ్మణ్యంగారు ఫోను చేస్తే వానలు పడుతున్నాయా అని విచారించారు. అమ్మయ్య సమాధి చెందిన వారంలో బ్రహ్మాండమైన వానలు కురిసినాయి. ఒకటి రెండు వానలకే దర్గా వద్ద ఉన్న చెరువు పూర్తిగా నిండింది. అమ్మయ్యగారిది జలతత్వం. అమ్మయ్యగారు శరీరం విడిచి వెళ్ళినందుకు సంకేతంగానేమో ప్రకృతి కూడా ఈ విధంగా స్పందించిందనిపిస్తుంది.

శనివారం ఉదయం 6 గంటలకు డా॥ బయారెడ్డిగారు, ఆయన భార్య డా॥ సంగమ్మగారు దర్బారు నగరం వచ్చి స్వామివారిని వెంటనే కడపకు రావలసిందిగా అభ్యర్థించారు. త్రికాలజ్ఞానియైన స్వామివారు వారి అభ్యర్థనను మన్నించలేదు. "ప్రతీదీ సర్వేశ్వరుని ఆజ్ఞ ప్రకారం జరుగుతుంది. దైవనిర్ణయాన్ని ఎవరూ తప్పించలేరు. మీరు వెళ్లిరండి" అని వారితో స్వామి అన్నారు. ఆ సమయానికి ఆశ్రమంలో ఉన్న సుబ్రహ్మణ్యంగారు కడప వెళ్ళి అమ్మయ్యగారిని చూస్తానని ప్రార్థించగా స్వామి అనుమతించి "నాయనా! అమ్మయ్యను జాగ్రత్తగా తీసుకురండి" అని చెప్పారు. మాతాజీ నిర్యాణ సమయం అప్పటికి ఇంకా గంటకు పైగా ఉన్నది. డాక్టర్లు కడపకు వెళ్లిపోయినారు.

ఉదయం 10 గంటలకు మాతాజీని గోవర్ధన్‌గారి కారులో కూర్చోపెట్టుకుని దర్గాకు తీసికొని వచ్చారు. అమ్మయ్య ముఖంలో దివ్యకాంతి ఏమాత్రం తగ్గలేదు సరికదా మరింత దేదీప్యమానంగా దివ్యతేజస్సుతో ప్రకాశిస్తున్నది. మధ్యాహ్నం ఒంటి గంట వరకు నాడి ఆడుతూనే ఉన్నది. అనంత శాంతి నైర్మల్యాలు ఆమె ముఖంలో భాసిస్తుండటం భక్తులు అంతటి విషాదంలో కూడా అత్యంత ఆశ్చర్యంగా గమనించారు. ఆరోజు వరకు మాతాజీ, స్వామీజీలు భౌతికంగా ఇద్దరు, ఆత్మపరంగా ఒక్కరు. ఆ రోజు నుండి భౌతికంగా,

ఆత్మపరంగా కూడా ఒక్కరే. అంతకు ముందు మాతాజీని "అమ్మయ్య" అనేవారు (అమ్మ+అయ్య). ఇప్పుడు స్వామివారే అయ్య+అమ్మ అయినారు. ద్వైతం మరలా అద్వైతమైంది. ఓం తత్సత్.

మాతాజీ నిర్యాణ వార్త తెలియగానే భక్తులు వందలు, వేలు దర్బారునగరం చేరుకున్నారు. అందరిలోను విషాదం, అందరి హృదయంలోను ఎవరూ ఎప్పటికీ తీర్చలేని వెలితి. అత్యంత విలువైనది ఏదో కోల్పోయామన్న వేదన. భక్తులకు చివరి దర్శనార్థం అమ్మ భౌతిక శరీరాన్ని సమాధి మందిరానికి ముందున్న హాలు మధ్యలో ఉంచారు. ఆ సమాధి మందిరం చాలా సంవత్సరాల క్రితమే,1960లో, మాతాజీ కోరి నిర్మింపచేసికొన్నది. సర్వసంగ పరిత్యాగి, రాగద్వేషాతీతుడు అయిన స్వామీజీ శోకతప్త హృదయులైనారు. మహాత్ములు భావోద్వేగాలకు అతీతులే, అయితే శుష్కహృదయులుకాదు,ఆర్ద్రహృదయులే. రమణమహర్షిగానీ, రామకృష్ణ పరమహంసగానీ, షిర్డీసాయిగానీ సన్నిహితులు మరణించినపుడు విలపించినవారే. అది వారి ప్రేమానురాగాలకు నిదర్శనమేగాని మరొకటి కాదు.

మాతాజీ శరీరాన్ని ఆదివారం, సెప్టెంబరు 12, 2004 నాడు సమాధి చేయాలని స్వామివారి అనుజ్ఞతో భక్తులు నిర్ణయించారు. తదనుగుణంగా ఆదివారం ఉదయం 11 గంటలకు మాతాజీ శరీరాన్ని ఆశ్రమ ఆవరణలోగల బావిలోని పవిత్ర జలంతో స్నానం చేయించారు. అమ్మ శరీరం మామూలుగానే ఉన్నది. సాధారణంగా మృత శరీరాలు త్వరగా బిగుసుకుపోతాయి. మాతాజీ శరీరంలో అలాంటిదేమీ కనుపించలేదు. తర్వాత శరీరాన్ని పూలమాలలతో అలంకరించారు. భక్తులు వరుసగా వచ్చి అమ్మకు తుది నమస్కారం చేసుకున్నారు. తర్వాత సమాధిలో కుర్చీలో కూర్చోబెట్టి కర్పూరం, విభూది, ఉప్పు, సుగంధద్రవ్యాలు కలిపిన ఇసుకతో సమాధిని నింపి బండతో సమాధిని మూసివేశారు. ఇక మాతాజీ భౌతిక శరీరం మనకు కనుపించదు. అయితే ఆమె ఎక్కడికీ పోలేదు. స్వామీజీ మాటలలో "అమ్మ ఇక్కడే ఉన్నది. ఎక్కడికీ పోలేదు. నాలోనే ఉన్నది. చూడగలిగిన వారికి ఆమె కనుపిస్తూనే ఉంటుంది. అయితే జ్ఞాననేత్రంతో మాత్రమే".

మాతాజీ పరమయోగశిఖామణి. మరణానంతరం ఆమె శరీరం చెక్కుచెదరలేదు. కుడి చేతి బొటనవేలు చూపుడువేలు కలిసే ఉన్నాయి. (బొటనవేలు పరమాత్మకు, చూపుడువేలు జీవాత్మకు మిగిలిన మూడువేళ్లు త్రిగుణాలకు సంకేతాలు. బొటనవేలు చూపుడు వేలు కలిసి ఉండటం త్రిగుణరహితమైన జీవాత్మ పరమాత్మతో కలిసి ఉండటాన్ని సూచిస్తుంది). నిర్యాణం నాటినుండి అమ్మ సమాధి వద్ద పూజ, కుంకుమార్చన, లలితా సహస్రనామార్చన, భజనలు వగైరా కార్యక్రమాలు ఉదయం సాయంత్రం యథావిధిగా జరుగుతున్నాయి. అఖండ జ్యోతి నిరంతరం వెలుగుతూ ఉంటుంది. నవరాత్రి ఉత్సవంలో ప్రత్యేక పూజలు జరుగుతాయి. అన్నింటినీ స్వామీజీ స్వయంగా పర్యవేక్షిస్తారు. సమాధి నుండే మాతాజీ అనేక లీలలు చూపారు, చూపిస్తున్నారు. అంతా మన భక్తి విశ్వాసాలమీదే ఆధారపడి ఉంటుంది. నమ్మకం ఉన్నవారికి నిర్యాణానంతరం కూడా అమ్మ దర్శనం అనేక విధాలుగా లభించింది.

మాతాజీది అద్భుతమైన అత్యంత మహత్తరమైన పరిపూర్ణ వ్యక్తిత్వం. అయితే తన ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని, శక్తిని ఏమాత్రం పైకి కనపడనీయకుండా జాగ్రత్తపడేది. భక్తులు అసంఖ్యాకం ఆమె దర్శనానికి వచ్చేవారు. తమ కష్టసుఖాలు, సమస్యలు ఆమెకు విన్నవించుకునేవారు. వారిని ఓదార్చి, సమస్యలకు పరిష్కారం సూచించి వారికి మనశ్శాంతిని ప్రసాదించేది. కొంతమందిని స్వామివారి వద్దకే పంపేది. అమ్మ మితభాషిణి. తమ జీవితమే తమ సందేశం అన్నట్లుగా ఉండేది. ఆమె ఏ సందర్భంలోను ఎవరిపైన కోపగించుకోవడం ఎవరూ చూడలేదు, వినలేదు. స్వామి మాటే తనమాట అని భావించి తదనుగుణంగా జీవితాన్ని గడిపిన పతివ్రతా శిరోమణి మాతాజీ. అమ్మయ్య, స్వామీజీలు పార్వతీ పరమేశ్వరులలా ఈ జగత్తంతటికీ తల్లిదండ్రులు. కామవాసన లేశమైనా లేని పవిత్ర దివ్య దాంపత్యం వారిది. ఆధ్యాత్మిక చింతన, పరోపకారం, దీనజనోద్ధరణ వారి సాంసారిక జీవితం యొక్క లక్ష్యాలు.

దర్గాలలో సిద్ధపురుషుల సమాధుల చుట్టూ సిమెంట్‌తో గచ్చు చేసి, మధ్యలో మాత్రం కొద్ది జాగాలో గచ్చు లేకుండా మట్టి ఉంటుంది. ఈ ప్రదేశంలో ఒక గ్లాసు పాలు, నీళ్ళు పోస్తూండేవారు. అమ్మయ్య సమాధి చెందిన తర్వాత ఆ ప్రదేశంలో ఒక చిన్న వేపచెట్టు, అమ్మయ్యకు ప్రతిరూపకంగానా అన్నట్టు, మొలకెత్తింది. కొంతకాలం తర్వాత స్వామి దర్గాలలో దీపం పెడుతున్న సమయంలో దేశ సంచారం చేస్తున్న సాధువులాంటి వ్యక్తి సమాధుల మధ్య పెరుగుతున్న వేపచెట్టు వల్ల సమాధులకు ఇబ్బంది కలుగుతుంది. దానిని తీసివేయండి అన్నాడు. దానికి స్వామి "బోల్‌నేకా నహీ! సిర్ఫ్ దేఖ్‌నేకా" (ఇక్కడ మాట్లాడరాదు. జరిగేది చూడాలి అంతే) అని చెప్పారు.

2005 ఆగష్టు 28వ తేదీన స్వామీజీ కడప వెళ్ళారు. అక్కడ రామయ్యగారితో మాట్లాడుతూ, "ఇది నాకు పరీక్షా సమయం రా!" అని చెప్పారు. రామయ్యకు అది అర్థం కాలేదు. ఆ మాటలు తలుచుకుంటూ రాత్రి రామయ్య నిద్రపోయారు. కలలో అమ్మ దర్శనం ఇచ్చింది. రామయ్య ఆమెతో 'అమ్మా! స్వామివారు ఈ విధంగా అన్నారు. దాని అర్థం ఏమిటి?' అని అడిగారు. మాతాజీ "అది అంతేలే, నాయనా! స్వామివారు ఇప్పుడు పునర్జన్మ ఎత్తారు. అందుచేత అలా అన్నారు" అని చెప్పారు. దీని వెనకనున్న కథ: ఒకప్పుడు స్వామీజీ మాతాజీలు ఈ లోకాన్ని వదలటానికి నేను ముందు అంటే, నేను ముందు అని పోటీ పడ్డారు. తర్వాతికాలంలో మాతాజీ మాటే నెగ్గింది. ఆమె వెళ్ళిపోయారు. ఆమె స్వామీజీలో లీనమైంది. అదే స్వామివారి పునర్జన్మ. తాను సంకల్పించిన లౌకిక కార్యక్రమాలు పూర్తి చేయటానికి స్వామివారు ఇక్కడే శరీరంతో ఉండిపోయినారు. ఈ విధంగా పునర్జన్మ ఎత్తిన స్వామివారు ఈనాడు మనకు అర్థనారీశ్వరులే!

2005 ఆగష్టు 31వ తేదీ బుధవారంనాడు ఉదయం 5:30-7:05 గంటల మధ్య అమ్మయ్య సమాధి మందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపన జరిగింది. ఈ కార్యక్రమానికి అమ్మయ్య అష్టాదశ వర్ణాలలోని తన బిడ్డలను పిలిపించుకుందని స్వామి చెప్పారు.

అమ్మయ్యగారు సమాధి చెందిన తర్వాత స్వామి చాలా సంవత్సరాలు ఉదయం 8:00-8:30 గంటల మధ్యలో, సాయంత్రం 8:00-8:30 గంటల మధ్యలో ఫోను చేసిన భక్తులతో మాట్లాడేవారు. ఆ కాలంలో చాలామంది భక్తులకు స్వామికి ఫోను చేసే అలవాటు ఉంది. ఏదైనా కారణం చేత ఫోను చేయటం కుదరక తర్వాత ఫోన్ చేసినప్పుడు, "ఆలస్యమైందేమని?" స్వామి అడిగేవారు. వారి కుటుంబ విషయాలు, ఆ వారంలో జరిగిన విశేషాలు, స్వామికి చెప్పుకునేవారు. స్వామి ఆశీస్సులుతో అనుకున్న పనులు తేలికగా, సానుకూలంగా జరిగేవి.

అమ్మయ్యగారు సమాధి చెందిన సమయంలో స్వామి ఉదయం, సాయంత్రం దర్గాలలో భక్తుల సమస్యలకు పరిష్కారం చెప్పేవారు. తర్వాత ఆశ్రమం వాకిలి ఎదురుగుండా ఉన్న మెట్లమీద కూర్చొని కొంతకాలం చెప్పినారు. తర్వాత చాలాకాలం అమ్మయ్య సమాధి మందిరం బయట ఉన్న మెట్లమీద కూర్చొని చెప్పినారు. ఆ తర్వాత బాగా వృద్ధులై ఆశ్రమ హాలులో సోఫాలో కూర్చొని చెప్పారు.

2005వ సంవత్సరంలో అమ్మయ్య వార్షిక ఆరాధనోత్సవాలు పూర్తయినాక, గణపతి నవరాత్రులు మొదలయ్యే ముందర సెప్టెంబర్ 7వ తేదీన దర్బార్ సాయినాథ మందిరంలో దొంగలు పడి మందిరంలో సొత్తులన్నీ ఎత్తుకుపోయారు. స్వామి జరిగినదానికి మొదట్లో బాధ పడ్డారు. స్వామి దొంగిలించినవారు దర్బార్ సాయినాథుని కిరీటాన్ని ముక్కలు చేసారని, చేస్తున్నప్పుడు తమ తలను పగులగొడుతున్నంత బాధగా ఉందని చెప్పారు. కొన్ని రోజుల తర్వాత "నా సొత్తులు పోయినాయి. నేను తిరిగి తెచ్చుకుంటాను. నీకెందుకు బాధ?" అని దర్బార్ సాయినాథుడు అడిగినట్లుగా చెప్పి "ఆయన సొత్తులు ఆయన తెచ్చుకుంటాడు" అని భక్తులను సమాధానపరిచినారు. తర్వాత ఆశ్రమ భక్తులు పోలీస్ కంప్లైంట్ ఇచ్చి, కోర్టు కచ్చేరీలకి హాజరయ్యి పట్టుదలతో కృషి చేసినాక, పోలీసువారు పోయిన సొత్తుకు సమానమైన బంగారాన్ని వెనక్కు ఇచ్చినారు.

ఈ సంఘటన తర్వాత కొంతకాలానికి స్వామివారి రెండు కళ్ళలో గ్లాకోమా వచ్చి చూపు మందగించింది. భక్తులు చాలా ప్రార్థన చేసిన

మీదట స్వామి ప్రొద్దుటూరు వెళ్ళి లేజర్ ట్రీట్‌మెంట్ చేయించుకున్నాక చూపు మెరుగుపడింది. వైద్యం చేసినాక డాక్టర్లు ఒక నల్ల కళ్ళజోడు పెట్టుకోమని స్వామికి ఇచ్చినారు. స్వామి ఆ నల్ల కళ్ళజోడు చాలా సంవత్సరాలు పెట్టుకున్నారు.

2012దాకా కూడా స్వామి దర్బార్ సాయి మందిరంలోని నాలుగు ఆరతులు ఇచ్చినారు. ఊతం కొరకు చెంతనున్న వారి చేయి పట్టుకుని నెమ్మదిగా నడుచుకుంటూ అమ్మయ్య సమాధి మందిరంలో నమస్కారం చేసుకుని సాయి మందిరానికి వెళ్ళేవారు. చివర్లో అమ్మయ్య మందిరానికి వచ్చే దారిలో మెట్లు ఎక్కటానికి ఇబ్బంది పడేవారు. తర్వాత నెమ్మదిగా శేజ్ ఆరతిని భక్తులను నిర్వహించమన్నారు. మరి కొంతకాలం తర్వాత సాయంత్రం ఆరతిని కూడా శంకరయ్యగారికి అప్పచెప్పారు. 2012 సంవత్సరంలోనే మధ్యాహ్న ఆరతిని కూడా విరమించుకున్నారు.

17-7-2011 ఆదివారం నుండి 21-7-2011 గురువారం దాకా భక్తులందరూ స్వామికి భీమరథ శాంతి (80 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా చేసుకునే ఉత్సవం) ఉత్సవం జరిపించినారు. శ్రీ ఖరనామ సంవత్సరం ఆషాఢ బహుళ షష్ఠి గురువారం 21-7-2011 రోజున మధ్యాహ్నం 12:40కి భక్తుల అభిలాష మేరకు స్వామివారికి కనకాభిషేక శాంతి మహోత్సవం జరిగింది.

11-5-2012 శుక్రవారం నుండి 16-5-2012 బుధవారం వరకు భక్తులు స్వామికి సహస్ర చంద్ర దర్శన శాంతి మహోత్సవం జరిపించినారు. ఆ రోజు శ్రీ నందన నామ సంవత్సరం, వైశాఖ బహుళ ఏకాదశి. ఈ ఉత్సవాన్ని వెయ్యి పున్నములు చూసిన వారికి చేస్తారు. సాధారణంగా వెయ్యి పున్నములు చూసిన వ్యక్తిని ముట్టుకుంటే కూడా పుణ్యం కలుగుతుందని విశ్వాసం ఉంది. ఈ ఉత్సవం సందర్భంగా స్వామికి భక్తులు వేద మంత్రోఛ్ఛారణల మధ్య స్వర్ణ కిరీటాన్ని అలంకరించారు. తలమీద జల్లెడ పట్టి, అందులో భక్తులందరూ నీళ్ళు పోసి స్వామికి అభిషేకం చేసినారు. నవగ్రహ హోమాలు, ఆయుష్ హోమాలు జరిపించినారు. ఈ ఉత్సవానికి శ్రీపాద వల్లభాపురం శ్రీ గురు తత్వ ప్రచార సంస్థాపకులు స్వామి విఠల్‌బాబా గారు కూడా హాజరైనారు.

2016 దాకా కూడా స్వామి చాలా పట్టుదలతో వయోభారాన్ని కూడా లెక్కచేయకుండా ఎంతో శ్రమపడి సాయి మందిరానికి వచ్చి కాకడ ఆరతి నిర్వహించినారు. తర్వాతి కాలంలో చాలా వృద్ధులై శరీరం సహకరించక విరమించుకున్నారు.

2017 డిసెంబరు 3 దత్తజయంతి (మార్గశిర పౌర్ణమి) ఈ పుస్తక సంకలనం చేసే సమయానికి స్వామివారు 86 సంవత్సరాల పండు వయస్సులో కూడా భక్తులకు మార్గదర్శనం చేస్తూ, వారిని కాపాడుతూ ఉన్నారు.

## స్వామి, అమ్మయ్యలు ఈ క్రింది భజనను పాడేవారు

**సహస్రనామ పూజలు చేస్తాం సర్వేశ్వరునకు**
**సంతోషంగాను, స్వామికి ఉల్లాసంగాను ॥సహస్ర॥**

నీవు నేనను భేదబుద్ధి విడిచిపోదామా
సర్వమూ ఒకటనుచు స్వామికి సేవలు చేస్తామా **॥సహస్ర॥**

కామక్రోధలోభమోహమదమాత్సర్యాలను విడిచిపోదామా
శమదమ గుణములతో స్వామికి పూజ చేస్తామా **॥సహస్ర॥**

పూజలుచేసి ఆరగింపుపెట్టి హారతులిస్తామా
సర్వమూ ఒకటనుచు స్వామికి సేవలు చేస్తామా **॥సహస్ర॥**

అన్నిటికన్నా ఎక్కువైనదీ మానవజన్మము
మరుజన్మము వలదనుచూ శెలవు కోరుదామా **॥సహస్ర॥**

స్వామిని శెలవు కోరుదామా
సద్గురుస్వామిని శెలవు కోరుదామా **॥సహస్ర॥**



స్వామివారి సహస్ర చంద్ర దర్శన మహోత్సవ సందర్భంగా తీసిన ఫోటో

శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయినాథాయ నమః

# దైవం మానుష రూపేణ

## అధ్యాయము - 3

## సర్వజ్ఞుడు

సాధన ద్వారా సద్గురుకృపను పొంది, గురువు అనుగ్రహం వలన ఆత్మజ్ఞానం పొందిన మహనీయులే సిద్ధ పురుషులు. శాస్త్రాలలో భగవంతునకు చెప్పబడ్డ లక్షణాలు సర్వజ్ఞత్వం, సర్వసమర్థత, సర్వ వ్యాపకత్వం అట్టివారిలో సంపూర్ణంగా ప్రకటమవడం భక్తులకు అనుభవైకవేద్యము. ఇట్టి మహనీయులకు ప్రపంచంలో ఎక్కడ ఏమి జరుగుతున్నా అనుక్షణము తెలియబడుతూ అద్భుతరీతిన తమ భక్తులను సంకటముల నుండి రక్షిస్తుంటారు. ఈ అధ్యాయంలో శ్రీస్వామివారి యొక్క సర్వజ్ఞత్వ లక్షణమును నిరూపణ చేసినటువంటి భక్తులయొక్క వివిధ రకాల అనుభవాలను చూస్తాము.

■ ఇంటి నుండి ఆశ్రమానికి బయలుదేరి తమ దర్శనానికి వచ్చేటప్పుడు, లేదా ఆశ్రమం నుండి ఇంటికి వెళ్లేటప్పుడు ప్రయాణంలో స్వామి తన భక్తులకు ఎటువంటి ఆటంకాలు కలుగకుండా అనుక్షణం కనిపెట్టుకుని కాపాడిన సంఘటనలు.

■ ఎంతో శ్రమకోర్చి దూరప్రదేశాల నుండి వచ్చే భక్తుల గూర్చి ముందరే చెప్పి వారి సౌకర్యం కొరకు భోజన ఏర్పాట్లు చేయించిన సంఘటనలు చూస్తాము.

■ చాలా సందర్భాలలో ఆశ్రమానికి వచ్చిన వారి పూర్వాపరాలు, ఇతర వివరములు స్పష్టంగా చెప్పారు.

■ భక్తులు వివిధ ప్రదేశాలలో సంచరించినప్పుడు వారి ప్రవర్తన గురించి, వారి మనస్సులో భావాలను గురించి తెలియజేసారు.

■ స్వామి ఆశ్రమానికి వచ్చినవారి మనస్సులోని భావాలను వారు చెప్పకుండానే గ్రహించి, వారి స్వభావానికి అనుగుణంగా స్పందించి, వారిలోని సందేహాలను తొలగించి అనుగ్రహించేవారు. కొంతమందిని

తగువిధంగా సంస్కరించినారు.

■ ఆశ్రమంలో దర్శనానికి వచ్చిన కొంతమంది సమస్యలను వారు చెప్పకముందే గ్రహించి వాటికి పరిష్కారాలు సూచించారు

■ కారణాంతరాల వల్ల ఆశ్రమానికి రాలేని భక్తుల ఆర్తిని గ్రహించి వారికి స్వప్నదర్శనాలిచ్చి సమస్యలు పరిష్కరించారు.

■ భవిష్యత్తులో తమ భక్తులకు కలగబోయే ఆపదలను, అనారోగ్యాల గురించి ముందరే హెచ్చరించి వారిని జాగరూకపరిచారు.

■ చుట్టుప్రక్కల ప్రాంతాల ప్రజలు తమ పశువులు తప్పిపోయినా, మనుష్యులు తప్పిపోయినా దర్గాకు వచ్చి స్వామికి విన్నవించుకునేవారు. స్వామి వారి ఆనవాలు చెప్పి, తప్పిపోయిన వారిలో తగిన ప్రేరణ కలిగించి ఇంటికి వచ్చేటట్లు చేసేవారు. అయితే స్వామివారు పోయిన వస్తువుల గురించి చెప్పటానికి ఇష్టపడలేదు.

రాయచోటిలో కొత్తపేటలో నివాసముండే కామిరెడ్డి వెంకట్రామిరెడ్డిగారు రిటైర్డ్ తెలుగు పండితులు. వీరు తెలుగుకవి కూడా! అనర్గళంగా పద్యరచన చేస్తారు. 1971లో ఒకసారి వీరు , తమ స్నేహితునితో స్వామివారి దర్శనానికి బయలుదేరారు. ఆశ్రమం చేరుకునేటప్పటికి రాత్రి 10 గంటలు అయ్యింది. వారి రాక గురించి ఆశ్రమంలో ఎవరికీ ముందుగా తెలియపరచలేదు. అయితే అప్పటికే స్వామివారు అమ్మయ్యతో ఇద్దరు భక్తులు తమ దర్శనానికి వస్తున్నారని భోజనం పెట్టాలని చెప్పారు. ఈ విషయం మాతాజీ స్వయంగా వారితో చెప్పింది. వారే ఆ ఇద్దరు భక్తులు!

కడపజిల్లా, చిన్నమండెం నివాసి ముల్లంగ శేషయ్యశెట్టి తమ గ్రామస్తుల ద్వారా స్వామివారి గురించి తెలుసుకొని దర్గాకు వచ్చాడు. అప్పుడు అతని ఆరోగ్యం బాగా లేదు. అందువలన రెండు నెలలు దర్గా వద్ద వుండి సేవ చేసుకున్నారు. దానితో ఆరోగ్యం మెరుగు పడింది. కొన్నాళ్ళ తరువాత ఒక అమావాస్య రోజున రాత్రి తొమ్మిది గంటలప్పుడు ఆశ్రమానికి నడిచి వస్తున్నాడు. అప్పుడు ఆశ్రమంలో భోజనాలు చేస్తున్నారు. స్వామివారు అమ్మయ్యతో “చిన్నమండెం నుండి శేషయ్య వస్తున్నాడు, అన్నం తీసి పెట్టు” అని చెప్పారు. ఆ విషయం ఆశ్రమం చేరిన తర్వాత

అమ్మయ్య అతనితో చెప్పారు.

ఒకరోజు మునగా బాలసుబ్రహ్మణ్యంగారు లక్కిరెడ్డిపల్లె నుండి హారతికి దర్గాకు రావాలని మోటారు బైకుమీద బయలుదేరారు. టైర్లలో గాలి తక్కువగా ఉన్నా, స్వామి ఉన్నారులే అని భరోసాగా బయలుదేరారు. ఆయన ఆశ్రమంలో కనపడగానే స్వామివారు ప్రక్కవారితో "వీడు టైర్లలో గాలి తక్కువగా వున్నా స్వామి ఉన్నారులే అని బయలుదేరాడు" అని చెప్పారు.

దర్బార్ సాయి మందిరం కడుతున్న సమయంలో ఒకరోజు స్వామి అక్కడ వున్న ఇసుకలో కూర్చుని ఉన్నారు. రాత్రి 7 గంటలప్పుడు స్వామి ఆశ్రమంలోకి పోతూ "ఆశ్రమానికి ఎవరో వస్తున్నారు, అడ్రస్సు తెలియక తిరుగుతున్నారు. రానీ వస్తారులే!" అని చెంత వున్న నెల్లూరు కృష్ణారెడ్డిగారికి చెప్పారు. అరగంట తర్వాత కావలి నుండి వ్యానులో కొందరు భక్తులు వచ్చినారు. వారు 'ఇదే మొదటిసారి రావటం. అడ్రస్సు తెలియక అటూ ఇటూ తిరిగి ఇప్పటికి రాగలిగాము' అని కృష్ణారెడ్డిగారితో చెప్పారు. కృష్ణారెడ్డిగారు వాళ్ళతో ఇంతకుముందే మీరొస్తున్నారని స్వామి నాతో చెప్పారని తెలియజేసారు.

రాయచోటిలో స్వరూపగుప్తాగారి తమ్ముడు అమర్‌నాథ్ గారు స్వామి అనుమతి తీసుకోకుండా ఎప్పుడూ దర్గానుండి ఇంటికి బయలుదేరేవారు కాదు. కానీ ఒకరోజు రాత్రి 10గం॥ 30ని॥లకు స్వామి తమ గది లోపలకి వెళ్ళారు. మరలా బయటకు రావటానికి ఎంత సమయం పడుతుందో తెలియక, ఇప్పటికే ఆలస్యం అయ్యిందని ఆయన,ఆయన స్నేహితుడు నటరాజాగారు మెయిన్‌రోడ్డుకి వచ్చారు. ఒక బస్సు ఖాళీగా వెళ్ళుతున్నప్పటికీ డ్రైవరు వారిని చూసి కూడా ఆపకుండా వెళ్ళిపోయాడు. అరగంట గడిచినా ఒక్క వాహనం ఆగలేదు. ఇంతలో స్వామి దగ్గర నుండి ఒక భక్తుడు వచ్చి, స్వామి ఇమ్మన్నారని ప్రసాదం ఇచ్చాడు. వారు ఆశ్రమం దగ్గర నుండి బయలుదేరిన కొంతసేపటికి స్వామి బయటకు వచ్చారు. వారు వెళ్ళిపోయారని తెలుసుకున్నారు. స్వామి ఆశ్రమంలో ఒక భక్తునికి ప్రసాదం ఇచ్చి "వాళ్ళు మెయిన్‌రోడ్డులో వుంటారు. వెళ్ళి

ప్రసాదం ఇచ్చిరా'' అని చెప్పి పంపారు. స్వామి ప్రసాదం చేతికందిన తర్వాతనే వారికి బస్సు దొరికి ఇంటికి వెళ్ళగలిగారు. తమ భక్తులెక్కడ ఎప్పుడు వుండేది స్వామికి ఎంత స్పష్టంగా తెలుసునో కదా!

ఇటువంటి అనుభవాలు భక్తులకు కోకొల్లలు. ఒక్కసారి ఇంటివద్ద స్వామికి నమస్కరించుకుని దర్గాకు బయలుదేరినాక, దర్గా చేరేవరకు, అట్లాగే దర్గా వద్ద స్వామి అనుమతి తీసుకుని ఇంటికి చేరేవరకు స్వామిదే బాధ్యత. అనుక్షణం స్వామి తమ భక్తులను గమనిస్తూ ఉంటారు. ఒకవేళ ఇంటికి తాళం పెట్టి దర్గాలో కొన్ని రోజులు సేవ చేయటానికి నిలబడితే వారి ఇంటి భద్రత కూడా స్వామిదే.

2003 అక్టోబర్ 6వ తేదీన ఉదయం కాకడ హారతి అయిన తర్వాత శంకరయ్యగారిని పిలిచి "స్వీట్సు ముక్కలుగా చేసి ఎందుకు పంచినావు? నేను 130 మంది వస్తారు, 130 తీసుకువెళ్ళు అంటే 100 స్వీట్లు తీసుకువెళ్ళి ముక్కలు చేసి పంచి పెడతావా?'' అని మందలించినారు. అప్పుడు ఎంతమంది వచ్చేది వారికి ముందే తెలుసునని స్పష్టమయింది. ఈ విధంగా వారి సర్వజ్ఞత్వాన్ని వెల్లడి చేసినారు.

బెంగుళూరులో ఉండే సుధాకర్ అనే యువకుడు సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేసేవాడు. ఒకసారి ఆశ్రమానికి వచ్చిన ఒక భక్తునికి స్వామి సుధాకర్‌ని చూపిస్తూ "సి'' లో ఎక్స్పర్ట్ అని చెప్పారు. స్వామి చెప్పిన విధంగా అతను ఆఫీసులో "సి'' ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌లోనే పని చేస్తాడు. కానీ ఆ విషయం స్వామికి ఏనాడూ చెప్పలేదు.స్వామి తన గూర్చి ప్రత్యక్షంగా ఎన్నడూ స్వామికి తెలియపరచని విషయాన్ని ఆ విధంగా చెప్పటం గమనించి సుధాకర్ చాలా ఆశ్చర్యపోయాడు.

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పద్మజగారి అమ్మాయి ఇంటర్మీడియెట్ (యం.పి.సి) మొదటి సంవత్సరం చదువుతున్న సమయంలో స్వామి దర్శనానికి తీసుకువెళ్ళారు. స్వామి వారి అమ్మాయిని "ఏమి చదువుతున్నావు?'' అని అడిగారు. ఆ అమ్మాయి 'మొదటి సంవత్సరం' అని మాత్రమే చెప్పింది. ఇంకేమీ చెప్పకుండానే స్వామి "యం.పి.సి, ఇంజనీరింగ్ చేస్తావు'' అని ఆశీర్వదించారు. ప్రతి ఒక్కరి పుట్టుపూర్వోత్తరాలు స్వామికి తెరిచిన పుస్తకమే!

దమ్మపేట చీమకుర్తి సుబ్బారావుగారి పొలంలో ఒక ప్రక్కగా ఉన్న పాముపుట్టలో సగభాగం పొలంలోకి వచ్చింది. అది మాములు పుట్టే కదా అనే ఉద్దేశ్యంతో అది కొట్టించి పొలంలో నేలను చదును చేశారు. అలా చేసిన దగ్గరనుండి పొలంలో పాములు తిరుగుతూ కనపడేవి. తర్వాత దర్గాస్వామి దగ్గరకెళ్ళినప్పుడు 'స్వామీ! పొలంలో ఈ మధ్య పాములు కనపడుతున్నాయి' అని విన్నవించుకున్నారు. ఆయన ఇంకేమీ చెప్పకుండానే స్వామి "నీ పొలంలో ఒక ప్రక్కనున్న పుట్టను కొట్టేశావు. దాంట్లో నిన్ను కాపాడే దేవతలు ఉన్నారు. అవేమీ చేయవు కానీ సంవత్సరానికి ఒకసారి పాలు పోస్తుండు" అని చెప్పారు. అప్పటినుండి స్వామి చెప్పినట్లు చేయటం ప్రారంభించారు. తర్వాత ఎప్పుడూ పాములు కనపడలేదు. ఎక్కడో దమ్మపేట పొలంలో కొట్టేసిన పుట్ట గురించి చెప్పటమే కాక ఏమి చేస్తే అలా పాములు కనపడవో చెప్పటం, అలా పాములు కనపడనివ్వకుండా చేయటం ఆ సర్వసమర్థునికే సాధ్యం. సామాన్యంగా చుట్టుప్రక్కల రైతులు ఎవరన్నా వచ్చి పొలంలో కానీ, ఇంట్లో కానీ బోరుబావి వేసుకుంటున్నాము, ఎక్కడ వేసుకోమంటారు అని అడిగేవారు. ఇటువంటి చాలా సందర్భాలలో స్వామివారు నాగేంద్రునికి పాలుపోసి, వారి కులదైవాన్ని స్మరించి ఫలానా చోట వేసుకోమని సూచించేవారు.

కడప పట్టణంలోని రవీంద్ర నగర్‌లో నివసించే రిటైర్డు టీచర్ యస్. రాజకుళాయిగారు మొదటిసారి 1971లో కడపలో శ్రీ తలుపుల మల్లిఖార్జునగారింట్లో స్వామివారిని దర్శనం చేసుకున్నారు. ఆయనకు అప్పుడప్పుడూ స్పృహ తప్పి పడిపోయే జబ్బు వుండేది. అది స్వామివారికి మనవి చేసుకున్నారు. స్వామివారు "శుక్రవారం దర్గాకు వచ్చి నిద్ర చెయ్యి, శనివారంనాడు చెప్తాను" అన్నారు. ఆయన అలాగే నిద్ర చేశారు. దర్గా వద్ద మాతాజీగారి దర్శనం కూడా చేసుకున్నారు. స్వామివారు "నాగదోషం వలన నీకు స్పృహ తప్పి పడిపోయే జబ్బు వచ్చింది. మీ తండ్రిగారు 40 లేదా 50 ఏండ్ల క్రితం నాగుపామును చంపి వుంటారు. దాని వలన ఇది వచ్చింది" అన్నారు. ఆయన ఇంటికి వెళ్ళి వారి అమ్మగారిని అడుగగా ఆవిడ ఆ విషయం నిజమేనని చెప్పింది. మరలా వచ్చి స్వామివారికి ఈ

విషయం చెపితే స్వామి "ఒకరోజు ఉపవాసం వుండి నాగపూజ చేస్తే ఆ దోషం పోతుంది" అని చెప్పారు. ఆయన అలాగే చేసిన కొద్దిరోజుల నుండి ఆయనకు స్పృహ తప్పి పడిపోయే జబ్బు పోయింది. ఏదైనా అడగటానికి వచ్చిన వారి వంశంలోని వారి పూర్వీకుల వల్ల ఏదైనా దోషం జరిగి ఉంటే స్వామి అది గ్రహించి చెప్పేవారు. ఏదైనా పాములను చంపటం, ఆవులను కొట్టడం, మనుష్యులెవరికైనా కీడు చేయటం వంటి కర్మల యొక్క ఫలాలు చేసినవారికే కాక అనువంశికంగా వారి తర్వాత తరాలవారికి కూడా వస్తాయి. వంశంలో ఆస్తులు సంక్రమిచినట్లుగా, పెద్దవారు చేసే మంచి, చెడుల ఫలితాలు కూడా పిల్లలకి సంక్రమిస్తాయి.

ఖమ్మం జిల్లా, దమ్మపేట గ్రామ వాస్తవ్యులు పసుమర్తి శీనుకు ఎన్ని సంబంధాలు చూసినా వివాహం కాలేదు. మిత్రుల సలహా మీద అరుణాచలం వెళ్లి గిరిప్రదక్షిణ చేసుకున్నాడు. 'కొండచుట్టూ తిరిగితే పెండ్లవుతుందా?' అని ఆలోచిస్తూ ప్రదక్షిణ చేశాడు. ఆ తర్వాత అతను శ్రీ దర్గాస్వామివారి దగ్గరకొచ్చాడు. ఆ యువకుడు చెప్పకముందే "ఏమయ్యా! కొండ చుట్టూ తిరిగితే పెండ్లవుతుందా? అనుకుంటూ ప్రదక్షిణ చేస్తావేమిటి? నీవు శ్రీ రామచంద్రునికి వివాహం చేయించు, పెండ్లవుతుంది" అని చెప్పారు. రాములవారి వివాహం జరిపించగానే అతని వివాహం కూడా చక్కగా జరిగింది. ఎక్కడో అరుణాచలంలో అతని మనస్సులో మెదిలిన సంశయాన్ని శ్రీ స్వామివారు నీలకంఠరావుపేటలో చెప్పడమెంత చిత్రమో చూడండి.

దమ్మపేట భక్తురాలు శ్రీమతి చంద్రావతిగారు పది సంవత్సరములుగా ఉదయము ఏ ఆహారమూ తీసుకోకుండా గురు చరిత్ర, ఇతర సద్గ్రంథ పారాయణ నిత్యం శ్రద్ధగా చేసుకుని, మధ్యాహ్నం భోజనం చేసేవారు. ఆమెకు తిరిగి రాత్రి మాత్రమే భోజనం చేయటం అలవాటు. వారి భర్తగారైన శ్రీ రామకృష్ణగారు ఇలా ఆమె చేస్తుంటే నీరసపడి బలహీనమవుతుంది అని అభిప్రాయపడేవారు. శ్రీ దర్గాస్వామివారిని దర్శించినప్పుడు రామకృష్ణగారు ఈ విషయం గూర్చి స్వామివారితో చెప్పుకున్నారు. అప్పుడు శ్రీస్వామివారు "ఏమైంది? ఆ అమ్మాయికి ఈ పది సంవత్సరాల్లో ఒక్క మందుబిళ్ళ అయినా కొని తెచ్చావా? ఇచ్చావా?"

అని అన్నారు. ఆమెకు ఏ అనారోగ్యం లేనందు వలన ఏ ఒక్క మందూ వాడవలసిన అవసరం లేకపోయింది. ఇదే విషయం శ్రీ స్వామివారు ప్రస్తావించడంతో శ్రీ స్వామివారి సర్వజ్ఞతకు ఎంతో ఆశ్చర్యపోయారు. వారి మనస్సు కుదుటపడింది.

ఒకసారి దమ్మపేట మోహనరావుగారిని "నీవు ఏమి తీసుకువచ్చావు?" అని అడుగగా, మీకు ఏమీ తీసుకురాలేదు, బాబాకు వస్త్రాలు తీసుకువచ్చాను అని చెప్పారు. "నీవు నాకు లడ్డూ తీసుకురాలేదా?" అని అడిగారు. అప్పుడు గానీ ఆయనకు స్వామికోసం లడ్డూ తీసుకు వచ్చిన సంగతి గుర్తుకు రాలేదు. భక్తుడు మరచిపోయినా శ్రీ స్వామివారు తన వస్తువు అడిగి తీసుకున్నారు.

ఖమ్మం జిల్లా దమ్మపేట వాస్తవ్యులు తొండెపురాజుగారు మొదటిసారి శ్రీమతి లక్ష్మిగారు, శ్రీ నాగేశ్వరరావు మాష్టర్‌గారు మొదలగు వారితో శ్రీ దర్గాస్వామివారి దర్శనానికి వెళ్ళారు. కొందరు శ్రీ దర్గాస్వామివారు గొప్ప మహనీయులంటే, మరికొందరు సందేహించారు. అందరూ కలసి ఆ రాత్రికి ఒక నిర్ణయానికి వచ్చారు. 'మనమంతా శ్రీ భరద్వాజ మాష్టారి మార్గంలో ఉన్నాము. మనం అడగకుండానే శ్రీ దర్గాస్వామివారు మీరు శ్రీ భరద్వాజ మార్గంలో ఉన్నారని' చెపితే వారు మహనీయులని నమ్మాలనుకున్నారు. తెల్లవారి అందరికీ తీర్థమిస్తూ వీరి వంతు వచ్చినప్పుడు రాజుగారిని స్వామి "నీకేమి కావాలని?" మూడుమార్లు అడిగినా, ఆయన ఏమీవద్దని మూడుమార్లు చెప్పారు. ఒకవైపు సాయిబాబా, మరియొకవైపు శ్రీ మాష్టరుగారు ఉన్న ఫోటో ఆయన జేబులో నుండి స్వామి తీసుకుని ఆ ఫోటోను చూపిస్తూ "ఈయన మార్గంలో నడుస్తున్నాను అని కావాలి కదా? ఇంకేమీ అవసరం లేదు కదా" అన్నారు. ఈ విధంగా స్వామి సర్వజ్ఞులని రూఢీ అయ్యింది.

రాజుగారు లౌకిక విషయాలేవీ స్వామిని అడగలేదు. స్వామి ఆయన దగ్గరున్న అవధూతలీల (గొలగమూడి శ్రీ వెంకయ్యస్వామి జీవిత చరిత్ర) గ్రంథం తీసి ఒక చోట తెరిచారు. తెరిచిన చోట శ్రీ వెంకయ్యస్వామివారు భర్త చనిపోయిన దిగులుతో మంచం బట్టి

అహర్నిశలూ శోకిస్తున్న కోడూరు వెంకమ్మగారికి చిత్రమైన తత్త్వబోధ చేసి, ఆమె శోకాన్ని నివారించిన ఘట్టం ఉంది. ఆ ఘట్టాన్ని దర్గాస్వామివారు రాజుగారిని నిత్యం చదవమన్నారు.

ఆ ఘట్టం ఏమిటంటే :

శ్రీ వెంకయ్యస్వామి కోడూరు వెంకమ్మతో "అమ్మా, ఒక మామిడి పండుకు పుండు పడితే అది ఎంత ఫలింపు అవుతుందమ్మా? వరుటుబారి, కుళ్ళి ఎందుకూ పనికి రాకుండా పోతుంది. ఆ పండు ధైర్యంగా ఉండి ఆ పుండును లెక్క చేయకుంటే ఆ పుండు దాన్నేమీ చేయలేదు. పండు మధురంగా తయారై ఎన్నో కాయల్నిస్తుంది. అది ఎన్నోసార్లు ఇలాంటి చెట్లు అయిన తరువాత మనిషవుతుంది. ఇలా మనిషిగా ఎన్నోసార్లు జన్మించాక కాస్త బుద్ధిగలవాడౌతాడు. అలాంటి బుద్ధిగలవాడుగా ఎన్నోసార్లు జన్మించాక ఒక జన్మలో భక్తుడవుతాడు. తర్వాత అలాంటి జన్మలెన్నో అయ్యాక ఒక జన్మలో ధర్మంగా పరిపాలించే రాజవుతాడు. అట్లాంటి రాజుగా ఎన్నో జన్మలెత్తిన తర్వాత దేవుని కొరకు పాటుపడుతాడు. అలాంటి ముముక్షు జన్మలు ఎన్నో గడిచాక దేవుని సన్నిధిలో ఉంటాడు. అప్పుడు దేవుడు తన కన్ను కొద్దిగా తెరచి భక్తుని చూస్తాడు. ఆయన తన బొటన వ్రేలు క్రింద ఉండే అల్లెతాడు త్రొక్కితే ప్రపంచంలో ఉండే బొమ్మలాటంతా అతడికి కన్పిస్తుంది. అప్పుడు దేవుడు అతనిని తనలో చేర్చుకుంటాడు" అని చెప్పారు. అది విని వెంకమ్మ 'ఇప్పటికే ఇన్ని జన్మలు ఎత్తి ఎన్నో బాధలు పడుతున్నాను. ఈ కొంచెం బాధలు ఒక లెక్కా? ధైర్యంగా మామిడిపండువలె వుండాలని' అనుకొని, అది మొదలు వెంకమ్మ ఏడవటం మానుకుంది.

కాలాంతరంలో రాజుగారికి అనేక ఇబ్బందులు వచ్చాయి. ఆ సమయంలో ఏడురోజులు ఒంగోలులో భరద్వాజ మాష్టరుగారి సమాధి దగ్గర ఉన్నారు. క్రమంగా అన్నీ సర్దుకున్నాయి. శ్రీ దర్గాస్వామివారు అవధూతలీల గ్రంథం తెరిచి చదవమన్న ఘట్టం ఆయన జీవితంలో యథాతథంగా జరిగింది.

శ్రీ దర్గాస్వామివారి దర్శనార్థం వెళ్ళిన రాజుగారి సత్సంగసభ్యులు

శ్రీ స్వామివారికి నమస్కరించుకుని వారి ఆశ్రమం నుండి బయటకు వచ్చారు. ఆయనొక్కడే వెనుకబడి పోయారు. ఈలోగా శ్రీస్వామివారు కాలు మీద కాలు వేసుకొని మెట్టుపై కూర్చున్నారు. వారు రెండు పాదాలు నేల మీద పెడితే నమస్కరించుకోవాలని కోరుకుంటూ వెళ్ళారు. స్వామి పాదాలు నేల మీద పెట్టి "ఇప్పుడు నమస్కరించుకో" అని చెప్పారు. ఆయన కోరికను ఈ విధంగా తీర్చారు. సత్సంగసభ్యులందరూ ఆశ్రమం గేటు వరకు వచ్చేశారు. రాజుగారు, దారా నాగేశ్వరరావుగారు 'శ్రీ స్వామివారు ప్రసాదమివ్వకుండానే పంపారే' అని అనుకున్నారు. వెంటనే స్వామి గేటు వరకు వెళ్ళిన వారిని వెనక్కు పిలిచి, ఆపిల్‌పండును ముక్కలు చేసి ఇస్తూ "ఏం ప్రసాదం పెట్టకుండా పంపేస్తున్నానని అనుకుంటున్నారా? ఇదిగో ప్రసాదమని" ఇచ్చారు. ఆ మహనీయుని సర్వజ్ఞత్వం అడుగడుగునా స్పష్టంగా కనిపిస్తుంది. మనమెక్కడ ఉండి ఏమి చేసినా, ఏమి ఆలోచించినా, ఏమి మాట్లాడినా వారికి తెలుస్తుందని నిరంతరమూ గుర్తెరిగి నడుచుకుంటుంటే వారి అండ మనకెప్పుడూ ఉంటుంది.

నెల్లూరుజిల్లా వెంకటగిరి నుండి జి. గోపాల్ అనే యువకుడు స్వామిని దర్శిస్తుండేవాడు. ఒక పర్యటనలో గోపాల్ ఆశ్రమానికి వెళ్ళగానే స్వామి కఠినంగా "ఉద్యోగం వస్తుందని చెప్పాను గదా! మరలా వచ్చావెందుకురా లంజకొడకా?" అంటూ తిట్టారు. తర్వాత అందరూ ఆరతికి సాయి మందిరం లోనికి వెళ్ళారు. స్వామి ఆరతికి వత్తులు వేసుకుని నెయ్యి పోస్తున్నారు. ఇంతలో కొంతమంది భక్తులు ఆరతి చేద్దామని మందిరం లోపలికి వస్తున్నారు. ఒక పెద్దావిడ మందిరంలోనికి రావటానికి వాకిలి వద్దకు వచ్చింది. వాకిలి వద్ద నిలబడిన ఒకతను నోటికి వేలు అడ్డంపెట్టి శబ్దం చేయవద్దన్నట్టుగా సూచిస్తూ ఆమెను ప్రక్కకు తప్పుకోమని చేత్తో సైగ చేశాడు. అంతరాలయంలో ఉన్న స్వామికి వాకిలి వద్ద ఉన్నవాళ్ళు కనపడే అవకాశం లేదు. ఎక్కడో లోపల వున్న స్వామివారు "అశుద్ధ బ్రహ్మలారా! ఎక్కడ దాపురించారురా మీరు? ఆ తల్లిని లోపలికి రానీయండిరా" అని గట్టిగా అరచారు. వారెక్కడున్నా ఆశ్రమంలో ఏ మూల ఏం జరుగుతోందో తెలుస్తూనే వుంటుంది.

ఆరతి అయినాక, దర్గాలో తమ బిడ్డ తలనీలాలు సమర్పించి, ఆశీస్సులకోసమొచ్చిన ఒక ముస్లిం మహిళను స్వామి ఆప్యాయంగా పలకరించి మాట్లాడుతున్నారు. గోపాల్ ఇది చూచి ఇక్కడ ముస్లిం జనాభా అధికము గనుక వారితో సుహృద్భావంగా మెలగకుంటే వారి నుండి ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందేమో, కానీ 'హిందువునైన నన్ను కఠినంగా తిట్టారు' అని మనస్సులో అనుకున్నాడు. వెనువెంటనే శ్రీ స్వామివారు గోపాల్ వైపు తిరిగి "నాకెవరిని చూచినా భయం లేదోయ్!" అన్నారు. మన మనస్సులో కలిగే ప్రతి భావనా, ఆలోచనా వారికి తెలుస్తూనే వుంటుందని గోపాల్‌కు రూఢీ అయింది.

ఛాయాగారి చెల్లెలు కడప అవధూతేంద్రస్వామి చరిత్రలో దర్గాస్వామి గురించి తెలుసుకుని స్వామి దర్శనం చేసుకున్నారు. ఒక పర్యాయం దర్గాలకి వచ్చినప్పుడు మనస్సులో సాయిబాబాతో 'బాబా! నీవు, స్వామి ఒకటే అయితే, స్వామి నా దగ్గరనుండి 11 రూపాయలు దక్షిణ అడగాలి' అని చెప్పుకున్నారు. ఆమె తిరుగు ప్రయాణంలో స్వామి దగ్గర సెలవు తీసుకుందామని వెళ్ళగా, స్వామి ఆమెతో "11 రూపాయలు నేను అడగాలని బాబాను ప్రార్థించావు కదా" అని అన్నారు. అంతటితో విశ్వాసం దృఢపడింది.

ప్రతి సంవత్సరం శ్రీరామనవమికి నీలకంఠరావుపేట రామాలయంలో రాములవారి కళ్యాణం స్వామి దగ్గరుండి చాలా సంవత్సరాలు జరిపించారు. ఒక సంవత్సరం రాములవారి కళ్యాణానికి ఆశ్రమవాసులందరితో రాజీవ్ కూడా వెళ్ళాడు. ఒక భక్తుడెవరో స్వామి ఆశీస్సులతో గోరక్‌పూర్ గీతాప్రెస్‌వారి పాకెట్(జేబు)సైజ్ భగవద్గీత పుస్తకాన్ని పంచారు. పంచుతున్న సమయంలో చాలామంది ఉత్సాహంగా నిలబడి, చేతులు చాచి అడిగి తీసుకుంటున్నారు. దూరంగా నిలబడి వున్న రాజీవ్ తనకి కూడా ఒక కాపీ వస్తే బాగుంటుందేమో అని అనుకుంటూ, అయితే ఇంతమంది భక్తుల రద్దీలో పోటీపడి తీసుకోలేక 'స్వామి చెప్తే తీసుకుందాంలే!' అనుకుని నిలబడి చూస్తున్నాడు. అంతలో స్వామి ఠక్కున పంచుతున్న భక్తుడిని ఉద్దేశించి రాజీవ్‌కు కూడా పుస్తకం ఇమ్మని చెప్పారు. రాజీవ్ ఆ పుస్తకాన్ని ఇప్పటికి కూడా

జాగ్రత్తగా భద్రపరచుకున్నాడు. మార్గశిరమాసంలో వచ్చే గీతాజయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం కొన్ని శ్లోకాలు పారాయణ చేయటం అలవాటు చేసుకున్నాడు.

నెల్లూరు నుండి బాలార్కగారు గురుపూర్ణిమ రోజు స్వామికి ఫోను చేసి “స్వామీ! ఈ రోజు గురుపూర్ణిమ, మీ ఆశీస్సులు కావాలి” అని అడిగారు. స్వామి ఆశీర్వదిస్తూ “నీ మనస్సులో కోరిక నెరవేరిందా? అపార్టుమెంటు కొనుక్కోవటం నీకిష్టమే కదా! 8 లక్షలకు బేరం కుదిరింది కదా!” అని అడిగారు. వారు ఆ రోజే అపార్టుమెంట్ కొందామని అడ్వాన్సు ఇచ్చిన విషయమే స్వామి చెప్పేసరికి వారి ఇంటిల్లపాదీ ఆనందించారు.

విజయవాడ గొట్టిపూళ్ళ లక్ష్మిగారి అన్నయ్య శ్రీ చినజీయరు స్వామి భక్తులు. దర్గాస్వామి గురించి ఆయనకు అసలు తెలియదు. ఒకరోజు రాత్రి ఆయన కలలో కలలో ఒక మహనీయుడు తెల్లని బట్టలతో, గడ్డంతో కనపడ్డారు. తరువాత రోజు ఇంట్లోవాళ్ళకి కల గురించి చెప్పాడు. తరువాత రెండు రోజులకి ఒక వాహనం కొనాలని కడప వెళ్ళాడు. అక్కడ దర్గాస్వామి గురించి తెలిసి దర్శనానికి వెళ్ళి చూస్తే రెండురోజుల క్రితం ఆయన కలలో దర్శనమిచ్చిన మహనీయుడు శ్రీ స్వామివారే.

లక్ష్మిగారి కుటుంబం అంతా దర్గాస్వామి దర్శనానికి వెళ్ళినప్పుడు వారేమీ చెప్పకుండానే స్వామి లక్ష్మిగారిని చూసి “నీలో విజయవాడ కనకదుర్గ దర్శనమవుతోంది. అక్కడికి వెళ్ళకుండా దర్శనమిచ్చావు మా భాగ్యం!” అని అన్నారు. అంటే ఆవిడ విజయవాడ నుండి వచ్చారని ఎంత స్పష్టంగా చెప్పారోనని స్వామి యొక్క సర్వజ్ఞత్వం మనస్సులో దృఢపడింది.

దమ్మపేట గొర్తి సాయి సుబ్రహ్మణ్యం బెంగుళూరులో చదువుతుండగా తరచూ శ్రీ దర్గాస్వామివారికి ఫోను చేస్తూండేవాడు. ఒకరోజు అతని తండ్రిగారు అతనికి ఫోను చేసి, ఉపనయనానికి ఫలానా రోజు మంచి ముహూర్తమని, దాన్ని నిర్ణయించారని చెప్పారు. ఆ రోజు దర్గాస్వామివారికి ఈ విషయం చెపుదామని సాయి ఫోను చేస్తే టెలిఫోను లైను కలవలేదు. కానీ ఆ రోజు రాత్రి సాయి కలలో అతను స్వామి

దగ్గరకి వెళ్ళి 'స్వామీ! ఫలానారోజు ముహూర్తం మంచిదని నాకు ఉపనయనం నిర్ణయించారు' అని చెపితే స్వామివారు "అదేమీ గట్టి ముహూర్తం కాదు. మామూలుదే" అని రెండు మూడుసార్లు చెప్పారు. స్వప్నం అంతరించింది. ఇది జరిగిన మూడవరోజు సాయివాళ్ళ నాన్నగారు ఫోను చేసి అతనితో 'ముహూర్తం పెట్టిన శాస్త్రిగారు మరలా వచ్చి ముహూర్తానికి పెట్టింది శుభనక్షత్రమే అయినా తారాబలం కుదరలేదని చెప్పి ఇంకొక రోజు నిర్ణయించారు' అని చెప్పారు. శ్రీ దర్గాస్వామివారు సర్వజ్ఞులు కానిదే ముహూర్తం పెట్టిన సంగతి సాయి సుబ్రహ్మణ్యం చెప్పకుండానే, అతనికి స్వప్నదర్శనమిచ్చి ముహూర్తబలం గురించి చెప్పలేరు. సర్వప్రేరణాధికారిగా ముహూర్తం పెట్టిన శాస్త్రిగారిని దిద్దుకునేటట్లు చేసినారు. స్వప్నదర్శనమిచ్చి వారి సామర్థ్యాన్ని, ప్రేమను ఎరుకపరచిన ఆ సర్వసమర్థునికి హృదయపూర్వక నమస్కారములు.

ఆశ్రమంలో సేవచేసే శంకరయ్యను స్వామి ఒకరోజు తెల్లవారుఝామున 4 గం॥లప్పుడు నిద్రలేపి "దొంగలు పడ్డారు, లేవరా హుండీ ఎత్తుకు వెళుతున్నారు, లాంతరు వేసి చూడు" అని చెప్పారు. శంకరయ్య లాంతరు వెలిగించి అంతా వెతికి హుండీ భద్రంగానే ఉందని గమనించాడు. తదుపరి కొద్దిరోజులకి శంకరయ్యకు తన పూర్వపు గురువుగారి సమాధి మందిరంలో దొంగలు పడి హుండీ ఎత్తుకెళ్ళారని తెలిసింది. అది కూడా స్వామి తనను నిద్రలేపిన రోజునే జరిగిందని శంకరయ్య తెలుసుకున్నాడు. ఈ లీల ద్వారా స్వామి సర్వజ్ఞులనీ, తమనాశ్రయించిన భక్తులకు విశ్వాసాన్ని చిత్రమైన రీతిలో ఎలా దృఢపరుస్తారో తెలుస్తోంది.

స్వామి తమ భక్తులు ఎవరైనా గర్భవతులుగా ఉండి ప్రార్థన చేస్తే వారి పట్ల విశేషమైన శ్రద్ధ కనపరిచేవారు. దర్గాలోనూ, దర్బార్ సాయిమందిరంలోనూ తీర్థం ఇచ్చేటప్పుడు మూడు నెలలు నిండిన గర్భవతులకు రెండుసార్లు ఇచ్చేవారు. ఒకసారి తీర్థం ఆ తల్లికి, రెండవది గర్భంలో ఉన్న బిడ్డకు అని చెప్పేవారు. గర్భధారణ అయినాక దంపతులు ఇద్దరూ వచ్చి 5వ నెల లోపల కనీసం ఒక్కసారి దర్శనం చేసుకోమని సూచించేవారు. ప్రసవం అయ్యేదాకా తల్లిబిడ్డల ఆరోగ్యం

పట్ల బాధ్యత వహించేవారు. బిడ్డ పుట్టినాక మూడు నెలలలోపు ఒక్కసారైనా తీసుకురమ్మని చెప్పేవారు. ఈ మూడునెలలలోపు మొదటి దర్శనం కష్టతరమైనా, దాని వలన బిడ్డలకు విశేషమైన మేలు జరిగేది. అట్లాగే మొదటి రెండు సంవత్సరములలో పసిపిల్లలను ఆశ్రమానికి తీసుకువెళ్ళటం వలన వారిలో ఎదుగుదల విశేషంగా కనపడేది.

వీరప్రతాప్ భార్య గర్భిణిగా వుండి ప్రసవం సమయమప్పుడు అమ్మయ్యను తలుచుకున్న 2ని॥లలో డెలివరీ అయ్యింది. తర్వాత దర్గాస్వామి కలలో కనిపించి అమ్మయ్యే డెలివరీ చేయించింది అని చెప్పారు. కొన్ని సంవత్సరాల తర్వాత ఒక సాయంత్రం వీరప్రతాప్ దంపతులు ప్రగతినగర్ స్కూలుని బయట నుండి చూసి, వారి అమ్మాయిని ఆ స్కూలులో చేర్పిస్తే బాగుంటుంది అనుకున్నారు. కానీ స్వామి కలలో కనిపించి చెప్పలేదు కదా అని అనుకున్నారు. ఆ రోజు రాత్రి స్వామి కలలో కనిపించి "బుజ్జమ్మను ప్రగతినగర్ స్కూల్లో చేర్పించండి, బాగుంటుంది" అని చెప్పారు.

దర్గాస్వామి వీరప్రతాప్ భార్య కలలో కనిపించి ఒక ఇల్లు చూపించి దాన్ని కొంటారని చెప్పారు. అలానే వారు 2 నెలలకి ఆ ఇంటిని కొన్నారు. స్వామికి సమర్పణ చేసినవారు ఎక్కడవున్నా ఎల్లవేళలా వారి ఆలోచనలు స్వామి గమనిస్తుంటారు. వారికి సరైన మార్గదర్శనం చేస్తూంటారు. స్వప్నంలో సద్గురు దర్శనం కేవలం ఆ సద్గురుకృప వలన మాత్రమే జరుగుతుంది. స్వప్న దర్శనం ప్రత్యక్షదర్శనంతో సమానము!

దమ్మపేట దారా నాగేశ్వరరావుగారు 1994లో ఆశ్రమానికి వెళ్ళినప్పుడు స్వామివారు నాగేశ్వరరావుగారిని శ్రీ గురుచరిత్ర గ్రంథాన్ని ఒక చోట తెరవమన్నారు. వారు తెరిచిన చోట 10వ అధ్యాయంలో వల్లభేశుడిని దొంగలు చంపబోతే శ్రీ శ్రీపాదులవారు రక్షించిన సన్నివేశం వచ్చింది. దీన్ని నిత్యం శ్రద్ధగా పారాయణ చేస్తుండమని చెప్పారు. నాగేశ్వరరావుగారు అలాగే చేస్తూ వచ్చారు. 1996వ సం॥లో వీరు శ్రీ పాదస్వామివారి దర్శనార్థం కురువపురం పోతూ కృష్ణానదిని బుట్టపడవలో దాటవలసి వచ్చింది. బుట్టపడవ నది మధ్యలోకి వెళ్ళేసరికి బుట్టకు రంధ్రం పడి నీళ్ళు బుట్టలోకి వచ్చేస్తున్నాయి. బుట్టపడవ

నడిపేవాడు 'బుట్ట మునిగిపోతుంది, అందరూ నదిలో దూకెయ్యండి, ఈత వచ్చినవాళ్ళు ఒడ్డుకు చేరుతారు అని' అరుస్తూ తాను నీటిలోకి దూకేశాడు. అతని తోటి మిగిలిన అందరూ దూకేశారు. కానీ ఒక ఆడమనిషి, పదిహేను సం॥ల వయస్సుగల ఆమె కుమార్తె, నాగేశ్వరరావుగారు ఈత రానందున బుట్టలో వుండిపోయారు. నిమిషంలో బుట్ట ప్రక్కకు ఒరిగిపోయి నాగేశ్వరరావు నీటిలో వున్నారు. ఆయన ప్రాణభీతిచే తనను రక్షించమని శ్రీ పాదస్వామిని ప్రార్థిస్తూ బిగ్గరగా అరుస్తున్నారు. బుట్టవాడు అందులో ఉన్న ఆమెను రెక్క పట్టుకొని ఒడ్డుకు తీసుకుపోతున్నాడు. ఈలోగా నదిలో తేలుతున్న బొగ్గులమూట దొరికినందున దాన్ని నాగేశ్వరరావుగారు పట్టుకున్నారు. ఆ మూట ఒక బండకు తగిలి ప్రవాహంలో కొట్టుకుపోకుండా ఆగింది. అది అలా ఆగకుంటే వారు ఆ ప్రవాహంలో కొట్టుకుపోయేవారే! బుట్టవాడు వచ్చి వారిని ఒడ్డుకు లాక్కుపోయాడు. ఈ ప్రమాదంలో 15 సం॥ల అమ్మాయి చనిపోయింది. శ్రీ దర్గాస్వామివారు 2 సంవత్సరాలకు ముందే శ్రీ శ్రీపాదులవారి దగ్గర ఈ ప్రమాదం జరుగుతుందని తెలిసే వల్లభేశుని వృత్తాంతం నిత్యం పారాయణ చేయమన్నారు. మానవాకారం ధరించిన దైవమే శ్రీ దర్గాస్వామివారని నాగేశ్వరరావుగారి దృఢనమ్మకము

1994 ఆగస్టు 27వ తేదీన దమ్మపేట తొండెపురాజుగారు శ్రీ స్వామివారి దర్శనానికి వెళ్లినప్పుడు స్వామి "ఏరా! నాకు రోజూ పాలు పోస్తావా?" అని అడిగారు. ఆయన పోస్తాను స్వామీ! అని చెప్పారు. శ్రీ స్వామివారు "నీవు పాలు పోయవురా. నీళ్ళే పోస్తావు" అని అన్నారు. ఆయన ఇంటికి వెళ్ళిన రోజు నుండీ రోజూ ఒక గ్లాసు పాలు శ్రీ స్వామివారికి నైవేద్యం పెట్టేవారు. అలా రెండు సంవత్సరాలు చేసి తర్వాత అశ్రద్ధ వలన పాలు పెట్టడం మానేసి కేవలం గ్లాసుడు నీళ్ళు పెట్టడం మొదలుపెట్టారు. రాజుగారు శ్రీ స్వామివారి వద్ద కొస్తూనే "ఏరా! నాకు పాలు పోయట్లేదు. నీళ్ళే పోస్తున్నావు గదా!" అన్నారు స్వామి. 1994 ఆగస్టు 27వ తేదీన శ్రీ స్వామివారన్న మాట యథాతథంగా జరిగింది. సాధారణంగా ఇళ్ళలో భగవంతునికి శాస్త్రోక్తంగా షోడశోపచారపూజ చేయగలిగినవారు చేసుకోవటం మంచిది. పూజ

చేయటం తెలియనివారు, చేయలేనివారు కనీసం పంచోపచార పూజ (పుష్పం, ధూపం, దీపం, నైవేద్యం, ఆరతి) చేయటం మంచిది. ఈ నైవేద్యం కూడా మడితో ఇంట్లో వండుకున్న ఆహారాన్ని మొదట భగవంతునికి నివేదన చేసి, కుటుంబసభ్యులు స్వీకరించటం అన్ని విధాలా శ్రేష్టం. కారణాంతరాల వల్ల ఈ రకంగా చేయలేనివారు ఒక గ్లాసు పచ్చిపాలు, ఒక గ్లాసు నీళ్ళు భగవంతుని ముందు పెట్టే ఆచరణ కూడా మంచిదే. మంత్రయుక్త ఆచరణ చేయలేనివారు భావయుక్త ఆచరణనైనా చేయవచ్చు. పరమాత్మ భక్తుని యొక్క భావానికి మాత్రమే కట్టుబడతాడు.

వీరప్రతాప్ గారి బంధువు ఒకరు తమకి కూతురు పుట్టిన తర్వాత స్వామిని దర్శించింది. స్వామి ఆమెతో “మరలా నువ్వు కొడుకు పుట్టినాకే వస్తావు” అని అన్నారు. తర్వాత 15 సం॥లకి ఆమెకి పిల్లవాడు పుట్టాడు. అప్పుడు ఆమె స్వామిని దర్శించుకుంది.

దమ్మపేట మోహనరావుగారు చూసిన సన్నివేశం: ఎవరో భక్తులు ఏదో సమస్య విషయం అడగాలని శ్రీ దర్గాస్వామివారి దగ్గరకు నీలకంఠరావుపేట వచ్చారు. ఆ వచ్చిన వ్యక్తి ఆరోగ్యంగా వున్నాడు. కొంతకాలానికి నీకు చాలా ప్రమాదకరమైన జబ్బు చేస్తుంది, దేవుడు రక్షిస్తాడు అని స్వామి చెప్పారు. ఆ వచ్చినవారికి ఇదేమీ అర్థం కాలేదు. వారు ఇంటికి వెళ్లిన కొద్దిరోజులకు ఆయనకు మెంటల్ వచ్చినట్లు ప్రవర్తించసాగాడు. ఎంతో తెలివిగలవాడు, ఏమీ మాట్లాడకుండా ఇంట్లో ఒక మూల కూర్చోసాగాడు. వాళ్ళు చేతబడులు, స్పెషలిస్టు డాక్టర్లు, యంత్రాలు, మంత్రాలు అన్నీ చేసి విఫలమైనారు. ఆయన తల్లిగారు మాత్రం ఏమారకుండా శ్రీ స్వామివారిని స్మరించి తన కుమారుని పరిస్థితి మానసికంగా శ్రీస్వామివారికి విన్నవించుకుంటుండేది. ఒకరోజు ఆయనకు నెల్లూరు ఆస్పత్రిలో ఆపరేషన్ చేసారు. ఆయన తల్లిగారికి ఆయన మంచం చుట్టూ ఒక చంద్రబింబంలాంటి వెలుగులో శ్రీ దర్గాస్వామివారు అభయహస్తం చూపుతున్నారు. ఆ వెలుగులో శ్రీస్వామివారు ఆయన చుట్టూ తిరుగుతున్నట్లు దర్శనమైంది. తరువాత కొంతకాలానికి ఆ తల్లి నీలకంఠరావుపేటలో శ్రీ స్వామివారిని దర్శించి ఆస్పత్రిలో తన బిడ్డ మంచం

చుట్టూ తమరొక వెలుగులో అభయహస్తం చూపుతూ తిరిగారు. కనుక తన బిడ్డకు ఆరోగ్యం తమరి కృప వల్లనే చక్కపడింది అని బల్లగుద్ది చెప్పింది. శ్రీస్వామివారు ''నీవు అలా చెప్పకూడదమ్మా'' అని అనునయంగా చెప్పారు. స్వామివారే ఆమెకు దర్శనమిచ్చి నయం చేసినా, అందరి ఎదుట అలా తమ మహిమను బహిర్గతం చేయటం ఇష్టపడలేదు. శ్రీ స్వామి ''అలా చెప్పకూడదమ్మా'' అని సున్నితంగా సూచించారు. నిజమైన సత్పురుషుల లక్షణమిది. ''నేను అల్లాకు మాత్రమే బానిసను. నా నుండి ప్రకటమయ్యే లీలలన్నీ గురుకృపకు నిదర్శనమే'' అని శ్రీ శిరిడీ సాయి చెప్పిన దానికిది సరిపోయినది.

బెంగుళూరు నుండి సుధాకర్‌ని ఒక పర్యాయం స్వామి దర్గాల్లో ఉండమన్నారు. అతను ఉండకుండా బెంగుళూరుకి బయలుదేరాడు. మదనపల్లి దగ్గరకి వచ్చేసరికి అతని స్నేహితుడు ఫోను చేసి తన తమ్ముడు తప్పిపోయాడు, స్వామికి చెప్పి ఆశీస్సులు తీసుకోమని చెప్పాడు. అతను తర్వాత రోజుకు స్వామి దగ్గరకి వెళ్ళాడు. అక్కడున్న వాళ్ళు సుధాకర్‌తో స్వామి నీవు ఈ రోజు వస్తానని చెప్పారు. స్వామికి అతని స్నేహితుని తమ్ముడు తప్పిపోయాడని చెపితే స్వామి ''అతను వస్తాడు'' అని చెప్పారు. అలానే స్వామి చెప్పిన ప్రకారం అతడు వచ్చాడు.

ఒకసారి రాయచోటి అమర్‌నాథ్‌గారి అమ్మగారి చెవి కమ్మలలోని డైమండ్లు పోయాయి. ఇల్లంతా వెదికినా అవి కనిపించలేదు. వారి అమ్మగారు దాని విషయమై బాధపడినారు. ఆయన దర్గాల దగ్గరకి వెళ్ళి మనస్సులో 'ఏమిటి స్వామీ! ఈ వయస్సులో మా అమ్మను ఏడిపిస్తున్నారే? అవి దొరికితే కొంత డబ్బు దక్షిణగా అమ్మయ్యకి సమర్పిస్తానని' మ్రొక్కుకున్నారు. మ్రొక్కుకున్న రెండవరోజుకల్లా డైమండ్లు జండూబామ్ సీసాలో కనపడ్డాయి. మ్రొక్కు తీర్చాలని స్వామి దగ్గరకెళ్ళగానే వారేమీ చెప్పకుండానే ''దొరికింది కదరా! మీ అమ్మ హుండీలో వేసుకో పోరా'' అని అన్నారు. ఎల్లవేళలా తమ భక్తుల మనస్సులోని ఆలోచనలు స్వామి గమనిస్తూ, కాపాడుతుంటారనే విశ్వాసం దృఢపడింది.

ఈ అధ్యాయంలో చెప్పబడిన అనుభవాలలోని భక్తులందరూ కొన్ని సంవత్సరాలుగా స్వామితో అనుబంధం ఉన్నవారు. స్వామియందు

భక్తివిశ్వాసాలు కలవారు. స్వామి "గురువు నమ్మినవారి సొమ్ము" అని చెప్పేవారు. ఇటువంటి అనుభవాలు కలగటానికి భక్తుని యొక్క మనస్సులో స్వామి యొక్క ప్రతిరూపం నిలబడి ఉండాలి. స్వామివారు పై చెప్పిన వాటిలో ఏ పని చేసినా తమ మహత్తును ప్రకటితం చేసుకునేందుకు కాక తమ భక్తుల విశ్వాసాన్ని దృఢపరిచేందుకు, వారిని సంస్కరించి సరైన మార్గంలో నడిపేందుకు మాత్రమే నిదర్శనరూపకంగా చేసారు.



శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయినాథాయ నమః

# దైవం మానుష రూపేణ

## అధ్యాయము - 4
## సర్వవ్యాపకుడు

కారుణ్యమూర్తియైన శ్రీస్వామివారు తమను నమ్ముకున్న భక్తులు ఎచ్చట ఉండి, ఏ సమయంలో స్మరించిననూ వెంటనే వారిని చిత్రమైన రీతులలో ఆదుకుంటారు. ఈ అధ్యాయంలో స్వామివారిని తమ భక్తులు వారి ఇండ్లలో కానీ, బయట ఎక్కడనుండైనా కానీ ఆర్తితో స్మరించినా భక్తులను ఆపదల నుండి కాపాడటానికి, వారిని తగువిధంగా ప్రేరణ చేయటానికి తగు రూపాలలో దర్శనమిచ్చిన అనుభవాలు చూస్తాము.

స్వామి సందర్భానుసారం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో, స్వప్నరూపంలోనో భక్తుని చెంతకు చేరి, వారికి మార్గదర్శనం చేసి రక్షిస్తున్నారు. ఇంట్లో స్వామి పటాన్ని పెట్టుకుని ప్రార్థించిన వారికి కూడా పలుకుతున్నారు.

అమ్మయ్య సమాధి చెందిన తర్వాత ఎవరైనా భక్తులు తీర్థయాత్రలకు వెళ్తుంటే, వారికి యాత్రలో ఏమైనా అసౌకర్యం కలిగినా, ఆసరా కావలసి వచ్చినా "అమ్మా దర్గామాత! అమ్మా దర్గామాత!" అని పిలిస్తే అమ్మయ్యగారు వెంటనే వారి చెంతకు చేరి పలుకుతారని చాలాసార్లు చెప్పేవారు. దీనికనుగణంగా ఈ విషయాన్ని రూఢీ చేసే భక్తుల అనుభవాలు చాలా ఉన్నాయి.

ఒక పర్యాయం కావలి రంగారావుగారు శ్రీ స్వామివారి సన్నిధిలో ఉండగా "ఒరే రంగా! మీ ఇంటి దొడ్డి తలుపు గడియ వేయకుండానే పడుకున్నారు. అక్కడుండే సైకిల్ ఎవరైనా తీసుకుపోయినా పోతారు గదా!!" అని స్వామి అన్నారు. తెల్లవారి ఇంటికి వెళ్ళాక విచారిస్తే అది అక్షరాలా నిజమని తెలిసింది.

లక్కిరెడ్డిపల్లి టి.వి. స్టేషన్‌లో వెంకటరమణ అనే యువకుడు పనిచేసేవాడు. ఇతను తోటి ఉద్యోగస్తుల ద్వారా దర్గాస్వామిని గురించి

తెలుసుకుని స్వామిని దర్శించాడు. తర్వాతి కాలంలో చాలా సంవత్సరాలు స్వామికి సన్నిహితంగా ఉండి గురు, శుక్రవారాలలో ఆశ్రమంలో సేవ చేసాడు. దర్గాలలో గురువారం అభిషేకానికి క్రమం తప్పకుండా వచ్చేవాడు. అట్లానే శుక్రవారం అమ్మయ్య సమాథి మందిరంలో సేవ చేసుకున్నాడు. అతనికి మొదట్లో దేవుడంటే నమ్మకముండేది కాదు. స్వామి దగ్గరకు వస్తున్న కొత్తల్లో ఒక గురువారం నాడు ఆయన భార్య ఆయనని ఇంట్లో దీపం పెట్టి వెళ్ళమన్నది. దీపంలో ఏమున్నదని దీపం పెట్టకుండా దర్గాలకి వెళ్ళారు. ఆయన అభిషేకానికి నీళ్ళు అందిస్తున్నారు. స్వామి చికాకుగా "ఛ! అక్కడ పెట్టమంటే పెట్టలేదు కానీ ఇక్కడేదో అందిస్తాడట, పెడతాడట, దిగు ఇక్కడి నుండి" అని అరుస్తున్నారు. వెంటనే ఆయనకి ఇంట్లో దీపం పెట్టకపోవటం గురించి స్వామి హెచ్చరిస్తున్నారని అర్థం అయ్యింది. ఒకరోజు ఇంట్లోని క్యాలెండర్‌లో వున్న స్వామి ఫోటోకి నమస్కారం చేసి ముద్దు పెట్టుకున్నారు. తర్వాత దర్గాల దగ్గరకి వెళ్ళి గురువారం అభిషేకానికి నీళ్ళు అందిస్తుంటే స్వామి ఆయనతో "ఇప్పుడే తాకి వచ్చావు. మళ్ళీ తాకద్దు" అని ఆయన ఇంట్లో స్వామి పటానికి నమస్కారం చేసింది స్వామికి చెందినది అని హృదయగతమైంది.

సూర్యప్రకాశ్ రావుగారు పాలకొల్లు ఆడమ్స్ ఇంజనీరింగ్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేసేవారు. ఆయనకు ఒకరోజు రాత్రి విపరీతమయిన మానసిక ఆందోళన, చికాకుగా వుంది. ఎంతకూ మనస్సు ప్రశాంతపడక, నిద్రపట్టక బాధపడుతున్నారు. తీవ్రమయిన ఆ మానసిక కలవరంతోనే రాత్రి 12:00 గంటలు అయ్యింది. వారి వద్ద సద్గురు దర్గాస్వామివారి ఫోను నెంబరు వుంది. వారికి ఫోను చేసి మాట్లాడాలనిపించి, మళ్ళా వద్దనుకొని అలా కొద్దిసేపు ముందూ వెనుకాడి రాత్రి 12:00గంటల పైన ఫోను చేశారు. దర్గాస్వామి ఫోను ఎత్తి వారి వివరాలు అడిగి టైము ఎంత అని అడిగారు. వీరు చెప్పగా "ఈ టైములో నువ్వు ఫోను చేయాలా నేనే నీ వద్దకు వస్తాను" అన్నారు. మాట్లాడి ఫోను పెట్టేశాక అదేమి చిత్రమో వీరికి అసలు అంతకు ముందు అంత అశాంతిగా వున్నది కాస్తా ఏమాత్రం లేకుండా హాయిగా ఆనందంగా నిద్ర పోయారు. ఆ మరురోజు సూర్యప్రకాశ్ రావుగారి విద్యార్థి ఒకరు అనుకోకుండా

సాయిసన్నిధి గ్రంథం ఆయన ఇంటికి తీసుకువెళ్ళి ఇచ్చారు. వారు దాన్ని తెరువగానే "స్థానము - మీరున్నచోటు" అన్నపేజీ తెరువబడడం, వారు దాన్ని చదివి నిన్న రాత్రి స్వామి **"నేనే నీ దగ్గరకు వస్తాను"** అంటే ఈ విధంగా పుస్తకరూపంలో వచ్చారని సంతోషపడ్డారు.

హైదరాబాద్ రాజీవ్‌కు స్వామి ఒకసారి "నాయనా! నేను నీ ఇంట్లో ఉన్నాను" అని దృఢంగా అతని మనస్సుకు హత్తుకునేటట్లు చెప్పారు. అతనికి వివాహమైనాక మిద్దె కట్టుకున్నారు. పై నుండి క్రిందకి వచ్చే మెట్లకు రైలింగ్ ఇంకా చేయించలేదు. ఆ సమయంలో వారికి 9 నెలల మగ పిల్లవాడు ఉన్నాడు. ఒకరోజు ఆ పిల్లవాడు పాక్కుంటూ వెళ్ళి కొన్ని మెట్లు జారి సగం శరీరం మెట్లమీద ఉండి, క్రిందకు జారి ప్రమాదకరమైన పరిస్థితిలో ఉన్నాడు. ఇంతలో రాజీవ్ పిల్లవాడిని వెతుక్కుంటూ వచ్చి అక్కున చేర్చుకున్నాడు. ఈ విపత్కర పరిస్థితిని నివారించింది స్వామేనని ఇతని దృఢవిశ్వాసం. ఈ రకంగా అతనికి స్వామి చెప్పిన మాట హృదయంలో బలపడింది.

వారు మిద్దె కట్టుకున్నాక క్రిందిభాగం అద్దెకు ఇచ్చేవారు. వారికి శాఖాహారులకు మాత్రమే బాడుగకు ఇవ్వాలని భావన ఉండేది. ఒకసారి ఇల్లు ఖాళీ అయినాక రెండు నెలలైనా ఎవరూ బాడుగకు రాక మాంసాహారులకు ఇచ్చారు. రెండు సంవత్సరముల తర్వాత వారు ఇల్లు ఖాళీ చేసి వెళ్ళారు. మరలా అద్దెవారికోసం వెతుకుతున్న సమయంలో, అతని అమ్మగారు బాడుగ భాగంలో మీ స్వామి ఫోటో పెట్టవచ్చు కదా! మంచి బాడుగవారు తొందరగా దొరుకుతారేమో! అని యధాలాపంగా అన్నారు. రాజీవ్ వారి తల్లిగారు చెప్పినట్లు చేసారు. చాలా తక్కువ సమయంలో ఒక మంచి కుటుంబం వారు ఇంట్లో అద్దెకి దిగారు. రాజీవ్ వారికి గురువుగారి ఫోటో చూపించి, 'ఈయన మా గురువుగారు. దీనిని ఇక్కడ నుండి కదిలించకండి. మీకు మేలు జరుగుతుంది' అని చెప్పాడు. తర్వాతి కాలంలో రెండు సంవత్సరములు ఉండాలనుకున్నవారు తొమ్మిది నెలల్లోనే కొత్త ఇల్లు కొనుక్కొని వెళ్ళారు. ఈ తొమ్మిది నెలల్లో ఆ అద్దెకి తీసుకున్న కుర్రవానికి కొత్త ఉద్యోగం వచ్చి, జీతం బాగా పెరిగింది. ఇంట్లోకి చేరే ముందర అతని భార్య గర్భవతి. ఇంట్లో చేరినాక మగ

పిల్లవాడు పుట్టాడు. అతని తండ్రికి గుండె ఆపరేషన్ జరిగి ఆరోగ్యం పుంజుకున్నాడు. అద్దెకి చేరిన కొంతకాలం తర్వాత అతని మామగారు ఇంటికి వచ్చి ఫోటోలో ఉన్న దర్గాస్వామివారిని గుర్తుపట్టారు. ఆయన శాస్త్రీయ సంగీతం పాడే బాలార్కగారి బాబాయి.

పరిచయ సంవాదంలో బాలార్కగారి బాబాయిగారు రాజీవ్‌తో పంచుకున్న అనుభవం: ఒకసారి స్వామి నెల్లూరులో ఉండగా ఆయన మొదటిసారి స్వామి దర్శనం చేసుకున్నారు. అప్పటికి ఆయన తండ్రిగారు కాలం చేశారు. స్వామి ఆయనను చూడగానే ఒక పాట చాలా మార్దవంగా పాడారు. అది విని ఆయన ఉద్వేగపడ్డారు. ఎందుకంటే ఆ పాట వారి తండ్రిగారు ఆయన చిన్నతనంలో నిద్రపుచ్చటానికి పాడేవారు. ఈ పాటను స్వామి యాదృచ్ఛికంగా పాడారా?

బెంగుళూరు నివాసి నరేంద్రగారు ఆశ్రమంలో జరిగే అన్ని వైదిక కార్యక్రమాలకు బ్రహ్మగా వ్యవహరిస్తారు. ఈయన నవీన అలంకార శాస్త్రము, న్యాయశాస్త్రాలలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసారు. కృష్ణయజుర్వేద సంహిత, స్మార్తం అధ్యయనం చేసారు. 1970వ దశకం నుండి వారి తల్లిదండ్రులు ఆశ్రమానికి వచ్చేవారు. నరేంద్రగారి తల్లిదండ్రుల పేర్లు నరసింహులు, నాగమణమ్మ గార్లు.

నరేంద్రగారు ఒక పర్యాయం ఆశ్రమంలో ఉండగా స్వామి దర్గాలో ఒక స్విచ్ వేసి రమ్మన్నారు. దర్గాలో ఒక పది లైట్లు పైన ఉంటాయి. దర్గా పక్కన ఉన్న చేతి పంపుకి ఒక మోటారు అమర్చి ఉంటుంది. ఇవన్నీ కలుపుకుని దర్గాలో ఉన్న స్విచ్‌బోర్డులో పదిహేను, ఇరవై స్విచ్‌లు ఉంటాయి. నరేంద్ర దర్గాలోకి వెళ్ళినాక, స్వామి ఖచ్చితంగా ఏ స్విచ్‌లు వేయమన్నారో గుర్తులేక అన్ని స్విచ్‌లు వేసి వచ్చాడు. ఆశ్రమంలో వచ్చినాక స్వామి “ఏమి స్వాములు! ఒక స్విచ్ వేసి రమ్మంటే అన్ని స్విచ్‌లు వేసి వచ్చారు” అని అడిగారు. ఈ అనుభవం గుర్తు చేసుకుని నరేంద్రగారు ‘స్వామి దర్గాలోకి రాలేదు కదా! నేను అన్ని స్విచ్‌లు వేసిన సంగతి ఆయనకి ఎలా తెలిసింది?’ అని ఆశ్చర్యపోయారు.

1991లో ఒక పర్యాయం నరేంద్ర తల్లిదండ్రులతో ఆశ్రమానికి వెళ్ళారు. అప్పటికి నరేంద్రకు 19 సంవత్సరాలు ఉండేవి. ఆ సమయానికి

దర్గానుండి రామాపురానికి రోడ్డులేదు. ఆశ్రమం నుండి నీలకంఠరావుపేట మీదుగా మెయిన్ రోడ్డుకి వెళ్ళి, అక్కడనుండి రామాపురానికి వెళ్ళవలసి వచ్చేది. ఇది 6-8 కిలోమీటర్ల దూరం ఉంటుంది. నరేంద్ర తండ్రిగారికి ఊపిరితిత్తుల సమస్య వలన కొన్ని సందర్భాలలో శ్వాస సరిగ్గా ఆడేది కాదు. దానికి మందు వాడవలసి వచ్చేది. ఆశ్రమానికి వెళ్ళినాక నరసింహులుగారికి శ్వాస సమస్య వచ్చి నరేంద్ర మందు తీసుకురావలసిన పరిస్థితి ఏర్పడింది. ఆశ్రమం బయటకు వచ్చి కొద్దిదూరం నడిచినాక నరేంద్రకు ఒక వ్యక్తి సైకిల్ మీద తటస్థపడి, ఆయనను విచారించి రామాపురం తీసుకుపోయినాడు. కావలసిన మందు కొన్నాక తిరిగి ఆశ్రమానికి తీసుకువచ్చి దించాడు. ఆశ్రమంలోనికి వెళ్ళాక స్వామి "ఏం నాయనా! సైకిల్లో తీసుకుపోయినారా?" అని అడిగారు. ఈ సంఘటన జరిగిన చాలా సంవత్సరాలకు గానీ నరేంద్రకు, ఆ సమయానికి ఆ వ్యక్తి ఎందుకు వచ్చాడో? ఆయన అడగకుండానే విచారించి రామాపురానికి ఎందుకు తీసుకువెళ్ళాడు? స్వామి అంత నిర్ధారణగా సైకిల్లో వచ్చి తీసుకువెళ్ళారా అని ఎలా అడిగారు? అనేది స్ఫురించలేదు.

ఒక పర్యాయం నరేంద్రగారు ఆశ్రమానికి వెళ్ళగా స్వామి "నువ్వు వస్తున్నావని మీ అమ్మయ్యకు ముందరే చెప్పాను నాయనా!" అని అన్నారు. అప్పట్లో మందిరంలో సాయినాథునికి స్వామి, అమ్మయ్యలే వస్త్రాలు మార్చేవారు. అమ్మయ్య స్వయంగా వంట చేసి పెట్టగా స్వామి నరేంద్రకు భోజనం వడ్డించి పెట్టారు. భోజనం చేసే సమయానికి మధ్యాహ్నం రెండు గంటలు కాగా నరేంద్ర 'స్వామి! చాలా ఆలస్యమైంది, మీరు భోజనం చేయరా?' అని అడిగారు. స్వామి "ఇప్పటిదాకా తిన్నది ఎవరు రా?" అని అడిగారు. ఇది జరిగిన చాలాకాలం తర్వాత నరేంద్ర, అందరిలో ఉండే చైతన్యమే స్వామి, అని గ్రహించారు.

రాజీవ్ 2001 తర్వాత స్వామి ఆనతి మేర దర్గాల్లో 1, 2 రాత్రులు నిద్దుర చేయసాగినాడు. దర్గానుండి హైదరాబాదు తిరుగు ప్రయాణంలో రాత్రి 7గం॥లు దాటితే కడప నుండి దర్గాకు చేరుకోవడంగానీ, దర్గాలనుండి కడపకు చేరుకోవడంగానీ కొంచెం కష్టతరంగా దాదాపు

1 గంట నుండి 2 గంటలు పడుతూండేది. స్వామి అతన్ని ఆశ్రమానికి ఎప్పుడు వచ్చినా తిరుగు ప్రయాణానికి రిజర్వేషన్ చేసుకోకుండా రమ్మని చెప్పారు. సాధారణంగా స్వామి సాయంత్రం ఆరతి అయిన తర్వాత భోజనం చేసి బయలుదేరమనేవారు. అంటే బయలుదేరే సమయానికి సుమారు 7గం॥30ని॥ లేదా 8గం॥ అవుతుంది. ఎన్నిసార్లు స్వామి దర్శనానికి వచ్చారో, అన్నిసార్లు స్వామి క్షేమంగా, సుఖవంతంగా ప్రయాణం చేయించారు. వాటిల్లో మచ్చుకు కొన్ని అనుభవాలు.

ఒకసారి రాజీవ్ సాయంత్రం ఆరతి తర్వాత భోజనం ముగించుకుని రామాపురం చేరేసరికి సుమారు 8 గంటలయ్యింది. గువ్వలచెరువు వద్ద ఘాట్‌రోడ్డులో ఒక పెద్ద వాహనం అడ్డంగా పడిపోయి ట్రాఫిక్ జామ్ అయ్యిందనీ, రాయచోటి నుండి కడపకి బస్సులు తిరగట్లేదని తెలిసింది. ఈ పరిస్థితులలో కడప ఎలా చేరగలమా అని ఉద్విగ్నత, ఆలోచనలతో రోడ్డు మధ్యలో నిలబడి చూస్తుండగా ఒక యువకుడు బైకుమీద వచ్చి కడపకు వస్తారా అని అడిగాడు. ఆశ్చర్యంతో స్వామికి కృతజ్ఞతలు చెప్పుకొని బైకు ఎక్కాడు. ఒక పెద్ద పెట్రోలు ట్యాంకరు అడ్డంగా పడిపోయి 2, 3 కి.మీ. ట్రాఫిక్ జామ్ అయ్యింది. అప్పటికే క్రేన్లు, పోలీసులు వుండటం చూసి సుమారు 3,4 గంటల క్రితం అలా జరిగి వుంటుందని తెలిసింది. ఆ మోటారుబైకు నడుపుతున్న యువకుడు రాజీవ్‌ను కడపలో సరైన సమయానికి దించాడు. రాజీవ్ అడగకుండా అతనిని అడిగి ఎక్కించుకున్న ఆ యువకుడు ఎవరు? అతనికి ఆ ప్రేరణ కలిగించినది ఎవరు?

ఇంకొకసారి కడప చేరిన తర్వాత ప్రయాణికుల రద్దీ వలన ఏ ట్రావెల్సు బస్సులోనూ సీటు దొరకలేదు. ఇదేమిట్రా భగవంతుడా! అని కొంత అయోమయంగా చూస్తున్న సమయంలో స్వామి భక్తుడు శివరామకృష్ణ రెడ్డిగారు కనపడ్డారు. రాజీవ్ ఆయనతో మాట్లాడుతూ తన ప్రయాణం సంగతి చెప్పాడు. ఆయనతో పాటు వున్న యువకుడు సీటు ఏర్పాటు చేస్తానని చెప్పి పది నిమిషాలలో వచ్చి డ్రైవరు క్యాబిన్‌లో వున్న బెర్తు ఇప్పించాడు. రాజీవ్ ఆ బెర్తుపైన ప్రయాణం అసౌకర్యంగా ఉంటుందేమో అనుకున్నాడు కానీ ఏమాత్రం ఇబ్బంది లేకుండా

హాయిగా నిద్రపట్టి ప్రయాణం సుఖంగా జరిగింది. తన ఈ ప్రయాణాలలో అంతర్గతంగా స్వామే నడిపిస్తున్నారన్న విశ్వాసం రాజీవ్‌కి దృఢపడింది. స్వామి చెప్పిన మాట ప్రకారం నడుచుకుంటే అన్నివిధాలా మన శ్రేయస్సు స్వామి బాధ్యత.

1953 తర్వాత స్వామి, అమ్మయ్యలు దర్గాలో నివసించటం మొదలుపెట్టాక నెమ్మదిగా భక్తులు రాసాగినారు. అట్లా మొట్టమొదట వచ్చిన వారిలో రామ్మూర్తిగారు ఒకరు. వీరు బ్రాహ్మణులు. వృత్తిరీత్యా లాయరు. కడప వన్‌టౌను పోలీసుస్టేషన్ దగ్గరలో వున్న బ్రాహ్మణవీధిలో నివాసముండేవారు. వీరిని "అమ్మయ్య తొట్టతొలుత బిడ్డ" అని స్వామి చెప్పేవారు. అప్పట్లో రామ్మూర్తిగారు పరమహంస యోగానందగారి వల్ల ప్రభావితులై వారి మార్గంలో సాధన చేయాలనుకునేవారు. పరమహంస యోగానందగారు 'యొగోదా సత్సంగ సమాజం'ను స్థాపించినారు. అది అప్పటి బీహారు రాష్ట్రంలోని రాంచీలో ఉన్నది. వారి మార్గంలో నడవాలంటే ఆ కాలంలో వారి సమాజంలో క్రియాయోగ దీక్ష తీసుకోవాలి. అలా దీక్ష తీసుకోవటానికి రామ్మూర్తిగారు, ఆయన భార్య రాంచీ వెళ్ళినారు. మరునాడు దీక్ష ఇస్తారనగా రామ్మూర్తిగారి భార్య కొంత ఉద్వేగానికిలోనై మనస్సులో స్వామిని ప్రార్థన చేసింది. ఆ రాత్రి ఆవిడకు స్వప్నంలో స్వామి వివరంగా క్రియాయోగ దీక్షలోని విషయాలు చెప్పినారు. మరునాడు దీక్షను ఇచ్చే అతను క్రితం రాత్రి స్వామి చెప్పిన విషయాలే చెప్పాడు. రాంచీ నుంచి ఇంటికి తిరిగి వచ్చాక ఆశ్రమానికి వెళితే స్వామి నవ్వుతూ "అమ్మా! ప్రార్థన చేసావు కదా!" అన్నారు. ఈ విధంగా తనను నమ్మిన భక్తుల విశ్వాసాన్ని దృఢపరిచారు.

చిన్మయామిషన్ స్వామి చిదాత్మానందగారి మాటల్లో 'నాకు దర్గాస్వామి ఎల్లప్పుడూ అంతటా అన్నింట్లోనూ వున్నారు. ఆయన సాక్షాత్తు పరమాత్మ స్వరూపము. స్వామి ప్రేమ, కరుణ అనంతము. ఆయన మనపట్ల వహించే సంరక్షణకి హద్దే లేదు. ఆయన మనందరినీ ఎల్లవేళలా నడిపిస్తున్నారు. ఆయన తన కరుణను ఎప్పుడైనా ఎక్కడైనా కురిపించగలరు.

2016-2017లలో ఒకసారి చిదాత్మానందగారి 90 ఏళ్ళ నాన్నగారు నిలుచున్న చోటే క్రింద పడిపోయారు. పెద్ద దెబ్బ తగిలింది. చిదాత్మానందగారు వెంటనే దర్గాస్వామిగారికి ఫోను చేసారు. స్వామి ''ఏమీ అవదు, నేను చూసుకుంటాను'' అని చెప్పారు. డాక్టర్లు సి.టి.స్కానింగ్, ఎక్స్రే మిగిలిన పరీక్షలు చేసిన తర్వాత ఏమీ ప్రమాదం లేదు, అంతా బాగుంది అని చెప్పారు. అది స్వామి కరుణ కాక ఏమి అవుతుంది?

చిదాత్మానందగారి అమ్మగారికి ఆపరేషన్ జరుగుతున్నప్పుడు స్వామి కనపడ్డారు. ఆయన అంతా చూసుకుంటాను అని చెప్పారు. అలానే వారి అమ్మగారు త్వరగా కోలుకుంది.

ఎంతోమంది వారి వారి మనోభీష్టాలు స్వామి సంకల్పం, ఆశీస్సుల వల్ల పొందుతున్నారు. స్వామి ఎవరి ద్వారా అయినా పని చేయించగలరు. స్వామి ఎప్పుడూ మనకి మనలో వున్న భగవంతుడిని గుర్తు చేస్తూ వుంటారు. స్వామి కాల, స్థల, కోరికలకు అతీతుడు.

నెల్లూరు జిల్లా జె.వి.నారాయణమూర్తిగారి కోడలు బాలార్కగారు శాస్త్రీయ సంగీతం పాడతారు. మొదటిసారి స్వామిని చూడటానికి వెళ్ళినప్పుడు నారాయణమూర్తిగారు ఆవిడను స్వామి సమక్షంలో కీర్తనలు పాడమన్నారు. దర్గాబాబా అంటే ముస్లిమేమో కదా, ఆయనకు సంగీతంలో ఏమి అభిరుచి వుంటుంది అనుకున్నారు. స్వామి దగ్గర కూర్చున్నాక ''ఏమి కావాలి?'' అని అడిగారు. కొద్దికాలం క్రితం బాలార్కగారి నాన్నగారు చనిపోయారు. ఆవిడ స్వామితో 'మా నాన్నంటే ఇష్టం. నా చిన్నప్పుడే ఆయన వెళ్ళిపోయారు' అన్నారు. ''అలా ఎందుకు బాధపడతావు, నాలో మీ నాన్నను చూసుకో'' అన్నారు. ఆ మాట వినగానే బాలార్కగారికి ఉద్వేగం కలిగింది. ఆవిడ సంగీతం పాడతారనగానే 'గీతార్థము-సంగీతార్థము' అనే పాట వచ్చా? అని అడిగి, ఇంకా రెండు పాటలు అడిగి పాడించుకున్నారు. దీనికి ఆమె చాలా ఆశ్చర్యపోయారు. మధ్యాహ్నం భోజనాలు అయిన తర్వాత మళ్ళా పిలిపించి ''ఎంత వేడుకుందు రాఘవా'' అనే కీర్తన పాడించుకోవాలి అన్నారు. ఆమెకు ఆ కీర్తన, పల్లవి-అనుపల్లవి మాత్రమే గుర్తు వున్నాయి. చరణం గుర్తు లేదు.

అవి కాకుండా ఇంకొక రెండు కీర్తనలు పాడారు. కానీ స్వామి పట్టుపట్టి "ఎంత వేడుకుందు రాఘవా" పాడాలి అన్నారు. ఆమె మనస్సులో 'ఇంత ఇబ్బంది పెడుతున్నారే' అని అనుకుంటూ కీర్తన ప్రారంభిస్తే ఆమెకు ఏ రెండు లైన్లు గుర్తు లేవో అవి స్వామి అందించారు. ఆమె ఆశ్చర్యపోయారు. **స్వామికి సంగీతము కూడా కరతలామలకమే.** స్వామి ఆశీర్వదిస్తూ "నీవు మంచి స్థాయికి వెళతావు. ఎప్పుడు కచేరీకి వెళ్ళినా నన్ను తలుచుకొని వెళ్ళు, కొంచెం మజ్జిగ చుక్క త్రాగి వెళ్ళు" అన్నారు.

ఒకసారి దసరాలకి నెల్లూరు సాయిబాబా గుడిలో కచేరీ ఏర్పాటు చేసారు. ఆమె స్వామికి ఫోను చేస్తే ఆశీర్వదించారు. ఆ రోజు చివరి కీర్తనగా 'భో శంభో' అనే కీర్తన పాడుతుంటే ఆమెకు స్వామి ఎదురుగా పాడుతున్నాను అన్న భావనతో పాడటం వలన కచేరీ రాణింపుగా జరిగింది. ఇంటికి వచ్చి రాత్రి 11గం॥లకి స్వామికి ఫోను చేసారు. 'స్వామీ! కచేరీ అయింది' అని చెప్పారు. స్వామి వెంటనే "ఆ! నువ్వు శంభో అనే కీర్తన శివుడి మీద పాడావు. అది పాడినప్పుడు నాకైతే ఆనందంతో నృత్యం చేయాలనిపించిందమ్మా! చాలా చక్కగా పాడావు. నేనొచ్చాను. నువ్వు చూడాలేదా? నేను నీకు కనపడలేదా?" అని అన్నారు. సర్వవ్యాపకుడైన స్వామి అన్నివేళలా మనల్ని చూస్తూనే వున్నా, మనకి కొన్ని సందర్భాలలో మాత్రమే స్వామి ఎదురుగా వున్న భావన కలగటమే స్వామి రావటంగా భావించవచ్చు.

దమ్మపేట మనోజ్‌కుమార్ పొరుగింటిలో ఒకతని పదవ తరగతి సర్టిఫికేట్‌లో పేరు తప్పు పడింది. మనోజ్ హైదరాబాద్‌లో ఉన్నందున పేరు మార్పించమని అభ్యర్థించి ఆ సర్టిఫికేట్ ఇచ్చారు. మనోజ్, అతని స్నేహితునితో కలిసి పదవ తరగతి ఎస్. ఎస్. సి బోర్డుకి వెళ్ళబోతుంటే, అతని స్నేహితుడు వినాయక చవితి సందర్భంగా 'ఖైరతాబాదులో పెట్టిన వినాయకుడిని దర్శించి రేపు వెళదాం' అని చెప్పేసరికి అతను సరే అన్నాడు. అతని స్నేహితుడు రూములో ఆ సర్టిఫికేట్ పెట్టి వచ్చాడు. తరువాత వారు రూముకి తిరిగి వచ్చేసరికి, రూములో వుంటున్న మిగతా స్నేహితులు రూము మారారు. ఈ సందర్భంగా సామానులు సర్దటం వలన ఆ సర్టిఫికేట్ కనబడలేదు. వారు రెండు రోజులు వెతికినా ఆ

సర్టిఫికేట్ కనపడలేదు. స్వామికి ఫోను చేస్తే "మీ రూములో నుండి వెళ్ళిన వాళ్ళ సామానుతో పోయింది. అక్కడ వెతుకు" అన్నారు. మనోజ్ మరలా రెండు సార్లు వాళ్ళ రూములో వెతికినా, సర్టిఫికేట్ కనపడకపోయేసరికి, స్వామికి మరలా ఫోను చేస్తే "వెధవా! అక్కడే వుంది, సరిగ్గా వెతుకు" అన్నారు. తరువాత మరలా వెతికినా దొరకక పోయేసరికి, 5000 రూపాయలు పెట్టి డూప్లికేటు తెప్పించి పేరు మార్పించాడు. డూప్లికేటు వచ్చిన వారం రోజులకి రూము మారిన స్నేహితుడు ఫోను చేసి మనోజ్ వెతుకుతున్న సర్టిఫికేట్ తీసుకువచ్చి ఇచ్చాడు. ఎంత వెదికినా కనపడని సర్టిఫికేట్ అంత ఖచ్చితంగా దర్గాస్వామి చెప్పారంటే స్వామి సర్వత్రస్థితుడని, సర్వవ్యాపకుడని అర్థమవుతోంది.

వీరప్రతాప్ అత్తగారింట్లో అద్దెకు ఉండే లావణ్యగారు దర్గాస్వామి గురించి విని దర్శించాలనుకుంది. ఒకరోజు బెంగుళూరులో ఒక దేవాలయంకి వెళుతుంటే దారిలో కాషాయ వస్త్రాలు ధరించి స్వామి భౌతికంగా కనపడి మాట్లాడారు. ఈమె నీలకంఠరావుపేటకి వెళ్ళి స్వామి దర్శనం చేసుకుంది. భోజనాలు అయిన తర్వాత మనస్సులో స్కూలు దగ్గర ఎవరైనా పని చెపితే సేవ చేద్దామనుకున్నది. వెంటనే శంకరన్న పని చెప్పేసరికి చాలా ఆనందపడి సేవ చేసింది.

డా॥ శ్రీధర్‌రెడ్డిగారు ఒక స్థలం కొందామనుకుని నెల్లూరు నుండి స్వామికి ఫోను చేసి చెప్తే "అరెయ్ స్థలంలో నైరుతి పెరిగి ఉంది. చూసుకో. అలా ఉంటే బిడ్డలకి ఇబ్బంది" అని అన్నారు. విచారిస్తే అది నిజమని, ఆ యిల్లు అమ్మే ఆయన బిడ్డ చనిపోయాడని తెలిసింది.

హైదరాబాదులో నివసించే వెంకటేశ్వరరావుగారు ఆయన భార్య, కూతురికి పాసుపోర్టు దరఖాస్తు చేసుకోవటానికి పాసుపోర్టు ఆఫీసు కెళ్ళారు. పాస్‌పోర్ట్ ఆఫీసువారి నియమాల ప్రకారం ఎవరి పాసుపోర్టు దరఖాస్తు వారే చేసుకోవాలి. అందుకే పూర్తి వివరాలు నింపిన అప్లికేషన్‌లను తన భార్య, కూతురికి ఇచ్చి ఆఫీసు లోపల దాఖలు చేసి రమ్మన్నారు. కౌంటర్‌లో వున్న ఉద్యోగి అప్లికేషన్‌ను సమీక్ష చేసి వివరాలు పూర్తిగా ఇవ్వలేదని వారిమీద కోప్పడ్డాడు. దానికి బాధపడి వెంకటేశ్వరరావుగారి భార్య, కుమార్తె ఇంటికి వెళ్ళిపోదామనుకున్నారు. వెంకటేశ్వరరావుగారు వారితో 'ఒక్కసారి

దర్గాస్వామిని తలుచుకుని వెళ్ళండి' అని చెప్పారు. స్వామిని తలచుకుని తిరిగి ఆఫీసు లోపలికి వెళ్ళితే, అదే గుమాస్తా 5 నిముషాలలో అప్లికేషన్‌లో పూర్తి చేయని వివరాలు అడిగి, వారి అప్లికేషన్‌ను స్వయంగా అతనే నింపి తీసుకున్నాడు.

ఒకసారి నెల్లూరు జిల్లా గంగపట్నం నుండి ఉమామహేశ్వరరావుగారు ఆయన స్నేహితులతో స్వామి దర్శనానికి మారుతీ వ్యాన్‌లో బయలుదేరారు. దామరమడుగు సమీపంలోకి వచ్చాక వేగంగా వెళ్ళుతున్న వారి వ్యాన్ అదుపు తప్పి, రోడ్డు ప్రక్కనున్న కాలువలో పడిపోయింది. ఆ కాలువ రోడ్డుకి 5,6 అడుగుల లోతులో ఉంది. కాలువ నీటిలో వ్యాన్ సగం మునిగింది. ఇంత జరిగినా కానీ వ్యాన్‌లో వారెవ్వరికీ ఏ దెబ్బా తగల్లేదు. ఇది ఏదో కాకతాళీయంగా జరిగిందనుకుని ప్రమాదం జరిగిన తర్వాత వారు లేస్తుంటే ఒక సాధువు కనపడి "మీరు కడపకి వెళ్ళుతున్నారు కదా!" అని అడిగారు. వారు ఔనని చెప్పగా "మీకేమీ కాదు" అని అదృశ్యమయినాడు. అప్పటికి కానీ వారికి దెబ్బ తగలకపోవటం స్వామి కృప అని గుర్తించలేకపోయారు. ఆ సాధువు అదృశ్యమవకుంటే, వారు స్వామే రక్షించాడని గుర్తించలేకపోయేవారు.

ఒకసారి నెల్లూరు నుండి ఒక భక్తుడు స్వామి దగ్గరకి వెళ్దామని నెల్లూరు కృష్ణారెడ్డిగారిని ఉదయం 5గంటలకి కారు తీసుకురమ్మన్నారు. ఆ రోజుల్లో కృష్ణారెడ్డిగారు నెల్లూరు నుండి ఎవరైనా భక్తులు ఆశ్రమానికి రావాలంటే కారులో తీసుకుని వచ్చేవారు. ఆ రోజు కొన్ని కారణాల వలన ఆలస్యమై వారు ఉదయం 7గం॥ 30ని॥లకి బయలుదేరగలిగారు. ఎట్లాగైనా మధ్యాహ్న ఆరతికి వెళదామని ఆ భక్తుడు అనడంతో కృష్ణారెడ్డిగారు వ్యానుని వేగంగా పోనిస్తున్నారు. మైదుకూరు అవతల 15 కి.మీ. సింగిల్ రోడ్డు వుంది. అకస్మాత్తుగా 7,8 సం॥ పిల్లవాడు రోడ్డుకి అడ్డంగా రావటం, వ్యానుకి గుద్దుకోవటం, ఎగిరి అవతల పడటం రెప్పపాటులో జరిగిపోయాయి. ఆ సమయానికి కారు గంటకి 100 కి.మీ. వేగంతో నడుస్తున్నది. కారు ఢీకొన్న దెబ్బకు పిల్లవాడు చనిపోయి వుంటాడనుకుని భయపడ్డారు. కానీ చాలా చిత్రంగా ఒక్కచోటకూడా గాయము కాలేదు, నెత్తురు లేదు. జనం పోగై డాక్టరు దగ్గరకి తీసుకు

వెళ్ళమన్నారు. డాక్టరు పరీక్ష చేసి ఇంజెక్షను వేసాడు. కొంతసేపటికి పిల్లవాడు లేచి నడవగలిగాడు. ఈ తతంగమంతా అయ్యి స్వామి దగ్గరకి వెళ్ళేసరికి మధ్యాహ్నం ఒకటిన్నర గంటయ్యింది. ఆ భక్తుడు 'స్వామీ! ఆరతికి వద్దామనుకున్నాము కానీ రాలేకపోయాము' అని అన్నాడు. స్వామి వెంటనే "దార్లో అబ్బాయి పడ్డాడు. ఆ అబ్బాయికి ఏమీ కాలేదు. **ఆ వ్యానులో ఎప్పుడూ నేనున్నాను**" అని వారు చెప్పకుండా స్వామే చెప్పారు. గంటకి 100కి.మీ. వేగంతో వెళ్ళే వ్యానుకు తగిలి చిన్న పిల్లవాడికి దెబ్బ తగలకపోవటము స్వామికృపేనని మనస్సుకు హత్తుకునేటట్లు చేసారు.

ఒకసారి కావలి చలంబ్యాల సూర్యప్రకాశరావు దంపతులు కాశీలో పంచక్రోశ యాత్రలో పడవలో ప్రయాణిస్తుంటే పడవకు చిల్లుపడి పడవలోనికి నీళ్ళు రావడం మొదలైంది. వారు పడవ మునిగి పోతుందేమోనని భయపడ్డారు. అదే సమయానికి ఎదురుగా వెళుతున్న వేరొక పడవలో స్వామివారు "నేనుండగా మీకేం భయం" అన్నట్లు అభయహస్తంతో నిలబడి దర్శనమిచ్చారు. వారి భయం తొలగిపోయింది, ఏ ప్రమాదమూ జరగలేదు.

స్వరూపగుప్తాగారి తల్లిగారు కాలం చేసినాక, వారి అస్థికలను నిమజ్జనం చేయటానికి కుటుంబ సమేతంగా కాశీకి వెళ్ళారు. అక్కడ నుండి గయ వెళ్ళి తిరిగి కాశీ రావాలి. వారు ముందుగా టిక్కెట్టు రిజర్వేషన్ చేసుకోలేదు. ట్రైను వచ్చింది కానీ కిక్కిరిసి ఉంది. నిలబడటానికి కూడా స్థలం లేదు. స్వరూపగుప్తాగారి బృందంలో చాలామంది ఉన్నారు. వారందరకీ ఆ ప్రదేశాలు కొత్త. అందరూ ఇబ్బంది పడకుండా క్షేమంగా రైలు ఎక్కటం ఎలా? అని ఆలోచిస్తూ, స్వరూపగుప్తాగారు సద్గురు దర్గాస్వామిగారిని, మాతాజీ గారిని ప్రార్థన చేసారు. ఆశ్చర్యంగా వారి వద్దకు ఒక రైల్వే కూలి వచ్చాడు. 'సార్ మీరు కాశీ వెళ్ళాలా? ఇలా ఇంతమందికి సీటు దొరకడం కష్టం. నాతో పాటు రండి' అని టిక్కెట్టు కలెక్టర్ దగ్గరకి తీసుకువెళ్ళాడు. అతను ఆ టిక్కెట్టు కలెక్టర్‌కి నచ్చచెప్పి వారికి కాశీ వెళ్ళేందుకు సీట్లు ఇప్పించాడు. వారి వద్ద నుండి పైకం ఏమీ తీసుకోకుండా వెళ్ళిపోయాడు. ఈ విధంగా వారి సుఖప్రయాణానికి ఏర్పాటు జరిగింది. గుప్తాగారి ముగ్గురు అన్నదమ్ములు యిది

శ్రీ దర్గాస్వామివారి కృపాకటాక్షమే అని దృఢంగా విశ్వసించారు.

హైదరాబాద్ చంద్రశేఖర్‌రావు, సుకన్య దంపతులకు అమర్‌నాథ్, మానస సరోవర యాత్ర చేద్దామని కోరిక ఉండేది. సుకన్యగారి ఆరోగ్యం బలహీనంగా ఉండేది. స్వామి ఆశీస్సులకై ప్రార్థించగా, స్వామి వెళ్ళి రమ్మని అనుమతించారు. డాక్టర్లు మాత్రం వెళ్ళవద్దని చెప్పారు. కానీ స్వామి అనుమతిచ్చారని వాళ్ళు ధైర్యంగా యాత్రకి వెళ్ళారు. వారికి ఎక్కడా ఏ ఇబ్బందీ కలుగలేదు. అందరికంటే సుకన్యగారు చాలా చలాకీగా ఉండి యాత్ర చేసుకోగలిగారు. యాత్రనుండి వచ్చిన తర్వాత స్వామి దర్శనానికి వెళ్ళగా, వారు యాత్రకి బయలుదేరి తిరిగివచ్చిన రోజు దాకా స్వామి విపరీతమైన కాళ్ళ నొప్పులతో బాధపడ్డారని తెలిసింది. అంటే సుకన్యగారి నొప్పులు స్వామి తమ శరీరం మీదకు తీసుకుని వారి కోరికను నెరవేర్చారు.

ఈ యాత్రలో అమర్‌నాథ్‌కి వెళ్ళే దారిలో బలిష్టంగా వున్న పూజారికి చంద్రశేఖరరావుగారు, ఆయన స్నేహితులు కలసి కొంత ఆర్థికసహాయం చేసారు. ఆ పూజారి ఒకచోట కూర్చుని ఆయనను వెళ్ళమని చెప్పారు. చిత్రంగా కొంతదూరం నడిచినాక ఆ పూజారి వీరికంటే ముందర ఇంకొక చోట కూర్చుని కనిపించారు. ఈ విధంగా రెండుమూడుసార్లు జరిగింది. ఆ కనిపించిన పూజారి ఎవరో సిద్ధపురుషుడై ఉంటాడని అనుకున్నారు.

అమర్‌నాథ్ యాత్ర చేసి తిరిగి ఇంటికి వచ్చిన తర్వాత చంద్రశేఖరరావుగారికి స్వామి దర్శనం చేసుకోవాలనిపించింది. ఒక గురువారం రోజు ఆశ్రమానికి వెళ్ళేసరికి స్వామి దర్గాలకు అభిషేకం చేస్తున్నారు. అభిషేకం అయిన తర్వాత దర్గాలకు వస్త్రాలు కప్పుతూ ఆయనను పిలిచి వస్త్రాలను కప్పేటప్పుడు పట్టుకోమన్నారు. స్వామి ప్రక్కన కూర్చుని కప్పుతున్నప్పుడు, స్వామి తనలో తాను "నీవు అమర్‌నాథ్ వెళ్ళావు. చాలా దూరం ప్రయాణం చేశావు. నేను నీకు తోడుగా వచ్చాను. పూజారిగా ఒకచోట కూర్చున్నవాడిని రెండుచోట్ల మీకంటే ముందర వచ్చి కూర్చున్నాను. ఇవాళ నన్ను గుర్తుపట్టలేదా?" అని మాట్లాడుకుంటున్నారు. ఇది గమనించి విన్న తర్వాత చంద్రశేఖరరావుగారికి స్వామి తనలో తాను మాట్లాడుకున్నది, అమర్‌నాథ్ యాత్రలో జరిగిన అనుభవం

సమన్వయపడ్డాయి. ఆయన చెప్పకుండానే స్వామి అంత స్పష్టంగా చెప్పగలిగారు అంటే స్వామి సిద్ధపురుషులని గ్రహించి అప్పటినుండి తరచూ స్వామి దర్శనం చేసుకుంటుండేవారు.

నెల్లూరు యశోదమ్మగారి పెద్దమ్మాయిని నెలలు నిండినాక ప్రసవానికి ఆస్పత్రిలో చేర్పించారు. ఏ సమయంలోనైనా ప్రసవమయ్యేటట్లు వున్నది. ఆ సమయంలో దర్గాస్వామి నెల్లూరులో వున్నారని తెలిసి, స్వామి దర్శనానికి వెళ్ళలేకపోతున్నారని యశోదమ్మగారు చాలా బాధపడ్డారు. స్వామి కృష్ణారెడ్డిగారితో ఫోను చేయించి "పురుడు తల్లికి కానీ నీకు కాదు, నువ్వు వచ్చి దర్శనం చేసుకో" అని చెప్పారు. స్నానం చేసి స్వామి దగ్గరకి వెళ్ళేసరికి స్వామి అమ్మయ్యతో "అమ్మయ్యా! యశోదమ్మ బిడ్డకి జయ, విజయులు పుట్టారు. కృత్తికా నక్షత్రం" అని చెప్పారు. ఆవిడ నమస్కారము చేసుకోగానే మీ పాపకే కాదమ్మా, మీ పాప ప్రక్క రూములో ఉన్నవారికి కూడా బాబు పుట్టాడు. వాళ్ళు వేంకటేశ్వరస్వామి భక్తులు. వేంకటేశ్వరస్వామి దగ్గరుండి డెలివరీ చేసి వెళ్ళినాడు" అని చెప్పారు. స్వామి దర్శనం తర్వాత ఆస్పత్రికి వెళ్ళి ప్రక్కరూములో నున్న వాళ్ళని అడిగితే, వాళ్ళు వేంకటేశ్వరస్వామి భక్తులమని చెప్పారు. సర్వసృష్టిలో ఎక్కడ ఏమి జరుగుతున్నదో స్వామికి ఎరుకే.

ఒకసారి గుంటూరులో భరద్వాజ తల్లిదండ్రులు కొత్తగా కొనుకున్న స్కూటర్ మీద సాయిబాబా మందిరానికి వెళ్ళారు. అక్కడ సాయినాథుని దర్శనం చేసుకుని తిరిగి వచ్చే సమయంలో ఒక వ్యక్తి అకస్మాత్తుగా వారి వద్దకు వచ్చాడు. "బండి చక్రాన్ని ఒకసారి పరీక్ష చేసుకోండి" అని చెప్పి వెళ్ళిపోయాడు. స్కూటర్ చక్రం ఉన్న పరిస్థితిలో వారు బండి నడిపి ఉంటే ప్రమాదం అయి ఉండేది. స్వామివారే ఆ వ్యక్తి రూపంలో వచ్చి, వారిని హెచ్చరించి కాపాడారని వారి విశ్వాసం. స్వామి చాలాసార్లు భరద్వాజ తల్లి కనకదుర్గమ్మగారికి ఎల్లప్పుడూ వారింట్లో ఉంటానని చెప్పేవారు.

ఒక పర్యాయం భరద్వాజ బహ్రెయిన్ నుండి నేరుగా ఆశ్రమానికి రావటానికి ప్రయాణ ఏర్పాట్లు చేసుకున్నాడు. బహ్రెయిన్ నుండి చెన్నై రావటానికి ఒక విమాన టిక్కెట్టు, చెన్నై నుండి కడప రావడానికి ఒక ట్రైన్

టిక్కెట్టు బుక్ చేసుకున్నాడు. ప్రణాళిక ప్రకారం బహ్రెయిన్‌లో విమానాశ్రయానికి వెళ్ళాడు. ఆ రోజు విమానం రెండు గంటలు ఆలస్యమని తెలిసింది. దీనివల్ల చెన్నై నుండి కడపకి వెళ్ళే ట్రైన్‌ను సకాలంలో అందుకోలేడు. భరద్వాజ ఇది ఇష్టపడనందువలన విమానసంస్థవారు అతనికి తర్వాత రోజు ప్రయాణం చేయటానికి టిక్కెట్టు సర్దుబాటు చేసారు. ఇంటికి వచ్చి అతను రైలు టిక్కెట్టు కూడా ఒకరోజు మార్చుకుందామనుకున్నాడు. ఇంతలో చెన్నైలో వరదల వలన అతను టిక్కెట్టు బుక్ చేసుకున్న రోజున రైలు కాన్సిల్ అయిందని తెలిసింది. తమాషాగా అతని విమానప్రయాణం సరైన సమయానికి జరిగి ఉంటే చెన్నైలో రైలు అందక ఇబ్బంది పడి ఉండేవాడు. వరదల వల్ల ఇతర ప్రయాణ సౌకర్యం కూడా దొరకక ఇంకా ఇబ్బంది పడేవాడు. జరిగిన సంఘటనలన్నీ నెమరువేసుకుని చూడగా ఆ విమానం ఆలస్యమవటం వల్ల అతనికి ఎంతో మేలు జరిగింది. తర్వాతరోజు అతని ప్రయాణం సౌకర్యంగా జరిగింది.

2005లో రాజీవ్ ఉద్యోగరీత్యా సౌదీఅరేబియాలో నాలుగు నెలలు పనిచేయవలసి వచ్చింది. అతను తను పనిచేసుకునే కంప్యూటర్‌లో స్వామి బొమ్మను పెట్టుకునేవాడు. ఒకరోజు అతని తోటి ఉద్యోగస్తుడు అత్యం సునీల్ స్వామివారిని బొమ్మని చూచి, గుర్తు పట్టి 'ఈయన దర్గాస్వామివారు కదా!' అని అడిగారు. రాజీవ్‌కు ఒకక్షణం రోమాంచితమైంది. ఎక్కడ ఇండియా, ఎక్కడ సౌదీ అరేబియా? దేశంకాని దేశంలో తన గురువుగారిని గుర్తుపట్టిన వైనం చూసి రాజీవ్‌కు ఉద్వేగం కలిగింది. అత్యం సునీల్‌ది దమ్మపేట స్వగ్రామం.

ఒక సిద్ధపురుషుని మొదటిసారి దర్శించినప్పుడు మనకు ఆయన గురించి ఏమీ తెలియకపోవచ్చు. అటువంటి సందర్భాలలో వారికి నమస్కరించకపోయినా దోషం లేదు. వారి సాంగత్యంలో మౌనంగా కాలం గడిపినా మనకు మేలు జరుగుతుంది. సామాన్యంగా ఒక సద్గురునియందు భక్తునికి పూర్ణమైన సమర్పణ అనేది ఒక్క దర్శనంలోనే జరగదు. సమర్పణ అనేది ఒక కాలానుగుణ ప్రక్రియ. భక్తుడు గురువు దర్శనానికి వెళ్ళే ప్రతిసారీ ఆయనకు పరీక్షే. గురువే

భక్తుని యొక్క విశ్వాసాన్ని దృఢపరిచేటటువంటి అనుభవాలను ఇస్తారు. భక్తుడు ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సాధనలో పరిణతి సాధిస్తాడు. ఈ అధ్యాయంలోని అనుభవాలను చదివినాక మన హృదయంలో స్వామి అన్నిచోట్ల అనుక్షణం తమ భక్తులను గమనిస్తూ మనను రక్షిస్తున్నారనే విశ్వాసం దృఢపడుగాక!

శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయినాథాయ నమః

# దైవం మానుష రూపేణ

## అధ్యాయము - 5
## సర్వసమర్థుడు

భగవద్గీతలో శ్రీ కృష్ణుడు శ్రద్ధాళువులైన భక్తులను నాలుగు తరగతులుగా విభజించాడు.

**చతుర్విధా భజన్తేమాం । జనా: సుకృతినో అర్జున ॥**
**ఆర్తో జిజ్ఞాసుర్ అర్థార్థీ । జ్ఞానీచ భరతర్షభ ॥**

ఈ అధ్యాయంలో ఆర్తులు, అర్థార్థులు అయిన భక్తులు భక్తిశ్రద్ధలతో వారి హృదయఫలకమున సద్గురువును నిలిపి ప్రార్థించినవారికి యోగ్యతను అనుసరించి సమంజసము, సహేతుకమైన కోరికలను తీర్చిన అనుభవాలు కూర్చటమైనది. ఈ అనుభవములు శ్రీస్వామివారి యొక్క సర్వసమర్థత్వ లక్షణమును నిరూపణ చేస్తాయి. శ్రీ దర్గాస్వామివారు ఆర్తులకు సంతానం, విద్య, ఉద్యోగం, ఆర్థికము, వివాహం మరియు ఆరోగ్యము అను ఆరు విషయములు ప్రసాదించారు. ఈ ఆరింటిలో మూడు విషయములు అమ్మయ్యగారు, మూడు విషయములు స్వామివారు భక్తులకు ఇచ్చేవారని స్వామివారు ఒక సందర్భంలో చెప్పారు.

సాధారణంగా పై ఆరు విషయాలలో స్వామిని అడిగే ముందర కనీస మానవ ప్రయత్నం చేయాలి. ఏ ప్రయత్నమూ చేయకుండా వెళ్ళి స్వామిని పెళ్ళి కావాలనో, ఉద్యోగం కావాలనో అడిగితే మందలించేవారు. కొన్ని సందర్భాలలో భక్తులు వెళ్ళి 'స్వామి, మీ ఆశీస్సులు కావాలి' అని అడిగినప్పుడు వారిని స్వామి మందలించారు. ఆశీస్సులు అడిగే ముందర ఏ విషయంలో కావాలో (ఫలానా పని చేస్తున్నాను అని చెప్పి ఆ విషయంలో) తెలియజెప్పి అడగాలని చెప్పేవారు.

## సంతానం

సాధారణంగా ఎవరైనా దంపతులు సంతానం కొరకు స్వామిని ప్రార్థిస్తే, స్వామి వారి కులదైవం ఎవరని అడిగేవారు. కొన్ని సందర్భాలలో ఒక స్త్రీ కనపడుతోంది. ఎవరు ఆమె? మీరు ఏ పేరుతో కొలుస్తారు? అని అడిగేవారు. బిడ్డ పుడితే తమ కులదైవం పేరు పెట్టుకుని, ఆయన/ఆమె పేర వెంట్రుకలు తీయిస్తామని మ్రొక్కుకోమని చెప్పేవారు.

చిన్మయామిషన్ ఉభయ తెలుగు రాష్ట్రాల అధ్యక్షునిగా స్వామి చిదాత్మానందగారు చాలాకాలంగా పనిచేస్తున్నారు. ఈ పాత్రలో ఆయన మిషన్ ద్వారా ఎన్నో సేవా మరియు ధార్మిక కార్యకలాపాలను నిర్వహిస్తుంటారు. చిదాత్మానందగారి తల్లి గారు నీలకంఠరావుపేటలో జన్మించినారు. వీరు దర్గామాతాజీగారికి బాల్య స్నేహితులు. వీరికి వివాహమైన తర్వాత సంతానం కొరకు స్వామి ఆశీస్సుల కోసం ప్రార్థిస్తే "తల్లీ! నీకు పుండరీకుడు జన్మిస్తాడు" అని ఆశీర్వదించారు. చిదాత్మగారు వారికి కలిగిన ఏకైక సంతానం. చిదాత్మగారు చిన్నతనం నుండి ఆధ్యాత్మిక ప్రవృత్తి గలవారై యుక్తవయస్సులో చిన్మయానందులవారిపట్ల ఆకర్షితులై, మిషన్‌లో చేరి సన్యసించినారు. వారు సన్యసించిన తర్వాత కూడా వృద్ధులైన తమ తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకుంటున్నారు. ఎన్నో సంవత్సరాల క్రితం స్వామివారు చెప్పిన వాక్కు ఈ విధంగా నిజమైంది.

దమ్మపేట నుండి లక్ష్మి (శ్రీనివాసుగారి భార్య) 1994 లో పెళ్ళికాకముందు దర్గాస్వామి దగ్గరకి వెళ్ళినప్పుడు, స్వామి ఆమెతో "1995లో గురుకృప కలుగుతుంది. తర్వాత నీకొక కోరిక వుంటుంది. అది నెరవేరుతుంది" అన్నారు. 1995 లో ఆమెకు పెళ్ళి అయింది. తర్వాత ఆమెకు 7సం॥ల వరకు సంతానం కలగలేదు. డాక్టర్లు పరీక్షలు చేసి పిల్లలు పుట్టరని చెప్పారు. ఆమె గొలగమూడి శ్రీ వెంకయ్యస్వామి 'మౌనబోధ' పుస్తకం 108సార్లు ప్రదక్షిణలు చేస్తూ పారాయణ చేసింది. ఒకసారి గొలగమూడి వెంకయ్యస్వామి దర్శనానికి వెళ్ళినప్పుడు, అక్కడ సత్సంగంలో శ్రీ సుబ్బరామయ్యగారితో 'సంతానం కొరకు దర్గాస్వామివారిని ప్రార్థించాలని అనుకుంటున్నాను' అని చెప్పింది. దానికి

సుబ్బరామయ్యగారు "అమ్మా! బిడ్డలు పుట్టలేదని బాధపడతాము కానీ బిడ్డలు పుట్టిన వాళ్ళందరూ బాగున్నారా? పిల్లలు పుట్టాక ఏమి ఇబ్బందులు వస్తాయో! తర్వాత వాళ్ళకోసం ఎన్ని కోరికలు కోరాల్సి వస్తుందో కదా! మనకేది మంచిదో ఆయనకి తెలుసు. అంతేగాక సరైన సమయంలో ప్రసాదిస్తారు. మనమెప్పుడూ స్వామి ఆశీస్సులను మాత్రమే అడగాల"ని చెప్పారు. ఆమెకు ఈ విషయం హృదయగతమై స్వామి దగ్గరకి వెళ్ళినప్పుడు స్వామి "ఏం కావాలని" రెండు, మూడుసార్లు అడిగినా మీ ఆశీస్సులు కావాలని అడిగింది. ఆమె ప్రార్థనతో సంతృప్తి చెందిన స్వామి అక్కడున్న వారితో ఆమెను చూపిస్తూ "మా అమ్మాయికి బిడ్డ పుడతాడని" చెప్తూ ఆమె వైపు తిరిగి "మీకు బిడ్డ పుట్టినప్పుడు మీ ఊరు వస్తాను" అని చెప్పారు.

కొంతకాలం తర్వాత సంక్రాంతి పండుగ సమయంలో ఆమె ఆరోగ్యం సరిగ్గా లేదు. కలలో ఆరోజు రాత్రి, స్వామి ఆమె పొట్ట నిమురుతూ "నువ్వు గర్భవతివమ్మా" అని చెప్పారు. డాక్టరు దగ్గరకి వెళితే ఆమె గర్భవతి అని నిర్ధారించారు. ఆమెకు సెప్టెంబరు 10వ తారీఖున ప్రసవం అవుతుందని చెప్పారు. ఆరోజు రాత్రి స్వామి కలలో కనపడి "అమ్మా! నీకు సెప్టెంబరు 3వ తారీఖున ప్రసవం అవుతుంది" అని చెప్పారు. ఆమె పారాయణ, ప్రదక్షిణలు చేసుకుంటున్నారు. సెప్టెంబరు 3వ తారీఖు మంగళవారం అయ్యింది. ఆమె చేసే గురుచరిత్ర సప్తాహ పారాయణ బుధవారం అవుతుంది కాబట్టి ఆమె దర్గాస్వామి ఫోటోకి "స్వామీ! గురుచరిత్ర పారాయణ అయిన తర్వాత నాకు ప్రసవం అయ్యేటట్లు చూడండి" అని చెప్పుకున్నారు. సెప్టెంబరు 3వ తేదీ రాత్రి నొప్పులు వచ్చి ఆగిపోయాయి. సెప్టెంబరు 4వ తేదీన ఆమె పారాయణ అయిన తర్వాత నొప్పులు మొదలయ్యి సాయంత్రానికి ఆమెకు బిడ్డ పుట్టాడు.

చిత్రంగా అదేరోజు దమ్మపేట సాయిబాబాగుడి బీరువాలో వుంచిన దర్గాస్వామి చిత్రపటాన్ని కమిటీవారు బయటకు తీసి మందిరంలో వెంకయ్యస్వామి ఫోటో ప్రక్కన వుంచారు. అదీ ఆమె అబ్బాయి పుట్టిన 10 నిమిషాలకి. ఇలా ఆవిడ బిడ్డ పుట్టిన తర్వాత స్వామే ఆమె ఊరు వస్తారన్న మాటను నిజం చేశారు.

రాజీవ్‌గారి చెల్లెలికి 2003లో వివాహం అయ్యింది. 2008 దాకా సంతానం కలుగలేదు. సంతానం కొరకు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. రాజీవ్ సూచించగా వారు స్వామి దర్శనం చేసుకున్నారు. స్వామి అతని చెల్లెలిని, బావని మరలా దర్శనానికి వచ్చేటప్పుడు ఎండు ఖర్జూరపు పండ్లు తీసుకు రమ్మన్నారు. వారు అలానే దర్శనం చేసుకున్నారు. స్వామి ఆశీర్వదించి ఆ పండ్లను తిరిగి వారికే ప్రసాదంగా చెరి సగం ఇచ్చినారు. ఒకసారి అతని చెల్లెలు, బావగారు దర్శనానికి వచ్చినప్పుడు స్వామి రాజీవ్‌తో "నాయనా! రేపు నెల్లూరు వెళ్తున్నాము. శంకరయ్యకి చెప్పి పెట్టినాను. నీవు నీ బావను అశ్వత్థ నారాయణుడికి ఒక గ్లాసు పాలు, ఒక గ్లాసు నీళ్ళు పెట్టమను, ఏమైనా అడ్డంకులు వుంటే తొలగిపోతాయి" అన్నారు. రాజీవ్ బావ అలానే చేసారు. కొంతకాలం తర్వాత స్వామి ఆశీస్సులతో వారికి ఒక ఆడబిడ్డ జన్మించింది.

కానీ 8 నెలలకే (నెల తక్కువగా) ఆడపిల్ల పుట్టింది. పుట్టిన బిడ్డ బలహీనంగా వుండి బరువు తక్కువగా వున్నది. స్వామి వాళ్ళని దర్గాలకు తీసుకువచ్చి దర్శనం చేసుకోమన్నా, బిడ్డ బలహీనంగా వుండటం వల్ల వాళ్ళు రాలేదు. రాజీవ్ వెళ్ళినప్పుడు బిడ్డ విషయం చెప్పి, అందువలన అతని చెల్లెలు వాళ్ళు రాలేదు అని స్వామికి చెప్పాడు. స్వామి వెంటనే కోపంగా "అమ్మయ్య ఆశీర్వాదంతో పుట్టిన బిడ్డ అలా ఎందుకు వుంటుంది, బిడ్డని తీసుకు రమ్మ"న్నారు. చిత్రంగా స్వామి అలా అన్న నెల రోజులకే పాపాయి ఆరోగ్యం పుంజుకుని ఒళ్ళు చేసింది.

రాజీవ్ చెల్లెలు, బావగారు స్వామి దగ్గరకు వస్తున్నప్పుడు అతను వారితో వెళ్ళేవాడు. ఒకసారి స్వామి దగ్గరకి వెళ్తూ అతను బావగారితో 'రెండు, మూడు సం॥లనుండి స్వామి దర్శనం చేసుకుంటున్నావు కదా! మీ అనుభవం ఏమిటి?' అని అడిగాడు. బావగారు చెప్తూ 'స్వామి దగ్గరకి రాక ముందర ఆఫీసులో చాలా పని ఒత్తిడి వుండి శని, ఆదివారాల్లో కూడా పని చేయాల్సి వచ్చేది. స్వామి దగ్గరకి వస్తున్నప్పటి నుండి శని, ఆది వారాల్లో చేయాల్సి రావటం లేదు. పైగా పనిలో ఎన్ని ఆటంకాలు వున్నా వాటంతటఅవే సమసిపోతున్నాయి' అని చెప్పారు.

రాజీవ్ చెల్లెలు, బావగారు స్వామి దర్శనం చేసుకున్నది సంతానం కోసం మాత్రమే. కానీ అతని బావగారి ఉద్యోగంలో వున్న అధిక పనిభారం, ఆటంకాలను కూడా స్వామి తొలగించారు. స్వామి దర్శనమే మహా భాగ్యం! మనకి ఏది శ్రేయస్సో గ్రహించి స్వామే మనకు అది ప్రసాదిస్తారని తెలుస్తోంది.

స్వామి ఒకసారి చెన్నై వచ్చినప్పుడు శ్రీకాంత్‌గారికి తెలిసిన ఒక దంపతులు స్వామితో వారికి వివాహం జరిగి 12సం॥లు అయినా కూడా సంతానం లేదని, సంతానం ప్రసాదించమని ప్రార్థించారు. స్వామి వారితో "గోకర్ణం వెళ్ళి ఇంటికి రా, చెన్నై నుండి స్వామిమలైకి వెళ్ళు, అక్కడ అర్చన చేసి ఇక్కడకి 5వ దినం వచ్చినావంటే ఖర్జూరం పంపిస్తా"మని చెప్పారు. వారు అలానే చేసారు. సంవత్సరం తర్వాత వారు బిడ్డతో స్వామి దర్శనానికి వచ్చారు.

## విద్య

దమ్మపేట మోహనరావు గారు తమ పెద్దమ్మాయిని ఇంటర్‌మీడియెట్ అయిన తర్వాత ఆశ్రమానికి తీసుకువెళ్ళారు. స్వామి ఆ అమ్మాయితో "హైదరాబాదులో చేరితే మీ నాయనకి ఎక్కువ ఖర్చు అవుతుంది, గంగారాం సాయిస్ఫూర్తి కాలేజీలో కంప్యూటర్ సైన్సు గ్రూపులో ఇంజనీరింగ్ చేరు" అని చెప్పారు. ఆ అమ్మాయి ఎలక్ట్రానిక్స్ గ్రూపులో చేరతానన్నది. స్వామి "సరే నీ ఇష్టం" అని అన్నారు. కౌన్సిలింగ్‌కి వెళ్ళినప్పుడు కంప్యూటర్ సైన్సు గ్రూపులో 2 సీట్లు, ఎలక్ట్రానిక్స్ గ్రూపులో 10 సీట్లు వుండేసరికి కంప్యూటర్ సైన్సు గ్రూపుకే ఎక్కువ డిమాండ్ వుందని కంప్యూటర్ సైన్సు గ్రూపు తీసుకున్నది. అడ్మిషన్స్ తర్వాత స్వామి దగ్గరకి వెళ్ళినప్పుడు వారేమీ చెప్పకముందే స్వామి ఆ పెద్దమ్మాయితో "కంప్యూటర్ సైన్సు గ్రూపు తీసుకోనన్నావు, మరి అదే ఎందుకు తీసుకున్నావు?" అని అడిగారు. దీనితో ఆయన సర్వజ్ఞత్వం మరియు తనను నమ్ముకున్న మోహన్‌రావుగారికి ఆర్థిక ఇబ్బంది లేకుండా చేయటం స్పష్టమౌతోంది.

ఆయన రెండవ అమ్మాయిని కూడా ఇంటర్మీడియెట్ అయిన తర్వాత స్వామి దగ్గరకి తీసుకు వెళ్ళి 'ఏమి చదివించమంటారు?' అని అడిగారు. స్వామి "బి.టెక్ చదివించు, సీటు వస్తుంది. అక్కా చెల్లెళ్ళు ఒక చోటే వుంటారు. గంగారాం సాయి స్ఫూర్తి కాలేజీలో సీటు వస్తుంది" అని చెప్పారు. 'ఏ సీటు తీసుకోమంటారు స్వామీ?' అని అడిగితే "ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ గ్రూపులో సీటు వస్తుంది" అని స్వామి చెప్పారు. తర్వాత వారి అమ్మాయికి ఎంసెట్‌లో 82,000 ర్యాంకు వచ్చింది. సాధారణంగా ఆ ర్యాంకుకు గంగారాం సాయి స్ఫూర్తి కాలేజీలో సీటు రావటం కష్టం. స్వామి దగ్గరకి వచ్చి 'స్వామీ! మీరు గంగారాం సాయి స్ఫూర్తి కాలేజీలో సీటు వస్తుందన్నారు. వారి అమ్మాయికి 82,000 ర్యాంకు వచ్చింది అ ర్యాంకుకి ఎక్కడా సీటు వచ్చే సూచనలు కనపడటం లేదు. ఎలాగ స్వామీ!' అని అడిగారు. స్వామి "సీటు వస్తుంది" అని మూడుసార్లు అన్నారు. "హైదరాబాదులో కౌన్సిలింగుకి వెళ్ళితే ఖర్చు ఎక్కువవుతుంది. గుంటూరుకి వెళ్ళు" అని స్వామి చెప్పారు.

కౌన్సిలింగ్ ముందర రోజే వెళ్ళి విచారిస్తే అప్పటికే గంగారాం సాయి స్ఫూర్తి కాలేజీలో సీట్లు అయిపోయి వారం అవుతోంది అని తెలిసింది. అడ్మిషన్ కౌన్సిలింగ్‌లో మరునాడు ఉదయం 11 గంటలదాకా ఆ కాలేజీలో సీట్లు లేవు. మోహనరావుగారు టెన్షన్ పడి స్వామికి ఉదయం 11:30గం॥లకి ఫోను చేశారు. స్వామితో 'స్వామీ! మీరు సీటు వస్తుందన్నారు. సీట్లు లేవు. మమ్మల్ని మధ్యాహ్నం 2 గంటలకి పిలుస్తారు. నన్ను ఏం చేయమంటారు' అని అడిగితే స్వామి తన ప్రక్కనున్న శంకరయ్యగారితో "అరే శంకరా! మోహన్‌గాడు, వాడి బిడ్డ గుంటూరు కౌన్సిలింగ్‌కి వెళ్ళారు. సీటు లేదని కొట్టుకు చస్తున్నాడు. సీటు వుందిరా అంటున్నా వినటం లేదు" అని చెప్పి ఆయనతో "రేపు ఉదయము 9 గంటలకి సీటు ఇస్తారు. నువ్వు వుండు. వెళితే సీటు రాదు" అన్నారు. ఆయన మరలా 'కాదు స్వామీ, ఈ రోజు 2 గం॥లకి కౌన్సిలింగ్ అంటే రేపు ఉదయం 9 గం॥లకి వస్తుందంటున్నారు. నాకు పరిస్థితి అర్థం కాలేదు' అని అడిగారు. స్వామి వెంటనే "సీటు వుంది. వస్తుంది. రేపు ఉదయం 9గం॥లకి ఇస్తారు. నువ్వు తిరిగి వెళ్ళకు" అని చెప్పారు. జాబితా

ప్రకారం 2గం॥లకి వారిని పిలుస్తారని ఎదురు చూస్తుండగా అనివార్య కారణాల వలన అంతర్జాలం (ఇంటర్నెట్) పనిచేయలేదు. అందువలన ఆ రోజు జరగవలసిన కౌన్సిలింగ్ మర్నాటికి వాయిదా వేసారని తెలిసింది.

మరునాడు జాబితాలో వారి ముందర ఉన్న సత్తుపల్లి అమ్మాయి వెళ్ళి గంగారాం కాలేజీలో సీటు కావాలని అడిగింది. ఆ కాలేజీలో సీట్లు లేవని చెప్పగా, ఆ అమ్మాయి కరీంనగర్ కాలేజీలో సీటు ఎంచుకుంది. వారిని పిలిస్తే వారు కూడా గంగారాం కాలేజీలో సీటు కావాలంటే వాళ్ళు 'మీ ముందరే కదా ఆ అమ్మాయిని కరీంనగర్‌లో తీసుకోమన్నాము' అని చెప్తుంటే మోహనరావుగారి అమ్మాయి ఏడవటం మొదలు పెట్టింది. అంతలోనే కంప్యూటర్‌లో గంగారాం కాలేజీలో ఐ.టి. సీటు ఒకటి వుందని చూపెట్టింది. వెంటనే దాన్ని వారి అమ్మాయి పేరున వ్రాస్తూ మీకు బలమైన దైవకృప వుంది అందువలననే ఈ క్షణం దాకా లేని సీటు మీకోసం వచ్చింది అన్నారు. ఫీజు కట్టేసి బయటకొచ్చాక స్వామికి ఫోను చేస్తే స్వామి "రాదన్నావు కదరా! డబ్బెట్టి కొనుక్కుంటానన్నావు కదరా, ఆ సీటు మనదిరా, నేను దాచిపెట్టి వుంచాను" అని చెప్పారు. కేవలం స్వామి దయ వలన మాత్రమే మోహనరావుగారి అమ్మాయికి ఇంజనీరింగ్‌లో సీటు వచ్చింది. దానికి ఈ క్రింది సన్నివేశంలో స్వామి ఇచ్చిన అభయమే కారణం.

స్వామి వారి అమ్మాయికి సీటు వస్తుందన్న తర్వాత ఒకసారి స్వామి దగ్గరకి వెళితే స్వామి "అరే మోహనా! మీ అమ్మాయికి డొనేషన్ కట్టుకో" అని అన్నారు. వెంటనే ఆయన మనస్సులో 'ఇంతకు ముందు సీటు ఇప్పిస్తానన్నారు, ఇప్పుడు డొనేషన్ కట్టుకోమంటున్నారు. లక్ష రూపాయల డొనేషన్ ఎక్కడనుండి తేవాలి, ఇప్పుడు అమ్మాయిని డిగ్రీలో చేర్చటానికి కూడా లేదు అందువలన తర్వాత రోజు స్వామికి చెప్పకుండా వెళ్ళిపోదామ'నుకున్నారు. ఆ రోజు రాత్రి అమ్మయ్య సమాధి దగ్గర విన్నవించుకొని పడుకున్నారు. ఆ రోజు రాత్రి కలలో అమ్మయ్య స్వామితో "మీరు మోహన్‌కి మొదట సీటు ఇప్పిస్తానన్నారు. మరలా ఇప్పుడు డొనేషన్ కట్టాలంటున్నారు" అని అడిగింది. దానికి స్వామి "వాడిని 11 రూపాయలు దక్షిణ ఇవ్వమను, సీటు వస్తుంది" అన్నారు. అమ్మయ్య ఆయనతో

"అరే మోహనా! 11 రూపాయలు దక్షిణ ఇవ్వు" అని చెప్పారు. స్వామి కాగితాల మీద సంతకం చేసి "ఇదుగో సీటు తీసుకో" అని ఇచ్చారు. అంతటితో ఆ స్వప్నం ముగిసింది.

మర్నాడు ఉదయం ఆరతి అయిన తర్వాత ఎవరికైనా స్వప్నాలుకానీ, సందేశాలు కానీ వచ్చాయా? అని ఆయన వంక చూస్తూ నాలుగైదుసార్లు అడిగారు. మోహనరావుగారు మాట్లాడలేదు. స్వామి వెళ్ళిన తర్వాత శంకరయ్యకు చెపితే ఆయన 'స్వామి అడినప్పుడు చెప్పకుండా వుండటం తప్పు కదా? నువ్వు అమ్మయ్యకు వెళ్ళి క్షమాపణ చెప్పు. స్వామే నిన్ను పిలుస్తారు' అని చెప్పారు. ఆయన అమ్మయ్య సమాధి దగ్గరకి వెళ్ళి 'అమ్మా! తల్లి దగ్గర భయం వుండదు కనుక చెప్పాను, స్వామికి చెప్పాలంటే నాకు భయం. నువ్వే స్వామితో చెప్పు' అని ప్రార్థించారు. స్వామి అడిగినప్పుడు చెప్పనందుకు ప్రాయశ్చిత్తంగా అమ్మయ్య సమాధి చుట్టూ మూడు మోకాళ్ళ ప్రదక్షిణలు చేసారు. తర్వాత ఆయన సామానులు సర్దుకుని బయటకు వచ్చి బయట నుండే స్వామికి వెళ్ళి వస్తానని చెపుతున్నారు. స్వామి లోపలికి రమ్మన్నా ఆయన సంకోచిస్తుంటే, ఒకమాట మాట్లాడాలి రమ్మని పిలిచారు. లోపలికి వెళ్ళగా "అమ్మయ్య ఏం చెప్పింది?"అని అడిగారు. స్వామికి రాత్రి వచ్చిన స్వప్నం గురించి చెప్పారు. స్వామి వెంటనే "మరి 11 రూపాయలు ఇచ్చావా"? అని అడిగారు. ఆయన దర్గాల దగ్గర హుండీలలో దక్షిణ సమర్పించాననగానే "ఇంక ఆ సీటు నీదే" అని, ఒక పేపరు మీద సంతకం చేసి అభయమిచ్చారు. ఈ అభయం వలననే వారి అమ్మాయికి 82,000 ర్యాంకు వచ్చినా వారి ఇంటికి దగ్గర కాలేజీలో స్వామి చెప్పినట్లు ఐ.టి.గ్రూపులో సీటు వచ్చింది.

మదనపల్లిలో నివసించే ఛాయగారి అమ్మాయిని స్వామి హైదరాబాద్‌లో బి.టెక్. చదివించమన్నారు. అక్కడ 10-12 లక్షలు ఖర్చు అవుతుందని ఆమె సంకోచంతో తమిళనాడులోని హొసూరులో చేర్పించనా అని అడిగితే స్వామి "నీ ఇష్టం" అని అన్నారు. ఆ మాటను అర్థం చేసుకోకుండా హొసూరులో 40,000 కట్టి చేర్పించారు. హైదరాబాదులో ఆమె చిన్నాన్న స్వామికి ఫోను చేసినప్పుడల్లా "హైదరాబాద్‌లో సీట్ దొరుకుతుందేమో" చూడమన్నారు. స్వామి

దయవలన హైదరాబాదులో సీట్ దొరికింది. హొసూరులో 40,000 కట్టి ఉన్నారు. ఆ కాలేజీవారు ఇప్పటిదాకా ఎవరికీ కట్టిన ఫీజు డబ్బు వెనక్కు ఇచ్చిన దాఖలాలు లేవు. ఈ విషయం ఆమె స్వామికి చెప్పుకుంటే "దిగులు పడొద్దు. వాపసు యిస్తారని" అభయమిచ్చారు. అలానే స్వామి దయవలన చిత్రాతిచిత్రంగా ఆమె కట్టిన డబ్బు వాపసు ఇచ్చారు.

## ఉద్యోగం

సాధారణంగా ఎవరైనా ఉద్యోగార్థం ప్రశ్న అడిగినప్పుడు, స్వామి "ఎక్కడైనా నాలుగు చోట్ల అప్లై చేసావా? ఎక్కడైనా రెండు చోట్లకు ఇంటర్వ్యూకి వెళ్ళావా?" అని అడిగేవారు. అలా చేస్తే జయం నాయనా! అని చెప్పేవారు. ఈ విధంగా స్వామి మానవప్రయత్నానికి పెద్దపీట వేసి అడిగినవారి ప్రయత్నాలు సఫలీకృతమయ్యేందుకు తమ ఆశీస్సులను జత చేసేవారు.

మదనపల్లిలో నివసించే ఛాయగారు అనే స్వామి భక్తురాలు ఆశ్రమానికి చాలా సంవత్సరాలుగా వస్తున్నారు. మొదట ఆమెను శ్రీ భరద్వాజ మాస్టారుగారు దర్గాస్వామి దగ్గరకు వెళ్ళమని చెప్పారు. అదే విషయం స్వామి శంకరయ్య చేత ఛాయగారికి తెలియజేసారు. ఆమె చాలాకాలంగా సప్తగిరి గ్రామీణ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నారు. ఒకప్పుడు మదనపల్లికి 50కి॥మీ దూరంలో వున్న పెద్దమండ బ్రాంచికి బదిలీ అయ్యింది. ప్రతిరోజు మదనపల్లి నుండి పెదమండకు ప్రయాణం చేసి పని చేసేవారు. ఒక సంవత్సరం అలా పనిచేసిన తర్వాత ఇంక అక్కడ పనిచేయలేననుకున్నారు. స్వామికి చెప్తే "పోమ్మా! అదే మీ ఊరు వస్తుంది" అన్నారు. కొంతకాలం జరిగినా మార్పులేక పోవడంతో ఆమె మరలా ఉద్యోగం గురించి ప్రస్తావించగా స్వామి అదే మాట చెప్పారు. తర్వాత కొన్ని రోజులకు భారత ప్రభుత్వం ఒక తీర్మానం చేసింది. ఏదైనా గ్రామీణ బ్యాంకు సరిగ్గా పనిచేయకుంటే దగ్గరలో ఉన్న పట్టణానికి మార్చవచ్చు. దాని ప్రకారం మదనపల్లికి 18కి॥మీ దూరంలో వున్న రెడ్డివారిపల్లె బ్రాంచి సరిగ్గా పనిచేయక పోవటం వలన దానిని మదనపల్లికి మార్చారు. ఆ బ్రాంచికి ఛాయగారిని క్లర్కుగా బదిలీ చేసారు.

నెల్లూరు నుండి లక్ష్మీ విలాస్ బ్యాంక్ ఉద్యోగి రాజేష్ చంద్రగారు ఇలా చెపుతున్నారు: చిన్నప్పుడు మా నాన్నగారితో పాటు సాయిబాబా భజనలలో పాల్గొనటం వలన సాయిబాబా మీద భక్తి కలిగి గురు భావంతో ఆరాధిస్తుండేవాడిని. 2006లో డా॥ సురేంద్రగారు 'టి.టి.డి' ప్రాంగణంలోని సాయి మందిరంలో ఉన్న దర్గాస్వామి దగ్గరకు తీసుకొని వెళ్ళి భజనలు, పాటలు పాడతానని స్వామికి చెప్పగానే స్వామి నన్ను దగ్గర కూర్చోపెట్టుకొని పాడమన్నారు. పాడిన తర్వాత స్వామి ఆశీర్వదించారు. ఆరోజే నాకు లక్ష్మీవిలాస్ బ్యాంకు వ్రాత పరీక్షకి రమ్మని లెటరు వచ్చింది. ఆ తర్వాత ఇంటర్వ్యూకు వెళ్ళే ముందర స్వామి దర్శనం చేసుకుంటే ఇంటర్వ్యూకి మజ్జిగ త్రాగి వెళ్ళమని చెప్పారు. ఇంటర్వ్యూ ముందర రోజు హైదరాబాద్‌లో సాయిబాబా గుడికెళితే మా కుటుంబ సభ్యులందరిలో నాకొక్కడికే పూజారి పూలు ఇచ్చారు. అంతకు ముందు స్వామి నన్ను ఇంటర్వ్యూకి జేబులో పూలు పెట్టుకెళ్ళమని చెప్పిన మాటలు స్ఫురించి అవి స్వామి ప్రసాదంగా తీసుకున్నాను. తర్వాత రోజు ఇంటర్వ్యూ బాగా చేసాను. అక్కడికక్కడే నేను సెలక్ట్ అయ్యానని చెప్పారు. ఇంతకు ముందు వ్రాత పరీక్షకు కూడా పిలవని నాకు దర్గాస్వామి దర్శనం మాత్రంతోనే నాకు ఉద్యోగం ఇచ్చారు.

ఒకరోజు రాత్రి స్వప్నంలో దర్గాస్వామి కనపడి "నీకేం భయం లేదు. నీ వెంట నేనుంటాను. నిన్ను నేను నడిపిస్తాను" అని చెప్పారు. దర్గాస్వామి వెనుకాల సాయిబాబా కనపడి ఆశీర్వదించారు. ఆ స్వప్నదర్శనం తర్వాత దర్గాస్వామి మీద విశ్వాసం పెరిగి గురుభావం దృఢపడింది.

రాయచోటి నుండి కిరణ్ అనే యువకుడు ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్న రోజులలో అతని పిన్ని దర్గాస్వామి గురించి చెప్పింది. అతను, వాళ్ళ అమ్మ, చెల్లి, ఇద్దరు పిన్నమ్మలతో కలిసి స్వామి దర్శనానికి వెళ్ళాడు. అతని ఉద్యోగం గురించి అడుగగా, స్వామి "3 నెలల్లో వస్తుంది" అని చెప్పారు. సరిగ్గా 3వ నెల చివరి రోజున ఇంటర్వ్యూ పాసై, అతనికి ఆ ఉద్యోగం వచ్చింది. స్వామి చెప్పిన విధంగా సరిగ్గా 3వ నెల ఆఖరిరోజున అతనికి ఉద్యోగం రావటం గమ్మత్తైన విషయం.

రాయచోటినుండి భరత్ అనే యువకుడు స్వామివారి ఆశీస్సుల వలన ఇంటర్మీడియెట్, ఇంజనీరింగ్‌లలో మంచి మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు. ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నప్పుడు, స్వామి "బాబా పల్లకీ మొయ్యరా, ఉద్యోగమిప్పిస్తాము" అన్నారు. స్వామి చెప్పిన విధంగా బాబా పల్లకీ మోయగా అతనికి బెంగుళూరులో ఉద్యోగం వచ్చింది.

సామాన్యంగా మార్గదర్శనం కొరకు స్వామి వద్దకు వచ్చి అడిగినాక స్వామి ఒకటి, రెండు వాక్యాలు చెప్పేవారు. ఆ వాక్యం మీద దృఢమైన విశ్వాసంతో చెప్పిన పని చేస్తే అడిగినవారి సమస్యలు తీరి పనులు సానుకూలమయ్యేవి.


ఓం శ్రీ సద్గురుభ్యోన్నమః
శ్రద్ధ
సబూరి
శ్రీ సమర్థ సద్గురు దర్గా స్వామీజీ
ధ్యాన మూలం గురోర్మూర్తి ః పూజా మూలం గురో ః పదం।
మంత్రమూలం గురోర్వాక్యం మోక్షమూలం గురో ః కృపా॥
నమామి సద్గురుం శాంతం ప్రత్యక్ష శివరూపిణమ్।
శిరసా యోగ పీఠస్థం ముక్తి కామ్యార్థ సిద్ధయే॥
2016

## ఆర్థికము

1993వ సం॥లో రొయ్యల పరిశ్రమలో చాలామంది వ్యవసాయదారులు లక్షలు నష్టపోయి అప్పులతో దివాళా తీసారు. నెల్లూరు డి. జయచంద్రారెడ్డిగారు కూడా చాలా నష్టపడ్డారు. ఈ పరిస్థితులలో మార్గదర్శనం కొరకు, రంగారావుగారు నెల్లూరు డి. జయచంద్రారెడ్డి దంపతులను శ్రీ దర్గాస్వామివారిని దర్శించుకోమని ఫోను చేశారు. ఆయన భార్య ప్రోద్భలముతో శ్రీ దర్గాస్వామివారి దర్శనార్థం నీలకంఠరావుపేట వెళ్ళారు. శ్రీ స్వామివారి దర్శనం అయినాక, వారు జయచంద్రారెడ్డిగారి వైపు చూస్తూ "ఒరే నాయనా! నీ గురువు ఇక్కడ కూడా ఉన్నారు లేరా! నీ బాధ ఏమిటో చెప్పుకోరా!!" అన్నారు. ఆయన వారికి పాదాభివందనం చేసి వారి కష్టం చెప్పుకున్నారు. "నీవు మరలా అదే పరిశ్రమలో దిగు, బయటపడగలవు" అని అన్నారు. జయచంద్రారెడ్డిగారు 'నా దగ్గర చిల్లిగవ్వ లేదు. రెండు లక్షల పెట్టుబడి ఎక్కడ తేగలను' అంటే "అదంతా నాకు తెలియదు ఈసారి నీ సమస్య తీరుతుంది" అని స్వామి నవ్వుతూ "అలా తీరితే నాకేమి ఇస్తావు?" అని అడిగారు. ఈయన ప్రతిఫలం ఆశించేవాడుగా ఉన్నాడే, సమస్య తీరితే ఏదో ఒకటి ఇస్తాములే అనుకొని జయచంద్రారెడ్డిగారు వచ్చేశారు. ఆయన తిరిగి రొయ్యల పరిశ్రమలో దిగారు. ఆ తర్వాత మూడు నెలలోనే ఆయన అప్పులన్నీ తీరి బయటపడ్డారు. వారు 1,116 రూపాయలు శ్రీ స్వామివారికి పంపితే ఆశ్రమంలో జరిగే అన్న సంతర్పణకిమ్మన్నారు. ఆ దైవ స్వరూపులైన మహనీయులు తమ ఒక్క దర్శనముతో, వారి అమృతవాక్కుతో జయచంద్రారెడ్డిగారిని బాధాకరమైన పరిస్థితి నుండి బయటపడేసారు.

సురేంద్రగారి తమ్ముడు స్వామి సలహామీద రొయ్యల వ్యాపారంలో దిగాడు. ఆ సంవత్సరం చాలామంది రొయ్య వ్యాపారులు నష్టాలతో దాదాపు దివాళా తీసిన పరిస్థితి వచ్చింది. సురేంద్రగారి తమ్ముడికి మాత్రం ఏ యిబ్బందీ, నష్టమూ కలుగలేదు. స్వామి చెప్పినట్లు వచ్చిన రాబడిలో కొంత దాన ధర్మాలు చేస్తున్నాడు. సురేంద్రగారు ఒక స్థలం చూసి, కొందామనుకుని స్వామిని అడిగితే "అది రిజిష్టర్ అవ్వదు, లీజుకి

తీసుకోమన్నారు". ఎందుకు రిజిష్టరు అవదో అని అనుమానంతో విచారిస్తే, ఆ స్థలం మాఫీ చేయబడి ఉందనీ, దాన్ని రిజిష్టరు చేయటానికి లేదనీ తెలుసుకొని స్వామి చెప్పినట్లు లీజుకి తీసుకున్నారు.

రాయచోటి నటరాజగారు 20 సంవత్సరములుగా బట్టల అంగడి నడుపుతున్నారు. వ్యాపారం అంతంత మాత్రంగా జరుగుతుండేది. ఒకరోజు స్వామి, అమ్మయ్యలు రాయచోటికి వచ్చినప్పుడు వారి అంగడికి వెళ్ళారు. ఆయన అడగకుండానే స్వామి "ఈ బట్టల అంగడి అమ్మివెయ్యి, నీకిది కలిసిరాదు" అని చెప్పారు. అలా చెప్పిన తర్వాత కూడా 3 సం॥లు బట్టలంగడి మీద వ్యామోహంతో అదే వ్యాపారం చేసారు. స్వామి చెప్పిన విధంగా ఆ వ్యాపారం ఏమాత్రం కలిసి రాలేదు. తర్వాత ఆయన ఆ బట్టలంగడి అమ్మేసి, రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించారు. వ్యాపారం బాగా కలిసొచ్చింది.

శేఖర్‌రాజు గారు బెంగుళూరు, బి.టి.ఎమ్. సాయిమందిర కార్యవర్గ సభ్యులు. వారి అబ్బాయికి కొంతకాలంగా వ్యాపారంలో మంచి ఫలితాలు రావడం లేదు అని స్వామికి చెప్పుకున్నారు. స్వామి "2010 మార్చి తరువాత మెరుగవుతుంది" అని చెప్పారు. అదే ప్రకారంగా మార్చి 12, 2010 నుండి మార్పు వచ్చి వ్యాపారంలో అభివృద్ధి జరిగింది. ఆయన కుమారుడు స్వామి దగ్గరకి వెళ్ళి కృతజ్ఞతగా 'స్వామీ! మీరు చెప్పినట్లు నా వ్యాపారంలో మంచి మార్పు వచ్చింది" అని చెప్పగా, వెంటనే స్వామి **"నేను చెప్పలేదు, నా గురువుగారు చెప్పారు"** అని అన్నారు. నిజమైన సత్పురుషుల లక్షణమిది. స్వామి అతనిని "నీ ఇష్టదైవము ఎవరు?" అని అడిగారు. అతను సుబ్రహ్మణ్యస్వామి అని చెప్పినాక, స్వామి అతనికి సుబ్రహ్మణ్యస్వామి బీజాక్షరాన్ని ఉపదేశించి, నిరంతరం స్మరణ చెయ్యి భగవంతుని ఆశీస్సులు వుంటాయి అని చెప్పారు.

## వివాహము

సామాన్యంగా ఎవరైనా భక్తులు వివాహ ప్రస్తావనతో వస్తే, ఎక్కడైనా సంబంధాలు చూసారా? అమ్మాయి, అబ్బాయి చూసుకున్నారా? ఒకరినొకరు ఇష్టపడ్డారా? అని స్వామి అడిగేవారు. వివాహ విషయంలో

ఇవి చేయవలసిన కనీస మానవ ప్రయత్నం. దీని తర్వాత మిగిలిన కార్యం సవ్యంగా జరగాలని స్వామి ఆశీస్సుల కొరకు ప్రార్థిస్తే ఆయన సంతోషించి ఆశీర్వదించేవారు.

1993వ సం॥లో ఛాయ గారి చెల్లెలు వివాహం చేయాలని పెద్దలు ప్రయత్నించారు. ఈ సందర్భంలో ఆమె  స్వామి ఆమోదించి, ఖాయం చేసిన సంబంధము చేసుకుంటానని నిర్ణయించుకుంది. ఈ విధంగా ఒక సంబంధము గురించి స్వామికి చెప్పగా "అమ్మా! అబ్బాయి ఇప్పుడు పెద్ద స్థితిమంతుడు కాదు. కానీ జీవితములో నీకేమీ లోటు రాదు" అని ఆశీర్వదించి ఆ సంబంధము ఖాయం చేసారు. ఆమె స్వామి చెప్పిన విధంగా పెళ్ళి చేసుకున్నారు. వివాహమైన కొత్తల్లో ఆమె భర్తకు నెలకు 600 రూపాయల జీతం. కానీ స్వామి అనుగ్రహం వలన అతను వృత్తిలో క్రమేణా అభివృద్ధి సాధించి, ప్రస్తుతం 50 వేల పైన జీతం సంపాదిస్తూ కుటుంబాన్ని ప్రేమగా చూసుకుంటున్నాడు.  స్వామి వాక్కు అమృతవాక్కు!

రంగారావుగారి పెద్దమ్మాయి 'శ్రీ దర్గాస్వామివారు చెప్పిన సంబంధమే చేసుకుంటాను' అని పట్టు పట్టింది. తరువాత వరుడు పెండ్లిచూపుల సందర్భంలో ఆ అమ్మాయిని 'షిరిడీ హారతులు నాలుగూ వచ్చునా' అని అడగగా ఆ అమ్మాయి తనకి ఒకటే వచ్చునని సమాధానం చెప్పింది. తరువాత వారు అడిగిన కట్నం ఇచ్చి పెండ్లి చేయటం కష్టం అని రంగారావుగారు సందేహించారు. ఆశ్రమానికి వెళ్ళగా శ్రీ దర్గాస్వామివారు పెండ్లికొడుకు పలికిన మాటలు "షిరిడీ హారతులు వచ్చునా అని అడిగినట్లు, అమ్మాయికి ఒకటే వచ్చు అని చెప్పినట్లు" తెలిపి ఆ సంబంధమునే నిశ్చయించి చేసుకోమన్నారు. తరువాత కట్నమునకు కావలసిన సొమ్ము అంతయు సమకూర్చి, వివాహము శ్రీస్వామివారి అనుగ్రహముతో చక్కగా జరిపించినారు.

నెల్లూరు డి. జయచంద్రారెడ్డిగారి కొమార్తెకు రెండు సంవత్సరములుగా పెండ్లి సంబంధాలు చూస్తున్న సమయంలో స్వామి దగ్గరకు తీసుకుపోయారు. "మీ నాయన నిన్ను అమెరికా పంపాలంటున్నాడు. పోతావా? పోతావులే" అని అన్నారు. శ్రీ స్వామివారు అమ్మాయి జాతకం చూచి "అమ్మాయిది పుష్యమి నక్షత్రం - పునర్వసు

నక్షత్రం వుండే పిల్లవాడు కావాలి. కుదురుతుందిలే'' అన్నారు. శ్రీ స్వామివారు ఒకరోజు ఫోనుచేసి ''ఇప్పుడు వచ్చిన సంబంధం నక్షత్రాలు కలిసాయి. మంచిదే. కానీ మీరనుకున్న దానికంటే ఒకటి రెండు లక్షలు ఎక్కువ అడుగుతారు. ఈ సంబంధం పోనీయవద్దని'' చెప్పారు. 29-9-2000 నిశ్చితార్థం, 11-10-2000 వివాహం, 31-10-2000 దంపతులు అమెరికా పోవడం దాదాపు ఒక నెలలో జరిగినాయి. అమెరికాలోనే అబ్బాయి ఉద్యోగం చేయడం జరిగింది. వారి మాట వేదవాక్కు.

## ఆరోగ్యము

భరించలేని వ్యాధులతో బాధపడుతూ, శ్రీస్వామివారిని ప్రార్థించినప్పుడు, అట్టివారి బాధను శ్రీస్వామివారు తన శరీరంపైకి తీసుకొని తానే అనుభవించి ఆ భక్తుని బాధ తీర్చేవారు. స్వామివారికి ఎదుట నిలబడినవారి కష్టాలను, అనారోగ్యాలను తమలోనికి తీసుకునే వరాన్ని వారి గురువులు ఇచ్చారు. తమ శరీరాన్ని సాధనంగా వినియోగించి స్వామివారు ఎంతోమందికి ఆరోగ్యం చేకూర్చినారు. ఎవరైనా ఆరోగ్య విషయమై అడిగినప్పుడు సాధారణంగా రక్త,మూత్ర పరీక్షలు చేయించుకుని, డాక్టరుకు చూపించుకుని ఆయన ఇచ్చిన మందులు మ్రింగమనేవారు. ఇక్కడ ఒక సందేహం కలుగవచ్చు. పై చెప్పినవన్నీ చేస్తే స్వామినడగవలసిన అవసరం ఏముంది? స్వామిని అడిగి, ఆయన మాట ప్రకారం నడుచుకున్నప్పుడు మనకు ఆయన వాక్కు మీద గురి ఉన్నదని తెలుస్తుంది. స్వామి ఆశీస్సులు తీసుకుని ఆ పని చేసినవారి అనుభవం వేరు. కొన్ని సందర్భాలలో అడిగినవారి శరీరంలో ఉన్న రుగ్మతలు వైద్య పరీక్షలు చేయించుకోక ముందే ఖచ్చితంగా చెప్పారు.

కావలి శ్రీ సి. సూర్యప్రకాశరావుగారు తరచూ కుటుంబసమేతంగా దర్గాకు పోయి శ్రీ స్వామి దంపతుల ఆశీస్సులు పొంది వచ్చేవారు. వారు ఎప్పుడు ఏది ఇచ్చినా స్వీకరించక ''మీరు తింటే నేను తిన్నట్లే. మీరు తిన్నవన్నీ నా పొట్టలో ఉన్నాయి. కాబట్టి ఇవి అన్నీ అందరికీ

పంచి మీరు తినండి'' అనేవారు. అంతేగాక వారు కారియర్ మూత తీయకముందే అవి ఏమిటో చెప్పేవారు. ఆ విధంగా వారి సర్వజ్ఞత్వం వెల్లడయ్యేది.

1996 ఆగస్టులో సూర్యప్రకాశరావు గారుకి మలేరియా వ్యాధి వచ్చింది. 21 రోజులకు కూడా తిరుగు ముఖం పట్టలేదు. మందులు ఎక్కువగా వాడవలసి రావడంతో భరించలేని బాధగా వుండేది. రోసోచిన్ మాత్రలు వేసుకున్నప్పుడు ఆయన కడుపులో అగ్నిగోళాలు తిరిగినంత మంటగా వుండేది. 26వ తేదీ సాయంకాలం ఆ బాధ భరించలేక ఆయన మానసికంగా శ్రీ స్వామివారితో ఇలా చెప్పుకున్నారు. 'మేము మీ దగ్గరకొచ్చినప్పుడల్లా మేము తింటున్నవన్నీ మీలోకి చేరుతున్నట్లు చెప్పారు గదా! ఇప్పుడు నేను మ్రింగుతున్న రోసోచిన్ మాత్రలు గూడా మీ పొట్టలోకి చేరుతున్నాయా? చేరితే వాటి ప్రభావం మీ మీద చూపటం లేదా? నా ప్రారబ్ధం కొద్దీ నేను అనుభవిస్తున్న ఈ బాధను మీరు కూడా అనుభవించి తగ్గించవచ్చు కదా!' అని అనుకొని కండ్లు మూసుకున్నారు. పది నిమిషాలలో ఒళ్ళంతా చెమటపోసి జ్వరం పూర్తిగా తగ్గిపోయింది. దాని తర్వాత ఇక జ్వరం రాలేదు.

ఒక వారం తరువాత కావలికి శ్రీ స్వామివారిని ఆహ్వానించేందుకు మిత్రులతో కలసి సూర్యప్రకాశరావుగారు నీలకంఠరావుపేటకు వెళ్ళారు. ఆయనకి జ్వరం వచ్చిన విషయం శ్రీ స్వామివారికి చెప్పబోతూంటే, స్వామి కృష్ణారెడ్డిగారిని పిలిచి, క్రితం వారం జరిగిన సంగతి చెప్పమన్నారు. కృష్ణారెడ్డిగారు ఇలా చెప్పారు: 'పోయిన వారం శ్రీ స్వామివారికి, అమ్మయ్యగారికి జ్వరం తీవ్రంగా వచ్చింది. చాలా బాధపడ్డారు. మాత్రలు వేసుకోమంటే "ఉండరా ఇప్పటికే కడుపునిండా మాత్రలు వేసియున్నారు'' అని చెప్పి మందు తీసుకోలేదు. ఆ రాత్రికి జ్వరం తగ్గిపోయింది. మరుసటి రోజుకు మామూలుగా ఆరోగ్యంగా వున్నారు' అని చెప్పాడు.

చిత్రమేమంటే సూర్యప్రకాశరావుగారికి జ్వరం తగ్గిన సమయంలోనే శ్రీ స్వామివారు, అమ్మయ్యగారు జ్వరాన పడ్డారు. సూర్యప్రకాశరావుగారి స్మరణమాత్రం చేత క్షణకాలంలో స్వామి ఆయన జ్వరాన్ని తమ శరీరం

మీదకు తీసుకొని ఆయన బాధను తీర్చారు. సాయి అష్టోత్తరంలో **స్మరణమాత్ర సంతుష్టాయ నమః** అనే నామం ఈ సందర్భంగా రూఢీ అవుతుంది. ఎంతో దూరంలో వున్న నా ప్రార్థన విన్నారంటే వారు సర్వవ్యాపకులై ఉండాలి. నా జబ్బును తన శరీరంపైకి తీసుకున్నారంటే సర్వసమర్థులని అర్థం.

హైదరాబాదు నుండి శ్రీ పెసల సుబ్బరామయ్యగారి మిత్రుని అనుభవం: "ఒకసారి నా భార్య ఆరోగ్య విషయం అడగాలని దర్గాస్వామివారి దర్శనార్థం వెళ్ళాను. నేను వారికి నమస్కారం చేయగానే తమ ఎడమ చేత్తో కుడిచేతి జబ్బ మీద కొట్టుకుంటున్నారు. నేను నా భార్య ఆరోగ్య విషయమై వారికి చెప్పనేలేదు. నేను మాట్లాడకముందే వారన్నారు "నేను నీ భార్యకు నొప్పి ఉండేచోట కొడుతున్నాను. తగ్గిపోతుందిలే" అన్నారు. నేను నోరు తెరచి అడుగకముందే స్వామివారు విషయాన్ని గ్రహించి అనుగ్రహించినారు. అనతికాలంలో నా భార్య నొప్పి నుండి విముక్తి పొందింది. వారు సర్వజ్ఞులనీ, సర్వసమర్థులనీ ఈ అనుభవం ద్వారా నిస్సందేహంగా తెలుసుకున్నాను".

దమ్మపేట నుండి ముత్తా సత్యనారాయణగారి అబ్బాయి పుల్లారావుకు కాలు మీద పుండు వచ్చి నీరు, చీము పట్టాయి. 2002లో 30,000 రూ॥ల ఖర్చుతో ఆపరేషన్ చేయించినా తగ్గలేదు. ప్రతినెలా విజయవాడ ఆసుపత్రిలో రెగ్యులర్‌గా చెకప్ చేయిస్తున్నారు. ప్రతినెలా 1,000 రూ॥లు ఖర్చు పెట్టినా వ్యాధి తగ్గలేదు. దర్గాస్వామి భక్తుడు మోహన్‌గారు వారితో 'స్వామి ఫోటో పెట్టుకుని ప్రతిరోజు ప్రదక్షిణలు చేయండి, వ్యాధి తగ్గాక స్వామి దర్శనానికి వెళ్ళమని' చెప్పారు.

ప్రదక్షిణలు 4,5 రోజులు చేసేసరికి బాధ, వాపు చాలావరకు తగ్గిపోయాయి. రెండు మాసాలుపాటు ప్రదక్షిణలు చేసిన తర్వాత స్వామి దర్శనానికి వెళ్ళారు. "ఏమిటీ నీ బాధ?" అని స్వామివారు అడిగారు. మీ ఫోటో పెట్టి ప్రదక్షిణలు చెయ్యడం మొదలు పెట్టిన తర్వాత బాధ తగ్గింది. ఇప్పుడు కొంచెం వాపు ఉంది. అది కూడా తగ్గిస్తారని మీ దగ్గరకు వచ్చామని సత్యనారాయణగారు చెప్పారు. స్వామి పుల్లారావు కాలు చూసి "ఇంతకు ముందు ఆపరేషన్ చేయించారు అది సక్సెస్ కాలేదు. మళ్ళీ

ఆపరేషన్ చేయాలి" అని అన్నారు. ఇంతకుముందే 30,000రూ॥లు ఖర్చు అయ్యింది మరలా అంత ఖర్చు పెట్టలేము అని ముగ్గురూ (తల్లి, తండ్రి, పిల్లవాడు) కాళ్ళమీద పడి ఏడ్చారు. "ఈ రోజు రాత్రి దర్గాల దగ్గర నిద్ర చేయండి, రేపు చూస్తాము" అని స్వామి అన్నారు.

తర్వాత రోజు సత్యనారాయణగారితో "మీ అబ్బాయికి వ్యాధి తీసేశాను. ఆపరేషన్ అవసరం లేదు, హైదరాబాదులో నిమ్స్ హాస్పిటల్‌కి వెళ్ళి డాక్టరు ఇచ్చే ఆయింట్‌మెంట్ రాయ"మని చెప్పారు. 20 రోజుల తర్వాత నిమ్స్‌లో చెకప్ చేయిస్తే ఆపరేషన్ చేయాలి, 20,000/- రూపాయలు తీసుకురమ్మని చెప్పి, 10 రోజులు ఉండేటట్లుగా రమ్మన్నారు. ఈ విషయం మోహన్‌గారికి చెప్పి స్వామిని అడగమని చెప్పారు. ఆ విషయం చెబితే స్వామివారు "అక్కడ ఏముందని ఆపరేషన్ చేస్తారు, ఆపరేషన్ అవసరం లేదు, వాళ్ళే తర్వాత ఆశ్రమానికి వస్తారు" అని చెప్పారు. మోహన్‌గారు స్వామి చెప్పిన మాటలు చెప్పి, 'మీరు భయపడవలసిన అవసరం లేదు, డబ్బులు తీసుకుని వెళ్ళండి, ఆపైన స్వామి చూసుకుంటారు' అని చెప్పారు. హైదరాబాదు ఆస్పత్రిలో అడ్మిట్ చేసిన తర్వాత ఆపరేషన్ థియేటర్‌లో స్వామి ఫోటో పెట్టి సర్వబాధ్యతలు నీవేనని చెప్పి ఏడ్చారు. డాక్టర్లు పరీక్ష చేసి జబ్బు లేదు అందువలన ఒక రోజుండి అవసరమైతే రేపు చూసి ఆపరేషన్ చేద్దాము అన్నారు. ఆ తర్వాత రోజు కూడా ఆ వ్యాధి లక్షణాలు కనపడలేదు. తర్వాత కేరళ డాక్టరును కూడా పిలిపించి చూపించారు. ఆయన పరీక్ష చేసి ఏమీ లేదు ఆపరేషన్ అక్కరలేదు అన్నారు. ఆయింట్‌మెంటు, మాత్రలు ఇచ్చి పంపారు. ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత విజయదశమికి కృతజ్ఞతలు తెలుపుకోవడానికి దర్గాస్వామి దర్శనానికి వెళ్ళారు. స్వామి వీరిని చూచి "ఒరేయ్ సత్తీ! ఏముందని ఆపరేషన్ చేస్తార్రా డాక్టరు?" అని ఆ సంగతంతా భక్తులకు చెప్పి అంతా దైవలీల అని, పరమాత్మ లీల అని చెప్పారు.

సిద్ధేశ్వరంగారు కడపజిల్లా లక్కిరెడ్డిపల్లెలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. 2000వ సంవత్సరంలో వారి పెద్దబ్బాయి శశిధర్‌కు (10 సం॥) మోకాళ్ళక్రింద పిక్కల్లో నొప్పులు వచ్చి నిలబడలేక, నడవలేకపోయేవాడు. పద్మాసనంలో కూర్చోలేడు. కాళ్ళు

ఎడంగా పెట్టుకుని కూర్చోవాలి లేదా పడుకోవాలి. కర్నూలు, తిరుపతి స్విమ్స్, హైదరాబాదు నిమ్స్ ఆసుపత్రులలో చూపిస్తే అన్ని చోట్ల రిపోర్టుల్లో ఏమీ కారణం కనబడలేదు. 40,000 రూపాయల దాకా ఖర్చు అయ్యింది. పిల్లవాడికి నొప్పులు అలానే వున్నాయి. ఆ సమయంలో ఆయన స్కూలు సీనియర్ అసిస్టెంట్ వరలక్ష్మిగారికి మాటల సందర్భంలో పిల్లవాడి విషయం చెపితే ఆమె చాలా ప్రోద్బలం చేసి దర్గాస్వామి దర్శనానికి వెళ్ళేటట్లు చేసింది. సిద్ధేశ్వరంగారు పిల్లవాడిని తీసుకుని ఆశ్రమానికి వెళ్ళే సమయానికి స్వామి దర్గాల దగ్గర దీపాలు పెడుతున్నారు. తర్వాత వారిని పిలిస్తే, వారు చేసిన ప్రయత్నాలన్నీ చెప్పి మీ ఆశీస్సులు కోసం వచ్చామని చెప్పారు. అప్పుడు స్వామి "ఇదేముంది లేరా పోతుంది పో! దర్గాల చుట్టూ ఒక చుట్టు వేయమను" అన్నారు. వారి అబ్బాయి నిలబడలేకపోతే ఆయన, వారి అన్నయ్య పట్టుకొని త్రిప్పుతుంటే స్వామి అరచి "వదలరా వాడిని. తిరుగుతాడు వాడు" అని అన్నారు. సిద్ధేశ్వరం గారి అన్న వదలినా ఆయన వదలకుండా ఒక చుట్టు త్రిప్పుకొని వచ్చారు. అక్కడ వున్న చిన్నపుల్ల అతనికిచ్చి "అరెయ్, పుల్ల యివ్వరా! దానితో తిరిగేస్తాడు" అన్నాడు. ఆ పుల్ల తీసుకొని రెండవ చుట్టు తిరుగుకొని వచ్చాడు. అప్పటికీ ఓ మాదిరిగా నడువగలిగాడు. మూడవ చుట్టు తిరిగేసరికి మామూలుగా తిరుగగలిగాడు. అక్కడ వున్న వాళ్ళందరూ జబ్బు చేసి వచ్చినతను ఇతనేనా అని ఆశ్చర్యపోయారు. అప్పుడు స్వామివారు 40 రోజులు దర్గా వద్ద వుండి సేవ చేసుకోమన్నారు. స్వామి చెప్పిన మాట ప్రకారం వారు అలాగే చేశారు. అప్పటి నుండి ఏ యిబ్బందీ లేదు. శశిధర్ యిప్పుడు ఇంజనీరింగ్ విద్య పూర్తి చేసాడు.

2004వ సంవత్సరంలో సిద్ధేశ్వరంగారి అన్నయ్యకు తిరుపతి స్విమ్స్ హాస్పిటల్‌లో పరీక్ష చేయిస్తే హెచ్.వి.ఎస్ పాజిటివ్(పచ్చకామెర్లు) అని వచ్చింది. ప్రఖ్యాత డాక్టరు కృష్ణమోహన్ గారు వారి అన్నయ్య రిపోర్టు చూసి పచ్చ కామెర్లు చివరి స్టేజీ అని చెప్పి, లివర్ మార్చటానికి వీలు కాదు కాబట్టి ప్రాణాలు పోతాయని చెప్పారు. నామ మాత్రంగా మందులు ఇచ్చారు. ఇంత జరిగినా స్వామికి చెప్పలేదు. డాక్టర్ల వల్ల కాలేదని సిద్ధేశ్వరంగారు స్వామి దగ్గరకి వెళ్ళి 12గం॥లకి మధ్యాహ్న ఆరతికి

హాజరయ్యారు. ఆరతి తర్వాత స్వామి తీర్థం ఇస్తూ వారి అన్నయ్య తీర్థం తీసుకునేటప్పుడు స్వామి ఆయనతో "పోయింది పోరా నీ ఖర్మ" అన్నారు. స్వామికి జరిగిన విషయం చెపితే "నేను చెప్పినా కదరా బాబా దగ్గర, పోయింది పో! ఏం లేదు" అన్నారు స్వామి.

డాక్టర్లు యిచ్చిన మందులు 15 రోజులు వాడి తర్వాత స్విమ్స్ ఆస్పత్రికి చెకప్ కోసం వెళితే రిపోర్టుల్లో పచ్చకామెర్లు వ్యాధి లక్షణాలు ఏమీ కనపడలేదు. కృష్ణమోహన్‌గారు రిపోర్టులు చూసి ఆశ్చర్యపోయి మరలా ఆయన స్వయంగా లాబ్‌లో పరీక్ష చేసాడు. మరలా ఏమీ వ్యాధి లక్షణాలు లేకపోయేసరికి తనతో పాటు పనిచేసే డాక్టర్లకు 15 రోజుల క్రితం రిపోర్టులు, ఇప్పటి రిపోర్టులు చూపించేసరికి వాళ్ళెంతో ఆశ్చర్య పోయారు. ఇదంతా దర్గాస్వామి దయ వలన జరిగిందని విని స్వామి దర్శనం చేసుకోవాలనుకుంటున్నానని డాక్టరు కృష్ణమోహన్‌గారు చెప్పారు. తర్వాత కూడా సిద్దేశ్వరంగారి అన్నయ్యకు ఏమీ యిబ్బంది లేదు. ఇప్పటికీ ఆరోగ్యంగా వ్యవసాయం చేసుకుంటున్నాడు. వారి అన్నయ్య కొడుకుకి నవంబర్ నెలలో ఉద్యోగం వస్తుందని స్వామి చెప్పారు. నవంబరులో స్వామి చెప్పినట్టుగా అతనికి టి.సి.ఎస్ అనే సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది.

దమ్మపేట వాస్తవ్యులు ఖమ్మంపాటి వేణుకి మహనీయులన్నా, దేవుళ్ళన్నా నమ్మకముండేదికాదు. 2003వ సంవత్సరము, జనవరి నుండి బాగా దగ్గుగా వుండడం వల్ల రాజమండ్రి, సత్తుపల్లి, ఏలూరు, విజయవాడ, పాల్వంచలలోని డాక్టర్ల మందులు ఎన్ని వాడినా ఏమాత్రం తగ్గడం లేదు. పది నెలలు జరిగిపోయింది. వారి బంధువు ఒకామె 'ఇంత ప్రయత్నిస్తున్నావు. మౌనబోధ అనే పుస్తకం 40 రోజులు చదివి శ్రీ వెంకయ్యస్వామివారి దర్శనానికి వస్తాను. నా బాధ నివారించమని మొక్కు చెప్పుకోమన్నది'. సరేనని ఆయన మౌనబోధ పారాయణ 25 రోజులు చేయగానే వారి గ్రామస్థులు గొలగమూడి వెళ్తుంటే ఆయన తన భార్యతో వెళ్ళారు. అందరూ ముందు దర్గాస్వామివారి దగ్గరకు వెళ్ళి తర్వాత గొలగమూడికి పోదామని తీర్మానించుకుని అలా వెళ్ళారు. అక్కడకు వెళ్ళి శ్రీ స్వామి ముందు కూర్చొని తన ఆరోగ్యం బాగాలేదు

స్వామీ అని చెప్పగానే "నీకు చెస్ట్ దగ్గర నొప్పిగా వుంది. ఊపిరితిత్తుల్లో నీరు, దగ్గు ఉంది. అదేమీ చేయదులే. రోజూ రాగిరొట్టె తిను అని తయారు చేసే పద్ధతి కూడా వారే చెప్పారు".

అదేమి చిత్రమోగాని స్వామి దగ్గరకు పోయేటప్పుడు వారి రెండు సంచులూ ఆయన భార్యే మోసుకొచ్చింది. కానీ తిరుగుప్రయాణంలో ఆ రెండు సంచులూ ఆయనే మోసుకెళ్ళారు. కాళ్ళ నొప్పులు, చేతుల నొప్పులు, చెస్ట్ నొప్పి ఎలా పోయాయో తెలియదు. అంతా శ్రీ స్వామివారి అనుగ్రహం. అది మొదలు మహనీయులు, దేవుడు, మందిరం అంటే నమ్మకమేర్పడి నిత్యం మందిరానికి వెళ్ళడం, పారాయణ చేస్తూ మంచి మార్గంలో నడుస్తున్నారు.

2010 డిసెంబరులో ఛాయగారి చెల్లెలు ఆరోగ్యం బాగాలేక స్వామిని ఆశ్రయించారు. స్వామి ఆమెను పరీక్షగా చూచి "క్షయరోగం ఉంది. వైద్యం చేయించుకో" అని చెప్పారు. ఆమె హైదరాబాదులోని ఒక ప్రముఖ హాస్పిటల్లో చెకప్ చేయించుకోగా వారు క్షయ రోగము లేదని నిర్ధారించారు. మూడు నెలల తర్వాత ఇంకొకమారు చెకప్ చేయించుకోగా క్షయ ఉందని నిర్ధారించారు. అప్పటినుండి ఆమె మందులు తీసుకుంటున్నారు. తర్వాతి కాలంలో స్వామిని దర్శించినప్పుడు తగ్గిపోతుందని భరోసా యిచ్చారు. స్వామి చెప్పిన విధంగానే అనతికాలంలోనే ఆమె క్షయవ్యాధి నుండి విముక్తురాలయింది.

కడపజిల్లా గాలివీడు గ్రామం నుండి చిరుదల విశాలగారికి ఒక సమయంలో కడుపులో విపరీతమైన బాధగా వుండేది. రాయచోటి ఆస్పత్రికి వెళ్ళగా డాక్టర్లు పరీక్షలు చేసి కడుపులో గడ్డ ఉందని నిర్థారించారు. ఆపరేషన్ ఒక్కటే మార్గమని చెప్పారు. ఆపరేషన్ అంటే ఆర్థికంగాను, శారీరకంగాను భయపడి ఆమె శ్రీ దర్గాస్వామివారిని ఆశ్రయించారు. స్వామి చూసి "నీకు గడ్డలేదు, ఏమీ లేదు. 25 రోజులు ఆశ్రమంలో వుండు. పరిస్థితి బాగుపడుతుంది" చెప్పారు. స్వామివారి ఆశ్రమంలో ఆమె మూడు నెలలు వున్నారు. చిత్రంగా ఏ మందులూ వాడకుండానే ఆమె కడుపులో బాధ, నొప్పీ మాయమైనాయి. శ్రీ దర్గాస్వామివారి కృపవల్ల ఆరోగ్యవంతురాలై హాయిగా వున్నది.

కొంతకాలం తర్వాత ఆమె భర్త రమణయ్యగారికి పిచ్చి పట్టింది. బెంగుళూరులో మందులు వాడినా మార్పు కలగలేదు. ఇక భరించలేక శ్రీ దర్గాస్వామివారి పాదములనాశ్రయించారు. స్వామికృప వలన ఏ మందులు, వైద్యాలు లేకుండానే ఆరోగ్యంగా వున్నాడు.

దమ్మపేట గొర్తి సాయి సుబ్రహ్మణ్యం శ్రీ దర్గాస్వామిని దర్శించినప్పుడు "ఒరేయ్! నీ మీద బండ పడబోతుంది. జాగ్రత్తగా సాయిని వదలకుండా పట్టుకోరా!" అని చెప్పారు. అప్పటికి ఆరోగ్యంగా వున్న అతనికి ఆ మాటలోని అంతరార్థం అర్థం కాలేదు. స్వామి చెప్పినట్లుగానే నాలుగు నెలలలో అతనికి పెద్ద అనారోగ్యమే వచ్చింది. అనారోగ్యరీత్యా బెంగుళూరులో పనిచేస్తున్న ఆఫీసులో స్పృహ లేకుండా పడిపోయాడు. ఆఫీసులో సరైన వైద్యం అందించాక స్పృహ వచ్చిన తర్వాత ఇంటికి పంపేశారు. అతను వాళ్ళ నాన్నగారికి కానీ, స్వామికి కానీ సహాయం కొరకు చాలా సార్లు ఫోను చేసినా లైను కలవలేదు.ఆ సమయానికి బెంగుళూరులోనే ఉన్న అతని తల్లిగారు ధైర్యం చేసి సాయిని బెంగుళూరు నుండి గొలగమూడి తీసుకువెళ్ళారు. కొంతకాలం గొలగమూడి శ్రీ వెంకయ్యస్వామివారి సన్నిధిలో ఉంటూ డాక్టర్ల మందులు వాడినాక ఆరోగ్యం మెరుగైంది. అతని పిహెచ్.డి. కూడా 2 సంవత్సరాలలో పూర్తయింది. స్వామివారు అవ్యాజ కరుణతో అతనికి రాబోయే సమస్యను గూర్చి హెచ్చరించి జాగరూకపరిచారు. అదృశ్యంగా వెంటవుండి కంటికి రెప్పలాగా కాపాడినారు.

ఖమ్మం జిల్లాలో కొంచాట శ్రీనివాసరావు గారి దంపతులు ఉండేవారు. వారి సంతానం ఒక అమ్మాయి, ఒక అబ్బాయి. అమ్మాయి పేరు దుర్గ. సుమారు 1990వ సం॥ ప్రాంతాలలో, శ్రీనివాసరావుగారికి 50 సంవత్సరాల వయస్సులో ఆకస్మికంగా అనారోగ్యం చేసి, దాదాపు 11 సంవత్సరాలు నానా రకాల ఇబ్బందులు పడ్డారు. మొదట వారికి మోకాలు, పాదము పట్టేసి వాచినాయి.రాజమండ్రిలో వైద్యులను సంప్రదించి వైద్యం చేయించుకున్నారు. ఎంత వ్యయప్రయాసలకు ఓర్చినా సమస్యకు పదిశాతం ఉపశమనం కూడా కలగలేదు. తర్వాత ఏలూరులో వైద్యుల వద్ద మూడు సంవత్సరాలు మందులు తీసుకున్నారు. అయినా ఆరోగ్యం

ఏమాత్రం మెరుగు పడలేదు. వచ్చిన పరిస్థితిని ఓర్పుగా అనుభవిస్తూ దమ్మపేట వైద్యుల వద్ద చూపించుకున్నారు. చివరకు పరిస్థితి విషమించి శ్రీనివాసరావు గారిని ఆస్పత్రిలో చేర్పించారు. ఆయనకు రక్తము, సెలైన్‌లను కూడా ఎక్కించారు. ఇంతకాలం వైద్యం చేయించటం వల్ల ఖర్చులతో ఆర్థికంగా కూడా చితికిపోయారు. ఈ పరిస్థితిలో దర్గాస్వామి గురించి తెలిసి, ఫోను చేసి కష్టాలను చెప్పుకున్నారు. స్వామి "సాయినాథుడు మీ అండ వున్నారు, ఫరవాలేదు, తగ్గిపోతుంది. ఏం కంగారు పడకండి" అని ధైర్య వచనాలు చెప్పారు.

మరునాటి ఉదయం 10 గంటలకు దర్గాస్వామివారికి ఫోను చేసి జ్వరంగా తీవ్రంగా ఉందని తెలుపగా, స్వామి డాక్టరు వద్ద చూపించి హోమియోపతి మందు తీసుకోమన్నారు.

శ్రీనివాసరావుగారి భార్య ఆర్ద్రంగా 'స్వామీ! నాకేం వద్దు. సిరిసంపదలూ, ధనధాన్యాలూ వద్దు. ఆయన ఆరోగ్యం బాగుంటే చాలు. మీ ఆశీస్సులు కావాలి. ఆయన మోకాళ్ళు, కీళ్ళనొప్పులు చాలా సంవత్సరాలనుండీ తగ్గలేదు. ఊపిరితిత్తులలో రాళ్ళు వున్నాయట. కీళ్ళు అరిగాయి. ఈ పరిస్థితిలో మీరే మాకు దిక్కు!' అని చెప్పుకున్నారు.

స్వామి "హోమియోపతి మాత్ర ఒక్కటి వెయ్యి, చాలు తగ్గిపోతుంది. రాళ్ళు లేవు, ఏమీ లేవు. నేను చెబుతున్నాను కదమ్మా పిచ్చితల్లీ! ఎందుకు ఏడుస్తావు? ఏమీకాదు. సాయినాథుడు నీ అండన వున్నాడు. ఆయనను గట్టిగా పట్టుకో!!" అని భరోసాగా చెప్పారు. స్వామి ఓదార్చిన విధానం, ఆయన ప్రేమపూర్వకమైన, వాత్సల్యపూరితమైన లాలనకు ఆమె ఎంతో ఊరట పడ్డారు. స్వామి కన్నతండ్రిలాగా మాట్లాడారు.

ఆనాటి ఉదయం 11 గంటలకు కొంచెం జ్వరం తగ్గింది. 12 గంటలకు గ్లూకోజ్, నీళ్ళు, రొట్టె ఇచ్చారు. అవి తీసుకొని చలితో రగ్గు కప్పుకుని సాయంత్రం 6 గంటల వరకూ పడుకున్నారు. 6 గంటలకు వారే లేచి ఆశ్చర్యంతో ఇదేంటీ నా కీళ్ళ నొప్పులు, ఏమీ లేవు ఏమయ్యాయి? జ్వరం తగ్గిపోయింది అని ఎంతో ఆనందంగా చెప్పారు. వారి కాళ్ళు, చేతులు ఆ స్థితిలో ఏ వాపూ, నొప్పి లేకుండా వుండడం 11 సంవత్సరాల తర్వాత మళ్ళీ ఇదే మొదటిసారి. ఆ రోజు సాయంత్రం నుండీ పాలు,

కాఫీ అన్ని రకాల కూరలు తీసుకోవడం మొదలు పెట్టారు. అప్పటి నుండి పూర్తి స్వస్థులయినారు. కొంచెం బలహీనంగా వుండటం తప్ప ఏ విధమైన వాపులు, నొప్పుల బాధలు లేవు.

ఈ విధంగా శ్రీనివాసరావుగారి కుటుంబం స్వామివారికి సమర్పణ చేసి మనస్ఫూర్తిగా ప్రార్థన చేయటం వలన స్వామి వారు ఎన్నో సంవత్సరాలుగా అనుభవిస్తున్న అనారోగ్యాన్ని తొలగించినారు. వారు శ్రద్ధాభక్తులతో స్వామి చెప్పినట్లు నడుచుకోవటం వలన నాటకీయంగా అనారోగ్యం నుండి బయటపడ్డారు.

మునగా బాల సుబ్రహ్మణ్యంగారి 8సం॥ల పిల్లవాడికి ఫిట్సు వచ్చాయి. స్వామికి చెపితే అదేమీ చెయ్యదు అన్నారు. తర్వాత డాక్టరు దగ్గరకి తీసుకు వెళ్ళితే మెదడులో సిస్టు వుందని చెప్పారు. స్వామికి చెపితే "అదేమీ లేదు పోతుంది" అన్నారు. నెలరోజుల తర్వాత డాక్టర్లు పరీక్ష చేసి సిస్టు గానీ, మరే ప్రాబ్లం గానీ లేదు అని చెప్పారు.

ఖమ్మం జిల్లా దమ్మపేట వాస్తవ్యులు తొండెపురాజుగారు ఒకప్పుడు కరెంటు పనిచేస్తూ కరెంటు స్థంభం నుండి గోతిలో పడ్డారు. అప్పుడు వచ్చిన నడుము నొప్పి కాలం గడిచినా తగ్గలేదు. పని చేసినా, పడుకున్నా విపరీతమైన నొప్పి వచ్చేది. ఒకరోజు శ్రీ స్వామివారికి విన్నవించారు. శ్రీ స్వామివారు తన దండంతో మెడ నుండి నడుం వరకూ తాకి ఆయన వీపును దండంతో తట్టారు. ఆనాటి తర్వాత మరలా నడుంనొప్పి రాలేదు. ఎంత పని చేసినా, బరువులు పట్టినా నొప్పిలేదు.

నెల్లూరు డా॥ శ్రీధర్‌రెడ్డిగారి అబ్బాయికి మెదడుకి సంబంధించిన వ్యాధితో పాటు చర్మ వ్యాధి కూడా వచ్చింది. డాక్టర్లకు చూపించినా వ్యాధి నయం కాలేదు. స్వామికి చెపితే "పిల్లవాడికి 12 1/2 సం॥లకు తగ్గుతుంది" అని చెప్పారు. అలానే వారి అబ్బాయికి 12 1/2 సం॥లకు రెండు వ్యాధులు పోయి ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నాడు.

ఏలూరు వాస్తవ్యులు చెన్నా దివ్య మోహనరావుగారికి 1978వ సం॥లో ఒక ఆపరేషన్ జరిగింది. ఆ రోజు స్వామివారు ఆయనకు కలలో దర్శనమిచ్చి తమ చేతిలోని బెత్తంతో ఆపరేషన్ జరిగిన చోట రుద్దినట్లనిపించింది. అప్పటినుండీ ఆయనకు ఆపరేషన్ తర్వాత ఏమాత్రం

నొప్పి లేకుండా నయమైంది. జీవితంలో కూడా ఏ సమస్య వచ్చినా స్వామివారిని స్మరించుకొని ప్రార్థిస్తే ఇట్టే పరిష్కారమయ్యేవి.

గురుగీతలో పెద్దలు ఈ విధంగా చెప్పినారు.

**ధ్యానమూలం గురోర్మూర్తి: పూజామూలం గురో: పదం।**
**మంత్రమూలం గురోర్వాక్యం మోక్షమూలం గురో: కృపా॥**

గురువు ముఖము నుండి వెలువడిన వాక్యమును అత్యంత శ్రద్ధాభక్తులతో గ్రహించి ఆచరించినవారికి శ్రేయస్సు కలుగుతుంది. పై ఆరు విషయాలలో మార్గదర్శనం కొరకు స్వామిని అడిగినాక ఆయన చెప్పిన మాట ప్రకారం నడుచుకోవటం ఉత్తమం. కొన్ని సందర్భాలలో కొంతమంది ఆకతాయిగా వచ్చి స్వామిని ఆటపట్టించాలనే ఉద్దేశ్యంతో ప్రవర్తించిన సంఘటనలు కూడా ఉన్నాయి. అటువంటివారిని స్వామి ఎప్పుడూ శిక్షించలేదు కానీ మౌనంగా ఉండేవారు. తర్వాతి కాలంలో అటువంటివారు చాలా ఇబ్బందులు పడ్డారు.

శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయినాథాయ నమః

# దైవం మానుష రూపేణ

## అధ్యాయము - 6

## భూతనియంత

నిర్మలం, నిష్కళం, నిత్యం, నిర్వికల్పం, నిరంజనం అయినట్టి ఆ పరమాత్మ తాను అనేకమవ్వాలనే దివ్య సంకల్పంతో ధరించిన రూపమే ఈ స్థూలజగత్తు. మన శరీరం మనస్సుకధీనమైనట్లు, మన మనస్సు ఆత్మకధీనము. సద్గురువు త్రిమూర్త్యాత్మకుడైన సాక్షాత్తు పరబ్రహ్మమే గనుక ఈ విశ్వమంతా వారి అధీనమై ఉంటుంది. ఈ విషయం సద్గురువు ద్వారా ప్రకటమయ్యే దివ్యలీలల ద్వారా భక్తులకు తెలుస్తుంది. అనంతమైన ప్రకృతిని శాసించగల సద్గురువు సామర్థ్యమును చవిచూచిన భక్తులకు, గురువు యందు విశ్వాసం ధృఢపడి, శ్రద్ధాభక్తులతో వారిని సేవించి తరించగలరు.

మనజీవిత సంఘటనలను శాసించగల దైవశక్తి ఉన్నదన్న విశ్వాసం మనకు కల్గించాలని, తద్వారా నిత్య జీవితములో వివేకము, వైరాగ్యము గల్గి ధార్మిక జీవితము త్రికరణ శుద్ధిగా మనచేత ఆచరింపజేయాలనే సద్గురుని యొక్క తపనే ఇట్టి లీలలకు మూలము. వారు మన నుంచి ఆశించునది అట్టి పవిత్ర జీవన విధానమే. మనం అలా జీవించినప్పుడే మనం నిజంగా వారికి దక్షిణ సమర్పించిన వారమౌతాము.

దమ్మపేట మోహనరావును విజయదశమికి రెండు రోజులు ముందుగా రమ్మని స్వామి చెప్పినారు. ఆయన 'అరటి తోట తడపాలి, నాకు వీలుపడదు' అని ఫోటో రూపంలో వున్న స్వామితో గురువారం రోజు చెప్పారు. ఆ రోజు రాత్రి 7 దుక్కుల వర్షం పడింది. ఇక తోట పని ఏమీ లేదని శుక్రవారం బయలుదేరి స్వామి వద్దకు వెళ్ళారు. ఆయనను చూచి స్వామి "ఒరే మోహనా! నీవు వర్షం పడకపోతే రానన్నావుగా! వర్షం పడిందటగా, వర్షం సరిపోతుందా? ఇంకా కావాలా?" అని అడిగారు. వారి సర్వజ్ఞత్వం, సర్వ సమర్థత్వం అలా వెల్లడి చేసినారు. ఈ లీలను హృదయగతం చేసుకొని స్వామే స్వయంగా తమ దగ్గరకు రమ్మని

చెప్పినప్పుడు ఎంత నష్టమైనా వెళితే ఆయన ఎంత సంతోషిస్తారో కదా!

ఒక రోజు "ఒరే మోహనా! నీకు తెలుసుగా, అమ్మయ్యని అడిగి బియ్యం తీసుకుని వండుకుని తిన్న తర్వాత పడుకోండి. రేపు ఉదయం చెపుతాను" అని స్వామి అన్నారు. వెనకాల వచ్చిన 9 మందికి కూడా మోహన్‌గారే వండాలి అన్నారు. మరియు ఎవరూ ఎటువంటి సాయమూ చేయలేదు. ఇంతమందికి ఎంత బియ్యం వండాలో తెలియని మోహన్‌గారు ఒక కేజీ బియ్యం తెచ్చి స్వామి మీద నమ్మకంతో శ్రీ గురు చరిత్రలోని భాస్కరశర్మ చేసిన భిక్ష సన్నివేశాన్ని గుర్తు చేసుకుని వండారు. ఆ వండిన అన్నాన్ని ఆ 11 మంది తినటమే కాక మరొక నలుగురికి ఇచ్చారు. మరియు ఇంకా మిగిలిన ఇద్దరు, ముగ్గురికి సరిపోయే అన్నాన్ని అక్కడ వున్న కుక్కలకు పెట్టారు. అంటే 1 కేజీ బియ్యం 18 మందికి సంతృప్తిగా సరిపోయింది. ఇది శ్రీ గురుడి సన్నిధిలో భాస్కరశర్మ చేసిన భిక్ష వృత్తాంతాన్ని పోలి ఉన్నది.

ఖమ్మంజిల్లా దమ్మపేటలో బ్యాంకు అధికారిగా రిటైర్ అయిన శ్రీ రామశాస్త్రిగారు ఒక సంవత్సరం దర్బార్ సాయి మందిర వార్షికోత్సవానికి ఆశ్రమంలో ఉన్నారు. ఆ రోజు ఉదయం హోమం జరుగుతుంటే వర్షపు చినుకులు పడటం ప్రారంభమయినాయి. స్వామి ఆకాశం వైపు చూసి చిన్నగా "ఆగు" అన్నారు. తర్వాత వర్షం పడటం ఆగిపోయి, కార్యక్రమం సజావుగా జరిగింది. సాయంత్రం పల్లకీ సేవకి ముందర మబ్బుకట్టి వర్షం మొదలైంది. వారంతా ఈ రోజు పల్లకీ సేవకి అంతరాయం కలుగుతుందనుకున్నారు. కానీ చిత్రంగా వర్షం ఆగిపోయింది. మబ్బులు విడిపోయాయి. పల్లకీ సేవ అయిన తర్వాత స్వామి వద్ద కూర్చున్నారు. స్వామి వారితో "పల్లకీ సేవ జరగదనుకున్నారు కదా!" అని అన్నారు. వారు 'అవును, స్వామీ! వర్షమొచ్చి పల్లకీ సేవ ఆగిపోతుందనుకున్నాము' అని చెప్పారు. స్వామి "పరమాత్ముడున్నాడు. ఆయనే అన్నీ చేస్తాడు" అన్నారు. సంకల్పమాత్రంతో పంచభూతాలను శాసించగల స్వామి ఎంత నిరాడంబరంగా ఆయన చేసే లీలలన్నీ కూడా పరమాత్ముడే చేస్తున్నారని చెపుతున్నారు. ఎంత సాధారణత్వమో కదా!

భక్తుల ప్రార్థన మేరకు స్వామి ప్రొద్దుటూరులో అమర్త్యేశ్వరస్వామి మందిర ప్రతిష్ఠ కోసమై వెళ్ళినారు. ఈ ప్రతిష్ఠా కార్యక్రమం జూన్ 4,5,6 తేదీలలో జరిగింది. 4వ తారీఖు ఉదయం కార్యక్రమం మొదలైనప్పుడు చిన్నగా చినుకులు మొదలైనాయి. స్వామి శివలింగం వంక చూస్తూ “ ఏమి శివా! నీకు వర్షం కావాలా? నీ త్రిశూలం పంపించు” అని అన్నారు. వెంటనే వర్షం ఆగింది. 6వ తారీఖు మధ్యాహ్నం 3గంటలకు స్వామి తిరుగుప్రయాణానికి కార్లు తీసుకురమ్మన్నారు. స్వామిని తీసుకు వెళ్ళటానికి ఆ కార్లు ఆలస్యంగా వచ్చిన కారణం అడిగితే, వచ్చేచోట బ్రహ్మాండంగా వర్షం పడుతోందని ఒక్క ప్రొద్దుటూరులోనే వర్షం పడట్లేదని చెప్పారు. కార్యక్రమం అయిన తర్వాత స్వామి భక్తులతో ప్రొద్దుటూరు దాటారు. కొంతసేపటికి ప్రొద్దుటూరులో బ్రహ్మాండంగా కుంభవృష్టి కురిసిందని తెలిసింది. ఈ లీల వలన స్వామి సర్వభూతనియంతని గ్రహించవచ్చు.

స్వామి ఆశీస్సులతో నిర్మించిన నెల్లూరు చిల్డ్రన్స్ పార్కు సాయిమందిర ప్రతిష్ఠ మే 13వ తారీఖున ఖాయమైంది. మే నెల ఎండలకి భయపడి మే 12వ తారీఖున నగరోత్సవం చేస్తే భక్తులు ఇబ్బంది పడతారు కదా! చేద్దామా, వద్దా? అని నిర్వాహకులు శ్రీనివాసులుగారు స్వామిని అడిగారు. స్వామి “ఏం ఫరవాలేదు నాయనా! మీరు మీ పని చేసుకోండి, ఏ ఇబ్బంది ఉండదు, నగరోత్సవం చేసుకోండి” అని అభయమిచ్చారు. మే 12న ఎండ చాలా తక్కువగా వుండటం వలన మధ్యాహ్నం 12గంటలకు బయలుదేరి నాలుగు గంటలపాటు చెప్పులు లేకుండా నగరోత్సవంలో భక్తులు చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు. తరువాత రోజు కూడా ఎండ తీవ్రత చాలా తక్కువగా వుండి మందిర ప్రతిష్ఠ కార్యక్రమము చాలా బ్రహ్మాండంగా జరిగింది. మే నెలలో ఆ రెండు రోజులు ఎండ తీవ్రత లేకుండా వుండటం చాలా ఆశ్చర్యము, అద్భుతము.

నెల్లూరు నుండి డా॥ శ్రీధర్‌రెడ్డిగారు స్వామివారి సమక్షంలో తమ సొంత యిల్లు కట్టుకోవటానికి శంకుస్థాపన చేసారు. నీటి వసతికి బావి త్రవ్వటానికి స్వామివారే స్వహస్తాలతో టెంకాయ కొట్టి, గడ్డపార వేసారు. ఆయన దయవలన ఎంతటి ఎండాకాలమైనా వారి బావిలో నీరు పుష్కలంగా ఉంటుంది. పొగతోటలో వారి యింటి చుట్టుప్రక్కలవారు

ఎండాకాలంలో ఆ బావి నీరే తీసుకొని వెళతారు.

నాయుడుపేట శ్రీనివాసులుగారి కుమార్తె అనూరాధ ఇల్లు కొందామనుకుంటున్నామని స్వామికి చెప్తే "ఇప్పుడు బాడుగ ఉంటున్న ఇల్లు కొనుక్కోమని" చెప్పారు. కావలిలో నీటికి చాలా ఎద్దడి. బోరు వేసినా కూడా చాలామందికి నీళ్ళు పడటం కష్టం. ఆమె తమ ఇంట్లో ఎక్కడ బోరు వేసుకోవాలో తెలుసుకుందామని ఇంటి ప్లాను కాగితం తీసుకొని స్వామి దగ్గరకి వెళ్ళారు. స్వామిని అడిగితే "నాకు ప్లాను కాగితాలు అక్కర్లేదు. బావి ప్రక్కన ఈశాన్యంలో చిన్న బాబా విగ్రహం పెట్టి, కొబ్బరికాయ కొట్టి గంగమ్మ తల్లికి నమస్కారం చేసుకో"మన్నారు. వారు స్వామి చెప్పిన విధంగా చేశారు. పుష్కలంగా మంచినీళ్ళు పడ్డాయి.

శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయినాథాయ నమః

# దైవం మానుష రూపేణ

## అధ్యాయము - 7
## సకల సాధు, దేవతా స్వరూపము

నిర్గుణుడు, నిరాకారుడు అయిన భగవంతుడు ఇంద్రియాలకు, మనస్సుకు గోచరించడు. తపోనిష్టులైన మహర్షులకు మాత్రమే ధ్యానంలో గోచరిస్తాడు. సామాన్యులను ఉద్ధరించడానికి ఆయనయే పరిపూర్ణులైన మహనీయుల రూపాలలో భూమి మీద లభిస్తుంటాడని భాగవతాది సద్గ్రంధాలు చెపుతున్నాయి. మహనీయుల రూపాలు వేరైనా వారిలో విరాజిల్లే సద్గురు (దత్తాత్రేయ) తత్వం ఒక్కటే.

**దేవతలంటే రూపాలు గాదు. లోకాతీతమైన శక్తిసామర్థ్యాలే. సిరిసంపదలనిచ్చేది లక్ష్మియనీ, విద్యనిచ్చేది సరస్వతియనీ, యిలా దేవతలగూర్చి శాస్త్రాలు చెబుతాయి. తమనాశ్రయించిన భక్తులకు రోగాలు నివారించినందు వలన దర్గాస్వామియే ధన్వంతరి. ధనధాన్యాలు ప్రసాదించడం వలన ఆయనయే లక్ష్మీదేవి. అందుకే సద్గురువు సకల సాధు స్వరూపి, సకల దేవతా స్వరూపి.**

చూడటానికి సద్గురువు సామాన్య మానవునిలాగే వున్నా, సమర్పణ చేసి నమ్ముకున్నవారిని రక్షించటానికి ఆయన యొక్క శక్తి సామర్థ్యాలు మాత్రం అపారము. సద్గురు లీలలను చింతన చేస్తే భగవంతుని తత్వంపై మనకు స్థిరమైన భక్తిశ్రద్ధలు కలుగుతాయి. సద్గురువు భక్తులకిష్టమైన మహనీయులతో తాదాత్మ్యము, తానే సకల దేవతా స్వరూపము అనే అనుభవాలిచ్చి తద్వారా ఆయా రూపాలలో వున్న భగవంతుని తత్వంపై విశ్వాసాన్ని దృఢపరుస్తూ అంతటా వున్న భగవంతుడిని జ్ఞప్తికి తెస్తారు. ఈ అధ్యాయంలో కూర్చిన వివిధ భక్తుల అనుభవాలే దీనికి నిదర్శనము.

ఒకరోజు వెంకటగిరి గోపాల్, అతని స్నేహితుడు ఆశ్రమానికి వచ్చి రాత్రి నిద్ర చేసారు. గోపాల్‌గారు మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పని

చేసేవారు. వచ్చిన రోజున గోపాల్ మిత్రుడు దర్గాలో నమస్కరిస్తుంటే ఒక అభయహస్తం సమాధుల మధ్య స్పష్టంగా కనిపించింది. తను భ్రమ పడటం లేదని ధృవపరచుకోవటానికి మిత్రుడు గోపాల్‌కు చెబితే, అతను అలాంటివి పట్టించుకోవద్దన్నాడు.

తర్వాతరోజు కావలి నుండి కొందరు భక్తులు ఆశ్రమానికి టెంకాయలు తీసుకుని వచ్చారు. స్వామి ఆశ్రమంలో అడుగుపెట్టిన వారిని చూడగానే, వాళ్ళను తెగతిట్టి "వీడు రోగం పోవాలని, వీడు డబ్బు కావాలని, వీడు మూట కావాలని వచ్చారు. మాకింకేమీ పని లేదా? పోండిరా పోండి" అని ఆశ్రమం వాకిలి వరకు తరిమి వేశారు. వాళ్ళు సందిగ్ధంగా వాకిలి బయటే నిలుచొని వున్నారు. కొంతసేపయ్యాక స్వామి వారిని దగ్గరకు పిలిచి ఆ టెంకాయలను అక్కడ పెట్టమన్నారు. స్వామి "దృఢమైన విశ్వాసంతో ఈ కొబ్బరికాయ తీసుకోండి. మీ కోరికలు తప్పక నెరవేరుతాయని" సవాలు చేసినట్లు ఉచ్ఛకంఠంతో పలికారు.

ఇది గమనించిన గోపాల్ మిత్రుడు స్వామి వద్దకు వెళ్ళి టెంకాయ సమర్పించి, స్వామి తాకినాక ఆ టెంకాయను తిరిగి తీసుకోవటానికి దోసిలి చాపాడు. వెంటనే శ్రీ స్వామి "నిన్న నీకు అభయహస్తం ఇచ్చాను గదా! ఇంకా మళ్ళీ ఇదెందుకూ" అంటూ అతనికి టెంకాయ ఇవ్వలేదు. క్రితంరోజు ఆయనకు అభయహస్తం కనిపించిన విషయం ఎవరూ చెప్పకుండానే స్వామి తెలియపరిచారు. ఆ అభయహస్తం ఇచ్చింది స్వామేనని చెపుతున్నారు. ఆ సమాధుల్లో మహనీయులకు, ఆయనకూ బేధం లేదని చెపుతున్నారు.

మునగా బాలసుబ్రహ్మణ్యంగారు 1999లో శిరిడీ వెళ్ళి వచ్చిన మూడు నెలలకి దర్గాస్వామివారి ప్రథమ దర్శనం కలిగింది. కొంత కాలం తర్వాత స్వామితో శిరిడీ వెళదామనుకుంటున్నామని చెపితే "మంచిది నాయనా! వెళ్ళిరా" అని ఆశీర్వదించారు. "వచ్చేటప్పుడు మన్మాడ్‌లో అశోక్‌బాబా ఉంటారు. ఆయన దర్శనం చేసుకో. ఆయన చూడడానికి పిచ్చివాడిలా ఉంటాడు. ఆయన చుట్టూ 4 కుక్కలు ఉంటాయి, మురికి కాలువల దగ్గర ఉంటాడు. ఆయన తిట్టినా, కొట్టినా, అరచినా మీరు ఎదురు మాట్లాడవద్దు" అని చెప్పారు. వారు

శిరిడీ సాయి దర్శనం అయినాక తిరుగు ప్రయాణానికి మన్మాడ్ స్టేషన్‌కి వచ్చారు. సుబ్రహ్మణ్యంగారు అశోక్‌బాబాను చూడటానికి వెతుక్కుంటూ వెళ్ళారు. బాబా కనపడక నిరుత్సాహంతో తిరిగి స్టేషన్‌కి వెళ్ళారు. అక్కడ ఉన్న కుటుంబసభ్యులు 'అంతకు ముందే అశోక్‌బాబా నాలుగు కుక్కలతో స్టేషన్‌లో దర్శనం ఇచ్చి, ఏ ట్రైనుకి వెళుతున్నారని అడిగారు. మేము ప్రక్కనున్న షాపులో అరటిపండు కొని ఇవ్వగా దాన్ని తిని, బాబా ఆశీస్సులు యిచ్చి వెళ్ళారని' చెప్పారు. ఆ విషయం తెలుసుకుని సుబ్రహ్మణ్యంగారు తనకు బాబా దర్శనం కాలేదని బాధపడ్డారు.

తిరిగి ఇంటికి వచ్చిన తర్వాత ఆశ్రమానికి వెళితే స్వామి "దర్శనం అయ్యిందా?" అని అడిగారు. సుబ్రహ్మణ్యంగారు 'స్వామీ! మా వాళ్ళను స్టేషన్‌లో కూర్చోపెట్టి, నేను బాబా కోసం వెతికాను. వారు నాకు కనపడలేదు. స్టేషన్‌లో ఉన్న మా వాళ్ళకు దర్శనమిచ్చి వెళ్ళారు' అని బాధగా చెప్పారు. వెంటనే స్వామి **"నాయనా! నీకు ఆత్రుత ఎక్కువ, ఆయన్ని వెతుక్కుని పోయినావు. ఆయన్ని వెతికి కనుక్కోలేము. సద్గురుదేవా! అని ఉన్నచోటనే మౌనంగా కూర్చుని ప్రార్థన చేస్తే, ఆయనే నీదగ్గరకి వచ్చేవారు కదా! ఆయన్ని చూడాలని ఊరంతా వెతికి వచ్చావు. ఆయన సాక్షాత్తు దత్తుడు నాయనా!"** అని చెప్పారు. అప్పటిదాకా అశోక్‌బాబా గొప్పతనం పూర్తిగా గ్రహించలేని సుబ్రహ్మణ్యంగారు వారు సాక్షాత్తు దత్తుడని వినేసరికి ఎంతో ఆశ్చర్యపోయారు.

కొంతకాలం తర్వాత జరిగిన విషయాన్ని మరలా గుర్తు చేసుకుని, అశోక్‌బాబా దర్శనం కాలేదని బాధపడుతూ, స్వామి దగ్గర ప్రస్తావన చేసారు. స్వామి "నాయనా! నువ్వు ఆయన్ని వెతుక్కుని పోయినావు. దేవుడిని వెతికి చూడలేవు. ఉన్నచోటనే సద్గురువు ఆశీర్వాదం ఉంటే ఆయన దర్శనమిస్తారు. నువ్వు ఇప్పుడు దర్శనం కాలేదని బాధపడుతున్నావు కదా! ఇస్తాంలే పో"అన్నారు. ఆరోజు రాత్రి ఆయనకు స్వప్నంలో సాక్షాత్తు శిరిడీసాయినాథుడు సింహాసనంలో కూర్చుని యోగనిద్రలో ఉన్నట్టు దర్శనం అయింది. వారి అబ్బాయి 'బాబా,

ఇలా ప్రత్యక్షంగా వచ్చారా!' అని బాబాని ముట్టుకొని చూస్తున్నాడు. బాబా ఒక మిద్దె అంత ఎత్తు ఉన్నారు. అప్పుడే అశోక్‌బాబా, దర్గాస్వామి మరియు చాలామంది మహనీయులు దర్శనమిచ్చారు. తర్వాత రోజు స్వామి దగ్గరకి వెళ్ళితే, ఆయనేమీ చెప్పకుండానే "అయ్యడా! దర్శనమిచ్చారా?" అని అడిగారు. ఆయన దర్శనమిచ్చారని చెప్పగా స్వామి "మంచిది నాయనా! నీవెప్పుడైతే నమ్ముతావో వాళ్ళు ఖచ్చితంగా దర్శనమిస్తారు, తోడు ఉంటారు" అని చెప్పారు. ఈ సంఘటనతో **మహనీయుల రూపాలు వేరైనా వారందరిలో ఉన్న సద్గురువు ఒక్కడే** అని సుబ్రహ్మణ్యంగారి మనస్సుకు దృఢంగా నాటుకుంది.

సుబ్రహ్మణ్యంగారు స్వామి దగ్గర జరిగిన అనుభవాలు జాగ్రత్తగా విచారించి చూచుకోగా, స్వామి బోధించే విధానం ఎంతో అద్భుతంగా వుంటుందని గ్రహించారు. ఆయన ప్రయత్నించినా అశోక్‌బాబాగారి దర్శనం అవలేదు. ప్రయత్నం చేయకపోయినా వారి కుటుంబసభ్యులకు దర్శనమిచ్చారు. ఆయన బాధతో స్వామితో విన్నవించుకుంటే, ఆయన ప్రయత్నాలకన్నా సద్గురువు ఆశీస్సులు ఎంత ముఖ్యమో మనస్సుకు హత్తుకునే అనుభవం ఇచ్చారు. చాలామంది మహనీయుల స్వప్నదర్శనమిచ్చి రూపాలు వేరైనా సద్గురువు ఒక్కడేననేది ఆయనకు దృఢపరిచారు. అంతేగాక ఆయనకు స్వప్న దర్శనమైందని సుబ్రహ్మణ్యంగారు ఏమీ చెప్పకుండానే స్వామే మొదట ప్రస్తావన చేసి సర్వజ్ఞులని తెలియపరిచారు.

2011 జనవరి 30వ తేదీన ఆదివారం సాయంత్రం 4 గంటల పైన ప్రొద్దుటూరు నుండి శ్రీ శ్రీ శ్రీ కృష్ణయ్యస్వామి శ్రీ దర్గాస్వామి ఆశ్రమానికి వచ్చారు. ప్రతి ఆదివారము ప్రొద్దుటూరులో ఒక భక్తుడు తన కారును తెచ్చి శ్రీ కృష్ణయ్యస్వామివారి దగ్గర ఉంచుతాడు. శ్రీస్వామివారు వచ్చి ఎక్కి ఎక్కడకి పొమ్మంటే అక్కడికి తీసుకుపోతారు. ఆ రోజు కృష్ణయ్యస్వామి బండిని దర్గాస్వామివారి ఆశ్రమానికి నడిపించమన్నారు. వారు వచ్చే సమయానికి ఆశ్రమంలో భక్తులు ప్రతిరోజూ జరిగే సిద్ధమంగళ స్తోత్ర పారాయణ చేస్తూ వున్నారు. వస్తున్న కారును చూచి శ్రీ దర్గాస్వామి "కృష్ణయ్యస్వామి వస్తున్నారని" పదే పదే చెప్పడంతో భక్తులందరూ

ఆశ్రమం బయటకు వచ్చి ఉత్సాహంగా అరుస్తున్నారు. కృష్ణయ్యస్వామివారు "త్వరగా పోనీయ్!" అని అరుస్తూ బండి నడుపుతున్న డ్రైవర్ భుజం మీద కొడుతున్నారు. అప్పటికి శ్రీ దర్గాస్వామి వయోభారం వలన ప్రయాసతో శ్రీ కృష్ణయ్యస్వామి కారు దగ్గరకొచ్చారు. ఆశ్రమంలోని భక్తులు శ్రీ కృష్ణయ్యస్వామి పాదాలు కడగాలని నీళ్ళచెంబుతో కారు వద్దకు వచ్చారు. శ్రీ కృష్ణయ్యస్వామి కారు దిగకుండానే ఆ చెంబు లాక్కొని తన అలవాటు ప్రకారం అందులోని నీళ్ళు భక్తులపై విసిరారు. (నీళ్ళు పైపుతో పట్టి భక్తులపై చల్లడం శ్రీ కృష్ణయ్యస్వామి అలవాటు). తర్వాత ఆ చెంబును భక్తులపైన పడేసి, ఒక పెద్ద కమలా పండు తీసుకొని శ్రీ దర్గాస్వామివారి దోసిట్లో పెట్టారు. శ్రీ కృష్ణయ్యస్వామి కొన్ని కిస్మిస్ పండ్లు, పచ్చి శెనగలు భక్తులపై విసిరారు. వాటిని భక్తులు ప్రసాదంగా తీసుకున్నారు. శ్రీ కృష్ణయ్యస్వామి కారులో నుండి దిగలేదు. భక్తులు కారు చుట్టూ చేరి సంతోషముతో కేరింతలు కొడుతున్నారు. కొద్దిసేపటి తర్వాత శ్రీ కృష్ణయ్యస్వామి డ్రైవర్ వీపు మీద గుద్దుతూ కారు వెనక్కు త్రిప్పమని అరుస్తున్నారు. డ్రైవర్ కారును వెనక్కు త్రిప్పి తిరుగు ప్రయాణమైనారు. శ్రీ దర్గాస్వామి ఆ కమలాపండును అందరూ పంచుకుని తినమని ఒక భక్తుని చేతికిచ్చారు.

శ్రీ కృష్ణయ్యస్వామి కొన్నిసార్లు శ్రీ దర్గాస్వామివారి ఆశ్రమానికి వచ్చి వెళ్ళారు. భక్తులు చూడగా వారిరువురూ సంభాషించుకున్న సందర్భము లేదు. ఒకరినొకరు చూచుకున్న తర్వాత శ్రీ కృష్ణయ్యస్వామి తిరిగి వెళ్ళేవారు.

వేణుగోపాల్‌గారు, కల్వాకం ఇలా చెపుతున్నారు: ఒకసారి నేను, నా భార్య, అత్తగారు, సహెూద్యోగి, ఇంకొక ఇద్దరు భక్తులము దర్గాస్వామి దర్శనం చేసుకొని **ప్రొద్దుటూరు కృష్ణయ్యస్వామిని** దర్శించుకుందామని గొలగమూడి నుండి బయలుదేరాము. స్వామి ఎంతో ఆప్యాయంగా మమ్మల్ని దగ్గరకు తీసుకొని మాట్లాడారు. ప్రొద్దుటూరు కృష్ణయ్యస్వామి దర్శనానికి వెళదామనుకుంటున్నాము అని చెప్పాము. దానికి దర్గాస్వామి "కృష్ణయ్యస్వామి దర్శనం చేసుకుంటారా?" అని వెంటనే బిగ్గరగా "ఏయ్ కృష్ణయ్యా! వీళ్ళకి దర్శనం యివ్వు" అని అన్నారు.

తర్వాత మేము ప్రొద్దుటూరులో కృష్ణయ్యస్వామి వుండే నివాసానికొచ్చేసరికి రాత్రి 8గం॥లు అయ్యింది. అప్పుడు స్వామి భోజనం చేస్తున్నారు. మరునాడు ఉదయమే దర్శనం అని అక్కడ వున్నవారు చెప్పారు. కానీ దర్గాస్వామి దయవలన మాకు కృష్ణయ్యస్వామి దర్శనం కిటికీ గుండా జరిగింది. తరువాత స్వామి ప్రసాదం లభించింది.

ఆ రాత్రికి ప్రొద్దుటూరులోనే బస చేశాము. తర్వాత రోజు దర్శనం అయ్యాక, స్వామిని వీడియో తీస్తుంటే ఆయన తమ మీద వున్న చొక్కా తీసి నా మీదకి కొట్టారు. అది మహా ప్రసాదంగా స్వీకరించాను. మా అత్తగారు 2,3సం॥ల నుండీ తలనొప్పితో బాధపడుతుండేవారు. ఏమీ అడగకుండానే స్వామి తనంతట తానే విసన కర్ర వెనుకకు త్రిప్పి మా అత్తగారి తలమీద కొట్టారు. ఈ సంఘటన తర్వాత ఆవిడకి తిరిగి తలనొప్పి రాలేదు. తృప్తిగా కృష్ణయ్యస్వామి దర్శనం, ప్రసాదం లభించటానికి దర్గాస్వామి ఆశీస్సులే కారణం అని తలుస్తున్నాను.

## కడప అవధూతేంద్రస్వామితో ఆధ్యాత్మిక మైత్రి

శ్రీ సద్గురు దర్గాస్వామివారి భక్తులు చాలామంది కడపలో వున్నారు. అది 1960వ సంవత్సరం అక్టోబరు నెల శ్రీ సద్గురు దర్గాస్వామివారు కడప విచ్చేసి కొందరు భక్తులను ఆశీర్వదించి చేతిలో ఒక ఖర్జూరపు పండును ఉంచుకొని వై.వి.చలం వీధిలో వస్తున్నారు. శ్రీ అవధూతేంద్రులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద కూర్చుని ఉన్నారు. ఆ మహనీయుని చూడగానే శ్రీ సద్గురు దర్గాస్వామివారు ఆదరభావంతో దగ్గరకు వెళ్ళి చేతనున్న ఖర్జూర ఫలమును స్వామివారికి సమర్పించారు. అవధూతేంద్రులు ఖర్జూరము గ్రహించడానికి అన్నట్లుగా ఎడమ చేయి ముందుకు చాపి తల దక్షిణము వైపు త్రిప్పి "హూ" అన్నారు.

**శ్రీ దర్గాస్వామి :** ఎడమ చేయి చాపావే! కుడి చేయి పట్టు ఇస్తాను.

**అవధూతేంద్రులు:** కుడి ఎడమలు ఉన్నాయా?

**శ్రీ దర్గాస్వామి:** నిన్ను కదిలించేదానికే అలా అడిగాను

అవధూతేంద్రులు లేచారు. చిన్నగా వై.వి.చలం వీధిలోకి వెళ్ళి పోయారు.

శ్రీ సద్గురు దర్గాస్వామి ఆయనను అనుసరించారు.

**అవధూతేంద్రులు:** మళ్ళీ వచ్చావా?

**శ్రీ దర్గాస్వామి:** నేను నిన్ను వదిలేదానికి రాలేదు.

**అవధూతేంద్రులు:** ఏమి తీసుకుందామని వెంటాడుతావు? పోతావా లేదా? అని హుంకరించారు.

శ్రీ సద్గురు దర్గాస్వామివారు పట్టు వదలక స్వామివారిని అలాగే వెంబడించారు. అవధూతేంద్రులకు భోజనం ఏర్పాటు చేసారు. శ్రీ దర్గాస్వామివారు తర్వాత కొన్ని అరటి పండ్లు కొని అవధూతేంద్రులకు సమర్పించబోయారు. ఏమనుకున్నారో ఏమో అవధూతేంద్రులు ఒక్కమారు ఆగ్రహావేశపరులై తన కుడి చేతితో శ్రీ దర్గాస్వామివారి చెక్కిలిపై ఒక చురక అంటించారు. అంతటితో ఆగక తన పవిత్ర పాద పద్మములతో శ్రీ సద్గురు దర్గాస్వామివారిని ఒక్క త్రోపు తోశారు. ఆ త్రోపుకు ఇరువురు స్వాములు క్రింద పడ్డారు.

వీరిద్దరి వింత ప్రవర్తన అక్కడున్న ఎవ్వరికీ బోధపడటం లేదు. ఆ మహనీయులిద్దరికీ ఆ సంఘటన సర్వ సహజముగా వున్నదే కానీ తాము ఏదో ప్రత్యేకంగా ప్రవర్తిస్తున్నామన్న స్ఫురణ కలగటం లేదు. అవధూతేంద్రులు లేచి వై.వి.చలం వీధి వెలుపలకు దారి తీశారు. శ్రీ సద్గురు దర్గాస్వామివారు ఆయనను అనుసరించారు. వీరిరువురు దారి వెంట వెడుతుంటే ఆ వింతను చూడటానికి ఎందరో జనులు ప్రోగయ్యారు. వదలక వారు ఈ స్వాముల వెంట వెళ్ళుతున్నారు. కడపకు దక్షిణంగా అగ్రహారం అనే ఒక చిన్న పల్లె వున్నది. ఆ పల్లెకు దక్షిణంగా “బుగ్గవంక” అనే వాగు సాగుతుంది. అవధూతేంద్రులు, శ్రీ సద్గురు దర్గాస్వామివారు ఆ ప్రదేశం చేరుకున్నారు. అప్పటికి సాయంత్రం అయ్యింది. వారు అంతరంగంలో సంభాషించుకున్నది ఏమిటో తెలియదు కానీ అక్కడికి వెళ్ళాక శ్రీ అవధూతేంద్రులు ప్రసన్నులయ్యారు. పరస్పరం ఆలింగనం చేసుకున్నారు. శ్రీ అవధూతేంద్రులు శ్రీ దర్గాస్వామి శిరస్సుపై ఆశీర్వాదపూర్వకంగా హస్తముంచారు. వర్ణనాతీతమైన బ్రహ్మానందంలో ఆ యిరువురూ ఓలలాడారు.

పై సంఘటనలు జరిగిన మరుసటి దినము అవధూతేంద్రులు కడప పాతబస్టాండు వద్ద కూర్చుని వున్నారు. అప్పుడు అక్కడికి దర్గాస్వామివారు వచ్చారు. శ్రీ దర్గాస్వామివారు కొన్ని ఇడ్లీలను అవధూతేంద్రులకు సమర్పించారు. శ్రీ అవధూతేంద్రులు వాటిని చేతిలోకి తీసుకుని ఆరగిస్తున్నారు. అంతలో దారిన పోయే ఒక మేక వాటిని ఆశించి వచ్చింది. అవధూతేంద్రులు "ఆ॥ పో॥" అని అదిలించారు. అందుకు శ్రీ దర్గాస్వామివారు "అది కూడా బ్రహ్మమే కదా! దానికిస్తే ఏమి?" అని ప్రశ్నించారు. శ్రీ అవధూతేంద్రులు ఆయనను సూటిగా చూసి "ఆ" అన్నారు. తర్వాత ఇడ్లీ తినలేదు. మిగిలిన ఇడ్లీని శ్రీ సద్గురు దర్గాస్వామివారు, ఆయన బృందం స్వామివారి ప్రసాదంగా స్వీకరించి ఆరగించారు.

శ్రీ అవధూతేంద్రులకు, శ్రీ సద్గురు స్వామివారికి అవ్యాజమైన అనుబంధమేదో వున్నది. ఒకనాడు శ్రీ అవధూతేంద్రులను శ్రీ దర్గాస్వామివారు అనుసరించారు. స్వామివారు నేరుగా వెళ్ళి బుగ్గవంకలోని మురికి నీటిలోకి దిగారు.

**అవధూతేంద్రస్వామి:** ఈ మురికి నీటిలోకి నీవు రాగలవా?

మున్సిపాలిటీ కాలువల గుండా బుగ్గవంక చేరుకున్న ఆ మురికి నీరు మహా దుర్గంధ భూయిష్టంగా ఉంటుంది. నల్లనిరంగులో క్రిములకు, మలమాలిన్యాలకు నిలయమై చూపరులకు జుగుప్స కలిగించే విధముగా వుంటుంది.

**దర్గాస్వామి:** ఊ!

అని అంటూ ఆ నీటిలోకి దిగారు. అంతేగాకుండా శ్రీ అవధూతేంద్రుల పాదోదకమని భావించుకొని ఆయన పాదముల క్రింద నీటిని చేతిలోనికి తీసికొని తీర్థంగా ఆపోసనం పట్టారు.

శ్రీ అవధూతేంద్రుల పరీక్ష నెగ్గటం అంత సులువైన పని కాదు. "సర్వం ఖల్విదం బ్రహ్మ" అను మాటను అక్షరసత్యంగా భావించారు. ఆయన అసహ్యించుకునే పదార్థమంటూ సృష్టిలో ఏదీ లేదు. అన్నింటా పరమాత్మనే దర్శిస్తూ తన శిష్యునికి కూడా దానినే ఉద్బోధించారాయన. అవధూతేంద్రుల వద్దకు ఎందరో యోగపురుషులు వచ్చి వెళ్ళేవారు.

అవధూతేంద్రస్వామి దర్గాస్వామివారికి లంబికాయోగాన్ని నేర్పిన గురువు.

## ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారితో ఆధ్యాత్మిక మైత్రి

ఒంగోలు నుండి కె.వి. రంగారావుగారు ఇలా చెపుతున్నారు: పూజ్యశ్రీ దర్గాస్వామీజీ వారిని నేను ప్రథమంగా దర్శించడం కేవలం ఆచార్య భరద్వాజ గారి అనుగ్రహం వలననే. తర్వాతికాలంలో చాలాసార్లు స్వామీజీ, మాతాజీల దర్శనం చేసుకున్నాను. వారి అనుగ్రహం, ఆశీర్వాదం వల్ల నా కుమారుని విద్య, మా పెద్దమ్మాయి వివాహం అన్నీ అనుకోని విధంగా జరిగిపోయాయి.

1. మాష్టారుగారి శిష్యులు కడప రామచంద్రయ్యగారు నన్ను స్వామివారి దర్శనానికి రమ్మన్నారు. నేను "ఆచార్యులవారు వారిని చూడలేదు కదా! వద్దులే" అని అన్నాను. కాదు, ఒకసారి చూసి వద్దాము, రమ్మన్నారు. సరే నేను వారిని దర్శించటం మాష్టారుగారికి ఇష్టమైతే స్వామివారే నాకు దక్షిణ ఇవ్వాలి అని మనస్సులో చెప్పుకున్నాను. దారి పొడుగునా ఈయన మహాత్ముడా? సిద్ధుడా? జ్ఞానా? అనేదే నా ఆలోచన. అక్కడ నన్ను చూస్తూనే "ఓహో రంగనాయకమ్మ కొడుకా" అని పిలిచి, "మా ఆవిడ పేరు కూడా రంగనాయకమ్మే" అని స్వామివారు అన్నారు. తరువాత అందరూ దక్షిణ ఇచ్చారు. నేను ఇవ్వలేదు. వారే నాకు 5 రూపాయలు దక్షిణ ఇచ్చి ఇది నీ గురుప్రసాదం అని అన్నారు. ఈ సన్నివేశముతో నాకు వారిపై గురుత్వం ఏర్పడింది.

2. తర్వాతికాలంలో నా కుమారుడు బి.టెక్ మరియు నా పెద్దమ్మాయి ఎమ్. ఎస్‌సి విద్యాభ్యాస ఖర్చులు శ్రీ స్వామివారు, అమ్మయ్యగారు భరించారు (ఆ రోజులలో సుమారు 80 వేల రూపాయలు). నా పిల్లల ఉన్నత చదువులకు సరిపడా ఆర్థిక స్థోమత నాకు లేదు. ఇది కేవలం స్వామి, అమ్మయ్యల కృప వలననే సాధ్యపడింది. ఈ సందర్భంగా శ్రీస్వామివారు చెప్పిన క్రింది మాటలు నాకు ఎల్లవేళలా జ్ఞాపకం ఉంటాయి. "నీ గురువు సిద్ధి పొందుతూ నిన్ను చూడమని నాకు చెప్పారు. నీ బిడ్డల చదువులకు ఇచ్చేదంతా గత జన్మలో నీ డబ్బే"

దమ్మపేట నుండి ఒక భక్తురాలు పంచుకున్న అనుభవాలు: నేను సాయిబాబాను పూజిస్తూ ఉంటాను. పూజలో సాయిబాబాకు ఉదయం పాలు, సాయంత్రం నీళ్ళు, వేసవికాలంలో మధ్యాహ్నం పూట కొబ్బరినీళ్ళు నివేదించేదానిని. సాయిసన్నిధి పారాయణ, మిగిలిన మహనీయుల చరిత్ర పారాయణలు చేస్తుండే దానిని. దమ్మపేట నుండి 10,15 మంది సత్సంగసభ్యులము దర్గాస్వామి దర్శనానికి వెళ్ళినప్పుడు స్వామి నన్ను ఉద్దేశించి "పాలు పెడతావా, నీళ్ళు పెడతావా, కొబ్బరి నీళ్ళు పెడతావా" అని అడిగారు. అంటే నేను సాయిబాబాకు నివేదించేవి స్వామికి చెందుతున్నాయని తెలిసి సాయిబాబా, దర్గాస్వామి వేరుకాదు ఒకటేనని స్ఫురించి స్వామి మీద విశ్వాసం పెరిగింది.

కొంత సమయం తర్వాత మరలా స్వామి నాతో "అమ్మా! నీవు చేసే పారాయణలన్నీ చూస్తున్నాను. నీకు త్వరలో ఇబ్బందులు రాబోతున్నాయి. సాయిబాబా చూసుకుంటారు" అన్నారు. తర్వాత ఒకేసారి నా ఇద్దరు తమ్ముళ్ళు చనిపోయారు. చాలా ఆర్థిక ఇబ్బందులు వచ్చాయి. నిదానంగా కోలుకొని పిల్లలు మంచి చదువులు చదువుకున్నారు. మా పిల్లవాడు ఒకరోజు ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వెళ్ళబోతూ దేనికో వెతుకుతుంటే వెంకయ్యస్వామి ఫోటో చేతిలోకొచ్చింది. స్వామి కనపడ్డారన్న విశ్వాసంతో ఈసారి తప్పకుండా ఉద్యోగం వస్తుందనుకొని వెళ్ళాడు. స్వామి దయవలన ఉద్యోగం వచ్చింది. శ్రీ సాయిబాబా, శ్రీ దర్గాస్వామి, శ్రీ వెంకయ్యస్వామి ఒకటేనని నమ్ముతున్నాను.

నాంపల్లిబాబా సమాధి మందిరంలో పనిచేసిన పూజారి రాజుగారు గొలగమూడిలో ఉంటున్నప్పుడు దర్గాస్వామి ఒక ధర్మసత్రం ప్రారంభోత్సవమునకు గొలగమూడి వచ్చారు. రాజుగారు ఆయన దర్శనము చేసుకున్నారు. అప్పటినుండి సుబ్బరామయ్య సార్ గారి సలహా మేరకు రాజుగారికి దర్గాస్వామి ఆశ్రమంలో ఉండి సేవ చేసుకోవాలనే కోరిక ఉండేది. గొలగమూడిలో ఉండే మిలట్రీ స్వామి కూడా స్వామి దర్శనానికి వస్తాననేసరికి ఒకరోజు ఇద్దరూ కలసి వెళదామనుకున్నారు. రాజుగారికి ప్రయాణానికి ముందు రోజు రాత్రి స్వప్నంలో దర్గాస్వామి, అమ్మయ్యగార్లు చాలా సేపు కనపడ్డారు. వారు

అనుకున్న విధంగా గొలగమూడి నుండి దర్గాల దగ్గరకి వెళ్ళేసరికి సాయంత్రం 7 గంటలయ్యింది. అప్పటికి స్వామి దర్గాలో దీపం పెట్టి ఆశ్రమం లోపలకి వెళ్ళిపోయారు. సామాన్యంగా ఆ తర్వాత స్వామి కొత్తగా వచ్చిన వాళ్ళతో మాట్లాడరు. ఇదే విషయాన్ని రాజుగారికి అక్కడున్నవాళ్ళు తెలియజేసి, రాత్రికి ఆశ్రమంలో నిద్ర చేసి మరునాడు దర్శనం చేసుకోవల్సిందిగా సూచించారు. ఇంతలో పాలరామయ్యగారు వచ్చి 'ఇక్కడ వెంకయ్యతాత దగ్గర నుండి వచ్చిన రాజును స్వామి రమ్మంటున్నారు' అని చెప్పేసరికి స్వామి దగ్గరకి వెళ్ళారు. పడుకున్న స్వామి లేచి రాజుగారిని చూస్తూ "రారా నువ్వు వస్తున్నావని సాయిబాబా చెప్పారు" అని చాలా ఆప్యాయంగా మాట్లాడారు. స్వామి సర్వజ్ఞత్వం చూచి రాజుగారు చాలా ఆశ్చర్యపోయారు.

తర్వాతి కాలంలో రాజుగారు కొన్ని నెలలు దర్గాస్వామి సేవలో ఆశ్రమంలో ఉన్నారు. ఆశ్రమంలో ఉన్న సమయంలో ఆయనకు ఒకసారి మలేరియా జ్వరం వచ్చి చికిత్సకు నెల్లూరు వెళ్ళారు. మలేరియా నయమై ఆరోగ్యం పుంజుకున్నాక షిర్డీ వెళ్ళి కొంతకాలం అక్కడ ఉన్నారు. ఆ సమయంలో హైదరాబాదులోని శ్రీ నాంపల్లిబాబాగారు కూకట్‌పల్లిలో ఉండేవారు. వారి వయస్సురీత్యా చాలా పెద్దవారు. ఆయనను కనిపెట్టుకుని సేవ చేయటానికి ఒక మనిషి అవసరం కలిగింది. నాంపల్లిబాబా గారి భక్తులు విచారించగా రాజుగారి గురించి తెలిసింది. రాజుగారిని హైదరాబాద్ వచ్చి నాంపల్లిబాబాకు సేవ చేసుకుంటారేమోనని అడిగారు. రాజుగారు నాంపల్లిబాబావారి సేవ చేసుకోవటమో లేక షిర్డిలోనే సాయినాథుని సేవలో నిలబడటమో నిర్ణయించుకోలేకపోయారు. ఈ పరిస్థితిలో దర్గాస్వామివారి మార్గదర్శనం కొరకు ఫోను చేస్తే **"ఆయన సాక్షాత్తు పరమేశ్వరుడు"** అని స్వామి చెప్పారు. రాజుగారు స్వామి సూచనమేరకు నాంపల్లిబాబా సేవకు వెళ్ళారు. తర్వాత కొన్నాళ్ళకు ఆయనకు వీపు క్రింద నొప్పిగా ఉండేది. ఆయన అదేమైనా వ్యాధేమోనని తలచి నాంపల్లిబాబాకు చూపిస్తే ఆయన చూచారు కానీ ఆ నొప్పి తగ్గలేదు. నాంపల్లిబాబా సమాధి అయిన తర్వాత విగ్రహం ఎలా తయారు చేయించాలి? సమాధి దగ్గర ఎలా సేవ చేయాలి? అనే విషయాలను

తెలుసుకోవటానికి దర్గాస్వామి వద్దకు వెళ్ళారు. స్వామివారు ఆ విషయాలను వివరంగా చెప్పి రాజుగారి సందేహాలు తీర్చారు. ఈ సందర్భంలో రాజుగారు ఆయన వెన్నునొప్పి గురించి స్వామికి చెప్పారు. స్వామి ఆయనను వెనక్కు తిరగమని చెప్పి, బెత్తంతో రుద్ది "భయపడాల్సిందేమీలేదని" చెప్పారు. చాలా కొద్దిరోజులలో ఆ నొప్పి తగ్గిపోయింది. సమాధి మందిరంలో నాంపల్లిబాబాగారి సేవ చేసుకోగలిగారు. ఈ విధంగా రాజుగారిని నాంపల్లిబాబా దగ్గరకు వెళ్ళమని ప్రోత్సహించటమేకాక, ఆయన అనారోగ్యాన్ని తొలగించి ఆయన తృప్తికరంగా నాంపల్లిబాబాను సేవించుకునే భాగ్యం కలిగించారు.

దమ్మపేట గ్రామం నుండి రవిగారి తల్లిగారి అనుభవం: మా బంధువులు మోసం చేసి మా ఆస్తి అంతా హస్తగతం చేసుకొన్నారు. చదువురాని నేను మానసిక ఒత్తిడులకు, విపరీతమైన అనారోగ్య బాధలకు గురి అయ్యాను. ఆస్తి పోవుటచే నా కొమార్తె వివాహం చేయలేకపోయాము. నాకు పిచ్చి పట్టిందని, చనిపోతానని అందరూ తలచారు. ఇంట్లో ఎవ్వరూ అన్నం ముట్టలేదు. మేము చాలా ప్రార్థనలు చేశాము.

ఒక రాత్రి ఆజానుబాహుడు, బొజ్జ గల్గి, నుదుట నామాలు ధరించిన వారు పద్మాసనంలో కూర్చొని కనిపించి "ఎందుకమ్మా బాధపడుతున్నావు? నేనున్నానుగా, మీరు ధర్మంగా, మంచిగా ఉండండి" అని ఎంతో ప్రేమగా, లాలనగా చాలాసేపు ఓదార్చారు. కేవలం ఈ కల ప్రభావం వలన తెల్లవారేసరికి ఎంతో ధైర్యం వచ్చి అంతా వారు చూసుకుంటారు అనే భావంతో 90% కోలుకున్నాము. ఆ స్వప్నంలో నన్ను ఓదార్చిన వ్యక్తి పోలికలు చెప్పగా, నా కుమార్తె అక్కల్కోట స్వామి సమర్థుల వారి బొమ్మ చూపించింది. ఆశ్చర్యంగా స్వామివారి పోలికలు నాకు స్వప్నంలో కనపడిన వ్యక్తికి సరితూగినాయి.

కొన్నాళ్ళ తర్వాత మా స్థలంలో మా బంధువులు షాపులు కట్టించి ఇతరులకు అమ్మేశారు. నేను శ్రీ వెంకయ్యస్వామివారిని తలచుకొని 'స్వామీ! వారికి డబ్బు బలం వుంది కనుక మీరేమీ చేయలేకున్నారా?' అని నిష్ఠూరాలాడాను. నిద్రపట్టి స్వప్నం వచ్చింది. స్వప్నంలో

శ్రీ దర్గాస్వామివారు మా ఇంటికి వచ్చి తృప్తిగా భోంచేశారు. "నేనెప్పుడూ నీకు తోడుగా వుంటాను. నీవు దేనికీ కంగారు పడవద్దు" అని వెళ్ళిపోతున్నారు. వెంటనే శ్రీ దర్గాస్వామివారు షిరిడీ సాయిగా రూపాంతరం చెందారు. బాబాను చూపించి ఇంట్లో అందరినీ దర్శించుకోమన్నాను. తర్వాత శివపార్వతులు, విష్ణుమూర్తి, లక్ష్మీదేవి, మూడు ముఖాలతో శ్రీ దత్తాత్రేయస్వామి దర్శనమిచ్చి స్వప్నం అదృశ్యమైంది. ఈ విధంగా నాకు శ్రీ దర్గాస్వామి దత్తుని రూపాలైన ఇతర మహాత్ములు కూడా తన రూపమేనని చెప్పారు.

దమ్మపేట నుండి సూర్య చంద్రారావుగారు శ్రీ దర్గాస్వామివారిని దర్శించారు కానీ వారు ఆయనకు ఏ దేవతగాను దర్శనమివ్వలేదే అనుకున్నారు. శ్రీ దర్గాస్వామివారి నుండి వచ్చిన రెండవ రోజున శ్రీ స్వామివారు ఒక కొండ మీద గల పెద్ద బండ మీద కూర్చొనియున్నారు. ఆయన చూస్తుండగానే పది శిరస్సులు గల సుబ్రహ్మణ్య స్వామిగా మారిపోయారు. ఇది ఆయన చాలా స్పష్టంగా చూసారు. ఆయనకు ఈ విషయం తలుచుకుని ఒళ్ళు జలదరించింది. ఆయనకు చిన్నప్పటి నుండీ శ్రీ సుబ్రహ్మణ్యస్వామి అంటే ఎనలేని ప్రీతి. ఆయన ప్రీతిననుసరించి శ్రీ దర్గాస్వామివారు దర్శనమిచ్చి తాము సద్గురువునని ఆయనకు దృఢపరిచారు. శ్రీ సద్గురు దర్గాస్వామే శ్రీ సుబ్రహ్మణ్య స్వామి! స్వామివారు తరచూ రూపాలు వేరైనా లోపల చైతన్యం ఒకటే అని చెప్పేవారు.

2011 ఏప్రిల్ 24 శ్రీ సత్యసాయిబాబాగారి పుణ్య తిథి. రెండు వారాల ముందర నుండి వార్తాపత్రికలలో ఆయన అనారోగ్యం గురించి వార్తలు వస్తున్నాయి. ఆశ్రమంలో ఎప్పటిలాగే ఉదయం 7:45 కి ఆరతి అయినాక స్వామి వచ్చి అమ్మయ్య సమాధి ముందర కూర్చున్నారు.ఇంతలో గోవర్ధన్‌గారు వచ్చి బాబాగారు పరమపదించినారనే వార్త స్వామికి తెలియజేసినారు. స్వామి ఒకక్షణం మౌనం వహించి ప్రక్కనే ఉన్న పంచాంగం తీసుకుని చూచినారు. ఆ సమయానికి ఆదివారం, సప్తమి తిథి, ఉత్తరాషాఢ నక్షత్రం. మూడూ కూడా సూర్య భగవానునికి చెందినవి. "ఆయన సూర్యనారాయణుని వంటివారు. మనము మిణుగురు పురుగుల వంటి వారం" అని కొన్ని క్షణాలు మౌనంగా వున్నారు. ఈ సంఘటన స్వామి ఔదార్యానికి ఒక

నిలువెత్తు నిదర్శనం.

విశాఖపట్టణం భీమిలి వద్ద ఒక కొండమీద యోగానంద అనే ఒక సిద్ధపురుషుడు చాలాకాలం నివసించినారు. స్వామివారు ఎప్పుడూ విశాఖపట్టణం వెళ్ళిన దాఖలాలు లేవు. ఒకసారి గుంటూరు భరద్వాజ స్వామి సన్నిధిలో ఉండగా "నాయనా! యోగి బాగున్నాడా?" అని అడిగారు. భరద్వాజ ఈ యోగానందగారిని అప్పుడప్పుడు దర్శించేవాడు.

స్వామి చిన్మయానందులవారు తమ సాధనలో ఉత్తీర్ణులై జ్ఞానం పొంది గీతాజ్ఞాన యజ్ఞాలు చేస్తూ దేశమంతా సంచరిస్తున్న కాలంలో దర్గాకు కూడా రావటం తటస్థించింది. ఒక సిద్ధపురుషుని మరియొక సిద్ధపురుషుడు మాత్రమే గుర్తించగలడనే చందాన చిన్మయానందులవారు స్వామిని చూడగానే వారిని గుర్తించారు. "మీ వంటివారు ఇటువంటి మారుమూల ప్రదేశంలో ఉండటం కన్నా దేశసంచారం చేస్తూ ప్రజలను జాగృతులను చేయటానికి మాతో కలిసి రండి" అని అడిగారు. అందుకు స్వామి సున్నితంగా నిరాకరించి "స్వామి! మా గురువుగారి ఆజ్ఞానుసారం మేమిక్కడ నిలబడటం జరిగింది" అని చెప్పారు. అయితే చిన్మయానందులవారు అడిగినందుకు తర్వాత కాలంలో తమ తరపున ఒకరిని పంపుతామని చెప్పారు. తర్వాతికాలంలో చిన్మయామిషన్ ఏర్పాటు అయినాక మిషన్‌లో చేరి సేవచేసే బ్రహ్మచారులు, సన్యాసులు కొంతమంది స్వామి దగ్గరకు వచ్చి మార్గదర్శనం పొందేవారు. వీరు స్వామి వద్దకే కాక, వారు పనిచేసే ప్రాంతాలలో ఉండే ఇతర సిద్ధపురుషులను కూడా దర్శిస్తూంటారు.

ఆదోనిలో స్వామి ప్రమేయానంద పనిచేస్తుండేవారు. ఆయన శ్రీ క్షేత్ర శ్రీ వల్లభాపురం, కురువపురంలో ఉండే శ్రీ స్వామి విఠలానంద సరస్వతీ మహరాజ్ (విఠల్‌బాబా) మరియు స్వామి దగ్గరకు వెళ్తూండేవారు. మాటల సందర్భంలో స్వామి గురించి శ్రీ విఠల్‌బాబాకు తెలియజేసారు. 2012 సం॥లో స్వామి సహస్ర చంద్ర దర్శనానికి కొంచెం అటుఇటుగా విఠ్ఠల్‌బాబాగారు దర్గాస్వామి ఆశ్రమానికి వచ్చారు. ఈ

పర్యటన గురించి ముందే తెలిసిన కొంతమంది చిన్మయామిషన్ స్వామీజీలు కూడా ఆ సమయానికి ఆశ్రమానికి వచ్చారు. వారిలో స్వామి చిదాత్మానంద కూడా ఉన్నారు. విఠల్‌బాబాగారు ఆశ్రమంలోనికి వచ్చి నేరుగా స్వామి వద్దకు వెళ్ళారు. స్వామి లేచి వారికి నమస్కరించి స్వాగతం పలికారు. విఠల్‌బాబాగారు తిరిగి వెళ్ళినాక చిదాత్మగారు స్వామిని 'స్వామీ! మీరు సామాన్యంగా ఎవరికీ నమస్కరించరు కదా? విఠల్‌బాబాగారికి నమస్కరించినారే?' అని అడిగారు. స్వామి "నేనేం చేసేది నాయనా? ఆయనలో మా గురువుగారు కనపడ్డారు" అని జవాబిచ్చారు.

సత్యసాయిబాబాగారు కానీ, విఠ్ఠల్‌బాబాగారు కానీ, గోపాల్‌బాబా కానీ, స్వామి శివానందగారు కానీ సమాధి చెందటానికి కొద్దిరోజుల ముందర స్వామి శారీరకంగా చాలా ఇబ్బంది పడ్డారు. వారు సమాధి చెందిన వార్త తెలిసినాక, స్వామికి శారీరిక ఇబ్బంది తగ్గేది.

2007 ఫిబ్రవరి 8,9 తేదీలలో పెద్దవడ్లపూడి గ్రామంలో శ్రీ భరద్వాజ మాస్టర్‌గారి భక్త సమ్మేళనంలో శ్రీ దర్గాస్వామివారు సూక్ష్మ రూపంలో వెళ్ళి ఈ క్రింది సందేశాన్ని ఇచ్చినారు.

**ఉప్పు కప్పురంబు, నొక్క పోలికనుండు**
**చూడ చూడ రుచుల జాడ వేరు !**
**పురుషులందు పుణ్య పురుషులు వేరయా**
**విశ్వదాభిరామ వినుర వేమా!!**

ఉప్పు, కర్పూరము చూసేదానికి ఒకటిగా ఉన్నా రుచి, వాసనలలో తేడా ఉంటుంది. అదే మాదిరి పురుషులందరూ ఒకటిగా ఉండవచ్చు కానీ పుణ్యపురుషులు, వారి నడక, దినచర్య వేరుగా ఉంటుంది. ప్రతి పురుషునికి సంసారము ఉంటుంది. ఈ సంసారము విషవృక్షంలాంటిది. రాగద్వేషాలు, ఈర్ష్య, ద్వేషము, లోభం, దర్పం, మోహం, మమకారం, లాభనష్టాలు కలది. ద్వంద్వాతీతముతో నిండిన విషవృక్షం. ఈ విషవృక్షానికి అమృతములాంటి ఫలాలు, అవి

సజ్జనసాంగత్యము, కావ్యామృతరసపానము. వీటిలో ఏ ఒకటి దొరికినా వారు పుణ్యపురుషులు. రెండూ దొరికినవారు ధన్యజీవి, ప్రేమమూర్తి, పూజింపదగినవాడు. సాధుసాంగత్యము, మహాత్ములను దర్శించటమేగాక వారిని ప్రపంచానికి తెలిపి పామరులను కూడా తరించటానికి దారి చూపిన మహాత్ముల ముద్దుబిడ్డ శ్రీ భరద్వాజగారు. శ్రీ దత్తాత్రేయుల వారి అవతారాలను వెలికి తీసిన ధన్యజీవి. శ్రీ సమర్ధ సద్గురు సాయినాథుని ఆంధ్రరాష్ట్రమేగాక అన్ని రాష్ట్రాలకు చాటిచెప్పిన అమృతమూర్తి శ్రీ భరద్వాజ. ఈనాడు ఆంధ్రరాష్ట్రమంతటా శ్రీ సమర్ధ సద్గురు సాయినాథుని మందిరాలు వెలియటానికి కారణం శ్రీ భరద్వాజ మాస్టర్‌గారు.

ఒక సమయంలో హైదరాబాద్ రాజీవ్ రామకృష్ణామిషన్‌వారి పుస్తకాలు బాగా చదువుకున్న సందర్భంలో ఆశ్రమానికి వెళ్ళాడు. ఆశ్రమంలో స్వామి దర్శనమైనాక, మాటల సందర్భంలో స్వామితో రామకృష్ణ పరమహంస ఇలా చెప్పారు అని తాను పుస్తకంలో చదివిన విషయాన్ని ఒకటి ప్రస్తావించాడు. స్వామి ఉత్తరక్షణంలో అతని మనస్సులో నాటుకునేటట్లు "రామకృష్ణ పరమహంస చెప్పినా, నేను చెప్పినా ఒక్కటే!" అని చెప్పారు. ఇంకొక సందర్భంలో "పుస్తకంలోనిది మస్తకంలోనికి రావాలి నాయనా!" అని చెప్పారు.

2007 మార్చి 16వ తారీఖున కడప శ్రీ రామకృష్ణమిషన్ వారు ఒక మఠం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామివారిని ఆహ్వానించారు. అక్కడ సభకు కలకత్తా నుండి 94సంవత్సరముల ఒక పెద్దస్వామి వచ్చారు. వారు స్వామిని చూచి "శ్రీ గురుదేవుల గారికి నమస్కారములు" అని చెప్పి సన్మానించారు. స్వామి ఈ క్రింది విధంగా చెప్పారు.

రామకృష్ణ గురుదేవ రామకృష్ణ సమభావ
రామకృష్ణ గురుదేవ రామకృష్ణ సమభావ !!రామ!!

రామకృష్ణ మమబంధో రామకృష్ణ గుణసింధో
రామకృష్ణ యతిచంద్ర రామకృష్ణ యోగీంద్ర !!రామ!!

రామకృష్ణ కరుణాత్మ రామకృష్ణ పరమాత్మ
రామకృష్ణ భవహర రామకృష్ణ అవతార !!రామ!!

రామకృష్ణ మమదైవం రామకృష్ణ మమస్వరం
రామకృష్ణ మమదైవం రామకృష్ణ కులదైవం !!రామ!!

మఠంవారు పై కీర్తనను ప్రింటు వేయించి తాళాలు,డకీలు తీసుకుని కాసేపు భజన చేసారు.

శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయినాథాయ నమః

# దైవం మానుష రూపేణ

## అధ్యాయము - 8

## స్వామి దర్శన, ఆశీస్సుల మాహాత్మ్యము

మహనీయుల దర్శనం పుణ్యం, స్పర్శనం పాపనాశనం అన్నారు పెద్దలు. మన సాధనతో నిర్మూలించుకోలేని దుర్గుణాలు మహనీయుల దర్శనంతో నిర్మూలించబడతాయని శ్రీ రమణ మహర్షి చెపుతారు.

"నిప్పు దగ్గర వున్న వ్యక్తి నా గుడ్డల చెమ్మ పోగొట్టమని ఆ అగ్నిని ప్రార్థించనక్కరలేదు. అక్కడున్న వేడికి మన గుడ్డల తేమ హరించబడుతుంది. అలాగే మహనీయుల సన్నిధిలో కూర్చున్నంత మాత్రాన మనము సాధనతో నిర్మూలించుకోలేని దుష్టసంస్కారాలన్నీ వాటికై అవే మన నుండి దూరవౌతాయి. గనుక శ్రీ వెంకయ్యస్వామివారు మీ ప్రాంతానికి వస్తే వదిలి పెట్టకుండా సాధ్యమైనంతసేపు వారి సన్నిధిలో వుండు" అని ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు శ్రీ పెసల సుబ్బరామయ్యగారిని ప్రోత్సహించి స్వామిదర్శనం చేయించారు.

మహనీయుల దర్శన, చరిత్ర పారాయణతో మనకి ఆధ్యాత్మికత మీద ఉన్ముఖం కలిగి సత్యం, ధర్మం, సంపన్నత్వం, సాధారణత్వము, సద్గురుసేవ అనేవి మనకు అలవడి, తద్వారా భగవంతునికి సంతృప్తిగా జీవించగలుగుతాము.

సామాన్యంగా మనకి జరిగే ఇబ్బందులు, ఆందోళనలు, మానసిక అలజడి వలన ప్రక్కవారి మీద రాగద్వేషాలు ఏర్పరచుకొని క్రొత్త ఋణానుబంధాలు తగిలించుకుంటాము. మన అజ్ఞానం వలన చిన్న చిన్న విషయాలకి కూడా ఆందోళన, మానసిక అలజడిని అనుభవిస్తాము. ఇంక పెద్ద ఇబ్బందులు ఎదురైతే ఎలా వుంటుందో కూడా ఊహించటానికి భయమేస్తుంది. మరి మనస్సు హాయిగా, ప్రశాంతంగా వుండాలంటే ఎవరు ఆ పరిస్థితులను శాసించగలరో వారిని తప్పక ఆశ్రయించి నడుచుకోవాలి. ఇప్పటిదాకా వివిధ భక్తులకు

చూపిన దివ్యలీలల ద్వారా స్వామి సర్వసమర్థత్వము, సర్వజ్ఞత్వము, సర్వవ్యాపకత్వము, భక్తుల మీద స్వామికున్న అపార ప్రేమ, కరుణలను తెలుసుకున్నాము. ఈ అధ్యాయములో స్వామి దర్శన, ఆశీస్సుల ప్రభావమెంతటిదో చూడగలము.

నెల్లూరులోని డాక్టర్ మల్లిఖార్జున్‌గారు 2003వ సం॥లో ఒక ట్రస్టు ఏర్పాటు చేసి, దాని ద్వారా సేవాకార్యక్రమాలు చేయాలనుకున్నారు. ఆ ట్రస్టు ప్రారంభోత్సవానికి దర్గాస్వామిని పిలుచుకు వచ్చే సందర్భంలో, స్వామిని ఆశ్రమంలో దర్శించుకునే భాగ్యం కలిగింది. స్వామిని దర్శించిన దగ్గర నుండీ ఆయనకు ధైర్యంగా వుండేది. అప్పటికి ఆయన ఒక అద్దె ఇంట్లో ప్రాక్టీసు చేస్తున్నారు. ఆయనకు క్రొత్త ఇల్లు కొందామనే ఆలోచన వుంది కానీ తగినంత డబ్బు లేదు. ఈ విషయం స్వామికి చెప్పారు. “నాయనా! నీవు తప్పక కొంటావు, డబ్బులు వస్తాయి” అని ఆశీర్వదించారు. ఆ ట్రస్టు శంకుస్థాపన అయిన తర్వాత స్వామి డా॥ శ్రీధర్ రెడ్డిని పిలిచి ఆయనకి మల్లిఖార్జున్‌గారిని చూపించి “శ్రీధర్! మావాడు మంచివాడు. ధైర్యం కొంచెం తక్కువ. నీవు చేయేస్తే కానీ పని కాదు” అని అన్నారు. మల్లిఖార్జున్‌గారు ఆ మాటలు చాలా క్యాజువల్‌గా తీసుకున్నారు. స్వామికి ఆయన చూసిన ఇంటిని చూపారు, స్వామి తన దండంతో నేలమీద కొట్టి “ఈ స్థలం నీదే నాయనా” అని అన్నారు.

కొన్నిరోజుల తర్వాత డా॥ శ్రీధర్‌రెడ్డి ఆయనతో “అరెయ్! ఎవరో ఇంకొకరు నీవు చూసిన ఇంటిని కొందామనుకుంటున్నారు” అని సమాచారం తెలిపాడు. అప్పుడు మధ్యవర్తుల ద్వారా విషయం తెలుసుకుంటే ఆ ఇల్లు తల్లీ, కొడుకులది. వీళ్ళు కొడుకుతో మాట్లాడుతుంటే ఇంకొకరు తల్లితో మాట్లాడుతున్నారు. వెంటనే అమెరికా నుండి మల్లిఖార్జున్‌గారి తమ్ముడు పంపిన 5 లక్షల రూపాయలు అడ్వాన్సు ఇచ్చారు. కొంతకాలం తర్వాత పూర్తిగా డబ్బు చెల్లించి ఆ ఇల్లు కొనుక్కున్నారు. అప్పుడు అంకణం 75 వేల రూపాయలుంటే ఇప్పుడు 7 లక్షల రూపాయలు పలుకుతోంది. కేవలం స్వామికృపతో ఆయన ఇల్లు కొనగలిగారు. పైగా శ్రీధర్‌రెడ్డి ఇచ్చిన

సమాచారం తర్వాతనే విషయం తెలుసుకుని త్వరగా ఇల్లు కొనుక్కోగలిగారు. స్వామి చెప్పిన మాట "శ్రీధర్ చేయేస్తే పని అవుతుంది" ఇల్లు కొన్న తర్వాత కానీ అర్థం కాలేదు.

నెల్లూరు నుండి మార్బుల్స్ వ్యాపారి రమేష్‌గారు స్వామి దగ్గరకు వెళ్ళటం మొదలుపెట్టిన దగ్గర నుండి ఆయన ఆర్థిక పరిస్థితి మెరుగు కాజొచ్చింది. నెల్లూరు టౌన్‌లోని మాగుంట లేఔట్‌లో ఒక స్థలం అమ్మకానికి పెట్టారు. అది అన్నివిధాల ఆయన వ్యాపారానికి అనుకూలంగా ఉండే స్థలం. కానీ అప్పటికి ఆయన దగ్గర దాన్ని కొనేంత డబ్బు లేదు. స్వామికి చెప్తే ఆ స్థలాన్ని ఆయనకిప్పిస్తామన్నారు. ఆ స్థలం ఒకటిన్నర సంవత్సరం తర్వాత కూడా ఎవరూ కొనుక్కోలేదు. ఒకతను అడ్వాన్సు ఇచ్చినా కానీ మొత్తం డబ్బు చెల్లించి పూర్తిగా కొనుగోలు చేయలేకపోయాడు. రమేష్‌గారు ఒకటిన్నర సంవత్సరం తర్వాత పెరిగిన రేటు ప్రకారం డబ్బు చెల్లించి స్వామి దయ వలన కొనుక్కోగలిగారు. వ్యాపారం బాగా అభివృద్ధి చెందింది. ఆయనెప్పుడు దర్శనం చేసుకున్నా స్వామి ఆయనతో "ఎన్ని కోట్లు కావాలి?" అని అడిగేవారు. ఆ విధంగానే ఆయనకు కోట్ల ఆదాయం ఇచ్చారు.

నెల్లూరు నుండి యశోదమ్మగారు, వారి కూతురు ఉమ 1996వ సంవత్సరం ఫిబ్రవరి 25వ తేదీన మొదటిసారిగా దర్గాకు వెళ్ళి స్వామివారిని దర్శించుకున్నారు. అప్పుడు ఉమ ఆఖరి సంవత్సరం బి.టెక్. చదువుతూ, ఎమ్.టెక్ ఎంట్రన్సు పరీక్ష వ్రాసి వున్నారు. స్వామీజీ ఆమెకు మద్రాసు గిండీ కాలేజీలో సీటు వస్తుందని చెప్పారు. తర్వాత ఆమెకు మద్రాసు ఐ.ఐ.టి.లో ఎమ్.టెక్. సీటు వచ్చింది. ఐ.ఐ.టిలో చేరిన తర్వాత ఆమె ఆ వాతావరణం చూసి భయపడి, చదువు మానివేద్దామనుకున్నది. స్వామీజీ "నువ్వు చదవక తప్పదు" అని ధైర్యం చెప్పి ఎమ్.టెక్. చదివించారు. ఆమెకు మేథమేటిక్స్‌లో సెంట్ (పూర్తి మార్కులు) వస్తుందని చెప్పారు. స్వామి చెప్పిన విధంగా ఆమెకు మేథమేటిక్స్‌లో సెంట్ (పూర్తి మార్కులు) వచ్చాయి. ఆమెను ప్రాజెక్టు బాగా చేయమని చెప్పారు. ఆమె చేసిన ప్రాజెక్టును బెస్ట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయబడి, దేశ ఉపరాష్ట్రపతి చేత అవార్డు అందుకుంది. చదువు

పూర్తయిన తర్వాత స్వామీజీ, అమ్మయ్యల ఆశీర్వచనం వలన ఆమెకు క్యాంపస్ ఇంటర్వ్యూలో హె.సి.ఎల్ కంపెనీలో ఉద్యోగం కూడా వచ్చింది.

నెల్లూరు నుండి జె.వి. నారాయణ మూర్తిగారు 1998 నాటికి విద్యాసంస్థలు పెట్టి నష్టం వచ్చి అప్పుల్లో వున్నారు. సాయికుమార్ అనే భక్తుడి ద్వారా దర్గాస్వామి గురించి తెలిసింది. కావలి రమా నర్సింగ్ హెూమ్‌కి స్వామి వచ్చినప్పుడు, వారి కష్టాలు చెప్పుకోవటానికి ఆయన భార్యతో కలసి వెళ్ళారు. వేల సంఖ్యలో భక్తులు వచ్చారు. సాయంత్రం మాత్రమే స్వామికి చెప్పుకునే అవకాశం కలిగింది. ఆయన వారికున్న రెండు సమస్యల గురించి చెప్పారు. అవి

1. ఆయన భార్యకు మోకాళ్ళ నొప్పుల వలన క్రింద కూర్చోవటం కూడా కష్టంగా ఉండేది. ఎంతో మంది డాక్టర్లకు చూపించినా ఫలితం లేకపోయేసరికి ఆయన భార్య విసిగిపోయి మరే డాక్టరు దగ్గరకి వెళ్ళేది కాదు. కానీ దర్గాస్వామి "కూర్చో అక్కా!" అనే సరికి ఏ యిబ్బందీ లేకుండా క్రింద కూర్చో కలిగింది. స్వామి దండంతో వీపు మీద నిమిరి తగ్గిపోతుంది అని అన్నారు. ఆ అమృతవాక్కుతో 10 సం॥లుగా వున్న మోకాళ్ళ నొప్పులు ఆ రోజు నుండీ తగ్గిపోయాయి.

2. ఆయన తన అప్పులు గురించి విన్నవిస్తే స్వామి "నేను సగం ఇస్తా, నువ్వు సగం వేసుకో" అన్నారు. తర్వాత ప్రయోజకులైన ఆయన విద్యార్థులను అడుగగా కొంత డబ్బు ఇచ్చారు. ఆయన ఇంటిని అమ్మివేసి అప్పులు తీర్చేశారు. తర్వాత దర్గాల దగ్గరకి వెళ్ళినప్పుడు స్వామితో 'మీరు సగం ఇస్తానన్నారు కానీ నేను అప్పులు తీర్చేశాను' అని చెప్పగానే "అదేమిటయ్యా! నీ శిష్యులు అంతా తలా ఒక చెయ్యి వేసారు కదా. అదే నేను, అదే నేను" అని స్వామి తమ విశ్వరూపాన్ని ప్రకటం చేసారు. అంతటా తానైన పరమాత్మలో భాగమై ఉండి కూడా ఆ స్పృహను కోల్పోయిన మనలను ఉద్ధరించటానికి ఆ పరమాత్మే వివిధ మహనీయుల రూపాలలో ఆయా దేశ, కాల పరిస్థితులను బట్టి వస్తారు. సద్గురువు విశ్వరూపుడని, ఏ జీవిని ఆదరించినా, బాధించినా అది ఆ సద్గురువుకే చెందుతుందని గుర్తించి నడుచుకుందుము గాక!

3. ఒకసారి నారాయణ మూర్తిగారు దత్తయజ్ఞం చేస్తున్నామని స్వామికి చెప్తే "నేనొస్తాను" అని ఆశీర్వదించారు. బాలార్క నారాయణమూర్తి గారి కోడలు. జులై 14, 15, 16లలో ఆయన కాలేజీ క్యాంపస్‌లో దత్తయజ్ఞం చేసారు. చిట్టచివరి రోజున పెద్ద మీసాలు, తెల్ల జుబ్బా వేసుకొన్న ఒక క్రొత్త వ్యక్తి వచ్చిన వారికి కుర్చీలు వేస్తున్నాడు, ఎవరీ క్రొత్తవ్యక్తి అని వారి కోడలు చూస్తూండగా అతను కూడా బాలార్క వంక చూచాక అదృశ్యమైపోయాడు. ఈ విషయం నారాయణ మూర్తిగారికి తెలియదు. దర్శాల దగ్గరకి వెళ్ళినప్పుడు 'స్వామీ! మీ ఆజ్ఞతో యజ్ఞం బాగా జరిగింది' అని చెప్పాను. వెంటనే "నేనొచ్చాను, మీ కోడలు నన్ను చూసి నవ్వింది, మీసాలు పెట్టుకొని, తెల్ల జుబ్బా వేసుకొని వచ్చాను. మీ బావమరిది భార్యకు కుర్చీ కూడా వేసాను " అని చెప్పేసరికి ఆయన చాలా ఆనందపడ్డారు. బాలార్కగారు నెల్లూరులో స్వామి దర్శనం చేసుకున్నప్పుడు, స్వామి ఆమె చేతులు పట్టుకుని "అమ్మా! మీ మామగారు యజ్ఞం చేసినప్పుడు నేనొచ్చాను. నువ్వు చూసావు" అని చెప్పేసరికి ఆమె చాలా ఆనంద పడింది.

బాలార్కగారు శాస్త్రీయసంగీతాన్ని అభ్యసించారు. ఆమెకు లలితసంగీతంగా భజనలు పాడే అలవాటు లేదు. నెల్లూరులో దత్తమఠంలో జరిగే కచేరీకి కొన్ని కృతులు/కీర్తనలు అభ్యాసం చేసి వెళ్ళారు. దత్తమఠంలో స్వామి సాయిబాబా మీద పాట పాడమని అడిగారు. ఆమెకు పూర్వ అభ్యాసం లేకపోయినా అలవోకగా భజనలు పాడింది. ఆమె ఇది కేవలం స్వామి కృప అని నమ్ముతున్నారు.

స్వామి బాలార్కగారితో "నీవు నాకూతురువి. వేసవి కాలంలో కూతురు, అల్లుడు ఇంటికొస్తే కదా నాకు ఆనందంగా ఉండేది" అని ఆమె భర్తను దర్శాలకు రమ్మని చెప్పారు. ఆమె కూతురుతో స్వామి "నీకు 10వ తరగతిలో 550 మార్కులు పైన వస్తే వెయ్యిన్నూటపదహార్లు ఇస్తాను" అని చెప్పారు.

లక్కిరెడ్డిపల్లి దూరదర్శన్ కేంద్రంలో పనిచేసే వెంకట రమణ 2008లో శిరిడీ వెళ్లినప్పుడు ఒక గురువారం ద్వారకామాయిలో కూర్చుని వున్నాడు. ఆ రోజు చావడి ఉత్సవం జరుగుతోంది. అందువలన అక్కడ

వున్న భక్తులందరినీ బయటకు పంపించారు. ఆయన, తన భార్య వారి యిద్దరి పాపల్ని ఎత్తుకుని నుంచున్నారు. అన్ని వేలమందిలో వెంకటరమణ, అతని భార్యని ముక్కూ, ముఖము తెలియని వ్యక్తి ద్వారకామాయిలోకి రమ్మని పిలిచి లోపల కూర్చోబెట్టాడు. స్వామే ఆ రూపంలో వచ్చి వారిని అలా అనుగ్రహించారని భావిస్తున్నారు.

వెంకటరమణకు ఇద్దరు ఆడపిల్లలు. స్వామి వారికి ఒక మగపిల్లవాడిని ఇస్తామని చెప్పారు. తర్వాత అతని భార్య గర్భవతి అయింది. అతను స్వామి దగ్గరున్నప్పుడు అతని భార్యకి నొప్పులు వస్తున్నాయని ఫోను ద్వారా తెలిసింది. స్వామికి చెప్తే స్వామి ఊదీ ఇచ్చి "భద్రం నాయనా! 1వ తారీఖు 10 గంటలు దాటితే అనుకూలంగా వుంటుంది" అని చెప్పారు. నా భార్యకు 29వ తారీఖు తెల్లవారుఝామున 3 గం॥ 45 ని॥లకు ప్రసవం జరిగి మగపిల్లవాడు జన్మించాడు. పిల్లవాడిని బయటకు తీసేటప్పుడు తేడా జరగడంతో అతని భార్యకు బాగా రక్తస్రావం అయ్యి, కోమాలోకి వెళ్ళింది. అతని స్నేహితులు 5 బాటిల్స్ రక్తం ఇచ్చారు. కానీ ఎక్కించిన రక్తం అంతా బయటకు వచ్చేసింది. డాక్టరమ్మ, ఆమె భర్త ఆమె నాడి చూసి బ్రతకదని చెప్పారు.

స్వామికి ఫోను చేసి విషయం చెపితే చాలా కోపంగా "ఎవడ్రా వాడు చెప్పేదానికి, కర్త అనేవాడు వున్నాడు చనిపోయిందని చెప్పటానికి. ఒక బాటిల్ రక్తం ఎక్కించుకుంటూ వేలూరు పోండి. ఏమీ కాదు పో! ఆ పాపకు" అని అభయమిచ్చారు. వారు అలానే వేలూరు వెళ్ళి ఆస్పత్రిలో చేర్పించారు. మరురోజు ఉదయం కల్లా అతని భార్య పరిస్థితి మెరుగైంది. కానీ వారి బాబు 1వ తారీఖు ఉదయం 5 గం॥ 15 ని॥లకు మరణించాడు. ఇంటికి వచ్చిన తర్వాత స్వామి దగ్గరకి వస్తే "చెట్టు (తల్లి) కావాలా? కాయలు (పిల్లలు) కావాలా?" అని అడిగారు. ఆయన చెట్టే కావాలన్నాడు. తర్వాత స్వామి ఆయనతో "నీకు మగబిడ్డని ఇద్దామనుకుంటున్నాము, ఇస్తాముర" అని ఆశీర్వదించారు. స్వామి ఆశీస్సులే లేకుంటే 5 బాటిల్స్ రక్తం ఎక్కించినా నిలబడనిది ఒక బాటిల్ రక్తం ఎలా ఎక్కింది? అప్పటిదాకా ప్రమాదకరంగా వున్న పరిస్థితి ఒక్కరోజులో ఎలా మారుతుంది?

నాయుడుపేట ఎస్. శ్రీనివాసులుగారి కూతురు అనూరాధ. 2004లో స్వామి దగ్గరకి వెళ్ళి స్వామితో చెన్నై, హైదరాబాదు, బెంగుళూరులలో ఏ వూరిలో షాపు పెట్టుకోమంటారు అని అడిగితే స్వామి "వైజాగ్ వెళ్ళ"మన్నారు. ఆమె హైదరాబాదులో తెలిసినవారు వున్నారంటే స్వామి వద్దన్నారు. చెన్నై దగ్గరగా వుంటుందని చెప్పింది. అదీ వద్దన్నారు. వైజాగ్‌లో తెలిసిన వారెవరూ లేరని చెపితే "మీ ఆయన స్నేహితుడు వున్నాడు. అతను చూసుకుంటాడు. అక్కడ దేవుడిలాగా సహాయపడే వాళ్ళు వుంటారని" చెప్పారు. వైజాగ్ నుండి దర్గాలకి రావాలంటే దూరం అని చెప్పారు. "అక్కడ గోపాల్‌బాబా వున్నారు. ఆయన దర్శనం చేసుకోండి. నన్ను ఆయనలో దర్శించుకోండి. అవసరమైనప్పుడు ఫోను చెయ్యండి" అని చెప్పారు.

వారు ఇంటికి వచ్చాక ఇంకా దాని గురించే ఆలోచిస్తున్నారు. ఒకరోజు స్వప్నంలో ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ గారి సతీమణి శ్రీమతి అలివేలు మంగమ్మగారు కనిపించి శ్రీ దర్గాస్వామి ఫోటో చూపించి ఆయన మాట వినండి, మీకు మంచి జరుగుతుంది అని చెప్పారు. వారు అలానే వైజాగ్ వెళ్ళారు. స్వామి చెప్పినట్లే చుట్టుప్రక్కల వారి సహాయ, సహకారాలతో అంతా సవ్యంగా జరుగుతోంది.

2008లో అనూరాధగారి భర్తకు జ్వరంగా వుండి తగ్గలేదు. షుగర్ పరీక్ష చేస్తే 430 వుంది. డాక్టరుగారు ఆస్పత్రిలో అడ్మిట్ అవ్వమన్నారు. ఆయన కంగారుపడి ఇంటికి వచ్చాక దర్గాస్వామికి మంగళవారం ఫోను చేస్తే " ఏమీ కంగారు పడాల్సిన అవసరం లేదు. డాక్టరు సూదిమందు వేస్తారు, భయపడవద్దు, మళ్ళీ శనివారం ఉదయం 10గంటలకి ఫోను చెయ్యండి" అని స్వామి అభయమిచ్చారు. డాక్టరుకి చూపిస్తే ఇన్సులిన్ ఇంజెక్షన్లు ఇచ్చారు. శనివారానికి కొద్దిగా కోలుకున్నారు. స్వామికి ఫోను చేస్తే స్వామి "ఇప్పుడు ఫరవాలేదు కదా" అన్నారు. 'ఇప్పుడు ఫరవాలేదు, కానీ మా ఆయనకు రాత్రిపూట నిద్ర రావటం లేదు స్వామీ' అని విన్నవించింది. "పడుకునే ముందర సాయినామం 20సార్లు జపించమన్నారు. అంతా సాయినాథుని దయతో జరుగుతుంది" అని చెప్పారు. అలానే చేస్తే హాయిగా నిద్రపట్టేది. 15 రోజుల తర్వాత డాక్టరు

షుగర్ పరీక్ష చేసి, నార్మల్‌గా వుందని చెప్పారు. వారు ఆశ్చర్యంగా 15రోజులలో ఎలా తగ్గింది అని అడిగితే, అనూరాధ భర్త 'దర్గాస్వామి ఆశీర్వదించటం వలన' అని చెప్పి స్వామి వివరాలు తెలిపారు.

అనూరాధగారి అబ్బాయిని చిన్న వయస్సులో డాక్టర్లు పరీక్ష చేసి కంటిలో గ్లుకోమా వచ్చే అవకాశం వుందని చెప్పారు. స్వామికి చెప్తే కంటి చూపుకి ఢోకా లేదని చెప్పారు. 4 సంవత్సరముల తర్వాత చెకప్ కోసమని వెళ్ళితే ప్రముఖ డాక్టరు కంటిలో ప్రాబ్లమ్ వుందని చెప్పారు. వెంటనే చెన్నైలోని శంకర్ నేత్రాలయలో చూపిస్తే గ్లుకోమా వుందని నిర్ధారించి తరువాత రోజు రమ్మన్నారు. మరురోజు ఉదయం ఫీల్డ్ టెస్ట్ చేసి గ్లుకోమా లేదని తేల్చి ఇంకొక వార్డుకి పంపించారు. అక్కడ చెక్ చేసి చుండ్రు, దురదల వలన ఇలా అయ్యిందని చెప్పి, కళ్ళకి ఆయింట్‌మెంట్, డ్రాప్స్ ఇచ్చి, వేడి నీళ్ళతో కానీ, చల్లటి నీళ్ళతో కానీ కాపడం పెట్టమన్నారు. ప్రముఖ డాక్టర్లు అధునాతనమైన ప్రయోగశాలల్లో తేల్చి చెప్పింది లేకుండా పోయిందంటే స్వామి వాక్కు ఎంతటి మహిమాన్వితమైనదో తెలుస్తోంది.

2008లో అనూరాధగారి అమ్మాయికి 10సంవత్సరాల వయస్సులో ఒక చర్మవ్యాధి వచ్చి శరీరమంతా నల్లటి మచ్చలు వచ్చాయి. డాక్టరుగారికి చూపిస్తే పూవా థెరపీ (కరెంట్‌తో చేసేది) 20సార్లు చేసారు అయినా తగ్గలేదు. పైగా ఆ అమ్మాయి చాలా నీరసించింది. డాక్టరిని అడిగితే ఇంకొక 20 లేదా 40సార్లు చేయాల్సి వుంటుందని చెప్పారు. వారు భయపడి దర్గాస్వామికి చెప్తే "ప్రాణహాని లేదు. మీ కులదైవాన్ని మరిచిపోయారు. ఆయనకు మ్రొక్కుకోండి, తగ్గిపోతుంది" అని చెప్పారు. తరువాత రోజు గోపాల్‌బాబాగారి దర్శనానికి వెళ్ళితే ఆయన మౌనంగా వేంకటేశ్వరస్వామి, పద్మావతిదేవిల ఫోటో ఇచ్చి పట్టుకోమన్నారు. అనూరాధగారు వారి కుటుంబ సభ్యులందరూ ఆ ఫోటో పట్టుకొని అరగంట నిల్చున్నారు. వారి కులదైవం తిరుపతి వేంకటేశ్వరస్వామి. వారు పాపకి చర్మవ్యాధి తగ్గిపోతే తిరుపతి శ్రీ వేంకటేశ్వరస్వామికి పాప తలనీలాలు సమర్పిస్తామని మొక్కుకున్నారు. తరువాత చెన్నైలో డాక్టరుకి చూపించగా మందులు

వ్రాసిచ్చారు. ఆ మందులు వాడగా అంతటి భయంకర చర్మవ్యాధి ఆశ్చర్యంగా తగ్గిపోయింది. వారి కులదైవానికి మొక్కుకోమని దర్గాస్వామి చెప్పటమూ, గోపాల్‌బాబా వారి కులదైవము ఫొటో ఇవ్వటం బట్టి దర్గాస్వామి, గోపాల్‌బాబా వేరుకాదని గుర్తించి ఆ మహనీయులను ఏ భేద భావము లేకుండా సేవించెదముగాక!

గంగోత్రి, యమునోత్రి, కేదార్‌నాథ్, బదరీనాథ్‌లను కలిపి చార్‌ధామ్ అంటారు. ఒకసారి చార్‌ధామ్ యాత్రకి వెళ్ళాలని స్వామి అనుమతితో అనూరాధగారి భర్త ఒక్కరే టిక్కెట్లు రిజర్వు చేయించుకున్నారు. అనూరాధగారు ఆవిడ భర్త ఒక్కరే వెళ్ళుతున్నారని మధనపడ్డారు. ఆయన రిజర్వేషన్ చేయించుకున్న తర్వాత, తెలిసినవారు ఐదుగురు కలిసి వస్తామని టిక్కెట్లు రిజర్వు చేయించుకున్నారు. యాత్రకు బయలుదేరే ముందర స్వామి ఆశీస్సులకై ఫోను చేస్తే "జయం, జయం, జయం" అని ఆశీర్వదించారు. అన్నిచోట్ల బాగా దర్శనం జరిగింది. ఉత్తర కాశీ నుండి బయలుదేరి కేదార్‌నాథ్ దగ్గరకి వచ్చేసరికి వర్షం పడుతోంది. పైకెళ్ళే కొద్దీ ఆక్సిజన్ తగ్గిపోతుండడం వలన ఆయనకు ఊపిరి తీసుకోవటం కష్టమైంది. దాంతో ఆ రోజు ప్రయాణం ముగించి ఉత్తర కాశీకి వచ్చేశారు. ఆయన అనారోగ్యం వలన తనతో వచ్చినవాళ్ళని తర్వాత రోజు కేదార్‌నాథ్ వెళ్ళిరమ్మన్నారు. కానీ ఆ రోజు రాత్రి 12 గం॥ 30 ని॥లకు స్వప్నంలో దర్గాస్వామి, దర్గామాత, గోపాల్‌బాబా కనపడి ప్రక్కనే వున్న పార్వతీ, పరమేశ్వరులకు ఆయనను చూపి "వీడు నా బిడ్డ. మీ దర్శనం ఇచ్చి జాగ్రత్తగా పంపించండి" అని చెపుతున్నారు. ఈ స్వప్నం ఎంత అమోఘమైనదంటే తెల్లవారేసరికి ఎక్కడలేని ఉత్సాహం వచ్చి అనూరాధగారి భర్త అందరికంటే ఉత్సాహంగా బయలుదేరి కేదార్‌నాథ్‌కు వెళ్ళి రాగలిగారు. అంతేగాక చుట్టుప్రక్కల ప్రదేశాలు కూడా చూడగలిగారు. మిగిలిన వారందరూ ఓపిక లేక ఆ ప్రదేశాలకు వెళ్ళలేకపోయారు. సద్గురు ఆశీస్సులతో చేసిన యాత్ర ఎంత సార్థకవంతమవుతుందో ప్రత్యక్షంగా అనుభవమైంది, కొసమెరుపేంటంటే వారు కేదార్‌నాథ్‌కి వెళ్ళిన రోజు వాతావరణం చాలా ఆహ్లాదకరంగా వుండి ముందరరోజు, తర్వాతరోజు

కూడా వర్షం పడింది. ఇలా ప్రకృతి కూడా ఎంతో సహకరించింది.

నెల్లూరు నుండి వి.వి.రామారావుగారి భార్య 1997లో చనిపోయారు. 1999లో వారి పెదబాబుకి పెళ్ళి సంబంధాలు చూస్తున్నారు. పిల్లవాడు వరంగల్ ఆర్.ఇ.సి (ఎన్.ఐ.టి)లో డిస్టింక్షన్‌లో పాసై ఉద్యోగం చేస్తున్నా, ఏదో కారణంతో చాలా పెళ్ళిసంబంధాలు తప్పిపోతుండేవి. అదీగాక వారి తాతల దగ్గర నుండి ప్రతీ తరంలో ఎవరో ఒకరు పెళ్ళికాకుండా ఉండేవారు. (వారి పెద్ద తాతయ్య, వారి పెదనాన్న, వారి అన్నయ్యలకు పెళ్ళిళ్ళు కాలేదు). దీనితో ఆయనకు పిల్లవాడి పెళ్ళి గురించి ఆదుర్దా ఎక్కువైంది. 1999 జనవరిలో ఈ విషయమై స్వామి దగ్గరకి వెళ్ళి విన్నవించుకున్నారు.స్వామి "మే మొదటివారంలో పెళ్ళి అవుతుంది" అని చెప్పారు. ఆయన ప్రయత్నమేమీ లేకుండా ఒక సంబంధం వారు వారంతట వారు వచ్చి మాట్లాడుకుని సంబంధం ఖాయం చేసుకున్నారు. స్వామి దయ వలన మే 9 వ తారీఖు పెళ్ళి జరిగింది.

రామారావుగారు రాపూరులో సబ్ ట్రెజరీ ఆఫీసర్‌గా వుంటున్నప్పుడు ఆయన దగ్గర పనిచేసే షరాఫ్ విపరీతంగా త్రాగేవాడు. అతని త్రాగుడు అలవాటు వలన అతని చెల్లెలికి పెళ్ళి సంబంధం కుదరట్లేదు. ఒకరోజు ఆ పిల్ల ఆయన దగ్గరకొచ్చి బాధపడితే, రామారావుగారు ఆ పిల్లను దర్గాస్వామి దర్శనానికి తీసుకెళ్ళారు. స్వామి ఆ పిల్లతో "అమ్మా! మీకు గొలగమూడి దగ్గర కాబట్టి 6 శనివారాలు వెంకయ్యస్వామి దర్శనం చేసుకొని, ఒక ప్రదక్షిణ చేసి, ధునిలో కాయ సమర్పించు" అని చెప్పారు. ఆ పిల్ల స్వామి చెప్పినట్లు చేయటం ప్రారంభించిన 4వ వారంలో సూళ్ళూరుపేటలో బంధువుల పెళ్ళికి వెళ్ళగా, అక్కడ ఒక కుటుంబం వారు చూసి ఇష్టపడి, మాట్లాడుకొని 6వ శనివారం కల్లా పెళ్ళి కుదిరింది. ఆ తర్వాత పెళ్ళి చేసుకుని వారు ఆనందంగా వున్నారు.

రామారావుగారి పొరుగింట్లో వుండే భార్యాభర్తలు సఖ్యతగా ఉండేవారు కాదు. అతను ఆటో డ్రైవరు. అతను ఒకటంటే దానికి పూర్తి వ్యతిరేకంగా భార్య మాట్లాడేది. రేకుల షెడ్డులో వుండేవారు. అతన్ని తీసుకొని స్వామి దగ్గరకి వెళ్ళితే స్వామి అతనితో "బాబూ! నీ భార్య మాట విను. నీ భార్య కంట నీరు పెట్టుకుంటే నీకు డబ్బు ఎలా

నిలుస్తుంది. నీవు నీ భార్య మాట వినకపోతే నా దగ్గరకి రాకు. వింటావా? వింటావా? వింటావా?" అని చెప్పి పంపించారు. అతను స్వామి చెప్పినట్లు వింటున్నాడు. ఇప్పుడు హాయిగా వుంటున్నారు. మిద్దె ఇల్లు కట్టుకున్నారు.

నెల్లూరు ఫత్తేఖాన్‌పేట నుండి సుధాకర్ ఒకసారి దర్గాస్వామి దర్శనానికి క్రొత్త టైర్లు వేసిన వ్యాన్‌లో స్నేహితులతో బయలుదేరాడు. వారంతా తెలిసిన వ్యక్తి దుర్గుణాల గురించి మాట్లాడుకుంటూ ప్రయాణం చేస్తున్నారు. కొంతసేపటికి టైరు పంక్చరయ్యిందని గమనించి, దిగి చూసేసరికి అది చాలా దూరం ముందరే పంక్చరయ్యిందని అర్థం అయ్యింది. పంక్చరయిన టైరు చాలా నలిగిపోయి దాన్ని తీసి పారెయ్యాల్సి వచ్చింది. అప్పుడు కానీ మహనీయుల దర్శనానికి వెళ్ళేటప్పుడు సద్గురు స్మరణతో వెళ్ళాలనీ, అలా వెళ్ళకపోవటం వలననే టైరు పంక్చరయ్యిందని మనస్సులో ముద్రపడింది. ఇతరులను నిందించటం పంది మల భక్షణ చేయటం వంటిదని సాయిబాబా చేసిన హెచ్చరికను గుర్తుంచుకుని నడుచుకుందుముగాక!

సుధాకర్‌గారి అబ్బాయి 10వ తరగతి చదివేటప్పుడు మొదటిసారి స్వామి దర్శనానికి తీసుకువెళ్ళారు. స్వామి పాసవుతాడు అని ఆశీర్వదించారు. ఆయనకు తమ పిల్లవాడు పాసవుతాడనే నమ్మకం లేదు. కానీ స్వామిదయ వలన 10వ తరగతి పాసవటమే గాక తర్వాతి కాలంలో ఎమ్.ఎస్‌సి(కంప్యూటర్ సైన్సు) చదివాడు. ఒక్క దర్శనంతో ఆ పిల్లవాడి చదువు బాధ్యత అంతా స్వామే వహించారు.

నెల్లూరు సాయిప్రసాద్ గారి అబ్బాయి 1995లో ఐ.ఐ.టిలో ఎమ్.టెక్ పూర్తి చేసాడు. అమెరికాలో పిహెచ్.డి కోసం ప్రయత్నిస్తే రాకపోయేసరికి రిలయన్స్ కంపెనీలో ఇంజనీరుగా చేరాడు. తర్వాత సంవత్సరం ప్రయత్నిస్తే ఒక యూనివర్శిటీలో అడ్మిషన్ వచ్చింది. అమెరికాకి పంపించాలా లేదా అని దత్తసాయి మందిరం సుబ్రహ్మణ్యంగారిని అడిగితే, ఆయన 'నేను కాదు చెప్పేది. కడప దగ్గర దర్గాస్వామి వున్నారు, ఆయన చెప్పినట్లు చేస్తే మంచిది' అన్నారు. సాయిప్రసాద్‌గారికి స్వాములంటే నమ్మకం లేదు. కానీ సుబ్రహ్మణ్యంగారు చెప్పారని స్వామి దగ్గరకి బయలుదేరారు.

సాయిప్రసాద్‌గారు అక్కడకి వెళ్ళకముందే స్వామి అక్కడవున్న నెల్లూరు భక్తులతో ఇవాళ నెల్లూరు నుండి ఇంకొక భక్తుడు వస్తున్నాడు అని చెప్పారు. సాయిప్రసాద్‌గారు వెళ్ళిన తర్వాత స్వామి "ఎందుకు వచ్చావు?" అని అడిగారు. 'స్వామీ! నేను నెల్లూరు నుండి వచ్చాను. నేను నిష్కపటంగా మాట్లాడతాను. నాకు మీ దగ్గరకి రావటానికి ఇష్టంలేదు. ఒక విషయమై నెల్లూరు దత్తసాయిమందిరం సుబ్రహ్మణ్యంగారిని అడిగితే ఆయన మిమ్మల్ని కలవమన్నారు' అని వివరంగా చెప్పారు. స్వామి "ఏమిటి మీ సమస్య?" అని అడిగారు. ఆయన 'మా అబ్బాయికి అమెరికాలో పిహెచ్.డి చేసే అవకాశం వచ్చింది. మీరు పొమ్మంటే పోతాడు. వద్దంటే వెళ్ళడు' అని చెప్పారు. క్షణమాలోచించి ఆయన అబ్బాయి పేరడిగి "ఆ అబ్బాయిని నిరభ్యంతరంగా వెళ్ళమని చెప్పు. ఆ అబ్బాయి బాగోగులు నేను చూసుకుంటాను" అని స్వామి అన్నారు. వారి అబ్బాయి తర్వాత స్వామి దర్శనం చేసుకొని మరలా ఆ విషయమై అడిగి, స్వామి చెప్పినట్లు అమెరికా వెళ్ళి పిహెచ్.డి పూర్తి చేసి సైంటిస్టుగా పనిచేస్తున్నాడు. తర్వాత కూడా స్వామి "మీ వాడ్ని అమెరికాకి పంపించింది నేనే, మరలా వాడిని నేనే ఇండియాకు తీసుకువస్తాను. కొంచెం సమయం పడుతుంది" అని వారికి అభయమిచ్చారు.

1998లో సాయిప్రసాద్‌గారి అమ్మాయికి పెళ్ళిసంబంధాలు చూస్తూ ఒక పిల్లవాడి ఫోటో స్వామికి చూపించారు. స్వామి "ఈ సంబంధం బాగుంది. ఏ సమస్యలు రావు. నేను పెళ్ళికి వస్తాను. ఏ రూపంలో వస్తానో చెప్పను" అన్నారు. పెళ్ళికి స్వామి ఉత్తరం వ్రాయించి ఆశీస్సులు పంపించారు. వివాహమైనాక కొత్త దంపతులు స్వామి దయ వలన హాయిగా వున్నారు.

సాయిప్రసాద్‌గారి భార్యతో స్వామి ఒకసారి "నీకు తెలుసా! మీ అల్లుడి చేత పెద్ద ఇల్లు కట్టిస్తున్నాను. పూనా కెళ్ళి చూడు" అన్నారు. తర్వాత పూనా కెళ్ళి చూస్తే నిజంగానే చాలా పెద్ద ఇల్లు కట్టారు. పైగా అది డూప్లెక్సు ఇల్లు. వారికి ఇల్లు కడుతున్నారని తెలుసుగానీ ఎంత ఇల్లు అనే విషయాలు ఏమీ తెలియవు. ఎక్కడో నీలకంఠరావుపేటలో

కూర్చున్న స్వామికి అంత స్పష్టంగా తెలుస్తున్నాయి అంటే స్వామి సర్వవ్యాపకుడని, సర్వజ్ఞుడని స్పష్టమవుతున్నది.

రాయచోటి స్వరూపగుప్తాగారి తమ్ముడు అమర్‌నాథ్‌గారి అమ్మాయి పెళ్ళి అయిన తర్వాత స్వీడన్ వెళ్ళటం కోసం వీసాకి అప్లై చేసారు. స్వామి "ఇద్దరూ కలిసి వెళతారు" అని ఆశీర్వదించారు. వివాహమైనాక అమ్మాయి వీసా గురించి ఢిల్లీలో ఎంబసీ వారికి ఫోను చేసి విచారించగా, వీసా రావటానికి ఇంకొక 10రోజుల పట్టవచ్చు అని చెప్పారు. అంతటితో వారి అల్లుడు 'అమ్మాయిని తర్వాత పంపించండి. నేను ముందర వెళతాను' అని చెప్పాడు. అమర్‌నాథ్‌గారు అతనితో 'స్వామి చెప్పారంటే మీరిద్దరూ తప్పనిసరిగా ఒకేసారి వెళతారు' అని స్వామి ఆశీర్వచనం గుర్తు చేసారు. అద్భుతంగా ఆ రోజు సాయంత్రానికి కల్లా వారి అమ్మాయికి వీసా వచ్చింది. వారి అల్లుడు స్వామి చెప్పిన మాట యొక్క మహిమను అప్పుడు గ్రహించాడు. స్వామి మాట జరిగి తీరవలసిందే!

ఒకసారి దర్గాలో ఒక ఫంక్షన్ జరిగిన రోజు అమర్‌నాథ్ దంపతులు,స్వరూపగుప్తా దంపతులు కలిసి ఆటోలో స్వామి దగ్గరకి వెళ్ళారు. ఆటో లైట్లు సరిగ్గా పని చేయట్లేదని డ్రైవరు రిపేరు చేస్తున్నాడు. స్వామి దగ్గర సెలవు తీసుకొని ఇంటికి బయలుదేరబోతే ఆటో స్టార్టు అవ్వట్లేదనీ, లైట్లు వెలగట్లేదనీ, రాత్రిపూట లైట్లు లేకుండా వెళ్ళటం కష్టమని ఆటో డ్రైవర్ చెప్పాడు. స్వామి పంపించారు కాబట్టి అమర్‌నాథ్‌గారు ధైర్యంగా ఆటో డ్రైవర్‌తో 'నువ్వు స్టార్టు చేయి. పంపించేవాడు ఆయన' అని దృఢమైన విశ్వాసంతో చెప్పారు. వెంటనే ఆటో స్టార్టు అవటమేగాక లైట్లు కూడా వెలిగాయి. అందరూ ఆశ్చర్యపోయారు. ఆటో అతను 'ఏమి అన్నా! ఇలా స్టార్టు అయ్యింది' అంటే "మనలో ఎవరికో సందేహం వుండి వుండాలి. దాన్ని తీసెయ్యటానికే స్వామి ఇలా చేసుంటారు" అని అమర్‌నాథ్‌గారు చెప్పారు.

రాయచోటిలో సత్యసాయిబాబా మందిర నిర్మాణమప్పుడు కమిటీవారు స్వామి ఆశీస్సులకని వెళ్ళినప్పుడు స్వామి కొంత డబ్బులిచ్చి, భూమి పూజ చేయించారు. వారు అప్పటినుండీ మార్గదర్శనం కొరకు స్వామిని కలుస్తుండేవారు. సాయిబాబా, కృష్ణుని విగ్రహాలు

తీసుకురావటానికి స్వరూపగుప్తాగారు, ఆయన తమ్ముడు అమర్‌నాథ్‌గారు జైపూర్ వెళ్ళేముందు స్వామి ఆశీస్సులకోసం వెళ్ళారు. మాటల సందర్భంలో స్వామిని 'ఎంత ఖర్చవుతుంది స్వామీ! ' అంటే 70, 80 వేలు అవుతుందన్నారు. స్వామితో, 'నాకు విగ్రహం సెలెక్టు చేయటం తెలియదు. మీరే ప్రేరేపణ చేసి మంచి విగ్రహాన్ని తీసుకునేటట్లు ఆశీర్వదించండి' అని ప్రార్థించారు. "ఏమిరా తెలివిగా మాట్లాడుతున్నావు?" అని హెచ్చరింపుగా పలికారు. 'నా ప్రమేయం అంటూ ఏమీ లేదు. మీరే విగ్రహం తీయించాలి' అని వారు మరలా విన్నవించుకున్నారు. "అలాగే నువ్వు వెళ్ళరా" అని స్వామి అన్నారు. జైపూరు వెళ్ళి విచారించగా విగ్రహం ఖరీదు ఎక్కువ చెప్పారు. ఒకచోట ధర ఎక్కువైనా సాయిబాబా విగ్రహానికి అడ్వాన్సు ఇచ్చి బుక్ చేసుకున్నారు. వారు కృష్ణుడి విగ్రహం చూసి వచ్చేసరికి, వాళ్ళు తీసుకుందామనుకున్న సాయిబాబా విగ్రహాన్ని అమ్మకందారు మరెవరికో అమ్మేసాడని తెలిసింది. వారు ఇచ్చిన అడ్వాన్సు తిరిగి తీసుకున్న తర్వాత ఆ విగ్రహాన్ని మరలా తేరిపార చూడగా, బాబా అభయహస్తం వెనకాల రాయి చీలి వుంది. అందుకోసమే స్వామి ఆ విగ్రహాన్ని కొనవలసి రాకుండా ఉండే పరిస్థితిని కలుగజేసారని స్ఫురించింది. తర్వాత రోజు నామస్మరణ చేసుకుంటూ వెళ్ళి బాబా, కృష్ణుని విగ్రహాలు ఒక దుకాణంలో అడ్వాన్సు ఇచ్చి బుక్ చేసుకున్నారు. తర్వాత విగ్రహాలు డెలివరీ తీసుకునేటప్పుడు, మాట్లాడుకున్న ధరకన్నా తక్కువగా, స్వామి చెప్పిన విధంగా 80 వేలు మాత్రమే తీసుకున్నారు. అట్లానే విగ్రహం తీసుకురావటానికి వాహనం మాట్లాడి అడ్వాన్సు ఇచ్చారు. వారి ట్రైన్ మధ్యాహ్నం 3గంటలకు గాను ట్రాన్సుపోర్టు డ్రైవర్ 2గంటలైనా రాలేదు. ఒక పరిచయస్థుడు తటస్థించి విషయం అడిగి తెలుసుకుని,అతను 3 రోజుల తర్వాత బయలుదేరి వస్తానని చెప్పి అతను విగ్రహాన్ని భద్రంగా తీసుకొచ్చాడు. స్వామి ఆశీర్వాదంతో బయలుదేరినందు వలన బాధ్యతంతా స్వామి వహించి వ్యవహారాన్ని నిర్విఘ్నంగా జరిపించారు.

చాలామంది భక్తుల అనుభవాలలో స్వామి నోటి నుండి వెలువడిన వాక్యం అమోఘమైన శక్తి కలదిగా ఉండి ఊహకందని రీతిలో

సత్యమయ్యేది. కొన్ని సందర్భాలలో పరిస్థితుల ప్రాబల్యం వలన భక్తుల మనస్సులో సందేహం / సందిగ్ధం కలిగినా స్వామి చెప్పిన వాక్యానుసారం విశ్వాసంతో నిలబడి చివరిదాకా ప్రయత్నం చేసిన వారికి కార్యాలు సఫలమయ్యేవి. 'కాకతాళీయము'అనే పదం మొదటిసారి యోగవాసిష్టంలో చెప్పబడింది. ఒక కాకి వెళ్ళి చెట్టుమీద ఉన్న కొబ్బరికాయ మీద వాలుతుంది. ఇంతలోనే ఆ కొబ్బరికాయ నేలకు రాలుతుంది. ఈ పరిస్థితిలో కాకి వెళ్ళి వాలటం వలన కాయ రాలిందా? లేదా వ్రాలుతున్న కాయ మీద కాకి వాలిందా? అనే వెంట్రుకమందం సందేహం కలుగవచ్చు. ఇదేవిధంగా ఒక కార్యం సఫలమైనాక, అది మన పురుషార్థం వల్ల జరిగిందా? లేక గురుకృప వలన జరిగిందా? అనే మీమాంస కలుగవచ్చు. గురుకృప పొందాలంటే వారి వాక్యమునందు దృఢమైన విశ్వాసంతో నడవాలి. పని ప్రారంభించిన దగ్గరనుండీ దాన్ని సఫలంగా పూర్తి చేసేదాక జరిగిన సంఘటనలను అవలోకనం చేసుకుంటే స్వామి మాట ఎంత ప్రభావవంతములో తెలుసుకోగలము.

శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయినాథాయ నమః

# దైవం మానుష రూపేణ

## అధ్యాయము - 9

## ఆశ్రిత కల్పవృక్షము

ఈ అధ్యాయంలో స్వామి వద్దకు చాలా సంవత్సరాలుగా వస్తున్న భక్తులయొక్క అనుభవాలు పొందుపరచటమైనది. ఈ అనుభవాల ద్వారా స్వామి తమ భక్తులను సర్వవిధాలా కాపాడినట్లు తెలుసుకోగలము. స్వామి భక్తుల యొక్క పూర్తి కుటుంబాన్ని సంరక్షించే బాధ్యత తీసుకునేవారు. ఆశ్రమానికి వెళ్ళినప్పుడు కుటుంబంలోని ప్రతి వ్యక్తిని పేరుపేరునా కుశలమడిగేవారు. ఆశ్రమానికి వచ్చే భక్తుల కుటుంబాలలో కూడా ఆ అన్యోన్యత కనపడేది. చాలామంది పిల్లలు తమ తల్లిదండ్రుల పట్ల, తమవారి పట్ల పూర్ణబాధ్యతను నిర్వర్తిస్తూ పరస్పర సఖ్యతతో నివసిస్తున్న కుటుంబాలు ఉన్నాయి. ఇది సంవత్సరాల తరబడి వచ్చిన భక్తుల అనుభవాలలో స్వామి ఆశ్రయంలో ఉండటం వల్ల కలిగే గొప్ప ఆశీర్వచనం. దీని వలన భక్తులు తృప్తి, శాంతిగా జీవనం గడుపుతున్నారు.

చాలామంది భక్తులు సంవత్సరాల తరబడి ఆశ్రమానికి వచ్చేవారే. **ఆశ్రమంలో ఉన్నంతకాలం ఆరోగ్యంగా ఉండి, మనస్సులో తృప్తి, శాంతిగా ఉంటుంది. ఏ రకమైన కోరికలు గానీ, తాపత్రయాలు గానీ లేని ప్రశాంతమైన మనోస్థితిని అనుభవించేవారు. పుంజుకున్న ఆరోగ్యంతో, మనోస్థితితో తిరిగి ఇంటికి వెళ్ళేవారు.** స్వామి కూడా వచ్చినవారు ఒకటి, రెండు రోజులు ఆశ్రమంలో నిద్ర చేసి వెళితే సంతోషపడేవారు. ఆశ్రమానికి వెళ్ళినప్పుడు కనీసం ఒక రాత్రి నిద్ర చేస్తే చాలా మేలు కలగటం భక్తుల యొక్క అనుభవం.

అమ్మయ్య ఆరాధన ఉత్సవం జరిగినప్పుడు గానీ, సాయినాథ మందిర వార్షికోత్సవం సందర్భంగా గానీ స్వామి భక్తులను "మీ మీ

మనస్సులోని కోరికలు అడగండి. మీ పనులన్నీ నెరవేరుతాయి. సాధ్యమైన కోరికలు మాత్రమే, అసాధ్యమైనవి కావు" అని చెప్పేవారు.

**కావలి రంగారావుగారు** ఒకసారి కుటుంబ సమేతంగా తుంగభద్రా పుష్కరాలకు మంత్రాలయం వెళ్ళారు. యాత్రీకుల రద్దీ వలన అక్కడ ఉండటానికి వసతి దొరకలేదు. చూచిన వరకు చాలని, వారు తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యారు. ఒక చిన్న పిల్లవాడు వచ్చి ఆయనను ఎవరో పిలుస్తున్నారని తీసుకువెళ్ళాడు. ఆ పెద్దమనిషి నీకు రూము కావాలా అని అడిగి, గెస్ట్‌హౌస్ ఇమ్మని చీటీ వ్రాసిచ్చి పంపారు. రంగారావుగారు ఆ గెస్ట్‌హౌస్‌ను చూసి బాడుగ చాలా ఎక్కువగా ఉంటుందని అని అనుకున్నారు. చిత్రంగా ఆ పెద్దమనిషి నిశ్శుల్కంగా ఇమ్మని వ్రాశాడని తెలిసింది. పరిస్థితిని అవగాహన చేసుకోవటానికి వారికి కొంత సమయం పట్టింది. తిరిగి ఇంటికి పోదామనుకునే సమయంలో గెస్ట్‌హౌస్ ఉచితంగా ఇమ్మనడమేమిటి? ఉచితంగా ఇప్పించేటట్లు ఎవరు చేసి వుంటారు? దీనికంతా మూలకారణం శ్రీ స్వామివారేనని భావిస్తున్నారు. శ్రీ స్వామివారికి వారిమీద ఎంత దయ!

ఒకరోజు రంగారావుగారి భార్య పద్మావతి స్కూలులో పడిపోయింది. టీచర్స్ అంతా ఆమెను కావలిలోని వైద్యశాలకు తీసుకుపోయారు. అక్కడి డాక్టర్లు పరీక్షలు చేసి ఆమెకు గుండెజబ్బు, ప్రమాదస్థితి అని తెలిపారు. ఆ తర్వాత నెల్లూరులో కూడా వైద్య పరీక్షలు చేయించగా వారు కూడా ప్రమాద పరిస్థితి అని నిర్ధారించి హైదరాబాద్ వెళ్ళమన్నారు. మార్గదర్శనం కొరకు ఈ విషయాన్ని శ్రీ స్వామివారికి ఆశ్రమంలో విన్నవించుకున్నారు. శ్రీ స్వామివారు "ఆమెకు ఏమీ లేదు బాగుంది. గొలగమూడి వెళ్ళి మూడు నిద్రలు చేయండి" అని చెప్పారు. అలా చేయగా అంత ప్రమాదకర స్థితి ఏమైందోగానీ, ఆమెకు ఏ వైద్యం లేకుండా ఆరోగ్యం పుంజుకుంది. వారు భగవత్స్వరూపులు కానిదే అలా చేయలేరు.

రంగారావుగారి పెద్దబ్బాయి రామకృష్ణకు ఇంజనీరింగ్ సీటు వచ్చింది. కానీ ఫ్రీ సీటు కాకుండా డొనేషన్ కట్టాలన్నారు. వారికంత శక్తి లేదు. అకోలాలో రహమాన్ అనే వారు కలసి మీరు పూసద్ వెళ్ళి నా పేరు చెప్పండి, ఫ్రీ సీటు ఇస్తారని చెప్పారు. ఆయన చివరి ఆశగా వెళ్ళారు.

రహమాన్ గారి పేరు చెప్పగానే ఫ్రీ సీటు ఇచ్చారు. 'ఈ రహమాన్ ఎవరు? నన్నెట్లా కలిశారు? నాకెందుకు ఫ్రీ సీటు ఇప్పించారు? ఈ లీలకంతకూ మూలపురుషుడు శ్రీ స్వామివారేనని' రంగారావుగారు గట్టిగా నమ్ముతున్నారు.

**మేడా సుబ్రహ్మణ్యంగారు** పబ్లిక్ హెల్త్ మరియు ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్టుమెంట్‌లో డిస్ట్రిక్ట్ మలేరియా ఆఫీసర్‌గా 1992లో పదవీ విరమణ చేసినాడు. వీరు కడప జిల్లావారు. వృత్తిరీత్యా రాయలసీమ ప్రాంతంలో చాలా చోట్ల సర్వీసు చేసినారు. ప్రవృత్తిరీత్యా ఆధ్యాత్మికంగా ప్రగతి సాధించిన లేక లక్ష్యాన్ని సాధించిన గురువులను, అవధూతలను దర్శించటం ఆయనకు ఇష్టం. పదవీ విరమణ చేసిన తర్వాత కడప టౌన్‌లో స్థిరపడినారు. కడప జిల్లాలో ఎవరైనా సిద్ధపురుషులు ఉంటే తరచూ దర్శించవచ్చు అనుకున్నారు. ఆ నేపథ్యంలో లాయర్ శ్రీరామ్మూర్తిగారు తటస్థపడి దర్గాస్వామి గారి గురించి చెప్పినారు. సుబ్రహ్మణ్యంగారికి రామయ్యగారనే (రిటైర్డ్ స్కూలు మాస్టర్) స్నేహితులు ఉండేవారు. రామయ్యగారు సుబ్రహ్మణ్యంగారిని వారి కుమార్తె వివాహానికి ఆహ్వానించారు. యాదృచ్ఛికంగా ఈ వివాహ వేదిక దర్గాలోని అనంత కళ్యాణ మండపం. ఈ విధంగా సుబ్రహ్మణ్యంగారు దర్గా వెళ్ళటం జరిగింది. వివాహ సందర్భంగా స్వామి సుబ్రహ్మణ్యంగారిని గుర్తుపట్టి ''ఒరేయ్ సుబ్రహ్మణ్యం! గుర్తు పట్టావా?'' అని అడిగి కౌగిలించుకున్నారు. తర్వాత సంభాషణలో ఇద్దరూ ప్రొద్దుటూరు మున్సిపల్ హైస్కూల్లో రెండవఫారం చదివినట్టు తెలిసింది. సుబ్రహ్మణ్యంగారు చాలా సంతోషపడ్డారు. ఎప్పుడో 55 సంవత్సరాల క్రితం చూచిన వ్యక్తిని గుర్తుపట్టి ఆత్మీయంగా పలకరించటం స్వామికే చెల్లు.

తర్వాత సుబ్రహ్మణ్యంగారు 2015 దాకా వీలున్నప్పుడల్లా దర్గా వచ్చి పోతుండేవారు. మొదట్లో నీలకంఠరావుపేట బస్టాపులో దిగి మూడు, నాలుగు కిలోమీటర్లు నడిచి దర్గా వచ్చేవారు. ఒక పర్యటనలో అలవాటు ప్రకారం ఒక చిన్న సంచి భుజానికి తగిలించుకుని బయలుదేరారు. బస్సు దిగి కొంత దూరం నడిచి వచ్చినాక అకస్మాత్తుగా

సంచి చాలా బరువుగా అనిపించింది. ఆయనకు విపరీతమైన నీరసం వచ్చింది. ఆయన సరే ఎట్లో కొంత ఓర్పుపట్టి వెళితే ఆశ్రమానికి చేరుకోవచ్చు అని మొండిగా నాలుగు అడుగులు వేయగానే ఇంకొక అడుగు ముందుకు వేయటానికి శక్తిలేక రోడ్డు ప్రక్కన కూర్చున్నారు. కొంతసేపు గడిచినా పరిస్థితి బాగుపడక మరింత నీరసించి రోడ్డు ప్రక్కనే పడుకున్నారు. సుబ్రహ్మణ్యంగారు 'ఇక నా సమయం అయిపోయినట్టుంది. అంత్యకాలం వచ్చినట్టుంది' అనుకున్నారు.

తర్వాత కొంత సమయం గడిచాక రోడ్డు మీద ఎవరో వెళుతుంటే, సుబ్రహ్మణ్యంగారు పిలిచి దర్గాలో గుప్తాగారికి వర్తమానం ఇవ్వవలసిందని చెప్పారు. గుప్తాగారితో ఆశ్రమంలో భక్తులు వచ్చి సుబ్రహ్మణ్యంగారిని భుజాల మీద పెట్టుకుని ఆశ్రమానికి తీసుకువెళ్ళారు. విషయం తెలిసిన స్వామి "ఏమీ లేదులేరా! అంతా పోయిందిలే" అన్నారు. రాయచోటి నుండి డా॥ బయ్యారెడ్డిగారిని పిలిపించి పరీక్ష చేయించారు. డాక్టరుగారు పరీక్ష చేసి, గుండెకు సంబంధించిన వైద్య పరీక్షలను చేయించుకోమని చెప్పారు. ఆయనను అప్పటికి విశ్రాంతి తీసుకోమన్నారు. కొన్ని గంటల తర్వాత ఆయనను స్వామే స్వయంగా వెళ్ళి పరామర్శించారు. సాయంత్రానికి ఆరోగ్యం కొంత మెరుగైనాక, స్వామి అనుమతిచ్చి, ఆశ్రమం నుంచి ఒక మనిషిని తోడు పంపించి బస్సు ఎక్కించారు. ఈ అనుభవంలో సుబ్రహ్మణ్యంగారికి స్వామి తమ ఆయుష్షును పొడిగించారన్న దృఢమైన భావన అంతర్గతంగా కలిగింది. సుబ్రహ్మణ్యంగారు స్వామి సాక్షాత్తు ఆ పరమేశ్వరుని స్వరూపమని తలుస్తున్నారు.

**దమ్మపేట మోహనరావుగారు** స్వామి దగ్గరకు వెళ్ళే ముందు ఒకరోజు తీవ్రంగా జ్వరం వచ్చింది. 'స్వామీ! ఇంత జ్వరం పెడితే ఎలా తట్టుకోగలను' అని స్వామివారిని ప్రార్థించారు. 10 నిమిషాల్లో జ్వరం తగ్గింది. ఆ తర్వాత ఆయన శ్రీస్వామివారి దగ్గరకి నీలకంఠరావుపేట వెళ్ళారు. స్వామి ఆయనను చూచి "ఒరే! మోహనా! నీవు ఒక్కరోజు బాధ కూడా అనుభవించకుండా నన్ను తిట్టినావురా!" అని అన్నారు. అంటే దమ్మపేటలో వుండి ప్రార్థించిన వెంటనే నీలకంఠరావుపేటలో

వున్న స్వామికి తెలిసింది అంటే వారు అంతటా వ్యాపించియున్నారు, వారు సర్వసమర్థులు కానిదే అలా ఆయన జ్వరం తగ్గించలేరు.

దమ్మపేట మోహనరావుగారికి 2011లో ఒకసారి 5 రోజులపాటు జ్వరం ఉండి 6 వ రోజు నుండీ 104 డిగ్రీలకి హెచ్చింది. స్వామితో ఫోనులో మాట్లాడటం కుదరలేదు. ఒకరోజు ఉదయం డాక్టరు ఆయనతో ఇదేదో మలేరియాలాగా ఉంది. ఎందుకైనా మంచిది మధ్యాహ్నం ఇంజక్షన్ చేసి గ్లూకోజ్ ఇస్తాను జ్వరం, నీరసం తగ్గుతాయి. సాయంత్రం వెళ్ళి రక్త పరీక్ష చేయించుకోండి అన్నాడు. మధ్యాహ్నం డాక్టరు దగ్గరకు వెళ్ళే ముందర స్వామికి ఫోన్ చేస్తే శంకరయ్య రాత్రి 8గం॥లకి ఫోన్ చెయ్యమన్నాడు. సాయంత్రం రక్త పరీక్షకు వెళ్ళి వచ్చారు. రాత్రి 7.05ని॥లకు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయ్యలేదు.

మోహనరావుగారు మనస్సులో 'ఏమీ స్వామీ! 5 రోజులు నుండి మాట్లాడటానికి వీలు పడలేదు. మమ్మల్ని మర్చిపోయావా?' అని ప్రార్థించారు. తర్వాత ఫోను చేస్తే స్వామి మాట్లాడుతూ ఆయనేమీ చెప్పకముందే "ఏరా ఈ టైమ్‌లో ఫోన్ చేసావేంటి"? అన్నారు. 'ఈ టైమ్‌లో ఏంటి స్వామి? 4 రోజులనుండీ చేస్తున్నాను. మీకు మాతో మాట్లాడటం కుదరలేదు. 104 డిగ్రీల జ్వరం, భయమేస్తోంది. పిచ్చి పిచ్చి కలలు వస్తున్నాయి' అన్నారు. "పిచ్చోడా నీకు భయమేంట్రా! నీవెనుకనే ఉన్నాను. రక్త పరీక్ష కూడా చేయించుకొచ్చా. మలేరియా అటాక్ అయ్యే సూచనలు ఉన్నాయి. కాబట్టి మలేరియాకు సంబంధించిన మందులు రేపు చెపుతానన్నాడు కదా! ఆ మందులు 5 రోజులు వాడితే తగ్గుతుంది. తగ్గిపోయిందని మానవద్దు, తగ్గిపోయినా మరలా వస్తుంది. మందులు వేసుకో, ఉండనా, ఇంక ఫోను పెట్టేయనా" అన్నారు. 'నాకు భయమేస్తోంది, నిద్ర కూడా పట్టట్లేదు, పిచ్చి పిచ్చి కలలు వస్తున్నాయి' అని మోహనరావుగారు చెప్తే "జ్వరం రాదు రాదు రాదు, తగ్గిపోయింది" అని నాలుగు సార్లు చెప్పి స్వామి ఫోను పెట్టేసారు. తర్వాత నుండి జ్వరం రాలేదు. ప్రారబ్దానుసారం మరో 5 రోజులు బాధపడి, మందులు వాడాల్సి ఉన్నా సర్వసమర్థుడైన స్వామిని ఆర్తితో ప్రార్థించగానే ఆ ఖర్మను తీసేశారు.

దమ్మపేట మోహనరావుగారు ఇలా చెపుతున్నారు: మా స్వంత ఊరు జక్కవరంలో, 3 ఎకరాల మామిడి తోటకి ఎంత సేద్యం చేసినా సంవత్సరానికి 5,000 రూపాయలకు మించి ఆదాయం వచ్చేది కాదు. స్వామికి చెప్తే కొట్టించెయ్‌మన్నారు. నేను కొట్టించేద్దామని బేరం పెడుతూంటే మా అన్నా వాళ్ళకి తెలిసి 'ఆ స్వామేదో చెప్పాడని ఇలా చేస్తావా? కాసే పంటను అలా వదులుకుంటావా' అని అడ్డుపడ్డారు. నేను అప్పటికి మౌనంగా వుండి తర్వాత ఎవరికీ చెప్పకుండా కొట్టేయటానికి ఒకాయన దగ్గర అడ్వాన్సు తీసుకొన్నాను. అతనితో నేను గొలగమూడి వెళ్ళినప్పుడు కొట్టేయమని చెప్పాను.

అనుకున్న ప్రకారం నేను గొలగమూడికి వెళ్ళినప్పుడు, పని ప్రారంభించి కొన్ని చెట్లు నరికారు. ఈ విషయం మా అన్నయ్యవాళ్ళకి తెలిసి అడ్డుపడ్డారు. చెట్లు నరికించే అతను నేను వ్రాసిన కాగితం చూపించి మోహనరావుగారు చెపితే కానీ ఆపము అన్నాడు. మా అన్నగారు నేను గొలగమూడి వెళ్ళానని తెలియక, మా ఇంటికి ఫోను చేసి విచారించగా, మా పెద్దమ్మాయి నాకు ఫోను చేసి అడిగింది. ఇది స్వామి ఆజ్ఞ అని చెప్పేసరికి ఇంకేమీ మాట్లాడలేదు. చెట్లన్నీ నరికేశారు.

కొన్నాళ్ళ తర్వాత ఆశ్రమానికి వెళ్ళి స్వామికి జరిగిన విషయం చెప్పాను. స్వామి "ఆయిల్ పామ్ చెట్లు వచ్చి వున్నాయి అవి వేయి" అని చెప్పారు. ఆయిల్ పామ్ చెట్లంటే మనకు అప్లై చేసిన 6 నెలలకి వస్తాయి కదా, ఏమో స్వామి ఇలా అంటున్నారు అనుకున్నాను. ఇంటికి వచ్చేసరికి మా చిన్నాన్న కొడుకు ఆయిల్ పామ్ చెట్లు వేద్దామనుకుని అతను కౌలుకి తీసుకున్న నా పొలంలో కూడా అదే వేద్దామని కావల్సినన్ని చెట్లు తెప్పించి నాటించాడు. అప్పుడు అర్థమైంది స్వామి అన్న మాటలు. ఇప్పుడు సంవత్సరానికి 20,000 రూపాయలు ఆదాయం వస్తోంది. సద్గురువు భుక్తి, ముక్తి ప్రదాయకుడు.

**రాజంపేట శంకరయ్యగారు** వారి తల్లిదండ్రులకు మొదటి సంతానం. వారి తండ్రిగారు ఆయన చిన్నవయస్సులోనే కాలం చేసారు. ఆయన ఆధ్యాత్మిక జిజ్ఞాస కలవాడై 1989-92 వరకు శ్రీ బొంబేస్వామివారి (గణేశపురి శ్రీ నిత్యానందస్వామి శిష్యులు) దగ్గరకి వెళుతుండేవారు.

శ్రీ బోంబేస్వామివారు సమాధి చెందిన తర్వాత వారిని 'నా జన్మ తరించేది ఎట్లా స్వామి? మీరే నాకు దిక్కు. దయచేసి మార్గదర్శనం చేయగలరు' అని ప్రార్థించినప్పుడు శ్రీ బోంబేస్వామివారు దర్గాస్వామిని స్వప్నంలో చూపించి అంతర్ధానము అయ్యారు.

అప్పటికి దర్గాస్వామి గురించి శంకరయ్యకు తెలియదు. తరువాత నెల్లూరు వాస్తవ్యులు స్వామి గురించి వివరాలు తెలిపారు. ఈ విధంగా స్వామి గురించి తెలుసుకున్న శంకరయ్య 1994 ఆగష్టు నుంచి సెప్టెంబరు మాసాల మధ్యలో దర్గాస్వామివారి ఆశ్రమానికి వచ్చి పోతుండేవారు. మహానందిలో జనశంకర తపోవనం రామకృష్ణానందస్వామివారి ఆశ్రమంలో ఉండాలని అనుకునేవారు. తర్వాతి దర్శనం చేసుకున్నప్పుడు దర్గాస్వామివారు **"నీ స్థానం ఇదేరా, నీవు ఎక్కడికి పోయినా తిరిగి ఇక్కడికే వస్తావు పోరా!"** అని ఆశీర్వదించారు.

శంకరయ్యకు చిన్నప్పటినుండీ ఆస్త్మాతో ఇబ్బంది పడేవారు. ప్రతిరోజు ఒక ఇంజెక్షన్ చేసుకుంటేగాని శ్వాస సరిగా తీసుకోలేకపోయేవారు. దానివలన ఆయన చదువు కూడా సరిగ్గా సాగక 8వ తరగతి వరకే చదివి విద్యాభ్యాసం నిలిపేసారు. తర్వాత కొంతకాలం సరుకుల అంగడి నడిపారు. ఖాళీ సమయంలో సినిమాలు చూడడం, మహాత్ముల దర్శనం చేసుకోవడం ఆయన వ్యాపకాలుగా ఉండేవి. దర్గాస్వామి దగ్గరకు వచ్చిన తర్వాత ఆయన సంస్కారంలో మార్పు వచ్చింది. సినిమాలకు తిరగడం వంటివి మానుకున్నారు. శ్రీ దర్గాస్వామివారు శంకరయ్యను చాలా చిత్రమైన అనుభవాన్ని ఇచ్చి ఆశ్రమంలో సేవ చేసుకునే భాగ్యం కలిగించారు.

1994-1998 వరకు స్వామి దగ్గరకు వచ్చి పోతుండేవారు. 1998 లో దర్బార్ సాయినాథ మందిర నిర్మాణం పూర్తి అయ్యింది. అప్పుడు ఒక 10 రోజులు సేవ చేయటానికి ఆశ్రమంలో ఉన్నారు. తిరిగి ఇంటికి వెళ్ళటానికి స్వామి దగ్గర సెలవు తీసుకుందామనుకొని వెళ్ళారు. స్వామి "ఇక్కడినే ఉండిపోరా, నీకు ఏమి కావాలి?" అని అడిగారు. శంకరయ్యగారు తన ఆరోగ్య సమస్య(ఆస్త్మా) గురించి చెప్పారు. మండలం రోజులు ఆశ్రమంలో ఉంటే నయం చేస్తారని స్వామివారు అభయం

ఇచ్చారు. ఒకరోజు శ్వాస సరిగ్గా ఆడక, బాధ భరించలేక స్వామివారి ముందు ఏడ్చేశారు. శంకరయ్యగారి వంక తీక్షణంగా చూసి, ఆయనను తిట్టి ఆ వ్యాధిని తనలోకి తీసుకుని కొన్నిరోజులు ఇబ్బంది పడ్డారు. అప్పటినుండి ఆయనకు ఉబ్బసం నుండి పూర్తిగా విముక్తి కలిగింది.

స్వామి దగ్గరకి వచ్చేటప్పటికి(1998) ఆయనకు ఒక సరుకుల అంగడి, కన్నతల్లిని చూడవలసిన బాధ్యత, పెండ్లికాని తమ్ముడు ఉన్నారు. ఆయన స్వామికి తన బాధ్యతల గురించి విన్నవించుకుంటే “అన్నీ చక్కబడతాయి లేరా” అని చెప్పారు. 1999 సం॥ చివరికల్లా ఆయనకు వ్యాపారం మీద వ్యామోహం పోయినది. 2000సం॥లో ఆయన తమ్ముడి వివాహము అయినది. 2001 సం॥లో ఆయన తల్లిగారు కాలము చేసినారు. ఆయన ఆశ్రమంలో సేవ చేయటానికి నిలబడినాక స్వామి ఆయన బాధ్యతలు అన్నీ తీర్చినారు.

ఆశ్రమంలో స్థిరపడిన తర్వాత కాలంలో ఆయన తమ్ముడి భార్య ప్రసవానికి ముందు గర్భసంచీలోని ఉమ్మనీరు అంతా బయటకి వెళ్ళిపోయింది. తల్లీబిడ్డల ఆరోగ్యం గురించి ఆయన తమ్ముడు శ్రీనివాసు ఆందోళన పడి, దర్గాస్వామికి తన భార్య పరిస్థితి వివరించమని శంకరయ్యగారికి ఉదయం 9:00 గం॥లకు ఫోను చేశాడు. శంకరయ్యగారు స్వామివారికి విన్నవించారు. అప్పటినుండీ స్వామివారు ఆయన కనబడినప్పుడల్లా తిడుతున్నారు. అలా ఆ రోజు మధ్యాహ్నం 3గం॥ల వరకు తిడుతూనే ఉన్నారు. 3గం॥లప్పుడు ఆయన తమ్ముడి భార్య పేరు చెప్పమని అడిగి తెలుసుకుని, తగ్గుతుంది అని చెప్పారు. ఆరోజు సాయంత్రం ఆయన తమ్ముడు ఫోన్ చేసి, సుఖప్రసవం అయింది, తల్లీబిడ్డా క్షేమమని చెప్పాడు.

శంకరయ్యగారికి చాలాకాలం ఆశ్రమంలో నివసించినందువల్ల స్వామి, అమ్మయ్యలకు సేవచేసుకునే భాగ్యం కలిగింది. ఆయన పంచుకున్న కొన్ని అనుభవాలు:

■ శంకరయ్యగారు ఒకరోజు దర్బార్ సాయినాథ్ మందిరంలో హారతి ఇచ్చిన తర్వాత తీర్థము ఇస్తున్నారు. చివరగా ఒక ముస్లిం యువకుడు వచ్చాడు. తీర్థమును నిరాకరించి సాయినాథుని విగ్రహం

చేత్తో చూపించి తన వైపు చూపించాడు (తను నేను వేరు కాము అన్నట్లు సంజ్ఞలతో విగ్రహం వైపు చూపి, చెప్పి వెళ్ళిపోయినాడు). ఆరతి అయిన తర్వాత ఆయన స్వామికి జరిగినది విన్నవించారు. అప్పుడు దర్గాస్వామి "వచ్చినవాడు సాయినాథుడే" అని చెప్పారు.

■ ఒకరోజు ఉదయం 11గం॥లకు టిఫిన్ కోసం ఒక యువకుడు వచ్చి నలుగురికి టిఫిన్ ఉందా అని అడిగాడు. అప్పుడు శంకరయ్యగారు ఉన్నదని చెప్పారు. ఆ యువకుడు తన వెంట 20 మందితో లోపలికి వచ్చాడు. ఉన్న పదార్థాలు సరిపోవని చెప్పి ఆ యువకునికి భోజన పదార్థాలు చూపించి వడ్డించమన్నారు. అంతలో లావుగా ధృఢముగా ఉన్న ఒక ముస్లిం వచ్చి మొదట్లో కూర్చున్నాడు. ఆ యువకుడు అంతకుముందే వడ్డించడం ప్రారంభించడం వలన మొదట ఉన్న ముస్లింకు వడ్డించలేదు. అంతేగాక అతని వద్దకు వచ్చేసరికి బేసిన్‌లో పదార్థములు ఏమీ మిగలలేదు. శంకరయ్యగారు ఆ ముస్లింతో మీరు ఒక గంట తరువాత వస్తే భోజనం పెడతాము అని చెప్పారు. అప్పుడతను "అందర్ కో దేఖో" అని అన్నాడు. లోపలికి వెళ్ళి బేసిన్‌లో చూస్తే కొద్ది పదార్థము ఉంది. శంకరయ్యగారు అది తీసుకొని వచ్చి వడ్డించారు. అతను అది తిని వెళ్ళిపోయాడు.

ఆరోజు జరిగిన విషయం స్వామివారికి విన్నవించితే "**వచ్చినవాడు దర్బార్ అలీషావలీ రా ఏమన్నా పెట్టి పంపించావా లేదా?**" అని అడిగారు. ఉన్న కొద్ది పదార్థములు వడ్డించాను అని చెబితే "నీ జన్మ ధన్యమైంది పో" అన్నారు.

■ అమ్మయ్యగారు ఉన్న కాలంలో ఆశ్రమంలో భక్తులందరూ భోజనం చేసినాక మధ్యాహ్నం మూడు గంటల తర్వాత కొద్దిగా ఆహారం తీసుకునేవారు. అమ్మగారు సమాధి అయినాక శంకరయ్యగారు కూడా చాలాకాలం భక్తులందరూ తిన్నాక భోంచేసేవారు. ఒకసారి ఇలా భోజనం చేస్తూ ఉన్నప్పుడు ఒక యువకుడు మురికి వస్త్రములతో వచ్చి ఆయన ప్రక్కనే కూర్చుని అన్నం తిన్నాడు. అతడు ఎవరని దర్గాస్వామిని అడిగితే అతడే దర్బార్ జలీల్ మస్తాన్ బాబా అని చెప్పారు.

■ ఒక పర్యాయం శంకరయ్యగారు సాయినాథుని మందిరంలో

ఉన్నప్పుడు ఇద్దరు వ్యక్తులు వచ్చారు. ఒకరికి విష్ణునామాలు, మరియొకరికి నుదుటి మీద త్రిపుంఢ్రము ఉండి గడ్డముతో ఉన్నారు. వారు మందిరంలో అంతరాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తుంటే, శంకరయ్య వారితో ఒక ప్రదక్షిణ మాత్రమే గర్భగుడిలో చేయాలి, బయట మాత్రం ఎన్ని ప్రదక్షిణలయినా చేసుకోవచ్చన్నారు. ఆ మాట వినకుండా వారు మూడు ప్రదక్షిణాలు చేసి వెళ్ళారు. శంకరయ్య వారిని కోప్పడ్డాడు. వారు శంకరయ్యతో "నీవు ఇక్కడ పనికిరావని" వెళ్ళిపోయారు.

శంకరయ్య స్వామికి విన్నవించాడు. "అప్పుడు వచ్చిన వాళ్ళు ఎవరనుకున్నావు? సాక్షాత్తు వేంకటేశ్వరుడు మరియు బ్రహ్మ దేవుడురా వాళ్ళు నిన్ను శపించి వెళ్ళిపోయారు" అని చెప్పారు. 'స్వామీ, ఇందులో నా తప్పేమీ లేదు. నేను మీ ఆజ్ఞ ప్రకారం ఒక్క ప్రదక్షిణము మాత్రమే గర్భగుడిలో చేయాలి' అని చెప్పాను. స్వామి చెప్పిన పని చేసినందుకు స్వామి శంకరయ్యను శాప ప్రభావం నుండి రక్షించారు.

**రాయచోటి వాస్తవ్యులు డా॥ బయారెడ్డి,డా॥ సంగమ్మ దంపతులు** ఇద్దరూ పేరెన్నికగన్న వైద్యులు. వీరు రాయచోటిలో ఒక ఆస్పత్రిని నడుపుతున్నారు. ఈ ఆస్పత్రి ద్వారా వీరు ఎంతోమందికి ఉత్తమ వైద్య సేవలు అందిస్తున్నారు. 1996లో మొదటిసారిగా స్వామిని దర్శించుకొని తమ జీవితాన్ని గురించి, ఆయన నాస్తికత్వాన్ని గురించి స్వామికి వివరంగా చెప్పారు. స్వామి ఓపిగ్గా విని "నాయనా! నీవొకసారి కుటుంబ సమేతంగా షిరిడీ వెళ్ళి బాబాను దర్శించుకో, శుభం జరుగుతుంది" అని ఆశీర్వదించి పంపారు.

ఒకవారం తరువాత స్వామి సలహా మేరకు కుటుంబ సమేతంగా షిర్డీ వెళ్ళి బాబాను దర్శించుకున్న తర్వాత త్రయంబకేశ్వర్ వెళ్ళారు. అక్కడ అడవి మార్గము ద్వారా కాలి నడకన గోదావరి పుట్టిన స్థలము చేరుకున్నారు. అక్కడ కాసేపు విశ్రమించి క్రిందికి వస్తూ మార్గమధ్యములో ఒక చిన్న షాపు దగ్గర కుర్చీలలో కూర్చొని చెరుకు రసము త్రాగి త్రయంబకేశ్వర్ దర్శనానికి వెళ్ళారు. రద్దీ ఎక్కువ లేదు. దైవ దర్శనం సులభంగా అయ్యింది. దర్శనానంతరము ప్రసాదానికై శ్రీమతిని డబ్బులివ్వమని అడిగితే అసలు హ్యాండ్‌బ్యాగే లేదు. వారు చెరుకు

రసం త్రాగిన ప్రదేశంలో కుర్చీలో పెట్టి, వచ్చే సమయంలో మరచిపోయినారు.

ఆయన శ్రీమతి జాగ్రత్తపరురాలు కాబట్టి సాధారణంగా కుటుంబసమేతంగా ఎక్కడకి వెళ్ళినా డబ్బు, ముఖ్యమైన వస్తువులు ఆయన శ్రీమతి దగ్గరే ఉంచేవారు. ఆ బ్యాగ్‌లో 30 వేల రూపాయల డబ్బు, పూనా నుండి కడపకు రావడానికి రిటర్న్ జర్నీ టిక్కెట్లు వున్నాయి. ఆయనకు చాలా కోపం వచ్చింది స్వామిపై. 'ఏమయ్యా! నీవేమో దగ్గరకి రా! అని పిల్చినావు. మా వూరి స్వామి కూడా నిన్ను దర్శనం చేసుకో శుభం జరుగుతుందని పంపినారు. మీరిద్దరూ కలసి మా డబ్బు, టిక్కెట్లు పోయేటట్లు చేశారు' అని మనస్సులో ఆందోళనతో స్వాములనిద్దరినీ నిందిస్తూ ,బ్యాగ్ కోసం వచ్చిన దారిలో వెతుకుతున్నారు. కొంత దూరం పోయేసరికి వారికి ఎదురుగా ఒక పది సంవత్సరాల అబ్బాయి ఒక బ్యాగ్‌ను చేత్తో త్రిప్పుతూ (యే బ్యాగ్ కిస్ కా హై?) యీ బ్యాగ్ ఎవరిదీ? అని బిగ్గరగా అరుస్తూ క్రిందికి వస్తున్నాడు. చూస్తే ఆ బ్యాగ్ వారిదే. ఆ అబ్బాయి వాళ్ళ బ్యాగ్ తిరిగిచ్చి, వారు కృతజ్ఞతతో కొంత డబ్బు ఇచ్చినా నిరాకరించి వెళ్ళిపోయాడు. అప్పుడర్థమైంది ఆ స్వాముల యొక్క మహత్మ్యమనేది. ఇదే ఆయన ఆధ్యాత్మిక జీవితానికి నాంది.

ఒకసారి ఉరుసు రోజున ఆశ్రమంలో బాగా రద్దీగా వుంది. వారు వచ్చేటప్పటికి స్వామికి విపరీతమైన జ్వరం వుంది. చేయి పట్టుకొని చూస్తే 104 ఫారన్‌హీట్ డిగ్రీల పైనే వుందనిపించింది. రాయచోటికి పోయి మందులు తీసుకు వస్తానని స్వామితో చెప్పారు. అందుకు స్వామి "మందులా - ఊ - మందులా - మందులిస్తావా! నాయనా! లోపలికి పోయి భోజనం చేసి రండి తర్వాత యిస్తురు" అని అన్నారు. భోంచేసి వచ్చిన తర్వాత చూస్తే అసలా జ్వరమే లేదు. మాములుగా వున్నారు. అంతా దైవలీల.

మరియొకసారి స్వామికి కడుపు నొప్పి, చీముబేదుల వ్యాధి వచ్చింది. మందులిస్తామన్నారు. "మందులొద్దు నాయనా! మీ యిద్దరి చేతులను నా కడుపుపై పెట్టి లింగాష్టకము చెప్పమన్నారు". వారు అలాగే చెప్పారు. స్వామికి నయమైంది.

ఒకసారి సంగమ్మగారికి చికెన్‌గున్యా జ్వరం వచ్చి తీవ్రంగా బాధపడుతూ మంచం నుండి లేవలేని స్థితిలో వున్నారు. రెండురోజుల్లో ఆమె లండన్‌కు పోవాలి. వారి అమ్మాయి లండన్‌లో ఉన్నారు. అడ్వాన్స్‌గా బుక్ చేసుకున్న టిక్కెట్లుకూడా ఉన్నాయి. అంతే కాకుండా మరుసటిరోజున బాబా మందిర వార్షికోత్సవము వుంది. (బయ్యారెడ్డి, సంగమ్మగార్లు రాయచోటిలో ఒక సాయి మందిరాన్ని నిర్మించి నిర్వహిస్తున్నారు) హెూమము వద్ద కూర్చోవాలి. ఈ విషయం స్వామికి విన్నవించుకున్నారు. స్వామి కాసేపు మౌనం వహించిన తర్వాత "నాయనా! నా బిడ్డ నిరభ్యంతరంగా లండన్‌కు పోతుంది. హెూమము దగ్గర కూడా పూజలు చేస్తుంది" అని చెప్పి దీవించినారు. అదే విధంగా మరునాడు ఒంటరిగా ఎవరి సహాయం లేకుండా నడచి వచ్చి హెూమము దగ్గర పూజలు చేసి మరుసటి దినం లండన్‌కు వెళ్ళారు.

**రాయచోటి స్వరూపగుప్తాగారు,** ఆయన ప్రాణ మిత్రుడు ప్రసాదరెడ్డి, రాయచోటి ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ నరసింహ గుప్తా, యింకొక రిటైర్డు టీచర్ నలుగురూ తిరుపతిలో ఒక వివాహానికి హాజరై, రాయచోటికి తిరుగు ప్రయాణంలో పీలేరు దాకా వచ్చారు. అప్పుడు సమయం రాత్రి 11 గం॥లు. గంటసేపు వేచి చూచినా యెటువంటి వాహనమూ రాలేదు. స్వరూపగుప్తాగారు ప్రసాదరెడ్డితో 'మనం త్వరగా ఇంటికి వెళ్ళాలి కానీ ఏ వాహనమూ రాలేదు. నేను సద్గురు దర్గా మాతను ప్రార్థిస్తాను దాని ఫలితాన్ని మనం చూస్తాము' అని చెప్పి సద్గురు దర్గామాతను ప్రార్థించారు. 15 నిమిషాల తర్వాత ఒక ఇండికా కారు సర్రున వచ్చి వారి ముందు నిలబడింది. అందులో డ్రైవర్ మాత్రమే వున్నాడు. 'సార్! రాయచోటికి వెళుతున్నాను. మీరు రండి' అని అతను వారిని కారులో ఎక్కించుకొని రాయచోటిలో దింపాడు. వారికి అతనితో ఏ పరిచయమూ లేదు. కానీ అతనికి వారు బాగా తెలుసని చెప్పాడు. రాయచోటిలో కారు దిగిన తర్వాత డబ్బులు ఇవ్వబోతే నిరాకరించాడు. పైగా అతను 'మీ దగ్గర ఎలా డబ్బులు తీసుకుంటాను? మీరు అందించే సేవలు నాకు బాగా తెలుసు. శ్రీ నరసింహ గుప్తాగారు బాగా తెలుసు. మీ దగ్గర నేను డబ్బు తీసుకోను' అని చెప్పి వెళ్ళిపోయాడు. ఈ రోజు

వరకు ఆలోచించినా అతనెవరో వారికి గుర్తు రాలేదు. తరువాత మళ్ళా ఎప్పుడూ కనపడలేదు.

సరిగా 3 నెలల తర్వాత ఉచిత నీటి సరఫరా కార్యక్రమంలో శ్రీ సద్గురు దర్గాస్వామివారి దర్శనభాగ్యం కలిగింది. మాటలలో "ఏరా! ఆనాడు నీవు మనస్ఫూర్తిగా నన్ను ప్రార్థించినందున నీకు పీలేరులో కారుని పంపలేదా! ఆర్తితో నన్ను కోరితే తప్పక ఏదో రూపంలో నేను సహకరిస్తాను కదా" అన్నారు. ఆయన చాలా ఆశ్చర్యపోయారు. అమ్మయ్యను ప్రార్థిస్తే స్వామి కారు పంపటం బట్టి స్వామికి, అమ్మయ్యకు భేదం లేదని తెలుస్తోంది.

ఒకరోజు స్వరూపగుప్తాగారి కుమార్తె ఫోను చేసి వారి మనుమడి ఆరోగ్యం కుదుటబడాలంటే హైదరాబాదులోని పెద్ద ఆసుపత్రిలో కడుపుకు ఆపరేషను చేయించాలని చెప్పింది. వారు సకుటుంబముగా స్వామివారి వద్దకి వెళ్ళి విషయం వివరించి చెప్పారు. కొద్దిసేపు ధ్యానంలో వున్న స్వామీజీ "ఒరే! మీ అమ్మే కనుక వుండి వుంటే వీపుపై మర్దన చేస్తే ఈ ఆపరేషన్లు చేయాల్సిన అవసరం ఉండేది కాదు. నీవు హైదరాబాదు వెళ్ళి డాక్టరు చెప్పినట్లు చెయ్యి, ఆపరేషన్‌కు పోవలసిన అవసరం వుండదు, జయం కలుగుతుంది" అని చెప్పారు. బాబును బెత్తంతో నిమిరి ఆశీర్వదించి పంపారు. వారి చిన్ననాటి స్నేహితుడు డా॥ చంద్రమౌళిగారితో ఆసుపత్రిలో కలిసి పనిచేసే డా॥ నరేంద్రగారి సూచన మేరకు అన్ని ఆరోగ్య పరీక్షలు జరిపించినారు. పరీక్షల అనంతరం డాక్టరుగారు పిల్లవాడికి ఆపరేషన్ అవసరం లేదని నిర్ధారించారు. మందులు రాసి పంపారు. కొంతకాలం తర్వాత నెమ్మదిగా అబ్బాయి ఆరోగ్యం మెరుగయ్యింది. ఇప్పుడు బాబు ఆరోగ్యంగా, ఆనందంగా వున్నాడు.

స్వరూపగుప్తాగారి పెద్ద కుమార్తె అమెరికాలో నివసిస్తున్నారు. ఆమె రెండవ కాన్పు జరిపించుటకై గుప్తాగారి భార్య అక్కడకు వెళ్ళవలసి వచ్చినది. వెళ్ళేముందు స్వామిని దర్శించి వారి ఆశీస్సుల కొరకు ప్రార్థించగా, స్వామి"నేను నీ వెంట అక్కడికి వస్తాను, భయం లేదు. ధైర్యంగా వెళ్ళు"అని చెప్పారు. ఆమె ప్రయాణంలో ఫ్రాంకుఫర్టు

విమానాశ్రయంలో ఒక సూట్‌కేసు మిస్ అయ్యి అమెరికాలో ఆమెకు అందలేదు. గుప్తాగారు ఈ విషయాన్ని స్వామితో చెప్పారు. స్వామి “మీ వస్తువులు యెక్కడికీ పోవు. ఇంక కొద్దిసేపటికి అది జర్మనీ నుండి అక్కడికి చేరుతుంది. 24గంటలలో అది మీ ఇంటిలో వుంటుంది. ఈ విషయం వారికి చెప్ప”మన్నారు. గుప్తాగారు ఫోనులో వారికి ఈ విషయం తెలియచేసారు. సరిగా 18 గంటల తర్వాత వారి అల్లునికి విమానాశ్రయం వారు ఫోను చేసి వారి వస్తువులను తీసుకెళ్ళమన్నారు. స్వామి చెప్పినట్లు ఏ వస్తువులు పోకుండా 24గంటలలో క్షేమంగా సూట్‌కేసు ఇంటికి చేరింది

**స్వామి నమ్మినవారి సొమ్ము..**

అమెరికాలోని గుప్తాగారి అమ్మాయి తనకు స్కానింగ్ అయ్యిందని, బహుశా అమ్మాయి పుట్టవచ్చని ఫోనులో చెప్పింది. ఈ విషయం స్వామికి చెపితే స్వామి “చాలా సంతోషం నాయనా! అబ్బాయి పుడతాడని, ఏ కష్టం ఉండదని నేను ముందుగానే చెప్పాను కదా అని” అన్నారు. స్వామీ అక్కడ అమ్మాయి అని చెప్పారు అని అంటే “కొద్దికాలం వేచి చూడండి”అన్నారు స్వామి. 3 నెలల తర్వాత రిజల్టు వస్తే దాంట్లో అబ్బాయి అని నిర్ధారణ చేశారు. ఆశ్చర్యం! ఆనందం!! స్వామివారి వాక్కు ప్రకారం భగవంతుడు ప్రసాదించింది అబ్బాయినే.

గుప్తాగారి అమ్మాయి కాన్పుకై అమెరికా వెళ్ళిన వారి శ్రీమతి ‘ఇండియా వచ్చేటప్పుడు కలిసి వద్దాము, మీరు మీ మనుమడితో ఆడుకోవడానికి అమెరికా రండి’ అని వారితో అన్నది. ఇండియాలో పనులు సర్దుబాటు చేసిన తర్వాత అక్కడికి వెళ్ళాలని ఆయన తన తమ్ముళ్ళతో రాత్రి 10గం॥లకి చెప్పారు. మరుసటి దినం ఉదయం శ్రీ సద్గురు దర్గాస్వామీజీగారు రాయచోటి బస్టాండు వద్ద చలివేంద్రం ప్రారంభించడానికి వచ్చారు. గుప్తాగారు కారులో దిగుతున్న స్వామీజీ వద్దకు వెళ్ళి కారు డోరును తెరిచి స్వామివారికి నమస్కరించారు. “ఏరా! నా బిడ్డ వద్దకు ఎప్పుడు ప్రయాణం? రమ్మని కోరింది కదా త్వరగా బయలుదేరి వెళ్ళు! జయం కలుగుతుందని” స్వామి చెప్పారు. ఆశ్చర్యపోయి చూస్తున్న గుప్తాగారిని భుజంపైన తట్టి “మా పాప పిలిచింది కదా, బయలుదేరు” అన్నారు. గుప్తాగారి మనస్సులోని కోరికను స్వామీజీ

వాక్కు ద్వారా విని వారి కుటుంబ సభ్యులందరూ అవాక్కయ్యారు.! ఈ విషయం విన్న అమెరికాలోని ఆయన భార్య, బిడ్డలు స్వామీజీ ఆశీస్సులతో ఆనందభరితులయ్యారు.

**నెల్లూరు కృష్ణారెడ్డిగారి** కొడుకుకి 10వ సం॥ల వయస్సులో ఫిట్సు వచ్చాయి. చెన్నైలో డాక్టరు రవి దగ్గర చూపిద్దామని వెళ్ళారు. డా॥ రవిగారు అమెరికా వెళ్ళారని, వాళ్ళ నాన్నగారు డా॥ రాంమూర్తిగారికి చూపిద్దామనుకున్నారు. కానీ ఆయన అపాయింట్‌మెంటు లేకుండా చూడరు. అందువలన ఇంకొక డాక్టరు (శ్రీధర్)ని కలవమని అడ్రస్సు చెప్పారు. అక్కడకి వెళ్ళితే ఆయన కూడా లేరని తెలిసి ఏమి చేయాలా? అనే సందిగ్ధములో డా॥ శ్రీధర్‌గారి ఆస్పత్రిలో కూర్చొని స్వామిని తలుచుకున్నారు. ఇంతలో ఇద్దరు వ్యక్తులు పంచె కట్టుకుని, తువ్వాలు పైన వేసుకొని ఆయన దగ్గరకు వచ్చి వివరాలు అడిగారు. కృష్ణారెడ్డిగారు వారిద్దరికి వివరాలు చెప్పారు. వారు బాగా తెలిసినట్లు "రాంమూర్తి వుంటాడు, పోండి" అని చెప్పారు. ఆటో మాట్లాడిన తర్వాత వారు కూడా వస్తారనేసరికి 'ఆటోలో ముగ్గురు కంటే ఎక్కువ మంది వెళ్ళలేము కదా!' అని అనుకున్నారు. వారు "మేము తర్వాత వస్తాములే" అన్నారు. వారు డా॥ రాంమ్మూర్తిగారి దగ్గరకు వెళ్ళగా 'అపాయింట్‌మెంటు లేకుండా కలవటం కష్టం, అందువలన జూనియర్ డాక్టరుని కలవండి' అని నర్సులు చెప్పారు. కానీ స్వామి దయ వలన రాంమూర్తిగారు పిల్లవాడిని పరీక్ష చేసి ఉదయం ఒక మాత్ర, సాయంత్రం ఒక మాత్ర 3 సంవత్సరాలు క్రమం తప్పకుండా వెయ్యాలి. ఎప్పుడైనా మానేస్తే మరలా 3 సంవత్సరాలు వేసుకోవాల్సి వస్తుంది అన్నారు. ఒక మాత్ర 50పైసలు మాత్రమే.

నెల్లూరు వచ్చిన పది రోజులకి కృష్ణారెడ్డిగారు తమ కుటుంబాన్ని మొదటిసారి దర్గాస్వామి దర్శనానికి తీసుకువెళ్ళారు. అప్పటికి ఆయన భార్యకు స్వామి గురించి పూర్తిగా తెలియదు. స్వామి దగ్గరకెళ్ళితే స్వామి కృష్ణారెడ్డిగారితో "ఈ మధ్య రాలేదు. ఎక్కడెక్కడికి వెళ్ళావు" అని అడిగేసరికి జరిగిన విషయం చెప్పారు. స్వామి వారితో "చెన్నైలో నీ దగ్గరకి ఎవరు వచ్చారు?" అని అడిగితే ఆయన ఎవరూ రాలేదని

చెప్పారు. స్వామి గట్టిగా అడిగేసరికి ఇద్దరు వ్యక్తులు వచ్చారని చెప్పారు. స్వామి సంతోషంగా "డాక్టరు ఏమి వ్రాసిచ్చాడు?" అని అడిగితే రోజుకు రెండు మాత్రలు 3 సంవత్సరాలు వేసుకోమని చెప్పారని తెలియచేసాడు. స్వామి వెంటనే "ఆ మాత్రలు తీసుకుపోయి ఆ చెరువులో పారెయ్యి పోరా! అంత దూరం ఎందుకురా పోయినావు. నాకాడకొస్తే దెబ్బకి ఎగురకొట్టనా దాన్ని" అని చెప్తూ "నీకు 700 రూపాయలు ఖర్చు అయ్యింది కదా" అని ఆయనకు అయ్యిన ఖర్చును చెప్పారు.

ఆ రోజు రాత్రి వారు స్కూలు రూములో వున్నారు. రాత్రికి మందు వెయ్యాలని ఆయన భార్య పట్టుబట్టింది. స్వామి అక్కర్లేదు అన్నారు కాబట్టి ఆయన వద్దని చెపుతున్నా వినట్లేదు. వారి మాటలు స్వామి వినటానికి ఆస్కారమే లేదు. స్వామి మా రూము తలుపు దగ్గరకొచ్చి "మాత్ర వద్దంటే వేస్తున్నారు, ఎందుకని? మీకు నమ్మకం లేకపోతే వెళ్ళిపోండి" అని అరిచారు. వారు గమ్మున నిద్రపోయారు. ఆయన భార్యకి మనస్సులో బాధగానే వుంది.

తర్వాత రోజు స్వామి దర్గాల దగ్గర వున్నప్పుడు వారిని పిలిచి ఏమి కావాలని అడిగారు. ఆయన భార్యకి వెన్నుపూసలో నొప్పి గురించి చెపితే స్వామి దండంతో చూసి "అమ్మా! నీవు పిల్లలు పుట్టకుండా లూపు వేసుకున్నావు. దాని వలనే నీకు నొప్పులు. లూపు తీసేస్తే బాగుంటావు" అని చెప్పేసరికి స్వామి సర్వజ్ఞత్వమునకు ఆయన భార్య స్వామి పాదాలకు నమస్కరించింది. ఆవిడ 10సం॥ల క్రితం వేయించుకున్న లూపు ఇంకనూ తీయలేదు. సామాన్యంగా ప్రతి 3 సం॥లకి తీయించుకోవాలి. ఇంత వ్యక్తిగతమైన విషయము స్వామికి తెలియటము చాలా ఆశ్చర్యకరమైన విషయం. ఈ సంఘటనతో ఆయన భార్యకి స్వామి మీద విశ్వాసం ఏర్పడినది.

మూడు నెలల తర్వాత తిరిగి నెల్లూరులో వారి అబ్బాయికి ఫిట్సు వచ్చాయి. పిల్లవాడిని తీసుకొని స్వామి దగ్గరకి వచ్చేసరికి వారి కోసమే ఎదురు చూస్తునట్లుగా స్వామి చూస్తున్నారు. వారిని చూడగానే స్వామి "మరలా వచ్చిందా?" అని అడిగారు. ఔనని చెప్పగా వారి అబ్బాయికేసి 5 నిమిషాలపాటు తదేకంగా చూసి "పోయిందిరా పో" అన్నారు. స్వామి

ఎండుద్రాక్ష ప్రసాదం ఇచ్చి తినమన్నారు. ఆ తర్వాత మరెప్పుడూ ఫిట్స్ రాలేదు. ప్రస్తుతం వారి పిల్లవాడు ఇంజనీరింగ్ పూర్తి చేసి ఉద్యోగం చేస్తునాడు. వైద్యులకు మించిన భవరోగ వైద్యుడి ఆశీస్సులు, సంకల్పానికి మించినదేముంది!

**హైదరాబాద్ వాస్తవ్యులు చంద్రశేఖరరావుగారు, సుకన్య దంపతులు** అవసరంలో ఉన్నవారికి చేతనైన సహాయం చేసే స్వభావం కలవారు. ఈయన స్వభావం తెలిసినవారు ఇళ్ళు కట్టుకుంటున్నప్పుడు, పెళ్ళిళ్ళు చేసుకునేటప్పుడు వారికి సహాయంగా ఉండి మార్గదర్శనం చేయమని అడిగేవారు. చంద్రశేఖరరావుగారికి బాబాలు, స్వాములంటే నమ్మకం ఉండేది కాదు. కానీ భార్య, పిల్లవాడు దర్గాస్వామి దగ్గరకి వెళ్తుంటే, వెళ్ళద్దని అడ్డు చెప్పేవారు కాదు. ఆయన కుటుంబపద్ధతి ప్రకారం పండుగలకు పూజలు చేసేవారు. ఆయన భార్య దర్గాలకి వెళ్ళినప్పుడు ఒకసారి స్వామి ఆమెతో "తనంతతానే మీ ఆయన ఇక్కడకొచ్చి దర్శనం చేసుకుంటాడని" చెప్పారు. ఆయన వైఖరి తెలిసిన ఆమె మాత్రం అలా కలలో కూడా జరగదనుకున్నది. తరువాతి కాలంలో చంద్రశేఖరరావుగారు దర్గాను దర్శించటం, స్వామి అమ్మయ్యల యందు అత్యంత శ్రద్ధాభక్తులు కలిగి సమర్పణం చేయటం చమత్కారంగా జరిగినాయి.

హైదరాబాదు నుండి చంద్రశేఖరరావుగారి కొడుకు **ఆదర్శ్ గారు** ఇలా చెపుతున్నారు: "క్యాంపస్ ఇంటర్వ్యూకి వెళ్ళే ముందర స్వామి ఆశీస్సులు అడిగితే 'సద్గురుదేవా' అని చెప్పి వెళ్ళమన్నారు. నాకు డిఫెన్సు ల్యాబ్‌లో అపాయింట్‌మెంట్ వచ్చింది. తర్వాత వేరొక కంపెనీ వాళ్ళు ప్రాజెక్టు పని కోసం నన్ను సెలెక్టు చేసి డిఫెన్సు ల్యాబ్‌లోనే పని చేయమన్నారు. ఇలా చేయవచ్చో లేదో అని తెలుసుకుందామని స్వామికి ఫోను చేస్తే నన్ను టెక్నికల్‌గా ఏమేమి ప్రశ్నలు వేశారో అన్నీ చెప్పి తర్వాత నేనేమి సమాధానం ఇచ్చానో కూడా చెప్పారు. అంటే స్వామికి అన్ని విషయాలు తెలుసు అనేది నాకు దృఢపడింది.

మా నాన్నగారికి వున్న రక్తసంబంధమైన వ్యాధికి డాక్టర్లు చికిత్స చేస్తూ ఇచ్చిన మందులను వాడేవాళ్ళము. స్వామి దగ్గరకి వెళ్ళినప్పుడు "అరెయ్ అవసరానికంటే ఎక్కువ డోసేజ్ ఇస్తున్నారు" అని

చూచాయిగా చెప్పారు. కానీ డాక్టర్లు చెప్పినట్లు ఆ ఎక్కువ డోసేజ్ మందులే వాడాల్సి వచ్చింది. కొన్ని నెలలకు మా నాన్నగారు చనిపోయారు. దహన సంస్కారాల తర్వాత అస్థికలు తీసుకుంటున్నప్పుడు మా నాన్నగారి తొడల దగ్గర ప్రదేశంలో వేడిగా అనిపించింది. తర్వాత కొన్ని రోజులకు స్వామి దర్శనానికి వెళితే స్వామి "అరెయ్ తొడభాగంలో వేడి వుందా లేదారా? నిజం చెప్పరా!" అని నాతో అనేసరికి స్వామి ఎక్కువ డోసేజ్ గురించి హెచ్చరించిన మాటలు గుర్తుకు వచ్చి స్వామికి ఎక్కడ ఏమి జరుగుచున్నదో అన్నీ తెలుసు అనిపించింది.

ఒకరోజు ఆరతి అయిన తర్వాత స్వామి" కొంతమంది ముందరే చనిపోతారు. మరి కొంతమంది ఎక్కువకాలం బ్రతుకుతారు. ఎందుకంటే ఎవరి పని అయ్యేదాకా వారు వుండాల్సిందే" అని చెప్పి అంతకుముందు నాకున్న సందేహానికి నేను అడగకుండానే సమాధానమిచ్చారు.

మా ఊరిలోని స్థలాన్ని ఒకతను కబ్జా చేసాడు. అతనికి మద్దతుగా సి.ఐ. వుండడంతో ఎవరు కేసు వేసినా ప్రయోజనం లేదని నాలాంటి బాధితులు ఎవరూ కేసు వేయలేదు. స్వామికి చెప్తే "చూద్దాంలే నాయనా!" అని అన్నారు. తర్వాత కొన్నాళ్ళకే అకస్మాత్తుగా సి.ఐ. కి ట్రాన్స్‌ఫర్ అయ్యింది. క్రొత్తగా వచ్చిన సి.ఐ.కి ఇద్దరు ఆడవాళ్ళు కేసు పెట్టారు. ఆ సి.ఐ. పూర్వాపరాలు గమనించి కేసు పెట్టిన ఆ ఇద్దరు ఆడవాళ్ళ భూములే కాకుండా మిగిలిన అందరి భూములు కూడా ఇప్పించారు. స్వామికి చెప్పటమే ఆలస్యం ఆయనకు చెప్పుకున్న వారికే కాదు అన్యాయానికి లోను అయిన వారికి కూడా వారి కృపను వర్షిస్తారు. స్వామి ధర్మ స్వరూపుడు!

2012 సంIIలో నేను అయ్యప్పస్వామి దీక్ష తీసుకున్నాను. జ్యోతి దర్శనానికి వెళ్ళే ముందర స్వామి ఆశీస్సులు కోసం స్వామి దర్శనానికి వెళ్ళాను. స్వామి అన్ని విషయాలు అడిగారు. సామాన్యంగా జ్యోతి దర్శనానికి 24గంIIలు నుండి 48గంIIలు పడుతుంది. దానికి తగ్గట్లుగా రెండోరోజు రాత్రి తిరుగు ప్రయాణానికి రిజర్వు చేసుకున్నాను. కానీ

ఆ సంవత్సరము భక్తుల సంఖ్య మాకు చెప్పిన దానికి పావు వంతు కూడా లేదు. మాకు 45ని॥లలో దర్శనము అయిపోయింది. అలా జరగటం గత 35 సం॥లలో చూడలేదని మా గురుస్వామి చెప్పారు. నాకు దర్శనం అయిన దగ్గరనుండి ఇంటికి తిరిగి వెళ్ళిపోదామని ఆలోచన నన్ను బలంగా లాగుతోంది. మిగిలిన వారందరూ సమయం ఉందని దగ్గరలో వున్న ప్రదేశాలని చూడటానికి వెళ్ళారు. నేను మాత్రం ఆ రోజు రాత్రికి రిజర్వేషను చేసుకొని ఇంటికి వెళ్ళిపోయాను. తర్వాత రెండురోజులకి వచ్చిన స్వాములు నన్ను 'మీరు క్షేమంగానే వచ్చారా?' అని అడిగారు. నేను వచ్చాను అని చెప్పి ఎందుకలా అడిగారు అని అడిగితే నేను ముందర రిజర్వేషను ప్రకారం రావల్సిన బస్సు అనంతపురం దగ్గర రోడ్డుప్రమాదానికి గురి అయ్యింది. ఆరుగురు స్వాములు కాలం చేసారు అని చెప్పారు. ఈ విధంగా స్వామి నా ఆరోగ్యాన్ని, ప్రాణాన్ని కాపాడారన్న భావన కలిగి తలుచుకున్నప్పుడల్లా రోమాంచితమౌతుంది. స్వామి సర్వప్రేరణాధికారి!

మా అమ్మ అనారోగ్యం వల్ల ఎక్కువసేపు కూర్చోలేదు. మా అమ్మకి ట్రీట్‌మెంట్ చేసే డాక్టరు దగ్గర చాలా రద్దీగా వుంటుంది. ముందర వెళ్ళకపోతే 3-4గంటలు కూర్చోవాల్సి వస్తుంది. ఒకసారి వెళ్ళేసరికి లేటు అయ్యింది. 32వ నెంబరు టోకెను వచ్చింది. స్వామిని తలుచుకుంటూ మేము కూర్చొని వుంటే ఒకతను తనంత తాను మా దగ్గరకి వచ్చి తనకి ఏదో పని వుందని చెప్పి ఆయన టోకెను మాకు ఇచ్చి వెళ్ళాడు. వెంటనే డాక్టరుగారికి చూపించగలిగాము.

మా అమ్మకి అల్లోపతి ట్రీట్‌మెంట్ ఇప్పిస్తున్నాము. అయినా మా అమ్మకి మోకాళ్ళ నొప్పులు తగ్గలేదు. కానీ అల్లోపతి వైద్యమే మంచిదని మందులు మానకుండా తీసుకుంటున్నాము. స్వామి ఒకసారి ఆయుర్వేదం మందు ఇప్పించమన్నారు. నేను తెలిసిన వాళ్ళను విచారించగా వారి ద్వారా 3,4 డాక్టర్ల పేర్లు తెలిసాయి. ఒక డాక్టరి పేరు చూడగానే నాకు ఆయన దగ్గరకి వెళ్ళాలనిపించి మా అమ్మను తీసుకువెళ్ళాను. ఆయన మా అమ్మ చెయ్యి పట్టుకుని మా అమ్మకి జరిగిన ఇబ్బందులు గురించి చెప్పి అందువల్లనే వచ్చి వుంటుందని

చెప్పి మందు ఇచ్చారు. చాలా చిత్రంగా మందు వాడితే నొప్పులు చాలా తగ్గినాయి. స్వామికి ఏ రోగానికి ఏ మందు ఇస్తే తగ్గుతుందో కూడా తెలుసు. స్వామి సర్వ రోగనివారకుడు!"

**ప్రొద్దుటూరు గంగిశెట్టి వెంకట శివప్రసాద్‌గారు** పంచుకున్న అనుభవం: నేను సి.ఏ చేద్దామని మద్రాసు వెళ్ళాను. అయితే స్వామివారు నన్ను వ్యాపారం చేయమన్నారు. నేను మెడికల్ ఏజెన్సీ తీసుకున్నాను. అది కలిసి వచ్చి ప్రస్తుతం ఉన్నత స్థితికి వచ్చాను. మనకు ఏది శ్రేయస్కరమో స్వామికి స్పష్టంగా తెలుసు! వారు చెప్పిన మాటననుసరించి నడుచుకుంటే మనకు శ్రేయస్సు కలుగుతుంది.

నాకు బెల్లంపల్లి గ్రామం నుండి వివాహ సంబంధం వచ్చింది. పెళ్లి చూపులు అయినాయి. స్వామి మా ఇంటికి వచ్చినప్పుడు స్వామికి అమ్మాయిని చూపించాలని వారికి ఫోను చేస్తే 'ఎప్పుడు పడితే అప్పుడు ఎలా చూపిస్తాము?' అని అన్నారు. స్వామికి చెప్తే "వాళ్ళే మరలా ఫోను చేస్తారులే" అన్నారు. తర్వాత వారే ఫోను చేసి రమ్మన్నారు. స్వామి "వెళ్ళనక్కరలేదు" అన్నారు. కానీ నాకు స్వామి అమ్మాయిని చూస్తే బాగుంటుంది అని కొంచెం పట్టుబట్టాను. స్వామి, అమ్మయ్యలు నన్ను ప్రక్కనున్న దేవుడి గదిలోకి తీసుకెళ్లి అమ్మాయి రూపురేఖలు స్పష్టంగా , ఖచ్చితంగా వర్ణించారు. ఆ అమ్మాయి అన్నివిధాల సరిపోతుంది అని చెప్పి, ఎప్పటికైనా ఆ అమ్మాయే నీకు భార్య అని చెప్పారు. తరువాత స్వామి చెప్పిన విధంగా ఆ అమ్మాయితోనే నా వివాహం అయ్యింది.

నాకు ఆడపిల్ల కావాలని కోరిక. ఒకరోజు స్వామి నన్ను "ఒరెయ్ శివయ్య! రారా, నీ భార్యను పిలవరా" అన్నారు. ఆ రోజే అంటు అయింది అని చెప్పాను. స్వామి వెంటనే "అంటు, సొంటు మీకు కానీ మాకు కాదురా! మీ ఆవిడని పిలవరా" అన్నారు. మేమిద్దరం వెళ్ళగానే నీకు అమ్మాయి కావాలనుకుంటున్నావు కదరా! ఎందుకు అమ్మాయి కావాలిరా?" అని ప్రశ్నించారు. 'ఏమో స్వామీ! అమ్మాయంటే ఇష్టం' అన్నాను. స్వామి "మా అమ్మను ఇస్తానురా నీకు, భగవతి అని పేరు పెట్టుకో" అన్నారు. మీ దయ స్వామీ అన్నాను. "లేదు. మీ తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను కనుక్కో ముందర భగవతి అని పేరు పెట్టటానికి

ఏమైనా అభ్యంతరముందేమోనని". అందరూ అక్కడే వున్నారు. మా తల్లిదండ్రులు 'మాదేముంది స్వామీ! మీ మాట కాదనేదేముంది' అని అంటే స్వామి "భగవతి అని పుట్టకముందే పేరు పెట్టాల, అలా అయితేనే ఇస్తాను" అన్నారు. 'సరే స్వామీ' అని మ్రొక్కుకున్నాను. మా అమ్మను ఇస్తున్నాను" అన్నారు. 'చిన్న కోరిక స్వామీ!' అన్నాను. "ఏమి నాయనా" అంటే మగపిల్లలిద్దరితో చాలా కష్టాలు పడ్డా స్వామీ, మా ఆవిడకి పాలు లేవు. పాలు దొరకక డబ్బాపాలు ఇవ్వాల్సి వచ్చింది అని చెప్పాను. "ఏమీ కష్టపడాల్సిన పని లేదు. మా అమ్మ పాలు అన్నీ తెచ్చుకుంటుంది" అని చెప్పారు. ఫిబ్రవరి 2వ తారీఖు ఎక్కడికీ పోకు నాయనా అన్నారు. ఏమి స్వామీ అంటే అమ్మాయి డెలివరీ అవుతుంది అన్నారు. సరిగ్గా ఫిబ్రవరి 2వ తారీఖున డెలివరీ అయింది. నామకరణానికి స్వామి, అమ్మయ్యలు వచ్చి భగవతి అని పేరు పెట్టి ఆశీర్వదించి, "ఆ అమ్మాయిని కొట్టకూడదు, తిట్టకూడదు, ఆ అమ్మాయి మీకు అనుకూలంగా నడుచుకుంటుంది" అని స్వామి చెప్పారు. 8సం॥ల వరకు దగ్గుగానీ, పడిశంగానీ ఏమీ లేదు. ఒక్కసారి జ్వరం వస్తే స్వామికి చెప్తే "పోతుందిరా పో" అన్నారు. అప్పటినుండి ఏ సమస్యలూ లేవు. బి.టెక్ 75% మార్కులుతో పూర్తి చేసింది.

**ప్రొద్దుటూరు నుండి గంగిశెట్టి వెంకట శివప్రసాద్‌గారి కొడుకు కళ్యాణ్ గారు** ఈ విధంగా చెపుతున్నారు: నాకు 8సం॥లు వయస్సప్పుడు కాలుకి ఆపరేషన్ చేసారు. చెన్నై హాస్పిటల్లో ఒక వారం వున్న తర్వాత డిశ్చార్జ్ చేశారు. అమ్మ, నాన్న, నేను ఒక రూములో వుంటున్నాము. 8వ రోజు బాగా నొప్పి వచ్చింది. స్వామిని చూడాలనిపించింది. మా నాన్న 'స్వామికి మ్రొక్కుకో' అని స్వామి పటం ఇచ్చారు. అలా ప్రార్థించిన కొద్దిసేపటికే నొప్పి తగ్గింది. మర్నాడు ఉదయం 6 గంటలకి కాలింగ్ బెల్ మ్రోగి తలుపు తెరిస్తే అమ్మయ్య, స్వామి వచ్చారు. మేము ఎవరూ చెప్పలేదు. చెన్నైలో ఒక పెళ్ళి వుండి చూసి వెళదామని వచ్చామని స్వామి చెప్పారు. "నువ్వు బానే నడుస్తావు. చదువులో ఫస్ట్ వుంటావు" అని ఆశీర్వదించి "నీకేమైనా భయమేస్తే టి.నగర్ మౌంట్‌రోడ్డులో వున్న దర్గాలోని మహనీయుని సమాధి దగ్గర

ప్రార్థన చేయి'' అని చెప్పారు. నమ్మినవారికి కొంగు బంగారము స్వామి!

నేను బి.టెక్ చదువుతున్నప్పుడు సెమిస్టర్ పరీక్షలు అయిన తర్వాత శెలవులకి క్రమం తప్పకుండా దర్గాల దర్శనానికి వెళ్ళేవాడిని. 7వ సెమిస్టర్‌లో ఒక 3 పరీక్షలు సరిగ్గా వ్రాయలేదు. అలవాటు ప్రకారం స్వామి దగ్గరకి వెళ్ళి 'ఒక 3 పరీక్షలు సరిగ్గా వ్రాయలేదు పాస్ అవకపోవచ్చు' అని చెప్పాను. స్వామి ''ఓవరాల్‌గా గెటాన్ అవుతావు. ఫస్ట్ క్లాస్ వస్తుంది'' అని చెప్పారు. అలానే ఫస్ట్‌క్లాస్ వచ్చింది. ఇంకొక సెమిస్టర్ శెలవులకి దర్గాల దర్శనానికి బయలుదేరాను. బస్సులో ప్రయాణిస్తుండగా కంట్లో నలకేదో పడింది. నీళ్ళల్లో కడిగినా నలకపోలేదు. బాధగా వున్నా దర్గాల దగ్గరకి వెళ్ళినందుకు స్వామి చాలా సంతోషపడి ''గ్లాడ్ టు హియర్ అని, తగ్గిపోతుందిలే'' అన్నారు. అమ్మయ్య కొంతసేపటికి 2 నెయ్యి చుక్కలు వేసింది. నొప్పి చాలా తగ్గింది. ఎరుపుతనం, నలక పోలేదు. స్వామి శంకరన్నతో కంట్లో తీర్థం పోయించారు. తర్వాత నలకలు, ఎరుపుతనం కూడా పోయింది.

నేను చిన్నప్పటి నుండి స్వామి దగ్గరకి వెళుతున్నాను కానీ ఏనాడూ సాయిబాబా చరిత్ర చదువలేదు. నాకు 25 సం॥లప్పుడు ఎందుకో చదవాలని శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు వ్రాసిన శ్రీ సాయి లీలామృతం చదివాను. చదువుతుంటే సాయిబాబా భక్తుల అనుభవాలు, స్వామి దగ్గర జరిగే సంఘటనలు ఒకలాగా వుండేసరికి సాయిబాబా, దర్గాస్వామి వేరుకాదనిపించి స్వామికి ఫోను చేసి చెప్పాను. అప్పుడు స్వామి ''సాయి చరిత్ర చదువుతున్నావా? సంతోషం నాయనా! పరమాత్మ రూపాలు వేరైనా ఆ సద్గురువు ఒక్కడే! ఆయన మసీదులో వున్నాడు. నేను దర్గాలో వున్నాను. ఆయన ఎన్నో అగచాట్లు పడి గురుస్థానానికి వచ్చాడు. నేను ఎన్నో అగచాట్లు పడి గురుస్థానానికి వచ్చాను. నువ్వు ఏ గురువును నమ్ముకున్నా నేను నిన్ను నడిపిస్తాను'' అని చెప్పారు.

ఒకరోజు కళ్యాణ్‌గారు స్వామి దగ్గర వుండగా ఒకామె తన సమస్యలు స్వామికి చెపితే స్వామి ''నాకు పాలు పోయమ్మా!'' అని ఒక క్షణం తర్వాత ''అర్థం కాలేదా! నాగేంద్రుడికి పాలు పోయమ్మా, అన్నీ పోతాయి'' అని చెప్పారు. అంటే స్వామి సాక్షాత్తు

సుబ్రహ్మణ్యస్వామి అని చెప్పకనే చెప్పారు.

ఎప్పుడు దర్గాల దగ్గరకి వెళ్ళినా అమ్మయ్య దగ్గరకి మొదట వెళ్ళి నమస్కారం చేసుకుని స్వామి దర్శనం గురించి విన్నవిస్తాము. ఈ విధంగా మొదట అమ్మయ్య నమస్కారం చేసుకోమని స్వయంగా స్వామియే చాలామందికి చెప్పినారు. అమ్మయ్య "పోరా, స్వామి దర్శనం చేసుకోరా" అని చెప్పిన తర్వాత వెళితే స్వామి ఆశీర్వదించేవారు. అమ్మయ్య అంటే అమ్మ+అయ్య అని స్వామి చెప్పేవారు. అమ్మయ్య అనే పదంలో తల్లి, తండ్రి ఇద్దరూ ఉన్నారనేదానికి సంకేతం. అందువలన అమ్మయ్యకు నమస్కారం చేసుకుంటే స్వామికి, అమ్మయ్యకు ఇద్దరికీ నమస్కారం చేసుకున్నట్లు.

1990సం॥ ఉరుసు జరుగుతున్నప్పుడు రెండు వ్యానుల నిండా భక్తులు వచ్చారు. స్వామి "నిష్ఠ, భక్తితో భజన జరిగినంతసేపూ కర్పూరం వెలుగుతుంటే బాబా తప్పక వస్తాడు" అని చెప్పారు. భక్తులు భజన చేస్తుంటే కళ్యాణ్, ఇంకొకతను కర్పూరం వెలిగిస్తున్నారు. భజన అయిన తర్వాత ఆరతి కొండెక్కింది. నల్లగా మసిబారిన ఆరతి పళ్ళెంలో చాలా స్పష్టంగా రెండు పాదాలు కనపడ్డాయి. స్వామి చెప్పినట్లు సాయిబాబా వచ్చారు అనిపించింది.

నాకు 2013లో పెళ్ళి అయ్యింది. కొంతకాలం తరువాత నా భార్య కుడిచెవి క్రింద గడ్డ లేచింది. డాక్టర్లు అన్ని పరీక్షలు చేసి 'ఊపిరితిత్తుల దగ్గర ఒక మార్క్ వుంది అది ఏమిటో అర్థం కాలేదు' అని కొందరు, టి.బి. అని కొందరు చెప్పారు. స్వామికి ఫోను చేస్తే అమ్మాయికి ఎలా వుంది అని అడిగి విషయం తెలుసుకున్నారు. స్వామి "అమ్మాయికి ఏమీ లేదు, నీళ్ళను బాగా మరిగించి చల్లార్చిన తర్వాత నీళ్ళను రోజూ ఒక 3 నెలలు త్రాగమను" అని చెప్పారు. అలానే చేస్తే డాక్టర్లకు అంతుపట్టని గడ్డ మాయమైంది. స్వామి దగ్గరకి వెళ్ళినప్పుడు "ఫొటో (ఎక్స్‌రే) తీయించారా?" అని అడిగారు. నేను 'మీరు తగ్గుతుందని చెప్పారు కదా స్వామీ! అందువలన తీయించలేదు' అన్నాను.

2016 సెప్టెంబర్ 12వ తేదీ కళ్యాణ్ దంపతులకు ఒక మగబిడ్డ జన్మించాడు. ఈతనికి స్వామి ఆజ్ఞ మేరకు "జయదేవ్' అని నామకరణం

చేసుకున్నారు. పిల్లవాడు జన్మించిన మొదటి రెండు వారాలు అతని ఆరోగ్యం బలహీనంగా ఉందని, ఉమ్మనీరు మ్రింగటం వలన పచ్చకామెర్లు వచ్చిందని, చాలా విషయాలు డాక్టర్లు కళ్యాణ్‌కు చెప్పారు. వీరికి పిల్లవాడు మొదటి సంతానం కాబట్టి కళ్యాణ్ వాళ్ళు కూడా చాలా గాభరాపడ్డారు. జరుగుతున్న విషయాలు స్వామికి విన్నవించుకుని ఆయన ఆశీస్సులు కోరారు. స్వామి దృఢంగా "పిల్లవాడు ఆరోగ్యవంతుడు. ఏమీ భయం లేదు. అన్నీ సర్దుకుంటాయి" అని ధైర్యం చెప్పారు. ఈ రెండు వారాలు మానసిక వ్యథ అనుభవించిన కళ్యాణ్ కుటుంబానికి స్వామి వాక్యాలు ఎంతో ఆస్వాసనను ఇచ్చాయి.

మా నాన్నగారు మెడనొప్పితో కొద్దిసం॥లు చాలా బాధపడ్డారు. స్వామికి చెప్తే తగ్గుతుందిలే అని అన్నారు. కానీ నొప్పి తగ్గలేదు. ఒకసారి మా నాన్నని పిలిచి "మెడనొప్పి కదా, జండూబామ్ రాసుకో" అని చెప్పారు. ఒక వారం అలా రాసిన తర్వాత మెడనొప్పి రాలేదు. ఎందుకు 3 సం॥లు నొప్పితో బాధపడాలి, తర్వాత జండూబామ్‌తో రాసుకోమని చెప్తే తగ్గటమేమిటి? స్వామికే ఎరుక ఎంత బాధ ఎవరు అనుభవించాలి అనేది! అలా కొంచెం బాధతో ఎంత పెద్ద కర్మను తొలగించారో ఎవరికి ఎరుక!

**తిరుపతి నుండి గిరి** అనే భక్తుడు దాదాపు రెండు దశాబ్దాల నుండి స్వామి దర్శనం చేసుకుంటున్నారు. ఈయన వృత్తిరీత్యా ఫోటోగ్రాఫర్. దర్గాలో జరిగిన చాలా ఉత్సవాలకు ఈయన ఫోటోలు, వీడియోలు తీసియున్నారు. ఆయన పంచుకున్న అనుభవాలు: అన్నివిధాల చితికిపోయిన నాకు భగవంతుడు కరుణించి లాయరు మస్తానునాయుడు గారి ద్వారా దర్గాస్వామి దర్శనం చేయించారు. స్వామి స్వహస్తాలతో నేలమీద నీళ్ళు చల్లి, ఆకు వేసి అన్నం ఆకునిండా పూర్తిగా వడ్డించి ఏమాత్రం వదలకుండా తినమని చెప్పారు. కష్టపడి పూర్తిగా తిన్నాను. స్వామి సంతోషంగా ఆశీర్వదిస్తూ "నీకు నేనున్నాను, దేనికీ దిగులు పడాల్సిన పనిలేదు" అని అభయమిచ్చారు.

చాలామందికి అమ్మయ్య చేసిన వంట స్వయంగా స్వామియే వడ్డించి భోజనం పెట్టినారు. ఈ రకంగా స్వామి చేతి భోజనం తిన్నవారు

చాలా అదృష్టవంతులు. వారికి జీవితం వడ్డించిన విస్తరి అని సంకేతం. ఆ భోజనం తిన్నవారిని స్వామి అమ్మయ్యలు దత్తు తీసుకుని స్వయంగా వారి యొక్క సంరక్షణ బాధ్యతను స్వీకరించినట్లు. ఈ రకమైన కృప హైదరాబాద్ భానుమూర్తి, రాజీవ్‌లకు కూడా లభించింది.

గుమాస్తాగా చాలీచాలని జీతంతో జీవిస్తున్న నేను కేవలం స్వామికృప వలన ఫోటో స్టూడియో పెట్టగలిగాను. పెళ్ళయిన తర్వాత దర్గాల దగ్గర స్వామి రెండు పళ్ళు ఇచ్చి మొదట పాప, తర్వాత బాబు పుడతారు అని ఆశీర్వదించారు. కాలాంతరంలో స్వామి చెప్పినట్టుగానే జరిగింది.

నా శరీరం ఎడమప్రక్క పక్షవాతం కలిగితే స్వామి చూచి "ఏమీ ఫర్వాలేదులేరా, మందులు వేసుకో తగ్గిపోతుంది" అని చెప్పారు. అలానే చేసిన తర్వాత పూర్తి ఆరోగ్యం కలిగింది.

నేను ట్రస్టు భూమిలో ప్లాటు కొనుక్కొని ఇల్లు కట్టుకున్నాను. కొద్ది రోజులకు ట్రస్టు భూమిని ఆక్రమించారని కలెక్టరు, ఇన్‌స్పెక్టరు మొ॥ వాళ్ళు వచ్చి కొన్ని కట్టడాలు పగలగొట్టారు. మా ఇంటిని కూడా పగలగొట్టాలని మార్కు చేసుకుని వెళ్ళారు. కానీ తర్వాత ఎవరూ రాలేదు. 4 నెలల తర్వాత స్వామి దర్శనం చేసుకుంటే ఏమీ చెప్పకముందే స్వామి "ఏమిరా! వాళ్ళేమీ ఇంటి దాకా రాలేదు కదా! ఎలా వస్తారు రా? నీవు పూజించే జగన్మాత వుందిరా"అని చెప్పేసరికి మేమంతా ఆశ్చర్యపోయాము. తర్వాత స్వామి అన్నీ గమనిస్తున్నారని తెలిసి ధైర్యము, ఆనందమూ కలిగినాయి.

ఒకసారి **చీమకుర్తి సుబ్బారావుగారి** భార్యకు కామెర్ల వ్యాధి వచ్చింది. విజయవాడలోని డాక్టర్లు వైద్యం చేసి వ్యాధిని తగ్గించారు. కానీ శరీరంలో రక్తం తగ్గి, నీరు పట్టి కాళ్ళు, చేతులు వాచినాయి. డాక్టర్లు రక్తం పట్టే ఆహారం తీసుకోమన్నారు. అలాంటి ఆహారం తీసుకున్నా ఆరోగ్యం మెరుగవలేదు. ఆవిడ నడవటానికి కూడా కష్టపడేది. ఈ సమయంలో దర్గాస్వామి దర్శనానికి వెళ్ళినప్పుడు స్వామికి తన ఆరోగ్యం గురించి విన్నవించింది. స్వామి "రక్తం చెడిపోయింది. రక్తం ఎక్కించుకో, తగ్గుతుంది" అన్నారు. ఇంటికి వచ్చిన తర్వాత ఒక 12 బాటిల్స్ రక్తం ఎక్కించారు. ఆవిడ ఉబ్బటం తగ్గి యిప్పుడు తన పని తాను

చేసుకుంటున్నది. స్వామి సూచన పాటించటం వల్ల ఆయన భార్య బలహీనత, కాళ్ళు, చేతుల వాపులు తగ్గి ఆరోగ్యం పుంజుకున్నది.

ఒకసారి ఆరుగురు భక్తులు కలసి దర్గాస్వామి ఆశీస్సులు తీసుకుని తిరుమల తిరుపతికి బయలుదేరారు. సకాలంలో బస్సులు దొరికి చాలా త్వరగా తిరుమలకి చేరారు. అంతేకాక కేవలం ఒక గంటలో శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనమయ్యింది. ఏ పనైనా సద్గురు ఆశీస్సులతో ప్రారంభిస్తే మంచి ఫలితాలు లభిస్తాయని తెలుస్తోంది.

చీమకుర్తి సుబ్బారావుగారికి చిన్నప్పటినుండి చిన్న దెబ్బ తగిలినా చాలాసేపటి వరకూ రక్తం కారుతూ ఉండేది. ఒకసారి ఆయన, ఆయన కుమారుడు స్వామి దగ్గరకి వస్తుంటే ఆయన తలకి దెబ్బ తగిలి రక్తం కారుతోంది. వారి కుమారుడు ఆస్పత్రికి వెళదామంటే ఆయన స్వామిని తలచుకొని, తడిపిన గుడ్డతో తలకి కట్టు కట్టి, పట్టుదలతో స్వామి దర్శనానికి ప్రయాణం కొనసాగించారు. మార్గమధ్యంలోనే రక్తం కారటం ఆగిపోయింది. అలా జరగటం చాలా అద్భుతం. స్వామికి ఈ విషయం చెప్తే "నా పేరు తలచుకుంటూ, దర్గాల దగ్గరకి వస్తుంటే కడప బాంబు వేసినా ఏమవదు" అని అభయమిచ్చారు.

1995లో అశ్వారావుపేట చీమకుర్తి అన్నపూర్ణ గారి కుటుంబమంతా మొదటిసారి దర్గాస్వామి దర్శనానికి వెళ్ళారు. మధ్యాహ్నా ఆరతికి 10ని॥ ముందర స్వామి వారిని "ఏ ఊరు నుండి వచ్చారు?" అని అడిగారు. ఎక్కువ మంది భక్తులు తరచూ దమ్మపేట నుండి స్వామి దర్శనం చేసుకుంటూ ఉంటారు. అందువలన వారిది అశ్వారావు పేట అయినా దమ్మపేట అని చెప్తే వాళ్ళని గుర్తుపెట్టుకుంటారని 'దమ్మపేట స్వామీ!' అని చెప్పారు. వెంటనే స్వామి వాళ్ళని మందలించి బయటికి పంపించారు. వారికి ఏమి తప్పు చేశారో, ఎందుకు అలా బయటకు పంపారో అర్థంగాక మందిరం బయట చెట్టు క్రింద కూర్చుని శ్రీ గురుచరిత్ర, శ్రీ సాయిలీలామృతం గ్రంథాలు పారాయణ చేస్తున్నారు. అలా పారాయణ చేస్తున్నప్పుడు ప్రక్కవారు చెప్పుకుంటున్నది వినటం వలన వారు అబద్ధం చెప్పారు గాబట్టి స్వామి బయటకు పంపేశారని అర్థమై, మనస్సులోనే స్వామికి క్షమాపణ చెప్పుకున్నారు. సాయంత్రం ప్రశ్న చెప్పటానికి

వచ్చినప్పుడు, స్వామి అక్కడ ఉన్న సుమారు 100 మందిలో వారిని పిలిచి "మీ ఆయన మంచి పేరు గడిస్తాడు, మీ పాప మంచి మెరిట్‌లో విద్యాభ్యాసం చేస్తుంది" అని చెప్పారు. తర్వాతి కాలంలో వారి అమ్మాయికి 10వ తరగతిలో అశ్వారావు పేట మండలంలో మొదటి ర్యాంకు వచ్చింది. ఐ.ఐ.ఐ.టి, నూజివీడులో ఇంటర్మీడియెట్ పూర్తి చేసి బి.టెక్. చదివింది. వారికున్న ఆర్థిక స్థోమతకు అంత మంచి కాలేజీలో చదివించటం చాలా పెద్ద విషయం. అది కేవలం స్వామి కృప వలననే సాధ్యపడింది.

వారి ఇంట్లో ఒక దంపతులు అద్దెకి ఉండేవారు. అబ్బాయి రోడ్లు వేసే ఇంజనీరు. అమ్మాయి పేరు పల్లవి. వారికి పెళ్ళయి 10 సం॥లైనా పిల్లలు లేరు. పల్లవి వారు చెప్పినట్లు శ్రీ గురుచరిత్ర, సాయిబాబా చరిత్రలు పారాయణ చేస్తూ, ప్రదక్షిణలు చేస్తూండేది. డాక్టర్లు పిల్లలు పుట్టటానికి అవకాశం ఉందని చెప్పేవారు కానీ పల్లవి అత్తగారు తన కుమారుడికి రెండవ పెళ్ళి సంబంధాలు చూస్తుండే సరికి పల్లవి భయపడింది.

అంతేగాక అదే సమయంలో పల్లవి భర్తకు ఉద్యోగంలో బదిలీ అయ్యింది. పల్లవికి ఆ ఊరినుండి వెళ్ళటానికి ఇష్టం లేదు. కానీ అన్ని సామాన్లు సర్దుకొని మరునాడు వెళదామనుకుంటుంటే అన్నపూర్ణగారు ఫోనులో దర్గాస్వామితో మాట్లాడే అవకాశం కలిగింది. పల్లవి కూడా స్వామితో మాట్లాడదామనుకొని ఫోను తీసుకుంది. ఆమె ఏమీ చెప్పకుండానే స్వామి "నువ్వేమీ బాధ పడకు, ఇంకా 1 1/2 సం॥ అక్కడే ఉంటారు" అన్నారు. మర్నాడు పల్లవి భర్తకు రెండు సంవత్సరాలు అశ్వారావు పేటలోనే ఉండమని పోస్టింగ్ ఆర్డరు వచ్చింది. ఒక వారం తర్వాత స్వామికి ఫోను చేసి విషయం చెప్పి, బిడ్డల గురించి అడిగితే స్వామి "సంవత్సరంలోగా మగ బిడ్డ పుడతాడు" అని చెప్పారు. అలానే స్వామి దయ వలన పల్లవి గురుపూర్ణిమ రోజు మగబిడ్డను ప్రసవించింది.

**డా. రామచంద్రారెడ్డి, డా.లీలావతి దంపతులు** రాయచోటి వాస్తవ్యులు. వీరు రాయచోటిలో ఒక ఆస్పత్రి స్థాపించి దానిద్వారా ఎంతోమందికి వైద్యసేవలు చేస్తున్నారు. ఈ ఆస్పత్రిలో స్త్రీలకు ప్రసవాలు, ఆడవారి సమస్యలకు వైద్యం చేస్తారు. వీరికి 1998 సం॥లో డా॥ సుబ్బారెడ్డి గారి ద్వారా స్వామి పరిచయం, దర్శనం కలిగింది.

డా॥ లీలావతిగారు స్వామితో 'స్వామీ! నా తమ్ముడు ఇంట్లోని సమస్యలకి పారిపోయాడు. ఎక్కడ వున్నాడు?' అని అడిగితే స్వామి "రాయచోటికి 20 కి.మీ దక్షిణంలో వున్నాడు. తనంత తానే వస్తాడు" అని చెప్పారు. అలానే స్వామి చెప్పినట్లు ఒక నెలకి వచ్చాడు.

డా॥ లీలావతిగారు 'స్వామి! మా తోటలో పాములు తిరుగుతున్నాయి' అంటే "మీ పూర్వీకులు నాగదేవతను ప్రతిష్ఠించారు" అని స్వామి చెప్పారు. స్వామికి ఎప్పుడో కొన్ని తరాల క్రితం జరిగిన విషయాలు కూడా తెలుసు.

వీరు రాయచోటిలో హాస్పిటల్ కట్టించడానికి శ్రీ స్వామివారు, అమ్మయ్యగారు వచ్చి శంఖుస్థాపన చేసారు. అప్పటి నుండి ఆ ఆస్పత్రి ద్వారా ప్రజలకు ఎంతో సేవ చేస్తున్నారు. అంతకుముందు వారికి కొన్ని సమస్యలు వుండేవి. కానీ స్వామికి సమర్పణ చేసిన తర్వాత అవన్నీ తీరిపోయాయి.

వారికి ఇద్దరు ఆడపిల్లలు. స్వామి చెప్పినట్లే వారి పిల్లలిద్దరికీ ఎంసెట్‌లో  మెరిట్ కోటాలో సీటు వచ్చింది. వీరి పెద్దపాప భార్గవి పి.జి. కోర్సు చేసింది.  వారి ఇద్దరి పిల్లలకి స్వామే పెద్దరికం వహించి సంబంధాలు ఖాయం చేశారు. అందరూ హాయిగా వున్నారు. పెద్దపాపకి పెళ్ళయిన 2సం॥లు దాకా పిల్లలు పుట్టలేదు. స్వామికి విన్నవిస్తే ఒక సం॥ లోపల మగ పిల్లవాడు పుడతాడు అని చెప్పారు. అలానే జరిగింది. వారి పెద్ద అల్లుడు, కూతురు స్వామి అనుమతి మరియు ఆశీస్సులతో రాయచోటిలో మెడికల్ ప్రాక్టీస్ పెట్టుకున్నారు.

చిన్న కూతురు గర్భం ధరించి 3వ నెలలో డాక్టర్ స్కాన్ చేసి పిండానికి హార్ట్ ప్రాబ్లమ్ వుంది అని చెప్పారు. స్వామి దగ్గరకి వెళ్ళి చెపితే స్వామి "ఏమీ లేదు. అమ్మయ్యతో పిల్లాడు ఆడుకుంటున్నాడు. ఆపరేషన్ అక్కర్లేదు, ఏమీ చెయ్యద్దు" అని చెప్పారు. కొన్ని రోజుల తర్వాత మరలా స్కానింగ్ చేయిస్తే డాక్టర్లు పరీక్షించి అంతా పర్ఫెక్టుగా వుంది' అని చెప్పారు. నెలలు నిండాక ఆరోగ్యవంతమైన మగ పిల్లవాడు పుట్టాడు.

డా॥ లీలావతి గారికి కొన్ని సం॥ల క్రితం ముక్కుకి, తలకి పెద్ద

అపరేషన్లు జరిగాయి. తర్వాత గొంతుకి పెద్ద అపరేషన్ చేయాల్సి వచ్చింది. స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. ఆపరేషన్ రోజు స్వామి ఫోను చేసి " నీ దగ్గరే వున్నాను. దత్తాత్రేయుడు వున్నాడు. భయపడకు" అని ధైర్యం చెప్పారు. ఆపరేషన్ విజయవంతంగా అయ్యింది.

డా॥ లీలావతిగారి అమ్మగారు చనిపోయిన తర్వాత సంవత్సరీకం అయ్యేదాకా యాత్రలు చేయకూడదని చెప్పారు. మనస్సులో స్వామి చరణాలలో సమస్త తీర్థాలుంటాయని తలచి స్వామి దర్శనానికి వెళ్ళారు. స్వామి గురుగీత పుస్తకం ఇచ్చి డా॥లీలావతిగారిని చదవమన్నారు. దాంట్లో పార్వతీదేవికి పరమేశ్వరుడు ఇలా చెపుతాడు "సద్గురు చరణాలలో సర్వ తీర్థాలు వుంటాయి. ఆయనకి పాదాభివందనం చేస్తే అశ్వమేధ యాగం చేసినంత ఫలితం లభిస్తుంది." తరువాత స్వామి ఖర్జూరం పండ్లు ఇచ్చి "ఇవి మీరే తినాలని" చెప్పారు. అలా వారి మనస్సులో తీర్థక్షేత్రాలకు వెళ్ళాలన్న కోరికను తీర్చారు.

తరువాత కొంతకాలానికి స్వామి ఆశీస్సులు తీసుకుని కాశీకి బయలుదేరుతుంటే స్వామి 5,000 రూపాయలు ఇచ్చి "కాశీలో, గాణ్గాపూర్‌లో అన్నదానం చేయమని చెప్పి, మీకేమైనా ఇబ్బంది వస్తే అమ్మయ్యను తలచుకోండి, వెంటనే పని జరుగుతుంది" అని చెప్పారు. కాశీలో వారిద్దరూ వేరు వేరు క్యూలలో దర్శనం చేసుకోవాల్సి వచ్చింది. దంపతులిద్దరం కలిసి దర్శనం చేసుకోలేకపోయామని అమ్మయ్యను తలుచుకున్నారు. వెంటనే ఒక పోలీసు ఆఫీసర్ అంతమందిలో వారిద్దరినీ మాత్రమే ఒకే క్యూలో పంపించి దర్శనం చేయించారు.

వారు వైష్ణవీ దేవీ దర్శనానికి ఆవిడ చెల్లెలి కుటుంబంతో కలిసి వెళ్ళారు. దర్శనం చేసుకుని వచ్చేటప్పుడు వారు విడిపడి, ఆవిడ చెల్లెలి కుటుంబసభ్యులు కనపడలేదు. వారు హెలికాప్టర్‌లో వెళ్ళాల్సిన సమయం ఆవుతోంది. ఆవిడ చెల్లెలివాళ్ళ జాడ తెలియలేదు. లీలావతిగారు అమ్మయ్యను తలుచుకున్నారు. 5ని॥ల తర్వాత ఆవిడ చెల్లెలు వాళ్ళు వచ్చి కలిసారు.

స్వామి లీలావతి దంపతులను 2011వ సం॥లో కురువపురం దర్శనం చేసుకోమన్నారు. శ్రీ పాదవల్లభ చరితం చదవమన్నారు. వారు

కార్తీకమాసంలో కురువపుర దర్శనం, మాఘమాసంలో శ్రీ కాళహస్తి, తిరుమల, శిరిడీ వెళ్ళారు. వారు స్వామి దర్శనానికి వెళితే, ఏరోజు ఎక్కడికి వెళ్ళి దర్శనం చేసుకున్నారో చెప్పి, వచ్చే పూర్ణిమకి ఇక్కడ ఉంటారు అని చెప్పారు. అలానే 2012సం॥లో స్వామి సహస్ర చంద్ర దర్శన ఉత్సవానికి ఆశ్రమంలో స్వామి దగ్గరే వున్నారు.

లీలావతి దంపతులు 2014సం॥లో శిరిడీ దర్శించుకుందామని స్వామిని ఆశీస్సులు కోరారు. స్వామి ఆశీర్వదించి "నేను మీ వెంటే వుంటాను" అని చెప్పారు. వారు శిరిడీలో యాత్రీనివాస్ సత్రంలో రూము తీసుకున్నారు. తలుపులు తెరిచేసరికి అమ్మయ్య, స్వామి ఫొటో అక్కడ పెట్టబడి వుంది. స్వామి ఆశీస్సులతో ఆరతి చూసి, సాయి సత్య వ్రతం చేసుకోగలిగారు. వచ్చిన తర్వాత స్వామికి చెప్తే "చెప్పాగా! మీ వెంటే వుంటానని" అనే తమ ఆశీర్వచనాన్ని గుర్తు చేసారు.

**సత్యకళగారు** ఇలా చెపుతున్నారు: మాకు గత 20 సంవత్సరాలుగా స్వామి పరిచయం. నాతో స్వామి చాలాసార్లు "అమ్మా సత్యా! మీరు 15రోజులకొకసారి ఇక్కడకి వచ్చి నిద్ర చెయ్యండి. మీకేమి కావాలో అదిస్తాను" అన్నారు. మా జీవితాలు స్వామి దయవలన సాఫీగా జరుగుతున్నాయి.

మా అమ్మాయి తను ఉద్యోగం చేసే కంపెనీలో ఒకతన్ని ప్రేమించింది. వారిద్దరూ వివాహం చేసుకోవాలనుకున్నారు. మాది మధ్య తరగతి కుటుంబం. మాకు కట్నాలు ఇవ్వటం ఇష్టం లేదు. ఈ విషయాన్ని అబ్బాయి తల్లిదండ్రులకు తెలియచేసాము. మా వారు కష్టపడి హైదరాబాదులో కొనుక్కున్న ఫ్లాటు మా తదనంతరం మా అమ్మాయికి ఇవ్వగలము అని చెప్పాము. దానికి వారు అయిష్టంగానే సమ్మతించారు. ముహూర్తాలు మాట్లాడుకునేటప్పుడు ఆడపడుచుకట్నం దగ్గర పేచి వచ్చింది. మాకేమో ఆడపడుచు కట్నం ఆనవాయితీ కాదు. వారేమో కావాలని పట్టుబట్టారు.

ఈ స్పర్ధ వలన అబ్బాయి పెళ్ళికి వద్దన్నాడు. మేము స్వామి దగ్గర విషయం చెపితే, స్వామి అబ్బాయిని దర్గాకు పిలిపించారు. అతనితో "ఊరికే మాట్లాడవద్దు. ఈ అమ్మాయి అంటే నీకు ఇష్టమా

కాదా? ఒక మాట చెప్పు. చేసుకుంటావా? చేసుకోవా?'' అని అడిగేసరికి అబ్బాయి 'ఇష్టమే, పెళ్ళి చేసుకుంటాను' అన్నాడు. ''అట్లాగయితే ఎందుకంత గలాట చేసుకుంటావు'' అనేసరికి అంతా సద్దుమణిగి తిరుపతిలో పెళ్ళి జరిగింది.

కొంతకాలం తర్వాత మా అమ్మాయి గర్భవతి అయింది. ప్రసవానికి కంపెనీ వాళ్ళు ఆస్పత్రి ఖర్చులు యిస్తారు, మీరే బెంగుళూరుకి రండి అని మమ్మల్ని పిలిచింది. మేము బెంగుళూరు వెళ్ళి మా అమ్మాయికి పురుడు పోసాము. ఆస్పత్రి ఖర్చులు 80,000/- అయితే కంపెనీ వాళ్ళు 60,000/- ఇచ్చారు. మా అమ్మాయి మిగిలిన 20,000/- కట్టి, కంపెనీవాళ్ళు మొత్తం డబ్బు ఇచ్చారని చెప్పింది. మేము దాని గురించి పట్టించుకోలేదు. ఈ విషయం మా అల్లుడి తల్లిదండ్రులకు తెలిసి ఆ డబ్బు మేము వాళ్లకి ఇవ్వాలని అడిగారు. మా అమ్మాయి ఎందుకు యివ్వాలని వాదించింది. దానితో అదంతా చిలికి చిలికి గాలివాన అయ్యింది. మేము ఈ విషయం స్వామికి చెప్పుకుంటే స్వామి ''అమ్మా! వాళ్ళు డబ్బు మనుషులు. వాళ్ళు గృహప్రవేశానికి వచ్చినారంటే ఏం మాట్లాడకూడదు. **ఆడపిల్లను ఇచ్చిన వాళ్ళం మనవేమీ మాట్లాడకూడదు. మనమే సర్దుకుపోవాలి.** 20,000/- రుపాయలు ఇచ్చేసి ఏమీ మాట్లాడవద్దు'' అన్నారు. అంతా స్వామి చెప్పినట్లు చేసి ఆ సంకట పరిస్థితి నుండి బయటపడ్డాము.

మరలా కొంత కాలం తర్వాత మా అల్లుడు అమెరికాకు వెళ్లాడు. అక్కడ ఒక సంవత్సరం ఉన్న తర్వాత మా అమ్మాయిని ఉద్యోగం మానేసి అమెరికా రమ్మన్నాడు. మా అమ్మాయికి ఉద్యోగం మానటం ఇష్టంలేక రానంటే మనస్పర్ధలు ఏర్పడి విషయం విడాకులు ఇచ్చుకునేంత వరకు వెళ్ళింది. మా అమ్మాయిని స్వామి దగ్గరకి తీసుకొని వెళ్ళి విషయం విన్నవించుకున్నాము. నేను నా మనస్సులో 'ఎందుకు అనవసరంగా నెలకు 60,000 రూపాయలు వచ్చే ఉద్యోగం మానేసి అమెరికాకి వెళ్ళటం' అనుకున్నాను. వెంటనే స్వామి నా వంక తీక్షణంగా చూస్తూ ''నువ్వు సాకాలనుకుంటే ఇక్కడ పెట్టుకో, నీ బిడ్డని'' అన్నారు. వెంటనే నేను 'మీ ఇష్టం స్వామీ'! అన్నాను. మా అమ్మాయితో

"అమ్మా ఇక్కడ ఉండొద్దు. వాళ్ళమ్మా,నాన్న ప్రభావం అతని మీద ఉంది. ఏది మంచి, ఏది చెడు తెలుసుకునే శక్తిలేదు. అబ్బాయి మంచివాడు. ఎందుకు చిన్నదానికి గొడవలు పడతారు. నువ్వెళ్ళిపోమ్మా! ఆ అబ్బాయి మారుతాడు పో, నీకేం భయం లేదు నేనున్నాను పో" అని ఆశీర్వదించారు.

మా అమ్మాయి వెళ్ళి ఇప్పటికి 3సం॥ అయ్యింది. వాళ్ళు హాయిగా ఉన్నారు. స్వామి మాటను పాటించటం వల్ల మా అమ్మాయి కాపురం ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా హాయిగా నిలిచి ఉన్నది.

సత్యకళగారి అబ్బాయి ఒక అమ్మాయిని ప్రేమించటం వలన ఎమ్.ఎస్. అయిపోగానే పెళ్ళి చేసారు. అతనికి మెడికల్ ప్రాక్టీసు పెద్దగా లేదు కనుక ఆర్థిక ఇబ్బంది వల్ల ఇల్లు గడవడం కష్టంగా ఉండేది. వివాహమైన కొంతకాలానికే వారికి మగ పిల్లవాడు పుట్టాడు. సత్యకళగారి మనుమడి అన్నప్రాసన స్వామి దగ్గర చేసారు. స్వామి కొంత నగదు, ఒక స్టీలుప్లేటు, వెండిగ్లాసు వారి అబ్బాయికి ఇస్తూ "డబ్బులు బీరువాలో పెట్టండి. సంవత్సరానికి ఒకసారి వచ్చి దర్గాల దగ్గర నిద్ర చేయండి నాయనా! మీకు మంచి జరుగుతుంది" అని చెప్పారు. సత్యకళగారి అబ్బాయి స్వామి చెప్పిన విధంగా చేసాడు. సంవత్సరం తిరగకుండానే ప్రాక్టీసు పెరిగి మంచి డాక్టరుగా పేరు పొందాడు. వారి కోడలికి ఉద్యోగం వచ్చింది. వారి అబ్బాయి ఆర్థిక ఇబ్బందులు తీరినాయి.

**మదనపల్లి వాస్తవ్యులు శివప్రసాద్ గారు** స్వామి దగ్గర వారంలో మూడు రోజులు సేవ చేస్తారు. ఆయన అనుభవాలు ఇలా చెపుతున్నారు: స్వామి నాకు మగపిల్లవాడు పుడతాడు అని చెప్పారు. కానీ ప్రసవంలో ఆడబిడ్డ జన్మించింది. దీనికి డాక్టర్లు ఆశ్చర్యపోయి, నా భార్య కడుపుతో వున్నప్పుడు తీసిన రిపోర్టులు మళ్ళీ పరిశీలించిన తరువాత వాటి ప్రకారం మగపిల్లవాడు పుట్టి ఉండాలి అని తేల్చారు. నాకు మగపిల్లాడు పుట్టలేదని బాధ కలిగింది. తరువాత కొన్నాళ్ళకు స్వామి "అరెయ్! మగబిడ్డ పుడితే నీకు ప్రాణగండం రా! అందుకే మార్చాము' అని చెప్పారు. కొన్ని నెలల తరువాత పాపాయి జాతకం చూపెడితే జ్యోతిష్కులు వివరాలు చెప్తూ 'మగపిల్లవాడు కానీ ఇదే సమయానికి పుడితే తండ్రికి ప్రాణగండం వుంది'

అని చెప్పారు. ఈ అమ్మాయి ప్రస్తుతం కెమికల్ ఇంజనీరింగ్ చదువుతోంది. ఇంటర్మీడియెట్ విద్యలో స్టేట్‌ర్యాంకు సాధించింది. ఈమె ప్రస్తావన వచ్చినప్పుడు "నీకు బంగారం లాంటి బిడ్డ పుట్టింది. భయమెందుకు నాయనా!" అని చెప్పేవారు. స్వామి బ్రహ్మరాతని కూడా మార్చగలరు అని నాకు బాగా అర్థం అయ్యింది.

ఒకసారి ఉదయం నేను బయటకు వెళ్ళినప్పుడు ఇంటికి తాళం వేయకుండా వెళ్ళాను. మధ్యాహ్నం ఇంటికి వచ్చినప్పుడు తాళం వేయలేదని గమనించాను. ఇంట్లో ఏ వస్తువూ పోలేదు. తర్వాత స్వామి దగ్గరకి వెళ్ళినప్పుడు "ఏరా! నాలుగు గంటలు మీ ఇంట్లో కావలి కాయాల్సి వచ్చిందిరా" అని చెప్పారు.

2012లో శివప్రసాద్‌గారి ఎడమకన్నుకి చూపు తగ్గినందుకు కాటరాక్ట్ ఆపరేషన్ చేయించుకున్నారు. తర్వాత ఆయనకు కంటి చూపు రాలేదు. ఆపరేషన్ చేసిన డాక్టర్లు ఇన్‌ఫెక్షన్ వచ్చింది అని తెలిపారు. స్వామికి చెపితే "జయం. మరలా ఆపరేషన్ చేయించుకోమని" చెప్పారు. బెంగుళూరు నేత్రదాన్‌లో చూపెడితే వారు చూపు రాదు, మేక కన్ను పెడతాము అన్నారు. కానీ ఆయన అధైర్యపడకుండా డాక్టర్లతో 'మా గురువుగారు చెప్పారు. మీరు ఆపరేషన్ చేయండి' అని చెప్పారు. ఆపరేషన్ అయిన రోజు రాత్రి ఆయనకి కలలో చాలామంది దేవతలు (శివుడు, విష్ణువు మొ॥) కనపడి "మేము కాదు. నీ గురువు దర్గాస్వామి, అమ్మయ్యలు" అని చెప్పారు. తర్వాత రెండురోజులకి శివప్రసాద్‌గారికి చూపు వచ్చింది.

ఒకరోజు రాత్రి స్వామి దగ్గర సేవ చేస్తూన్నప్పుడు "మీ భార్య ఎలా వుంది నాయనా?" అని చాలాసార్లు అడిగారు. నేను 'బావుంది స్వామి' అని చెప్పాను. తెల్లవారిన తర్వాత చూస్తే నా భార్య నుండి చాలా మిస్డ్ కాల్స్ వచ్చాయి. ఫోను చేసి వివరం కనుక్కుంటే ఆ రోజు రాత్రి నా భార్యకి కాళ్ళు పట్టేసి పైకి లేవలేక చాలా ఇబ్బంది పడింది. చివరకి ఎదురుగుండా వున్నవారు తమ దగ్గర వున్న మా ఇంటి తాళంచెవితో ఇంట్లోకి వచ్చి మా ఆవిడకి కాళ్ళు మర్దన చేసారు. కొంతసేపటికి కాళ్ళు స్వాధీనంలోకి వచ్చాయి. నా భార్య పడుకున్నప్పుడు మా ఇంటి తలుపుకు తాళం తప్ప మరే గొళ్ళాలు వేయకుండా వుండటం కొసమెరుపు. ఇదంతా

స్వామి గమనిస్తూ, తమను సేవించేవారి బాగోగులు నిరంతరమూ కనిపెట్టుకుంటారు అని నేను దృఢంగా తెలుసుకున్నాను.

ఒక వ్యక్తి జీవితంలో అతని తల్లిదండ్రులు పోషణ చేసినట్లుగా మరెవ్వరూ చేయలేరు. అయితే పూర్వపుణ్య వశం చేత ఎవరికైనా ఒక సద్గురువు ఆశ్రయం లభిస్తే వారు చేసే లాలన, పోషణ కలిగించే పుష్టి, తుష్టి అనుభవించిన తర్వాత దానికి సమమైన అనుభవం ఇంకొక చోట కలగదని గ్రహించగలుగుతారు. ఒక వ్యక్తికి ఎన్ని సంబంధ బాంధవ్యాలున్నా అన్నీ ఇచ్చిపుచ్చుకునే సంబంధాలే. కానీ గురువుతో సంబంధం ఒక్కటే ఎల్లవేళలా పుచ్చుకునే సంబంధం. గురువుకు ఇచ్చుకోగలిగే వస్తువుకానీ, విషయంకానీ, ఇంకొకటి లేదు. వారికి ఏ అవసరమూ ఉండదు. వారికి సమర్పణ చేసుకోగలిగినది కేవలం మన మనస్సు మాత్రమే. గురువుకు ప్రపంచ సంబంధమైన దేని మీద అపేక్ష ఉండదు. వారికి ఏదైనా అపేక్ష ఉంటే అది కేవలం తమను ఆశ్రయించినవారి శ్రేయస్సు మాత్రమే. అందువలననే సద్గురు సమక్షంలో మనము ఏ భయమూ లేక పూర్ణమైన తృప్తి, శాంతిని అనుభవిస్తాము.

శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయినాథాయ నమః

# దైవం మానుష రూపేణ

## అధ్యాయము - 10

## భక్త చింతామణి

### చెన్నై విల్లివాకంలో నివాసం ఉండే గోవర్ధన్‌గారు

చిన్మయమిషన్ బ్రహ్మచారుల ద్వారా దర్గాస్వామి గురించి తెలుసుకుని, మొదటిసారిగా 2001వ సంవత్సరంలో స్వామి అమ్మయ్య గార్లను ఒక మంగళవారంనాడు దర్శించుకున్నారు.వారు దర్గాకువెళ్ళి దర్శనం చేసుకోగానే శ్రీ స్వామివారు "జన్మ జన్మల అనుబంధం!" అన్నారు. అప్పటి నుండి వారి కుటుంబం యొుక్క బాగోగులు స్వామివారే చూచుకొంటున్నారు. మొదటిసారి వారు స్వామివారి దర్శనానికి వెళ్లినప్పుడు వారికి ఒక మగపిల్లవాడు. శ్రీ స్వామివారు మొదటి దర్శనంలోనే "త్వరలో మీకు కుమార్తె పుడుతుంది" అని ఆశీర్వదించారు. గోవర్ధన్‌గారి భార్య గర్భముతో ఉన్నప్పుడు వారు స్వామి దర్శనానికి క్రమం తప్పకుండా వెళ్లి వస్తుండేవారు. 2004లో స్వామివారు, అమ్మయ్యలు విల్లివాకంలోని మందిర ప్రారంభోత్సవ కార్యక్రమానికి వెళ్ళినప్పుడు వారి ఇంట్లోనే విడిది చేశారు. అదే అమ్మయ్య మద్రాసుకు ఆఖరుసారి వెళ్ళడం. తిరిగి దర్గాకు వెళ్లేటప్పుడు అమ్మయ్య తనచీర ఒకటి గోవర్ధన్‌గారి అమ్మకు ఇచ్చి "జాగ్రత్తగా దాచమని, నేను మళ్ళీ వస్తాను" అని చెప్పారు. అది వారి సుకృతఫలంగా భావిస్తున్నారు. అటు తర్వాత 11 సెప్టెంబరు 2004 న అమ్మయ్య సమాధి చెందారు. అక్కడ నుండి ఆరవ రోజున అనగా 16 సెప్టెంబరు 2004, గురువారం వారికి ఆడపిల్ల పుట్టింది. ఆ అమ్మయ్యగారే వారి ఇంట వెలిసింది అనుకున్నారు.

2003లో దత్తాత్రేయ జయంతినాడు గోవర్ధన్‌గారు ఆశ్రమం నుండి చెన్నైకి బయలుదేరుతుంటే స్వామి ఒక పూలమాల ఇచ్చి "కారుకు కట్టుకుని పోయిరండి" అని అన్నారు. గోవర్ధన్‌గారు కారు బోనెట్‌కి ఆ మాల కడుతూంటే స్వామి పిలిచారు. ఆయన స్వామివైపు తిరిగి చూడగా స్వామి స్థానంలో శ్రీ శిరిడీ సాయి కనపడ్డారు. అలానే కొద్దిసేపు చూస్తూ ఏమీ

మాట్లాడలేకపోయారు. వారు బయలుదేరి మెయిన్‌రోడ్డు మీదకొచ్చాక మాత్రమే గోవర్ధన్‌గారికి "సాయిబాబాకు పాద నమస్కారం చేసుకుంటే బాగుండేది కదా" అని స్ఫురించింది. దర్గాస్వామి, శిరిడీ సాయి ఒకటేనని వారి విశ్వాసం దృఢపడింది.

చెన్నై గోవర్ధన్‌గారి కుటుంబానికి 2003లో కారు ప్రమాదమై కారు తుక్కుతుక్కు అయిపోయినా గోవర్ధన్‌గారి తల్లిగారి కాలుకు చిన్న దెబ్బ తగలటం తప్పించి స్వామిదయ వలన ఎవరికీ ఎటువంటి ప్రమాదం కలగలేదు. స్వామికి విన్నవిస్తే కారును బాగు చేయించమన్నారు. గోవర్ధన్‌గారు ఒక్కమాట మాట్లాడకుండా స్వామి చెప్పినట్లు కారును 5 లక్షలు పెట్టి బాగుచేయించుకుని దానినే మరలా వాడారు. 6 లక్షలు పెట్టి కొన్న కారుకి 5 లక్షలు పెట్టి రిపేరు చేయించాల్సి వస్తే సామాన్యంగా లాభనష్టాలు బేరీజు వేసుకొని రిపేరు చేయించటం కన్నా క్రొత్తకారు కొనుక్కుంటే బాగుంటుందనుకుంటాము. కానీ ఎవర్ని ఎలా రక్షిస్తున్నారో స్వామికే ఎరుక. **ఆ సమయానికిఅర్థం కాకపోయినా స్వామి చెప్పిన మాట ప్రకారం నడుచుకోవటం ఎల్లవేళలా మనకు శ్రేయస్కరం.**

శ్రీ స్వామివారి నోట వెలువడిన వాక్యానికి అర్థం ఎంత సూక్ష్మంగా ఉంటుందో తెలుసుకోవడం సామాన్యులకు సాధ్యంకాదు. గురువు చెప్పిన మాట అర్థం కాకుంటే దాని అర్థం మనకు తెలిసేటట్లు చెప్పమని భగవాన్ శ్రీ శ్రీ శ్రీ వెంకయ్యస్వామి సేవకుడైన రోశిరెడ్డివలె **"ఓ ప్రభూ! నీ మాట యొక్క నిజమైన అర్థం తెలుసుకొని నీకు ప్రీతికరంగా నేను ఆచరించలేను. తమరే నాలో ప్రేరణపెట్టి మీకు ప్రీతికలిగేటట్లు నేను మీ మాటను ఆచరించేటట్లు చేయండి"** అని హృదయ పూర్వకంగా ప్రార్థించాలి.

చెన్నైలో మందిర నిర్మాణం జరగకముందు, ప్రతి గురువారం ఇంట్లో స్వామి అభయహస్తంతో ఉన్న పెద్ద ఫోటోకి గోవర్ధన్‌గారు ఆరతి ఇచ్చేవారు. 2003లో పెద్ద యాక్సిడెంటు అయ్యి, మనస్సు కలత చెంది, బాధగా వుండేది. అలవాటు ప్రకారం ఒకరోజు ఆరతి ఇస్తున్నప్పుడు, స్వామి ప్రత్యక్షంగా ఆయనకు తమ అభయహస్తంతో ఆశీర్వదించటం ఆయన

భార్య చూచింది. ఆయన ఆరతి చేయటంలో నిమగ్నమై వుండటం వల్ల ఇది గమనించలేదు. తరువాత ఆ విషయం తెలుసుకుని చాలా ఆనందపడ్డారు. అంతేకాక ఆయన మనస్సులోని బాధ మాయమైపోయింది. చాలాసార్లు ఆయన వెనుకనే స్వామి ఉన్నట్లు ఆయన భార్య గాయత్రిగారికి స్వామి దర్శనం ఇచ్చారు.

గోవర్థన్‌గారు చాలా సంవత్సరాలు దర్గాల దగ్గర వారానికి 3 రోజులు సేవ చేసి ఇంటికి బయలుదేరేవారు. 2006 జూన్ 6 నాటికి చెన్నై శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయి జ్ఞాన మందిరానికి మొదటి వార్షికము పూర్తి కానున్నది. దీనికి వారం ముందర ఆయనను ఉద్యోగం నుండి అకారణంగా తొలగించారు. జూన్ 4, 2006న శ్రీ దర్గాస్వామివారి వద్దకు వెళ్ళారు. స్వామిని 6వ తేదీన జరుగనున్న మొదటి సంవత్సర వార్షికోత్సవానికి చెన్నైకి వెంట తీసుకెళ్ళాల్సి వుంది. ఆయన ఈ సందర్భంగా స్వామికి ఉద్యోగ విషయం వివరించారు. దానికి శ్రీ స్వామి "ఇది నాకు పరీక్ష కానీ నీకు కాదు" అని 5వ తేదీన చెన్నై విచ్చేసి 5,6,7 తేదీల వరకు ఉండి వార్షికోత్సవం జరిపించి, ఆ బాబాతో మొరపెట్టి మళ్ళా వారం తిరగకుండానే వేరొక మంచి కంపెనీలో స్థిరమైన ఉద్యోగం ఇప్పించారు. 2006 జూన్ 19వ తేదీన ఆశ్రమంలో ఉన్న గోవర్థన్‌గారు ఉదయం ఆరతికి శ్రీ స్వామి వెనుకాలే మందిరానికి వెళ్ళారు. స్వామి ఆయనతో "గురువు నడిచిన దోవలో నడిచావు. నీకు అన్నింటా జయం అవుతుంది" అని రెండు హస్తములతో ఆశీర్వాదం చేసారు. నాటి నుండి ఇప్పటికీ ఆయనకు తోడు నీడగా వుండి సమర్థ సద్గురు శ్రీ దర్గాస్వామివారు నడిపిస్తున్నారు.

2002లో స్వామి చెన్నై వచ్చినప్పుడు **శ్రీకాంత్‌గారింటికి** అమ్మయ్యతో కలిసి వెళ్ళారు. స్వామి, అమ్మయ్యలను కూర్చోపెట్టి నమస్కారం చేసుకుంటే స్వామి "అదిగో మా గురువుగారు మీయింటికి వచ్చారు" అని చెప్పి మమ్మల్ని ఆశీర్వదించారు.

ఆ సందర్భంగా శ్రీకాంత్‌గారు తమ పూర్వీకుల ఇల్లు అమ్మటానికి స్వామి అనుమతి అడిగారు. స్వామి "మీ ముగ్గురు అన్నదమ్ములు అమ్ముదామనుకుంటున్నామని ఒక పేపరులో వ్రాసి, సంతకాలు చేసి,

ఆ కాగితాన్ని మీ తల్లిదండ్రుల ఫోటోల దగ్గర పెట్టి దీపారాధన చేసి ప్రార్థించండి" అన్నారు. వారు స్వామి చెప్పిన విధంగా చేసారు. మర్నాడు ఉదయం 10 గంటలకి ఒకతను వచ్చి, ఇల్లు కొంటానని అడ్వాన్సు ఇచ్చి వెళ్ళాడు. అనతికాలంలోనే ఇల్లు అమ్మివేసారు. ఇంత క్లిష్టమైన విషయాన్ని తేలికగా పరిష్కరించినందుకు, స్వామికృపకు కృతజ్ఞతగా కొంత పైకాన్ని విల్లివాకంలో నిర్మిస్తున్న దర్బారు సాయి మందిరానికి దక్షిణగా సమర్పించుకున్నారు. ఈ కాలంలో ఇల్లు అమ్మాలంటే ఎంతో క్లిష్టమైన విషయం. వారు స్వామికృప వలన కష్టపడకుండా, సులువుగా ఇల్లు అమ్మివేయగలిగారు.

శ్రీకాంత్ దంపతులకు మొదటి సంతానంగా ఆడపిల్ల పుట్టింది. వారి వంశంలో అందరూ ఆడబిడ్డలే పుడుతున్నారని తర్వాత బిడ్డకోసం వారు ప్రయత్నం చేయలేదు. వారేమీ చెప్పకుండానే ఒకరోజు స్వామివారు వారిని పిలిచి, తీర్థంలో ఊది కలిపి యిచ్చి దంపతులిద్దరినీ త్రాగమన్నారు. 10 నెలల తర్వాత వారికి ఒక మగ పిల్లవాడు జన్మించాడు.

శ్రీకాంత్‌గారు స్వామి, అమ్మయ్యగార్లు చెప్పినట్లు విల్లివాకం దర్బారు సాయిమందిరంలో సాయిబాబాకు ఆరతులు, అభిషేకాలు చేసుకుంటున్నారు. స్వామి ఆదేశించినట్లు భగవద్గీతలో 15వ అధ్యాయమైన పురుషోత్తమప్రాప్తి యోగాన్ని దర్గాలకి వెళ్ళినప్పుడు పారాయణ చేయటం మొదలుపెట్టినారు. కాలాంతరంలో అది ఆయనకు నిత్య పారాయణ అయ్యింది. భగవద్గీతలో 15వ అధ్యాయాన్ని నిత్యం పారాయణ చేయటం వల్ల కుటుంబంలో కూటికి, గుడ్డకి లోటు ఉండదని స్వామి చెప్పేవారు. అమ్మయ్య, స్వామీజీల దయవలన వారి జీవితాలు ఏ ఇబ్బందీ లేకుండా సాఫీగా, సార్థకంగా కొనసాగుతున్నాయి.

2004 సం॥ శ్రీకాంత్‌కు సయాటిక్ నొప్పి తీవ్రంగా వచ్చి, నిలబడటానికి కూడా కష్టపడాల్సి వచ్చింది. చెన్నైలోని డాక్టర్లకు చూపెడితే ఆపరేషన్ చేయాలని చెప్పారు. అలాంటి పరిస్థితిలో దర్గాల దగ్గర ఉరుసు ఉత్సవానికి వెళ్ళారు. శ్రీకాంత్ స్వామికి తన నొప్పి గురించి చెప్పుకోలేదు. ఉరుసు రోజు రాత్రి 2గం॥లకు దర్గాల దగ్గర నుండి స్వామి వస్తూ శ్రీకాంత్‌ను చూసి "అరెయ్ శ్రీకాంత్ ఇలా రారా!" అని పిలిచారు. దర్గాలో

సిద్ధపురుషులకు సమర్పించిన గంధాన్ని అతని తొడ నుండి పాదం వరకు మూడుసార్లు రాసి చేతిని రెండుసార్లు నేలకేసి కొట్టినట్లు చేయి విదిలించారు. ఆ రోజు రాత్రి నిద్రపోయి తెల్లవారి లేచేసరికి నొప్పిలేదు. శ్రీకాంత్‌కు ఇంక నొప్పిరాదని, ఆ వ్యాధి స్వామి తొలగించారని నమ్మి అతను తీసుకువెళ్ళిన మందులన్నీ దర్గా దగ్గరున్న బావిలో పడేశారు. తరువాత మరెప్పుడూ ఆ నొప్పి రాలేదు. అచంచల విశ్వాసంతో ఆ సద్గురువును సేవించి ఆయన కృపకు పాత్రుడనయ్యేటట్లు చేయమని శ్రీకాంత్ స్వామిని ప్రార్థిస్తున్నాడు.

**హైదరాబాదు నుండి రాజీవ్** అను స్వామి భక్తుడు 1995 సం॥ నుండి దర్గాస్వామిని దర్శిస్తున్నాడు. అతనికి చాలా సంవత్సరాలుగా గురక వల్ల సరిగ్గా నిద్ర పట్టేది కాదు. అందువలన ఇతర ఆరోగ్య సమస్యలు వచ్చాయి. ఈ సమస్య పరిష్కారం కోసం ఎన్నో ప్రయత్నాలు చేసాడు కానీ సరైన పరిష్కారం దొరకలేదు. ఎంతో ఇబ్బందిగా ఉన్నా ఇలాంటి చిన్న సమస్యను స్వామి దృష్టికి తీసుకు వెళ్ళటం ఇష్టపడలేదు. 2011 జులై 21న జరిగిన స్వామి 80వ జన్మదిన వేడుకలకి వెళ్ళాడు. తర్వాత 23 జులై (శనివారం) సాయంత్రం కడప నుండి ఒక గుజరాతీ ఆవిడ స్వామితో మాట్లాడటానికి వచ్చింది. ఆమె హిందీలో మాట్లాడుతోంది. స్వామి ప్రక్కన వున్న అతనితో "ఆమె ఏమి అడుగుతోందో నాకు చెప్పు" అన్నారు. ఇంతకు ముందెప్పుడూ స్వామి ఆయనను అలా అడగలేదు. పైగా స్వామి హిందీ బాగానే మాట్లాడతారు. ఆమె వాళ్ళ ఆస్తుల గురించి, పిల్లల పెళ్ళిళ్ల గురించి అడిగి చివర్లో 'నాకు అసలు నిద్ర పట్టట్లేదు స్వామీ!' అని ఆమె విన్నవించింది. దానికి స్వామి "మీ కుటుంబంలో ఏ గురువుని తలుస్తారు?" అని అడిగారు. ఆమె 'ముక్తానందగారిని, మిమ్మల్ని, అమ్మవారిని పూజిస్తాము' అని చెప్పింది. వెంటనే స్వామి "అమ్మా! నీవు పడుకునే ముందర మీ గురువుగారిని తలచుకుని పడుకో!!" అని చెప్పారు. తర్వాత ఆమె వెళ్ళిపోయింది. ఇది విన్న రాజీవ్‌కు స్వామి చెప్పింది అతనికి కూడా వర్తిస్తుందని, స్వామిని స్మరించి పడుకుంటే హాయిగా నిద్ర పడుతుందని గ్రహింపు కలిగింది. తర్వాతికాలంలో పడుకునే ముందర స్వామిని స్మరణ చేసుకుని పడుకోవటం వలన అతనికి హాయిగా నిద్ర పడుతోంది.

కరుణామయుడు, కృపాళుడు అయిన సద్గురువు అతని సంకోచాన్ని గ్రహించి పరోక్షంగా అతని సమస్యకు పరిష్కారం చూపించారు. పైగా స్వామి అతని చేత ఆమె హిందీలో చెప్పేది తర్జుమా చేసి చెప్పమనటం వల్ల అతను జాగ్రత్తగా వారిద్దరి మధ్య సంభాషణ వినేటట్లు చేయటమే కాక స్వామి చెప్పింది అతని సమస్యకు పరిష్కారం అని గుర్తించేటట్లు చేసారు.

హైదరాబాద్ రాజీవ్‌కు 2010లో అష్టమశని సంచారం జరుగుతున్నది. సాధారణంగా ఒక వ్యక్తి జీవితంలో అష్టమశని సంచారం జరుగుతున్న సమయం కఠినమైన పరీక్షా సమయం. ఆయనకు కుటుంబపరంగా కొంత చీకాకుగా ఉండి మనస్సులో బాధగా ఉండేది. ఆ రోజులలో స్వామి అమ్మయ్య సమాధి ముందర దర్బార్ చేసేవారు. ఒకరోజు ఉదయం 11గం॥ 30 నిమిషాలకల్లా వచ్చిన వారందరూ స్వామిని ప్రశ్న అడిగి వెళ్ళిపోయినారు. రాజీవ్ మౌనంగా స్వామికి కొంత దూరంలో కూర్చొని ఉన్నాడు. స్వామి అతని వంక తిరిగి చూచి "ఏ నాయనా! మెత్తగా వున్నావు?" అన్నారు. రాజీవ్ కళ్ళ నీళ్ళు ఆగలేదు. తర్వాత అతనికి మనస్సు చాలా తేలిక పడినట్లు అనిపించింది.

హైదరాబాద్ రాజీవ్ నాన్నగారి పేరు తాడేపల్లి శ్రీమన్నారాయణగారు. వీరిది సదాచార బ్రాహ్మణ కుటుంబం. 19 సం॥ల వయస్సులో రాజీవ్ కడప కందుల శ్రీనివాసారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో చదువుకుంటున్నప్పుడు మొదటిసారి స్వామి దర్శనం చేసుకున్నాడు. ఒక సంవత్సర కాలం వచ్చి వెళ్ళిన తర్వాత స్వామి వలన చాలా ప్రభావితుడై, ఆయనను గురువు క్రింద భావించి సమర్పణ చేసినాడు. ఈ విషయం తెలిసి అతని నాన్నగారు ఆందోళన పడ్డారు. బంధువులతో చర్చిస్తే వారు 'నీ కొడుకు చేజారిపోయినాడు. సాయిబుల సమాధుల దగ్గరకి వెళ్ళటమేమిటి?" అన్నారు. అతని నాన్నగారు పరిస్థితిని అర్థం చేసుకోవటానికి స్వయంగా ఆశ్రమానికి వచ్చారు. స్వామిని 'వీడేమైనా పనికొస్తాడా?' అని అడిగారు. స్వామి "నాయనా! మా కన్న బిడ్డలవలే కడుపులో పెట్టుకుని సాక్కుంటాము. నీకే భయమూ అక్కరలేదు" అని ధైర్యం చెప్పారు. ఈ సంఘటన తర్వాత 20 సం॥లు

గడిచిపోయినాయి. స్వామి ఆశ్రయంలో అతని జీవితం ఏ కొరతా లేకుండా సాగింది. మంచి ఉద్యోగం, తృప్తికరమైన సంపాదన, వివాహం, సంతానం మరియు ఏ ఇతర విషయంలోనూ లోటు లేకుండా స్వామి నడిపినారు.

ఇంకొక సందర్భంలో స్వామి రాజీవ్ నాన్నగారికి "ఈషణ త్రయము విడిచిపెట్టాలి, నాయనా!" అని చెప్పారు. ఈ మాట చెప్పిననాటికి వారికి ఈషణ త్రయము అంటే ఏమిటో తెలియదు. తరువాత విచారించగా, ధనేషణ, దారేషణ, పుత్రేషణ అనేవి ఈషణ త్రయము అని తెలిసింది. ఈ విషయం ఆయన మనస్సులో కొంత బలంగా నాటుకుంది. ఈ సంఘటన తర్వాత సంవత్సరాలలో ఆయన వ్యక్తిత్వంలో చాలా మార్పు వచ్చింది. ఈ సందర్భంలోనే స్వామి "నాయనా! నీకు జరిగిన జీవితం కన్నా జరగబోయే జీవితం సంతోషంగా, ఉజ్జ్వలంగా ఉంటుంది" అని చెప్పారు. రిటైర్ అయిన తర్వాత శ్రీమన్నారాయాణమూర్తిగారు హైదరాబాద్‌లో పిల్లలిని, ఇంటిని వదిలి వారణాసిలో వానప్రస్థాశ్రమంలో ఉండి దైవచింతనలో కాలం గడిపారు.

**భానుమూర్తిగారని** హైదరాబాద్‌లో మంచి నైపుణ్యం గల సాఫ్ట్‌వేర్ ఇంజనీరు వుండేవారు. ఆయన పనిచేసే కంపెనీవారు ఈయన ప్రతిభను గుర్తించి 4,5 సార్లు అమెరికాకి పంపించటానికి ప్రయత్నించినారు. ప్రతిసారీ ఏదో అనివార్య కారణాల వల్ల ఈయన వీసా తిరస్కరించేవారు. ఈయన 2000 సం॥నుండి స్వామి దర్శనం చేసుకుంటున్నారు. ఈ సందర్భంలో ఒకసారి అమెరికా వీసా ఇంటర్వ్యూకి వెళ్ళేముందర స్వామి ఆశీర్వాదం కొరకు వెళ్ళారు. అమ్మయ్య భోజనం చేసి వెళ్ళమన్నారు. ఇంతలో వేరే భక్తులు భోజనం చేస్తూ మంచినీళ్ళు అడుగగా ఇవ్వడానికి వెళ్ళినప్పుడు వారు తెచ్చుకున్న భోజనం కొంత ఆయనకు పెట్టారు. తర్వాత ఆతను తిన్నది స్వామి గ్రహించి "నీకు అమెరికా లేదు" అని కోప్పడి తరిమినారు. అతనికి స్వామి చెప్పిన విధంగా వీసా రాలేదు. ఇది జరిగిన చాలా సంవత్సరాలకుగానీ ఆయన అమెరికాకు వెళ్ళలేకపోయారు. అదే విధంగా ఈ సంఘటన జరిగిన చాలా సంవత్సరాల తర్వాత స్వామి

ఒక సందర్భంలో ఈ విధంగా చెప్పినారు "భానుమూర్తికి అన్నం పెట్టిన వారి బిడ్డ అమెరికాకు వెళ్ళి అక్కడ స్థిరపడినాడు". తరువాత స్వామి, అమ్మయ్యలు అతనిని దగ్గరకు చేర్చుకుని బెంగుళూరులో ఉద్యోగమిప్పించారు, వివాహం కూడా చేయించినారు. వీసా కోసమని వెళ్ళి అది రాకపోయినా, స్వామి, అమ్మయ్యల భౌతిక దర్శనం తరచుగా చేసుకుంటూ, ఇండియాలో మంచి ఉద్యోగం చేస్తూ, తృప్తిగా ఉన్నాడు. అతనికి అమెరికా ఛాన్సు పోయిందని ఎప్పుడూ బాధపడలేదు. అది తప్పిపోయినా తరచూ స్వామిని దర్శించి సేవించే అవకాశం కలిగినందుకు సంతోషంగా ఉన్నాడు. ఈ పైన సంఘటన చూస్తే స్వామి భానుమూర్తిని, ఆయనకు భోజనం పెట్టినవారిని ఇద్దరినీ సమదృష్టితో అనుగ్రహించినారు.

కాలాంతరంలో స్వామి అనుగ్రహం వలన అతనికి వివాహం 2005లో జరిగింది. ఒకసారి ఆయన భార్య అనుపమతో కలసి వెళ్ళినప్పుడు బిడ్డలు కావాలని స్వామిని కోరారు. స్వామి దస్తగిరి వృక్షానికి పాలుపోయమని చెప్పారు. అలా చేసిన తర్వాత వారికి ఆడబిడ్డ పుట్టింది. కానీ పుట్టినప్పటినుండి ఆరోగ్యం సరిగా లేదు. స్వామి, అమ్మయ్యలు వారిని దర్బారు నగరానికి రప్పించుకొని వారి పాపకి ఆరోగ్యం, మాటలు ప్రసాదించారు. ఈ పాపని తరువాతి కాలంలో స్వామి వాత్సల్యంతో కనిపెట్టుకుని, ఆశీర్వదించటం వలన ఆరోగ్యంలో ఎంతో మార్పు వచ్చింది.

భానుమూర్తిగారి భార్య రెండవసారి గర్భవతిగా వున్నప్పుడు, స్వామికి ఫోను చేసి మాట్లాడారు. స్వామి "ఏమ్మా! బాబు ఆడుకుంటున్నాడా?" అని అడిగారు. వారు తమ మొదటి సంతానం పాపను సూచిస్తూ స్వామి "ఆడుకుంటున్నదా?" అని అడగబోయి "బాబు ఆడుకుంటున్నాడా?" అని అడిగారని భ్రమపడ్డారు. నెలలు నిండిన తర్వాత వారికి ఒక మగపిల్లవాడు పుట్టాడు. అప్పుడు వారికి స్వామి గర్భంలో ఉన్న పిల్లవాడిని సూచిస్తూ అడిగారనే గ్రహింపు కలిగింది. భానుమూర్తిగారి కుటుంబంలో ఆరుగురు అన్నదమ్ములు. వీరిలో ఒకతననిని దత్తు ఇచ్చినారు. ఈయన ఆఖరివాడు. ఈ

అయిదుగురు (దత్తు వెళ్ళినతను కాకుండా) అన్నదమ్ములలో భానుమూర్తుగారికి పుట్టిన కొడుకే ఏకైక వంశాంకురం.

హైదరాబాద్ భానుమూర్తిగారి భార్య అనుపమ. వీరికి ఇద్దరు పిల్లలు- ఒక పాప, ఒక బాబు. పాప ఆరోగ్యం కొంత సమస్యగా వుండేది. ప్రతిరోజూ ఇంటి పనులు, అమ్మాయి ఆరోగ్యంతో పాటు విద్యాభ్యాసం చూసుకోవటానికి కొంత ఒత్తిడిగా వుండేది అనుపమగారికి. ఈ విషయమై స్వామికి విపులంగా చెప్పుకుంటే కొంత స్వాంతన లభిస్తుందనే భావన ఆమెకు వుండేది. అయితే, సాధారణంగా స్వామి స్త్రీలను దగ్గరకు రానివ్వరు. ఎవరికైనా, ఏదైనా సమస్య ఉంటే ప్రశ్న చెప్పేటప్పుడు వచ్చి మాట్లాడవచ్చు కానీ ఇతర సమయాలలో మాట్లాడే అవకాశం తక్కువ. దూరప్రాంతాల నుండి వచ్చి ఒకటి, రెండు రాత్రులు నిద్ర చేసే భక్తులు ఆశ్రమానికి వచ్చాక మొదటి దర్శనంలో స్వామి చాలా ప్రేమగా మాట్లాడేవారు. కుటుంబంలో ప్రతివారిని పేరుపేరునా కుశలం అడిగేవారు. అట్లాగే తిరుగు ప్రయాణానికి అనుమతి తీసుకుని వెళ్ళేటప్పుడు ఒకటి లేక రెండు మాటలు మాట్లాడేదానికి అవకాశం ఉండేది. ఈ విధంగా ఒకసారి స్వామి దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణానికై స్వామి అనుమతి తీసుకోవటానికి వెళ్ళారు. అనుపమగారి మనస్సు కొంత ఉద్వేగంగా వున్నది. స్వామి చిన్నగా "అమ్మా అనుపమా! టిఫెన్‌బాక్సులో అన్నం కట్టుకున్నావా?" అని అడిగారు. ఈ చిన్ని పలకరింపుతో అనుపమగారి మనస్సులోని భారమంతా తీసేసినట్లు అనుభవమైంది.

**మునగా బాలసుబ్రహ్మణ్యంగారు** పనిచేస్తున్న లక్కిరెడ్డిపల్లె టి.వి. స్టేషన్‌లో ఒకసారి టి.వి. రిలే యంత్రం చెడిపోయింది. టి.వి. కార్యక్రమాలకు అంతరాయం కలుగకుండా వుండాలని రిపేరు చేయడానికి చాలా ప్రయత్నించారు. అయినా అది పనిచేయలేదు. ఆశ్రమంలోని దర్బార్ సాయిమందిరంలో మధ్యాహ్న హారతికి వెళ్ళారు. హారతి అయినాక తిరిగి ఆఫీసుకి వెళ్ళి మరలా పరీక్షించి చూడగా యంత్రం మాములుగానే పని చేసింది. ఇది స్వామివారి కృప వలన మాత్రమే జరిగిందని వారి విశ్వాసం.

మునగా బాలసుబ్రహ్మణ్యంగారు కొంతకాలం ఒక విధమైన చర్మవ్యాధితో బాధపడ్డారు. వారు వైద్యం చేయించుకున్నా లాభం లేకపోయింది. ఆ విషయం స్వామివారికి విన్నవించుకోగా "అదేమి లేదులే నాయనా! ఊదీ తీసుకో తగ్గిపోతుంది" అన్నారు. అలాగే విభూది తీసుకున్నారు. జబ్బు తగ్గిపోయింది.

1999వ సం॥లో ఆయన శ్రీమతిని మెడికల్ పి.జి. కౌన్సిలింగ్ కొరకు విజయవాడ తీసుకు వెళ్ళారు. తిరుగు ప్రయాణం బస్సులో రాత్రి 10గం॥లకు ఆయనకు కడుపునొప్పి ప్రారంభమైంది. ఒంటి గంట నుండి వాంతులు కూడా మొదలైనాయి. ప్రయాణం చేయలేక కావలిలో బస్సు దిగి దగ్గరలో వున్న నర్సింగ్ హెూమ్‌కి వెళ్ళారు. అక్కడ డాక్టర్లు పరీక్ష చేసి కిడ్నీలో రాళ్ళు వున్నాయని తేల్చారు. మరుసటి దినం వారే టిఫిన్, భోజనము ఏర్పాటు చేసి దగ్గరుండి రైలు ఎక్కించి ఇంటికి పంపినారు. కొన్ని రోజుల తర్వాత స్వామి దర్శనానికి ఆశ్రమానికి వెళ్ళారు. లోపలికి అడుగు పెట్టగానే స్వామివారు "అమ్మయ్యా! ఇదిగో రాత్రంతా యుద్ధం చేసిన వీరుడు వచ్చాడు" అన్నారు. ఆయనకు నోట మాట రాలేదు. కొద్దిసేపు ఆగి ఏదో చెప్పబోయారు. స్వామివారు వెంటనే అడ్డు తగిలి "నాకంతా తెలుసులే" అన్నారు. అక్కడే వున్న శంకరయ్యగారు ఆయనతో 'ఆ రాత్రి అంతా స్వామివారు పొత్తి కడుపు నొప్పితో బాధ పడ్డారు, ఎవరిదో తెలియదు' అని అన్నారు. తర్వాత ఆయనతో "ఏమీ ఫర్వాలేదు, ఆపరేషన్ ఏమీ చేయనక్కరలేదు. ఏదో ఆపద వచ్చింది, అది పోయింది" అని స్వామి అభయమిచ్చారు. అయినా కూడా ఆయనకు మనస్సులో కొంత ఆందోళన తగ్గలేదు. ఒకరోజు రాత్రి స్వామి మూత్ర విసర్జన చేస్తున్నారు. ఆయన మనస్సులో స్వామి మూత్రం అమృతంతో సమానం కదా! అని అనుకున్నారు. తర్వాత రోజు ఆయన మూత్రవిసర్జన చేసినప్పుడు మూత్రంతో పాటు రాళ్ళు బయటకి వచ్చాయి. సుబ్రహ్మణ్యంగారు కొద్దిరోజుల తర్వాత తిరిగి పరీక్ష చేయించుకుంటే డాక్టర్లు అంతా బాగుంది, ఆపరేషన్ అవసరం లేదు అని చెప్పారు.

**గుంటూరు నుండి భరద్వాజ** అనే యువకుడు మొదటిసారి 2001లో స్వామిని దర్శించాడు. భరద్వాజకి చిన్మయామిషన్ స్వామీజీల

సాంగత్యం ద్వారా స్వామి దర్శనం కలిగింది. మొదటి దర్శనం చేసిన రోజు రాత్రి ఆశ్రమంలో నిద్ర చేసినాడు. ఇతను ఆధ్యాత్మిక జిజ్ఞాసతో స్వామిని దర్శించాడు. తర్వాతి కాలంలో అతని తల్లిదండ్రులు నాగేశ్వరరావు, కనకదుర్గాంబగార్లు, అన్న నరసింహారావు, చెల్లెలు లక్ష్మి స్వామి గురించి తెలుసుకుని భక్తులైనారు. వీరు బ్రాహ్మణులు. నరసింహారావు స్వీడన్‌లో చదువుకుని, గత కొన్ని సంవత్సరాలుగా స్వీడన్‌కు ప్రక్కదేశమైన డెన్మార్క్‌లో ప్రస్తుతం నివసిస్తూ ఉద్యోగం చేస్తున్నాడు. స్వామికృప వలన అతనికి డెన్మార్క్‌లో స్థిరనివాస పర్మిట్ కూడా ఇచ్చారు. ఇతని విద్యాభ్యాసం మొదలుకుని ఉద్యోగం మరియు వివాహము అన్ని విషయాలలో స్వామికి విన్నవించుకుని ఆయన చెప్పినట్లు నడుచుకోవడం వల్ల ఎంతో మేలు పొందారు. భరద్వాజ విషయంలో కూడా అతని విద్యాభ్యాసం, తర్వాత ఉద్యోగ విషయంలో కూడా అతను స్వామి మాటననుసరించి నడుచుకున్నందు వల్ల పనులన్నీ అనుకూలమైనాయి. ప్రస్తుతం కొద్ది సంవత్సరాలుగా బహ్రెయిన్‌లో పనిచేస్తున్నారు.

ఒక పర్యాయం భరద్వాజ ఆశ్రమానికి వెళ్ళినప్పుడు పిఠాపురం శ్రీ పాద శ్రీ వల్లభస్వామి సంస్థానం నుండి చాలామంది భక్తులు వచ్చి స్వామి వద్ద రద్దీగా ఉండినది. ఇది గమనించి స్వామితో మాట్లాడటం కుదరదేమోనని కొంత నిరుత్సాహంతో ఒక మూల ప్రార్థనాపూర్వకంగా, మౌనంగా కూర్చున్నాడు. అతను కూర్చున్న ప్రదేశం స్వామికి కనపడటం కష్టం. ఆశ్చర్యంగా ఒక అయిదు నిమిషాల తర్వాత స్వామి ప్రక్కనే ఉన్న గోవర్ధన్‌తో "చూడు ఎవరు వచ్చారో! భరద్వాజ. వాడిని దగ్గరికి రమ్మను" అని చెప్పారు. ఈ అకస్మాత్ పరిణామంతో, స్వామివారి అవ్యాజమైన కరుణ చూసి భరద్వాజకు మాట పెగలక కన్నీటి పర్యంతం అయ్యాడు. ఈ సంఘటన భరద్వాజకు స్వామివారు తమ భక్తుల హృదయాంతర్వర్తియై ఉంటారనే విశ్వాసాన్ని దృఢపరిచింది.

భరద్వాజ చెల్లెలు లక్ష్మి వివాహానికి స్వామివారు మార్గదర్శనం చేసారు. వారు స్వామి వాక్యానుసారం నడుచుకున్నారు. దీనివల్ల ఆమెకు మంచి భర్త దొరికి సంతోషంగా కాపురం చేసుకుంటున్నది. వారికి ఒక పిల్లవాడు పుట్టాడు. అతడికి 'స్వామి దత్తచంద్ర వేదాంత్' అని పేరు పెట్టుకున్నారు.

కొంతకాలం తర్వాత ఆమె స్వామిని గడుసుగా 'స్వామీ! రంగనాయకమ్మ కావాలి' అని అడిగింది. ఆమె ఉద్దేశ్యంలో ఒక అమ్మాయి కావాలని అలా ప్రార్థించింది. ఆమె అడిగిన దానిని విని స్వామి చాలా సంతోషించారు. తర్వాతి కాలంలో ఆమెకి ఒక ఆడబిడ్డ జన్మించగా 'రంగనాయకి కైవల్య' అని అమ్మయ్య పేరు పెట్టుకున్నారు.

భరద్వాజకు వెన్నులో పూసల తేడా వల్ల వెన్నునొప్పిగా ఉంటుంది. ఈ విషయంలో అతను డాక్టర్ల సలహా మేరకు వైద్యం చేయించుకుంటున్నాడు. ఒక పర్యాయం స్వామి దర్శనం చేసుకున్నప్పుడు భరద్వాజ అడగకముందే, స్వామి అతని సమస్యను వైద్య పరీక్షా రిపోర్టులలో చెప్పినట్టు వివరించారు. అతనికి ఈ సమస్యనుండి బయటపడటానికి సుబ్రహ్మణ్యస్వామి మంత్రాన్ని ఉపదేశించి రోజూ చేసుకోమని చెప్పారు. అతను బహ్రెయిన్ తిరిగి వెళ్ళాక స్వామి చెప్పిన మంత్రాన్ని సరిగ్గా విని, జ్ఞాపకం పెట్టుకుని, చేస్తున్నానో లేదో? అని సంకోచపడ్డాడు. రెండు రోజుల తర్వాత సూర్యోదయ వేళలో స్వామి అతనికి స్వప్నదర్శనమిచ్చి మంత్రాన్ని మరలా ఉపదేశించారు. వీరి కుటుంబం స్వామివారి చరణాల వద్దకు చేరిన తర్వాత వారి పరిరక్షణలో ఏ సమస్యలూ లేక తృప్తిగా జీవనం చేస్తున్నారు.

**బెంగుళూరు నుండి సుధాకర్‌గారు** పంచుకున్న అనుభవాలు:

ఒకసారి మా నాన్నగారికి బాగోకపోతే ఆస్పత్రిలో చేర్చాము. చాలా డబ్బు ఖర్చు అయినా కూడా ఆరోగ్యం మెరుగు కాలేదు. ఫోను చేసి స్వామికి చెప్తే "ఫలానా రోజుకి తగ్గిపోతుంది" అని చెప్పారు. స్వామి చెప్పిన విధంగా మా నాన్నగారికి ఆరోగ్యం మెరుగుపడి ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ అయ్యారు.

స్వామి ఒకసారి చాలా నీరసంగా వున్నారు. భక్తులతో స్వామి ఏమీ మాట్లాడట్లేదు. అందరూ స్వామి దర్శనం చేసుకుని వెళుతున్నారు. నేను కూడా వెళ్ళబోతుంటే స్వామి నాతో "ఉద్యోగం చేసే కంపెనీ మారాలనుకుంటున్నావు, మారకు" అని చెప్పారు. అలానే నేను నా నిర్ణయం మార్చుకుని స్వామి చెప్పినట్లు అదే కంపెనీలోనే వున్నాను. స్వామి సూచన చాలాఉపయోగకరమైనది! స్వామికృప వలన నేను

25 పేటెంట్లు ఫైల్ చేసాను. అంతేగాకుండా వీటివలన చాలా గుర్తింపు, ఆదాయం కలిగింది. ఒకసారి నేను ఉద్యోగరీత్యా చెక్ రిపబ్లిక్ దేశంలో వున్నప్పుడు మా నాన్నతో స్వామి ఆశీస్సులు కావాలని కోరాను. మా నాన్నగారు స్వామికి చెపితే స్వామి "నా ఆశీస్సులు ఎప్పుడూ వుంటాయి" అని అన్నారు. నేను రెండుసార్లు నా పాస్‌పోర్టు ఎక్కడో పెట్టి మరిచిపోయాను. స్వామి దయవల్ల మాత్రమే నా పాస్‌పోర్టు దొరికింది.

నాకు 3 పెండ్లిసంబంధాలు వస్తే స్వామి దగ్గరకి వెళ్ళి చెప్పాము. స్వామి ఒక సంబంధం ఖాయం చేస్తూ "ఈ సంబంధం బాగుంటుంది. నాదీ పూచీ! వచ్చే సంవత్సరంకల్లా బిడ్డ పుడుతుంది" అని చెప్పారు. అలానే జరిగింది. పెళ్ళి అయిన కొన్నాళ్ళకు కొన్ని ఇబ్బందులు వస్తే స్వామి నన్ను దగ్గర కూర్చోపెట్టుకుని అంతా విని నేను ఏమీ చేయాలో చెప్పారు. తర్వాత పరిస్థితులు అన్నీ మారిపోయాయి. పెళ్ళిళ్ళ విషయమై గొలగమూడి శ్రీ పెసల సుబ్బరామయ్యగారు చెప్పిన మాట కూడా మన అందరికీ బాగా ఉపయోగపడుతుంది "**స్వామి ఇష్టం ప్రకారం మనం పెళ్ళి చేసుకుంటే, పెళ్ళి అయిన తర్వాత ఏమైనా ఇబ్బందులు వచ్చినా స్వామిదే బాధ్యత**".

2015సం॥లో నా భార్యకి అనారోగ్యం చేసింది. ఆస్పత్రిలో చేర్పించగానే డాక్టర్లు చాలా పరీక్షలు చేసారు కానీ రోగాన్ని తెలుసుకోలేకపోయారు. స్వామికి ఫోను చేస్తే "వేడి చేసింది. మెంతి మజ్జిగను తీసుకోమని" చెప్పారు. మేము వెంటనే ఆస్పత్రి నుండి వచ్చేసి స్వామి చెప్పినట్లు చేసాము. కొన్ని రోజులలో ఆరోగ్యము చేకూరినది. డాక్టర్లకు కనీస శరీర అవగాహన లేదా? లేక అంతుబట్టని రోగమేమైనా స్వామి చెప్పటం వలన తగ్గిందా? అంతా స్వామి సంకల్పమే!!

2015 సం॥లో మా నాన్నగారికి తరచుగా తలనొప్పి వచ్చేది. స్వామికి ఫోను చేస్తే "ప్రాణాపాయం లేదు" అని చెప్పారు. ఎందువలన స్వామి అలా అన్నారో అర్థం కాలేదు. మేము అదంతా గ్లూకోమా వల్ల వచ్చింది అనుకున్నాము. డాక్టర్లకు చూపెడితే వారు పరీక్షలు చేసి మెదడులో రక్తం గడ్డ కట్టడం వల్ల అలా వచ్చిందని చెప్పి ఆపరేషన్ చేశారు. మా నాన్నగారికి తలనొప్పి తగ్గి ఆరోగ్యం చేకూరింది.

శ్రీపాదవల్లభ చరితామృతం చదివి చాలా ప్రభావితుడనై, పిఠాపురంలో కొంత స్థలం కొందామని స్వామిని అడిగితే ఇలా చెప్పారు "అన్ని రకాలుగా చూడాలి, ఓనర్సు ఎలాంటివారో చూడాలీ అక్కడకన్నా నువ్వుండే బెంగుళూరులో కొనుక్కో. అక్కడ ఇల్లు కడతావు. దానికి శ్రీ పాద నిలయము అని పేరు పెట్టు" అని అన్నారు. ఆ సమయంలో బెంగుళూరులో ఇల్లు కొనటమనేది నా ఊహకు కూడా అందనిది. తర్వాత స్వామి చెప్పినట్లు జరిగింది. అద్దె ఇల్లు వెతకటం కన్నా సొంత ఇల్లు కొనడమనేది చాలా తేలికయ్యింది. స్థలం కొని భవనం కట్టించమంటారా అని అడిగితే కట్టిన ఇంటినే కొనమని స్వామివారు చెప్పారు. గృహప్రవేశానికి ముందర స్వామి దర్శనానికి వెళితే స్వామి నాతో "నిలయం అని పెట్టావా? నిలయము అని పెట్టావా?" అని అడిగి "నిలయము అని పేరు పెట్టు" అని చెప్పారు. తర్వాత నేను తెలుగు వ్యాకరణము (గ్రామర్) ప్రకారం ఒక వాక్యం సున్నాతో ఆగకూడదు అని తెలుసుకున్నాను.

అమ్మయ్య ఆరాధనకి మేము లడ్డూలు రక రకాల పరిమాణాలలో చేస్తున్నాము. శంకరయ్యగారు ఇలా చెప్పారు 'స్వామి అడుగుతున్నారు, ఒకే రకంగా లడ్డూలు చేస్తున్నారా లేదా అని'. అంటే స్వామికి ఎక్కడ ఏం జరుగుతుందో తెలుసు. స్వామి లడ్డులు "గురుదేవా! గురుదేవా! అని స్మరణ చేస్తూ కట్టమని" చెప్పేవారు. అట్లా చేసిన లడ్డులు తిన్నవారికి పుష్టి, ఆరోగ్యము కలుగుతుందని చెప్పేవారు. ఇదే విషయాన్ని ఇంకొక సందర్భంలో ప్రతిగృహిణి తమ ఇంట్లో వంట చేసస్తూ భగవన్నామస్మరణతో చేయాలని చెప్పేవారు. దీనివలన తిన్నవారికి ఆరోగ్యము, సద్భావన, భగవద్భక్తి కలుగుతాయని చెప్పేవారు.

**మద్రాస్ నుండి వేణుగోపాల్, ఎన్. జానకి దంపతులు** ఇలా చెపుతున్నారు: గొలగమూడి శ్రీ పెసల సుబ్బరామయ్య మాస్టారుగారు శ్రీ దర్గాస్వామివారి గూర్చి మాకు తెలియజేసి వెళ్ళి దర్శనం చేసుకోవాల్సిందిగా సూచించారు.

జానకిగారి భర్తగారు వేణుగోపాల్. వేణుగోపాల్‌గారు ఉద్యోగరీత్యా 2009లో హైదరాబాదు నుండి చెన్నైకి బదిలీ అయ్యారు. వారికి చెన్నైలో

పరిచయస్థులు ఎవరూ లేరు కనుక ఆయన చెన్నైలో అద్దెఇంటి కొరకు వెతికినా నచ్చిన ఇల్లు దొరకలేదు. ప్రయత్నం చేస్తుండగా భగవంతుని కృప వలన ఇద్దరు గురు బంధువులు తటస్థించి రెండు ఇళ్ళు చూపారు. వేణుగోపాల్‌గారు దర్గాస్వామివారి దగ్గరకి వెళ్ళి ఈ రెండు ఇళ్ళ గురించి చెప్పారు. స్వామి వాటిలో ఒకదాన్ని ఓ.కె. చేస్తూ "నువ్వు ఇంట్లో దిగే ముందు గోవు పాదం పెట్టించు" అని చెప్పారు.

స్వామి చెప్పిన విధంగా చేయటానికి ఆవు కొరకు పరిచయమయిన ఆవిడని అడిగితే 'బాబూ! మేము ఆవుని చూసే చాలా సంవత్సరాలు అయ్యింది. ఇప్పుడు ఈ సమయంలో నీకెట్లా కుదురుతుంది' అని చెప్పారు. స్వామివారు సూచించారు కనుక, ప్రయత్నం చేయటం నా ధర్మం, ఆవు దొరకటం, దొరకకపోవటం స్వామి ఇష్టం అని ఆయన ఇంటి మెయిన్ గేటు దగ్గరకి వచ్చేసరికి ఒక ఆవు, దాని వెనకాలే దూడ కూడా వెళుతూ కనపడ్డాయి. అప్పుడు టైము రాత్రి 11 గంటలు. వేణుగోపాల్‌గారు 'అరె! ఈ సమయంలో ఆవు కనిపించటమేమిటి?' అనుకుని పరిగెత్తుకుని పోయి గేటు బయటకొచ్చేసరికి ఆవు యజమాని కూడా కనిపించాడు. అతనితో మాట్లాడి మర్నాడు తెల్లవారుఝామున 3-4గంటలకు వారి గృహప్రవేశానికి ఆవును తీసుకురావల్సిందిగా అడిగారు, ఆ యజమాని తెస్తానని చెప్పి, తన ఫోను నెంబరు కూడా ఇచ్చి వెళ్ళాడు.

అసలు ఆవులే కనపడని ప్రాంతంలో ఆవు ఎలా వచ్చిందని విచారించగా, ఆ ఆవు ఆ రోజు మేతకు వెళ్ళి తప్పిపోయిందని తెలిసింది. దాని యజమాని వెతికి ఇంటికి తీసుకువస్తుండగా వేణుగోపాల్‌గారికి కనపడింది. మరుసటి రోజు ఉదయం మాట్లాడుకున్న ప్రకారం అతను ఆవును, దూడను తీసుకు వచ్చాడు. ఆవు ఇంట్లోకి వచ్చిన తర్వాత ప్రతి గదిలోనూ తిరిగింది. లోపలకి వచ్చిన తర్వాత ఆవు పంచితం కూడా పోసింది. ఆవు చాలాసేపు ఇంటిలోనే గడిపింది. చాలాసేపటి తర్వాత ఆవు యజమాని నెమ్మదిగా అదిలించగా బయటకు వెళ్ళింది.

జరిగిన విషయాన్ని అంతా తరచి చూస్తే కాకతాళీయం అనుకోవడానికి ఆస్కారం కనిపించదు. ఎందుకంటే గృహప్రవేశానికి కేవలం

కొద్ది గంటల సమయం ముందర ఆవు కనపడటం, అదీగాక రాత్రి 11 గంటలకి దాని యజమానితో కనపడటం చిత్రమైన విషయం. ఈ లీలను బట్టి **స్వామి ఏమి చెప్పినా అది జరుగుతుందనే నమ్మకంతో, ఎంత కష్టమైనా, చేయటానికి ప్రయత్నిస్తే స్వామి సర్వవిధాలా ముందుకు నడిపిస్తారని గ్రహించవచ్చు.**

ఒకరోజు రాత్రి దర్గాస్వామివారి దర్శనానికి వేణుగోపాల్‌గారు బయలుదేరారు. ఆయన భార్యకు అప్పటికే బాగా జ్వరంగా వుంది. ఆయన ఊరు వెళ్ళితే ఇంట్లో ఆవిడ, వారి 8 సం॥లు బాబు మాత్రం ఉంటారు. జానకిగారికి ఆయనను వెళ్ళవద్దు అని చెప్పాలనిపించలేదు. స్వామివారి దగ్గరకే కదా అని అనుకున్నారు. మర్నాడు ఉదయాన్నే ఆవిడకు ఒక కల వచ్చింది. ఆవిడ గొలగమూడికి ఎప్పుడు పోయినా నెల్లూరు ఆర్.టి.సి. బస్టాండు దగ్గరగా వున్న హొటల్‌లో భోజనం చేసి నిల్చుంటారు. ఆ తరువాత ఆటో లేదా బస్ ఎక్కి గొలగమూడి చేరుకునేవారు. ఆ కలలో కూడ ఆవిడ అలానే నిలబడి ఉన్నారు. ఒక కారు వచ్చి ఆవిడ ముందర ఆగింది. దాని ముందు సీటులో డ్రైవరు మాత్రమే ఉండి వెనుక సీటులో స్కూలు పిల్లలు ఉన్నారు. డ్రైవర్ వెనుక డోరు తీసి కూర్చోండి అన్నాడు. ఆవిడ, వారి బాబు ఎక్కి కూర్చున్నారు. ఆవిడ కారు ఎక్కడకి వెళుతోంది? అని అడగగా దర్గాస్వామి దగ్గరకు అని చెప్పాడు. కారు బయలుదేరింది. బయట వర్షం పడి కొద్దిగా బురద, రోడ్డంతా గతుకులు, ఇసుక బాగా ఎక్కువగా వేసి చెదురుగా వుంది. ఆవిడ 'రోడ్డంతా ఇలా వుంటే, ఇసుకలో ఎలా మేము ఈ సామాను మోసుకొని నడవగలుగుతాము, ముందుకు పోవటం కూడా చాలా కష్టం, ఈ కారులో హాయిగా ఏ కష్టం లేకుండా వెళ్ళిపోతున్నాము, ఈ డ్రైవరు రూపంలో స్వామివారే మమ్ములను తీసుకుపోతున్నారని' అనుకున్నారు. తర్వాత నిద్ర నుండి మెలుకువ వచ్చింది. ఆవిడకు జ్వరం తగ్గింది. వేణుగోపాల్‌గారిని దర్గాస్వామి దగ్గరకి వెళుతుంటే వెళ్ళద్దు అని ఆవిడ చెప్పనందుకు, స్వామి కరుణించి ఆవిడ జ్వరాన్ని తగ్గించారని విశ్వసిస్తున్నారు.

2010 సంవత్సరంలో ఒకసారి స్వామివారి దర్శనానికి వేణుగోపాల్‌గారు కుటుంబసమేతంగా బయలుదేరారు. ఆయన భార్య జానకి చాలా తొందరగా నడుస్తున్నారు. సడెన్‌గా ఒక బైక్ ప్రక్కనుండి వచ్చి ఆవిడను గుద్దటం జరిగింది. ఆవిడ క్రింద పడిపోయారు. వెంటనే అతడిని గట్టిగా తిట్టాలనుకున్నారు. కానీ స్వామివారి దగ్గరకి వెళుతున్నాము కదా అతనితో తగవు పెట్టుకుంటే మనస్సంతా సరిగా వుండదు అని స్ఫురించి, కోపంగా అతడిని వెళ్ళిపొమ్మన్నారు. ఆవిడ కాలికి ఆ బైక్ గట్టిగా తగలటం వలన కాలి వేలికి రక్తం వచ్చింది. తరువాత స్వామివారి దగ్గరకు చేరుకున్నారు. అక్కడ దర్గాల చుట్టూ ప్రదక్షిణలు అన్నీ మామూలుగా చేసుకున్నారు. అదేరోజు సాయంత్రం ఆశ్రమం నుండి బయలుదేరి రాత్రికి ఆలస్యంగా చెన్నైకి చేరుకున్నారు. ఇంటికి వచ్చిన తర్వాత కాలు చూసుకుంటే, మోకాలి దాకా బాగా వాచింది. బైకు తగిలిన దగ్గర రక్తం గడ్డ కట్టింది. ఆవిడకు 2 రోజుల వరకూ నొప్పి వుండి, ఏ మందులూ లేకుండా దానంతటదే తగ్గిపోయినది. ఒక ఇంజక్షను కూడా లేకుండా ఏ మందులూ తీసుకోకుండా తగ్గిపోయింది.

గాయం నయమైన వారం రోజులకి ఆవిడ బాత్రూములో జారి పడ్డారు. దానివలన రెండురోజులు పూర్తి బెడ్ రెస్టు తీసుకోవాల్సి వచ్చింది. బాత్రూమ్‌లో పడ్డ దెబ్బ నెలరోజులకు కానీ తగ్గలేదు. ఆ నెల రోజులు కూడా నొప్పి వలన ఇబ్బంది పడ్డారు. ఇప్పటికీ ఎక్కువగా నడిచినా ఆ నొప్పి తెలుస్తుంది. ఈ దెబ్బ దర్గాస్వామి దగ్గరకి వెళ్ళేటప్పుడు తగిలిన దెబ్బ కంటే చాలా చిన్నది. అంతకుముందు స్వామిదర్శనానికి వెళ్ళినప్పుడు అంత పెద్దగా తగిలినా ఏ మందులూ లేకుండా తగ్గిపోయినది. రెండవది చాలా చిన్నగా తగిలినా విపరీతంగా బాధపడవలసి వచ్చినది. నా మనస్సుకు మాత్రం ఇది ఖచ్చితంగా స్వామివారి మహిమ అని అనిపించినది. ఈ విధంగా స్వామి దర్శనానికి వెళుతుంటే పెద్ద ప్రమాదం జరగవలసి ఉన్నప్పటికీ, చిన్న గాయంతో ఏ మందులూ వాడకుండా తగ్గించి ఆవిడ కర్మను నివారించినారని విశ్వసిస్తున్నారు.

**జహాంగీర్** అనే యువకుడు 1998వ సం॥లో, ఇరవై సం॥ల వయస్సులో, మొదటిసారి ఆశ్రమానికి వచ్చి స్వామి దర్శనం

చేసుకున్నాడు. ఇతనిని **దస్తగిరి** అని స్వామి పిలిచేవారు. ఇతను ప్రస్తుతం హైదరాబాద్ ప్రైవేట్ కాలేజీలో సీనియర్ ఇంగ్లీషు లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను ఆధ్యాత్మిక జిజ్ఞాసాపరుడు. ఎవరైనా సిద్ధపురుషుల మార్గదర్శనంలో ఆధ్యాత్మిక ప్రగతి సాధించాలనే కోరికతో స్వామి గురించి తెలిసి ఆశ్రయించినాడు. ఇతనిని చిన్న వయస్సులోనే "ఇంత ఆధ్యాత్మిక చింతన ఎందుకు నాయనా?" అని స్వామి నచ్చచెప్పారు. ఇతను ఎమ్.ఎ(ఇంగ్లీషు) పూర్తి చేసిన తర్వాత స్వామి ఆశీస్సులతో ఎమ్.ఫిల్‌కి కట్టి ఉత్తీర్ణుడైనాడు. ఇతనికి వివాహం చేసుకోవాలనే ఆలోచన ఉండేది కాదు. అయితే స్వామి "కర్మ ఉంది నాయనా! వచ్చేవాళ్ళు మనకు అనుకూలంగా ఉంటే ఇబ్బందేమీ ఉండదు కదా!" అని ధైర్యం చెప్పారు. తర్వాతి కాలంలో స్వామి ఆశీస్సులతో ఇతనికి వివాహం జరిగింది. ఇద్దరు పిల్లలు కూడా పుట్టారు.

ఒక పర్యటనలో స్వామి ఆశ్రమంలో ఉండగా దస్తగిరి ఆశ్రమం బయట సాయి మందిరం దగ్గర కూర్చుని ఉన్నాడు. ఇతని మనస్సులో 'నేను ఎల్లప్పుడూ స్వామి సంరక్షణలో ఉన్నాను. నాకు ఎలాంటి భయమూ లేదు' అనే దృఢమైన భావన కలిగింది. ఇంతలో దర్గా లోపలనించి స్వామి "అరెయ్ దస్తగిరి! లోపలికి రా!" అని పిలిచారు. ఇంతలో కొంత ఆశ్చర్యంగా దర్గాలోపల వెళ్ళినాక స్వామి "బయట కూర్చుని ఏమి ఆలోచిస్తున్నావు?" అని అడిగారు. ఇతనికి నోట మాట రాక మౌనంగా ఉండిపోయాడు. ఆరోజు రాత్రి నిద్ర చేసినప్పుడు అతనికి స్వప్నంలో తన కడుపులోని ప్రేగులు మాట్లాడుతున్నట్లు అనుభవమైంది. తనలోనున్న చైతన్యానికి, శరీరానికి మధ్య ఉన్న తేడా స్పష్టంగా అనుభవమైంది. దీనిని సాధారణంగా Out of Body Experience (OBE) అంటారు. ఈ అనుభవాలతో అతనికి కొంత భయంగా, కొంత సంతోషంగా అనిపించింది. మర్నాడు ఉదయం ఆరతిలో స్వామి "రాత్రి ఏం జరిగింది నాయనా?" అని అడిగారు. దస్తగిరి చెప్పేలోపే స్వామి "ఏమీ లేదు. అంతా మంచిగా ఉంటుందిలే" అన్నారు.

ఇతనికి చిన్న వయస్సులోనే మాతృవియోగం కలిగింది. మనస్సులో ఎప్పుడూ లోటుగా ఉండేది. ఐతే అమ్మయ్య దర్శనం అయినాక ఇతని

మనస్సులో శాంతి కలిగి, తన మాతృమూర్తిని చూసినంత తృప్తిగా ఉంది. తర్వాత కాలంలో అమ్మయ్య చేతి వంట తినే భాగ్యం కలిగింది. అమ్మయ్య దర్గాకి వచ్చే ఆర్తులను, భక్తులను సొంత బిడ్డల మాదిరి ఆదరిస్తారని, అనుభవంలో చూచిన, ఇతని దృఢమైన భావన.

ఎన్నో సంవత్సరాలుగా ఆశ్రమానికి క్రమం తప్పకుండా వచ్చి గమనిస్తూ తన అనుభవంతో చెప్పిన విషయం: ఆశ్రమానికి వచ్చినప్పుడు భక్తులందరూ ఏదో ఒక వ్యథతో, భారంతో వస్తారు. స్వామితో చెప్పుకుని చాలా మాట్లాడాలనుకుంటారు. కానీ వెళ్ళేటప్పుడు అందరూ ముఖం మీద చిరునవ్వుతో, తేలికపడిన హృదయంతో సంతోషంగా తమ ఇళ్ళకు వెళతారు.

గమనిక: ఈ పై అనుభవం చాలామంది తరచూ వచ్చే భక్తులకు కలిగినదే. స్వామి "ఆశ్రమం అంటే శ్రమను పోగొట్టేది" అని చెప్పేవారు. ముఖ్యంగా దర్బార్ నగరం ఆశ్రమంలో ఒక రాత్రి నిద్ర చేయటం చాలా విశేషం.

2002లో ఒకసారి **నెల్లూరు మల్లిఖార్జున రెడ్డిగారి** కుటుంబం అంతా స్వామి దర్శనానికి వెళ్ళారు. మధ్యాహ్నం భోజనాలైన తర్వాత బయలుదేరదామని స్వామి అనుమతి అడిగితే "ఎవరెవరు వచ్చారు?" అన్నారు. ఆయన భార్య, పాప కూడా వచ్చారని చెప్పారు. "ఇంకెవరూ రాలేదా?" అని స్వామి అడిగారు. నెల్లూరు నుండి కృష్టారెడ్డిగారు వచ్చారని చెప్పారు. వెంటనే కృష్ణారెడ్డితో "అరెయ్! నువ్వు కూడా వీళ్ళతో వెళ్ళు. కలసిపోండి" అని చెప్పారు. తిరుగు ప్రయాణంలో బద్వేలు వద్ద కృష్ణారెడ్డిగారి వ్యాన్‌లో ఉన్న భక్తులు టీ త్రాగటానికి దిగారు. మల్లిఖార్జున రెడ్డిగారు వాళ్ళని దాటివెళ్ళిన తర్వాత వారి కారు రేడియేటర్‌లో ఏదో ఇబ్బంది వచ్చి ఇంజన్ కూలెంట్ (చల్లబరిచే) నీరు కారిపోతోంది. కారు మర్రిపాడు గ్రామం దగ్గరకి వచ్చేసరికి పూర్తిగా ఆగిపోయింది. కారు అక్కడ వదిలి వెళ్ళలేక, కృష్ణారెడ్డిగారి వ్యానుకు తాళ్ళతో మల్లిఖార్జున రెడ్డిగారి కారును కట్టి ప్రయాణం సాగించారు. దీనికి తోడు మర్రిపాడు దాటిన తర్వాత గాలి, వాన ప్రారంభమయ్యాయి. అప్పుడు కానీ వారందరికీ స్వామి "కలిసిపోండి" అన్న మాటలోని అంతర్యం అర్థం కాలేదు. వారు

ఇబ్బంది పడతారని ముందే తెలిసిన స్వామి, వారి తరువాత బయలుదేరుదామనుకున్న కృష్ణారెడ్డిగారిని వారికి తోడుగా పంపించి నెల్లూరుకి చేర్చారు.

మల్లిఖార్జున రెడ్డిగారి అమ్మాయి మెడిసిన్ ఎంట్రన్సు పరీక్షలకు ఆంధ్రలోనే కాకుండా వేరే రాష్ట్రాలలో కూడా ప్రయత్నించాలనుకుంది. స్వామిని అడుగగా "ఆంధ్రలోనే వ్రాయమని" చెప్పారు. స్వామి మాట ప్రకారం ఎంసెట్ రాస్తే 2400 ర్యాంకు వచ్చింది. ఆ ర్యాంకుకి నెల్లూరు నారాయణ మెడికల్ కాలేజీలో సీటు రాదు, కనుక కుప్పం కాలేజీలో చేరుద్దామనుకున్నారు. స్వామి "కుప్పం కాలేజీ వద్దని, నారాయణ కావాలని, నారాయణలో వస్తుందని" చెప్పారు. ఆ సంవత్సరం ఫీజు రీయెంబర్సమెంట్ పథకం ద్వారా వారి అమ్మాయికి నారాయణా మెడికల్ కాలేజీలో పేమెంట్ సీటు వచ్చింది. ఫీజులు కూడా ఇన్‌స్టాల్‌మెంట్ పద్ధతి ప్రకారం మల్లిఖార్జున రెడ్డిగారికి అనుకూలంగా కట్టటం జరిగింది. వారెక్కడో దూరంగా చదివించాల్సి వస్తుందేమోననుకుంటే, స్వామికృప వలన అమ్మాయి ఇంట్లోనే వారితో కలిసి ఉండి మెడిసిన్ చదువు పూర్తి చేసింది. వారందరూ చాలా ఆనందంగా ఉన్నారు.

అమ్మయ్య సమాధి చెందిన తర్వాత, మల్లిఖార్జున రెడ్డిగారికి ప్రతి మంగళవారం స్వామికి ఫోను చేసే అలవాటు చేసుకున్నారు. ఆయనకు 2011, జనవరి 22 సాయంకాలం 103 డిగ్రీల జ్వరం, ఒళ్ళునొప్పులు వచ్చాయి. డెంగ్యూ జ్వరంలాగా ఉందని పరీక్షలు చేయిస్తే రిపోర్టుల్లో ఏమీలేదని వచ్చింది. ఆయనకు ఊహ తెలిసిన తర్వాత మొదటిసారి థర్మామీటరుతో చూడవలసి వచ్చింది. ఆదివారం మొదలైన జ్వరం మంగళవారం దాకా అలానే ఉంది. ఆ రోజు స్వామికి ఫోను చేసి చెప్తే స్వామి "నాయనా! నువ్వేనా? నిన్నటినుండి సతాయిస్తోంది నాకు. ఎవరికో ఏమో బాగోలేదనుకున్నాను. నాకు కూడా నిన్న సాయంత్రం,రాత్రి, ఇవాళ ఉదయం దాకా 3 పూటలా సతాయించింది. పోతుందిలే!' అని అభయమిచ్చారు. స్వామి చెప్పినట్లే ఆయన త్వరగా కోలుకున్నారు.

స్వామి చెన్నైలో విల్లివాకం దర్బార్ సాయి మందిరానికి వెళ్ళి అక్కడ గోవర్ధన్ గారింట్లో 3 రోజులు ఉండేవారు. ఆ సమయంలో మల్లిఖార్జున

రెడ్డిగారు స్వామితో మాట్లాడదామని అక్కడున్న ఒక భక్తుడికి ఫోను చేసారు. ఫోన్ చేసే ముందర ఆయన ఎడమ కాలు పట్టేసింది. ఆయన ఆ భక్తుడితో స్వామి గురించి అడుగుతున్నారు. ఇంతలో స్వామి "అరెయ్! కాలు పట్టేసింది" అని అంటున్నారు. తర్వాత స్వామికి భక్తులు ఫోన్ ఇస్తే "ఎట్లా ఉన్నావు?" అని అడిగారు. 'కాళ్ళు వాస్తున్నాయి, బాగా నొప్పి ఉంది' అన్నారు. వెంటనే "ఎడమకాలా?" అని అడిగి "నేను ఇప్పుడే విదిలించాను పోయింది పో ఏమీ కాదు. ఈ సారి వచ్చినప్పుడు విబూది ఇస్తాను పూసుకుందువులే. ఏమీ కాదు పో!, నువ్వు రెండు రోజులనుండీ ఎందుకో గుర్తు వస్తున్నావు" అని అన్నారు.

'స్వామి నేను గుర్తువస్తున్నాను' అనే మాట అనేసరికి మల్లిఖార్జున రెడ్డిగారు ఉండలేక ఆరోజు మధ్యాహ్నం దాకా హాస్పిటల్ పని చూసుకొని ఒక్కరే కారులో చెన్నై బయలుదేరారు. సాయంత్రం ఆరతి అయ్యి ప్రసాదాలు పంచిన తర్వాత స్వామి వారిని పిలిచారు. **ఊదీ ఇస్తారేమోననుకుంటే, స్వామే స్వయంగా ఊదీ తీసుకొని కాలికి మొత్తం పూసారు.** స్వామి అలా చేసేసరికి ఆయన నివ్వెరపోయారు. ఇది ఆయన ఊహించని సంఘటన. తేరుకొనేసరికి చాలా సేపు పట్టింది. నొప్పి చాలా మట్టుకు తగ్గింది. ఎప్పుడైనా ఎక్కువసేపు కూర్చుంటుంటే కొంచెం నొప్పిగా ఉండేది. స్వామికి చెప్తే "పూర్తిగా తగ్గిపోతుందిలే. దాని గురించి ఆలోచన వదిలేసెయ్" అని చెప్పారు. తర్వాతరోజు స్వామి దగ్గర సెలవు తీసుకొని ప్రయాణమై నెల్లూరు దగ్గరకొచ్చేసరికి, ఫోను చేసి స్వామి "క్షేమంగా చేరావా?" అని అడిగి తెలుసుకున్నారు. భక్తులపై స్వామికున్న అవ్యాజమైన ప్రేమకు ఇది ఒక నిదర్శనం.

2005లో **అశ్వారావుపేట విజయలక్ష్మిగారు** వారి రైసు మిల్లు అమ్మేసి ప్రక్కనున్న ఇంకొక ఊరిలో మిల్లు పెడదామని స్థలం కొనటానికి అడ్వాన్సు ఇచ్చారు. ఆ సమయంలో దర్గాస్వామి గురించి తెలిసి స్వామి దర్శనానికి వెళ్ళారు. స్వామిని వారు పెట్టబోయే మిల్లు గురించి అడుగగా "మీరు భూమైతే తీసుకున్నారు. అది మీది అవదు, ప్రక్కన పెడతావులే, ఆ! అది కూడా చిరాకవుతుంది. చివరికి డబ్బులు ఖర్చయినా పెడతావులే" అని చెప్పారు. కానీ వారు 'అడ్వాన్సు ఇచ్చేసాము కదా!

ఇంక ఆ స్థలం మాదే' అని తలచి స్వామి మాటలు విశ్వసించలేదు. వారు ఇంటికొచ్చిన తర్వాత అడ్వాన్సు తీసుకున్న స్థలం యజమాని వచ్చి, స్థలం అమ్మట్లేదని చెప్పాడు. ఒక సంవత్సరం తరువాత ఇంటి ప్రక్కనున్న ఆరు షాపులలో మిల్లు పెడదామని ప్రయత్నించగా, చాలా అడ్డంకులు వచ్చినాయి. చివరకు కోర్టు కేసు అయ్యి, చాలా డబ్బు ఖర్చు అయి, కేసు గెలిచి మిల్లు యింటి ప్రక్కగా పెట్టగలిగారు. పెట్టిన తర్వాత ఎప్పుడో 1-2 సం॥ల ముందర స్వామి అన్న మాటలు గుర్తు వచ్చి స్వామి మీద విశ్వాసం కుదిరింది.

విజయలక్ష్మిగారి పిల్లవాడికి ఇంటర్ మీడియట్‌లో 940 మార్కులు (1000 మార్కులకి) వచ్చినా హైదరాబాదులోని ఇంజనీరింగ్ కాలేజీలలో సంవత్సరానికి 3 లక్షల ఫీజు అడిగారు. వారంత ఖర్చు పెట్టలేక పాల్వంచలో సంవత్సరానికి లక్షరూపాయలు ఫీజు కట్టి ఇంజనీరింగ్ సీటు తీసుకున్నారు. వారి పిల్లవాడికి పాల్వంచలో చదవటం ఇష్టంలేదు. అందువలన గుంటూరులో జరిగే కౌన్సిలింగ్‌కి వెళ్ళేముందర స్వామి ఆశీస్సులకని విజయలక్ష్మిగారి భర్త, పిల్లవాడు దర్గాస్వామి దగ్గరకి వెళ్ళారు. దర్గాస్వామి ఆరోజు రాత్రి అక్కడే ఉండమన్నారు. కానీ వారి అబ్బాయి స్వామితో తర్వాత రోజు కౌన్సిలింగ్ ఉందని చెప్పాడు. అప్పుడు స్వామి "నీవు ఇంటికి వెళ్ళే సరికి చూసొచ్చిన కాలేజీ నుండి ఫోన్ వస్తుందిరా. కౌన్సిలింగ్ వద్దు, నీ మొహం వద్దు" అన్నారు. ఇంటికి వచ్చాక, స్వామి చెప్పిన విధంగా, హైదరాబాద్‌లో ఒక ఇంజనీరింగ్ కాలేజీ వారినుండి ఫోను వచ్చింది. ఆ కాలేజీలో ఇ.సి.ఇ. గ్రూపులో సీటు, ఇ.ఇ.ఇ. గ్రూపులో ఒక సీటు ఉన్నాయని తెలియచేసారు. సంవత్సరానికి 80వేలు ఫీజు అని చెప్పారు. వారి పిల్లవాడు ఆనందంగా ఆ కాలేజీలో చేరాడు.

విజయలక్ష్మిగారి అమ్మాయి చదువులో కొంచెం మందంగా ఉండేది. అందువలన ప్రతి సంవత్సరం నచ్చచెపుతూ చదివిస్తుండేవారు. గుంటూరు విజ్ఞాన్‌లో ఇంటర్‌మీడియట్ అయిన తర్వాత వారి అమ్మాయి ఎంసెట్ కోచింగ్ తీసుకుంటానన్నది. ఆ అమ్మాయికి వచ్చిన మార్కులని బట్టి ఎంసెట్ పరీక్షలో కనీస పాస్ మార్కులు రావని తల్లిదండ్రులు భావించారు. కానీ వారి అమ్మాయి ఇంజనీరింగ్ చదువుతానని

పట్టుబట్టింది. స్వామి ఆశీస్సులు తీసుకున్న తర్వాత ఏదో కాలేజీలో చేర్పించవచ్చని తలచి స్వామి దర్శనానికి వెళ్ళారు. వారు వెళ్ళిన సమయంలో ఉరుసు జరుగుతోంది. ఆశ్రమం భక్తులతో రద్దీగా ఉన్నది. స్వామితో మాట్లాడే అవకాశం రాలేదు. ఆరోజు సాయంత్రం ఇంటికి ఫోన్‌చేస్తే విజయలక్ష్మిగారి భర్తకి చాలా జ్వరంగా ఉందని చెప్పి వెంటనే రమ్మన్నారు. రాత్రిపూట ప్రయాణం కష్టమని తర్వాత రోజు అమ్మయ్య సమాధి దగ్గర ఉన్న హుండీలో దక్షిణ సమర్పించి వెళదామనుకున్నారు.

వారి అమ్మాయికి స్వామీజీ ఆశీస్సులు తీసుకోకుండా వెళ్ళాల్సి వస్తుందని బాధగా ఉంది. మర్నాడు వాళ్ళు అమ్మయ్య సమాధి దగ్గర స్వామి కూర్చొని ఉన్నారు. వారు హుండీలో దక్షిణ వేస్తుండగా, స్వామి వారివంక ప్రశ్నార్థకంగా చూచారు. స్వామి "ఏమిటని" అడిగితే ఆ అమ్మాయి 'స్వామీ! మీరు మాట్లాడలేదని బాధగా ఉంది. మా నాన్నకేమో బాగోలేదు. అందువల్ల వెళ్ళిపోతున్నాము' అని చెప్పి ఏడ్చింది. వెంటనే స్వామి "మీ నాన్నకు బాగాలేకపోతే మీరిక్కడ ఉంటే ఏమయ్యిందిరా? ఇందాకే వెళ్ళి వచ్చాను. కావాలంటే ఫోన్ చెయ్యి" అని ఫోన్ ఇచ్చారు. ఫోన్ చేస్తే విజయలక్ష్మిగారి భర్తగారు 'అక్కడ ఉరుసు కదా, రెండు రోజులుండి రండి. నాకు కొంచెంసేపటినుండి బాగానే ఉంది' అని చెప్పారు. వారి అమ్మాయి సంతోషంతో 'స్వామీ! ఎంసెట్ కోచింగ్ తీసుకుందామనుకుంటున్నాను' అంటే "తీసుకోరా. నీకు ర్యాంకు వస్తుంది. మంచి కాలేజీలో సీటు వస్తుంది" అని ఆశీర్వదించారు. అమ్మాయి చాలా ఆనందపడింది. ఈ విధంగా వారికి స్వామి కృప వలన ఉరుసు జరిగిన మూడు రోజులు అక్కడే ఉండి సేవ చేసుకొనే భాగ్యం కలిగింది.

వారి పాపకు స్వామి పాదాలను తాకి నమస్కరించుకోవాలని కోరిక. కానీ అప్పటిదాకా ఎప్పుడూ ఆ అవకాశం రాలేదు. ఉరుసులో గంధం ప్రసాదంగా ఇచ్చిన తర్వాత భక్తులు స్వామికి పాద నమస్కారం చేసుకుంటున్నారు. ఆ సమయానికి వారి అమ్మాయి నిద్రపోతోంది. స్వామి విజయలక్ష్మిగారిని చూచి "పిల్ల ఏది? తపించిపోతోందిగా?" అన్నారు. ఆవిడ పరిగెత్తుకుంటూ వెళ్ళి అమ్మాయిని నిద్రలేపి పిలుచుకు వచ్చారు.

ఆ అమ్మాయి పరుగెత్తుకుంటూ వెళ్ళి స్వామి పాదాలను తాకి తలను పాదాల దగ్గర పెట్టింది. స్వామి అలానే 10ని॥లు ఉంచమన్నారు.

వారు పాదనమస్కారం చేసుకున్న తర్వాత స్వామి "ఇంటికి బయలుదేరండి" అన్నారు. వారు రామాపురం బస్టాండ్‌లో బస్సు కొరకు వేచి చూస్తున్నారు. ఇంతలో దర్గాస్వామి దగ్గరనుండి నెల్లూరు చంద్రశేఖర్ రెడ్డిగారు వారిని వెతుక్కుంటూ వచ్చారు. 'స్వామి మిమ్మల్ని గొలగమూడిలో దించమని చెప్పారు' అని తెలియచేసి వారితో కారులో తీసుకువెళ్ళినారు. గొలగమూడిలోని శ్రీ పెసల సుబ్బరామయ్యగారింటి ప్రక్కన ఉన్న శ్రీ సాయిమాష్టార్ నిలయంలో దించి వెళ్ళారు. వారు వెంకయ్యస్వామి దర్శనం చేసుకుని ఇంటికి చేరారు. తర్వాతి కాలంలో ఆ అమ్మాయి కోచింగ్ తీసుకుని ఎంసెట్ రాసింది. ఎంసెట్‌లో లక్ష పైన ర్యాంకు వచ్చినా స్వామి దయవలన 'శ్రీరామ ఇంజనీరింగ్ కాలేజీలో' సీటు వచ్చింది.

ఒకసారి ఉరుసుకి విజయలక్ష్మిగారి అబ్బాయి కాలేజీ మానేసి వెళ్ళాడు. ఇంటివద్దనుండి తల్లిదండ్రులు ఎక్కువ రోజులు ఆశ్రమంలో ఉంటే కాలేజీ పోతుందని పిల్లవాడిని మందలించినారు. ఇక్కడ ఆశ్రమంలో కుర్రవాడు స్వామి అనుమతి తీసుకుని బయలుదేరదామని నిలబడి ఉన్నాడు. ఆ సమయంలో స్వామి చుట్టూ చాలామంది భక్తులు ఉన్నారు. అంత మంది ఉన్నా స్వామి ఆ పిల్లవాడి వంక చూసి "కాలేజీ పోతోంది నాన్న!" అన్నారు. వెంటనే స్వామికి నమస్కరించుకొని ఆ పిల్లవాడు కాలేజీకి బయలుదేరి వెళ్ళాడు.

**విశాఖపట్నం వాస్తవ్యురాలు పార్వతమ్మగారికి** "దైవం మానుష రూపేణ" అనే స్వామివారి చరిత్ర ప్రతి ఒకటి లభించగా దానిని శ్రద్ధగా పారాయణ చేసారు. అది పారాయణ చేసినాక ఇటువంటి సాధుపురుషుడు సజీవంగా ఉన్నారని సంబరపడి, స్వామి దర్శనం చేసుకోవాలనుకున్నారు. ఆ సమయంలో వారి అమ్మాయి బంగారు నల్లపూసల గొలుసు ఒకటి కనపడకుండా పోయింది. ఈ విషయమై అడగాలనుకుని 2012వ సంవత్సరంలో మొదటిసారి స్వామిని దర్శించుకున్నారు. స్వామిని అడుగగా "అమ్మా! అలాంటివి ఇక్కడ

చెప్పరు" అని జవాబిచ్చారు. ఆశ్రమం నుండి వారు తీర్థయాత్రకు వెళ్ళి ఇంటికి తిరిగి వెళ్ళాలనుకున్నారు. తీర్థయాత్రకు వెళ్ళే సమయంలో రైలులో ఉండగా ఆవిడకు స్వామి చరిత్రలోని అమర్‌నాథ్ తల్లిగారి డైమండ్ దుద్దులు పోయి దొరికిన వృత్తాంతం గుర్తుకు వచ్చింది. వెంటనే ఆవిడ మనస్సులో అమ్మయ్యను స్మరించుకుని 'అమ్మా! మా అమ్మాయి నల్లపూసల గొలుసు దొరికితే నా ఫింఛనులో 1116/- రూపాయలు సమర్పించుకుంటాను' అని చెప్పుకున్నారు. ఆవిడ చెప్పుకున్న పది నిమిషాలలో వారి అమ్మాయి నుండి ఫోను వచ్చింది. ఆ కనపడని గొలుసు ఇంట్లోనే బల్లమీద ఉన్న కాగితాలు సర్దుతుండగా దొరికిందని సారాంశం. ఆవిడ కృతజ్ఞతగా మనస్సులో స్వామి, అమ్మయ్యలకు నమస్కరించుకున్నారు.

ఆవిడకు తర్వాతి దర్శనం చేసుకోవటానికి ఒక సంవత్సరం పట్టింది. 2013లో రెండు చీరలు సర్దుకుని ఒకటి, రెండు రోజులు ఉందామని వచ్చారు. ఆశ్రమంలో ఉండటానికి స్వామిని అనుమతి అడుగగా "అమ్మా! నీ ఇష్టమొచ్చినన్నాళ్ళు ఉండు. సాయి సేవ చేసుకో" అని చెప్పారు. తర్వాత ఆవిడ ఒక సంవత్సరం ఆశ్రమంలోని ఉండి సేవ చేస్తున్నారు. ఈ రకంగా ఒక సంవత్సరం పైన ఆశ్రమంలో ఉన్నాక ఒకసారి విశాఖపట్నం వెళ్ళి వచ్చారు. 2012 నుండి ఈనాటి వరకు (2017) ఆవిడ ఆశ్రమంలో ఉండి సేవ చేస్తున్నారు. స్వామి ఆవిడను చూసినప్పుడు "అమ్మా! నీ ముఖం చూస్తే సంతోషంగా ఉంటుంది. ఆశ్రమంలో ఉండు తల్లీ! నీకు ఏ లోటూ ఉండదు" అని చెప్పేవారు. పార్వతమ్మగారికి చాలాకాలంగా ధ్యానం చేసుకునే అలవాటు ఉంది. ఆశ్రమంలో ఉండటం మొదలుపెట్టినాక ఆవిడకి మనస్సు నిలకడై ధ్యానంలో ఏకాగ్రత కలుగుతోంది.

ఈ అయిదు సంవత్సరాల్లో ఈవిడకు అలౌకికమైన అనుభవాలు కానీ, అనుభూతులు కానీ, మహిమలు కానీ జరుగలేదు. దేని వలన ఆకర్షింపబడి ఆవిడ 5 సంవత్సరాలు ఆశ్రమంలో ఉన్నట్టు? చాలామంది భక్తులు కూడా సంవత్సరాల తరబడి ఆశ్రమానికి వచ్చేవారే. పార్వతమ్మగారు **ఆశ్రమంలో ఉన్నంతకాలం ఆరోగ్యంగా ఉండి,**

**మనస్సులో తృప్తి, ప్రశాంతంగా ఉంటుంది.** ఏ రకమైన కోరికలు గానీ, తాపత్రయాలు గానీ లేని ప్రశాంతమైన మనోస్థితిగా ఉంటుంది అని చెప్పారు.

**అనంతపురం నుండి కుందా వెంకటేశ్వర్లు, పుష్ప దంపతులు** 2006-2007 నుండి ఆశ్రమానికి వస్తున్నారు. వీరికి 2005లో వివాహం జరిగింది. వీరిద్దరూ ఉద్యోగస్తులు. వెంకటేశ్వరావుగారు ఆశ్రమానికి రాకముందు ఆయనకు కాలి కండరాలు పట్టి, విపరీతమైన నొప్పిగా ఉండేది. ఇలా వచ్చినప్పుడు ఒక అరగంటసేపు బాధపడేవారు. మొదటిసారి ఆశ్రమానికి వచ్చి స్వామి దర్శనం చేసుకున్న దగ్గరనుండి నొప్పి మొదలైనప్పుడు స్వామిని స్మరించుకునే అలవాటు చేసుకున్నారు. ఆ మొదలైన నొప్పి క్రమంగా వెనక్కు తగ్గటం గమనించి ఆశ్చర్యపడేవారు. ఇది ఆయనకు స్పష్టంగా అనుభవమయ్యేది. ఇది తప్పించి ఆయనకు మరే విశేషమైన అలౌకికానుభవాలు లేవు. ఈ పది సంవత్సరములలో స్వామిని అడిగిన సందర్భాలు అరుదు. వీరికి సంతానం లేదు. వీరు ఏ కారణం చేత 10 సంవత్సరాలుగా ఆశ్రమానికి వస్తున్నట్లు?

స్వామి ఒక సందర్భంలో ''నాయనా! ఎవరైనా చెట్టు దగ్గరకి వెళుతున్నప్పుడు కాయో, పండో లభిస్తుందనే ఆశతో వెళతారు'' అని చెప్పారు. సారాంశమేమంటే మనిషి చేసే ఏ పనైనా కూడా ఒక ఫలితాన్ని ఆశించి చేస్తాడు. స్వామి దగ్గరకి మొదటిసారి ఎవరైనా కొంత ఉత్సుకతతో కానీ, సమస్యతో కానీ వెళ్తారు. అది తీరినాక సంవత్సరాలు తరబడి క్రమం తప్పకుండా ఎందుకు వెళుతున్నట్టు? వెళ్ళినప్పుడు ఏమి పొందుతున్నారు?

ఒకసారి స్వామి హైదరాబాదు రాజీవ్‌ను ఈ విధంగా అడిగారు ''నాయనా! చాలాకాలంగా ఇక్కడకు వస్తున్నావు కదా? నీకేమనిపిస్తుంది?''. అప్పటికి అతనికి చాలా పుస్తక జ్ఞానం ఉంది. అతను 'స్వామీ! మీ దగ్గరకు వచ్చే ముందు ఇంటి వద్ద స్వామిని ఇది అడగాలని, వీటిని గురించి తెలుసుకోవాలని చాలా ఆలోచనలతో ఒక ప్రణాళిక వేసుకుని ఆశ్రమానికి వస్తాను. మీ ముందు కూర్చున్నాక

మనస్సులో ఏ ఆలోచనా మెదలదు. ఏ ప్రశ్నా స్ఫురించదు. ప్రశాంతంగా ఉంటుంది' అని చెప్పాడు. ఇదేవిధంగా గమనిస్తే ఆశ్రమానికి వచ్చే చాలామంది భక్తులు ఎన్నో సంవత్సరాలుగా వచ్చేవారే.

పార్వతమ్మకు గానీ, వెంకటేశ్వర్లుకుగానీ, రాజీవ్‌కు గానీ కలిగిన అనుభవాలను గమనిస్తే వీరందరకీ ఆశ్రమంలో కలిగే ఒక తృప్తి, ప్రశాంతకరమైన స్థితికి వారు ఆకర్షింపబడి క్రమం తప్పకుండా ఆశ్రమానికి వెళ్ళటానికి కారణం అని తెలుసుకోవచ్చు.

ఇంకొక సందర్భంలో వెంకటేశ్వర్లుగారికి ఊపిరితిత్తుల సమస్య వచ్చింది. డాక్టరుకు చూపించుకోగా, క్షయవ్యాధి కావచ్చు పరీక్షలు చేయించండి అని చెప్పారు. ఆయన స్వామిని అడుగగా "ఏమీ లేదు నాయనా! ఊపిరితిత్తులలో నిమ్ము చేరింది. రోజూ ఉదయం పరకడుపున బాగా మరగ కాచి చల్లార్చిన ఉడుకు నీళ్లు (ఎంత వేడిగా త్రాగగలిగితే అంత) త్రాగు" అని చెప్పారు. ఆశ్చర్యంగా వైద్య పరీక్షలు చేయించుకున్నాక డాక్టర్లకు చూపించాక వారు కూడా క్షయవ్యాధి కాదు. కేవలం నిమ్ము చేరింది అని చెప్పారు. స్వామి చెప్పినట్లు చేసి సమస్య నుండి బయట పడ్డారు.

పుష్పగారు స్వామిని మొదటసారి దర్శించడానికి 6 సంవత్సరముల ముందునుండీ శిరిడీసాయి సచ్చరిత్ర నిత్యపారాయణ చేసేవారు. సాయి ఆశ్వాసనా వాక్యము "అన్ని జన్మలలో నేను ఉన్నాను" అనే వాక్యము ఆమె మనస్సులో దృఢంగా నాటుకుని పదేపదే గుర్తుకు వచ్చేది. పుష్పగారు 'ఈ జన్మలో నీ దర్శనము ఎట్లా కలుగుతుంది?' అని విచారపడేవారు. 'నాకై నేను వెతకలేను. నీవే దర్శనము ఇవ్వాలి' అని ప్రార్థించేవారు. ఒక సద్గురువును ఎట్లా గుర్తించవచ్చు అనే సందేహానికి బాబా "సద్గురువు ఎదురైనప్పుడు నిస్సందేహంగా నీ మనస్సు గుర్తిస్తుంది" అని చెప్పిన విషయం ఆమె మనస్సులో నాటుకుంది. 2005 జులైలో పుష్ప దంపతులు మొదటిసారి స్వామి దర్శనానికి బయలుదేరారు.ఆశ్రమం సమీపించగానే పుష్పగారికి మనస్సు తేలికపడి, విపరీతమైన సంతోషం కలిగింది. ఆమెకు బాబా వాక్కులు స్ఫురించినాయి. స్వామి దర్శనం అయినాక, చాలా సమయం మనస్సే

ఆనందంగా ఉంది. ఆమెకు సాక్షాత్తు శిరిడీసాయినాథుని దర్శనం కలిగిందని తృప్తిపడ్డారు.

2010 మే నెలలో ఆమె కొద్దిరోజులు ఆశ్రమంలో ఉన్నారు. ఒకరోజు రాత్రి ఆశ్రమంలో నిద్రిస్తున్నప్పుడు, ఆమె తల వద్ద ఎవరో నిలబడి ఉన్నట్టు అనిపించింది. ఆమె తల ఎత్తి చూడగా, దత్తాత్రేయస్వామి చిరునవ్వుతో ఆమెను ఆశీర్వదిస్తూ దర్శనమిచ్చారు. మర్నాడు ఉదయం ఆరతిలో స్వామికి ఈ విషయం చెప్పగా "దత్తుడు నీ వెంట ఉన్నాడమ్మా! ఆశ్రమంలో ఉన్న మేడిచెట్టుకు పసుపు, కుంకుమలతో పూజ చెయ్యి" అని చెప్పారు.

**గుంటూరుజిల్లా ఫణిదుర్గ** నాన్నగారు 13 సం॥లగా ఉద్యోగ బదిలీకి ప్రయత్నం చేస్తున్నా కావట్లేదు. ఆమె పెదనాన్నగారి ద్వారా స్వామి గురించి తెలిసి దర్శనానికి వెళ్ళి ఆశ్రమంలో 3 రోజులు నిద్ర చేసారు. స్వామికి విషయం చెపితే మరలా అప్లై చేయమన్నారు. చిత్రంగా కొద్దిరోజులకే బదిలీ అయిపోయింది.

ఫణిదుర్గ అమ్మమ్మ, లలితమ్మ గారికి ఆయాసం. ఆమెకు చలికాలం శ్వాస సరిగ్గా ఆడదు. స్వామి దర్శనానికి వెళ్ళినప్పుడు ఎప్పుడూ కూడా తగ్గించమని అడగలేదు. కానీ ఒక సంవత్సరం పాటు స్వామి దర్శనానికి వెళ్ళింది. ఏ మందులూ లేకుండానే ఆయాసం తగ్గిపోయింది.

ఫణిదుర్గ మామయ్య మానసిక వికలాంగుడు. 50 సం॥లు అయినా పెళ్ళి కాలేదు. బాగా అరవటం, బూతులు తిట్టటం చేసేవాడు. స్వామి దర్శనానికి తీసుకు వెళ్ళినప్పుడు స్వామి ఊదీ ఇచ్చారు. అప్పటినుండి తిట్టడం, అరవటం తగ్గిపోయాయి. కామ్‌గా వుంటాడు.

స్వామి దర్శనానికి వెళ్ళినప్పుడు "మీరు లింగాయతులు. మీ తాత హరహర మహాదేవ శంభో శంకర అంటూ నాకు రుద్రాభిషేకం చేసేవాడు" అని స్వామి చెప్పారు. స్వామి వేరు, శివుడు వేరు కాదు.

**గోదావరి జిల్లా గుప్తా గారు** స్వామి సన్నిధిలో చాలా సంవత్సరాలు వుండి సేవ చేసినారు. ఈయనకి అమ్మయ్య భోజనం పెట్టేవారు. ఆశ్రమంలో వున్న ఆవులను మేపి వాటి మంచి చెడు

చూసుకునేవారు. ఈయన దర్బారు సాయి పాఠశాలలో కొన్ని సంవత్సరాలు విద్యార్థులకు హిందీ బోధించినారు. చాలా సం॥లు దర్గాలో గురువారంనాడు అభిషేకం చేయటానికి స్వామికి చేదోడువాదోడుగా వుండేవారు. స్వామి దర్గాలో అభిషేకం చేసేటప్పుడు చాలా శ్రద్ధగా, ఏకాగ్రతగా వుండేవారు. దర్గా సమీపంలోని బోరుబావి నుండి నీరు తీసుకువచ్చి పెద్దస్వామికి పదిబిందెలు, చిన్నస్వామికి పది బిందెల నీటితో అభిషేకం చేసేవారు. చాలా గురువారాలు భక్తులు ఎవరూ లేకపోయినా కేవలం గుప్తాగారు, స్వామి ఇద్దరు మాత్రమే అభిషేకం నిర్వహించేవారు.

స్వామి సన్నిధిలో వున్నప్పుడు ఒకనాటి రాత్రి ఎడమచేయి మణికట్టు నొప్పి భరించరానిదిగా వుండి నిద్రపట్టలేదు. దర్గా వద్దకు వచ్చి అక్కడ వున్న ఊదీ తీసుకొని గురుస్మరణ చేస్తూ నొప్పి వున్నచోట రుద్దారు. కొద్దిసేపటికి ఆయనకు నొప్పి తగ్గి, చక్కగా నిద్ర పోయారు.

చాలాకాలంగా గుప్తాగారికి బొడ్డుక్రింద భాగంలో నొప్పిగా వుంది. ఒకరోజు నొప్పి బాగా ఎక్కువయ్యి రాయచోటిలో డా॥ రామచంద్రుడుగారి వద్దకు వెళ్ళారు. ఆయన స్కానింగ్ చేసి 'కణితి' వుంది, మందుల వలన తగ్గదు, ఆపరేషను చేయించుకోవాలి' అని చెప్పారు. ఈ విషయమై భయమేసి ఆయన శంకరయ్యతోనూ, గోవర్ధన్‌లతోనూ చెపితే వారు 'మనకు అన్నింటికీ స్వామీజీ దిక్కు కదా! శ్రీ స్వామికి విన్నవించుకో'మని సలహా ఇచ్చారు. ఆయన శ్రీ స్వామికి కణితి గురించి విన్నవించారు. స్వామి బెత్తముతో వీపు పై భాగము నుంచి క్రిందికి రుద్దినారు. "కణితి లేదు, బాధ లేదు, ఏదీ వుండదు" అని ధైర్యం చెప్పినారు. ఆ రోజు నుండీ బాధ ఏమియూ లేదు.ఆయన పూర్తి ఆరోగ్యముతో వున్నారు.

**శరత్‌బాబుగారు** స్వామి దగ్గరగా ఉండి సేవ చేసిన వారిలో ఒకరు. వీరు లక్కిరెడ్డి టి.వి. స్టేషన్‌లో పని చేసారు. స్వామి సాన్నిధ్యంలో వీరికి ఎన్నో అనుభవాలు కలిగాయి. ఒకరోజు రాత్రి స్వామి వద్ద పడుకుని ఉండగా శరత్‌బాబుగారికి గజ్జెల శబ్దం వినపడింది. విస్మయంగా శరత్‌బాబుగారు లేచి తేరిపార చుట్టుపక్కల గమనించి చూడగా, అక్కడ

ఎవరూ కనపడ లేదు. ఇంతలో స్వామి "ఎవరన్నా వచ్చారా నాయనా!" అని అడిగారు. శరత్‌బాబుగారు 'ఎవరూ లేరు స్వామి' అని చెప్పారు. తెల్లవారిన తర్వాత స్వామి మరలా అడుగగా, ఆయన 'గజ్జెల శబ్దం వినపడింది స్వామీ! కానీ ఎవరూ కనపడలేదు' అని చెప్పారు. స్వామి "అందుకే అడిగా నాయనా! అమ్మయ్యే అలా వచ్చి నిన్ను అనుగ్రహించింది" అని చెప్పారు.

ఇంకొకరోజు నిద్రలో ఉన్న శరత్‌బాబుగారికి అకస్మాత్తుగా మెలుకవ వచ్చింది. స్వామి పడుకున్న చోటు నుండి కొంత దూరంలో గోడ వైపు వెలుగు కనపడింది. ఆయన పరిశీలనగా చూడగా, అక్కడ ఒక పెద్దాయన తెల్లటి వస్త్రాలతో పడుకుని ఉన్నాడు. ఆయన వడిలో దర్గాస్వామి చిన్నపిల్లవాడు పడుకున్నట్లుగా ఉన్నారు. ప్రక్కకు తిరిగి చూస్తే స్వామి యధాస్థానంలో పడుకుని ఉన్నారు. కొంతసేపు వెలుగు అలానే ఉంది. శరత్‌బాబుగారు భయం, గగుర్పాటుతో తిరిగి నిద్రపోవటానికి ఉపక్రమించారు. తెల్లవారి జరిగిన విషయం స్వామికి చెపితే "దర్గాలోని పెద్దాయన అలీషావలి వచ్చారు నాయనా!" అని చెప్పారు.

శరత్‌బాబుగారికి ఒకరోజు నడుము పట్టేసింది. ఆ రోజు రాత్రి స్వామి పిలిచినప్పుడు శరత్‌బాబుగారు లేచి నడువలేక దోగాడుతూ వెళ్ళారు. ఇది గమనించిన స్వామి "ఏమయ్యింది నాయనా?" అని అడిగారు. శరత్‌బాబుగారు విషయం చెప్పగా స్వామి ఆయన నడుం మీద తట్టారు. తెల్లవారిన తర్వాత కూడా నొప్పి తగ్గకపోయేసరికి శరత్‌బాబుగారు స్వామికి సరిగ్గా సేవ చేయలేకపోయారు. స్వామి ఆయనిని వెనుకకు తిరగమని చెప్పి, నడుం దగ్గర మరలా తట్టారు. అంతే మరుక్షణంలో అంత నొప్పి పోయింది. శరత్‌బాబుగారు ఇందుమౌళిగారిని అభ్యర్థించి బెంగుళూరు నుండి ఒక ఆయుర్వేద తైలం తెప్పించుకున్నారు. ఆ తైలాన్ని స్వామి వేడి చేయించి శరత్‌బాబుగారి చేతులు, భుజాలు, నడుముకు మర్ధన చేసారు. 'స్వామికి మనం సేవ చేయటం కాదు . స్వామే మనకు సేవ చేస్తున్నారు' అని శరత్‌బాబుగారు తమ స్వానుభవంలో తెలుసుకున్నారు.

ఒక సంవత్సరం శ్రావణ మాసంలో శరత్‌బాబుగారి భార్య వరలక్ష్మి వ్రతం చేయాలనుకోగా, శరత్‌బాబుగారు స్వామిని ఆశీస్సులు కోరారు.

స్వామి "బాబు! నేను చెప్పినట్లు చేస్తావా?" అని మూడు సార్లు అడిగారు. తర్వాత స్వామి "డబ్బులు ఇస్తాను. మీరిద్దరూ బట్టలు తీసుకోండి. నేను పూజకు వస్తాను" అని ఆశీర్వదించారు. శరత్‌బాబుగారు స్వామి వద్ద డబ్బు తీసుకోవటం ఇష్టంలేకపోయినా, స్వామి మాట కాదనలేక ఆయన చెప్పిన ప్రకారం నడుచుకున్నారు. శుక్రవారం రోజు వాతావరణం బాగా మబ్బు పట్టి భారీ వర్షం వస్తుందా అన్నట్లు ఉంది. కానీ చిత్రంగా వర్షం పడలేదు. శరత్‌బాబు గారింట్లో పూజ వారికి తృప్తిగా జరిగింది. పూజకు, పేరంటానికి దాదాపు 80 మంది భక్తులు వచ్చారు. తర్వాత రోజు శరత్‌బాబుగారు ఆశ్రమానికి వెళ్ళగా, స్వామి "పూజ ఎలా జరిగింది నాయనా" అని అడిగారు. శరత్‌బాబుగారు 'బాగా జరిగింది స్వామీ! మీరు వస్తానన్నారు. రాలేదు కదా!' అని నిరుత్సాహంగా చెప్పారు. స్వామి "నేను వచ్చాను కదా! వర్షం రావాల్సింది రాలేదు కదా!" అని ఎరుకపరిచారు.

శరత్‌బాబుగారి అమ్మాయి ఇంజనీరింగ్ చదువు పూర్తి చేసింది. ఆయనకు అమ్మాయి ఒక సంవత్సరం ఉద్యోగం చేసిన తర్వాత పెళ్ళి చేయాలని మనస్సులో అనుకున్నారు. స్వామి మాత్రం "బాబు! అమ్మాయిని ఎమ్.టెక్ చదివించు. ఆమె చదువుకోవాలని కోరిక" అని చెప్పారు. శరత్‌బాబుగారు భార్యతో చర్చించగా ఆమె కూడా ఒక సంవత్సరం ఉద్యోగం చేసిన తర్వాత పెళ్ళి చేస్తే బాగుంటుంది కదా అనే అభిప్రాయాన్ని బలపరిచింది. స్వామి మాత్రం అమ్మాయిని పై చదువు చదివించమని చెపుతూనే ఉన్నారు. కొంతకాలం తర్వాత ఒకసారి శరత్‌బాబుగారి అమ్మాయి స్వామి దర్శనం చేసుకుంది. స్వామి ఆ అమ్మాయితో "అమ్మా! నీకు చదువుకోవాలని ఉంది కదూ?" అని అడిగారు. ఆ అమ్మాయి 'అవును స్వామీ! చదువుకోవాలని ఉంది. కానీ అమ్మ,నాన్నలకు ఇష్టంలేదని నేను బయటకు చెప్పలేదు' అని జవాబు ఇచ్చింది. అప్పటికిగానీ శరత్‌బాబుగారికి తమ కూతురు మనస్సులో ఉన్న విషయం తెలియలేదు. ఇదే విషయం స్వామికి ఎవరూ చెప్పకపోయినా ప్రస్ఫుటంగా తెలియజేసి అమ్మాయి ఇష్టప్రకారం పై చదువులు చదివించారు. తర్వాత స్వామికృప వలన చెన్నైలో ఎంటెక్ సీటు వచ్చి చదువుతోంది.

**ప్రొద్దుటూరు సత్యప్రకాష్‌గారు** స్వామికి సన్నిహితంగా ఉండి సేవ చేసారు. శివప్రసాద్‌గారు, సత్యప్రకాష్‌గారు స్వంత అన్నదమ్ములు. వీరి తండ్రిగారు స్వామికి స్వంత తమ్ముడు. ఆయన కాలం చేసిన తర్వాత వారి అస్తికలను కాశీ క్షేత్రంలోని గంగలో నిమజ్జనం చేయాలనుకున్నారు. స్వామి వద్దకు వెళ్ళి ప్రయాణానికై ఆశీస్సులు అడుగగా, "మీ వెంటే ఉంటాను" అని చెప్పారు. రైలు ప్రయాణంలో వారితో తోడు వెళ్ళిన బంధువులు పండ్ల ముక్కలు తింటూ పేకాట ఆడుతున్నారు. సత్యప్రకాష్‌గారు, వారి అన్న దూరంగా కూర్చుని మాట్లాడుకుంటున్నారు. సత్యప్రకాష్‌గారు స్వామి ఫోను చేయగా "ఏమి నాయనా! వాళ్ళంతా పండ్ల ముక్కలు తింటూ పేకాడుతుంటే మీరు దూరంగా కూర్చున్నారు" అని స్వామి అడిగారు. అది విన్న సత్యప్రకాష్‌గారు చాలా సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. వారు జనవరిలో కాశీ ప్రయాణం చేసారు. ఈ సమయంలో కాశీలో విపరీతమైన చలిగా ఉంటుంది. సత్యప్రకాష్‌గారి బృందం ఆ వాతావరణానికి తగ్గ వస్త్రాలు సర్దుకుని వెళ్ళలేదు. వారు కాశీలో ఉన్న రెండురోజులు చలి పెద్దగా లేక వారికి అసౌకర్యం కలగలేదు. స్వామి ఎల్లవేళలా తమతో తోడుగా ఉన్నారనే భావన ఆయనకు దృఢపడింది. ఈ సందర్భంగా సత్యప్రకాష్‌ని మణికర్ణికా ఘట్టంలో తప్పకుండా స్నానం చేయమని చెప్పారు.

సత్యప్రకాష్‌గారి భార్యపేరు రమాదేవి. ఈ దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు సంతానం. వారు మగపిల్లవాడు కావాలని కోరుకోగా స్వామి "రామేశ్వరంలోని శ్రీ రాముడినిస్తాము. రామనాథం అని పేరు పెట్టండి" అని చెప్పారు. కొంతకాలం తర్వాత రమాదేవిగారు గర్భవతి అయినారు. మూడవనెలలో స్కానింగ్ చేయిస్తే డాక్టర్లు ఆడపిల్ల అని తెలిపారు. అప్పటికే ఇద్దరు ఆడపిల్లలు ఉండటం వల్లనో, స్వామి చెప్పిన వాక్యం మీద పూర్తి నమ్మకం లేకపోవటం వల్లనో రమాదేవిగారు అబార్షన్ చేయించుకుందామనుకున్నారు. కుటుంబసభ్యులు 'స్వామి చెప్పారు కాబట్టి మగపిల్లవాడు పుడతాడు అందువలన అబార్షన్ వద్దని' నచ్చచెప్పారు. కానీ ఆవిడ మెడికల్ రిపోర్టులు తప్పు అవుతాయా? అని చెప్పి ఇంకొక డాక్టర్ దగ్గర స్కానింగ్ చేయించుకుంది. వారు కూడా

ఆడబిడ్డ అని రిపోర్టులో ధృవపరిచారు. అందువల్ల రమాదేవిగారు ఎవరికీ ఇష్టం లేకపోయినా ఆరవ నెల నిండాక అబార్షన్ చేయించుకున్నారు. దంపతులు ఈ విషయం స్వామికి చెప్పలేదు. కొన్నాళ్ళ తర్వాత ఆమె మరలా గర్భవతి అయ్యారు. స్వామికి విషయం తెలియజేయలేదు. కానీ స్వామి అంతకు ముందు చెప్పారు కాబట్టి మగపిల్లవాడు పుడతారనుకున్నారు. కానీ ఆడపిల్ల పుట్టింది. మొదట నాలుగు నెలలు ఆ పాపాయి ఆరోగ్యంగానే ఉంది. కానీ అకస్మాత్తుగా ఐదవ నెల నుండి ఊపిరితిత్తులలో ఇన్‌ఫెక్షన్ వచ్చి చాలా రోజులు ఇబ్బంది పడింది. సత్యప్రకాష్‌గారు ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి వైద్యం చేయించినా ఫలితం లేక ఆ పాపాయి చనిపోయింది. తర్వాత స్వామికి చెపితే "అబార్షన్ చేసి ఒక ప్రాణాన్ని చంపేశారు. ఆడబిడ్డ ఎంత ఖర్చు పెటించాలో అంత ఖర్చు పెట్టించి వెళ్ళింది" అని అన్నారు.

**విశ్వేశ్వరరెడ్డిగారు** 2002లో నీలకంఠరావుపేటలో పశువుల డాక్టరుగా కొంతకాలం పనిచేసారు. వీరు మొదట్లో స్వామి గురించి తెలిసినా, స్వామికి కోపం ఎక్కువని, అరుస్తారని జంకి చాలాకాలం స్వామి దగ్గరకు వెళ్ళలేదు. కానీ తన మిత్రుడు ఆశ్రమానికి వెళుతున్నప్పుడు మొదటిసారి దర్గాలలో స్వామి దర్శనం చేసుకున్నారు. అప్పటినుండి ఆఫీసులో పనిభారం తక్కువగా ఉండటంతో ప్రతిరోజు మధ్యాహ్న ఆరతికి వెళ్ళేవారు. ఇట్లా కొంతకాలం అలవాటు పడిన తర్వాత, స్వామి కూడా అమ్మయ్యతో "పశువుల డాక్టరు వచ్చారా?" అని అడిగేవారు. రెడ్డిగారు స్వామిని ఆఫీసులో పని తక్కువగా ఉందని మదనపల్లికి ట్రాన్స్‌ఫర్ అవ్వాలని కోరుకున్నారు. స్వామి "జరుగుతుంది నాయనా! ఖర్చవుతుంది" అని చెప్పారు. అట్లానే కొన్ని నెలలకి స్వామి చెప్పినట్లు కొంత ఖర్చయ్యి మదనపల్లికి 2003లో ట్రాన్స్‌ఫర్ అయ్యింది.

విశ్వేశ్వరరెడ్డి దంపతులు స్వామిని దర్శించినప్పుడల్లా సంతానం కొరకు ప్రార్థించేవారు. స్వామి "ఇస్తాం నాయనా!" అని చెప్పేవారు. పెళ్ళి అయి మూడు సంవత్సరాలు అయినా పిల్లలు పుట్టకపోయేసరికి హైద్రాబాద్‌లో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. రెడ్డిగారి భార్యకు ఒక ఆపరేషన్ చేసారు. తర్వాత మందులు వాడినా సంతానం కలుగలేదు.

రెండు లక్షలుకు పైగా ఖర్చు అయినా ప్రయోజనం కలుగలేదు.

ఇదంతా అయిన తర్వాత స్వామిని ఒక పర్యాయం దర్శించి సంతానం గురించి అడుగగా స్వామి "ఆపరేషన్ చేసారు కదా నాయనా! బిడ్డలు పుడతారని" చెప్పారు. స్వామికి వారు హైద్రాబాద్‌లో ఆపరేషన్ చేయించిన విషయమే కాక సైన్సు కూడా బాగా తెలుసనని రెడ్డిగారు ఆశ్చర్యపడ్డారు. తర్వాత నాలుగు నెలలకి నా భార్యకు గర్భం నిలబడి 2006లో మగ పిల్లవాడు పుట్టాడు.

రెడ్డిగారు స్వామిని వీలున్నప్పుడల్లా దర్శిస్తూ, 2009లో ఒక పాప కావాలాని అడిగారు. స్వామి "మీ ఆవిడని శ్రీ రామనవమికి తీసుకురా! ఇస్తాము" అని అన్నారు. అదే మిషతో శ్రీ రామనవమికి రెడ్డిగారు భార్యతో కలసి వెళితే స్వామి "పిలిస్తే కానీ నీ భార్యను తీసుకురావా" అని చురక వేసి "పాపను ఇస్తాము" అని చెప్పారు. అలానే కొన్ని నెలలకు రెడ్డిగారి భార్య గర్భం ధరించింది. స్వామిని దర్శించి విషయం చెపితే స్వామి "చెప్పాను కదరా! నీకు అమ్మాయి పుడుతుంది" అని చెప్పారు. కానీ రెడ్డిగారి భార్య ముఖంలో కళను బట్టి అందరూ బాబు పుడతాడు అనుకున్నారు. కానీ స్వామి చెప్పినట్లు ఆడబిడ్డ పుట్టింది.

మరలా కొన్ని సంవత్సరాల తర్వాత స్వామిని ఆశ్రయిస్తే " ఇస్తాము. నీ భార్యను శ్రీరామనవమికి తీసుకురా!" అని చెప్పారు. స్వామి మాట ప్రకారం రెడ్డిగారు తన భార్యని స్వామి దర్శనానికి తీసుకువెళ్ళితే, స్వామి వారిని ఆశీర్వదిస్తూ రెడ్డిగారితో "ఏమిరా! పిలిస్తే కానీ నీ భార్యను తీసుకురావా?" అని మందలింపుగా అడిగారు. స్వామి చెప్పిన విధంగా నడచుకున్న తర్వాత కొద్ది కాలానికే ఆయన భార్యకు గర్భం నిలబడి వారికి పాప జన్మించింది.

రెడ్డిగారు దర్శనం చేసుకున్నప్పుడల్లా చాలా సంవత్సరాలు స్వామి "నీకు ఇద్దరు పిల్లలు కదరా! ఇప్పటికైనా నమ్మకం కుదిరిందా" అని చురక వేసేవారు. రెడ్డిగారి పాప పుట్టినప్పటినుండి మంచం మీద కూడా పడుకోకుండా ఎవరో ఒకరు ఎత్తుకోవాల్సి వచ్చేది. తెల్లవారుఝామున పట్టే గాఢనిద్రలో తప్ప మిగిలిన సమయంలో ఉయ్యాలలో కానీ మంచం మీద కానీ పడుకోబెడితే వెంటనే నిద్ర లేచేది. పాపకు మూడవ నెలలో

ఒకసారి స్వామి దర్శనానికి వెళ్ళినప్పుడు స్వామి పాపను ముట్టుకుని ఆశీర్వదించారు. అప్పటినుండి వారి పాప నేలమీద పడుకోబెట్టినా ఏడవక హాయిగా నిద్రపోయేది. స్వామి స్పర్శలో ఎంతటి మహత్తు ఉన్నదో కదా!

నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం అప్పారావుపాలెం నివాసి **గంగవరపు ప్రసాద్** ఇండియాలో విద్యాభ్యాసం పూర్తి చేసాడు. అనంతరం అమెరికా వెళ్ళి, అక్కడే స్థిరపడి, చాలా సంవత్సరాలుగా అక్కడే ఉద్యోగం చేస్తున్నాడు. వీరి పూర్తి కుటుంబం దాదాపు 20 సంవత్సరాలు పైబడి దర్గాస్వామివారియందు విశ్వాసం కలిగి శ్రద్ధాభక్తులతో కొలుస్తున్నారు. వీరి కుటుంబం తమ గ్రామంలో ఒక సాయి మందిరాన్ని నిర్మించారు. 2002 ఫిబ్రవరి మాసంలో ప్రసాద్‌గారి గ్రామంలో సాయిమందిర ప్రతిష్ఠాపన కార్యక్రమానికి స్వామి వెళ్ళారు. ఈ సందర్భంగా ప్రసాద్ భార్య గర్భవతి అని తెలుసుకుని స్వామి "నార్మల్ డెలివరీ అవుతుంది" అని ఆశీర్వదించారు. గంగవరపు ప్రసాద్‌గారి భార్య మొదటి కాన్పుకి ఆపరేషన్ చేసారు. సాధారణంగా మొదటి కాన్పుకి ఆపరేషన్ చేస్తే తర్వాతి కాన్పులన్నీ ఆపరేషన్ ద్వారానే చేయాలని డాక్టర్లు సూచిస్తారు. ప్రసవ వేదన వల్ల ఇంతకు ముందు వేసిన కుట్ల వద్ద ఒత్తిడి పడి కుట్లు తెరుచుకునే ప్రమాదం కలగవచ్చని డాక్టర్లు నార్మల్ డెలివరీ జరపటానికి ఇష్టపడరు. ప్రసాద్ దంపతులు మాత్రం డాక్టర్‌తో మా గురువుగారు సుఖ ప్రసవం అవుతుందని చెప్పారు అందువలన ఆపరేషన్ వద్దని ఖచ్చితంగా చెప్పారు. డాక్టర్ వారు కోరుకున్నట్టు నార్మల్ డెలివరీ చేసాడు. స్వామి చెప్పినట్లే ప్రసాద్‌గారి భార్యకు 2002 సెప్టెంబర్ మాసంలో సుఖప్రసవం అయ్యింది. ప్రసాద్ దంపతులకు ఇద్దరు మగపిల్లలు సంతానం.

ప్రసాద్‌గారు 2005వ సంవత్సరంలో కుటుంబసమేతంగా ఒక పర్యాయం ఆశ్రమానికి వెళ్ళినప్పుడు రాత్రి నిద్ర చేసినారు. ఆశ్రమం వెనుకాల ఉన్న స్కూలు గదిలో వారంతా నిద్రించారు. ప్రసాద్‌గారికి తెల్లవారుతుండగా ఉదయం 4 గంటల ప్రాంతాల్లో మెలుకవ వచ్చి లేచి కూర్చున్నారు. ఇంతలో ఒక జ్యోతి ఆయన ఎదురుగా కనపడి కదులుతూ ముందుకు వెళ్ళిపోయింది. ఇది ప్రసాద్‌గారికి ప్రత్యక్షంగా

కంటికి కనపడింది. తదుపరి ఉదయం ఆరతిలో స్వామి ఎవరికైనా దర్శనాలుకానీ, స్వప్నాలుకానీ వచ్చినాయా అని అడిగారు. సాక్షాత్తు అమ్మయ్యగారే ఆ జ్యోతిరూపంలో దర్శనమిచ్చారని ప్రసాద్‌గారి దృఢవిశ్వాసం.

2016వ సంవత్సరంలో ప్రసాద్‌ను కంపెనీవారు ఉద్యోగం నుండి తొలగించారు. అమెరికాలో ఇది సాధారణం. ఉద్యోగం పోయినాక దాదాపు సంవత్సరంపాటు ఖాళీగా ఉండవలసి వచ్చింది. ప్రసాద్ శక్తిమేరకు ప్రయత్నించినా ప్రయోజనం కలగలేదు. అతను స్వామిని ఆశ్రయించి పరిస్థితి చెప్పుకున్నాడు. స్వామి "ఒక నెలలో ఉద్యోగం వస్తుంది, ధైర్యంగా ఉండు" అని ఆశీర్వదించారు. ప్రసాద్ రెండు మూడు చోట్ల అప్లై చేసినాడు. స్వామి చెప్పిన ప్రకారం 30వ రోజు సాయంత్రం ఇంటెల్ కంపెనీ వారి నుండి ఇంటర్వ్యూకి పిలుపు వచ్చింది. ప్రసాద్ ఆ కంపెనీ వారి ఫార్మాలిటీల ప్రకారం నడుచుకున్నాక ఉద్యోగం ఇచ్చారు. స్వామి చెప్పినట్లుగా ఒక నెలలో ఉద్యోగం వచ్చింది.

**బీరం శివరామిరెడ్డిగారు** కడప ప్రభుత్వ కళాశాలలో హిందీ ఉపన్యాసకులుగా పనిచేసి 2011వ సంవత్సరంలో పదవీ విరమణ చేసారు. 2000వ సంవత్సరం నాటికి ఆయన హేతువాది, నాస్తికుడు. వ్యక్తిగత జీవితంలో కొన్ని వ్యసనాలు కూడా ఉన్నాయి. ఆయనకు ఆ సంవత్సరం దసరా పండుగ నుండి ఊహించని రీతిలో మనస్సు విరక్తమై ఆత్మహత్య చేసుకోవాలనే భావన కలిగింది. ఆకలి సరిగ్గా ఉండేది కాదు. తినడం, త్రాగడం, నిద్రపోవటం దీనికేనా జీవితం? దీనికన్నా చనిపోవటం మేలనే భావన ఆయనను మానసికవ్యధకు గురిచేసేది. ఆయన ఈ మనోభావాలు ఎవరితో పంచుకోక ఒంటరిగా ఉండేవారు. పరిస్థితి గమనించిన ఆయన శ్రీమతి దర్గాస్వామివారి దర్శనానికి వెళదామని ఎంతో నచ్చచెప్పారు. శివరామిరెడ్డిగారు చాలాకాలం తాత్సారం చేసినాక 2001 జనవరి 7వ తేదీ ఉదయం సుమారు 10గంటలకు శ్రీ దర్గాస్వామివారిని మొదటిసారి దర్శించుకున్నారు. ఆయన స్వామికి తన మానసికస్థితి బాగులేదని చెప్పారు. స్వామి తమ దండంతో ఆయన

తలభాగం నుండి వెన్నుముక్క మీదుగా నడుము క్రిందదాకా రుద్ది “నీకు జబ్బు ఏమీ లేదు. నీవు ‘పంచాక్షరీ మంత్రం’ కానీ ‘ఓం నమో గురుదేవ’ అని కానీ జపిస్తూ ఉండు. అన్నీ చక్కపడతాయి” అని చెప్పి “1957లో పిలిస్తే ఇప్పుడు పలికావా?” అన్నారు. అప్పటికి శివరామిరెడ్డిగారికి ఆ మాట అర్థం కాలేదు. కానీ కొంతకాలం తర్వాత అది జన్మజన్మల గురుశిష్య సంబంధం అని అర్థం చేసుకున్నారు. అప్పటినుండి ఆయనలో ఆధ్యాత్మిక చింతన ప్రారంభమై సర్వం గురుమయంగా తోచసాగింది. తర్వాతికాలంలో ఆయనకు స్వామి సాంగత్యంలో ఎన్నో అనుభవాలు, అనుభూతులు, మహాత్ముల దర్శనాలు కలిగినాయి. స్వామి అనుగ్రహంతో ఆయన వృత్తిలోనే కాకుండా, సమాజసేవలో కూడా పాల్గొంటూ సేవ, త్యాగం అనే భావాలను అభ్యసిస్తూ సాగుతున్నారు. ఈ విధంగా స్వామి దర్శనం, సాంగత్యంతో శివరామిరెడ్డిగారి జీవితంలో ఎంతో మార్పు వచ్చింది.

ఈ పై అనుభవం చదవటానికి సామాన్యంగా ఉన్నా దీనిలో సూక్ష్మమైన అంశం ఉంది. ఒక నాస్తికుడైన వ్యక్తిని ఆస్తికునిగా మార్చాలంటే చాలా పెద్ద ప్రక్రియ. ఆ వ్యక్తి యొక్క విశ్వాసాన్నికానీ, అభిప్రాయాన్నికానీ మార్చాలంటే ఎన్నో సంవాదాలు, నచ్చచెప్పే ప్రయత్నము చేయాలి. కానీ పై అనుభవాన్ని చదివితే శివరామిరెడ్డిగారి అంతర్గతభావన వల్ల మార్పు చెందినట్లు తెలుస్తుంది. ఇది శ్రీ దర్గాస్వామివారి దగ్గర గమనించదగ్గ విలక్షణ పద్ధతి. ఎప్పుడన్నా, ఎవరన్నా భక్తునిలో మార్పు తీసుకురావాలంటే స్వామి అటువంటివారికి అంతర్గతంగా ప్రేరణ చేసి మార్పు తీసుకువచ్చేవారు. బాహ్యంగా భక్తునికి ఉపన్యాసంకానీ, వాదించి నచ్చచెప్పటంకానీ ఎప్పుడూ చేయలేదు.

శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయినాథాయ నమః

# దైవం మానుష రూపేణ

## అధ్యాయము - 11

## స్వామి సూక్తులు

స్వామి రెండు నిమిషాలకు మించి ఏదైనా ఒక విషయాన్ని గూర్చి మాట్లాడటం అరుదు. ఎప్పుడైనా మాట్లాడినా కూడా ఎక్కువ భాగం తమ ఆధ్యాత్మిక సాధనా సమయంలోని అనుభవాలని నెమరువేసుకునేవారు. ప్రత్యక్షంగా భక్తులకు ఆధ్యాత్మిక విషయాన్ని బోధించినట్టుగా చెప్పటం చాలా అరుదు. స్వామి తరచూ బోధించి, క్లుప్తంగా వున్న, కొన్ని విషయాలను సేకరించి ఈ అధ్యాయంలో క్రింద పొందుపరుస్తున్నాము.

■ గుండు సూది మొనపై నృత్యం చేయడం కంటే గురువుసేవ చేయడం కష్టమైన పని.

■ వందమంది గురువులకు శిష్యుని క్రింద ఉండవచ్చు కానీ ఒక్క వ్యక్తికి గురువుగా ఉండటం చాలా కఠినమైన విషయం.

■ పాలలో నెయ్యి ఉంది కానీ తీసి పెట్టాలంటే వీలు అవుతుందా? పాలలో ఒక్క మజ్జిగ చుక్క వేయాలి. పాలు మనస్సుకు ప్రతిరూపం. విచారజ్ఞానం మజ్జిగ చుక్కకు సంకేతం. విచార జ్ఞానం చేత ఆలోచించాలి. అప్పుడు మనలో ఆత్మస్వరూపాన్ని లేక సత్యస్వరూపాన్ని తెలుసుకోవచ్చు. ఇటువంటి ప్రక్రియ మనస్సుకు అవసరం.

■ భగవంతుని వద్ద 10 నిమిషాలు స్థిరముగా కూర్చోలేని వాడికి బ్రహ్మజ్ఞానం ఎవరు ఇస్తారు.

గమనిక: మన దినచర్య ఎంత ఒత్తిడిగా ఉన్నా సృష్టికర్తను ఉదయం, సాయంకాలం కనీసం ఒక్క రెండు నిమిషాలు కృతజ్ఞతతో స్మరణ చేసుకుని, రెండు ఊదిబత్తులు పెట్టమని చెప్పేవారు.

■ శరీరము మట్టిలో కలిసినప్పుడు గంధం వాసన రావాలి. వాడే సాధకుడు.

■ ప్రపంచంలో ఎక్కడ చెడిపోయినా, గురువు దగ్గర బాగుపడగలడు.

కానీ గురువు వద్ద వుండి చెడిపోయినవాడు ఎక్కడికి పోయినా బాగుపడలేడు.

■ పుస్తక పఠనం విజ్ఞానాన్ని మాత్రమే ఇస్తుంది. ఆచరణ అనే క్రియ జ్ఞానాన్ని కల్గిస్తుంది.

■ కదిలే సూదిలో దారం ఎక్కించలేము. స్థిర చిత్తము లేనివాడికి గురువు కడు దుర్లభం.

■ కాలింగ్‌బెల్ ఎప్పుడూ ఆడుతుండాలి అని నాలికను వ్రేలితో చూపారు. నోట్లో నామం ఆడుతూ వుండాలి, అప్పుడు ముళ్ళు (మన ఇష్టాయిష్టాలు) పోతాయి. కాలింగ్ బెల్లు ద్వారా ఇంటిలోని వారిని ఎలా పిలుస్తామో, నీలోని భగవంతుడిని అలా బెల్‌తో పిలిస్తే, సేవకుడై సేవ చేస్తాడు.

■ జీవితం సమస్యల నిలయం. వాటిలో కొన్ని పరిష్కరించబడతాయి. కొన్ని పరిష్కరించబడవు. కానీ ఎల్లప్పుడూ సాయి నామస్మరణ చేస్తూ ఉంటే వాటికవే దూరమవుతాయి.

■ శమము దమములతో లయము అయినవాడే దైవీ సంపదకు వారసుడు.

■ ఎంతటి బాధలో ఉన్నా దర్గామాత రూపంలో సమాధి చెంది ఉన్న జగన్మాత దర్శనంతో సుఖసంపదలు పొందగలవు.

■ ఆకలి లో నుంచి 'ఆ' కారం తీసేస్తే మిగిలింది 'కలి'. అంతా కలి మాయ. లేనిది వున్నట్లు, ఉన్నది లేనట్లు కనిపించేది. దీన్ని తెలుసుకుంటే మిగిలినది ఆ జగన్మాతనే. ఆ జగన్మాతే దర్గామాత!

■ మనస్సు నిలకడ చేసి నీలో వున్న సత్యమే అందరిలోనూ ఉన్నదని తెలుసుకొని ఎదుటిప్రాణిని నొప్పించకుండా వుండాలి.

■ డూ వాట్ ఐ సే : డోన్ట్ డూ వాట్ ఐ డూ

■ నమ్మకమే గురువు

■ అనుభవమే గురువు

గమనిక: పైరెండు వాక్యాలు సమన్వయం చేసుకుంటే చాలా శక్తివంతమైన భావం కనపడుతుంది. సాధారణంగా ప్రతిమానవుడు ఏదో ఒకరూపమందుగానీ, విషయమందుగానీ నమ్మకమూ/విశ్వాసమూ కలిగి

వుంటాడు. ఆ నమ్మకానికి ప్రమాణం ఏమిటి అంటే అతనిలో కలిగిన అనుభవం / అనుభూతి మాత్రమే.

- సప్తకోటి మహా మంత్రాలకన్నా గురునామము గొప్పది
- ఆలోచనే శత్రువు
- "సద్గురుదేవా!, సద్గురుదేవా" అంటూ  వంట చెయ్యండి. తినేవారికి బలము, తేజస్సు వస్తాయి.
- కరుణ, ప్రేమ ఉంటే సాయినాథుడు చేతిలో ఆడుతూ ఉంటారు.
- I am always with you; not seperate from you.
- Body is different, only one is acting
- ఒక్క పావలా నీవు సంపాదించుకో. నేను ముప్పావలా ఇస్తాను
- రాయి దొర్లంగా దొర్లంగా గుండ్రాయి అవుతుంది కానీ ఊరికే కాదు (జీవుడు జన్మ పరంపరలో సాధన చేయగా చేయగా ముక్తుడవుతాడని సూచనగా చెప్పిన వాక్యమిది).
- పని చేస్తున్నామని అహంకరించకు. ఆ పని పరమాత్ముని సేవగా భావించు.
- విన్నవాడి కన్నా కన్నవాడు గొప్ప. కన్నవాడి కన్నా కలియువాడు అధికుడు. (వినేవాడు చెవులు. కన్నవాడు కళ్ళు. కలియువాడు జీవుడు)
- సూత్రం (శ్వాస) మీదనే కలరు చుట్టాలు.
- తల్లిదండ్రులు - తల్లి అనగా నీ చూపు. తండ్రి అనగా నీ శ్వాస. ఈ రెండింటి కలయికే యోగం

శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయినాథాయ నమః

# దైవం మానుష రూపేణ

## అధ్యాయము - 12
## స్వామి బోధ

"సాయి సూక్తులు కేవలం మనస్సుకు అర్థమయ్యే పదజాలమూ, శబ్దజాలమూ మాత్రమే కాదు. అవి మహా మంత్రాలు, నిరంతర ఆత్మనిష్ఠయందు నిలిచియుండే ఆత్మవేత్తల వాక్యాలు అట్టి అతీత తపశ్శక్తి చేత ఉత్తేజితమై ఉంటాయి. ఆ వాక్యాలకు అర్హులైన వారి హృదయాలపై మనస్సుకూ, బుద్ధికీ అతీతమైన ప్రభావముంటుంది. మనస్సు, బుద్ధి ఏ ఆత్మనుండి ఉద్భవిస్తాయో అట్టి మూలమైన చైతన్య క్షేత్రంలోనే ఒక విశిష్టమైన జాగరణను కల్గించగలవు. కనుక మహనీయుల వాక్యాలన్నీ శృతులే, శృతులలా ఏర్పడినవే. వాటిని అధ్యయనం చేయడం, మనన నిధి ధ్యాసలను సలపడం ఆత్మప్రాప్తికావశ్యకం"- ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

స్వామి వాక్కు ద్వారా చేసిన బోధ చాలా తక్కువ. ఆయన ఆచరణకు ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చేవారు. ఆశ్రమంలో చేసే చిన్న పనులను కూడా నిశితంగా గమనించి భక్తులను సంస్కరించారు. స్వామి తమ సమక్షంలో, జరుగుతున్న నిమిషంలో జాగరూకతతో నడుచుకునేటట్టు నేర్పేవారు. ఒక క్షణం వెనకపడ్డా, తొందరపడ్డా మనం జరిగిపోయిన కాలంలో గానీ, జరగబోయే కాలంలో గానీ ఉన్నట్టు. సాధకుడు ఎల్లవేళలా జరుగుతున్న క్షణాన్ని ఒడిసిపట్టి, సవ్యమైన ఆచరణతో నడవాలి.

అట్లాగే స్వామి ఎప్పుడూ కూడా వ్యక్తిగతంగా బోధించి, సంస్కరించి, ఆచరింపచేసినారు. ఒక సమూహంగా బోధించింది చాలా అరుదు. సాధకుడు పరిశీలనాపరుడిగా ఉండి, సూక్ష్మంగా పరిసరాలను గమనించుకుంటూ, చుట్టుప్రక్కలవారితో సహకారంగా ఉండి, జరుగుతున్న నిమిషంలో నడవటాన్ని నేర్పారు.

బెంగుళూరు గొర్తి సాయిశివ స్వామిని అడిగి నేర్చుకున్న విషయాలు:
**ప్రశ్న:** స్వామీ! మేము ఏం చేస్తే, ఏ విధంగా నడుచుకొంటే మీకు తృప్తి కలిగించగలుగుతాము?
**స్వామి:** మనసు నిలకడ చేసి ఏకాగ్రతతో నీలో వున్న సత్యమే అందరిలోను, అంతటా ఉందని తెలుసుకుంటే అందరికీ తృప్తిగా ఉంటుంది. నాకూ ఎంతో తృప్తిగా ఉంటుంది.
**ప్రశ్న:** స్వామీ! మీరు నాలో ఉన్నదే - అందరిలోనూ ఉందన్నారు కానీ నాకు అనుభవంలో తెలియటం లేదు
**స్వామి:** పాలను చూస్తూ వెన్న ఎక్కడుంది? నెయ్యి ఎక్కడుంది అంటే ఎక్కడుంటుంది? పాలను పెరుగు చేసి, పెరుగును చిలికితే వెన్న కనిపిస్తుంది. అదే విధంగా మనసు నిలకడ చేస్తే, ఏకాగ్రతతో నీలో వున్న సత్యం తెలుస్తుంది. ముందు నీలో ఉన్న సత్యం తెలిస్తే తరువాత అంతటా ఉన్నది తెలుస్తుంది. నామస్మరణ చేస్తే మనసు నిలకడవుతుంది. పిలిచిన తక్షణమే (నామం ఉచ్ఛరించిన వెంటనే) **సద్గురువే మనకు సరెండర్ అయి మన చెంత ఉంటారు**. ప్రేమతో నామస్మరణ చేయి.
**ప్రశ్న:** స్వామీ! తపస్సంటే ఏమిటి?
**స్వామి:** తపస్సంటే కూర్చొని చేసేది కాదు. నోటినుండి పొరపాటున కూడా కఠినమైన, పరుషమైన మాటలు రాకూడదు. ఇతరులను నొప్పించకుండా, మృదు-మధురమైన మాటలే రావాలి. ఎదుటివాడు మనల్ని చెంపమీద కొట్టినా పరుషమైన వాక్యాలు రాకూడదు. మాట్లాడేముందు ఆలోచించి మాట్లాడాలి. అందరిలోనూ, నీలోనూ ఒక్కటే సత్యం పని చేస్తోంది. ఎదుటి వారిలో కూడా అదే సత్యం ఉంది. ఇది గుర్తించి తగు విధంగా మనస్సు, వాక్కు, పని మూడు ఒక్కటిగా నడుచుకోవటం. (ఈ సూత్రానికి అనుగుణంగా శరీరాన్ని, అన్ని అవయవాలనూ అదుపులో ఉంచుకోవడం)

సాయిశివ తన ఉపనయనం అయిన తర్వాత స్వామి వద్దకు వెళ్ళినప్పుడు "ఈ శరీరం నువ్వు కాదని, ఈ దేహాన్ని ఉపాధిగా చేసుకొని ఉంటున్న సత్య స్వరూపమయిన పరమాత్మే నువ్వని చెప్పారా?" అని అడిగారు.

సాయిశివ స్వామితో 'సుబ్బరామయ్యగారు మీ చరిత్ర సంకలనం చేస్తున్నారు. మీ చిన్ననాటి వివరాలను మిమ్ముల్ని అడిగి తెలుసుకోమన్నారు' అని అభ్యర్థించాడు. స్వామి ఈ విధంగా చెప్పారు: "నా గురించి చెప్పుకోవడానికి ఏముంది? అసలు నేను ఎవరు? హూ యామ్ ఐ? నేను అంటే ఈ కాళ్ళు, చేతులు, కన్ను, ముక్కు వున్న శరీరమా? ఏ మహాత్ముడైనా తన గురించి తాను చెప్పుకోడు. ఆ సద్గురువే నాలో వుండి ఆడిస్తున్నాడు. ఇంతకు ముందు ఎవరైనా తన దగ్గర ఏమైనా పెట్టి ఉంటే వాళ్ళను ఆ సద్గురువే నా వద్దకు పంపుతున్నాడు. ఆయనే నా ద్వారా వారికి చెపుతున్నాడు. నా గురించి చెప్పుకోవటానికి ఏమీ లేదు. **ఐ యామ్ హిజ్ సర్వెంట్**."

జి. సూర్యప్రకాశరావు గారికి స్వామి వ్రాసిన జాబు:

చిరంజీవి సూర్యప్రకాశరావుగారికి శ్రీ సద్గురు దర్గాస్వామీజీ హృదయ పూర్వక ఆశీర్వాదములు. నీ మనస్సులో ఏది సంకల్పించినా ఆ పని కానప్పుడు మనస్సుకు వికల్పము కలిగి అదే చింతలో వుంటాము. మనస్సులో అర్థంలేని భావనలు వచ్చి తలనొప్పి ఉంటుంది. **నీకు నచ్చిన రూపము వుంచుకొని ఆ రూపములో వున్నవారి పేరు మాటిమాటికి ధ్యానించిన ఏకాగ్రత వచ్చి మైమరచగలవు గదా!** సుషుప్తి వచ్చి సుఖనిద్ర పట్టును. మాత్రలు పూర్తిగా విసర్జించి ధ్యానించి తరించేది. చిరంజీవి! మీకు మా హృదయపూర్వక ఆశీర్వాదములు. ఇంతే సంగతులు

శ్రీ సద్గురు దర్గాస్వామీజీ

ఒక భక్తుడు తన సాధన, భవిష్యత్తును గురించి అడిగినదానికి స్వామి ఈ క్రింది విధంగా సమాధానం ఇచ్చారు.

"సోదరా! పట్టుదల, శ్రద్ధ, నిష్టతో మీకు నచ్చిన పద్ధతిలో ఇష్టమైన రూపము, నామమును సాధన చేసి జీవితములో సర్వేశ్వరుని సన్నిధి చేరటానికి మనస్సును కుదుటపరచి ప్రార్థించి తరించేది. సదా మిమ్ముల్ని నడుపుతున్న వానిని గుర్తించి జన్మ సార్థకము చేసుకునేది".

ఒకరోజున రిటైర్డు హెడ్మాష్టరు కావలి రంగారావుగారు శ్రీ స్వామివారి సన్నిధిలో జపం చేస్తున్నారు. లెక్క కొరకు జపమాల చేతిలో ఉంది. జపం చెయ్యడం అయ్యాక శ్రీ స్వామివారు ఆయనను పిలిచి ఎంత జపం చేశావని అడిగారు. ఆయన జపమాల సహాయంతో చేసారు గనుక ఇంత సంఖ్య అని చెప్పారు. వెంటనే శ్రీ స్వామి "అది జపమే కాదు. జపానికి ఎప్పుడూ లెక్క వుండకూడదు. అలాగే ప్రదక్షిణలు చేసేవారు కూడా లెక్కపెట్టి చేయడం తప్పు" అని చెప్పారు.

ఒకరోజు ఒక తల్లి, తన కోడలుతో స్వామి వద్దకు వచ్చి తన కొడుకు రోజూ రెండు సీసాలు మందు త్రాగుతాడని, అతని త్రాగుడు మాన్పించమని కోరింది. దానికి స్వామి "ఆ త్రాగుడు మానాలి అనుకున్న వ్యక్తే తమ వద్దకు వస్తే దర్గాల వద్ద తీర్థం ఇస్తాము. అది తీసుకుంటే త్రాగుడు క్రమంగా పోతుంది. ఒకసారి దర్గాలోని మహాత్ముల ముందు ఇక త్రాగను అని ప్రమాణం చేసి తీర్థం తీసుకున్నాక మరలా త్రాగితే వాంతులు, బేదులు అవుతాయి. దానికి సిద్ధపడితేనే రమ్మను. లేకుంటే వద్దు" అని చెప్పి పంపించి వేశారు.

పై చెప్పిన విధంగా స్వామి ఎందరికో త్రాగుడు మాన్పించినారు. ఎవరికైనా తమ బలహీనతలను తొలగించుకోవాలని కోరిక, చేతనైన ప్రయత్నం వుంటే స్వామికృప త్వరగా అనుభవమవుతుందని తెలుస్తోంది.

ఒకరోజు దమ్మపేట వాస్తవ్యురాలు ఒకావిడ ఆశ్రమానికి వచ్చింది. ఆవిడ 'స్వామీ! సాయినాథుడు సర్వసమత్వ భావన కలిగినవాడు కదా! ఆయనకు రకరకాల ఖాద్యపదార్థాలతో నైవేద్యాలు పెట్టాలా? నేను మానవ పురీషము సమర్పిస్తాను. సాయినాథుడికి నైవేద్యం చేస్తారా?' అని అడిగింది. స్వామి తడుముకోకుండా "తల్లీ! పరమాత్మ అనువాడు మనలోని భావనకు ప్రతిరూపం. నేను నిరభ్యంతరంగా నివేదన చేస్తాను. కానీ మొదటి ప్రసాదంగా నీకే పెడతాను. స్వీకరించగలవా?" అని అడిగారు. తరువాతి కాలంలో ఆవిడ కుటుంబం చాలా ఇబ్బందులు పడ్డారు. మహాత్ముల దగ్గర విశ్వాసం లేకపోతే మౌనంగా ఉండటం శ్రేష్టం. ఆకతాయి వేషాలు వేస్తే నిప్పుతో చెలగాటం చేసినట్లు వుంటుంది.

స్వామి చిద్రూపానంద చిన్మయామిషన్‌లో పనిచేస్తూంటారు. ఒకసారి స్వామి నెల్లూరు శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమం దగ్గర చిద్రూపానంద చేయి పట్టుకుని "నాయనా! వెంకయ్యస్వామిని చూద్దాం రా!" అని సమాధి మందిరంలోకి తీసుకువెళ్ళారు. ఈ విషయం జరిగిన చాలా సంవత్సరాల తర్వాత ఆయన చెప్తూ 'స్వామి నన్ను వెంకయ్యస్వామి సమాధి చూద్దాం రా! అని కాకుండా వెంకయ్యస్వామిని చూద్దాం రా!' అని తీసుకువెళ్ళారు. దీనివల్ల ఆయన మహాత్ముల సమాధి మందిరాలను దర్శిస్తున్నప్పుడు సాక్షాత్తు ఆ మహాత్ములను దర్శిస్తున్నట్లుగా భావించాలని తెలుసుకున్నారు.

■ ఒకరోజు దమ్మపేట మోహనరావుగారి స్వప్నములో స్వామి కన్పించి " మోహనా వచ్చినావా! నన్ను దర్గాల దగ్గరకి ఎత్తుకుని తీసుకువెళ్ళు. దీపం పెట్టాలి" అన్నారు. స్వామికి ఆరోగ్యం బాగుండకపోయినా నిత్య కార్యక్రమము చేస్తున్నారు. మోహనరావుగారికి ఆరోగ్యంగా వున్నా సేవ చేయడం లేదని హెచ్చరించినట్లుగా తోచింది. ఈ స్వప్నం తర్వాత ఆయన సాధన సజావుగా జరగసాగింది. చిన్న చిన్న అడ్డంకులను సాకుగా తీసుకుని నిత్యకృత్యాన్ని మానివేసే సామాన్యులకు ఈ బోధ ఆత్మవిమర్శకు చక్కగా ఉపయోగపడుతుంది.

■ ప్రదక్షిణ చేసేటప్పుడు త్వరత్వరగా నడువరాదు. భూదేవికి దెబ్బ తగలని విధంగా, నెమ్మదిగా, ఏకాగ్రతగా ప్రదక్షిణ చేయాలి. ఆ పరమాత్మను స్మరించే అవకాశమిచ్చినందుకు కృతజ్ఞతాభావనతో నడవాలి. భావనే ప్రధానం కానీ ప్రదక్షిణల సంఖ్య అనేది ప్రధానం కాదు. ఇది శ్రీ వెంకయ్యస్వామి క్లుప్తంగా చెప్పిన "ఒక్క చుట్టే గదయ్యా" అన్న మాటలాగానే వున్నది.

■ ఒకసారి దర్గాల దగ్గర దీపం పెట్టేటప్పుడు శంకరయ్య కబుర్లలో పడిపోయాడు. స్వామి దగ్గరకి వచ్చిన తర్వాత "దీపం పెట్టేటప్పుడు మాట్లాడకుండా, మనస్సును ఏకాగ్రత చేసి ప్రార్థనాపూర్వకంగా చెయ్యాలని ఎన్నిసార్లు చెప్పాలిరా" అని కోప్పడ్డారు.

■ టెంకాయ కొట్టేటప్పుడు నీరు చెంబులోకి పట్టవద్దు. భూదేవిని

త్రాగనివ్వండి. కొబ్బరంతా మనమే తింటిమి, నీళ్ళన్నీ మనమే త్రాగుతుంటిమి. ఆ కాయను ఇచ్చిన భూమాతకేమిస్తున్నాము? కాయలిచ్చినందుకు అన్ని టెంకాయ నీళ్ళయినా ఇవ్వవద్దా?

గమనిక: దర్గాల్లో టెంకాయని కొట్టేవారికి "నీటిని భూదేవికి వదిలెయ్యండి. వర్షాలు పుష్కలంగా పడతాయి" అని స్వామి చెప్పేవారు. జాగ్రత్తగా ఆలోచిస్తే పై పనిలో కొబ్బరి, నీరు మనమే స్వీకరిస్తే పూర్తిగా స్వార్థమౌతుంది. స్వామి చెప్పిన విధంగా చేస్తే మనం చేసే పనిలో కొంత పరోపకారం నేర్చుకునే అవకాశం ఏర్పడుతుంది.

■ గురువు అంటే అంగడిలో దొరికే వస్తువు కాదు. అలా అయితే అందరూ రూపాయలు ఇచ్చి కొనుక్కుని చంకలో పెట్టుకు తిరుగుతారు. గురువు నిరంతరం మనలోనే వుండి అంతర్వాణిగా చెపుతూ వుంటారు. గురువు కోసం వెతకడం, పాలను చేతిలో పట్టుకొని వెన్న కోసం తిరగడంలా వుంటుంది . ఒకతను నోటిలో సిగరెట్టు పెట్టుకుని చేతిలో దీపం పట్టుకొని అగ్గిపెట్టె కోసం నాలాంటి ముసలతని దగ్గరకి వచ్చి అగ్గిపెట్టె అడుగుతున్నాడట. అప్పుడా ముసలతను నీ చేతిలో వున్న దీపంతో వెలిగించుకో అని చెప్పాడట. గురువు కోసం వెతకటం అలా వుంటుంది.

■ మనం తినే ఆహారాన్ని సద్గురువే చైతన్యరూపంలో మన లోపల ఉండి జీర్ణం చేసి, అవయవాలన్నింటికీ శక్తినీ, బలాన్నీ, తేజస్సునూ ఇస్తున్నారు. మనలో గుణమూ, రూపమూ లేని వాడొకడున్నాడు. భోజనం చేసేటప్పుడు ప్రతిముద్దా వాడికి తినిపిస్తున్నామనే భావనతో తినాలి. చైతన్యరూపుడై పలికిస్తున్నదీ, నడిపిస్తున్నదీ, అవయవాలన్నింటికీ బలాన్నిస్తున్నదీ, అన్నీ చేస్తున్నదీ ఆ పరమాత్మే. అందరితో కలుస్తూనే, నీ పనులన్నీ చేస్తూ, అహంకారము, కర్తృత్వ భావమూ లేకుండా ఆ పరమాత్మే చేయిస్తున్నాడని దృఢంగా నమ్ము. సాయినాథుడు అన్ని పనులు చేస్తూనే అందరిలో ఉన్నాడు గదా! అల్లా మాలిక్ అన్నాడా లేదా?

■ కొందరు యువకులు 'మనస్సు నిలకడ లేకుండా పరిగెడుతుంది. కాన్‌సెన్‌ట్రేషన్ కుదరటంలేదు' అంటే "నీ కిష్టమైన నామం చెప్పుకుంటూ ఉండు. సాయినాథా, సాయినాథా అని కొందరికి, ఓం

శ్రీ సాయినాథాయనమ: అని కొందరికి, సద్గురుదేవా అని, జయ గురు దత్త అని కొందరికి స్మరణ చేసుకోమని'' చెప్పారు. ఎప్పుడూ నామస్మరణ చేస్తూ వుండండి. దాని ద్వారా చూపు, వినికిడి, ఆలోచన, మనస్సు ప్రక్షాళన అవుతాయి. లోపల వున్న దైవం మేల్కొని నిలిచి వుంటాడు.

■ ప్రశ్న: స్వామీ! ఎవరితోను సంబంధం లేకుండా ఏకాంతంగా పని చేసుకుంటూ ఉన్నప్పుడు ధ్యాస నిలుస్తున్నది. కానీ కాలేజీలో వ్యవహరించడంలో, పనిచేయడంలో ధ్యాస మరుగున పడిపోతోంది. మనసు నిలవటం లేదు

స్వామి: ఉద్యోగం చేసుకుంటూనే ఉండాలి. కానీ ఏ పని చేస్తున్నా సద్గురువే మనలో ఉండి చేయిస్తున్నారన్న భావంతో చెయ్యాలి. అసలు మన చేతులు, కాళ్ళు కదులుతున్నాయంటే మనం తిన్న ఆహారాన్ని సద్గురువు జీర్ణం చేసి, అవయవాలన్నింటికీ శక్తినీ, తేజస్సునూ ఇస్తుండడం వల్లనే పని చేయగలుగుతున్నాము. కాబట్టి మనలో ఆ సద్గురువు వుండి ఈ పని చేయిస్తున్నారు. ఆయన వల్లనే మన కాళ్ళూ, చేతులూ ఆడుతున్నాయి, ఆలోచించగలుగుతున్నాము అని ప్రతి పనీ అహంకారమూ, కర్తృత్వమూ లేకుండా చేయాలి.

■ ఒకరోజు సాయంత్రం ఆరతి తర్వాత సత్సంగంలో శ్రీ వేంకటేశ్వర వజ్ర కవచం పారాయణ చేస్తున్నారు. అందులో 'కార్య కారణం' అని వచ్చింది అంటే ఏమిటి? అని అడిగి స్వామివారే ఇలా చెప్పారు ''కార్యం అంటే కుండ. కారణం అంటే మట్టి. మట్టితోనే కుండ చేయబడింది. అలానే ఈ దేహంలో పరమాత్మ ప్రాణ రూపంలో ఉండటం వల్లనే ఇది ఇట్లా వుంది. అది పోతే శరీరం కుళ్ళిపోయి రెండు రోజులకి తీసి అవతల పారెయ్యమంటారు. ఆ పరమాత్మే మన లోపల వుండి మనలను ఇలా నడిపిస్తున్నాడని ఎప్పుడూ గుర్తు పెట్టుకుని అహంకరించకుండా వుంటే ఆయనే మనకు కవచమై మనలను ఎల్లప్పుడూ రక్షిస్తాడు. అది వేంకటేశ్వర వజ్ర కవచం''. ఇంకొక అరగంటలో సత్సంగం అయిపోతుంది అని సత్సంగంలో ఒకతను అంటే స్వామివారు ''మనమెప్పుడూ సత్సంగంలోనే వుంటాము. సత్ అంటే అంతటినీ నడిపించేది. అది లేకుంటే ముల్లు

ఊడిపోతే తక్కెడ ఎలా పడిపోతుందో మన శరీరం అలానే పడిపోతుంది. మనమెప్పుడూ సత్సంగంలోనే వుంటాము'' అన్నారు.

■ ఒకప్పుడు దమ్మపేట గ్రామస్థులు కొందరు స్వామిని దర్శించినప్పుడు స్వామి వారితో అన్న మాటలు "నడక బాగుండటం లేదు. కానీ కేవలం గురుచరిత్ర పారాయణ చేయడం వలననే మీరు ఇక్కడకు రాగలుగుతున్నారు''.

■ 'ఏమి స్వామీ! ఇంత వయస్సు అయిపోయిన తర్వాత మీరు దొరికినారు, మీరింత దగ్గరగా వుండినా పొందలేకపోయాము' అని అమర్‌నాథ్‌గారు అడిగితే "ఎవరికెంతో అంతేరా! 40, 50 సంవత్సరాల నుండీ వస్తుంటారు, కొంచెం కూడా డెవలప్‌మెంట్ లేనివాళ్ళు వుంటారు. వాళ్ళనేమి చేయాలి. ఎవరికెంతో అంతే వుంటుందిరా భగవంతుని కృప. ఇది మీ అదృష్టంగా భావించి సద్వినియోగం చేసుకోండి'' అని స్వామి చెప్పారు.

■ భగవంతుడిని ప్రతిష్ఠించవలసినది మందిరాలలో కాదు మన హృదయంలో ప్రతిష్ఠించుకోవాలి. సాయిచరిత్రగానీ, భగవద్గీతగానీ, భాగవతంగానీ, దత్తాత్రేయస్వామి చరిత్రగానీ, తాజుద్దీన్‌బాబా చరిత్రగానీ, రామకృష్ణ పరమహంస చరిత్రగానీ లేక ఇతర ఏ మహాత్ముల చరిత్ర చదివినా అందులో చెప్పబడిన గుణాలను మనం పొందే ప్రయత్నం చెయ్యాలి.

■ భగవద్గీతలో విద్యార్థికి ఉండవలసిన లక్షణాలు:

1. మితాహారం 2. మిత భాషణం 3. మిత నిద్ర

మనమంతా అంతటా వున్న భగవంతుని దర్శించటానికి ప్రయత్నిస్తున్న విద్యార్థులమే. అందువలన భగవంతుడు చెప్పినది మనందరికీ ఆచరణీయమైనది.

■ నీలో ఆడే ప్రాణశక్తే నాలోనూ ఉంది. సత్యమైన జీవన విధానం వుండాలి. భగవంతుడు మనకు ఒక రూపాయి ఇచ్చాడు. దానిని సరిగా ఉపయోగించుకోవడమా లేక పాడు చేసుకోవడమా అనేది మన చేతులలోనే వుంది. మనందరినీ భగవంతుడు ఒక్కొక్క పని మీద భూమి

మీదకు పంపాడు. మన లోపల ఆ పరమాత్మే వుండి మనలను ఆడిస్తాడు. ఈ విషయం మరచి అహంకరించకూడదు.

■ స్వామికూడా అడగటానికి వచ్చేవారిని మొదట వారి కులదైవం ఎవరూ అని అడిగేవారు. ఎల్లప్పుడూ కులదైవాన్ని పూజించమని లేక తలచుకోమని చెప్పేవారు. తరువాత వారి కులగురువులు ఎవరని అడిగేవారు. వారిని పూజించమని లేక స్మరణ చేసుకోమని చెప్పేవారు. ఒక కుటుంబంలో వంశానుక్రమంగా వస్తున్న కులదేవతలను, గురువులను ప్రథమంగా పూజించాలని చెప్పేవారు. ప్రధానంగా స్వామి ఎవరు ఏ సన్మార్గంలో నడుస్తున్నారో, వారిని ఆ మార్గంలోనే బలపరచి ముందుకు సాగటానికి ప్రోత్సహించేవారు.

■ ఒకసారి గోవర్ధన్ గారు స్వామి గది దగ్గర కుళాయిలో నీళ్ళు పడుతుంటే ఆఫీసు నుండి ఫోను వచ్చింది. మాట్లాడుతుంటే స్వామి ఎవరు? అని అడిగి, ఆఫీసు వాళ్ళు అని చెప్పగానే స్వామి "నువ్వు మాట్లాడు, నేను నీరు తీసుకుపోతాను" అని స్వామి బిందెతో నీళ్ళు తీసుకుపోయారు. స్వామి తరచూ "డూ యువర్ డ్యూటీ పర్ఫెక్ట్‌లీ" అని చెప్పేవారు.

■ ఒకరోజు స్వామి మాట్లాడుతూ గణేశచతుర్థి మూల ఉద్దేశ్యం ఏమిటి అని అడిగారు. భక్తులు కొన్ని సమాధానాలు ఇచ్చారు. తరువాత స్వామి చెపుతూ "గణేశుడు తన తల్లిదండ్రుల మీద భక్తి, గౌరవం కలిగి వుండేవాడు. అలానే మనం కూడా మన తల్లిదండ్రుల మీద భక్తి, గౌరవం కలిగి వుండాలి అని చెపుతూ, శంకరయ్యని నీవు నీ తల్లిదండ్రులకి ఎప్పుడైనా ప్రదక్షిణ చేసావా?" అని అడిగారు. శంకరయ్య చేసానని చెప్పాడు. ఈ ప్రశ్న స్వామి మనందరినీ అడుగుతున్నారు. మరి మనం మన తల్లిదండ్రులకి జీవితంలో ఒక్కసారైనా ప్రదక్షిణ చేసామా?

బెంగుళూరు నుండి సుధాకర్‌గారు స్వామి సన్నిధిలో నేర్చుకున్న అంశాలు:

■ 2009 వేసవి కాలంలో దర్గాల దగ్గర స్వామి తీర్థం ఇచ్చి సుధాకర్ వంక చూసి "డబ్బు దగ్గర పెట్టుకుంటే నువ్వు పిశాచమవుతావు. జ్ఞానాన్ని దగ్గర పెట్టుకుంటే రాక్షసుడివవుతావు" అని స్వామి చెప్పారు. మరలా అమ్మయ్య ఆరాధనకి కూడా అదే మాట చెప్పారు. అప్పటిదాకా స్వామి

వారిచ్చిన అనుభవాలు అందరితోనూ పంచుకోమని స్వామివారు చెపుతున్నారని సుధాకర్‌కు అర్థమైంది. అటు తర్వాత సుధాకర్ తనకు తెలిసినవారితో స్వామి ఇచ్చిన అనుభవాలు పంచుకున్నాడు.

■ ఒక సందర్భంలో స్వామి పని చేయటం గురించి చెప్తూ “చేస్తూ వుంటే అదే వస్తుంది” అని అన్నారు. ఒకసారి ఆఫీసులో పని భారం ఎక్కువయ్యి కష్టపడవలసి వచ్చింది. అది నాకు ఇష్టం లేక స్వామిని అడిగితే “గప్‌చిప్‌గా పని చెయ్యి” అని చెప్పారు. ఒకసారి ఒక భక్తుడు తన ఆఫీసులో పని గురించి, తన ఆఫీసు మేనేజర్ల గురించి ఫిర్యాదులు చెప్పినప్పుడు స్వామి “విజయం మన కృషి మీద, అదృష్టం మీద ఆధారపడుతుంద”ని చెప్పారు.

■ ఒకసారి బెంగుళూరు సుధాకర్‌కి ఆరోగ్యం సరిగ్గా లేక స్వామి దర్శనం చేసుకుని విషయం చెపితే స్వామి కోపంగా “ఇక్కడకి రాకపోవడం వల్ల జరిగింది. నాలుగు నెలలకు కనీసం ఒకసారి వస్తూండు” అని చెప్పారు. కనీసం మూడు-నాలుగు నెలలకు ఒక్కసారైనా స్వామి దర్శనం చేసుకుంటే మనకు జరగబోయే మంచి చెడులను సమీక్ష చేసి, బాధ్యత వహించి, మనను కాపాడి రక్షిస్తూంటారు.

■ ఒకసారి స్వామిని కామాన్ని ఎలా జయించాలి అని అడిగితే స్వామి “చెప్తా” అన్నారు. తర్వాత భజన జరుగుతుంటే నన్ను భజన చేయమన్నారు. భజనలో **“మానస భజరే గురుచరణం”** దగ్గర స్వామి ఆపి **“ఇదే నీ ప్రశ్నకు సమాధానం”** అని చెప్పారు.

■ అచ్యుతా, అనంతా, గోవిందా అంటే భగవంతుని సంకల్పం వల్లనే ప్రపంచంలో ప్రతి విషయము నడుస్తోంది అని చెప్పారు. సుధాకర్‌ని గోవింద నామాలు చెపుతూ వుండు ధైర్యాన్నిస్తాయి అని చెప్పారు. అలానే ఎప్పుడైనా ఇబ్బందికర పరిస్థితులు వస్తే సుధాకర్ గోవిందనామాలు తలుచుకోగానే ఎంతో ధైర్యం, శక్తి వస్తోంది.

స్వామి సూక్ష్మమైన ఆచరణ నుండి గమనించి నేర్చుకున్న కొన్ని అంశాలు. ఇవి ఏనాడూ స్వామి ప్రత్యక్షంగా వాక్కు ద్వారా చెప్పలేదు.

■ అనంత కళ్యాణ మండప ఆశ్రమానికి ముందున్న వసారాలో గోవులను కట్టి విడిచేవారు. ముఖ్యంగా గుమ్మానికి ఎదురుగుండా వున్న

గుంజకి అన్నిటికన్నా పెద్దదైన ఆవుని కట్టేవారు. ఈ గోవు ఆశ్రమంలో దాదాపు పదిహేను సంవత్సరాలు ఉన్నది. స్వామి సాయి మందిరంలో ఆరతికి గుమ్మం నుండి వెళ్ళేటప్పుడు ఈ ఆవుకి ఎడమప్రక్కగా వెళ్ళేవారు. ఆరతి అయినాక అశ్రమంలోనికి తిరిగి వచ్చేటప్పుడు కుడిప్రక్కగా వచ్చేవారు. ఇది జాగ్రత్తగా గమనిస్తే ఆవుకి ప్రదక్షిణ చేసినట్లు అవుతుంది.

■ స్వామి సూర్యనారాయణుని భక్తులు. సూర్యాస్తమయం తర్వాత గుక్కెడు నీరు కూడా త్రాగేవారు కాదు. ఆశ్రమంలో అమ్మయ్య ఉన్నప్పటి నుండి కూడా రథసప్తమి నాడు సూర్యనారాయణునికి చక్రపొంగలి నివేదన చేసి నమస్కారం చేసుకునేవారు. 2015లో 84 సంవత్సరాల వయస్సులో కూడా స్వామి లేచి ప్రదక్షిణ చేసి నమస్కారం చేసుకున్నారు.

■ ఆశ్రమానికి ఎవరన్నా క్రొత్తవారు వస్తే "ఎక్కడనుండి వస్తున్నారు?" అని అడిగేవారు. అంతేకానీ ఎప్పుడూ కూడా 'మీరు ఎవరు?' అని అడిగేవారు కాదు. ఒక సందర్భంలో స్వామి "ఎంతటివారైనా ఒక స్థానంలో నిలబడ వలసిందే. ఒక స్థానం నుండి రావల్సిందే" అని చెప్పారు. మీరు ఎవరు అని అడిగితే ఆది శంకరుల వారికి కాశీ నగరంలో ఛండాలుడు ఎదురు పడిన వృత్తాంతం పునరావృతం కావచ్చు. స్వామి చెప్పిన విధంగా మనలోని చైతన్యమే అందరిలో ఉందనుకుని, ఆ రకంగా దర్శించటానికి ప్రయత్నం చేస్తున్న వారమైతే 'మీరు ఎవరు?' అనే ప్రశ్న అడగలేము.

■ దర్బారు సాయినాథ మందిరంలో ఆరతి మరియు సత్సంగంలో జయకారాలు చేస్తున్న సమయంలో మొదట శిరిడీ సాయినాథునికి జయకారం చేసినాక, దర్బార్ సాయినాథునికి జయకారం చేస్తాము. ఇది సూక్ష్మమైన ఆచరణ. శిరిడీలోని సాయినాథ మందిరము సాయి భక్తులందరికీ హెడ్డాఫీసు వంటిది అనుకుంటే మన ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకున్న మందిరాలు బ్రాంచ్ వంటివి. ముందర కేంద్రస్థానంలో ఉన్న గురువుకి జయకారం చెప్పి, తర్వాత మన మందిర జయకారం చెప్పుకోవటం సమంజసంగా ఉంటుంది.

■ స్వామి ఆరతులు చేసేటప్పుడు ఆరతి పుస్తకం చేత పట్టుకుని చదివేవారు. ఆరతి చదవటం అయినాక ఆ పుస్తకాన్ని చిన్నగా నేలమీద

పెట్టి దానిముందు వంగి శిరస్సు నేలకానించి నమస్కారం చేసేవారు. ఇది చెప్పటం ఎందుకంటే తర్వాతి కాలంలో భక్తులు కొంతమంది ఆరతి అయిపోయినాక పుస్తకం ప్రక్కన పెట్టి నమస్కారం చేసుకోవటం మొదలుపెట్టినారు. సిక్కు ధర్మంలోని 'గురు-గ్రంథ-సాహెబ్'లోని మూడు అంశాలు కూడా ముఖ్యమైనవే. గురువు, ఆయన ఉపదేశసారమైన గ్రంథము, ఆ పరమాత్మ. పుస్తకాన్ని శిరస్సు ముందర ఉంచుకుని నమస్కారం చేయటంలో సూక్ష్మమైన సారాంశమిదే.

■ సాయినాథ మందిరంలో రోజూ జరిగే ఆరతులలో ఉదయం, మధ్యాహ్నం, రాత్రి ఐదు వత్తులతో సాయంకాలం ఒక వత్తితో ఆరతి చేస్తారు. ఇది మొత్తం కలిపితే 16 వత్తులు. 16 కళలకు ప్రతిరూపం అని ఒక సందర్భంలో స్వామి చెప్పియున్నారు.

■ స్వామి ఒక క్రొత్త పని 'స్వల్పారంభంగా' మొదలుపెట్టేవారు. ఏ పనీ కూడా ఆర్భాటంగా మొదలుపెట్టేవారు కాదు.

■ స్వామి "రాముడు కూడా మానవుడిగా వచ్చినప్పుడు మాయలోపడి చిన్నపిల్లాడిగా ఆడుకుంటుంటే వశిష్ట మహర్షి నాలుగు లక్షణాలు బోధించారు : **తృప్తి, శాంతి, విచారణ, సత్సావాసము** ఇవి మనం అలవరచుకోవాలి" అని చెప్పేవారు. ఈ పై నాలుగు సూత్రాలు అన్ని ఆధ్యాత్మిక అధ్యయనాల యొక్క సారాంశం.

■ సామాన్యంగా ఎవరైనా ఆశ్రమానికి వెళితే వారు తమ సమస్యలను స్వామికి చెప్పుకుని మార్గదర్శనం పొందటానికి వెళ్ళేవారు. ఇందులో ఒక సూక్ష్మమైన అంశం ఉంది. ఆశ్రమానికి గురువు కోసం వెళితే సమస్యను అడగలేరు. సమస్య పరిష్కారం కోసం వెళితే గురువు కోసం వెళ్ళినట్లుకాదు. గురువు ఎక్కువా? సమస్య ఎక్కువా? అనే ప్రశ్న వస్తుంది. ఆధ్యాత్మికంగా ప్రగతి సాధించదలుచుకునేవారు వీలైనంతవరకు గురువు సమక్షంలో మౌనంగా ఉండటం మంచిది. ఎవరికి ఏ సమయానికి ఏది మేలో గమనించి గురువు వారిని ఆ సమయానికి అనుగుణంగా అనుగ్రహించగలరనే దృఢమైన విశ్వాసంతో నడుచుకోవటం మంచిది. స్వామికూడా తమ దగ్గరి భక్తులను సమస్యలను కానీ, ప్రశ్నలను కానీ

అడగటానికి ప్రోత్సహించేవారు కాదు.

■ అమ్మయ్యగారు ఉన్నంత వరకు అనంత కళ్యాణ మండపంలో ఉత్తర దిక్కుగా కూర్చునేవారు. స్వామి తూర్పుదిక్కు తిరిగి కూర్చునేవారు. ఇది సూక్ష్మమైన విషయం. ఆశ్రమానికి వచ్చేవారందరి ప్రశ్నలకు జవాబులు చెప్పే బాధ్యత తూర్పు తిరిగి కూర్చున స్వామిది. అమ్మయ్యగారు సమాధి చెందినాక, ఒక సందర్భంలో స్వామి "సమాధిలో ఆమెను తూర్పు దిక్కుగా కూర్చోబెట్టారు. వచ్చినవారిని కాపాడి, సమాధానం చెప్పవలసిన బాధ్యత ఆమెకు ఉంటుంది" అని చెప్పారు.

■ భాద్రపద మాస బహుళపక్షాన్ని మహాలయ పక్షాలు అని వ్యవహరిస్తారు. ఈ పదిహేను రోజులు మనుష్యులు తమ వంశంలో గతించిన పితృదేవతలను స్మరించుకుని తర్పణాలు, పిండప్రదానాలు చేస్తారు. ఈ పక్షం కాగానే శరదృతువులో దేవీ నవరాత్రులు మొదలవుతాయి. సాధారణంగా నవరాత్రులు వస్తున్నాయి కదా అని ఇల్లు శుభ్రం చేసుకుంటారు. కానీ అమ్మయ్యగారు పితృపక్షాలలో బూజులు దులపటం కానీ, ఆశ్రమం శుభ్రం చేయటం కానీ చేసేవారు కాదు.

■ స్వామి ఎవరైనా భక్తులు ముఖ్యమైన పనులమీద ఇంటినుండి బయటకు వెళుతున్నప్పుడు, ఆశ్రమం నుండి ఇంటికి తిరిగి వెళుతున్నప్పుడు కొద్దిగా మజ్జిగ తాగి వెళ్ళమని చెప్పేవారు.

■ పరిపరివిధాలుగా పోయే మనస్సును ఒక్కచోట కూటస్థం చేయటమే ధ్యానం. నీవు ఏ పని చేస్తున్నా, ఎక్కడ ఉన్నా నీ మనస్సును ఎక్కడకీ పోనీయక భగవంతుని ధ్యాసలో ఉండటమే ధ్యానం. అలా చేసినాక ఏకాగ్రత వస్తుంది.

■ ఒకసారి స్వామి తమ హృదయాన్ని చూపిస్తూ ఇక్కడ నుంచి చేస్తే ఎ.ఇ (అసిస్టెంట్ ఇంజనీర్), కంఠం నుండి చేస్తే ఎ.డి.ఇ (అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్), భృకుటి నుండి చేస్తే డి.ఇ.(డివిజనల్ ఇంజనీర్) అని చెప్పారు. స్వామి తమ చైతన్యాన్ని హృదయస్థానంలో పెట్టుకుని తమ భక్తుల కొరకు పరమాత్మను ప్రార్థన చేసినందు వల్ల వారు కోరుకున్నవి జరిగి భక్తుల కోరికలు తీరుతాయి.

శ్రీ శంకరులవారు రచించిన గుర్వాష్టకంలోని ఒక శ్లోకాన్ని గుర్తు చేసుకుంటూ ఈ అధ్యాయాన్ని ముగిద్దాం!

**షడంగాదివేదో ముఖే శాస్త్రవిద్యా**
**కవిత్వాది గద్యం సుపద్యం కరోతి !**
**మనశ్చేన్న లగ్నం గురోరంఘ్రిపద్మే**
**తత: కిం తత: కిం తత: కిం తత: కిమ్ !!**

ఒక వ్యక్తి ఎన్నో విశేషణాలు కలిగి ఉండవచ్చు. కానీ అతని మనస్సు గురువు యొక్క పాదపద్మముల యందు నిలబడకపోతే ఆతనికున్న విశేషణములన్నీ నిరర్ధకములే అని శంకరులవారు ఈ అష్టకములో చెప్పారు.

శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయినాథాయ నమః

# దైవం మానుష రూపేణ

## అధ్యాయము - 13

## బోధనా దక్షత

స్వామి ఎల్లప్పుడూ చాలా జాగరూకతగా, సూక్ష్మమైన దృష్టి కలిగి వ్యవహరించేవారు. భక్తుల మాటలో కానీ, ఆచరణలో కానీ చిన్న తేడా వచ్చినా తక్కున గ్రహించి వారిని మందలించి సంస్కరించేవారు. కొన్ని సందర్భాలలో కఠినంగా మందలించి, ఉత్తర క్షణంలో అనునయంగా సవరించేవారు. వచ్చిన భక్తుని మనోభావాన్ని అనుసరించి ఆ సమయానికి, సందర్భానికి తగినట్లుగా సంస్కరించేవారు.

ఒకరోజు ఆరతికి ఒక కొత్తవ్యక్తి మందిర వాకిలిలోనుండి ఎడమ కాలు లోపలికి పెట్టి రాబోయాడు. అక్కడే ఉన్న స్వామి ఇది గమనించి "నీ దుంపతెగ! నేనేమి పాపం చేసానురా? ఎడమకాలు లోపలికి పెట్టి వస్తున్నావు" అని మందలించారు. ఒక క్షణం ఆగి స్వామి మరలా "ఇక్కడకు వచ్చినందుకు మిమ్మల్ని సంస్కరించే అధికారం నాకు లేకపోతే మీరు రావటంలో ప్రయోజనం ఏముంది?" అని చెప్పారు. ఇది చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోవలసిన విషయం.

జీవితంలో మెత్తగా చెప్పి నేర్పిన పాఠాలు జ్ఞాపకం ఉన్నాయా? ఒక లెంపదెబ్బ కొట్టి నేర్పిన పాఠాలు జ్ఞాపకం ఉన్నాయా? అని మనము సూక్ష్మమైన పరిశీలన చేసి విచారించుకోవాలి. దెబ్బ తగిలిన సమయంలో కొంత బాధ కలిగినా ఆ నేర్చుకున్న పాఠం జీవితాంతం ఉంటుంది. సాధారణంగా మనుష్య సంబంధాలు అన్నీ మనిషి అహంకారాన్ని ప్రోధి చేసేవిగా ఉంటాయి. ఎవరైనా మన అహంకారాన్ని దెబ్బ తీసే విధంగా మాట్లాడినా ప్రవర్తించినా మనం ఇష్టపడము.

హైదరాబాద్ రాజీవ్‌కు కొడుకు పుట్టినాక దర్బార్ సాయినాథునికి ఏదైనా సమర్పించుకోవాలనే భావన కలిగింది. సైజు తెలియదు కాబట్టి, ఒక 54 పూసల మరొక 108 పూసల రుద్రాక్షమాల వెండితో చుట్టించి ఆశ్రమానికి తీసుకువెళ్ళాడు. స్వామికి చెప్పి ఆ రెండు మాలలు

చూపించగా "నాయనా! మేము బంగారంతో చుట్టిన మాల వేసినాము. నువ్వు తెచ్చావు కాబట్టి ఆయన చేతికి వేస్తాము. ఏ మాల ఇస్తావో చెప్పు" అని అడిగారు. రాజీవ్ కొంత సందిగ్ధంగా 'స్వామీ! ఏది బాగుంటే అది తీసుకోండి' అని చెప్పాడు. స్వామి వెంటనే పసివాడైన రాజీవ్ కొడుకు గోపాల్‌ను సంబోధిస్తూ "ఏరా గోపాల్! మీ నాయన నన్ను పరీక్ష చేస్తున్నాడు" అని 108 పూసల మాల గోపాల్ మెడలో వేసి, 54 పూసల మాల తీసుకుని దర్బార్ సాయినాథుని చేతికి అలంకరించినారు. రాజీవ్‌కు తాను చేసిన పొరపాటు అర్థం చేసుకోవటానికి చాలాసేపు పట్టింది. స్వామి కఠోరమైన సాధన చేసి అరిషడ్వర్గాలను నెగ్గి, ముఖ్యంగా లోభము, మోహము నెగ్గి గురుస్థానానికి చేరినారు. అటువంటి వ్యక్తిని "నచ్చిన వస్తువు తీసుకోండి" అని అడగటం సమంజసమా? అనే భావన మనస్సులో స్ఫురించింది.

ఒకసారి శ్రీ స్వామివారు కావలి వచ్చియున్నారు. ఈ సందర్భంలో రిటైర్డు హెడ్మాష్టరు రంగారావుగారు స్వామి సన్నిధిలో వుండగా ఆయన స్నేహితులొచ్చారని వర్తమానం వచ్చింది. ఆ వచ్చింది ఎవరైందీ ఆయనకు తెలుసు. ఎంతసేపు ఆయన ఇంట్లో వుండాలో తెలుసు, వాళ్ళను రైలు ఎక్కించిగానీ శ్రీ స్వామి సన్నిధికి రాలేరని కూడా తెలుసు. ఇన్ని తెలిసి కూడా శ్రీ స్వామివారికి నిజం చెప్పకుండా 'ఇంటిదాకా వెళ్ళి వస్తాను' అని చెప్పి వెళ్ళారు. ఆ మిత్రులను రైలు ఎక్కించి వచ్చేసరికి శ్రీ స్వామివారు కారులో నీలకంఠరావుపేట తిరుగు ప్రయాణంలో వున్నారు. రంగారావుగారు శ్రీ స్వామివారికి నమస్కారాలు చెప్పాలని మరొకరి కారులో వెంబడించారు. ఐదు, పది నిమిషాలలో శ్రీ స్వామివారి కారుని క్రాస్ చేయగలరని తలచారు. అలాంటిది ఒక గంట ప్రయాణం తర్వాత కలుసుకోగలిగారు. ఆయన స్వామికి నమస్కరించి వచ్చేయాలనుకున్నారు. కానీ స్వామి ఆయనను తమ కారు ఎక్కించుకుని, ఆయన వచ్చిన కారును వెనుకకు పంపారు. కారులో తమ ప్రక్కన కూర్చోబెట్టుకొని చాలాసేపు సద్గురువును ఎలా సేవించాలో బోధించారు. మొత్తం ఆ మాటల సారాంశం ఒక్కటే. **గురువుగారితో లోపలొకటి బయటొకటిగా మాట్లాడరాదు.** అది

చాలా దోషం అని బోధించారు. ఆయన చేసిన తప్పును గ్రహించుకున్నారు.

చెన్నై నుండి జానకి, వేణుగోపాల్ దంపతులు వారి కొడుకుతో 2010లో జులై నెలలో ఒక శనివారం దర్గాస్వామివారి దర్శనమునకు వెళ్ళారు. స్వామి దర్శనం తర్వాత "ఉంటారా నాయనా?" అని అడిగారు. 'రెండురోజులు ఉంటాము స్వామి' అని చెప్పారు. "సరే నాయనా మీ ఇష్టం. ఉన్నన్ని రోజులు ఉండవచ్చు" అని స్వామివారు అన్నారు. వెనుకనున్న స్కూలు హాస్టల్లో ఒక రూములో ఆ రోజు రాత్రి వున్నారు. మరుసటి రోజు ఆదివారం ఉదయం 10 గంటలకు స్వామివారి దర్శనమునకు వెళ్ళారు. స్వామివారి దగ్గరకు వెళుతుండగా స్వామివారు ముఖము ఇబ్బందికరంగా పెట్టారు. "ఆ! ఏంటి చెప్పు?" అని అడిగారు. 'మధ్యాహ్నం బయలుదేరాలనుకుంటున్నామని స్వామికి' వేణుగోపాల్‌గారు చెప్పారు. స్వామివారు వెంటనే కోపంగా "నిన్న ఏమని చెప్పావురా? ఇప్పుడు ఏమని చెపుతున్నావురా?" అని గద్దించారు. అలా కోపంగా అడిగేసరికి వేణుగోపాల్‌గారికి నోట మాట రాక మౌనంగా ఉన్నారు. స్వామి గట్టిగా "చెప్పరా చెప్పు? రావటం నీ ఇష్టమేనా? వెళ్ళటం నీ ఇష్టమేనా? నీకు దెబ్బలు పడతాయిరా" అంటూ దండం పైకెత్తారు. కొట్టండి స్వామీ' అని వేణుగోపాల్‌గారు తలవంచి దగ్గరగా వెళ్ళారు. స్వామివారు "ఆఁ నిన్ను కొట్టను కానీ పాలిష్ చేస్తాను. పాలిష్ చేద్దామని అనుకుంటున్నాను" అన్నారు.

మధ్యాహ్న ఆరతికి స్వామివారి దగ్గర నుండి ప్రక్కకు వచ్చిన తర్వాత స్వామివారి దగ్గర వుండాలో, వెళ్ళాలో తెలియక మధనపడ్డారు. వారి ప్రక్కన వున్న ఒక అబ్బాయి 'ఈ రోజు రాత్రి మీరు దర్గాల దగ్గర పడుకోండి' అని అన్నాడు. కానీ స్వామివారి స్పష్టమైన అనుమతి లేకుండా అలా చేయవచ్చో లేదో అని సంకోచపడ్డారు. ఏమి చెయ్యాలో పాలుపోలేదు. 12 గంటలకు మధ్యాహ్న ఆరతికి వెళ్ళారు. అక్కడ స్వామివారు శంకరయ్యతో "ఇంజనీరింగ్ చదివి ఉద్యోగం చేస్తున్న మా వేణూ గొప్పా? ఇంజనీరింగ్ చేసి ఉద్యోగం చేయని మీ మేనల్లుడు గొప్పా? ఎవరు గొప్ప? చెప్పు శంకరయ్య" అని అడిగారు. శంకరయ్య

ఏమీ మాట్లాడలేదు. చెప్పు శంకరయ్య అని మళ్ళీ రెండు సార్లు అడిగారు. శంకరయ్య మౌనంగా వున్నాడు. స్వామివారు పెద్దగా "మీ మేనల్లుడు గొప్పా? చెన్నైలో వుంటున్న మా వేణు గొప్పా?" అని అడిగారు. అప్పుడు శంకరయ్య 'మా మేనల్లుడే గొప్ప' అన్నాడు. స్వామివారు ఒక నిమిషం ఆగి "మా చెన్నై వేణే గొప్ప. ఎలాగో తెలుసా మూడు రోజులు వుంటాను అని నీతో చెప్పి రెండు రాత్రులు వుండి మరుసటి రోజు వెళతానన్న మీ మేనల్లుడు నీకు పాఠం నేర్పాడు. వీడేమో (వేణు) రెండు రోజులు వుంటానని నిన్న రాత్రి వుండి ఇప్పుడు వెళతానని నాకు చెప్పి, నాకే పాఠం నేర్పుతున్నాడు. అందుకే మా చెన్నై వేణే గొప్ప" అని అన్నారు. అందరం మౌనంగా వుండిపోయారు. స్వామివారే ఆరతి అయిన తర్వాత శంకరయ్యతో వాళ్ళని "భోజనం చేసి బయలుదేరమను" అని శంకరయ్యతో చెప్పారు. శంకరయ్య వారితో తిరుగుప్రయాణం కమ్మని చెప్పాడు. ఈ అనుభవం ద్వారా మహాత్ముల దగ్గర చాలా జాగ్రత్తగా ఉండాలని, వారితో జాగ్రత్తగా మాట్లాడాలని తెలుసుకున్నారు.

హైదరాబాద్ రాజీవ్‌కు కూడా ఇటువంటి అనుభవం వుంది. 2003 ప్రాంతం నుండి ఆశ్రమానికి వచ్చినప్పుడు, స్వామి ఆజ్ఞ మేరకు ఒక రాత్రి నిద్ర చేయసాగినాడు. ఒక దర్శనంలో రెండు రాత్రులు వుంటానని చెప్పాడు. అది స్కూలు పెట్టిన మొదటి సంవత్సరం. స్కూలు అయినాక విద్యార్థులతో కలసి అతను కూడా ఆడాడు. ఆటలలో ఆయన కాలు బెణికింది. నడవటానికి కూడా కొంత ఇబ్బందికరంగా వుండటంతో సాయంకాలం స్వామి దగ్గరకి వెళ్ళి 'రాత్రికి హైదరాబాద్ వెళతానని' చెప్పాడు. వెంటనే స్వామి కటువుగా "చెప్పిన మాట ప్రకారం నడుచుకోవటం నేర్చుకో నాయనా!

walk the talk" అని మందలించి తిరుగు ప్రయాణానికి అనుమతించారు. అయితే అతను ఈ వృత్తాంతం మొత్తంలో, ఆటల్లో తనకు గాయమైనందుకు తిరుగు ప్రయాణానికి అడిగిన విషయం స్వామికి చెప్పలేదు. ఆశ్రమంలో ఎవరికీ కూడా చెప్పలేదు. తమాషాగా కొన్ని వారాల తరువాత దర్శనంలో స్వామి "ఏరా! క్రిందటిసారి

వచ్చినప్పుడు నీ కాలికి గాయమైందా? అమ్మయ్య చెప్పింది'' అని కుశలం అడిగారు.

సామాన్యంగా ఆశ్రమానికి వెళ్ళినప్పుడు స్వామికి ఇన్ని రోజులు ఉంటామని చెప్పినాక ఆ మాట ప్రకారం అన్ని రోజులు ఉండి వెళ్ళటం ఉత్తమం. అట్లాగే తిరుగు ప్రయాణానికి స్వామి అనుమతి తీసుకున్నాక స్వామికి చెప్పిన ప్రకారం తిరిగి వెళ్ళటం ఉత్తమం. అలాగని స్వామి ఆశ్రమానికి వచ్చిన భక్తులను ఇన్నిరోజులు ఉండమని కానీ ఫలానారోజు వెళ్ళమనికానీ చెప్పినది చాలా అరుదు. అయితే వచ్చిన వారిని వారి ఇష్టప్రకారం ఎన్ని రోజులు ఉంటారో, ఎప్పుడు వెళతారో విచారించేవారు. ఈ రెండు సందర్భాలలో ఎవరైనా ఎప్పుడైనా స్వామికి చెప్పిన విధంగా నడుచుకోకపోతే వారిని కఠినంగా మందలించేవారు.

చెన్నై వేణుగోపాల్‌గారిదే మరియొక అనుభవం: 'నేను చెన్నైలో స్వామి చేతుల మీదుగా ప్రతిష్ఠింపబడిన సాయిబాబా మందిరమునకు అప్పుడప్పుడూ వెళ్ళుతుండేవాడిని. మనస్సులో వెళ్ళాలని బలంగా ఉన్నా పని ఒత్తిడి వల్ల వెళ్ళలేక మథనపడేవాడిని. ఒక 6 నెలలు కష్టపడి వ్యాపారం అభివృద్ధి చేసి, ఆ తర్వాత నుండి క్రమం తప్పకుండా మందిరానికి వెళదామని నిర్ణయించుకున్నాను. అదనంగా ప్రతి శని, ఆదివారాలు ఏదో ఒక పుణ్య క్షేత్రానికైన వెళ్ళటానికి మంచి కారు కొనుక్కోవాలని భావించాను. స్వామి జనవరి 16,17,18 చెన్నై సాయిబాబా మందిరానికి వచ్చినప్పుడు సత్సంగం ప్రారంభించి "రెక్కలు యిస్తే ప్రపంచం అంతా చుట్టుకొని వస్తానన్నాడు ఒకడు'' అని ఆగి నా వైపు చురుకుగా చూసారు. నేను కారు కొనుక్కోవటం గురించి సూచిస్తూ అలా అన్నారనిపించింది. నా ఆలోచన స్వామికి సమ్మతం కాదని మనస్సుకి తోచింది. చిత్రంగా ఆ మాటతో నా మనస్సు సమాధానపడి, 'అవసరమైతే స్వామే మార్గదర్శనం చేస్తారని' కారు కొనే ఆలోచనను మానుకున్నాను. తర్వాత 6 నెలలు రాత్రింబవళ్ళు ఆఫీసులో చాలా కష్టపడ్డాను. ఇంట్లోనే పారాయణలు కూడా చేసేవాడిని. 6 నెలలైనా వ్యాపారంలో ఏ మాత్రం అభివృద్ధి జరగలేదు. జూన్‌లో స్వామి మరలా వచ్చినప్పుడు దర్శించుకుంటే స్వామి నాతో కోపంగా "ఏరా! ఎందుకురా

వస్తున్నావు? అవసరం ఉంటే వస్తున్నావు. కోరికలు తీరటానికి వస్తున్నావు, ఏరా వేణు?'' అన్నారు. నేను 'నా కోరిక మంచిదే కదా!' అనుకుని మౌనంగా వున్నాను.

కొంతకాలం తర్వాత స్వామి దగ్గరకి నీలకంఠరావుపేట వెళ్ళినప్పుడు నన్ను దగ్గర కూర్చోపెట్టుకొని ''దేవుడు అంతటా ఉన్నాడు. నువ్వు మీ యింట్లో ప్రార్థన చేసినా కూడా పలుకుతాడు. క్షేత్రాల్లో కొంత శక్తి ఉంటుంది. అక్కడికి వెళ్ళి చేస్తే ఫలితాలు బాగుంటాయి. అలాంటి క్షేత్రాల్లో ఏమీ చేయకుండా ఉన్నా మంచిదే. నువ్వు పారాయణలు, పూజలు ఇంట్లో ఉండి చేసుకుంటే పుణ్యం వస్తుందనుకుంటే చేసుకోరా, పోరా'' అన్నారు. ఆశ్రమం నుండి తిరిగి వచ్చాక క్రమం తప్పకుండా ఒక వారం రోజులు మందిరానికి వెళ్ళాను. ఇది గమనించి స్వామి గోవర్ధన్‌గారితో ''వాణ్ణి ఉదయం, పవళింపు ఆరతులకి రమ్మను, బాగుపడుతాడు'' అని చెప్పి పంపారు. అప్పటినుండి క్రమం తప్పకుండా మందిరానికి వెళుతున్నాను. వెంటనే ఆఫీసులో పని ఒత్తిడి కూడా తగ్గింది. అదనంగా వ్యాపారం కూడా అభివృద్ధి చెందింది.

పై లీల ద్వారా భగవంతుడు అంతటా ఉన్నాడని ఇంట్లో మాత్రమే పారాయణలు, పూజలు చేసుకోవటమే కాకుండా, సద్గురువు నిర్దేశించిన క్షేత్రాల్లో కూడా సాధ్యమైనంతవరకు సాధన చేయాలని తెలుసుకున్నాను. నేను వ్యాపారం చక్కపెట్టుకున్న తర్వాత క్రమం తప్పకుండా మందిరానికి వెళదామనుకుని, 6 నెలలు కష్టపడినా కూడా ఆశించిన ఫలితం సాధించలేకపోయాను. స్వామి చెప్పినట్లు మందిరానికి వెళ్ళి ఆరతులకి హాజరవుతుంటే వ్యాపారంలో అభివృద్ధి జరిగి, నాకు మానసిక ప్రశాంతత, ఆర్థికవృద్ధి కలిగాయి.

ఇక్కడ శ్రీ భరద్వాజ మాష్టారు గారు పరిప్రశ్న అనే గ్రంథంలో ప్రస్తావించిన 'జపపూజాదులేమి చేసినా యింటివద్ద కంటే నదీ తీరంలోను, అంతకంటే పుణ్యక్షేత్రంలోనూ, అన్నిటికంటే మహాత్ముని సన్నిధియందూ ఎన్నోరెట్లు అధిక ఫలితం కలిగియుంటాయని ఋషులందరూ చెప్పారనే' విషయాన్ని తలచుకోవచ్చు.

బెంగుళూరు నుండి శేఖర్‌రాజు గారు ఆశ్రమంలో గమనించి

నేర్చుకున్న అంశం: ఒక సమయంలో ఒక భక్తురాలు తన కోరిక తీరడానికి దర్గాలో సేవ చేస్తున్నది. ఒకరోజు స్వామివారు దస్తగిరి వృక్షం దగ్గర దీపం పెట్టి ప్రదక్షిణం చేస్తూ ఆవిడను సంబోధిస్తూ ''అమ్మా! ఫలితం పొందాలంటే అని'' ఒక కథ చెప్పారు. ''తిరువణ్ణామలైలో ఒక ముసలావిడ మనస్సులో కోరిక నెరవేర్చుకొనుటకు ఆశ్రమంలో భోజనం చేస్తూ సేవ చేసేది. అలా 3 సంవత్సరాలు అయినా ఆవిడ కోరిక తీరలేదు. ఒకరోజు బాధపడుతూ ఎందుకు అందరి కోరికలు కొద్ది రోజులలో తీరిపోతుంటే నాకు మాత్రం 3 సంవత్సరాలయినా తీరడం లేదని అనుకుంది. ''మేము పెట్టే భోజనం నువ్వు తింటూ నువ్వు సేవ చేసుకుంటే నీ కోరిక ఎలా తీరుతుంది?'' అని భగవంతుని సందేశంగా స్ఫురించింది. మరురోజు నుండి కొండపై నుండి మోదుగ ఆకులు తెచ్చి అవి కుట్టి అమ్మి, ఆ డబ్బుతో సేవ చేయటం మొదలుపెట్టింది. ఈ విధంగా 3 నెలలు చేసినా ఆమెకు కోరిక తీరలేదు. తరువాత ఆమెకు 'కొండపైన ఆకులు మీ అబ్బవా?' అని పరమాత్మ ప్రశ్నించినట్లు అనిపించింది. తరువాత ఆమె ఇంటి నుండి డబ్బు తెచ్చుకుని సేవ చేసింది. 15 రోజులలో ఆమె కోరిక తీరింది''. ఈ కథ ఆమెకు చెప్పినప్పుడు అక్కడే వున్న నాకు వెంటనే మనస్సులో 'నేను ఇన్నాళ్ళూ బెంగుళూరులో బి.టి.ఎమ్ లేఔట్‌లో వున్న బాబా గుడిలో సేవ చేస్తున్నానని భావించేవాడిని. కానీ అక్కడ ప్రసాదం తింటూ చేసేది సేవగా లెక్కకు రాదని' గ్రహించాను. బాబానే దర్గాస్వామి రూపంలో వచ్చి నాకు జ్ఞానోదయం కలిగించారు. ఇక మీదట సేవ చెయ్యాలి అంటే నిస్వార్థంగా సేవ చెయ్యాలి అని నిర్ణయించుకున్నాను. ఒక్క సన్నివేశంతో దర్గాలలో సేవ చేసే భక్తురాలికి, శేఖర్‌రాజుగారికి జ్ఞానోదయం కలిగింది. అదీ సద్గురుని బోధనాదక్షత.

గమనిక: దర్గాలలో సేవ చేసుకోవటానికి వచ్చిన భక్తులు దర్గాలోనే నివసిస్తూ, నిద్ర చేస్తూ ఉంటారు. అటువంటి భక్తులను ఆశ్రమంలోనికి వచ్చి టిఫెన్, భోజనం చేయటానికి స్వామి ప్రోత్సహించేవారు కాదు. వారి భోజనానికి కావలసిన సామాన్లు వారే తెచ్చుకుని, వండుకుని తినాలని స్వామి చెప్పేవారు.

నెల్లూరు నుండి మార్బుల్స్ వ్యాపారి రమేష్‌గారిని స్వామి ఒక సందర్భంలో ఆశ్రమానికి మార్బుల్ రాళ్ళు పంపించమన్నారు. ఆయన ఒక లారీ లోడ్ తన ఉద్యోగస్తులతో పురమాయించి మధ్యాహ్నం 2గం॥లకి ఆశ్రమానికి పంపారు. స్వామికి ఫోను చేసి రాళ్ళు పంపించాను అంటే **"నీకు చెప్పిన పని నువ్వొచ్చి చూసుకుని చేసుకు పోవాలి.** కానీ మీ స్టాఫ్‌కి చెప్తే వాళ్ళు వాళ్ళ స్టాఫ్‌కి చెప్తారు. నువ్వొచ్చి చేస్తే నీకే మంచిది. ఇక్కడకు పంపించే వారు చాలామంది వున్నారు'' అని చెప్పారు. ఆయన వెంటనే స్వామికి చెప్పకుండా దర్గాల దగ్గరకి బయలుదేరి రాత్రి 2గంటలప్పుడు చేరారు. అప్పటికి ఆయన కోసం వంట తయారుగా వుంది. రమేష్ వస్తున్నాడని స్వామి అక్కడ వుండేవారికి చెప్పి, వంట చేసి ఆయనకు పెట్టమని చెప్పారు. **సద్గురువు ఎవరికి ఆదేశించిన పని వారే చెయ్యాలి.** ఇది చాలా ముఖ్యమైన పాఠం. స్వామి చాలామంది భక్తులకు ఈ విషయాన్ని బలంగా చెప్పేవారు. ఏ వ్యక్తి అయినా తనకు అత్యంత ముఖ్యమైన పనిని స్వయంగా తనే నిర్వహించుకుంటాడు. ఇతరులకు అప్పజెప్పడు. ఇది ఆ పనియందు ఆ వ్యక్తి యొక్క శ్రద్ధను ప్రతిబింబిస్తుంది. సద్గురువు యందు మనకు నిజమైన శ్రద్ధ వుంటే ఆయన ఆదేశించిన పనిని మనమే స్వయంగా చేయాలి.

తిరుపతి గిరిగారు ఇలా చెపుతున్నారు: ఒకసారి నాకు చెడ్డ ఆలోచన వస్తోంది కదా అనుకుంటూ పడుకున్నాను. ఆ రోజు రాత్రి కలలో స్వామి దర్గాల్లో తిరుగుతూ **"శెనగలు తిన్నామా, చేయి కడిగామా అన్నట్టుండు నిన్నేమీ చేయదు"** అన్నారు. స్వామి సాధారణ మాటలతో బుద్ధుడు, శంకరుడు చెప్పిన చిత్తవృత్తులను నిరోధించే మార్గం చెప్పారు. అదేమిటంటే "మనలో అనుక్షణము ఉత్పన్నమయ్యే వృత్తులతో, (తలంపులతో) తాదాత్మ్యం చెందడం వలన వాటికి లొంగిపోతాము. ఇది తెలిసి వ్యక్తి తనలో ఉత్పన్నమయ్యే విషయచింతనలను తటస్థుడై నిశితంగా గమనిస్తుంటే వాటితో తాదాత్మ్యం చెందే సంస్కారం నశిస్తుంది. మరొకరికి వస్తున్న తలంపులను చూస్తున్నట్లు నిర్లిప్తంగా వుండగలుగుతాడు. చేతికర్రకు మనలను

నిలబెట్టే శక్తి మనం దానిని పట్టుకోవడం వల్లనే కల్గినట్లు, విషయవాసనలకు మన తాదాత్మ్యం వల్లనే బలం చేకూరుతుంది. కనుక మన తలంపులు క్రమంగా మనమీద ఎట్టి ప్రభావము లేకుండా పోతుంది''.

ఈ రకమైన అనుభవం హైదరాబాద్ రాజీవ్‌కు కూడా వున్నది. ఒక సందర్భంలో ఆశ్రమంలో వుండగా చాలా దురాలోచన మనస్సులో ప్రవేశించి కలవరపెట్టసాగింది. సామాన్యంగా ఇటువంటి ఆలోచనలు ఒక జూదశాలకు గానీ, ఒక వ్యభిచార గృహానికిగానీ, ఒక మధుపానశాలకు గానీ వెళ్ళినా కూడా కలుగదు. అటువంటిది, ఇటువంటి పవిత్ర స్థానంలో ఇటువంటి ఆలోచన బలవంతంగా మనస్సులోకి వచ్చి కలవరపెడుతున్నదే అని సంఘర్షణ పడుతూండగా ఠక్కున స్వామి వచ్చి **"నాయనా! మనస్సు ఈగ వంటిది. అన్నం మీదా వాలుతుంది, పెంట మీదా వాలుతుంది"** అని చెప్పారు. ఈ అనుభవాన్ని ఆయన చాలా సం॥లు మననం చేసుకోగా ఒక విషయం రూఢీ అవుతుంది. స్వామి అనుక్షణం తన బిడ్డలను గమనిస్తూ వారిలో కలిగే ఆలోచనలను కూడా గమనిస్తూ వారిని తగువిధంగా సంస్కరిస్తూ నడిపిస్తున్నారు.

ఒక సమయంలో స్వామి భక్తులతో ఈ విధంగా అనేవారు "నాయనా! మీరు బాల్ వేస్తే నేను బ్యాట్ ఆడతాను. మీరు బ్యాట్ ఆడితే నేను బాల్ వేస్తాను"

నెల్లూరు చంద్రశేఖర్ రెడ్డిగారు ఆర్థిక ఇబ్బందుల వలన స్వామిని దర్శనం చేసుకున్నప్పుడు "అరెయ్! నీకు మానసిక శాంతిని ఇస్తాను కానీ సూట్‌కేస్‌లో డబ్బులు ఇమ్మంటే ఇవ్వనురా! మంచి మార్గంలో వుండు నాయనా!" అని చెప్పారు.

**"నమ్మండి సొమ్మవుతుంది. దర్గాలలో వున్నప్పుడు ఉండే నియమ నిష్ఠలలో అణావంతు మీ ఇండ్ల దగ్గర వుంటే మీకు అన్నీ జరుగుతాయి.** సమంజసమైన కోరిక కోరండి. అమ్మాయికి లక్ష రూపాయలు పెట్టి పెండ్లి చేయాలంటే భగవంతుడిని ప్రార్థిస్తే, అప్పోసొప్పో పుట్టించి ఇస్తాడు. సైకిల్ వుండి స్కూటర్ కావాలని అడిగితే ఇస్తాడు.

అలా కాక బెంజి కారు కావాలంటే వున్న సైకిల్ పోతుంది. అత్యాశ కాకుండా వుంటే భగవంతుడిని లేదా సాయిబాబాను అడిగెయ్. నేను కూడా ఆయన్ని ప్రార్థిస్తాను”

పునరపి జననం పునరపి మరణం గురించి ప్రస్తావన వస్తే స్వామి **“నీలో కోరిక చస్తే నీవు పుడితే ఏంటి, చస్తే ఏంటి”** అని అన్నారు. **ఆశబోతే అంతాబోతుండ్లాయర్యా!** అన్న గొలగమూడి శ్రీ వెంకయ్యస్వామి మాటే దర్గాస్వామి కూడా నొక్కి చెపుతున్నారు. ఆచరించి తరించెదముగాక!

బెంగుళూరు సాయిశివ ఇలా చెపుతున్నారు: నాకు తిండిమీద వ్యామోహం పోవట్లేదని మనస్సులో అనుకుంటున్నప్పుడు నేనేమీ చెప్పకుండానే స్వామి ఇచ్చిన బోధ : “ఎదురుగా గూట్లో లడ్డూ కనిపించి తినాలనిపించింది. అయినా సరే కూర్చున్న చోటు నుండే లేవకుండా పట్టుదలగా అక్కడే కూర్చోనుంటే తినకుండా నిగ్రహించుకోగలుగుతామా? లేక కంట్రోల్ లేకుండా లేచి లడ్డూ దగ్గరకు వెళ్ళిపోతే తినకుండా ఉండడం అవుతుందా? అలా కదలకుండా అక్కడే కూర్చోనుండగలగాలంటే ఏం కావాలి? అని స్వామి తన తొడ కొడుతూ “బాడీ (శరీరం) కంట్రోల్ కావాలి, బాడీ కంట్రోల్ ఎలా వస్తుంది? ఆసనాలు, ప్రాణాయామం, సూర్యనమస్కారాలు చేస్తే వస్తుంది” అన్నారు.

బెంగుళూరు నుండి ప్రసాద్ ఇలా చెపుతున్నారు:

1. నేను ఆఫీసు పని మీద అమెరికాలో వున్నప్పుడు ఒకమ్మాయి గురించి పిచ్చి ఆలోచనలు చేస్తుండేవాడిని. స్వామికి ఫోను చేసినప్పుడు పేరు చెప్పకమునుపే చాలా కోపంగా, చికాకుగా “నీ టైమ్ వేస్టు చేస్తున్నావు, నా టైమ్ వేస్టు చేస్తున్నావు, ఫోను పెట్టెయ్యనా” అని మూడుసార్లు అరిచారు. **“మనస్సు గాలిపటంలాగా తిరుగుతోంది. 40రోజులు నామస్మరణ చెయ్యి, నామం చెపుతూ ఆ అమ్మాయిని చూడు, నామస్మరణ చేస్తావా?”** అని అన్నారు. మొదట చేస్తానని, మరలా చెయ్యకపోతే తప్పు అవుతుందని ప్రయత్నం చేస్తాను స్వామీ’ అని అన్నాను. స్వామి “మరలా 40 రోజులు అయిన

తర్వాత ఫోను చెయ్యమని" ఫోను పెట్టేశారు. స్వామి దయ వలన నామస్మరణ శ్రద్ధగా జరిగి ఆ అమ్మాయి ఆలోచనలు నా మనస్సు నుండి తొలగిపోయినాయి. 40 రోజుల తర్వాత ఫోను చేస్తే స్వామి చాలా ప్రేమగా మాట్లాడారు.

ఎక్కడో అమెరికాలో ఉన్నా నా మనస్సులోని ఆలోచనలు చెప్పకుండానే స్వామి గమనిస్తున్నారని తెలుసుకున్నాను. నాకు పరిష్కార మార్గం చూపించి, నా తప్పుడు నడకను సరిదిద్దినారు. చేయవలసిన ఆచరణకు కూడా కావలసిన బలాన్ని చేకూర్చినారు. ఆ చెడు ఆలోచనలు పోయాక ఎంతో ప్రేమగా మాట్లాడారు. నాకు తగిన వివేక, వైరాగ్యాలను ప్రసాదించమని స్వామిని అనన్యంగా ప్రార్థిస్తున్నాను.

2. నేను ఇండియాకు తిరిగి వస్తున్న విషయం స్వామికి చెప్తే "దర్గాల దగ్గర రెండు రోజులు వుండేటట్లు రమ్మ"న్నారు. అలానే ఇండియాకు వచ్చిన వెంటనే స్వామి దగ్గరకు వెళ్ళితే "ఎందుకొచ్చావు?" అని అడిగారు. 'మీరు రమ్మన్నారు కదా!' అన్నాను. అంతే స్వామి కోపంగా తిట్టి లోపలికెళ్ళారు. ఆశ్రమానికి రమ్మనమన్నది స్వామే, ఆ మాటే చెపితే ఎందుకు తిట్టారో అర్థం కాలేదు. మధ్యాహ్నం స్వామి కూర్చొని భక్తులతో మాట్లాడుతున్నప్పుడు, స్వామి "మరలా ఎందుకొచ్చావు?" అని అడిగారు. 'మీ ఆశీస్సుల కోసం' అన్నాను. స్వామి ఎంతో ఆనందంగా "అది. ఆ మాటే ఇందాక చెప్పవచ్చు కదా!" అన్నారు. అప్పటికి కానీ నేను చేసిన తప్పు అర్థం కాలేదు. నన్ను అంతటి ఆపద నుండి కాపాడరనే కృతజ్ఞతతో వచ్చి స్వామిని దర్శించాలని గ్రహించాను. స్వామి రమ్మన్నప్పుడు నేను వెళ్ళటం వలన నాకు మాత్రమే శ్రేయస్కరము.

ఇక్కడ ఆచార్య భరద్వాజ మాష్టారుగారు రచించిన 'శ్రీ ఆనందమాయి అమ్మ' అనే గ్రంథంలో శ్రీ అఖండానందస్వామి చెప్పినది హృదయంగతం చేసుకోవాలి. "శిష్యుడిగా మనమాచరించవలసిన ధర్మం తెలుసుకొని, దానిని రూపొందించిన మహర్షులపై అపారమైన విశ్వాసంతో దానిని తరచూ తప్పకుండా పాటిస్తుండాలి. మనతో గురువెంత ప్రేమగా మసులుకున్నా మనం

మాత్రం మన ధర్మం మరచిపోకూడదు. అది వారి ధర్మం, ఇది మన ధర్మం. దానిని విడిస్తే వారు మహాత్ములూ కారు. దీనిని విడిస్తే మనము సాధకులమూ గాము.'' స్వామి మనతో ఎంత ప్రేమగా వ్యవహరించినా, మనం ఎల్లప్పుడూ స్వామితో వినయపూర్వకంగా ప్రవర్తించాలని తెలుసుకున్నాను.

తర్వాత రోజు ఉదయం ఆరతి అయిన తర్వాత భజన చేయమన్నారు. స్వామి నన్ను స్త్రీ వ్యామోహం నుండి రక్షించిన సంఘటనను మనస్సులో తలచుకుంటూ భజన చేసాను. భజన తర్వాత స్వామి ఎంతో ఇష్టంగా ఇవాళ భజన బాగుంది అని మెచ్చుకున్నారు. కృతజ్ఞతతో కూడిన ప్రార్థన భగవంతునికి ఇష్టమౌతుందని అనుభవమైంది.

ఖమ్మం జిల్లా దమ్మపేట వాస్తవ్యులు డి.శారదగారికి నిత్యం రాత్రి 9 గం॥ 30 ని॥లకు టి.వి. చూచే అలవాటు. ఆ దురలవాటు పోగొట్టమని శ్రీ సాయినాధునికి అనేకసార్లు చెప్పుకొన్నది. కానీ ఆ అలవాటు పోలేదు.

ఈమె దర్గాస్వామిని దర్శించినప్పుడు తన దురలవాటును గురించి చెప్పడం గానీ, మనస్సులో ప్రార్థించడం గానీ చేయలేదు. దమ్మపేటలో ఉన్న ఈమెకు ఒక స్వప్నం వచ్చింది. ఆ స్వప్నంలో దమ్మపేట భక్తులు కొంతమంది దర్గాలకు పోతుంటే ఈమె తన నమస్కారాలు శ్రీ స్వామివారికి తెల్పమని చెప్పింది. వాళ్ళు శ్రీ స్వామివారికి తెలియజేసారు. వెంటనే శ్రీ స్వామివారు “ఆమెకు 9-30గంటలకి వుండే దుస్సాంగత్యం తొలగించుకోమని చెప్పు!'' అని అన్నారు. ఆ మాట శ్రీ స్వామివారే ఆమెకు స్వయంగా చెప్పినట్లుగా అనిపించింది. కానీ తన దురలవాటు మానలేకపోయింది.

కొన్నాళ్ళ తర్వాత శ్రీ దర్గాస్వామివారు ఆమె స్వప్నంలో కనిపించి “నీవు వ్యామోహం తొలగించుకోలేకున్నావు. ట్రాక్ దిగిపోతావు జాగ్రత్త'' అని కండ్లెర్రజేసి బెదిరించినారు. ఆమె భయపడి వణికిపోయింది. తెల్లవారి నుండి టి.వి. చూచే అలవాటు ఆమెకు తెలియకుండానే పోయింది. ఆనాటి నుండి పారాయణ చక్కగా జరుగుతోంది.

2002-2003 సంవత్సరంలో రాజీవ్ ఒకసారి ఆశ్రమానికి వెళ్ళగా స్వామి అతనిని రాత్రి నిద్రచేసి మరునాడు ఉదయం కొంచెం పెరుగన్నం తిని వెళ్ళమని చెప్పారు. అప్పటికింకా అతనికి ఆశ్రమంలో నిద్రచేసే అలవాటు లేదు. సంకోచం వలనో కానీ, అసౌకర్యంగా ఉంటుందనే భావంతో కానీ అతను ఉండటానికి ఇష్టపడలేదు. స్వామి రెండవసారి "నాయనా! రేపు ఉదయం అమ్మయ్య నీకు పెరుగన్నం చేసి పెడుతుంది. తిని వెళ్ళు" అని చెప్పారు. రాజీవ్ ఉంటానని చెప్పలేదు. స్వామి మూడవసారి "నాయనా! రేపు పెరుగన్నం తిని వెళ్ళు. నీ చూపు నిలబడి ఏకాగ్రత వస్తుంది" అని చెప్పారు. స్వామి ఇవ్వదలచిన వరాన్ని గుర్తించలేక అతను రాత్రి నిద్ర చేయకుండానే తిరుగు ప్రయాణమైనాడు. తర్వాతి ఆశ్రమ దర్శనంలో స్వామి సున్నితంగా "నాయనా! పెరుగన్నం తిని వెళితే నీకు ఏకాగ్రత కలిగి ఉండేది" అని చెప్పారు. అప్పుడుకానీ అతను చేసిన పొరపాటును గ్రహించలేకపోయాడు. తర్వాత కాలంలో ఆశ్రమానికి వచ్చే ఇతర భక్తులతో అనుభవాలు పంచుకుంటున్నప్పుడు చాలామంది భక్తులు ఇటువంటి అనుభవాన్ని చెప్పారు. స్వామి వారికి ఏదో చెప్పగా వారు చెప్పిన విధంగా నడవకుండా ఆయన మాట మీరి నడిచారు. ఇటువంటి అనుభవం స్వామి ఇంతమంది భక్తులకు ఎందుకు ఇచ్చినట్లు? గురువు చెప్పిన వాక్యం హృదయగతం చేసుకుని దానిని తు॥చ॥ తప్పకుండా శ్రద్ధగా ఆచరించాలి అనే భావన భక్తుల హృదయంలో దృఢపడాలి. శిష్యుడి/భక్తుడి కొరకు గురువు నోటినుండి వెలువడిన వాక్యం అత్యంత ప్రభావం కలిగి ఉంటుంది. ఆ మాటను అలక్ష్యం చేయకుండా అత్యంత శ్రద్ధతో ఆచరించటం ఆ శిష్యుడి/భక్తుడికి శ్రేయస్కరం.

శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయినాథాయ నమః

# దైవం మానుష రూపేణ

## అధ్యాయము - 14

## స్వామి ప్రసంగములు

ఒకానొక సమయంలో కొంతకాలం దర్బార్ సాయిమందిరంలో ఉదయం ఆరతి ఇచ్చినాక స్వామి ఒక రెండు నిమిషములు మాట్లాడేవారు. అట్లాగే ఏమైనా పర్వదినాలు (నూతన సంవత్సరం, గురు పౌర్ణమి మొ॥) వచ్చినప్పుడు కొద్దిసేపు చెప్పేవారు. ఏది చెప్పినా కూడా ఐదు నిమిషాలకు మించి మాట్లాడింది చాలా అరుదు. స్వామి ఎప్పుడు మాట్లాడినా ఎక్కువ భాగం ఆయన సాధన కాలమైన 1953-1958 మధ్య జరిగిన సంఘటనలను నెమరు వేసుకునేవారు. స్వామి చేసిన కొన్ని ప్రసంగములను ఆయన అనుమతి తీసుకుని రికార్డ్ చేసిన వాటిలో కొన్ని యధాతథంగా అనువదించి ఈ అధ్యాయంలో పొందుపరచటం జరిగింది.

### దర్గాలు దత్తాత్రేయ పీఠమా?

దర్గా అంటే ఒక బ్రహ్మవేత్త అయిన మహమ్మదీయ సాధు/సంతు పురుషుని సమాధి. సూఫీ సంప్రదాయంలో ఒక సాధకుడు పరమాత్మలో లీనమైననాడు పొందే సంయోగంలోని అనుభూతికి ఈ సృష్టిలో సమమయిన అనుభవం/అనుభూతి/ఆనందం మరొకటి లేదు. ఇది మా గురువుగారు అవికల్ప సమాధిలో రూపం విడిచిపొయ్యారే అని దు:ఖపడే సందర్భంకాదు. అటువంటి స్థితిని పొందిననాడు ఆ సాధకునికి/గురువుగారికి పండుగ. మానవాళికి పండుగ. మానవ జీవితంలో సర్వోత్కృష్టమైన ఆ క్షణం ఉత్సవం చేసుకునే సందర్భం. నిర్వికల్ప సమాధిలో ప్రాణోత్క్రమణ చెందిన మహానుభావుని శరీరాన్ని సమాధిచేసి, దానికి పూజలు చేస్తారు. ఆ రకంగా అవికల్ప సమాధిలో వున్న మహానుభావుని ద్వారా సామాన్య ప్రజానీకం సృష్టికర్తకు తమ ప్రార్థన తెలియచేయటం సత్ సంప్రదాయం.

ఇటువంటి పద్ధతిని మనము హిందూ సనాతన సంప్రదాయంలో, క్రైస్తవ సంప్రదాయంలో కూడా చూడవచ్చు. శృంగేరి పీఠంలో కూడా పరంపరలోని గురువుల సమాధులను శ్రద్ధతో పూజిస్తారు. శైవ సంప్రదాయంలో ఆ సమాధి మందిరాన్ని అధిష్ఠానం అంటారు. సమాధి మీద శివలింగాన్ని ప్రతిష్ఠిస్తారు. వైష్ణవ సంప్రదాయంలో బృందావనం అంటారు. సమాధి మీద తులసి మొక్కని ప్రతిష్ఠ చేస్తారు. ఉదాహరణకి శ్రీ రాఘవేంద్రస్వామి సమాధిని బృందావనం అంటారు. ఇదే విషయాన్ని మనము రోమ్లోని సిస్టీన్ ఛాపెల్‌లో కూడా క్రైస్తవ పోపుల సమాధుల్ని శ్రద్ధగా పరిరక్షించటం గమనించవచ్చు. ఇది అన్ని మతములవారు, అన్ని సంప్రదాయాలవారు అత్యంత శ్రద్ధా భక్తులతో ఆచరించటం మనం చూడవచ్చు.

మానవ జీవన లక్ష్యమైన ఆత్మానుభవాన్ని పొందిన జీవుడు పూర్ణత్వాన్ని చెందుతాడు. అటువంటి మహానుభావుడు సృష్టికర్తతో సమమౌతాడు. దానికి ఈ శాస్త్రవచనమే ప్రమాణం "బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి". ఇందువల్ల మనము ఏ మతస్థులమైనా ఏ సంప్రదాయానికి చెందిన వారమైనా ఒక బ్రహ్మవేత్త సమాధి మందిరాన్ని దర్శించి ఆయన పట్ల మన శ్రద్ధని, గౌరవాన్ని కనపరచటంలో సంకోచపడనక్కర్లేదు.

స్వామి ఎన్నో మార్లు "**ఇది సద్గురు పీఠం నాయన!**" అని చెప్పేవారు. సనాతన సంప్రదాయంలో సాధారణంగా సద్గురు అనే పదం దత్తాత్రేయునికి సంకేతం, ఆయన పరంపరకు సూచన. ఇందులో ఒక ప్రశ్న వస్తుంది. సమాధిలో వున్న వారేమో మహమ్మదీయులు, దీనిని సద్గురు పీఠం అని అర్థం చేసుకోవటంలో ఎట్లా సమన్వయము చేసుకోవాలి? 2012 నుంచి ఆశ్రమంలో సిద్ధ మంగళ స్తోత్ర పారాయణ చేసిన తరువాత స్వామి రెండు నిముషాలు చెప్పినది మనము జాగ్రత్తగా గమనిస్తే, పై ప్రశ్నకి సమాధానం దొరుకుతుంది.

"రూప నామ క్రియలు లేని ఆ పరిపూర్ణ పరబ్రహ్మ స్వరూపుడు, పరమాత్ముడు, దేవదేవుడు, కృపాళుడు, భక్తవత్సలుడు, సర్వజీవులను పోషించి రక్షించి కాపాడి, అఖిలాండ బ్రహ్మాండ నాయకుడు ఆది మధ్యములు లేనివాడు, సర్వాంతర్యామి, సర్వసాక్షి, పరంధాముడు,

పరాకాశుడు, పరబ్రహ్మ స్వరూపుడు పిఠాపురంలో మూడు రూపాలతో వెలసినాడు. శ్రీపాద శ్రీవల్లభుడు, నృసింహ సరస్వతి, అక్కల్‌కోట మహారాజ్. ఆ మూడు దత్తాత్రేయుని నిజస్వరూపములు. ఆయన ఉత్తరదేశం నుంచి బయలుదేరి దక్షిణానికి వచ్చి, 'సర్వం ఖల్విదం బ్రహ్మ' ఒకే కులం, ఒకే జాతి, ఒకే మతం అని సర్వులకు హితోపదేశం చేయుటకై వచ్చి ఎనుబది నాలుగు లక్షల జీవరాసుల్ని తన కడుపులో పెట్టుకొని ప్రశాంతంగా తప:సంపన్నుడై కూర్చున్న ఆ కాలంలో ......... సత్యస్వరూపుడు, సద్గురుడు హజరత్ దర్బార్ అలీషా వలి రహమతుల్లా అలై బాబా ఉత్తర దేశం నుంచి వచ్చి ఆయనని ఆశ్రయించి జ్ఞానభిక్ష తీసుకొని ఆయన ఉత్తరువుతో బ్రాహ్మణ అగ్రహారమైన ఈ స్థలంలో సర్వ జీవుల్ని సమదృష్టితో చూస్తూ పరిపాలిస్తూ ఆ కాలంలో......... ఎవరైనా ఆయన దగ్గర శిష్యరికం చేసిన వారు కూడా, తనలోని సత్యం ప్రతి జీవిలో ఉందని గుర్తెరుగునట్టు చేసిన సత్యస్వరూపుడు, పరంధాముడు, పరాకాశుడు, పరబ్రహ్మ స్వరూపుడు, పరమేశ్వరుడు సద్గురు హజరత్ దర్బార్ అలీషా వలి రహమతుల్లా అలై బాబా వారిని మా హృదయంలో ధ్యానించి సర్వజీవులను సమదృష్టితో కాపాడవలసిందని పాదములని పట్టి బ్రతిమాలుకుని వేడుకుంటున్నాను".

గమనిక: ఆశ్రమంలో ప్రతిరోజు మద్యాహ్నం ఒకటిన్నరకి సాయిచాలీసా, మరికొన్ని దేవతా స్తోత్రాలు పారాయణ చేసినాక 1:40 నుండి సిద్ధమంగళస్తోత్ర పారాయణ చేస్తారు. ఒక వృత్తంలో తొమ్మిదిసార్లుగా, ఇటువంటి వృత్తాలు నాలుగు పారాయణ చేసి, చివరికి రెండుసార్లు అదనంగా పఠిస్తారు. ఈ రకంగా 38సార్లు పారాయణ చేసినాక స్వామి నెమ్మదిగా లేచి కూర్చుని పై వ్రాసిన విషయాన్ని చెపుతారు.



## సిద్ధమంగళ స్తోత్రము

శ్రీమదనంత శ్రీవిభూషిత అప్పలలక్ష్మీ నరసింహరాజా ।
జయవిజయీభవ దిగ్విజయీభవ శ్రీ మదఖండ శ్రీవిజయీభవ ॥

శ్రీవిద్యాధరి రాధా సురేఖా శ్రీరాఖీధర శ్రీపాదా ।
జయవిజయీభవ దిగ్విజయీభవ శ్రీ మదఖండ శ్రీవిజయీభవ ॥

మాతాసుమతీ వాత్సల్యామృత పరిపోషిత జయ శ్రీపాదా ।
జయవిజయీభవ దిగ్విజయీభవ శ్రీ మదఖండ శ్రీవిజయీభవ ॥

సత్యఋషీశ్వర దుహితానందన బాపనార్యనుత శ్రీచరణా ।
జయవిజయీభవ దిగ్విజయీభవ శ్రీ మదఖండ శ్రీవిజయీభవ ॥

సవితృకాఠకచయన పుణ్యఫల భరద్వాజ ఋషి గోత్రసంభవా ।
జయవిజయీభవ దిగ్విజయీభవ శ్రీ మదఖండ శ్రీవిజయీభవ ॥

దో చౌపాతీ దేవ్ లక్ష్మీ ఘన సంఖ్యాబోధిత శ్రీచరణా ।
జయవిజయీభవ దిగ్విజయీభవ శ్రీ మదఖండ శ్రీ విజయీభవ ॥

పుణ్యరూపిణీ రాజమాంబసుత గర్భపుణ్యఫల సంజాతా ।
జయవిజయీభవ దిగ్విజయీభవ శ్రీ మదఖండ శ్రీవిజయీభవ ॥

సుమతీనందన నరహరినందన దత్తదేవప్రభు శ్రీపాదా ।
జయవిజయీభవ దిగ్విజయీభవ శ్రీ మదఖండ శ్రీవిజయీభవ ॥

పీఠికాపుర నిత్యవిహారా మధుమతి దత్తా మంగళరూపా ।
జయవిజయీభవ దిగ్విజయీభవ శ్రీ మదఖండ శ్రీవిజయీభవ ॥

(చరితామృతమునందలి శ్రీపాద శ్రీవల్లభుల వారికి అత్యంత ప్రీతికరమైన సిద్ధ మంగళ స్తోత్రమును ప్రతిదినము భక్తితో పఠించుట వలన సంకటములన్నియు నివారణమై, సకల శుభములు చేకూరును, అభీష్టములన్నియు సిద్ధించును.)

గమనిక: శ్రీపాద శ్రీవల్లభ చరితామృతంలో ఈ సిద్ధమంగళ స్తోత్రం గురించి వివరంగా ఇవ్వబడినది.



ఒక గురు పౌర్ణమి (ఆషాడ పౌర్ణమి) సందర్భంగా స్వామి చెప్పిన వాక్యములు యథాతథంగా క్రింద పొందపరచడమైనది

"కాబట్టి మన ఓంకార రూపంతో పుట్టిన ఈ శరీరంలో గురువును ప్రతిష్ఠించుకుంటే, ఆ పరబ్రహ్మస్వరూపమైన పరమాత్ముడు ఏదో ఒక మానవ రూపాన్ని మనము ఎన్నుకోవాల్సిన ధర్మం వుంది. మన చూపు నిలబడేదానికి, మన బుద్ధి కుదుట వచ్చేదానికి, ఏకాగ్రత వచ్చేదానికి, తప్పుఒప్పు అని తెలుసుకుండేదానికి, ఏదైనా మనకు నచ్చిన ఒక నామస్మరణ రామ అను, కృష్ణ అను, గోవిందా అను, నారాయణా అను, సాయి అను, సద్గురుదేవా అను ఏదైనా నీవు ఇష్టమైన రూపము పేరు పెట్టుకుని చేస్తే పరిగెత్తే మనసు ఒక కుదుటకు వస్తుంది. కుదుటకు వచ్చినప్పుడు తప్పుఒప్పు అని తెలుసుకునేదానికి మన లోపలే నిర్ణాయకర్త అయితాడు.

అతడు ఎట్లాంటివాడంటే

**"పూర్ణచంద్రుడై పూజించువారలకు ప్రత్యక్షమౌ శ్రీ సద్గురుమూర్తి"**

ఎవరికి ప్రత్యక్షమౌతాడు? పూర్ణచంద్రుడై పూజించువారలకు, నా లోపలే ఉన్నదని నేను గట్టిగా నమ్మి పూజ చేస్తే ఆయన నాకు కావలసినవన్నీ ఇస్తాడు, కృతకృత్యుని చేస్తాడు. ధన్యుణ్ణి చేస్తాడు. సర్వుల్లో వున్న సజీవ తత్వాన్ని మన లోపల వుందని తెలుసుకునేదానికి జ్ఞానాన్ని కూడా ఇస్తాడు ఆ సద్గురువు.

**"పూర్ణచంద్రుడై పూజించువారలకు ప్రత్యక్షమౌ శ్రీ సద్గురుమూర్తి దీని మూలంబే సదాశివరామ నామమే"**

రాముడు లేడు, శివుడు లేడు సదా శివరామ నామమే, శివ అంటే మంగళకరమైన ప్రాణము. ప్రతి జీవిలో ఉన్న ప్రాణం నేనే అని సాయి ఎట్లా నిరూపించాడో...ఆ...అదే సత్యమైనది. ప్రతిజీవిలో వున్న ప్రాణమే నేను అని నిర్ణయించిన ఈ సద్గురువు, అదే సదా శివరామ నామము.

శివ అంటే మంగళకరమైన ప్రాణము. ఆ ప్రాణములో ప్రవహిస్తున్న ధ్వనిలో వచ్చే నాదం వచ్చి రామ శబ్దము. చూసారా! ఎక్కడ ఉన్నాడు రాముడు? తన లోపల ఆడుతున్న ఏ ప్రాణవాయువులో సమ్మేళనంగా కలిసి తల్లి గర్భంలో వున్నప్పుడు ఏ భగవంతుడైతే ఈ ప్రాణవాయువును పంపిస్తూ దానికి తోడు చేశాడో, అదే ప్రాణవాయువును ఏమంటారాంటే, శివోహం - శివా.....సదాశివ....ప్రపంచమంతా ఏలుతున్న ఆ సదాశివుడే నీవు, నేను, మనము అసంతృప్తితో వెలుగుతున్నాము....నేను జీవుణ్ణి....కేవలము నీచుణ్ణి.....నా చేత ఏదీ కాదు అని అంటున్నారు...కాదు...అన్ని పనులు మనచేత అయ్యేటట్టు అతను ఇచ్చాడు. మనము నడవలేకపోతున్నాము......ఆయన మన లోపల అంతర్వాణిగా వుండి ప్రేరేవణ చేసినది విని చెయ్యలేకపోతున్నాము....తప్పు అని తెలియదా...ఇప్పుడు ఇక్కడ ఒక ఉంగరం వేశారు...దొరికింది నాకు...దొరికితే భగవంతుడు నాకు ఇచ్చాడు అని తృప్తిగా వేలుకు పెట్టుకుంటున్నామేగాని ఇది ఎవరిది అని అడగటం లేదు.

ఎదుటివాణ్ణి మోసం చేస్తున్నాను నేను లక్ష రూపాయలు సంపాయించాను...దానికి నాకు ఎంతో లాభం వచ్చింది అంటున్నావు. వాడు నీవు రూపం వేరుగానీ వస్తువు ఒక్కటే అని గ్రహించలేకపోతివి కదా! ఇటువంటి మహనీయుల దగ్గరకు వచ్చి కూడా...సద్గురువు సన్నిధికి వచ్చి కూడా చెయ్యలేకపోతున్నాము. నేను ఒక వ్యాపారం పెట్టాను. నేను కరెక్టుగా తూకం ఇస్తున్నాను...నాకు ఒక్క రూపాయి ఆదాయం వస్తుంది. వాడు తక్కువ ఇస్తున్నాడు వాడికి పది రూపాయలు వచ్చాయి...కొంతకాలము. సత్యం చావదు. నిజం నిలకడ మీద తెలుస్తుంది. ఆ సత్యస్వరూపుడైన ఆ సద్గురువుని మనస్సులో ప్రతిష్ఠించుకొని మనము నిత్యమూ ధ్యానం చేసనా వస్తే ఏమౌతుంది...ఆయనను

"పూర్ణచంద్రుడై పూజించువారలకు ప్రత్యక్షమౌ శ్రీ సద్గురుమూర్తి

దీని మూలంబే సదా శివరామ నామమే" అది ఏం చూపిస్తుంది తెలుసునా "రమ్యమైన రహదారి" ఆ త్రోవలో ఎవరూ పోలేరు అది చాలా కఠినమైనది...చాలా సులభమైనది...చాలా సంతోషమైన మార్గం...రమ్యమైన రహదారి...ఎక్కడ చూపిస్తుంది?

**"తనలోనే తాను తన్మయత్వమెరిగి తర్కించి చూచిన తేటతెల్లమౌ తేజవెుువ్వ"**

ఈ మూడు లైనులు వచ్చినాయండి యాభైఏడులో. ఈయనను యాభైనుంచి చేస్తే, యాభైఏడులో...మాకు గురువు రూపంతో వచ్చిన తర్వాత....ఈ మూడు లైనులు వచ్చినాయి. రాలే ఇంకో నాలుగవది...తిరిగి తిరిగి తిరిగి తిరిగి అలసి సొలసి ఆయన దాపు చేరితే...ఆయన కూడా ఒక ఆరు నెలలు అయిన తర్వాత విజయదశమి ముందుట్లో...అక్కడ చెరువంతా నీళ్ళు నిండింది...అక్కడ ఒక రాయి వుంది...ఆ రాయి మీద కూర్చుని ఉత్తర దిక్కులో కూర్చుంటే అప్పుడు వచ్చింది...

**"పండులోపల పండి పండు వెలుపల పండి పండినపుడే ప్రకాశించు శ్రీ సద్గురుమూర్తివర్యా"**

పండులోపల పండి....ఈడ పండాలంట (తన లోపల చూపిస్తూ)

పండు వెలుపల పండి...పండి పండినపుడే...పంట పండితేనే కదా కోస్తావు....ప్రకాశించు శ్రీ సద్గురుమూర్తివర్యా

ఇప్పుడు పరిగెత్తారు...ఇక్కడ ఎవడో నీ మాదిరిగా వున్న ఎవరో ఒక రూపాన్ని చూస్తూ ఆ సత్యమైన ఆ సాయినాథుడు ఇక్కడ ప్రతిష్ఠింపబడినాడని అందరం వచ్చి ఆ సాయినాథుని పూజిస్తున్నాము. ఆ సత్యస్వరూపుడు, నిత్యకళ్యాణ స్వరూపుడు, ఆ సద్గురుమూర్తి మన హృదయంలో ఉన్నాడని మనకు తెలియజేస్తూ వస్తాడు...తప్పుఒప్పు తప్పుఒప్పు అని చేసేదానికి మనకు మనసునిచ్చాడు. దేవతలకు మనసు లేదు, రాక్షసులకు మనసు లేదు, ఒక్క మానవులకు మనసు ఉంది. విచక్షణ జ్ఞానాన్ని ఇచ్చాడు. రెండు చేతుల పెట్టాడు శమదమాది గుణాలు పెట్టాడు...కామక్రోధాదులు పెట్టాడు.

ఆ...చెప్తాడు కృష్ణయ్య ధర్మక్షేత్రే కురుక్షేత్రే అని...ఆ కురుక్షేత్రం ఎక్కడ వుంటుందో చూడలేదు మనము. మహాత్ములు అనుభవించి రాసిన గ్రంథాలు ఆధారంగా చేసుకున్నాము గానీ మనకి ఏమీ తెలియదు. కానీ నా లోపల అనుభవాన్ని బట్టి చెప్తాను...ఎట్లా అంటే కురుక్షేత్రం అంటే ధర్మానికి నిలయమైన ఈ హృదయము.. ఈ క్షేత్రంలో కామక్రోధాదులు ఒక తట్టు, శమదమాదులు ఒక తట్టు...రోజూ యుద్ధం చేస్తుంటాయి..నేను ఏ పక్షంలో వుంటే ఆ పక్షానికి విజయం. గుడ్డివాడైన అంటే కళ్ళు లేనివాడైన దృతరాష్ట్రుడు ఏం చెప్పాడు...తన బిడ్డలైన అజ్ఞానులై అహంకారంతో వున్నా ఆ దుర్యోధనాదులని కూడా ఏం చెప్పాడు, తండ్రే ధర్మక్షేత్రే కురుక్షేత్రే ధర్మానికి నిలయమైన ఆ క్షేత్రంలో అక్కడ అధర్మమైన నా కొడుకులు యుద్ధం చేస్తున్నారు. ఆయన ముందే చూపించాడు...మన ధర్మక్షేత్రంలో అయన్నీ వున్నాయి...మనది క్షేత్రము...ఈ హృదయంలో నిత్యమూ యుద్ధం జరుగుతున్నది. ఆ యుద్ధం ఎక్కడ ఉందో మాకు తెలియదు కానీ మా గురువుగారు చూపించింది ఇక్కడ జరుగుతున్న ఈ హృదయంలో మాత్రం ఈ శమదమాది గుణాలకు ఆటపట్టైతే గెలుస్తాడు లేదా కామము, క్రోధము, లోభము, మోహము, మదము, మాత్సర్యమూ...రావణాసురుడంటాడే

దంభము, దర్పమూ, ఈర్ష్య, జుగుప్స ఈ పది గుణాలు నిన్ను ముంచి తెలుస్తాయిరా...బంధువులంటివే ఈ బంధువులంతా ఎంతవరకు ఉంటారంటే అంతవరకుంటారు. అయితే ఎట్లా అన్నాడు? ధర్మరాజు చెప్పాడు.

**సత్యం మాతా పితా జ్ఞాన ధర్మో భ్రాతా దయా సఖా**
**శాంతి: పత్నీ క్షమా పుత్రో షడయతే మమ బాంధవా**

శాంతం అనే గుణం వుంటే భార్య కన్నా ఎక్కువగా చూస్తారు, ఓర్పు వుంటే కొడుకు కన్నా ఎక్కువగా చూస్తారు...సత్యం, సత్యం నీ కంటిచూపులో వుంది సత్యం మాత..తల్లి.....పిత జ్ఞాన, మన లోపల వుండే జ్ఞానం...దయ సఖ...స్నేహితుడుగా వుంటాడు.

చూసావా! ఈ ఆరు గుణాలు మనము సంపాయించుకుంటే, ఆ పది గుణాలు వదలి ఈ ఆరు గుణాలు సంపాయించుకుంటే, ఆటపట్టె యుద్ధంలో గెలుస్తాము...యుద్ధంలో గెలుస్తామా రాజ్యం ఏలుతాము యుద్ధంలో చస్తామా స్వర్గం వస్తుంది. ఒక చీమ చూడండి పిపీలికము...పానకము తాగేదానికి దాని చుట్టూరా తిరుగుతుంది, చస్తానని భయపడుతోందా? కానీ మనకేమో భయము, జీవుడు కదా..ఆ! వాడు చంపుతాడేమో, వీడు వచ్చి నా ఇల్లు ఆక్రమిస్తాడేమో...ఆ పక్కన వున్నవాడు పూజిస్తాడో లేదు...వాడు కుట్ర పన్నుతున్నారు అని వీడు సంశయాత్మకుడై కేవలం పరిపరివిధాలుగా మనసును పోగొట్టుకుని...ఆదివ్యాధుల పీడితుడై. ఏకాగ్రత చేసుకొని మన హృదయంలో వున్న ఆ సత్యస్వరూపుణ్ణి చూస్తున్నాము ఈ చుట్టూ కానీ ఈ శరీరంలో ఉండి నడిపేవాణ్ణి మాత్రం చూడలేకున్నాము...అంత చూస్తున్నాము కానీ లోపల నడిపే ఆయనను చూడలేకుండా వున్నాడు.

అందుకే ఈయనను ఆశ్రయించాడు. ఈయనను ఆశ్రయించే ముందట్లో, చిన్నప్పుడు చేస్తే, ఈయన కొన్ని విషయాలు చెప్పి మరుగైనాడు. మా తల్లి విషయంలో యాభైమూడులో మరుగైనాడు తరువాత ఏ తల్లి కోసమైతే తపన పడి చేసావో...అటువంటి తల్లులు, అటువంటి తండ్రులు ఈ ప్రపంచంలో ఎంతోమంది వున్నారు...వారి కష్టసుఖాలను దూరం చేసేదానికి కావలసినది ఇస్తాను. ఎప్పుడు నీకు

ఏది కావలెనా అది తినిపిస్తాను పాలు ఇస్తానో...నీళ్ళు ఇస్తానో...నువ్వ దానితో తృప్తిగా వుండి నాయందు ఏకాగ్రం చేస్తే ఎవరేది కావాలనినా నెరవేరుతుంది. అసాధ్యమైన కోరికలు కాదు...సాధ్యమైన కోరికలు...అని ఆ సద్గురువు కరుణ ప్రేమతో వరము ఇచ్చినందువలన ఇక్కడికి వచ్చాము. దీర్ఘ వ్యాధులు ఉన్నప్పటికీ కూడా...ఎదురుగ వస్తే కూడా ఒక రెప్పపాటులో మరుగైతా ఉండింది. ఆయమ్మకు తెలుసు (అమ్మయ్యను సూచిస్తూ)...ఆయమ్మ ఎదురుగ వస్తే...నాయన ఆయన ఎదురుగా పోవద్దు నాయన...కాస్త ఓర్పుగా వుండండి...మీ మనసు ఏకాగ్రత చేసినాక పోదురు...ఏం అంటే...మీరు పోయినప్పుడు...ఆయనకిచ్చిన్న వరంతో మీ వ్యాధిని గుంజుకుంటాడు...కానీ మీరు మనసు ఏకాగ్రత లేకపోతే ఆయన తపన పడతాడు...మళ్ళా మీరు అనుభవిస్తారు.

మీరు దృష్టిలోపం లేకుండా ఏకాగ్రంగా మనసునుంచి మీరు ఆ పరబ్రహ్మను, పరమాత్మను, ఆ సద్గురువును...మీకు నచ్చిన రూపముతో, ఫలాని రూపంతో చేయమని మేము నిర్బంధించలేదు. రామ అను..కృష్ణ అను..గంగమ్మ అను పోలేరమ్మ అను ఏదైనా సరే ఒక దీక్ష, పట్టుదలతో ఏదిరాలేదు ఒక గోడ మీద పసుపుతో అట్లా అట్లా అలికి ఒక చుక్కపెట్టు, కుంకుమ బొట్టు అమ్మ అంటారా...నీకు వస్తుందో బలం రాదో చూడు. అది రాకపోతే మీరు ఏ శిక్ష విధిస్తే ఈ శరీరానికి అది అనుభవిస్తాను ఊం...రేపే ప్రారంభించండి. ఒక గోడ మీద...పటం కొనాలంటే డబ్బుకావాలి...దానికి అంత పసుపు రుద్దుతాము కదా...పసుపు ఎట్లా తెస్తాము అంటే మనము పప్పులో ఉప్పులో వేసుకుంటాము కదా..అది రుద్దుకుంటాము...ఒక కుంకుమ బొట్టు పెట్టుకో...తదేకదృష్టితో ఊరికే అలా చూస్తావుండు రెప్పకొట్టకుండా...నీకు నచ్చిన పదం తిప్పు...కాలక్రమేణా ఏమౌతుందంటే...నీకు ఏకాగ్రత వచ్చినప్పుడు అక్కడ శూన్యమౌతుంది...అక్కడ పసుపు లేదు, కుంకుమబొట్టు లేదు..అది ఎప్పుడు అయిపోయిందో త్రికరణశుద్ధిగ మనసు వాక్కు కర్మ

ఒకటైతే...నాకు జయమైందని...ఎవరిమీదంటే వారిమీద విర్రవీగకుండా...ప్రశాంతతతో...తోటివాడిని నువ్వు గౌరవిస్తూ వస్తే జన్మ సాఫల్యమౌతుంది...వచ్చినందుకు కీర్తి వస్తుంది.

చూడండి, ఆయన ఎప్పుడో శరీరం లోపల మరుగు చేసి...నేటికీ వెలుగుతున్నాడు...ఈయన చూడండి ఎప్పుడో సమాధిలో ఉండి మన అందరినీ రక్షించి కాపాడుతున్నాడు...ఎక్కడ షిర్డీలో ఉండి...మన అందరి హృదయాల్లో ఉండి..అయితుందా...ఒక ఇండియానే కాదు ఖండఖండాతరాలలో కూడా ఈయన పేరు మారుమ్రొగుతుంది సాయి..సాయి అంటే ఇసా..ఇసా అంటే రూహుల్లా..రూహు అంటే జీవి..జీవికి అధిపతి

**లా ఇలాహ ఇల్లెల్ల ఇసా రూహుల్లా..**

తొంబయిదోవ పైగంబరు ఈయన...తొంబయిదోవ పైగంబరు ఈయన...అయితే తెలియదు. 'లా ఇలాహ' ప్రపంచం పుడుతుంది సస్తోంది అది నేను కాదు 'లా ఇలాహ ఇల్లెల్ల ఇసా రూహుల్లా' ఇసా అంటే సాయి...ఇసా అంటే సాయి...రామ అంటే ..మర అంటారే...సాయి..జీవి..ఈ జీవికి అధిపతి...ఆ జీవికి అధిపతి అని వారు చెప్పినారే...మనకెట్లాఅయ్యా అయితుందంటే...ఈయన సమాధిలో పోతూ చెప్పాడు...ఎవరైతే నాపేరు పిలిచి చేస్తారో...ఆ పరబ్రహ్మ స్వరూపమైన పరమాత్మని ధ్యానించి నేను ముద్దబంగారుగా ఆయన వద్దపెట్టాను...ఎవరైతే...చేస్తారో...నా దాంట్లోంచి...నా అకౌంట్లో నుంచి వారికి అన్ని ప్రసాదించవలసిందని ఆ జగద్రక్షకుని, ఆపద్బాంధవుని, అనాధరక్షకుని తన హృదయములో నిలుపుకుని కూర్చున్నాడు సిద్ధపురుషుడు...యోగపురుషుడు...జ్ఞానపురుషుడు... అటువంటివారు మనమందరము భక్తితో కొలిస్తే...తొంభైతొమ్మిదిలో పరుగు పరుగున పరిగెత్తి ఒక రెప్పపాటులో వచ్చి కూర్చున్నాడు అక్కడ ప్రతిష్టింపబడ్డాడు. అక్కడ ప్రతిష్టింపబడినడాంటే మన హృదయంలో ప్రతిష్టింపబడినాడని. ..మనము జాగ్రత్తగా ఆయనయొక్క సచ్చరిత్రను...ఆయన ఏ విధంగా నడచి మనను నడచమని ప్రబోధించాడో...వాటిని మనము క్రమంగా

చేస్తూ చేస్తూ వస్తే మనం కూడా ఆయన సేవకు అర్హులమౌతాము. ఇతరప్రాణిని నొప్పించకుండా శమదమాది గుణాలకు మన మనసు ఆటపట్టై ఏకాగ్రతయు...తరించేదానికి...మన జన్మ సాఫల్యమయ్యేదానికి....

ఆ సద్గురువు సన్నిధికి వచ్చాము. గురు పౌర్ణమిలో మనమందరము ఐక్యంగా ఎట్లా ఆ సర్వేశ్వరుని ప్రార్థన చేస్తున్నామో, పౌర్ణమి అంటే తేజోస్వరూపమైన కాంతి. మన లోపలే వుంది. కాలిబొటన వేలి నుంచి కపాలం వరకు ఆడుతున్న ఈ సత్యమైతే ఉందో, అన్ని అవయవాలు వున్నా బలాన్ని కేంద్రీకరించి కపాలానికి ఎట్లా చేర్చాలనే దానిని తెలుసుకుండేదానికి సద్గురువును ఆశ్రయిస్తూ, వారేం చెప్తారంటే, ఏకాగ్రతగా నీలో ప్రవహిస్తున్నది, దానిలో నన్ను జత చెయ్యి. మనసును, నీ మనసులో కుదుటగా జత చేసి అంటే ఏదో ఒక పేరుతో నన్ను పిలిస్తే నేను వస్తాను. అయ్యా! రూపనామక్రియలు లేని నిన్ను నేను ఎట్లయ్యా నిన్ను పిలిచేది అని. అరెరెరె! నీకు అవయవాలు అన్ని వున్నప్పుడు నేను వేరే రూపంతో వస్తే నీవు ఎట్లా తెలుసుకుంటావు? నేను అవయవాలాతో వస్తేనే తెలుసుకుంటావు అని ఏదో ఒక రూపంతో వచ్చి, ఆయన మనల్ని సవరిస్తాడు. మనకు కావలసినవి అందిస్తాడు. చెయ్యవలసిన కర్తవ్యము, డ్యూటీ నేను చేసినను ఫలితము వస్తుంది అని మాత్రం ఆశించవద్దు. మనము ప్రతిఫలము కోరకుండా పని చేసేది మన వంతు. దానియొక్క ఫలితము కోరవద్దు. నేను అని అహంకారాన్ని చొప్పించుకోవద్దు ఈ శరీరానికి, శరీరములో వున్నప్పుడు ఈ అవయవాలు ఈ విధంగా గంతులు వేస్తున్నాయి. అతడు తొలగిపోయినప్పుడు అయితుంది. ఏంటయ్యా! గాలే కదా తొలిగిపోయింది...అని అంటావు...చూడు చల్లని గాలి వస్తా వుంది...ఆ గాలి మన ముక్కు రంధ్రాలలో వేసి అందించవచ్చు కదా ఎవరైనా...ఎవరు చేసేది...ఒకడు వున్నాడు కదా సృష్టికర్త....ఇవన్నీ మనము ఏ పేరుతోయైన పిలుచుకో...ఏ పేరుతో పిలిస్తే...ఆ పేరుతో పలుకుతాడు.. మనని చెంతకు చేర్చుకుంటాడు. మన కామా

క్రోధాదులను దూరం చేస్తాడు...మనకు ప్రసాదిస్తాడు...నిరంతరమూ తోడు నీడగా వుండి నడిపిస్తాడని నా దృఢమైన విశ్వాసము...ఆయన నడిపిస్తున్నాడు.

నేను తెచ్చుకుంటాను సొత్తు...నీకెందుకని ప్రశ్నించాడు...ఆయన తెచ్చుకున్నాడు...తెచ్చుకుంటాడు...చేయించుకుంటాడు (దర్బార్ సాయినాథ మందిరంలో దొంగలు పడి సొత్తులు ఎత్తుకు పోయిన సందర్భాన్ని సూచిస్తూ)...నీకేమిటి వ్యామోహం అన్నాడు. నాకేం వ్యామోహం లేదు.. ఇప్పుడు మీ దగ్గర ఒక బిడ్డ వుంటాడు నగలేస్తావు, గుడ్డలేస్తావు, మంచి ఆహారం పెడ్తావు...ఆనందంగా ఆ బిడ్డను ఊయలలో వేసి ఊపితే..బాబు నిద్రపోతే ఆనందంగా చూస్తావు కదా..అటువంటి తత్వాన్ని మాకు ఇచ్చాడు..చిన్ని బాబుగా వచ్చి...అందుకే ఇప్పుడు ఎప్పుడైనా...పెట్టి చూడాలని ఆపేక్ష వుంటుంది...ఎందుకు మానవ జన్మ ఎత్తినందువల్ల...మనసు ఉన్నందువల్ల...ఎంత ఏకాగ్రమైనప్పటికీ కూడా అయ్యో నా బిడ్డకి చొక్కాలేకపాయనే...అని అంటాడు కదా...అట్లాగ ఆయన దగ్గర...లేనప్పుడు ఒక రకంగా ఉంటుంది. రుద్రాక్షమాల లేనప్పుడు...మెళ్ళో దండలు లేనప్పుడు...నీ బంగారు అంతా తీసుకుపోయి లాకర్లో పెట్టారే..నన్ను నమ్మలే కదా, నువ్వు లాకర్లో పెట్టించుకున్నావు...నిన్ను నమ్మలేకకాదు. ప్రపంచం యొక్క దోపిడీకి భయపడి, లోకంలో చూపించేదాని కొరకు ఆ పని చేసారు. కాస్త ఆగు ఓర్పుపట్టు అంటున్నాడు. ఎక్కడ పారేసిన వస్తువు అక్కడే ఉంటుందిలే కాస్త ఉండు..**కాలం కోసం కాచుకోవాలిగానీ...కాలం మనకోసం కాచుకోదు కదా** అని ప్రేరేపణ చేసి నిలబెట్టినాడు.

ఇటువంటి పుణ్యపురుషుని, జ్ఞానపురుషుని, సిద్ధపురుషుని మనము నిరంతరమూ తలుస్తున్నాము. ఈరోజు గురుపౌర్ణమిలో గుణరూపము...గుణము రూపము లేని వస్తువు మన లోపల ఆడుతూ ఉంది. దానియొక్క లక్షణము, స్వభావము తెలియాలంటే...మహాత్ముల చరిత్రలు, వారు నడచిన బాటలు...రమణమహర్షి

చేసాడు....రమణమహర్షి లీలామృతము వుంది...సాయిలీలామృతము వుంది...మహాత్ములు నడచినవంటి ఉత్తర రామాయణము వుంది...భారతము వుంది, భాగవతము వుంది...రామాయణంలో రాముడు ఏవిధంగా నడచినాడో దానిని మనం ఆధారంగా చేసుకొంటే....తనను తాను తెలుసుకునేదానికి రామాయణము...తనని తాను తెలుసుకొని సర్వజీవులను నడిపి తృప్తిగా చెయ్యాలంటే భాగవతం చెయ్యాలి...కాబట్టి మనము భాగవతము, రామాయణాలు చేయాలంటే ఈ కాలంలో కాదు...ఏదో ఒక నామస్మరణ, ఏదో ఒక పేరు...ఏదో ఒక రూపము మనము చిత్రించుకుని చేస్తుంటే...ఏ పేరుతో పిలిస్తే...ఆ పేరుతో వస్తాడు....అబ్బా దర్గాస్వామి మా ఇంట్లో పిలిస్తే...కలలో వచ్చి కనొచ్చాడు...దర్గాస్వామి యాడ కానొస్తాడు...నువ్వు పిలిస్తే...నీ లోపల ఆ సత్యస్వరూపుడు, జగత్తుకు ఆధారమైన ఆ ఆయన నీలో ఏదైతే భ్రమ వుందో...ఆ భ్రమతో వచ్చి నీ కోరికను నెరవేర్చినాడు. అయ్యా దర్గాస్వామి అని నీకు ఎందుకు కలిగించాడు అంటే...దానియందు నీకు ప్రేమ వున్నందువల్ల తత్వాన్ని నిరూపించాడు. ఆ పరబ్రహ్మస్వరూపుడు, ఆ పరమాత్మ, ఆ సద్గురువు దాన్ని తెలుసుకోవాలి...దాన్ని మనము నిదానంగా గ్రహించి చేస్తాము...జయమౌతుంది...అందుకు కలిసికట్టుగా ఎట్లా చేస్తున్నామో....అవయాలో కలిసికట్టుగా చేసి దాన్ని నెరవేర్చుకుందాము.

పై ప్రకరణము నుండి గ్రహించిన పూర్తి పద్యము

**పూర్ణచంద్రుడై పూజించువారలకు ప్రత్యక్షమౌ శ్రీ సద్గురుమూర్తి।**
**దీని మూలంబే సదా శివరామ నామమే రమ్యమైన రహదారి॥**
**తనలోనే తాను తన్మయత్వమెరిగి తర్కించి చూచిన తేటతెల్లమౌ తేజమెుప్ప।**
**పండులోపల పండి పండు వెలుపల పండి పండినపుడే ప్రకాశించు సద్గురుమూర్తివర్యా॥**

ఇంకొక సందర్భంలో స్వామివారు ఈ విధంగా చెప్పినారు: “ఆ పరబ్రహ్మాన్ని కూడా అవయవాలు తీసుకుని నిర్వికారుడు, నిరంజనుడు, పరంజ్యోతి స్వరూపుడు, పరమాత్ముడంటే అతను ఆ రూపంలో వున్నప్పుడు మనకు అర్హత ఉండదు. ఒకరోజు ఒక రూపాన్ని నేను చూస్తే ఎప్పుడైనా దాని పేరు గుర్తుపెట్టుకునేదానికి వీలవుతుంది. ఎప్పుడూ ఆ రూపాన్నే చూడనప్పుడు, ఆ కరుణే చూడనప్పుడు, అది ఎట్లాంటిది అని తెలుస్తుంది. కాబట్టి మనం శరీరంలో వచ్చినప్పుడు ఆయనను మనకిష్టమైన పేరుతో, రూపాన్ని మలచుకొని మన హృదయములో పెట్టుకుని, మన చూపులో పెట్టుకుంటూ, మనం అవయవాల్లో ఆయన గుణగణాలని చేర్చుకుంటే, మనం ఒక పని చేయబోతాం, ఇది తప్పు కదా, ఇది ఆ మహనీయుడు చేయడు కదా అని మనం చేయము. అలాగే క్రమక్రమంగా చేస్తుంటే ఆయన యొక్క లక్షణమొస్తుంది. గురువే భ్రమరకీటకం, పాడుపురుగును తెచ్చుకుంటుంది. భయముచేతనో, భక్తిచేతనో దాన్ని చూస్తూ చూస్తూ వస్తే దాని రూపాన్ని పొందుతుంది. మనం కూడా ఆయన గుణగణాలు మననం చేస్తున్నాము, ధ్యానం చేస్తున్నాము నిరంతరం మన లోపల వాటిని ఉపయోగపెడుతున్నాము. క్రమంగా చేస్తూ చేస్తూ చేస్తూ వస్తే మన రక్తములో సమ్మేళనమౌతుంది. మన అవయవాలకు బలమొస్తుంది, తేజస్సు వస్తుంది. అప్పుడు మనకు శమదమాది గుణాలు అలవాటుపడతాయి. జయమౌతుంది.

భగవద్గీత, భగవద్గీత అంటున్నాము. యుద్ధం జరుగుతూ వుంది. గీతలో అంటే ఆం! జరిగింది. కృష్ణభగవానుడు సారథ్యం చేసాడు. పాండవుల తరపున, పుస్తకాలలో చదువుకున్నాము. అది యదార్థమే. కానీ నిరంతరమూ మన లోపల జరిగే యుద్ధాన్ని కూడా మనం చూడాలి. ఏమి యుద్ధం జరుగుతుందయ్యా? అంటే కామక్రోధాదులకు, శమదమాది గుణాలకు ప్రతి నిత్యమూ మన లోపల యుద్ధం జరుగుతోంది. మన మనస్సు దేనియందు లగ్నమౌతుందో అప్పుడు అయితుంది. అందుకే నరునికి నారాయణుడు చెపుతాడు ఉభయసైన్యముల మధ్యన నా రథమును నడుపుము. ఇటు

కామక్రోధాదులు పెట్టాడు. శమదమాది గుణాలు కూడా పెట్టాడు మనకు రెండు. ఊభయసైన్యముల మధ్య మన రథాన్ని నడిపిస్తున్నాడు ఆ సర్వేశ్వరుడు, సృష్టికర్త ఆ పరబ్రహ్మము ఆ పరమాత్ముడు. ఒక మానవరూపంలో వచ్చిన మోహనరూపుడు.

ఏమిచ్చాడు మనిషికి? విచక్షణ జ్ఞానము! మనస్సు! తప్పుఒప్పు అని తెలుసుకునేదానికి ఆయన మన అంతర్ముఖంగా వుండి చెప్పి చేయిస్తున్నాడు. ఒక పని చేస్తుంటే తప్పుతప్పు అని గుండె కొట్టుకుంటుంది. ఒక చెడ్డ పని చేస్తున్నప్పుడు చెడ్డది చెడ్డది అని తోస్తుంది. ఎవరైనా ఎవరికన్నా ఒక తప్పు గానీ, మోసం గానీ చేసుంటే ఆ వ్యక్తిని చూస్తానే గుండె కొట్టుకుంటుంది. ఆయన ఎంత వినయవిధేయతలు వున్నాడు కదా, నాది తప్పుకదా! నాది తప్పుకదా! ఆ సర్వేశ్వరుడు మన దగ్గర వున్నాడని ఉభయసైన్యముల మధ్య ఎట్లా అయితే ఆయన నడుపుతున్నాడో, మోహనరూపుడు. మనకు కామక్రోదాధులు పెట్టాడు. మనకు మనస్సు ఇచ్చాడు. దేవతలకు మనస్సు లేదు, రాక్షసులకూ లేదు. విచక్షణా జ్ఞానముంది. తప్పుఒప్పు తప్పుఒప్పు డెసిషన్ తీసుకునేదానికి, దానిపైన పట్టుదలతో చేస్తూ చేస్తూ వస్తే ఆ అటువంటి సద్గురువు మార్గాన్ని ప్రసాదిస్తాడు. తప్పకుండా జ్ఞానానిస్తాడు. మాకు దృఢమైన నమ్మకముంది. ఆ నమ్మకంతో ఈ రోజు, ఆ సద్గురుని సన్నిధికొచ్చాము. మనమందరమూ ఎప్పుడో ఒక స్థలమున ఉండినవారమే. క్రిందపడి రెండు రెండు కొట్టుకుని ఇప్పుడు మరలా సద్గురుని సన్నిధికి వివిధ రూపాలతో కులుసుకున్నాము సమిష్టితో".

## జనవరి 30, 2011న శ్రీ దర్గాస్వామివారు చెప్పిన విశేషాలు

ఆ పరమాత్ముడిక్కడ ఉన్న ఆ సమాధుల్లో ఉన్నవారి దగ్గరకు మమ్మల్ని చేర్చారు. ఆయన పేరేమిటో తెలుసా? "హజరత్ దర్బార్ అలీషా వలీ రహమతుల్లా" అంటారు. మేమిక్కడకు వచ్చాక "శ్రీ సద్గురు" అని పేరు పెట్టాము. శ్రీ సద్గురు హజరత్ దర్బారు ఆలీషా వలీ. అలీ అంటే ఆంజనేయులు. షా అంటే చక్రవర్తి, వలీ అంటే ఋషి సాంప్రదాయం. ఆ భగవంతుడు, ఆ పరబ్రహ్మ స్వరూపమైన

పరమాత్ముడు రహమతుల్లా కరుణామయుడైన ఆ దేవుణ్ణి హృదయంలో నింపుకున్నాము. ఆ పుణ్య పురుషుడు మా సద్గురువు సమస్తము చేయించాడు. అన్నీ చేసాడు. ఇక్కడున్న వాళ్ళకు స్కూలు పెట్టించాడు. ఇక్కడ ఉన్న సమస్త బిల్డింగులు అన్నీ కట్టించాడు. ఆ భక్త సులభుడు, ఆ సత్య స్వరూపుడు, నిండు సమాధిలో ఉన్నాడు. ఆయనే దర్బార్ అలీషావలీ. అలీ అనే ఆయన మన సాయినాథుని చరిత్రలో దత్తాత్రేయుని అంశలో వచ్చినవాడు సద్గురువే అయ్యేను. ఆయన సన్నిధిలో ఒక వ్యక్తిగా వున్నవాడే ఆయన గురువు దగ్గర రెండు పుల్లలు తెచ్చి ఇక్కడ నాటి వాటిని నిలబెట్టుకుంటూ వచ్చారు. జువ్వి చెట్టు వుంది. నేరేడు చెట్టు లేదు. అప్పుడు అక్కడ సమాధి అయినారు. ఇక్కడ వుండి నిలబడినవారు తెలుసా: శివతత్వం నమామీశ్వరం సద్గురుం సాయినాథం అంటావే అటువంటిదే. అలీషావలీ రహమతుల్లా కరుణామయుడు ఆంజనేయులంటావే ఆ సద్గురువుగారు ఇదే టైములో 1957లో పాదం పెట్టాడు. రాత్రిపూట నొసళ్ళు పిసికాడు.

తనలోని అంతశ్శక్తిని నాలోపల ప్రవహింపజేసి ప్రపంచంలో వున్న వస్తువులు నీ వెంట రావు, ఇవి శాశ్వతం కావు అని బోధ ఇచ్చి ఇక్కడకు పంపించి ఆ సద్గురు సన్నిధిలో నిలిపారు. మీరు ఇక్కడకు వచ్చి భజనలు, పూజలు చేస్తున్నారంటే మీ మనోభీష్టాలు, కోరికలు నెరవేరుతాయి. పరబ్రహ్మ స్వరూపుడైన పరమాత్ముడైన ఆ సద్గురువు దర్బార్ ఆయనే సాయినాధుడు. దర్బార్ సాయిరూపంలో ఇక్కడకు వచ్చి నిలిచాడు. పంచలోహాలతో వస్తానన్నాడు. పంచలోహాలతో వచ్చారు. అందరి పూజలు అందుకుంటున్నాడు. అటువంటి పరబ్రహ్మ స్వరూపుడి యొక్క భజన చేసి మనమందరమూ ఈ రోజు భక్తిపూర్వకంగా వారి వారి మనోభీష్టాలను కోరుకున్నవి లభించాలని ఆ పరమాత్మ స్వరూపుడైన శిరిడీ సాయిని నా హృదయంలో ధ్యానించి మీ అందరికీ ఆశీస్సులీయమని కోరుకుంటున్నాము.

# తస్మై జాగ్రత్త జాగ్రత్త

ఒకసారి కొందరు విద్యార్థులు దర్గాస్వామి వారి వద్దకు వెళ్ళినప్పుడు, వాళ్ళు అడిగిన విషయమై స్వామివారి సంభాషణ ఇక్కడ పొందుపరచబడినది:

**స్వామి:** నువ్వు నన్ను అడిగిన ప్రశ్న చాలా గొప్పది: భగవంతుని ప్రేరేపణతో, ఏ పనైనా ఆయన మన లోపల ఉండి చేయిస్తున్నాడు కదా అన్నావు, అదే కదా?

**విద్యార్థి:** అవును స్వామి

**స్వామి:** నేను నీ గురువుని; నా నడక నీకు రావాలా వద్దా? చెప్పవోయ్, తంతా ఎగిరి కాల్తో, చస్తావు ఇప్పుడు నా చేతిలో.

**విద్యార్థి:** రావాలి స్వామి

**స్వామి:** నేను బ్రాందీ తాగే వాడినా? సారాయి తాగే వాడినా? వ్యభిచారినా? వేరే ఆలోచనలు ఉండే వాడినా? అటువంటి గురువు దగ్గర పొందినప్పుడు మనమే స్థితిలో ఉండాలి?

భగవద్గీతలో కృష్ణుడు ఏమి చెప్పినాడు? అన్ని పనులు నే చేయిస్తున్నాను అంటే, వాని విధి కర్మలను బట్టి వాడు చేసినా కూడా, నువ్వు బాధ్యతగా వుండు అని ఆయన చెప్పినందుకు, దాన్ని తీసుకొచ్చి, "గురువు నాలో ఉండి చేయిస్తున్నాడు " అన్నావు కదా! అన్నావా లేదా?

**విద్యార్థి:** అన్నాను స్వామి

**స్వామి:** గురువు నీలో ఉండి చేయించేది మంచి కార్యాలు చేస్తాడా? చెడ్డ కార్యాలు చేస్తాడా?

**విద్యార్థి:** మంచి కార్యాలే

**స్వామి:** మా గురువు దగ్గర ఉపదేశమయినాదండి. ఆ గురువు యొక్క నడక నాకు కావాలా వద్దా?

**విద్యార్థి:** కావాలి

**స్వామి:** గబ్బు పురుగేరా భ్రమర కీటకము, భయం చేతనో, భక్తి చేతనో దాని రూపాన్ని పొందుతుంది. మనం కూడా ఆయన పాదాలు చూస్తూ తిరుగాడుతోంటే, ఈ సచ్చరిత్ర చదువుతున్నామంటే, దీంట్లో

నుంచి ఒక్క గుణమన్నా మనం మంచిది తీసుకోవాలా వద్దా? వద్దా అయ్యా?

**విద్యార్థి:** తీసుకోవాలి

**స్వామి:** ధర్మరాజు 'అశ్వత్థామ హత: కుంజర:' అని పాపం చేసినాడు కాబట్టి, నేను ఎన్నైనా చెప్తాను. కీచకుడు సైరంధ్రిని పట్టడానికి పోయినాడు, చచ్చాడు. సంకల్పం మంచిది ఉండాల్నా? చెడ్డది ఉండాల్నా?

**విద్యార్థి:** మంచిదే ఉండాలి

**స్వామి:** నువ్వు అడిగిన ప్రశ్న మంచిదే. భగవానుడు నాలో ఉండి ప్రేరేపణ చేస్తున్నాడు అంటే, పరిపూర్ణ అవతారుడైన పరబ్రహ్మము నాలో ఉన్నాడు వాసుదేవుడుగా. నేను జీవుడు కాను; ఆయన యొక్క లక్షణం ఉంది; నన్ను జీవుడు అని ఎందుకు అంటున్నారు? భయం ఉంది; నా ఇల్లు, నా భూమి, నావి నావి అని అంటున్నారు, నేను అన్నది ఏదో తెలియక. నా శరీరము అంటున్నానేగాని ఈ శరీరాన్ని నడిపే సత్య స్వరూపము నేను అని తెలుసుకోవడం లేదు. సబ్ కా సత్తా, అల్లా మాలిక్" అనేది తెలియాలి, అందరిలో ఉన్న సత్యమే నేను అని గ్రహించినప్పుడు, హింస రాదు నాయనా!

సద్గురువు నాలో ఉండి నడిపిస్తున్నాడు కదా, ఆయన ప్రేరేపణతో నాలో నుంచి ఈ పనులు అవుతున్నాయి అని అంటావే, అది మంచిదా చెడ్డదా అనే విచక్షణా జ్ఞానం నీకు ఇచ్చాడా లేదా? తప్పు, ఒప్పు, డెసిషన్ లేదూ?

**విద్యార్థి:** ఇచ్చారు స్వామి

**స్వామి:** ఉండినప్పుడు నువ్వు ఎట్లా పోతావయ్యా? ఉదాహరణ కూడా చెప్పాను కదా, ఆమె చేతిలో ఒక ఉంగరం ఉంది. ఉంగరం తీసుకోమంటోంది చూపు. మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అంటోంది, "ఆమె అబల, పైన పడు" అంటోంది. నువ్వు లేస్తే అవుతుందా? ఊరికే ఉంటే అవుతుందా?

నేను ఎందుకు చెబుతున్నానంటే, మనం ఎప్పుడూ జాగ్రత్తగా మెలగాలి. ఇతరుల చేతిలో మనము ఎప్పుడూ ఇరుక్కోకూడదు. ఎందువల్ల చెబుతున్నానంటే, దైవ ప్రేరణ అయ్యింది కదా అని, ఒక లేడీనే కాదు,

ఒక ఫ్రెండ్ షిప్పే కాదు, ఎవరైనా కాదు, భగవంతుడు నాకు ప్రేరేపణ చేసాడు లోగూడమని ఏమో అని కూడిపోతాము. "First remove that from your brain and heart" నాకూ రవంత ఇంగ్లీష్ వస్తాది.

బాబూ, పరమాత్ముడు ఈ శరీరాన్ని ఎందుకు పంపించాడు? దీంట్లో ఆయన చొరబడినాడు. ఆయన చొరబడినప్పుడు తప్పు, ఒప్పు అనే నిర్ణయం (డెసిషన్) తెలుసుకోవడానికి మార్గం ఇస్తాడు. బండి పోతూ ఉంది, అది ఇటువైపు కూలబడుతుందా? అటువైపు కూలబడుతుందా? కాదు. సెంటర్ ఆఫ్ గ్రావిటీతో జాగ్రత్తగా నడిపిస్తే పోతుంది. అట్లే మనలోని ప్రేరేపణ శక్తి - "అంతర్వాణి" యొక్క లక్షణాన్ని విని, సక్రమంగా నడుస్తూ వస్తే కానీ ఏమీ రాదు. అదే గురునానక్ భక్తులకు చెప్పినది.

నిన్ను నేను కొట్టలేదు, తిట్టలేదు. సరి అయిన ప్రవర్తనలో నడవాలని కోరుకుంటున్నాను. ఆ!...... మా భగవద్గీతలో చెప్పారు కదా, జూదం ఆడేవాడిలో నేనే వున్నాను, వ్యభిచారిలో నేనే వున్నాను, అన్నీ నా ప్రేరేపణతో జరుగుతున్నాయి అని అంటాడే: అట్లాగాక "భగవంతుడు నాలో వుండి పనులు చేయిస్తున్నాడు" అంటే "ఏ కార్యాలు చెయ్యాలి? ఏ కార్యాలు చెయ్యకూడదు? ఉన్నతం ఏమీ లేదూ?"

(భగవద్గీతలో) శ్రద్ధాభక్తుల్లో సత్వ రజో తమో గుణాల యొక్క లక్షణాలు గురించి చెప్పలేదూ? మనిషి అవి ఉపయోగించడు! దాని యొక్క స్వరూపాన్ని తెలుసుకొని దాన్ని మొదట తొలగించాలి (ఫస్ట్ రిమూవ్ దట్). బాగా సమ్మెట దెబ్బలతో కొట్టాల. కొరివి తీసుకుని కాల్చి పారవెయ్యాల, కండ్లల్లో కామం లేకుండా, మనస్సులో చింత లేకుండా.

"చింత దీర్చుటకెంత మోడి రా అంతరాత్మ చెంత రాక నే నెంత వేడుకొందురా రాఘవా" అని కొట్టుకొని చస్తా ఉండాము మేము చిన్నప్పుడు... "పంతమేలరా ఓ రాఘవా" అని.... ఆ పరమేశ్వరుడు మనకు అన్నీ ఇస్తాడు. మంచేదో, చెడేదో కూడా తెలియ జేస్తాడు. నడవాల్సిన గుణం కావాలి కదా? దానికే కదా గురువు దగ్గర పండుకునేది? మనం మరి ఆ గురువు చెప్పింది గ్రహించకుండా......, తస్మై, తస్మై, తస్మై శ్రీ గురువేనమ: అనడం ఎందుకు?

ఆయన మనలో ఉండి చేస్తున్నాడు అంటే, ఆ స్వామి ఈ పని చేసేవాడా? మా గురువు ఈ పని చేస్తాడా? అంటే, (నాలాగే) బ్రహ్మంగారు, నీలాంటి శిష్యులు అందరినీ తీసుకొని, వెడుతోవుంటే, నేను (బ్రహ్మం గారు) ఏమి చేసానంటే, వెళ్లి సారాయి అంగడిలో ఓ ముంత కల్లు తాగాను. మీరందరూ కూడా వెళ్లి ఛాన్స్ రా అని తలో ఒక ముంతా తాగేశారు. అప్పుడు వాళ్ళని చూసి నేను (బ్రహ్మం గారు), "ఒరేయ్, ఈ నా కొడుకులికి బుద్ధి రావాల్రా" అనుకున్నాను. గల-గల-గలా కాలిపోయే మూస (సీసం) చేతిలో తీసుకొని లొట-లొట-లొటా తాగితే ఈ శిష్యులందరూ బెంబేలు పడిపోతున్నారు. అప్పుడు బ్రహ్మంగారు, "యేమిరా మీరూ తాగట్లేదే?" అని అడిగారు. "అది తాగితే చచ్చిపోమూ!" అన్నారు (శిష్యులు). "చస్తానని భ్రమ ఉన్న నాకొడక, నే చేసిన పని ఎందుకురా నువ్వు చేసినావు?" అన్నారు. అట్లా అన్నమాట.

ఇంకా, నీలాంటి పిల్లలు ఏమన్నారంటే, సిద్ధయ్య అనే శిష్యుడు నాకు (బ్రహ్మం గారికి) బాగా ఇష్టమైన వాడు అని, సిద్ధయ్యని బాగా ప్రేమతో చూస్తున్నాడు, మమ్మల్ని చూడటం లేదు, అని బ్రహ్మంగారిని నిందిస్తున్నారు. చూసారు. ఒకసారి, బ్రహ్మంగారు బండిలో పోయేటప్పుడు, ఆయన బండిలో ఉన్నారు; సిద్ధయ్య, తక్కిన శిష్యులు అందరూ వెనకాల క్రిందన ఉన్నారు. కొంత దూరం అట్లా పోయాకా అక్కడ క్రింద ఒక చచ్చిపోయిన కుక్క ఒకటి ఉంది. గబ్బు కొట్టి చస్తోంది. అందరూ ముక్కులు మూసుకొని చస్తున్నారు. అప్పుడు బ్రహ్మంగారు, "ఒరేయ్ నాయనలారా, ఇలా రండి" అన్నారు. అందరూ ఆయన దగ్గరకు వచ్చారు. అప్పుడు ఆయన ఆ కుక్కను చూపిస్తూ, "నాయనలారా, భక్షించండి, భక్షించండి!", అన్నారు. 'వాసన వచ్చి చచ్చి పోతోంటే, దాన్ని భక్షించడం ఏమిటి?' అని అలా నిలబడి ఉండిపోయారు. ఇలాంటి దుండగులు ఎక్కడైనా ఉంటారు. అప్పుడు, "సిద్ధా!" అన్నారు; 'గురుదేవా' అన్నాడు; "నాయనా, అది భక్షించు" అన్నారు. 'చిత్తం గురుదేవా' అని వాడు అక్కడకు పోయి, దాన్ని తిందామని దోసిట్లోకి తీసుకోగానే, అది పప్పు-పరమాన్నాలయిపోయింది. అప్పుడు అది చూసి, మిగతా

వాళ్ళందరూ, తినడానికి పరిగెత్తుకు వచ్చేశారు.

అట్లాగ, జాగ్రత్తగా నడచాలి స్వాముల వారూ, సరి అయిన భావన (సద్భావన), సత్ప్రవర్తన తెచ్చుకోవాలి తండ్రీ; ముళ్ళు ఇప్పేది కాదు. అంతే! భగవంతుడు ప్రేరేపణ చేస్తున్నాడని, దేంట్లో అంటే దాంట్లో పడకూడదు. జాగ్రత్తగా నడుచుకోవాలి. తస్మై జాగ్రత్త జాగ్రత్త.

అంటే, నా లోపల తప్పు అనేది ఇమడదు. అందరూ పరిశుద్ధులు కావాలని కోరుకుంటాను.

ఈ మందిరంలో పిల్లలందరూ, మావంటి గురువులు దగ్గరకు వచ్చిన వాళ్లందరూ, ఒక తూరి కాకపోతే రెండు తూర్లలో గాని, మూడు నాలుగు తూర్లు, పది తూర్లలోనైనా, గోల్ కొట్టి తీరాలి. "Arise! Awake! and stop not till the goal is reached" - అని స్వామి వివేకానంద అన్నారు.

మీరు అనుకున్న Aim fulfillment అయ్యే వరకూ మర్చిపోవద్దు ---- **తస్మై జాగ్రత్త జాగ్రత్త.**

అమ్మయ్య చాలా గంభీరమైన వ్యక్తి. చాలా తక్కువగా మాట్లాడేవారు. ఎప్పుడూ జపంలోనో/ధ్యానంలోనో ఉన్నట్టు ఉండేవారు. ఒక జ్ఞానపురుషుని గుర్తించటం, వారిని గూర్చి చెప్పటం అనేది మరొక జ్ఞానికి మాత్రమే సాధ్యపడే విషయం. సామాన్యులు చెప్పటం కష్టం లేక అసాధ్యం. సిద్ధపురుషులు పరమపదించినాక వారిని సంప్రదాయం ప్రకారం సమాధి చేస్తారు. సమాధి చేసిన తర్వాత నలభైవరోజు "మండలారాధన" అని కార్యక్రమం చేస్తారు. తరువాత ప్రతి సంవత్సరం వారి ఆరాధన చేస్తారు. అమ్మయ్య మండలారాధన రోజున స్వామి ఒక పదుహేను నిమిషాలు మాట్లాడారు. దాని రికార్డు నుంచి స్వామి చెప్పిన విషయాన్ని ప్రతిలిఖించి ఈ క్రింద ఇవ్వడమైంది.

"అదే ఒక వస్త్రంతోటి ఆరేసుకుని అట్లే వుండినాము. ఎలాంటిది ఏం కోరలేదు ఈ మహాతల్లి. ఆ దర్గా దగ్గర వుండే సత్రం దగ్గరే మూడేళ్ళు వుండినాము. తరువాత ఒక స్థలం తీసుకున్నాము. ఇక్కడ ఒక కొట్టం

కట్టుకుని వున్నాము. అరవైఐదు-అరవైఆరులో ఇక్కడ కడుతున్నాము. (1965లో భారత-పాకిస్థాన్ల యుద్ధం జరిగి దేశమంతా కొంత కష్టకాలం ఏర్పడింది)....అంగడి వుంటే, వద్దంటే వినకుండా బొంబాయి పోయినారు. అక్కడ వెండిపోయింది. వెండిపోతే ఈ తట్టులో వున్న వాళ్ళంతా ఎగతాళిచేసారు. వెండిపోయింది ఆహారం పెడతారా? ఉరుసులో భోజనాలు పెడతారా లేదా? అని ప్రశ్నించారు. ఊళ్ళోకి ఇట్లా అంటు అయిపోతే ఎన్నికావాలో అన్ని అడిగినారు ఈ తల్లిని. ఆయమ్మ ఒకేమాట చెప్పింది "ఒక్క బియ్యపుగింజ ఒక్క రూపాయి అయినా తెచ్చిపెడతాము" అట్లాంటిచోట వాదించింది. తాను భక్తితో, కరుణతో, ప్రేమతో వచ్చినవాళ్ళను చూస్తూ, ఒక సంవత్సరం నుంచి వంట చెయ్యకుండా పిల్లలు ఏ ఆహారం పెడితే ఆ ఆహారమే తింటాను అని పట్టుబట్టిన పుణ్యవతి, శీలవతి, గుణవతి, ధర్మవతి, సత్యవతి. ఇటువంటి తల్లి మరుగైందని బాధేమీలేదు.

ఆయమ్మ ఎవరిచేత నీళ్ళు తాగనివ్వలేదు. మా ముగ్గురు, మేము అన్నదమ్ములం. వాళ్ళు ఇద్దరు ఇచ్చారు. (అమ్మయ్యవాళ్ళ తోడికోడళ్ళ చేతి మీద ఏదన్నా ఇస్తే తిన్నారు అని భావం) కడపలో తలుపుల మల్లిఖార్జునశెట్టి భార్య ఇక్కడకి వచ్చి వస్తే, ఆమె ఏదైనా అంత రొట్టె చేస్తే, పాలిస్తే తాగినది గానీ వాళ్ల కొడుకుల చేత, బిడ్డలచేత, ఎవరిచేతగానీ తాగలేదు, తినలేదు. కంటికి రెప్పగా ఈ శరీరాన్ని చూస్తావచ్చింది. పన్నెండుమాసాల ముందు మాకు అర్థంలేని ఒక స్థితిని తెచ్చిపెట్టినాడు ఆ పరబ్రహ్మము, ఆ పరమాత్ముడు, ఆ సద్గురుమూర్తి. ఈ ముఖమంతా పగులగొట్టారు ఎవరో (సింబాలిక్‌గా చెప్పినట్టు), అది ఏమో తంత్రమో, మంత్రమో, యంత్రమో, ఖర్మమో మిగతావి ఏవో తెలియదు. అందరితో చెప్పుకుంది ఆ మహాతల్లి. "ఒక్కపూట కూడా తినలేదు, పాలు కూడా తాగలేదు, పదునైదురోజులైంది" అని చెప్పింది. డాక్టర్ బయారెడ్డి, బయారెడ్డి భార్యను రమ్మన్నారు. వారు చూసారు, కడుపులో ఏమైందమ్మా అన్నారు. నవ్వినాడు స్వామి! అమ్మాయ వచ్చి "అహ్! ఆయనకు ఏముందయ్యా! ఆయన ఏం తింటున్నాడని చెప్పాలి" అని చెప్పింది ఆ మహాతల్లి. అప్పుడు బయారెడ్డి

వాళ్ళు వచ్చి ఆడ పండుకుంటే వాళ్ళిద్దరూ వచ్చి డాక్టరు, డాక్టరమ్మ వచ్చి చూసారు. "నాయనా, ఒకటి చెప్పు నాయనా!" అన్నాడు. "బ్రహ్మమురారి సురార్చితలింగం! నిర్మలభాషిత శోభిత లింగం" అని నా పొట్టమీద చెయ్యిపట్టి చెప్పండి నేను వచ్చి కూర్చుంటాను అది పోతుంది అని చెప్పాడు. తరువాత ఏమి లేదు. బాగైంది.

ఆహారంలోనే నియమము. నాకు మా గురువుగారు 1960లో, కడపలో అవధూత వున్నాడే, చెంపమీద ఒకపెట్టు పెట్టాడు. అక్కడనుంచి వెళ్ళిపొమ్మన్నాడు. కానీ డెబ్బై ఎనిమిది వరకు అక్కడ ఆగి వున్నాడు. ఆయనేం చేసినాడు తెలుసా? నాకు లంబికాయోగాన్ని ఇచ్చాడు. ఈ పెద్దనాలుకను లోపలపెట్టి చిన్న నాలుకతో జతపరిచినాడు. ఆకలిదప్పులు దూరమై, అనంతకోటి స్వరూపమైన, ఆ పరబ్రహ్మ స్వరూపమైన ఆ పరమాత్ముని యొక్క లీలలో వుండేటట్టు, ఈ బయలు ప్రదేశానికి మా ఇద్దరినీ చేర్చాడు.

ఆ పరాప్రకృతి, ఆ జగన్మాత, తను ఎవరి గొప్ప చెప్పాలని తన పిల్లలను పిలిపించుకుంది. ఎప్పుడు? పదోతేదీ రాత్రికి అందరినీ పిలిపించుకుంది మరిది పిల్లలను, కొడుకులను, కోడళ్ళను. "ఎవరమ్మా? స్వామిని చూస్తారు?" అంది. వాళ్ళకు అర్థం కాలేదు. "సరే! మీరందరూ భోంచేసి వెళ్ళిపోండి" అంది. తెల్లవార్ల పన్నెండు గంటలప్పుడు దర్గాలో ఒక లోటా పాలు, ఒక లోటా నీళ్ళు పొయ్యమని చెప్పింది. అక్కడ వున్న పిల్లకాయలకి, వీళ్ళు భ్రమపడి "అమ్మా! నువ్వు కలవరపడుతున్నావు" అన్నారు. "నేను కలవరపడలేదు నాయనా! బాగున్నాను చూడండి" అని చెప్పింది ఈ తల్లి. తరువాత మూడయింది. పాలిమ్మనింది. చిన్ముద్రతో ఇలా చేసుకుంది. లో బి.పి. అన్నారు. పరమాత్ముడిలో ఐక్యమైంది. వాళ్ళంతా డాక్టర్లు వచ్చి చూశారు. పది నిమిషాలు అయిదు గంటలు అన్నారు. కాదు, ఏడూ పదైదు గంటలకు, ఏడుగంటల పదైదు నిమిషాలకు పరమపదించింది.

ఆరు గంటలకు ఇక్కడ బయారెడ్డి, బయారెడ్డిభార్య వచ్చారు. నన్ను రమ్మన్నారు, ఆ రాత్రి పన్నెండు గంటలకు నా వళ్ళో వచ్చి కూర్చుంది. ఇక్కడ కూర్చుంది. ఇక నేను ఎక్కడకి పోవాలా? ఎవరి

దగ్గరకు పోవాలా? ఏమని అడగాలా?" మీరు పోండి, చూడండి, బాడీ ఎత్తుకొని రాండి, ఆమెను తీసుకొని రండి, అంతే కానీ నేను అక్కడకి ఎక్కడకీ వచ్చేదానికి లేదు" అని నాలోనించి పలికించాడు ఆ పరమాత్మ, ఆ పరబ్రహ్మ, సద్గురుమూర్తి. ఆయమ్మ డాక్టరు దగ్గరకి పోవాలంటే ముందు పర్మిషన్ తీసుకోమనింది. "అమ్మా! అయ్య పొమ్మన్నాడు అన్నారు. ఎక్కడికన్నా? మద్రాసుకు, ఎక్కడకికన్నా పోవాలంట అమ్మ, డాక్టర్ చెపితే ఒప్పుకోవాలంట" అని చెప్పారు. "ఆయనను అడగండి అనింది" ఆయనకు వీళ్ళు ఫోను చేస్తే ఏం చెప్పాడు. "శనివారం, ఆదివారం ఆమెను అక్కడినుంచి తరలించేదానికి లేదు. ఆమెను అక్కడినుంచి కదిలించవద్దు వద్దు వద్దు వద్దు" ఎందుకు వద్దన్నాడో ఏమో ఆ పరమాత్మునికే ఎరుక. ఇక్కడ నుంచి రామాపురంలో నుంచి కార్లో వస్తావుంటే, ఇక్కడనుంచి ఒకరిని పంపించారు. దూరదర్శంలోనే సాయి దాంట్లో నా యొక్క జీవితాన్ని రంగారావుగారు, కె.వి.రంగారావుగారు అని పబ్లిష్ చేసి వున్నాడు. వాళ్ళు హైద్రాబాద్‌లో, సాయి దూరదర్శనంలో ప్రింట్ చేసారు, ఆ రోజే వచ్చింది. మాస్టర్ భరద్వాజ చేసిన సాయి పుస్తకము వచ్చింది. రెండు ఆ తల్లి చేతికి పంపించాము, ఆ తల్లి తన దగ్గర పెట్టుకుంది. అటు ఆ పరమాత్ముని చూసింది, ఇటు శరీరానికి అధికారిగా వున్న వ్యక్తిని చూసింది. తనలో తాను ఆ పరమాత్ముని ధ్యానం చేసి నిష్క్రమించింది. ఆ సమాధిలో పోయింది. నిర్వికల్ప సమాధిలో ఆ సద్గురుమూర్తిలో కలిసింది. ఆ మహాతల్లిని గూర్చి నేను చెప్పేదానికి ఏం లేదు. స్వార్థమౌతుంది. నేను ఆయమ్మను, ఆయమ్మ వచ్చి నాలో వుంది కాబట్టి, ఏం చెప్పేదానికి ఏంలేదు నాయనా!

తొట్టతొలి ఇలా వచ్చింది. ఈ చెయ్యి వేసినందుకు ఎంతమంది అన్నారో! ఎన్ని మాటలన్నారో, ఆమె అండగా వున్నప్పుడే నేను ఈ ప్రపంచంలో వుండేదానికి వుంటుంది. ఆ పరాప్రకృతి లేనప్పుడు ఎక్కడ ఎక్కడ ఉంటాడో పోతూ పోతూ యాభైఏడులో చెప్పుకుంటూ చెప్పుకుంటూ (ఆ కొట్టంలో)? వున్నాడు. ఈమెకి యాభైతొమ్మిదిలో కుడికాలికి దెబ్బతగిలింది. అప్పుడు మాకు అన్ని ఇచ్చాడు కన్నతండ్రి.

ఈ మహాతల్లి వచ్చి కాపాడింది. కుప్పం ఆయన సుబ్బరాయుడు వచ్చి అమ్మకు దెబ్బ తగిలింది అంటే "చావలేదు పోరా!" అన్నాడు. అట్లాంటి ఆమె చనిపోయిందయ్యా! దెబ్బతీసినప్పుడు ఆ శరీరము వదిలిపోతుంది అని భయపడింది లేదు. అరవైఏడులో మళ్ళీ అయితుంది అని చూసింది. ఇద్దరమూ పోటీ చేసాం. ఆ పరమాత్ముడు "ఆ జలరూపంతో ఏమాత్రం కాదు, నాయనా! వచ్చిన పని పూర్తి అయిన తర్వాతనే" అన్నాడు. తాను వచ్చిన పని పూర్తి అయితే సరైన రీతిలో ఔతుంది.

అదే విధంగా ఈ మహాతల్లి విష్ణుసంజాతురాలు, ఆమె జలతత్వంలో పోయింది. నాది రుద్రతత్వం నాయనా! మేమిద్దరూ ఒకటే. మహాలక్ష్మి ఒకటే, రుద్రుడూ ఒకటే. వానిని విడిచి ఈమె వుండలేదు, ఈమెను విడిచి వాడుండలేదు. ఇద్దరూ ఒకే భావన. "ఏకమేవాద్వితీయం" ఒకే వస్తువు రెండు అయ్యింది కానీ రెండు ఒకటి కాదు. "సద్గురుమ్ తమ్ నమామి! సద్గురుమ్ తమ్ నమామి! " ఈ మహాతల్లి త్యాగశీలతతో, పట్టుదలతో, చేతలతో మనకు చూపించిన రస్తాను, మనమందరమూ కూడా చేస్తే మనలోపల వున్న సత్యం మనందరమూ కూడా తెలుసుకుని, ప్రతిజీవిని ప్రేమించే తత్వాన్ని ఈ మహాతల్లి చాటి చెప్పింది.

అన్ని జీవుల్ని సమత్వంతో చూసినప్పుడు, ప్రేమతో చూసినప్పుడు, ప్రేమతత్వాన్ని మనలో ఇముడ్చుకుంటే ఆ సద్గురువు సాయి యొక్క మహాత్తు అంతా మన ఒళ్ళులో ఇముడుతాయి. సాయియేకాదు, ఏ మహాత్ముని చరిత్ర తీసుకున్న వారి యొక్క లీలలలో కూడా భక్తి కలుగుతుంది. ఆ భక్తితో మనము నిరంతరము కృషి చేస్తే, వాక్మౌనం వస్తుంది. వాక్శుద్ధి అయ్యింది అంటే అందరూ నిన్ను గౌరవిస్తారు. ఎదుటివారిని దూషించకుండా ప్రేమతో వుంటూ, మనసును అరికట్టమంటే దీనియొక్క ఆత్మసాక్షాత్కారాన్ని చూసేదానికి కూడా అయితుంది. "మనసు అంటే ఏంటయ్యా?" అంటే, ఇక్కడ మీ అందరితో మాట్లాడుతున్నాడు. రోడ్డులో ఎవరో వస్తాడు అని ఇక్కడ మాట్లాడుతూ వెళ్ళిపోతున్నాడు. వీరబ్రహ్మంగారు ఏం చెప్పారంటే ఒక

చిన్న పని చేసారు. ఆయన మనుమరాలు ఈశ్వరమ్మ దగ్గర వున్నాడు. "అమ్మా భోజనం చేస్తాను" అన్నాడు. ఆకు వేసింది. అన్నం చేత పట్టుకుంది. ఈ మహాత్ముడు ఏం చేసేడంటే, దున్నపోతుకు మాలవాడకు పోయాడు. శరీరం ఇక్కడే వుంది. మాలవాడకు పోయి వాళ్ళ ఎంగిలి తినొచ్చి నాకు ఓర్పు లేదంటే ఎట్లా? శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర గురువులు, అప్పుడ ఈశ్వరమ్మ .... "అమ్మా! ఇంకా వడ్డీలేదే" అన్నాడు. "నువ్వు మాలవాడకు పోయి తినొస్తే, నేనెట్లా వడ్డించేదప్పా" అంది. "ఓ! అట్లనా తల్లి, నేను చేయలేని పనులన్నీ నీవు చేస్తావు" అని ఆ తల్లికి, ఆ మహాత్ముడు ఆయమ్మని ఆదేశించాడు. (పై ఉపోద్ఘాతంలో స్వామి మనస్సంటే ఏమిటి అనేదానికి ఉదాహరణగా బ్రహ్మంగారికి, ఈశ్వరమ్మగారికి మధ్య జరిగిన సంఘటనను వివరించారు. బ్రహ్మంగారి మనవరాలైన ఈశ్వరమ్మ కూడా బ్రహ్మంగారికి సమఉజ్జీయైన బ్రహ్మవేత్త. విస్తరి వేసి భోజనం వడ్డించే కొద్ది సమయంపాటు ఆకలికి ఓర్పు వహించలేక బ్రహ్మంగారు సూక్ష్మరూపంలో మాలవాడలో భోంచేసి వస్తారు. ఇది గ్రహించి ఈశ్వరమ్మ మీరు ఓర్పు వహించలేక నాకు లేదంటే ఎలా? అని బ్రహ్మంగారిని ప్రశ్నిస్తుంది)

ఇప్పుడు ఈ మహాతల్లి ఏమి చేసిందంటే, ఈ శరీరాన్ని.... ఆ తల్లి అయిదు సంవత్సరాలు బంగారుతో దత్తాత్రేయుడు రూపాన్ని నాకు ఇవ్వాలనింది. అంతట్లో ఆమె పోయింది శరీరం. ఇక ఆమె చెప్పిన పని పూర్తి చేసిన దానికి, ఈ కాయాన్ని సద్వినియోగం చేసుకుని, అయితే అప్పుడప్పుడు వచ్చి దీని రెచ్చగొడితే మీ వెంటవస్తాడు, మీతో మాట్లాడతాడు, వస్తాడు. మౌనంగా ఉంచితే ఏమి కదలకుండా ఉంటే,

ఎప్పుడు ఏది?? మౌనంగా వుండటానికి లేదు. కదిలించేదానికి కావాలి. ఆ విధంగా చేస్తే ఈ శరీరాన్ని మీ అందరికీ సహకరిస్తాడు. మీరందరూ శ్రద్ధతో పట్టుదలతో ఆ పరమాత్ముని ధ్యానం చేసి, ఆ సద్గురువును, ఆ దయ ఆ సద్గురువు, సద్గురువు, సద్గురు అంటున్నావేంటి అంటే సత్యమైనది గుణములు లేనిది. అది ఏది కాదు. "హంసాత్మకం పరమహంస విహార లీలం" ఏడు

పీఠములున్నాయి. ఇది ఎప్పుడూ అంటే .... ఎస్.ఎమ్.రావు / రామంగారు ఆయన కర్నూల్ పోయినాడు 68-69లో, అక్కడ ఆయన అంత్యఘడియలు వచ్చినై, వారు విచారించారు. నేను ఫలానా ఆయన (దర్గాస్వామివారి) శిష్యుడిని అని ఆయన ఘంటాపథంగా చెప్పాడు. చెపితే ఇక్కడి నుంచి బయల్దేరి, పిలుపు వస్తే కడపకు పోయాడు. కడపకు పోయి అక్కడ నుంచి వాళ్ళకు చెప్పాడు.

ఏడు రకాలైన పీఠాలు మన ప్రాంతంలో వుంది. అప్పుడు "హంసాత్మకం పరమహంస విహారలీలం" అని చెపితే, ఆయన చెప్పిన రెండు మూడు గంటలోనే పరమపదించాడు. ఆయనకు తీసుకు వచ్చారు. వస్తున్నారు అని తెలిసింది. అక్కడకు పోయి చూసేసి ఆయనను సరైన పద్ధతిలో ఆ సద్గురువు దగ్గరకు చేర్చాము, ఈ శరీరంతో. చాలా పట్టుదలగా ఆ మహనీయుడు అతడు ఎన్నో చేసాడు. రాష్ట్రపతి సంజీవరెడ్డికి చాలా దగ్గరవాడు. అతడు అన్ని పనులు చేసాడు. ఒక డ్రామాలే కాదు. ప్రతి ఒక్క కళ్ళలో కూడా చేసి, శ్రీ సద్గురు మాతాజీ అని ఆమె పేరిట పెట్టాము. ఇరవైమూడు మంది మెంబర్లుగా చేరి చేస్తున్నారు. ఈ స్కూలు నడిపేదానికి కూడా కంకణం కట్టుకున్నారు. ఈ స్కూలు యొక్క లక్షణంగా చేసేదానికి పట్టుదల, శ్రద్ధతో, అందరూ కలిసి చేస్తున్నారు. మనం లేం, వారున్నారు అనుకోవద్దు. ప్రతివారి రక్తంబొట్టు ఇక్కడ వుంది. మీ రక్తంబొట్టులో ఆ సద్గురుమూర్తి ఆడుతున్నాడు. ఆ పరబ్రహ్మస్వరూపుడు, పరమాత్ముడు వున్నాడు. కాకపోతే ఓర్పుతో నిగ్రహశక్తితో ఆచరించారంటే అన్నీ జయప్రదమయితాయి. తొందరపాటు లేకుండా చేయాలని మిమ్మల్నందరినీ ప్రార్థిస్తున్నాను. ఈ స్కూలును అభివృద్ధికి తెచ్చి ఆమె యొక్క ఆత్మకు, ఆమె ఈ స్కూల్లోనే భోజనాలు పెట్టించింది.

ఇటువంటి పుణ్యవతిని మనము ఏ రూపంతో చూస్తాము అంటే ఆ తల్లి మన కంటిచూపులోనే వుంది. మనము జాగ్రత్తగా చేసుకుంటే జయమౌతుంది.

**శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయినాథాయ నమః**

శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయినాథాయ నమః

# దైవం మానుష రూపేణ

## అధ్యాయము - 15

## అమ్మయ్యగారు

**ప్రాప్య పుణ్యకృతాం లోకాన్ ఉషిత్వా శాశ్వతీః సమాః।**
**శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోభిజాయతే॥**

తా॥ యోగభ్రష్టుడు పుణ్యాత్ములు పొందు లోకములలో అనగా స్వర్గాది ఉత్తమ లోకములను పొంది, ఆయా లోకములలో పెక్కు సంవత్సరములు గడిపి, పిదప పవిత్రులైన సంపన్నుల గృహములలో జన్మించును.

భగవద్గీతలో చెప్పిన పై శ్లోకం ప్రకారమా అన్నట్లు, అమ్మయ్యగారి జీవితం కనపడుతుంది. అమ్మయ్యగారు ఆధ్యాత్మికంగా ఎంతో ఉన్నతమైన పరిపక్వ స్థితిలో ఉండి కూడా, తమ ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని, దివ్యత్వాన్ని మరుగుపరుచుకుని ఒక సామాన్య గృహిణిగా జీవనం గడిపారు. ఎవరైనా భక్తులు అమ్మయ్యగారికి పాదనమస్కారం చేసుకున్నప్పుడు ఆమె చెయ్యెత్తి ఎన్నడూ ఆశీర్వదించలేదు. ఎప్పుడూ అమ్మయ్య రెండు చేతులు జోడించి తిరిగి నమస్కరించేవారు. ఈ ఆచరణను పరిశీలనగా విచారణ చేసుకుంటే, ఆమె ఎల్లప్పుడూ నమస్కరించినవారిలో సంచరించే చైతన్యము, తమలో ఉన్న చైతన్యము ఒకటేననే భావనలో ఉండేవారని గ్రహించవచ్చు. అట్లుకాక చెయ్యెత్తి అభయం చూపించి ఆశీర్వదిస్తే అక్కడ ఒక ఆర్తుడైన భక్తుడు, అతనిని/ఆమెను రక్షిస్తున్న గురువు అని రెండు వస్తువులు ఉన్నట్లు అవుతుంది. అమ్మయ్యగారు తమ సూక్ష్మమైన ఆచరణ ద్వారా ఎల్లప్పుడూ అద్వైతస్థితిలో ఉన్నారని గ్రహించవచ్చు.

అమ్మయ్యగారిది అందరిపట్ల తల్లి మనస్సు. భక్తులు ఎన్ని కష్టాలు వచ్చినా ఆమెకు చెప్పుకుని ఓదార్పు పొందేవారు. కొన్ని సందర్భాలలో

అమ్మయ్యగారు స్వామివారితో మాట్లాడిన తర్వాత పరిష్కారం సూచించేవారు. దర్గాస్వామివారు సంకల్పించి, చేపట్టిన కార్యాలలో గానీ, వారు భక్తులకు ప్రసాదించిన ఆశీస్సులలో గానీ అమ్మయ్యగారి ప్రభావం, శక్తి లీలగా గోచరించేవి. అమ్మయ్యగారు ప్రేమకు, త్యాగానికి ప్రతిరూపం. ఆ ప్రేమ తత్వంతో ఆమె ఎందరికో మాతృమూర్తిగా నిలిచారు.

చాలామంది భక్తులకు స్వామివారు అమ్మయ్యకు నమస్కరించుకోమని చెప్పేవారు. స్వామి మాటను అనుసరించి ఆశ్రమానికి వచ్చే భక్తులు మొదట అమ్మయ్యగారికి నమస్కరించుకుని తర్వాత స్వామివారి దగ్గరకు వెళ్ళేవారు. అమ్మయ్యగారు చాలా మితంగా మాట్లాడేవారు. వచ్చిన భక్తులను ఒకటి, రెండు వాక్యాలతో పలుకరించేవారు. ఆ చిన్న పలకరింపుతోనే భక్తులు తమ శారీరక అలసట, మానసిక వ్యధల నుండి ఉపశమనం పొందేవారు.

అమ్మయ్యగారు అన్నపూర్ణ స్వరూపంగా ఉండేవారు. చాలాకాలం భక్తులకు స్వయంగా వండి పెట్టారు. తర్వాతి కాలంలో ఆశ్రమంలో వంటశాల, భోజనశాల కట్టినాక, వచ్చినవారిని భోజనం చేసి రమ్మని చెప్పేవారు.

అమ్మయ్యగారి సన్నిధిలో భక్తులకు కలిగే అనుభవం, అనుభూతి మానసికమైనవి. ఆ భావనను, అనుభూతిని మాటలలో వ్యక్తపరచటం కష్టతరం.

అమ్మయ్యగారి సమాధికి పూర్వం స్వామి, అమ్మయ్యలు రెండు రూపాలతో భక్తులను అనుగ్రహించారు. సమాధి అనంతరం స్వామివారి ప్రార్థన మేరకు అమ్మయ్యగారు స్వామిలో కలిసినారు. అప్పటినుండి వారిద్దరూ స్వామివారి రూపంలో భక్తులను కాపాడుతున్నారు.



అమ్మయ్యగారు రూపంతో ఉన్నప్పుడు భక్తుల యొక్క అనుభవాలు ఇక్కడ పొందుపరుస్తున్నాము

పాల రామయ్యగారు ఇలా చెపుతున్నారు "స్వామి, అమ్మయ్యలు దర్గాల దగ్గరకి వచ్చేటప్పటికి నాకు 9 సం॥ల వయస్సు. బండల సత్రములో **పైన చవుడు మట్టివేసి చుట్టూరా ఈత ఆకులతో కట్టుకుని జీవించేవారు. స్వామి చుట్టుప్రక్కల పొలాల వారికి పంటలు పండించటంలో సూచనలు ఇచ్చేవారు. అన్ని రకాల పంటలు పండిచేవారు. ఉరునుకి రైతులు తమవంతుగా బియ్యం, కూరగాయలు తీసుకొచ్చేవారు. స్వామి నాతో "రామా! మనకు ఆవులు వున్నాయి కదా! నీవు ఇక్కడ ఆవులకు** పాలు తీయి" అని చెప్పారు. నేను అలానే చేసాను. అప్పటినుండీ అందరూ నన్ను 'పాల రామయ్య' అని పిలుస్తున్నారు.

ఒకసారి నా భార్య ఆరోగ్యం బాగోకపోతే నేను స్వామి అమ్మయ్యల దగ్గరకి వెళ్ళి విన్నవిస్తే అమ్మయ్య "బయారెడ్డి దగ్గర ఆపరేషన్ చేయించు, అంతా బాగుంటుంది" అని చెప్పింది. అలానే చేయిస్తే నా భార్య ఆరోగ్యం బాగుపడింది.

స్వామి ఆశీస్సులతో నా కొడుకుకి ప్రొద్దుటూరు కాలేజీలో డిప్లొమోలో సీటు వచ్చింది. అక్కడ సీనియర్లు రాగింగ్ చేస్తున్నారని నా కొడుకు ఇంటికి వచ్చేసాడు. ఆ విషయం స్వామి దగ్గరకి వచ్చి చెప్పాను. అమ్మయ్య నాతో "**ఇప్పుడు కాల పరిస్థితులను బట్టి పిల్లకాయలను ఏమీ అనవద్దు రామా! తరువాత చూద్దామని**" చెప్పింది. నేను కాలేజీ ప్రిన్సిపాల్‌కి ఫోను చేస్తే ఆయన 'మేము టి.సి. డబ్బులు ఇవ్వము కానీ పిల్లవాడు ఎప్పుడైనా రావచ్చు' అని చెప్పేసరికి నా మనస్సు కుదుటపడింది. తరువాత ఒకరోజు నాకు కలలో 'ఒక పెద్దావిడ నా కొడుకు దగ్గరకొచ్చి తలమీద బ్లేడుతో కోసింది. వత్తుతుంటే పసరు అంతా వెళ్ళిపోయింది'. తెల్లవారిన తర్వాత నా కొడుకు నేను ఏమీ చెప్పకుండానే తనంత తానే కాలేజీకి వెళతానని వెళ్ళిపోయాడు. తర్వాత ఎమ్.టెక్ కూడా చేసాడు. ప్రస్తుతానికి ప్రొద్దుటూరు గవర్నమెంటు పాలిటెక్నిక్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు"

పాలరామయ్యకి దర్గా దగ్గరలో కొంత వ్యవసాయ భూమి వుంది. వారి తండ్రిగారి కాలం నుండీ వారు ఆ దర్గా ప్రాంతంలో వ్యవసాయం చేస్తున్నారు. వారి భూమిలో ఒక దిగుడు బావి వుంది. 1958లో స్వామి, అమ్మయ్యలు కట్టుబట్టలతో దర్గా దగ్గర నివసిస్తున్న సమయంలో ఆ దిగుడుబావి దగ్గర స్నానం చేసేవారు.

2000 సం॥ తర్వాత రామాపుర మండలంలో నీటి ఎద్దడి పెరగసాగింది. ఈ సందర్భంగా పాలరామయ్య వ్యవసాయ నీటి అవసరాలకు బోరుబావి త్రవ్వించటానికి 2,3 బోరు బావులు త్రవ్వించినా నీరు పడలేదు. తర్వాత స్వామి సూచన మేరకు ఆ దిగుడుబావిని పూడిక తీసి పెద్దది చేస్తే పుష్కలంగా నీరు వచ్చినది.

హైదరాబాదు చంద్రశేఖరరావుగారు మొదటిసారి దర్గాకు వెళ్ళినప్పుడు ఆయన పేరు కానీ, ఆయనెవరో కానీ దర్గాలో ఎవరికీ తెలియదు. ఆయన కూడా చెప్పలేదు. అమ్మయ్య వద్దకు వెళ్ళి పాదనమస్కారము చేసుకున్నప్పుడు అమ్మయ్య "నీవు సుకన్య భర్తవు కదా!" అని అడిగారు. ఆయనకు చాలా ఆశ్చర్యం వేసింది. ఆయన భార్య అప్పుడు ఆయన ప్రక్కన లేదు. మరొకసారి వెళ్ళినప్పుడు స్వామివారు ఆశ్రమంలో లేరు. అమ్మయ్యకు నమస్కారం చేసుకొని ఆయన కుమారుని చదువు సంగతి ప్రస్తావించారు. అప్పుడు దానికి పరిష్కార మార్గం చూపించారు. ఆ తర్వాత స్వామివారి దర్శనం చేసుకొని అదే విషయం చర్చించగా స్వామివారు అమ్మయ్యగారు చెప్పినదే చెప్పారు. అది ఆయనకు చాలా వింతగా అనిపించింది. వారిద్దరి అంతరంగం ఒకటేనని అర్థమైంది.

2010లో చంద్రశేఖరరావుగారు చనిపోయారు. తర్వాత ఒక సందర్భంలో స్వామి "అమ్మయ్య సమాధి మందిరంలో సీలింగ్ ఫ్యాన్లు ఆయనిచ్చాడు. ఒకటైనా పాడైపోయిందా?" అని చెప్పటం ద్వారా చంద్రశేఖరరావుగారు ఇచ్చిన భావన మంచిది అని సమర్థించారు. ఒక వ్యక్తి ఇతరుల కొరకు ఏదైనా వస్తువు ఇచ్చినప్పుడు కానీ, పని చేసినప్పుడు కానీ ఆ వ్యక్తిలోని భావనను బట్టి దానిలో రాణింపు ఉంటుందని తెలుసుకోగలము.

ప్రొద్దుటూరు జి.వి.యస్. కళ్యాణ్ ఒకసారి అమ్మయ్యగారి ఆశీస్సులతో విహారయాత్రకు వెళ్ళాడు. ఘాట్ రోడ్డు ప్రయాణంలో ఒక మలుపులో బస్సు వెనుక భాగం వెనుకకు వాలింది. వెనుక అగాధమైన లోయ. అలాంటిదే మరొక చోట జరిగింది. బస్సులో అందరూ భయపడ్డారు. తిరిగి ఇల్లు చేరుకోగానే స్వామివారికి ఫోను చేశాడు. స్వామి వెంటనే "నాయనా టూర్ బాగా జరిగిందా? నీవు ప్రయాణంలో రెండు చోట్ల భయపడ్డావు కదరా? నాకు అమ్మయ్య చెప్పిందిలే" అన్నారు. ఈ అనుభవం ద్వారా అనుక్షణం అమ్మయ్య రక్షణ వున్నదని అర్థమైంది.

నెల్లూరు ఉమగారి తమ్ముడు పేరు కృష్ణ. అతను చెడు సహవాసం వలన ఒకసారి మద్యాన్ని రుచి చూసాడు. ఈ విషయం ఇంట్లోని వారికి తెలియదు. దర్గాల దగ్గరకి వెళ్ళినప్పుడు అమ్మయ్య అతన్ని దగ్గరకు పిలిచి "ఎలాంటి వాడివి? ఎలా అయిపోయావు చూడు?" అని మందలించి జరిగిన విషయం స్వామితో చెప్పి, అతనిని మంచి మార్గంలో నడిపించమని అడిగింది.. అప్పటినుండి అతను దర్గాల దగ్గరకి వెళుతున్నాడు. అతని చెడు సహవాసాలన్నీ దూరమైనాయి.

నెల్లూరు యశోదమ్మగారి పెద్దమ్మాయి పెళ్ళి ముందర రోజు స్వామి, అమ్మయ్యలు వచ్చి పెళ్ళికూతురుని చేసారు. అమ్మయ్య స్వయంగా వడియాలు పెట్టారు. పెళ్ళిరోజు వారు 800 మందికి వంట చేస్తే ఒక వెయ్యికి పైగా బంధువులు, మిత్రులు వచ్చారు. వంటకాలకి ఏ మాత్రం ఇబ్బంది లేకుండా వచ్చిన అందరికీ సంతృప్తిగా సరిపోయినాయి. అంతేగాక ఏ ఒక్కరూ దేనికీ వంకలు పెట్టలేదు.

## శ్రీ సద్గురు దర్గా మాతాజీ దివ్యసూక్తులు

1. ఏ పనినైనా "నేను చేస్తున్నాను" అనే భావన లేకుండా సేవా భావంతో చేసేవాడే నిజమైన భక్తుడు.

2. సంపాదించడం గొప్ప కాదు. సంపాదించిన దానిని సద్వినియోగ పరచడమే గొప్ప.

3. నూరు రూపాయలు వచ్చాయని రూపాయను మరచిపోవద్దు.

4. బ్రతికి పనిచేయి, పనిచేసి బ్రతుకు.

5. పౌరుషానికి పోక, పంతాలువీడి, విచక్షణాజ్ఞానంతో మెలిగినవాడే నిజమైన జ్ఞాని.

6. మీ పనిని మీరు చూసుకోండి. ఇతరులతో మాటలు వద్దు.

7. నీ సొమ్ము అయితే నడిరోడ్డులో వేసినా ఎక్కడికీపోదు.

8. చెంబెడు నీళ్లకే బెంబేలుపడితే బానెడు నీళ్లు ఎప్పుడు తాగగలవు?

9. చెప్పింది చేయి. పెట్టింది తిను.

10. ఆవగింజంత ఆయుష్షు ఉంటే పులినోటిలో పడినా తిరిగివస్తాడు. అది లేకపోతే నట్టింటిలోనే పోతాడు.


ఓం శ్రీ మాత్రే నమః
ఓం బ్రహ్మవిష్ణుశివాత్మికాయై నమః
ఓం శ్రీ భువనేశ్వరి దేవ్యై నమః
శ్రీ సద్గురు దర్గా మాతాజీ శ్రీమతి గంగిశెట్టి రంగనాయకమ్మ గారు
(అమ్మయ్య)
సర్వమంగళ మాంగళ్యే శివే సర్వార్థసాధికే ।
శరణ్యే త్ర్యంబికే దేవి నారాయణి నమోస్తుతే ॥
యా దేవీ సర్వభూతేషు మాతృరూపేణ సంస్థిత ।
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః ॥
కడప జిల్లా, రామాపురం మండలం, నీలకంఠ్రావుపేట సమీపంలోని దర్బారు నగరము నందు గల దర్గా వద్ద
ప్రతి సంవత్సరం శ్రావణ మాసపు ఆఖరి శనివారం మాతాజీ ఆరాధన మహోత్సవములు జరుగును

# అమ్మయ్య మహా సమాధి అనంతరం లీలలు

అమ్మయ్య సమాధి చెందిన తరువాత కూడా ఎంతో అప్రమత్తతతో తమను శరణు వేడిన భక్తులను కాపాడుతున్నారనేదానికి ఈ క్రింది సంఘటనలు నిదర్శనం

ఒకరోజు ఆవులు మేతకు ఆశ్రమం బయటకు వెళ్ళి సాయంకాలం సమయానికి తిరిగిరాలేదు. వాటిని వెతికి ఆశ్రమానికి తీసుకురావటానికి ప్రయత్నించినా కనబడలేదు. శంకరయ్య అమ్మయ్య సమాధి దగ్గర 'అమ్మా! ఎక్కడకని వెతకగలను, ఆరతి చేస్తాను, నువ్వే తీసుకురావాలి' అని అమ్మయ్యకు చెప్పుకొని ఆరతి పూర్తి చేసాడు. చిత్రంగా ఆవులు వాటంతటవే ఆశ్రమానికి తిరిగి వచ్చాయి.

ఒక నిర్మాత శ్రీ షిర్డీ సాయిబాబా భక్తుల అనుభవాలను సమీకరించి సినిమా తీశాడు. ఎన్ని రోజులకూ రిలీజ్ కాకపోయేసరికి సాయి కృప కోసం శిరిడీ వెళ్ళాడు. అక్కడ ఒక పెద్దావిడ ఆ నిర్మాతతో కడప దర్గాస్వామి వద్దకు వెళ్ళమని చెప్పింది. ఆయన అలానే స్వామి దర్శనానికి వచ్చి అక్కడ అమ్మయ్య ఫోటో చూసి ఈవిడే నాకు శిరిడీలో కనపడి ఇక్కడకు వెళ్ళమని చెప్పారు అని చెప్పాడు. స్వామి అతనితో "సినిమా పేరు మార్చు అన్నీ చక్కపడతాయి" అని చెప్పారు. తర్వాత ఆ నిర్మాత 'సాయే దైవం' అని సినిమాకి పేరు మార్చినాక అడ్డంకులు తొలగి, రిలీజ్‌కి వచ్చింది.

దర్బార్‌నగర్‌లో స్కూలు పెట్టిన దగ్గర నుండి పుంగనూరు శ్రీదేవిగారు ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. ఒకసారి కన్యకాపరమేశ్వరి గుడికి వెళ్ళినప్పుడు ఒక కళ్ళద్దాలు పెట్టుకున్న ఆవిడ వచ్చి మీరు బ్రాహ్మణులా అని అడిగి పాయసం తీసుకోండి అని పాయసం ఇచ్చి వెళ్ళింది. స్వామీజీ దగ్గరకొచ్చి చెపితే "అమ్మయ్యే వచ్చి నీకు పాయసం ఇచ్చి వెళ్ళింది" అని చెప్పారు. అమ్మయ్య విశ్వరూపాన్ని ఇలా చూడవచ్చు.

ప్రొద్దుటూరు గంగిశెట్టి వెంకట శివప్రసాద్‌గారు ఇలా చెపుతున్నారు: 2004 నవంబరులో మా తండ్రిగారి ఆరోగ్యం బాగోలేనందున మద్రాసుకు చికిత్సకు వెళ్ళాము. మా నాన్నగారు చికిత్సకు సుముఖంగా లేరు. మేము మాతాజీని ప్రార్థించగా మా తండ్రిగారికి స్వప్నదర్శనమిచ్చి ఆయనను చికిత్సకు ఒప్పించింది. మరుసటిరోజు నుండి మా తండ్రిగారు కోలుకొని మెల్లమెల్లగా నడువగలిగినారు.

సిద్ధేశ్వరరావు గారు, లక్కిరెడ్డిపల్లి ఇలా చెపుతున్నారు : 2007లో మా అమ్మకి డయేరియా వచ్చింది. ఊళ్ళోని డాక్టర్లు ప్రమాదకరమని చెప్పేసరికి తిరుపతి స్విమ్స్‌లో చూపించాము. అక్కడి డాక్టర్లు ఇప్పటిదాకా చాలా పవర్‌ఫుల్ మందులు వాడారు, కిడ్నీలు బాగా దెబ్బతిన్నాయి. అందువలన డయాలసిస్ చేయాలి. చేసినా మేము ప్రాణానికి హామీ యివ్వలేము. డయాలసిస్ చేయాలా వద్దా అని అడిగితే నేను మా కుటుంబసభ్యులతో సంప్రదించి చెపుతానన్నాను. మా బావ అరగంటలో హాస్పిటల్‌కి వస్తానని చెప్పాడు. ఆయన వచ్చేలోపల నాకు రెండు రోజుల నుండి సరిగా నిద్రలేకపోవటం వలన తూగులాగా వచ్చి గోడకు ఆనుకొని నిద్రపోతున్నాను. స్వప్నంలో 'నేను దర్గాల దగ్గరకి వెళ్ళినట్లు, దర్గామాత నన్ను "ఇక్కడేమి పనిరా నీకు, లేయ్ లేచిపో" అని అన్నది. నా మనస్సులో అమ్మా! ఎందుకు లేచిపోమంటున్నావు. నేను చేసిన తప్పేమీ అనుకుంటున్నాను' మెలకువ వచ్చింది. స్వప్నంలో అమ్మ చెప్పింది ఈ హాస్పిటల్ నుండి వెళ్ళమన్నట్లుగా తోచి స్వామి మీద భారం వేసి ఇంటికి తీసుకువచ్చాము.

మా యింటివైపు కూరగాయలమ్ముకునే ఆవిడొచ్చి డా॥ బయ్యారెడ్డిగారు యిలాంటి కేసులు బాగా చూసి చికిత్స చేసి వున్నారు. మమ్మల్ని కూడా వెళ్ళమని బలవంతం చేసింది. డాక్టరు బయ్యారెడ్డిగారి దగ్గరకి చికిత్సకు వెళ్ళిన వారానికల్లా మా అమ్మకి బాగయింది. ఇప్పటికీ ఆరోగ్యంగా వున్నది. ఇదంతా జరిగిన తర్వాత స్వామి దగ్గరకి వెళ్ళాను. నేనేమీ చెప్పకుండానే "ఏమిరా! మీ అమ్మకి బాగుందా" అని స్వామి అడిగారు. నేను మనస్సులో స్వామికేమీ చెప్పలేదు కదా అని అనుకుంటుంటే స్వామి "**నువ్వు చెప్పవులేరా! నువ్వు చెప్తేనే నాకు**

**తెలుస్తుందా**" అని స్వామి అన్నారు. మేము దర్గాల దగ్గరకి వీలైనప్పుడల్లా వచ్చి దర్శిస్తున్నందుకు మా ప్రార్థనతో నిమిత్తం లేకుండా అమ్మయ్యగారు స్వప్న దర్శనమిచ్చి, తర్వాత **నేనేమి చేయాలో ప్రేరణ ఇచ్చి నడుచుకొనేటట్లు చేశారు**. మా అమ్మ మాకు దక్కింది అంటే అది అమ్మయ్యగారి కృపవలననే. పైగా మా అమ్మ ఆరోగ్యం గురించి మేమేమీ చెప్పకుండానే స్వామి అడిగి తమకి, అమ్మయ్యకు భేదం లేదని, వారిద్దరూ ఒకటేనని, మాకు శ్రేయస్కరమైనది అడగకుండానే చేస్తున్నారని తెలియచేశారు. ఓం దర్గా మాత్రే నమ:

ఆశ్రమవాసి శంకరయ్య గారు చెప్పిన విశేషాలు:

1. అమ్మయ్య సమాధి అయిన తర్వాత ఒకరోజు రాత్రి సుమారు 12గం॥ నుండి 1గం॥ మధ్య ఒక కల వచ్చింది. ఆ కలలో మాతాజీ "ఒరే శంకరా! వర్షం వస్తున్నది. కట్టెలు కొద్దిగానైనా లోపల వెయ్యి" అని చెప్పింది. వెంటనే నాకు మెలుకువ వచ్చింది. వెలుపలకు వచ్చి చూస్తే అప్పుడే వర్షం మొదలైంది. వంటశాలకు వెళ్ళి కట్టెలు లోపలికి వేశాను. ఆ రోజు రాత్రి పెద్ద వర్షం పడింది.

2. 10-8-2005 న జరిగిన సంఘటన. సుమారు 10 రోజుల నుండి నాకు నడుము క్రింద నుండీ పాదాల వరకూ చాలా నొప్పిగా ఉండినది. నేను స్వామీజీని, దేవతలను స్మరించుకుంటూ అలాగే నొప్పి భరిస్తున్నాను. ఒకసారి అమ్మయ్యతో చెప్పుకొని ఏడ్చాను. తర్వాత సాయి మందిరంలో భజన చేస్తుంటే నడుము క్రింద భాగంలో నల్లని చీమ కుట్టింది. భజన అయిపోగానే నొప్పులు కూడా పోయాయి.

3. ఒకసారి పళ్ళనొప్పి ఎక్కువగా వచ్చింది. పది రోజులు బాధ పెట్టింది. శ్రావణ శుద్ధ పౌర్ణమి శుక్రవారం నాడు మాతాజీ పంచలోహ విగ్రహానికి మొదటిసారిగా పంచామృతాభిషేకం జరిగింది. స్వామివారు "ఆ పంచామృతం పుక్కిట ఉంచుకో, పంటి నొప్పి పోతుంది" అన్నారు. అలాగే చేశాను. పంటి నొప్పి మాయమైంది. ఆ విధంగా శ్రీ సద్గురు దర్గా మాతాజీ సమాధి నుండే తమ భక్తులను కాపాడుచున్నారు.

4. 2008లో దర్బార్ సాయి ఉన్నత పాఠశాలలో చదువుతున్న 200 మంది పిల్లలకి యూనిఫామ్ కుట్టిస్తానని స్వామికి చెప్పాను. స్వామి ఆ

విషయం అందరికీ చెప్పారు. నేను ఒక టైలర్‌ను తెప్పించి ఎంత గుడ్డ కావాలో తెలుసుకోవటానికి దాదాపు మూడు నెలలు పాటు చాలా చోట్ల ప్రయత్నించాను. కానీ ఏ ఒక్క టైలర్ రాలేదు. పిల్లలు నన్ను ప్రతిరోజు యూనిఫామ్ గురించి అడుగుతున్నారు. నాకు దిక్కు తోచక అమ్మయ్య సమాధి దగ్గర 'అమ్మా! పిల్లలకి యూనిఫామ్ ఇస్తానని వాగ్దానం చేసాను. ఇప్పటిదాకా టైలర్ దొరకలేదు. నీవే దిక్కు. నా మాట నిలబెడతావో పడదోస్తావో నీ ఇష్టం' అని ప్రార్థించాను. తర్వాత మూడవ రోజుకి నా తమ్ముడు కృష్ణమూర్తి రాజంపేట నుండి ఫోను చేసి అక్కడ నుండి టైలర్‌ను పంపిస్తున్నానని చెప్పాడు. టైలర్ వచ్చి పిల్లల యూనిఫామ్ కొలతలు తీసుకుని ఏ డ్రస్సుకైనా 60 రూపాయలు ఇవ్వమని చెప్పాడు. డ్రస్సు గుడ్డ మరియు కుట్టు ఛార్జీ కలుపుకుని 30,000 వేల రూపాయలు మాత్రమే అయ్యింది. 200 మంది పిల్లలకి 30,000 రూపాయలుకి యూనిఫామ్ రావటం అమ్మయ్య కృపగాక మరేమిటి? అమ్మయ్య పంపించిన టైలర్, అతని భార్యకు పంచె, చీర దక్షిణ పెట్టి ఆనందించాను.

హైదరాబాద్ రాజీవ్‌గారు చూసిన విషయాన్ని ఇలా చెపుతున్నారు:

అమ్మయ్య మహా సమాధి తర్వాత ఒకసారి స్వామి అమ్మయ్య కుర్చీమీద చేతులు పెట్టుకునే చెక్కమీద వున్న పుస్తకాలు (ఇవి అమ్మయ్య నిత్యం చదివేవి) దులుపుతూండగా, ఒక పుస్తకం నుండి చిన్న న్యూస్ పేపరు కటింగ్ తీసి నాకు చూపించారు. దాంట్లో స్వామి ఫోటో, స్వామికి చేసిన సన్మానం విషయాలు వున్నాయి. ఎప్పుడో జరిగిన దాన్ని ఎంతో భద్రంగా అమ్మయ్య దాచుకోవటం చూసి స్వామి కళ్ళు చెమ్మగిల్లాయి.

అమ్మయ్య మహా సమాధి చెందిన తర్వాత స్వామి రాజీవ్‌గారితో "అమ్మయ్య ఫోటోలు ఏమైనా నీ దగ్గర వున్నాయా?" అని అడిగారు. తర్వాతసారి దర్గాల దగ్గరకి వచ్చేటప్పుడు అమ్మయ్య కుర్చీలో కూర్చున్న ఫోటోని లామినేషన్ చేయించి తీసుకువచ్చి స్వామికి ఇచ్చాను. ఆ ఫోటో చూసిన స్వామి చాలా ఎమోషనల్‌గా ఫీల్ అయ్యారు. దాన్ని అమ్మయ్య కూర్చుండే కుర్చీలో పెడదామని చూస్తే ఫోటో కుర్చీలో సరిగ్గా సరిపోయింది. స్వామి దాన్ని చూసి చాలా ఆనందపడ్డారు. నేను తిరిగి

ఇంటికి వచ్చేసరికి నన్ను 3 నెలలకి ఆఫీసు పని మీద మలేషియా వెళ్ళి రమ్మని పని అప్పగించారు. స్వామికి ఇష్టమైన ఫోటో చేయించటానికి ఖర్చు పెట్టిన ప్రతి రూపాయికి 1000 రెట్లు ఇచ్చారు. ఇది స్వామి ఇచ్చిన ఆశీర్వాదం.

ఈ విషయం గుర్తించి స్వామిని సంతోషపెట్టే పనులు చేస్తే, మనం నోరు విప్పి అడుగకుండానే స్వామి ఆశీర్వదిస్తారు కదా!

శ్రీ సమర్థ సద్గురు సాయినాథాయ నమ:
శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయినాథాయ నమ:
శ్రీ సమర్థ సద్గురు దర్గా మాతాజీ నమ:

శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయినాథాయ నమః

# దైవం మానుష రూపేణ

## అధ్యాయము - 16

## సద్ధర్మ సంరక్షకుడు

ఇప్పటిదాకా చూసిన స్వామియొక్క లీలలను బట్టి స్వామి సర్వవ్యాపకుడనీ, సర్వసమర్థుడనీ మనస్సులో స్థిరపరచుకొని మనం ఏ పని చేసినా అది స్వామిసేవగా తలచి మన జీవితాలను యజ్ఞమయం చేసుకోవటానికి ప్రయత్నం చేద్దాం. అందుకు స్వామి జీవితాన్ని గురించి, తత్వాన్ని గురించి చింతన చేస్తే అవే లక్షణాలు మనలోనూ సంస్కారాలుగా ఏర్పడి, బలపడి మనకు తెలియకనే మనకు సహజంగా శ్రేయస్సును చేకూరుస్తాయి.

ఈ అధ్యాయంలో స్వామి సందర్భానుసారం భక్తులను ప్రోత్సహించి లేక వారి కోరికలని బలపరచి సమాజశ్రేయస్సు కొరకు ఆలయాలు, ఆస్పత్రులు, స్కూళ్ళు మొదలైనవి స్థాపించి, వాటి ద్వారా అర్హులైనవారికి సేవచేసే ఏర్పాటు చేసారు. వీటిని మననం చేసుకుని, మనం కూడా చేతనైనంత పరోపకారం అలవరచుకుందాం!

స్వామి తనను ఆశ్రయించినవారిలో సంఘసేవ చేయాలనే కోరిక ఉన్నవారిని ప్రోత్సహించి, వారికి కావలసిన బలాన్ని చేకూర్చి నడిపిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. చాలామంది భక్తులు గుళ్ళు, ఆస్పత్రులు కట్టాలనుకున్నవారు వచ్చి స్వామి ఆశీస్సులు తీసుకున్న తర్వాత, వారి కార్యాలు నిర్విఘ్నంగా సఫలమయినాయి. సంఘసేవ అంటే సంఘాన్ని గురుస్వరూపంగా భావించి నిష్కామంగా సేవ చేయటం. పరులకు సహాయం చేయటంతో పాటు, చేసిన సహాయం వలన పని సఫలమైనా, విఫలమైనా సంతోషంగానీ, విచారంగానీ లేకుండా సమభావం వహించడమే నిష్కామకర్మకు గీటురాయి. ఈ నిష్కామకర్మ మనలోని లోపాలను, బలహీనతలను గుర్తించి వివేకవైరాగ్యాలతో తొలగించుకోవటానికేనని గుర్తించాలి. ఈ బలహీనతలను మలదోషం అన్నారు. ఈ మలదోషం నిష్కామకర్మ ద్వారా మాత్రమే పోతుంది.

**శరీరమింద్రియం ప్రాణం అర్థ స్వజన బాంధవాన్**
**ఆత్మదారాదికం సర్వం సద్గురుభ్యోన్నివేదయేత్**

తాత్పర్యము: శరీరమును, ఇంద్రియములను, ప్రాణములను, ధనమును, భార్యాపుత్రాది స్వజనమును సద్గురువునకు నివేదించవలెను.

స్వామి పరమాత్మ తప్ప అన్య వస్తువేదీ లేదని అనుభవించి అనన్యమైన గురుభక్తితో తనను తాను గురువుగారి పాదాలకు అంకితం చేసుకున్నారు. తనను ఆశ్రయించిన వారందరి కర్మలు, తనను సేవించినవారి కర్మలు తన తపోశక్తితో క్షాళణ చేస్తున్నారు. తపోశక్తితో క్షాళణ చేయలేనివి, తప్పనిసరిగా ఆయా శరీరాలు అనుభవించవలసి ఉంటే అలాంటి కర్మలను తన శరీరం మీదకు తీసుకొని తానా బాధను అనుభవిస్తూ ఆయా వ్యక్తులకు బాధ విముక్తి చేస్తున్నారు.

**"సాధు దర్శనం పుణ్యం - స్పర్శనం పావనాశనం"** అన్నారు పెద్దలు. చాలా సంవత్సరాలుగా కేవలం రోజుకొక గ్లాసు ఆవుపాలు గానీ, లేక కొబ్బరికాయ నీళ్ళు మాత్రమే తీసుకునే మన స్వామి గొలగమూడి భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి లాగా తన వృద్ధాప్యాన్ని కూడా లెక్క చేయక శ్రద్ధాభక్తులు గల అమాయకులైన తన భక్తులకు దర్శనమిచ్చేందుకు ఎన్నో ఇబ్బందులు, కష్టాలను సంతోషంగా ఓర్చుకొని అనేక గ్రామాలు, పట్టణాలలో జరిగే మందిర శంకుస్థాపన, ప్రారంభోత్సవాలకు, భక్తుల వివిధ సత్సంకల్పాలను నెరవేర్చటానికి సంచరిస్తున్నారు.

స్వామీజీ, మాతాజీలు భక్తుల వివాహాలు జరిపించడమేగాకుండా ఇతర విధాలుగా కూడా పేదలను, కష్టాల్లో ఉన్నవారిని ఆదుకొనేవారు. ఎంతో మంది పేద విద్యార్థులకు ఫీజులు కట్టడం, వారికి పుస్తకాలు వగైరా కొని ఇవ్వడం, వారికి పరిపాటి. చిన్నక్లాసుల నుండి - పి.జి, ఇంజనీరింగ్ వగైరా పెద్ద చదువులు చదువుతున్నవారికి కూడా మాతాజీ ధన సహాయం చేసేవారు. ఆ విధంగా అమ్మయ్యగారు చదివించినవారు మనదేశంలోనే గాక విదేశాలలోను గొప్ప ఉద్యోగాలలో ఉన్నారు. వారు

ఈనాటికి మాతాజీ దానశీలత, ఉదారత, అనురాగం, ఆప్యాయత మరచిపోలేదు, మరచిపోలేరు కూడా. స్వామీజీ, మాతాజీ సంకల్పించిన మరొక మహత్తర సేవాకార్యం గ్రామీణ పేద విద్యార్థులకు రెసిడెన్షియల్ హైస్కూల్ స్థాపించడం, దర్బారు నగరంలో అనంత కల్యాణ మండపం హాలు వెనుకనే ఈ స్కూలు భవనం నిర్మించబడింది. రెండు అంతస్తులు గల ఈ భవనం ప్రతి అంతస్తులోను 12 తరగతి గదులు, ఒక ధ్యాన మందిరం ఉన్నాయి. ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు క్లాసులు నిర్వహిస్తున్నారు. ఈ స్కూలుకు ప్రభుత్వ గుర్తింపు ఉన్నది. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఉచిత మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. స్కూలు బస్సు చుట్టు ప్రక్కల గ్రామాల నుండి విద్యార్థులను తీసుకు వస్తుంది. ఎక్కువమంది విద్యార్థులు స్కూలులోనే ఉంటారు. వారికి ఉచిత వసతి సదుపాయం ఉన్నది. (ప్రస్తుతం ఈ స్కూలు అమ్మయ్యగారి పేరు మీద ఏర్పాటు చేసిన ట్రస్టు ఆధ్వర్యంలో నడుస్తుంది.) ఈ విధంగా అన్నదానం, విద్యాదానం, జ్ఞానదానం చాలా గొప్పవని స్వామి, మాతాజీ మనకు పరోక్షంగా బోధిస్తున్నారు. సేవకి ప్రాతిపదికలు ప్రేమ, కరుణ, త్యాగశీలత అని మనం నేర్చుకోగలము.

## ఆస్పత్రి నిర్మాణాలు

**రాయచోటి వాస్తవ్యులు స్వరూపగుప్తాగారు** పంచుకున్న అనుభవాలు: 2006వ సం॥లో స్వామివారి ఆశీస్సులతో రాయచోటిలో ఉచిత సామూహిక వివాహాలు జరిపించాము. వివాహ ముహూర్తం తర్వాత స్వామిని మేము నిర్మిస్తున్న లయన్స్ క్లబ్ కంటి అస్పత్రి నిర్మాణ కార్యక్రమాలను పరిశీలించి, నిలిచిపోయిన నిర్మాణాన్ని ప్రారంభం అయ్యేలా చేయమని ప్రార్థించాను. స్వామివారు ఆస్పత్రికి విచ్చేసి త్వరలోనే పూర్తవుతుందని చెప్పారు. కానీ 2007వ సంవత్సరాంతానికి కూడా ఎటువంటి అభివృద్ధి జరుగలేదు. ఒక సందర్భంలో నా సతీమణి ప్రార్థన మేరకు స్వామివారు మా యింటికి విచ్చేశారు. అప్పుడు స్వామిని ఆస్పత్రిని దర్శించమని కోరగా విచ్చేశారు. స్వామివారికి ఆస్పత్రిని చూపిస్తూ మనస్సులో నా అశక్తతను వివరించాను. కాసేపు మౌనంగా వున్న స్వామి అకస్మాత్తుగా "ఏరా! ఈ

నిర్మాణం పని అంతా నీవే చేస్తున్నావని అనుకుంటున్నావా?'' అని అడిగేసరికి నేను నిరుత్తరుడయ్యాను. వెంటనే స్వామీజీ "పైనున్నవాడు ఇస్తున్నాడు. బేలుదారి పని, మేస్త్రీ చేస్తున్నాడు. సిమెంటు కలిపేవాడు కలుపుతున్నాడు. కట్టేవాడు కడుతున్నాడు. పైవాడు ఇచ్చాడు. నీవు చేయిస్తున్నావు. వాడు ఇవ్వలేదు. నువ్వు చేయించలేదు. ఎందుకురా విచారిస్తావు? ఆయన ఇచ్చినప్పుడు పూర్తి చెయ్యి. నీవు నిమిత్తమాత్రుడవని గుర్తుంచుకో. అంతా మంచి జరుగుతుందని'' చెప్పి "నాకు దాహం వేస్తోంది. ఒక గ్లాసు నీళ్ళు ఇప్పించు'' అని అడిగారు. విషయం అర్థం చేసుకోలేని నేను స్తబ్ధతలో వున్నాను. వెంటనే తేరుకొని నీటికోసం చూసాను. మాతో వచ్చిన రెండు కారులలో కానీ, ఆసుపత్రి ఆవరణలో కానీ నీళ్ళు దొరకలేదు. అప్పుడే పోయిన కరెంటు వచ్చింది. వాచ్‌మెన్ పరిగెత్తుకుంటూ ఒక స్టీలు చెంబు వెతికి, మోటారు వేసి ఆ చెంబుని నీళ్ళతో కడిగిన తర్వాత చెంబుడు నీళ్ళను స్వామికి ఇచ్చాము. స్వామి నీరు త్రాగి **"నా దాహం నీవు తీర్చావు - నీ దాహం నేను తీరుస్తాను''** అని చెప్పి నా భుజంపై చెయ్యి వేసి "ప్రజల అవసరం కోసం నీవు చేసే ఈ ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తి చేస్తాను'' అని చెప్పి ఆశీర్వదించారు.

నాలుగు రోజుల తర్వాత బెంగుళూరులో వున్న నన్ను పిలిపించి స్వామి "నీవు డాక్టరు బయారెడ్డి, డా॥ నారాయణ రెడ్డి, డా॥ బలరామరాజు, డా॥చంద్రశేఖరరెడ్డి వద్దకెళ్ళి ఆసుపత్రి నిర్మాణానికి తలా ఒక లక్షరూపాయలను అడుగు, మాతృశ్రీ దర్గామాత ఒక లక్ష రూపాయలను ఇస్తుంది'' అని చెప్పారు.

నాకైతే దిక్కు తోచలేదు. డా॥ బయారెడ్డిగారు తప్ప మిగిలిన వారిని యెలా అడగాలని చాలా సంశయించాను. మిత్రుడు టంగుటూరి సత్యనారాయణగారు వచ్చి స్వామివారు చెప్పారు కాబట్టి సంశయం వద్దు వెళ్ళి అడుగు అని నాతో వచ్చారు. అడిగిన వెంటనే అందరు డాక్టర్లు ఆనందంగా 'స్వామీజీ చెప్పారా! ఇది నిజంగా మా అదృష్టం, మేము తప్పక ఇస్తామ'ని చెప్పి దక్షిణ ఇచ్చారు.

"అమ్మ దర్గామాతాజీగారు ఇక్కడి కంటి అసుపత్రి పూర్తికి

సహకారం అందించి ప్రజలకు సేవలందించాలని అమ్మగారి ఆజ్ఞ అయిందని, ఈ పైకంను ఆపరేషన్ పరికరాల కొరకే వినియోగించాలని" స్వామివారు నన్ను ఆజ్ఞాపించారు. పరికరాలకు తక్కువ వస్తుందని చెపితే మరో రెండు లక్షల రూపాయలు నాకు ప్రసాదించి ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేసేందుకు నన్ను ఆశీర్వదించి పంపారు.

ఆశ్చర్యకరంగా కోరిన వెంటనే మిత్రులు, బంధువులు, దూరప్రాంతాలవారు కూడా స్పందించి అందించిన ధన సహాయంతో ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తి చేయగలిగాము. ప్రతి విషయంలో కూడా సూచనలందించి ఈ సేవను చేయగలిగే భాగ్యాన్ని స్వామీజీ, మాతాజీ నాకు ప్రసాదించారు. పేద ప్రజలకు ఉచిత కంటి ఆపరేషనుల ద్వారానే ఈ ఋణాన్ని తీర్చుకోగలము అని నమ్ముతున్నాను. శ్రీ మాతాజీ గారికి, సద్గురు స్వామివారికి నేను సదా కృతజ్ఞుడనే.

2009 సం॥లో ఆసుపత్రి ద్వారా ప్రజలకు సేవలందించడం ప్రారంభించాము. నాకు వస్తున్న సమస్యలను, అక్కడ జరిగే విషయాలను స్వామివారికి వివరించేవాడిని. దానికి స్వామివారి సూచనలు, సలహాలను పాటిస్తూ వాటినధిగమించేవాడిని. అప్పటికి వున్న ఆర్థిక సమస్యలను, ఆసుపత్రి అభివృద్ధికి కావలసిన వాటి గురించి ధ్యానంలో మాతాజీకి చెప్పుకునేవాడిని. ఒకరోజు స్వామివారు నన్ను పిలిచారు. వెళ్ళగా స్వామి "ఒరే! అమ్మ ఆసుపత్రిలో ఇంకొక మైక్రోస్కోపు పెట్టించి ఇంకా ఎక్కువమంది ప్రజలకు సేవలందించాలని నాకు చెప్పింది. కాబట్టి ఇంకొక మైక్రోస్కోపు మరియు ఇతర మిషన్లు తీసుకో అని రెండు లక్షల రూపాయలు ఇమ్మనింది" అని చెప్పారు.

అంతేకాదు స్వామివారు అక్కడున్నవారితో నా గురించి చెబుతూ "వాడికి ఆసుపత్రిలో అనేక సమస్యలు వస్తున్నాయి. అవి అధిగమించడానికి వానికి మనోధైర్యం కావాలి. అందుకు అమ్మయ్య వాడి హృదయంపై సదా తోడుగా వుండాలని ఆశీర్వదించి", మాతాజీ వర్ధంతి నాడు అమ్మయ్య డాలర్‌ను నా గుండెలపై ఉంచారు. ఆనాటి నుండి నాకు ఎటువంటి సమస్య వచ్చినా అమ్మయ్య దయతో దూదిపింజలాగా ఎగిరిపోయి నాకు ఎంతో శక్తిని ప్రసాదించింది. ఎక్కువ

ఆపరేషన్ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఎక్కువమందికి సేవలందించే అవకాశాన్ని కలుగజేసింది. ఆరోగ్యరీత్యా, ఆర్థికరీత్యా, వ్యాపారపరంగా, శారీరకంగా, సామాజికంగా ఎంతో ప్రోత్సాహాన్ని, శక్తిని, హితుల, స్నేహితుల, సేవాతత్పరుల, సహకారాన్ని అందిస్తూ నన్ను సదా ముందుకు నడిపిస్తున్నది. అందులకు ఎంతో కృతజ్ఞుడను.

**నెల్లూరు సురేంద్రగారి అనుభవాలు:** మేము కొంత మంది డాక్టర్లము కలసి 1994లో రూరల్ వెల్‌ఫేర్ పథకం క్రింద పేదవారికి సేవచేయటం ప్రారంభించాము. 2002లో ఒక హాస్పిటల్ కట్టి ఉచితంగా సేవలు అందిద్దామనుకున్నాము కానీ మా దగ్గర డబ్బులు లేవు. మాకు లోను ఇవ్వటానికి కూడా ఎవరూ ముందుకు రాలేదు. కానీ మేము ఉత్సాహంగా ఆస్పత్రి, సాయిబాబా గుడి కడదామని డా॥ శ్రీధర్‌రెడ్డిగారి ద్వారా దర్గాస్వామి గురించి తెలుసుకొని శంకుస్థాపనకు స్వామిని ఆహ్వానించాము. స్వామి వచ్చి లక్ష రూపాయలు మొదటి డొనేషన్ ఇచ్చి మాకు ధైర్యం చెప్పి "సురేంద్రా! నువ్వు పని మొదలుపెట్టు, జయం అవుతుంది" అని చెప్పారు. అలానే మొదలుపెట్టిన తర్వాత కొన్ని నెలలకు ఒక బ్యాంకువాళ్ళు తమంత తామే మా ప్రాజెక్టు గురించి తెలుసుకుని 22 లక్షల ఆర్థిక రుణం మంజూరు చేసారు. నిర్మాణ సమయంలో ఎంతెంత అవసరమో అంత చాలా చిత్రంగా సమకూరేవి. కొన్ని చెక్కులు చెల్లక వెనక్కు వెళ్ళిపోతే స్వామికి చెప్పుకుంటే "అవెక్కడికీ వెళ్ళవు, మరలా వస్తాయి" అని అభయమిచ్చారు. అలానే చాలా విచిత్రంగా చెల్లవని పంపించిన చెక్కులే చెల్లాయి.

మా ఆస్పత్రికి ఆనుకుని సాయిబాబా గుడి వుంది. ఒకసారి మాటల సందర్భంలో "ఈ మందిరంలో అన్నీ వుంచాము, ఎవరికి ఏమి కావాలో వారికి అవి లభిస్తాయి" అని స్వామి ఆశీస్సులు ఇచ్చారు.

ఒకసారి 25సం॥ల యువకునికి గుండె ఆపరేషన్ జరిగింది. ఒక సం॥ తర్వాత అతనికి హెపటైటిస్ - బి వచ్చి ఇంజక్షన్ చేస్తే రక్తం కారుతూ వుండేది. బ్రెయిన్ హెమరేజ్ మొదలైంది. నేను చాలా కంగారుపడ్డాను. కానీ స్నేహితులు డా॥ శ్రీధర్‌రెడ్డి నాతో **'మనమెందుకన్నా భయపడేది. మనమంతా పోస్టమాన్‌లాగా**

**చేసేది. అంతా చేయించేది స్వామే'** అని చెప్పేసరికి చాలా ధైర్యం వచ్చింది. తర్వాత మేము చేసిన వైద్యం కేవలం నామమాత్రం. కానీ స్వామి దయ వలన అంతటి ప్రమాదకర పరిస్థితి పోయి అతను ఇప్పటికీ హాయిగా వున్నాడు. ఈ సంఘటనతో చేసేదంతా స్వామేనని, మాకు ఇలా ఈ విశ్వ యజ్ఞంలో పాలు పంచుకునే అవకాశం ఇచ్చినారని అర్థమై స్వామి మీద భక్తి, విశ్వాసాలు పెరిగాయి.

## మందిర నిర్మాణాలు

### దర్గాస్వామివారితో గొలగమూడి పెనల సుబ్బరామయ్యగారి అనుభవములు:

2001వ సంవత్సరము వరకు వివిధ భక్తుల అనుభవాలు వినడం తప్ప నాకే అనుభవాలూ లేవు. 2001వ సంవత్సరములో గొలగమూడిలో శ్రీ బ్రహ్మంగారి మఠం పునరుద్ధరించే పని శ్రీ వెంకయ్యస్వామివారు నాకు ప్రసాదించారు. శ్రీ దర్గాస్వామివారు ఆ పవిత్ర ఆలయ ప్రదేశానికి వచ్చి "డబ్బు ఆయనే తెప్పించుకుంటారు నీవు స్లాబు వేయి. సిమెంటు రేకులు వద్దు" అని అన్నారు. ఈ పనికి గాను నాకు తెలిసిన పెద్దమనిషిని చందా అడగాలని వెళ్ళాను. వెంటనే ఆయన 'మందిరాలు కట్టిస్తారు. దీపాలు పెట్టే దిక్కు ఉండదు. కట్టించటం కాదు ఆ తరువాత నిర్వహణ సమస్య' అని అన్నారు. నేను వెంటనే ఆయనను అడగకుండా వచ్చేశాను. ఆ ప్రక్కరోజు నుండీ శ్రీ దర్గాస్వామివారు నీలకంఠరావుపేట నుండి నాలుగుమార్లు నలుగురి చేత "దీపం పెట్టే దిక్కు వుండదు అని అన్నారు, అది ఎలా పెట్టరో చూస్తాను. పని త్వరగా కానిమ్మని చెప్పు" అని చెప్పి పంపారు. నేను స్వామివారిని కలవలేదు. ఆ మాట అన్న పెద్దమనిషి వారికి ఆ మాట తాను అన్నట్లు చెప్పరు. మరి వారికి ఆ మాట ఎట్లా తెలిసింది? వారు సర్వాంతర్యామి కానిదే అలా చెప్పలేరు కదా!

నన్ను స్వామివారు బ్రహ్మంగారి మఠానికి రసీదు పుస్తకాలు అచ్చు వేయించమన్నారు. కానీ నా మనస్సులో ఇష్టం లేదు. ఎందుకు అంటే కొంతమంది రసీదు పుస్తకాలు తీసుకువెళ్ళి తిరిగి తెచ్చి ఇవ్వరు. ఇది శ్రీ వెంకయ్యస్వామివారి ఆశ్రమంలో జరిగిన అనుభవం.

శ్రీ దర్గాస్వామివారు గొలగమూడి వస్తూనే నాతో మొదట పలికిన మాట "రసీదు పుస్తకాలు వేయించు, అవి తిరిగి రాకుంటే నాది బాధ్యత" అని అన్నారు. ఇది నా మనసులోని అనుమానానికి సమాధానం. వారు సర్వభూత హృదయాంతర్వర్తి కానిదే నా మనస్సులోని అనుమానం తెలుసుకోలేరు.

మందిర నిర్మాణం పవిత్రసేవ అని, శ్లాబు వేయమన్న దర్గాస్వామివారి ఆదేశాన్ని తప్పక పాటించాలని నాకు తెలుస్తూ వుంది. కానీ నాలోని సంస్కారాలు - అంటే పిసినిగొట్టుతనము, ధనవ్యామోహము లాంటివి ఆ సేవను చక్కగా చేయకుండా అడ్డుపడుతున్నాయి. ఒక భక్తుడు ఇచ్చిన డబ్బుతో పడిపోయిన పూరిపాకను తిరిగి అదే సామానుతో కప్పించాలనుకున్నాను. పై కప్పుకి తాటాకు కూడా తెచ్చిపెట్టాను. శ్రీ స్వామివారు నా మనస్సు మార్చారు. ఈ తాటాకు పని ప్రతి సంవత్సరమూ కష్టమే. ఇంకొక వెయ్యిగాని రెండువేలుగానీ సొంతంగానైనా ఖర్చు పెట్టి రేకులు వేస్తే ఇక ఎప్పటికీ పని ఉండదని 3 మీటర్ల సిమెంటు రేకులు తెప్పించాను. నాలుగు మూలల్లో కంకర, సిమెంటు, కమ్ములతో చేసిన నాలుగు స్థంభాలు నాటి చుట్టూ నాలుగు అంగుళాల గోడ సగం పెట్టించాను.

ఆ సమయంలో సద్గురు శ్రీ దర్గాస్వామివారు గొలగమూడి విచ్చేశారు. ఆ మహనీయుడు తన పాదస్పర్శతో పవిత్రం చేస్తే ఈ బ్రహ్మంగారి మఠం పని పూర్తవుతుందని వారిని అర్థించి మఠ నిర్మాణ స్థలానికి తీసుకువచ్చాను. ఆ మహనీయుడు "తలా ఒక పువ్వు వేస్తే పూలమాల అవుతుంది. నీవు సిమెంటు రేకులు గాకుండా స్లాబే వేయమని" ఆదేశించారు. "స్లాబు వేయాలంటే డబ్బు కావాలి కదా స్వామీ! నేనందుకు చాలను" అని విన్నవించాను. "బ్రహ్మంగారే డబ్బు పంపుతారు. ఆరు కమ్ములు, పది బస్తాల సిమెంటు సరిపోతుంది, స్లాబు వేయించు" అని చెప్పి వెళ్ళిపోయారు. నాకు పచ్చి వెలక్కాయ గొంతున పడినట్లయింది.

ఆ మహనీయుడు చెప్పినట్లు చేసేందుకు తెంపురాదు. వారు

ఆజ్ఞాపించారు కనుక చేయకుండా వుండలేను. కనీసం నెలరోజులు పని ఆపి ఆలోచిస్తున్నాను. ఈలోగా నేను పని చేయించని విషయం తెలిసే కాబోలు పని ఎంతవరకు వచ్చింది అని గొలగమూడి నుండి వెళ్ళిన భక్తులను నాలుగుసార్లు అడిగారు. వేసవికాలమైనందున బ్రహ్మంగారి బావి ఎండిపోయింది. నేను పని చేయించక పోవుటకు కారణం దొరికింది. వెంటనే శ్రీ స్వామివారికి బావి ఎండిపోయిన సంగతి లెటరు వ్రాసి, నీరు వస్తే పని చేస్తానని తెలిపాను.

ఆ మహనీయునకు నా ఆత్మలోని బాధ తెలియకపోలేదు. క్యాన్సరు వ్యాధిని శ్రీ స్వామివారి ఆశీస్సులతో పోగొట్టుకున్నవారు స్వామివారికి కృతజ్ఞతలు తెలిపేందుకు నీలకంఠరావుపేట పోతే గొలగమూడిలో నిర్మించే బ్రహ్మంగారి మఠం చూసి వెళ్ళమన్నారు. ఆ భక్తుడిక్కడికి వచ్చి నా బాధంతా విని 'సార్! ఏమైనా సరే మీరు స్వామివారు చెప్పినట్లే చేయండి. దానికవసరమైన కమ్ములు, సిమెంటు నేనిస్తానన్నాడు'. సరేనన్నాను. వారు 60 కమ్ములు, 30 బస్తాల సిమెంటు పంపారు.

యుగంధర్ అనే భక్తుడు 'ఫలానారోజు నా యింటికి స్లాబు పోస్తున్నాను, ఆ రోజే బ్రహ్మంగారి మఠానికి స్లాబు పోయాలని' పట్టుబట్టి పని జరిపించారు. మంచి వేసవి, బావిలో చుక్క నీరు లేవు. ఆ భక్తుడు 300 గజాలకు పైన రబ్బరు పైపులు జాయింటు చేసి స్లాబుకే కాక క్యూరింగ్‌కు కూడా నీళ్ళు సరఫరా చేసాడు.

ఈ లోగా నా అభ్యర్థన లేకుండానే అనేక భక్తుల సహకారంతో మఠం మాత్రమే గాకుండా పూజారికి రెండు రూములు సిమెంటు రేకులతో వేసాము. చుట్టూ ప్రహరీ గోడ, గేటు ఏర్పడ్డాయి. ఒక భక్తుడు 5 అడుగుల బ్రహ్మంగారి పటమిచ్చాడు. మఠంపైన కలశం పెట్టాలి. ఒకరి ద్వారా ఆర్డరు ఇచ్చి డబ్బు ఇస్తానన్నాను. చిత్రంగా ఆ వ్యక్తి ఆ కలశం ఖర్చు తానే భరించాడు. 26-11-2001 నాడు సద్గురు శ్రీ దర్గాస్వామివారి కరకమలములతో మఠ ప్రారంభోత్సవం దివ్యంగా జరిగింది. ఇంతటి పని నేను చేయిస్తానని కలలో కూడా అనుకోలేదు. స్వామివారి దివ్య ఆశీస్సులే ఈ కార్యమంతా చేయించింది.

గొలగమూడిలోని శ్రీ బ్రహ్మంగారి మఠం ప్రారంభోత్సవంలో

శ్రీ దర్గాస్వామివారు ఉపన్యసిస్తున్నారు. చాలా మంది భక్తులు కిక్కిరిసియున్నారు. అదే రోజు ఆ గ్రామంలోని ఒక గృహప్రవేశమునకు చాలామంది బంధువులు వచ్చి వున్నారు. ఉపన్యాసం మధ్యలో ఒకామె హఠాత్తుగా లేచి 'స్వామీ! ఈ సంసారం, భార్య, పిల్లలు ఇదంతా ఎందుకు స్వామీ?' అని అడిగింది. "ఎందుకేమిటమ్మా! కలర్ టీవీలు, నగలు తెచ్చివ్వలేదని మొగుణ్ణి రోకలి బండతో కొట్టేందుకమ్మా" అని చెప్పి స్వామి తమ ఉపన్యాసం కొనసాగించారు. ఆమె 'కిం' అనకుండా కూర్చుంది.

గృహప్రవేశం దగ్గర మగవాళ్ళంతా భోంచేసి తాంబూలం సేవిస్తూ పెద్దగా నవ్వుకుంటున్నారు. విషయమేమిటని కనుక్కుంటే ఇందాక శ్రీ స్వామివారు రోకలిబండతో భర్తను కొట్టేందుకే ఈ సంసారమని చెప్పారు గదా! ఆ ప్రశ్న అడిగిన ఆమె తన మొగుణ్ణి రోకలిబండతో కలర్ టీ.వీ తేలేదని కొట్టింది అని చెప్పారు.

ఎంత చిత్రమో చూడండి. శ్రీ స్వామివారు ఎప్పుడూ వారి గ్రామం పోలేదు. అందువలన ఆ విషయం వారికి తెలియదని మనం అనుకుంటాము. కానీ ఆమె అడిగిన వెంటనే ఏమీ తడుముకోకుండా ఆమె తప్పును కుండ బ్రద్దలు కొట్టినట్లు చెప్పేశారు. అదే సర్వజ్ఞత్వం - సర్వవ్యాపకత్వం. ఇట్టి మహనీయుడు మన మధ్య వున్నా వారి నిజస్థితిని తెలుసుకోలేని మన అంధత్వం, అజ్ఞానం ఎంత గొప్పగా వున్నాయో గదా!

**నెల్లూరు చిల్డ్రన్స్ పార్కు దగ్గర సాయి మందిర నిర్వాహకులు శ్రీనివాసరెడ్డిగారు** ఇలా చెపుతున్నారు: 2002సం॥లో సాయిబాబా మందిర నిర్మాణానికి స్వామి దగ్గర ఆశీస్సులు తీసుకొని వెళ్ళాము. మందిర నిర్మాణానికి దక్షిణ యిస్తామన్న వారు ఇవ్వకపోయేసరికి మందిర నిర్మాణం ఆగిపోయింది. స్వామి దగ్గర విన్నవించుకుంటే **"సచ్చరిత్రలో బాబా ఏమి చెప్పాడు? అయన్ని నమ్ముకోమని చెప్పారు. మీరు ఎవరినీ అడగనక్కరలేదు. సాయి సచ్చరిత్ర నిత్య పారాయణ చేస్తుండండి, అన్నీ ఆ భగవంతుడే చేస్తాడని"** చెప్పారు. అలాగే నిత్య పారాయణ చేయటం మొదలు పెట్టగానే ఏ రోజుకి ఎంత కావాలో భక్తులు తీసుకు వచ్చి ఇచ్చారు. వారేగాక మేము ఇంతకు ముందు అడగనివారు కూడా వారికై వారు

వచ్చి మందిర నిర్మాణానికి దక్షిణ సమర్పించారు.

నెల్లూరు చిల్డ్రన్స్ పార్కు సాయిమందిర నిర్మాణం జరిగిన కాలాంతరంలో భక్తుల రద్దీ పెరిగి ఇరుకైంది. అందువలన వెనుకనున్న స్థలం కొందామనుకుంటే ఆ స్థలం వారు (ఆరుగురు భాగస్వాములు) ఇల్లు కట్టుకోవాలని అమ్మనన్నారు. స్వామి దగ్గరకి వెళ్ళి 'స్వామీ! మీరు మందిరం వెనుకనున్న స్థలం తీసుకోమన్నారు కానీ వాళ్ళు ఇవ్వట్లేదు ఇప్పుడు ఏమి చేసేది' అని అడిగాము. దానికి స్వామి "మీకెందుకు నాయనా! బాబాను ప్రార్థించుకోండి. ఆ స్థలం మనది. ఏ రోజుకైనా మందిరం కట్టాలి" అన్నారు. తర్వాతి కాలంలో ఆ ఆరుగురు భాగస్వాములు ప్లాను తెచ్చుకొని గుంటలు కూడా త్రవ్వుకున్న తరువాత వారిలో వారికి గొడవలొచ్చి వారంతట వారే అమ్ముతామని అన్నారు. స్వామికి ఇలా తక్కువకి ఇస్తున్నారని తెలిపితే స్వామి "బాబా తత్వం అది కాదు నాయనా! మార్కెట్ ధరకే తీసుకోండి" అన్నారు. అలానే స్వామి చెప్పినట్లు స్థలం తీసుకున్నాము.

**చెన్నై విల్లివాకంలో సాయిమందిర నిర్మాణం గురించి గోవర్ధన్‌గారు** ఇలా చెపుతున్నారు: మా తల్లిదండ్రులైన శ్రీమతి ప్రభావతమ్మ, శ్రీ శ్రీనివాసులుగారు కొద్దికాలం దర్గాలో గడపాలని అంతా సిద్ధమై వెళ్ళినారు. అప్పుడు స్వామివారు "ఆ సాయే మీ వద్దకు వస్తారు, మీరు వెళ్ళి అక్కడే సేవ చేసుకోండి" అని చెప్పారు. దాని ఫలితమే విల్లివాక్కం, లక్ష్మీ స్ట్రీట్‌లో శ్రీ సమర్థ సద్గురు దర్బారుసాయి జ్ఞాన మందిర నిర్మాణం.

స్వామివారు మరియు అమ్మయ్య మొదటిసారిగా ఫిబ్రవరి 2002లో లక్ష్మీ స్ట్రీట్ (తిరుమంగళంరోడ్డు, విల్లివాక్కం, చెన్నై) లోని మా ఇంటికి వచ్చారు. అప్పుడు అక్కడ సాయిమందిరం నిర్మించాలని స్వామివారు మాకు సూచించారు. వారు చెప్పినది సరిగా అర్థం చేసుకోలేక మేము మందిరానికి స్థలం కొరకు వెదకడం ప్రారంభించాము. స్వామివారు ఆగస్టు 2002లో వచ్చినప్పుడు మరలా ఆ విషయం ప్రస్తావించారు. కొన్ని నెలల తర్వాత మా ఎదురింటిలో వున్న మా బంధువులు శ్రీ కృష్ణమూర్తి, శాంతమ్మగార్లు వచ్చి తమ ఇంటికి పడమరలో వున్న 15

అడుగుల వెడల్పున్న ఖాళీ స్థలాన్ని ఇస్తామని ప్రస్తావించారు. ఈ విషయాన్ని స్వామివారికి చెప్పడమైనది. అప్పుడు స్వామివారు "ఆ స్థలాన్ని అమ్మినా అమ్మకపోయినా ఫరవాలేదు కానీ వారింటికి వాయువ్యం పెరిగి వుంది కనుక అక్కడ వున్న మెట్లను తీసివేస్తే వారి కుటుంబానికి మంచిది" అని సలహా ఇచ్చారు. శాంతమ్మ, కృష్ణమూర్తిగార్లు అందుకు అంగీకరించి మెట్లను తీసివేసి మిగిలిన ఖాళీ స్థలాన్ని చేర్చి 17 అ॥ వెడల్పు 35 అ॥ పొడవుగా చేసి శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయి ట్రస్టుకు అమ్మడం జరిగింది.

భూమిపూజ స్వామి,అమ్మయ్యల సమక్షంలో 23-2-2004న జరిగింది. స్వామివారు తమ ఆశీర్వచనంతో పాటు రు. 516/- విరాళం కూడా అందజేశారు. ఆ తరువాత స్వామివారు మరొక లక్షరూపాయలు మందిర నిర్మాణానికి గాను మాకు అందచేశారు. వీటితో పాటు శ్రీస్వామివారు మందిరానికి కావలసిన పూజా సామాగ్రి మొత్తం ఇచ్చారు. మందిర నిర్మాణ సమయంలో కూడా స్వామివారి అనుగ్రహం మాకు స్పష్టంగా గోచరించింది. మొదటి అంతస్తుకు స్లాబ్ వేసేటప్పుడు దట్టంగా మబ్బులు ఉన్నాయి. అయినా స్లాబ్ పని పూర్తయేవరకు ఒక చుక్క వర్షం కూడా రాలేదు. ఈ విషయాన్ని మా నాయనగారు శ్రీ అమ్మయ్యగారి వద్ద దర్గాకు పోయి ప్రస్తావించగా "మంచి కార్యాలకు ఎలాంటి ఆటంకాలూ రావు" అని చెప్పారు.

తర్వాత, 6 సెప్టెంబరు 2004 కృష్ణాష్టమి నాడు ద్వారకామాయి సాయిబాబా ఫోటోని ప్రతిష్టించి, మందిరానికి కావలసిన సమస్త వస్తువులను శ్రీ అమ్మయ్యగారు సమకూర్చారు. ఆ తర్వాత జూన్ 20వ తేదీ 2005 జ్యేష్టమాసం త్రయోదశినాడు స్వామివారు తమ దివ్య హస్తాలతో సమర్థ సద్గురు శ్రీ దర్బారు సాయి, శ్రీ మహా గణపతి, శ్రీ సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలు మందిరంలో ప్రతిష్ఠించారు. ఆ సందర్భంగా జరిగిన మహాకుంభాభిషేకం అత్యంత వైభవంగా జరిగింది.

చెన్నైలో సాయి మందిరం కట్టేటప్పుడు "సాయి వస్తాడు రా, మీరు ఎవర్నీ దక్షిణ కోసం బలవంతం చేయవద్దు, ఎవర్నీ ఇబ్బంది పెట్టవద్దు. సాయికి తెలుసు ఎవరి దగ్గర ఏమి తీసుకోవాలో" అని స్వామి చెప్పారు.



స్వామి చెప్పిన మాట ప్రకారమే నడుచుకున్నాము. ఒక ధనవంతుడి దగ్గరకి వెళ్ళి మందిర నిర్మాణ వివరాల పాంప్లెట్ ఇచ్చాము. వారు 100 రూపాయలు ఇచ్చారు. అదే రోజు ఇంకొకరి ఇంటికి వెళ్ళాము. వారిది మధ్య తరగతి కుటుంబం, కానీ 30 వేల రూపాయల చెక్కు ఇచ్చారు. స్వామి అన్నమాట "సాయికి తెలుసు ఎవరి దగ్గర ఏమి తీసుకోవాలో" ఎంత సత్యమో అనేది బాగా అర్థమైంది.

**వేణుగోపాల్ గారు**, చెన్నై ఇలా చెపుతున్నారు: విల్లివాకంలో స్వామి చేతుల మీదుగా ప్రతిష్ఠించిన సాయిబాబా మందిరంలో ప్రతిరోజు ఉదయం ఆరతి, తర్వాత గోవింద నామాలు, భజన చేస్తాము. అక్టోబరు 2010లో ఒకరోజు బద్ధకంగా నేను, శ్రీకాంత్‌గారు ఆరతి, గోవిందనామాలు చేసాము. ఏదో అయింది అనిపించాము కాని ఉత్సాహంగా చేయలేదు. ఆరోజు సాయంత్రం గోవర్ధన్‌గారు స్వామి దగ్గరనుండి వస్తూనే ఏమిటీ! ఆరతి బద్ధకంగా చేశారా! ఉదయం స్వామి మీరు బద్ధకంగా చేస్తున్నారని చెప్పి ఈ రెండు బిస్కెట్లు మిమ్మల్ని తినమని చెప్పారు అని చెప్పేసరికి మాకు ఆశ్చర్యంతో నోటమాటరాలేదు. అంటే మేము చెన్నైలో చేసే ప్రతి చేష్ట ఆయనకు తెలుస్తోందని మాకు తెలియచేసి మమ్మల్ని సరైన మార్గంలో పెట్టారు.

**కల్పాకంలో ఉద్యోగం చేస్తున్న వేణుగోపాల్ గారు** ఇలా

చెపుతున్నారు: కల్పాకం, చెన్నై నుండి 80 కి.మీ. దూరంలో మరియు మహాబలిపురానికి చాలా దగ్గరలో వున్న అణు విద్యుత్ శాఖ ఉద్యోగులు నివసించే టౌన్‌షిప్. మా టౌన్‌షిప్‌లో ప్రతి గురువారం భక్తుల ఇళ్ళల్లో సత్సంగం చేసుకునేవాళ్ళము. సత్సంగం సభ్యులు అయ్యప్ప గుడి ప్రాంగణంలో ఒక సాయిబాబా మందిరం కూడా కడదామనే సంకల్పంతో అయ్యప్ప గుడి కమిటీ వారిని అభ్యర్థించగా వారు కాదన్నారు. అదే విధంగా ఇంకొక గుడి యాజమాన్యం కూడా ఒప్పుకోలేదు. ప్రత్యేకంగా మందిరం కడదామని ప్రయత్నించి ఇక్కడి అధికారులకు స్థలం ఇచ్చే అధికారం లేకపోవడం వల్ల విషయం ముందుకు సాగలేదు. దర్గాస్వామి దగ్గరకొచ్చి విన్నవిస్తే "నేను స్థలానికి వచ్చి ధ్యానం చేస్తే ఆటంకాలు తొలుగుతాయి. మీకు నిదానంగా స్థలం వస్తుంది" అని అన్నారు. మరలా ప్రయత్నించినా కూడా విఫలమైనాము. కొన్నాళ్ళకు దర్గాస్వామి చెన్నైకి వచ్చారు. స్వామిని కల్పాకం ఆహ్వానించాలని వెళ్ళాము. మాకు మందిరానికి స్థలము దొరకలేదు. మరి స్వామిని తీసుకువస్తే స్వామి ఎక్కడ ధ్యానం చేస్తారు? అనే శంక ఉండడంతో స్వామితో మేము హృదయపూర్వకంగా చెప్పలేకపోయాము. మా బాధ స్వామికి తెలియకపోతే కదా! మేము మా ప్రయత్నాల గురించి చెపితే స్వామి "నేను అంత దూరం ప్రయాణం చేసి రాలేను. ఇక్కడనుండే చేస్తాను, నిదానంగా పనులు అవుతాయి" అన్నారు.

మేము చేసిన ప్రయత్నాలకు ఎన్నో యిబ్బందులు వచ్చాయి. ఎన్నో కమిటీలవారి అనుమతులు, పైగా అనుమతి యిచ్చినట్లు వ్రాస్తారు కానీ అసలు మందిరం కట్టటానికి అనుమతి ఉండదు. చాలా చిత్రంగా స్వామి ఏమి ప్రేరణను ఇచ్చారో తెలియదు కానీ, మంజునాథ అనే ఆయన చొరవతో మందిరానికి స్థలం, కట్టడానికి అనుమతి వచ్చింది. శంఖుస్థాపనకని స్వామి దగ్గర కెళితే స్వామి మేము తీసుకెళ్ళిన మందిర స్థలంలో శిలను చూచి అమ్మవారు కనిపిస్తున్నారని చెప్పారు. మేమేమి అడగకుండానే "మంజునాథ ధైర్యవంతుడు, శివుడిని ఆరాధిస్తాడు" అని 2-3 ని॥ ఆయన గొప్ప లక్షణాలు చెప్పి మంజునాథ చేత శంకుస్థాపన చేయించమని మరియు శంకుస్థాపనకు రెండు కొబ్బరి కాయలు

కొట్టమని చెప్పారు. మా సత్సంగసభ్యులలో కొందరు శంకుస్థాపన సమయంలో ఒక కొబ్బరికాయ సరిపోతుందని, మరికొందరు స్వామి చెప్పినట్లు రెండు కొట్టాలని అన్నారు. మా ప్రమేయం లేకుండా మొదటి కొబ్బరికాయ కుళ్ళిపోగా రెండవకాయ కొట్టవలసి వచ్చింది. పై లీలను తరచి చూస్తే స్వామి సర్వప్రేరణాధికారియై మంజునాథగారిని ప్రేరేపించి అనుమతి లభించేటట్లు చేసారు. మందిర స్థలంలో పుట్టలు ఉన్నాయని, మేము తీసుకు వెళ్ళిన రాళ్ళలో అమ్మవారు ఉన్నారని, మేమేమి చెప్పకుండానే మంజునాథగారి గురించి చెప్పి, రెండు కొబ్బరి కాయలు కొట్టండని చెప్పి అలానే జరిపించిన స్వామివారు సర్వజ్ఞులు, సర్వసమర్థులు, సర్వప్రేరణాధికారి అని తెలుస్తోంది. ఎన్నో అధికారిక అడ్డంకులు వున్నా ఇలాంటి ఒక టౌన్‌షిప్‌లో మందిర నిర్మాణానికి స్థలం రావటం, అనుమతి యివ్వబడటం ఒక పెద్ద అద్భుతం.

## దమ్మపేటలో సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ:

దమ్మపేట సత్సంగ సభ్యులు ఒక సాయిబాబా ఆలయ నిర్మాణం చేసుకోవాలని భావించారు. దానికి దర్గాస్వామి ఆశీస్సులతో ప్రారంభిస్తే పని ఆటంకాలు లేకుండా అనుకూలంగా జరుగుతుందని విగ్రహప్రతిష్ఠకు ముందు స్వామిని దర్శించారు. ఈ సందర్భంగా శ్రీ దర్గాస్వామివారితో విగ్రహము కొరకు ప్రయత్నిస్తున్నామని, ప్రసాదరావుగారు ఇస్తున్నారని చెప్పినారు. అప్పుడు శ్రీ స్వామివారు "ఆయన ఎలక్షన్‌లో గెలవరు కానీ విగ్రహం ఇస్తాడు. ప్రతిష్ఠకు నేను వస్తాను" అని చెప్పారు. వారు ప్రతిష్ఠ ఆహ్వాన పత్రికను స్వామికి పంపారు. కాకతాళీయంగా ఆహ్వానపత్రిక పంపిన రోజునే శ్రీ స్వామి నుండి "ఏ రూపంగానైనా వచ్చేదే" అని వ్రాసిన జాబు చేరినది. ప్రసాదరావుగారు నిమిత్తమాత్రుడేనని, వారికా సంకల్పం కలిగించి, మందిరానికి కావలసిన సాయి విగ్రహాన్ని ఆయన ద్వారా ఇప్పించింది శ్రీస్వామివారేనని వారి దృఢవిశ్వాసం. ఒకసారి సత్సంగ సభ్యురాలు జ్యోతిగారు స్వామిని దర్శించగా "మీ మందిరంలో బాబా విగ్రహ రూపంలో వుండి మీ పూజలు, నివేదనలు స్వీకరిస్తున్నామని" చెప్పారు.

ఈ విధంగా విశ్వగురుడు, సకల సాధుస్వరూపుడు అయిన శ్రీ సాయి, స్వామి ఒక్కటేనని మా విశ్వాసం.

నెల్లూరులోనే అయిదు ప్రదేశాలకు పైగా మరియు వింజమూరు, కావలి, కనిగిరి, ఆత్మకూరు, కొండబిట్రగుంట, కడప, రాయచోటి, పొదలకూరు, అప్పారావుపాళెం, మొగిలిచర్ల, డేగపూడి, కండలేరు, చెన్నైలలో శ్రీ సద్గురు షిర్డీ సాయినాథుని విగ్రహాలని స్వామీజీ తమ స్వర్ణ హస్తాలతో ప్రతిష్ఠించగా, మాతాజీ తమ స్వర్ణ హస్తాలతో మందిరానికి అవసరమైన ధనసహాయం, వస్తుసహాయం చేశారు. అంతేగాక, గువ్వల చెరువులో మసీదులకు, దర్గాలకు కూడా ధన సహాయం చేశారు. అలాంటి సహాయం వారి సర్వమత సమభావానికీ, పరమత సహనానికి అత్యుత్తమ నిదర్శనం. కేవలం షిర్డీసాయి విగ్రహాలనేకాక వారు సీతారామ లక్ష్మణ ఆంజనేయ విగ్రహాలను, నవగ్రహాలను, గణపతి, దత్తాత్రేయ స్వామి, శివపార్వతులు వగైరా దేవతా విగ్రహాలను కూడా ప్రతిష్ఠించారు. మరొక విశేషం, శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాష్టారుగారి విగ్రహాన్ని ప్రతిష్ఠించడం.

## విద్యాలయాలు

దైవకార్యాలకు, భక్తుల సౌకర్యాలకు మాతాజీ, స్వామివారు చేసిన కృషి, ధన సహాయం అపారం. షిర్డీసాయి విగ్రహప్రతిష్ఠ అనేక గ్రామాలలో, పట్టణాలలో వారు చేశారు. శ్రీ దర్గాస్వామివారు అమ్మయ్యతో తమ వివాహం తర్వాత తన ఆస్తిని, అమ్మయ్యగారి ఆస్తిని యావత్తు దానధర్మాలకు వినియోగించి రిక్తహస్తాలతో నిలిచారు.

భక్తుల సౌకర్యార్థం పుణ్యక్షేత్రాలలో, ఇతర ప్రదేశాలలోకూడా వారు భూరి విరాళాలు ఇచ్చిఉన్నారు. వాటిలో మచ్చుకు కొన్ని : శిరిడీలో అఖిల భారత శిరిడీ క్షేత్ర సాయిభక్త నివాస్ ట్రస్టువారికి భక్తులవసతికై ఒక గది నిర్మాణానికి ఒకలక్ష వేయినూటపదహారు రూపాయలు; అదే సత్రంలో నిత్యాన్నదానానికి ఇరవై అయిదువేల నూటపదహారు రూపాయలు; షిర్డీ సంస్థాన్ వారి నిత్య అన్నదాన పథకానికి యాభైవేల రూపాయలు; తమిళనాడులోని షోలింగర్‌లో శ్రీ లక్ష్మీనృసింహ స్వామివారి సన్నిధిలో గది నిర్మాణానికి ధనసహాయం; నెల్లూరులో

శ్రీ షిర్డీసాయి రూరల్ వెల్ఫేర్ & మెడికల్ ఫౌండేషన్‌వారు నిర్మించిన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి మరియు శ్రీ సాయి మందిరం ఆవరణలో ధ్యాన మందిర నిర్మాణానికి ఒక లక్ష రూపాయలు; భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి పుణ్యక్షేత్రమైన గొలగమూడిలో అన్నదానానికీ, పేద విద్యార్థుల నివాసానికి ధర్మసత్ర నిర్మాణము; ఉచిత వివాహాలకై కళ్యాణ మండప నిర్మాణార్థం శంకుస్థాపన. ఇలాంటి వితరణ కార్యాలలో సంకల్పమూ, ప్రోత్సాహము మాతాజీదే. రూపకల్పన, నిర్వహణ స్వామీజీది. స్వామీజీతో మాతాజీ, "స్వామీ, మీ చేతుల మీదుగా లక్షలు ఖర్చవుతాయి. లక్షలు కూడా అదేరీతిలో చేతికి వస్తాయి" అనేవారు. ఇంతగా దాన ధర్మాలు చేసినా వారిలో నిగర్వత, నిరాడంబరత మినహా మరేమీ కనిపించదు. వీటిని గురించి ప్రస్తావిస్తే, మాతాజీ "మాదేముంది, వారిసొమ్ము వారికిచ్చాం" అనేవారు.

దర్బారు నగరంలో (దర్గావద్ద) ఉరుసు, జెండా ఉత్సవమేగాక, శ్రీరామనవమి, గురుపూర్ణిమ, విజయదశమి, దత్త జయంతి, ఆంగ్ల నూతన సంవత్సరాది, శ్రీ సమర్థ సద్గురు సాయినాథ మందిర వార్షికోత్సవం వగైరా జరుపుతారు. వాటికి కుల, మత, ప్రాంత, ధనిక, బీద లాంటి తారతమ్యాలు ఏమీ కనిపించవు. అందరికీ ఒకే పంక్తి. అందరికీ అదే మృష్టాన్న భోజనం. అందరినీ మాతాజీ స్వయంగా "భోజనం చేశారా లేదా?" అని అడుగుతారు. అంతేగాక దూర ప్రాంతాల భక్తులు ఇళ్ళకు వెళ్ళేటప్పుడు వారికి స్వీట్లు వగైరా ప్యాకెట్లు ఇచ్చి పంపుతారు. ఇవన్నీ మాతాజీ స్వీయ పర్యవేక్షణలో జరిగేవి.

దర్బార్ సాయి భవనము శంకుస్థాపనకు గొలగమూడికి శ్రీ స్వామివారు వచ్చారు. శంకుస్థాపన జరిగే చోట శ్రీ స్వామివారు అక్కడకొచ్చిన భక్తులందరినీ భక్తితో తోచినది సమర్పించమని విరాళం అడుగుతున్నారు. కొంతమందినైతే "ఐదువేలు ఇస్తామని చెప్పు శ్రీ వెంకయ్య తాతగారు నీ జబ్బు నయం చేస్తారు" అని, మరికొందరిని "పదివేలిమ్మని" అడుగుతున్నారు. వాళ్ళు ఇంటికి వెళ్ళి చెపుతాము స్వామీ అంటే "ఇంటికి వెళ్ళాక ఇవ్వడం - చెప్పడం ఇక్కడే" అని నవ్వుతున్నారు. వేలు ఇచ్చినవారు కూడా దూరంగానే వున్నారు. ఒక పేదరాలు అంతమందిలో ఒక్కరూపాయి సమర్పించింది. ఆ తల్లి రెండు చేతులూ

శ్రీ స్వామివారు పట్టుకొని ఈ తల్లి భక్తితో ఒక రూపాయి సమర్పించింది. అదే నాకు పదివేలని మెచ్చుకున్నారు. చూచే ప్రేక్షకులలో కొందరు 'ఇదెక్కడి స్వామిరా బాబూ! ఇంత గొప్ప డబ్బు పిచ్చి వుండేవారిని తీసుకువచ్చారు' అని అనుకుంటున్నారు.

శ్రీ స్వామివారు అన్నాల హాలుకు నడిచిపోతున్నారు. ఒక భక్తుడు మధ్య దోవలో శ్రీ స్వామివారి పాదాలు పట్టుకొని వదలలేదు. కారణం చెప్పమని శ్రీ స్వామివారు ఎంతో అనునయంగా అడిగినా చెప్పలేదు. తన తనివి తీరాక ఆ భక్తుడు లేచి తానొక మందిరం కట్టిస్తున్నానని వారి చేత్తో ఏమైనా ఇవ్వమని అర్థించాడు. శంఖుస్థాపన దగ్గర వచ్చిన డబ్బంతా శ్రీ వెంకయ్యస్వామి మందిర పర్యవేక్షణాధికారికి (ఎక్జిక్యూటివ్ ఆఫీసర్) ఇచ్చేశారు. ఇక వారి దగ్గర డబ్బు లేదు. పర్యవేక్షణాధికారిని పిలిచి "ఇంటికి వెళ్ళాక నీకు పంపుతాను నాకు ఐదువేలు అప్పుగా ఇవ్వు" అని అడిగి తీసుకొని ఆ భక్తునికిచ్చారు. అంతేగాక "నీ అడ్రస్సు ఇచ్చిపో మరికొంత డి.డి. తీసి పంపుతాను" అని చెప్పారు. శంకుస్థాపన దగ్గర అందరినీ డబ్బులిమ్మని అడుగుతుంటే ఈయనకు డబ్బుపిచ్చి అనుకున్న వాళ్ళు ఇప్పుడు ఈ సన్నివేశం చూచారో లేదో మరి. వారు గొలగమూడికి వచ్చి సంపాదించినది ఐదు వేల రూపాయల అప్పు.

కొంతమంది సాధువులు మేము డబ్బు తాకము అని చెపుతూ భక్తులు తమకు ఇచ్చే డబ్బు మరొకరి దగ్గర వుంచుతారు. **డబ్బు మనస్సుతో తాకకూడదు. చేతులతో తాకితే ఏమీ కాదు.** శ్రీ స్వామివారు ఎన్ని లక్షలు ఎలా దానం చేసారో, ఎన్ని వివాహాలను చేయించారో, ఎందరు విద్యార్థులను చదివించారో లెక్క వుండదు. ఈ విషయంలో వీరు షిరిడీ సాయిని పోలి వుంటారు. ఇంతటి మహనీయమూర్తి మనకు మానవ రూపంలో లభించారు. **వారికి మనం సమర్పించే కానుకల కంటే మనం నిత్య జీవితంలో ఆచరించే సత్యం, ధర్మమే గొప్ప కానుకలని ఎరిగి, వారు మన లోపల, బయట నిరంతరం సాక్షీభూతంగా ఉన్నారనే గుర్తింపుతో వారిని సేవించి తరిద్దాం.**

# ప్రార్థన

1) ప్రభూ దీనదయపాలో మము కావగ రావయ్యా
మా పలుకులు నడకలను పరిశుభ్ర పరచుమయ్య
ఓ నిశ్చల నిర్మల సచ్చయుడ నీ దాపున చేరితిమి
మా కార్యములన్నియు నీకంకిత పరచితిమి
మా జీవిత రథమునకు నీవు సారథి కావయ్య
మా హృదయ కుటీరములో స్థిర నివాసము చేయుమయ్య

2) మూడు లోకములనేలు మోహనుడవు
గుర్రములు తోలు పనికి వప్పుకుంటివి
ఔరా! భక్త సంరక్షణార్థం
ఏ పనికైనా సాహసించెదవు కృష్ణా!

3) ఓం శ్రీ గురుమాలా మన్త్ర:
ఓం నమ: శ్రీ గురుదేవాయ పరమపురుషాయ
సర్వదేవతా వశీకరాయ సర్వారిష్ట వినాశాయ
సర్వమన్త్ర చ్ఛేదనాయ త్రైలోక్యం వశమానాయ స్వాహా
ఓం శ్రీ సద్గురు దర్గాస్వామి చరణారవిందాభ్యాం నమ:
ఓం శ్రీ దక్షిణామూర్తి పరబ్రహ్మణే నమ:

ఓం తత్ సత్

శ్రీ దర్బార్ సాయి పాఠశాలను ప్రారంభించిన తర్వాత, పాఠశాలలో విద్యనభ్యసించే పిల్లలకు రోజూ ప్రార్థనకు ఏదైనా చెప్పమని అభ్యర్థించగా శ్రీ దర్గాస్వామివారు పై పద్యాలు, మంత్రాన్ని చెప్పారు.

శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయినాథాయ నమః

# దైవం మానుష రూపేణ

## అధ్యాయము - 17

## దర్బార్ నగరంలో నిత్యకార్యక్రమములు

- దర్గామాత మందిరంలో దీపం : ఉ॥ 5 గం॥ 00 ని॥
- దర్బార్‌సాయి కాకడ ఆరతి : ఉ॥ 5 గం॥ 30 ని॥
- స్వామి వద్ద స్తోత్ర పారాయణ : ఉ॥ 8 గం॥ 30 ని॥
- దర్గామాత మందిరంలో అర్చన : ఉ॥ 9 గం॥ 30 ని॥
- దర్గాలలో దీపారాధన : ఉ॥ 10 గం॥ 00 ని॥
- దస్తగిరి స్వామి వద్ద దీపం
- అశ్వత్థ నారాయణుని వద్ద దీపం
- స్వామితో ప్రశ్న - సమాధానం : ఉ॥ 10 గం॥ 30 ని॥
- మధ్యాహ్న ఆరతి : మ॥ 12 గం॥ 00 ని॥
- సిద్ధమంగళస్తోత్ర పారాయణ : మ॥ 1 గం॥ 30 ని॥
- దర్గామాత మందిరంలో దీపం : సా॥ 6 గం॥ 00 ని॥
- దర్గాలలో దీపారాధన : సా॥ 6 గం॥ 15 ని॥
- దస్తగిరి స్వామి వద్ద దీపం
- అశ్వత్థ నారాయణుని వద్ద దీపం
- సాయం ఆరతి : సా॥ 6 గం॥ 45 ని॥
- దర్గామాత మందిరంలో అర్చన : రా॥ 8 గం॥ 30 ని॥
- శేజ్ ఆరతి : రా॥ 9 గం॥ 45 ని॥

ప్రతి నెల పౌర్ణమి శ్రీ సమర్థ సద్గురు దర్బార్ సాయి సత్య వ్రతము, ప్రతి గురువారం దర్గాలో గురువులకు, దర్బార్ సాయినాథునికి అభిషేకం చేస్తారు.

ఆశ్రమంలో దైనందిక కార్యక్రమం ఉదయం నాలుగు గంటలకు ప్రారంభం అవుతుంది. స్నానాదికాలు ముగించుకుని 5 గంటలకల్లా స్వామి అమ్మయ్య సమాధి దర్శనం చేసుకుని అఖండదీపంలో నెయ్యి

వేయటానికి వచ్చేవారు. ఉదయం శ్రీ సద్గురుమాతాజీ సమాధి మందిర ద్వారం తెరిచేటప్పుడు స్వామి ఈ విధంగా ప్రార్థన చేసేవారు.

**తెలతెల్లవారెను తూర్పు దిక్కున**
**తెరలుతెరలుగా ----తెచ్చెను**
**మేలుకోవమ్మా దర్గామాత**
**మమ్మేలుకోమమ్మా దర్గామాత**

చాలా సంవత్సరాలు ఉదయం 5గం॥30ని॥ లోపు అమ్మయ్య సమాధి మందిర దర్శనం పూర్తి చేసుకుని సాయినాథుని మందిరానికి వెళ్ళేవారు. తరువాతి కాలంలో స్వామి పెద్దవారు అయినాక చాలా పట్టుదలతో, నడుము వంగిపోయినా ఒకరి చెయ్యి పట్టుకుని నెమ్మదిగా వచ్చేవారు. మొదట్లో మందిరంలోపలికి వెళ్ళి దర్శనం చేసుకునేవారు. తర్వాతి కాలంలో దారిలో ఉన్న మెట్లు ఎక్కి దిగలేక అనంత కళ్యాణ మండపంలో కూర్చుని దూరం నుండే నమస్కరించుకునేవారు. ఈ విధంగా 2016 దాకా స్వామి అమ్మయ్య సమాధి మందిర దర్శనం చేసుకున్నారు. తర్వాత 86 సంవత్సరాల వయస్సులో శరీరం సహకరించక మానుకున్నారు.

నెమ్మదిగా అమ్మయ్య సమాధి మందిరం నుండి సాయినాథుని మందిరానికి వెళ్ళేవారు. సాయినాథుని మందిర వాకిలి ముందర నిలబడి తలెత్తి చూస్తే అమ్మయ్య మందిర గోపుర శిఖరం కనపడుతుంది. స్వామి ప్రతిరోజు శిఖర దర్శనం చేసుకునేవారు. ఆ గోపురం మీద ఒక విద్యుద్దీపం ఉంది. ఎప్పుడైనా ఆ దీపం వెయ్యటం మరచిపోతే మందలించేవారు. సాయినాథ మందిర వాకిలి నుండే ఆశ్రమం గేటు ద్వారా చూస్తే దర్గాలలో సమాధిలో వున్న మహాత్ములు కనపడతారు. వారికి కూడా నమస్కారం చేసుకునేవారు. తర్వాత నెమ్మదిగా మందిర వాకిలి బీగం తీసుకుని లోపలికి వెళ్ళేవారు.

సాయినాథుడి ముందర వున్న తెర తొలగించి కట్టేవారు. తర్వాత స్వామి మందిరం లోపల, బయట లైట్లు వేసేవారు. అంతరాలయంలో వాకిలి బీగం తీసేవారు. వాకిలి వద్ద పెట్టిన నెయ్యిపావు, బీగం తీసుకుని అంతరాలయంలోకి వెళ్ళేవారు. తర్వాత ఇద్దరు భక్తులు లోపలకు

వెళ్ళేవారు. మందిరంలో తెరలు తొలగించికోవటానికి, కసువు తోసుకుని,ఆరతి పుస్తకాలు సర్దుకోవటానికి వీరు సహకరించేవారు. ఒకరు సాయినాథుని అంతరాలయం చుట్టూరా, మరొకరు సాయినాథుని ముందర వున్న ప్రదేశంలో కసువు తోసేవారు. స్వామి మందిర అంతరాలయంలో కసువు బయటకు తోసేవారు. గురువారం రోజు మాత్రం కసువు తోసినాక స్వామి గిన్నెతో మందిరమంతా నీళ్ళు చల్లేవారు. తర్వాత భక్తులు అలికి తుడిచేవారు. ఈ పని ఆయన శక్తి ఉన్నంతకాలం చేసారు. భక్తులు ఈ కసువంతా చాటలోకి ఎత్తుకుని ఆశ్రమ ప్రహరీ గోడ అవతల పడేసేవారు. తీర్థం ఇచ్చే వెండి గిన్నెలో నీరు తీసుకుని వాకిలి బయటకు వచ్చి "గంగేచ యమునే గోదావరీ......" అని చెపుతూ వాకిలి ఎడమగట్టు మీద, వాకిలి ముందు మెట్టు మీద, వాకిలి కుడి గట్టుమీద నీరు చల్లి చేతితో తుడిచేవారు. తర్వాత గోనెసంచి పట్టాను మెట్టుమీదకు లాగి, వేసి చేతితో రెండు దెబ్బలు వేసేవారు. నిలబడి ఆ వెండిగిన్నె లోపల చేతితో రుద్ది మిగిలిన నీరు దూరంగా విసిరేవారు. స్వామి లోపలకు వెళ్ళి అంతరాలయంలో కూర్చుని ఆరతికి వత్తులు వేసుకునేవారు.

తర్వాత భక్తులను లోపలకు పంపేవారు. లోపలకు వచ్చిన భక్తులు దర్బార్ సాయినాథునికి కుడిప్రక్క ఉన్న గణపతికి మొదట నమస్కారం చేసుకుని అంతరాలయమునకు ప్రదక్షిణ చేసి వచ్చి కూర్చునేవారు. ఇక్కడ జాగ్రత్తగా గమనిస్తే ఒక సూక్ష్మమైన అంశం ఉంది. స్వామి అంతరాలయంలోకి వెళ్ళి కూర్చున్న తర్వాత భక్తులు ప్రదక్షిణగా వెళ్ళి కూర్చుంటే దర్బార్ సాయినాథునికి, స్వామికి ప్రదక్షిణ చేసినట్లు ఉంటుంది.

మందిరంలో అడుగు పెట్టిన దగ్గరనుండీ ఆరతి పూర్తయ్యేవరకు స్వామి గంభీరంగా, చాలా అలర్ట్‌గా ఉండేవారు. ప్రతిరోజూ ప్రతిపనీ ఒకే పద్ధతిలో జరగాలి. చేసే పనిలో కానీ పద్ధతిలో కానీ తేడా వస్తే మందలించేవారు.

కాకడ ఆరతికి 5 వత్తులు వేసుకుని నెయ్యి పోసుకుని, మధ్యలో కర్పూరం బిళ్ళలు వేసుకునేవారు. వత్తులు ఎడమప్రక్క నుండి

కుడిప్రక్కకు వరుసక్రమంలో వెలిగించేవారు. ఏ పరిస్థితులలోను వరుసక్రమం తప్పేవారు కాదు. రెండు అగరుబత్తీలని వెలిగించేవారు, ఐదు వత్తులు వెలిగించాక 'ఓంకారము' చేసి బత్తీలతో కర్పూరాన్ని వెలిగించేవారు. స్వామి ఓంకారము చెప్పటంతో నగారా స్విచ్ వేసి, గంట, ఠంకం, ఢమరుకాలని మ్రోగించేవారు. స్వామి బత్తీలని సాయినాథుని చుట్టూ తిప్పి పెట్టేవారు. ఆరతి కుందిని ఎత్తి మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తికి చూపించి వెనక్కి తిరిగి వీపు చూపించకుండా నెమ్మదిగా వెనక్కు నడుచుకు వచ్చేవారు. అంతరాలయం నుండి బయటకు వచ్చాక, ఎడమప్రక్కకు వచ్చి గణపతికి ఆరతిచ్చి కుడిప్రక్కకు వెళ్ళేవారు. అక్కడ శిరిడీ సాయినాథునికి కూడా ఆరతిచ్చినాక ప్రదక్షిణగా ఉత్తరం మీదుగా తూర్పుకు తిరిగేవారు. అప్పుడు భక్తులందరూ ఆరతి మీద చేతులు పెట్టి కండ్లకు అద్దుకునేవారు. ఆరతిని ఒక్కసారి మాత్రమే కండ్లకు అద్దుకునేవారు. ఎవరన్నా కొత్తవాళ్ళు వచ్చినప్పుడు మూడుసార్లు అద్దుకుంటే స్వామి అరిచేవారు. ఈ నమస్కరించుకునే సమయంలో చేయి కదలటంలో గాలికి ఆరతిలో ఉన్న వత్తులు ఏమైనా ఆరిపోతే గట్టిగా మందలించేవారు. ఎట్టి పరిస్థితిలో ఆరతి నేలమీద పెట్టేదాకా ఐదు వత్తులు వెలుగుతూ ఉండాలని జాగ్రత్తగా, పట్టుదలగా ఉండేవారు. ఎప్పుడన్నా ఒకడి, రెండు వత్తులు ఆరిపోతే అక్కడే ఉన్న శంకరయ్యను కానీ గోవర్ధన్‌ను కానీ వెలిగించమనేవారు. ఈ విధంగా శరీరంలో సత్తువ ఉన్నంతకాలం చేసారు. చివర్లో ఆరతి ఎత్తే ఓపిక లేక నేలమీదే పెట్టి నమస్కరించుకునేవారు. ఆరతి అయినాక స్వామి అంతరాలయంలోనికి వెళ్ళి ఒక నిమిషం కూర్చునేవారు.

తర్వాత వెండిగిన్నెలో తీర్థం తీసుకువచ్చి నిలబడి భక్తులకు ఇచ్చేవారు. ఓపిక తగ్గినాక కొంతకాలం కూర్చుని ఇచ్చారు. తర్వాత కొంతకాలం స్వామి అంతరాలయంలో కూర్చుని గోవర్ధన్‌తో కానీ ప్రకాష్‌తో కానీ, సత్యమన్నతో కానీ ఇప్పించారు. ఈ విధంగా భక్తులందరికీ తీర్థం ఇచ్చినాక ఆఖరికి స్వామి కొంత ఊదీ నోట్లో

వేసుకుని తీర్థం తీసుకునేవారు. చాలాకాలం పట్టుదలగా సూర్యోదయం లోపు తీర్థం ఇచ్చారు. తీర్థం అయినాక పటికబెల్లాన్ని ప్రసాదంగా పెట్టేవారు. తర్వాత ఎవరన్నా భక్తుడు నేలమీద పడ్డ తీర్థాన్ని గుడ్డ పెట్టి అలికేవారు. నేలమీద పడ్డ తీర్థాన్ని తొక్కటాన్ని స్వామి ఇష్టపడేవారు కాదు.

దర్బార్ సాయిమందిరంలో కాకడ ఆరతి, తీర్థప్రసాదాలు అయిన తర్వాత గోవిందనామాలు చదివేవారు. గోవిందనామాల పారాయణ పూర్తయిన తర్వాత స్వామివారు తమ కనుబొమ్మల మధ్య కుడిచేతి వేలితో చిన్నగా కొట్టుకుంటూ "ఓం శ్రీ అచ్యుతానంతగోవిందాయ నమ: ఓం" అన్న నామాన్ని కొన్నిసార్లు స్మరణ చేసేవారు. తర్వాత ఈ క్రిందినామాలను కూడా స్మరణ చేసేవారు.

- ఓం గోమాతా గోవిందాయ నమ: ఓం
- ఓం గోవర్ధన గిరిధర గోపాల బాల ఓం
- ఓం గోవింద రామ్ రామ్ గోపాల హరి హరి ఓం
- ఓం హరిహరపుత్రా స్వామియే శరణం అయ్యప్ప ఓం
- ఓం భద్రాచలవాసా నిత్యాగ్నిహోత్ర శ్రీ సద్గురు గోవిందస్వామియే నమ: ఓం

ఈ పై నామాలు స్మరణ చేసినాక సద్గురు పరబ్రహ్మార్పణమస్తు అని చెప్పి సత్సంగానికి మలయాళ స్వామివారి గ్రంథాన్ని పారాయణకు ఇచ్చేవారు.

సత్సంగంలో గ్రంథ పఠన అయినాక స్వామి గ్రంథాన్ని తిరిగి తీసుకుని "ఓం నమశ్శివాయ" అని ఐదుసార్లు చెప్పేవారు. 'ప్రజ్ఞానం బ్రహ్మ" అని మూడుసార్లు చెపుతూ పుస్తకాన్ని కవరులో పెట్టేవారు. తర్వాత

- ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి - 3 సార్లు
- ఓం సాయి నమోనమ: శ్రీ సాయి నమోనమ: జయ జయ సాయి నమోనమ: - 3 సార్లు
- హరేరామ హరేరామ సాయిరామ హరేహరే - 3 సార్లు
- హరేకృష్ణ హరేకృష్ణ సాయికృష్ణ హరేహరే - 3 సార్లు

- ఓం నమో భగవతే వాసుదేవాయ - గురువుల నామాలు
- ఓం నారాయణ ఆదినారాయణ వెంకయ్యస్వామియే శరణమయ్యా - 16సార్లు (ఇది స్వామి చెప్పేవారు)
- ఓం సామ్ శరవణభవ - 5 సార్లు
- దిగంబరా దిగంబరా దత్తాత్రేయా దిగంబరా -
- దిగంబరా దిగంబరా శ్రీపాద శ్రీవల్లభ దిగంబరా -
- దిగంబరా దిగంబరా నృసింహ సరస్వతి దిగంబరా -
- దిగంబరా దిగంబరా అవధూత చింతన దిగంబరా - 3 సార్లు
- ఆఖరికి సాయిబాబా ఆరతి పుస్తకంలోని భజన పాడేవారు.

స్వామి ఆరతి అయినాక ఈ క్రింది విధంగా స్మరణ చేసుకునేవారు.

- శ్రీశైలేశం శివలింగం
- శ్రీగురునిలయం శివలింగం
- ఆనందమయం శివలింగం
- అమృతమయం శివలింగం
- ఇందుశేఖరం శివలింగం
- ఓం భ్రమరాంబికాయై నమోనమ:

ఉదయం 9:30 గంటల తర్వాత దర్గాల దగ్గర, దస్తగిరిస్వామి దగ్గర, అశ్వత్థనారాయణుని దగ్గర నేతితో దీపాలు పెడతారు. తర్వాత, 10:30గంటలపైన 12గం॥ల వరకు వచ్చిన భక్తులకు వాళ్ళు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్తారు.

మధ్యాహ్న ఆరతి 12గంటలకు, తర్వాత మ॥ 1గం॥30ని॥ ల నుండి 3 గంటల లోపు స్వామి సన్నిధిలో సిద్ధమంగళ స్తోత్రం చేస్తారు.

తరువాత సాయంత్రం 5గం॥ల నుండి 6గం॥15ని॥ల వరకు స్వామి సన్నిధిలో స్తోత్ర పఠనము, గ్రంథపఠనము జరుగుతాయి. చాలాకాలం స్వామి సాయంత్రం కూడా భక్తుల సమస్యలకు పరిష్కారమార్గం చూపేవారు. పెద్దవారు అయిన తర్వాత సాయంత్రం స్వామి ప్రశ్న

చెప్పటం మానేసారు.

సాయంత్రం 6 గం॥ 45 ని॥ల తర్వాత సాయం ఆరతి, సత్సంగము జరుగుతుంది.

రాత్రి 9:30 గంటల తర్వాత పవళింపు (శేజ్) ఆరతి చేస్తారు. శేజ్ ఆరతి అయిన తర్వాత మొదట సాయినాధుడికి ఎడమప్రక్క తర్వాత కుడిప్రక్క వింజామర వీచేవారు. వింజామర వీస్తున్నప్పుడు **"దేవదేవ జగన్నాధా కృపాళో భక్తవత్సలా"** అని 5-10 సార్లు చెప్పేవారు. తర్వాత

- అనంతరంగం శ్రీ వైకుంఠం రాజ్యమంతా రామభజన
- శిరిడీవాసా సాయినాథ మహరాజా పవళించవయ్యా
- ద్వారకామాయివాసా సాయినాథ మహరాజా పవళించవయ్యా
- ఓం సాయి శ్రీ సాయి జయజయసాయి మహరాజా పవళించవయ్యా
- ఓం శ్రీ సమర్థ సద్గురు సాయినాథ మహరాజా పవళించవయ్యా
- పరిపూర్ణావతార పరబ్రహ్మ స్వరూపా పరమాత్మ సద్గురుదేవా సాయినాథ మహరాజా పవళించవయ్యా
- సద్గురుదేవా పవళించవయ్యా - సద్గురుదేవా పవళించవయ్యా
- సద్గురుదేవా సద్గురుదేవా సద్గురుదేవా

సద్గురువులోనే విశ్వమంతా ఉన్నది, విశ్వమధ్యములో శ్రీ గురుడు ఉన్నాడని గురుగీతలో చెప్పినట్లు తననాశ్రయించిన భక్తులకు ఇబ్బందులు వస్తే స్వయంగా తన గురువుగారికే వచ్చాయని తలచి సచ్ఛిష్యుడిలాగా సకల ఉపచారాలు చేస్తారు స్వామి.

ఇంతటి నిత్య కార్యక్రమములో టెలిఫోను ద్వారా స్వామి ఆశీస్సుల కోసం మాట్లాడేవారు ఎంతమందో! అఖరికి అర్ధరాత్రిపూట కూడా ఫోను మ్రోగితే స్వయంగా స్వామే ఫోనులో మాట్లాడి సమాధానపరుస్తారు.

కొంత మంది భక్తులు స్వామిని ప్రార్థించి వారానికి ఒకరోజు మాట్లాడాలని ఫోను చేసి మాట్లాడుతూ ఉంటారు. ఎప్పుడైనా వారు ఫోన్ చేయలేక తరువాతరోజు ఫోన్ చేస్తే ఎందువలన ఫోనుచేయలేదు అని గుర్తుంచుకొని అడుగుతారు.

ఇంతటితో స్వామివారు అలసిపోతారా అంటే లేదే! తన చుట్టూ వున్న భక్తుల మనస్సులో తలెత్తిన దుష్టతలంపులను తీసివేయటానికి కోపముతో అరచి హెచ్చరిస్తారు. అంతేకాక తననాశ్రయించిన వారు ఏమరుపాటుగా ఉంటే వారిని తగు విధంగా సంస్కరిస్తారు.

ఆశ్రమంలో ప్రతిరోజు గురు, శుక్ర, ఆది వారాలలో దర్గాలోని గురువుల వద్ద ఒక గ్లాసు పాలు, ఒక గ్లాసు నీళ్ళు సమర్పిస్తారు. మంగళ, బుధ, శనివారం అశ్వత్థ నారాయణుని వద్ద సమర్పిస్తారు. సోమవారం మాత్రం మెహబూబ్ సుభాన్ స్వామి వద్ద సమర్పిస్తారు.

ఆశ్రమంలో జరిగే ఉత్సవాలన్నీ కూడా స్వామికృప వలన మాత్రమే జరుగుతున్నాయనటానికి కొన్ని ఉదాహరణలు:

ఒకసారి శరత్‌బాబుగారు, వెంకట్రావ్ దర్గాల దగ్గర కూర్చుని 'ఉరుసు ఇంకా రెండు రోజులే ఉంది. సున్నాలు ఇంకా వేయలేదే' అని మనస్సులో బాధపడ్డారు. తర్వాత స్వామి దగ్గరకి వచ్చి కూర్చున్నప్పుడు స్వామి "ఏమిరా ఆలోచిస్తున్నారు? సున్నాలు వేసేవారు వస్తారు లేరా!" అని అన్నారు. స్వామికి తమ ఆలోచనలు, మనస్సులోని బాధ తెలుసునని వారికి ఆశ్చర్యమేసింది. ఆరోజు సాయంత్రం ముగ్గురు వ్యక్తులు వచ్చారు. స్వామి దర్శనం తర్వాత రోజు మాత్రమే చేసుకోగలరు అందువలన రాత్రి దర్గాల్లో ఉండచ్చు లేదా మరునాడు ఉదయం రావచ్చు అని శరత్‌బాబు గారు చెపితే వారు ఉంటామన్నారు. మాటల సందర్భంలో వారు సున్నాలు వేసేవారు అని చెప్పారు. శరత్‌బాబుగారి ఆశ్చర్యానికి, ఆనందానికి అవధి లేదు. తర్వాతరోజు ఆ వచ్చిన భక్తులు ఉదయమే నిద్ర లేచి సున్నాలు మధ్యాహ్నం కల్లా వేసేశారు.

శంకరయ్య స్వామి దగ్గరే ఉండటం వలన ఆశ్రమంలో అన్ని పనులు చేస్తూ, ఆశ్రమానికి వచ్చిన భక్తులను కూడా పనులకు పురమాయిస్తుంటాడు. ఆయనకు 2014 నుండి మోకాళ్ళ నొప్పులు. నడవటం ఇబ్బందిగా ఉంటుంది. అందువలన ఏదైనా పెద్ద ఉత్సవమప్పుడు స్వామి దగ్గరకి వెళ్ళి 'స్వామీ! నాకు మోకాళ్ళ నొప్పులు, నేను పనులు చేయలేను. నా వల్లకాదు' అని చెప్తే స్వామి "ఏం కాదులేరా!

అంతా బాగుంటుంది" అని భరోసా ఇస్తారు. అంతే వెంటనే ఏం శక్తి వస్తుందో తెలియదు కానీ పనులన్నీ చకాచకా అయిపోతాయి. శంకరయ్య తన మాటల్లో 'నేను నిమిత్తమాత్రుడనే. ఇక్కడ ప్రతిరోజు అన్నీ చేసేది స్వామే' అని అంటారు.

ఆశ్రమంలో ఒక ఉత్సవానికి వంటవాడు పొంగళి చేస్తున్నాడు. అతను పొరపాటున నిమ్మరసం డబ్బాను నూనె డబ్బా అనుకుని దానితో పొంగళి చేసాడు. ఇది తెలిసిన శంకరయ్య స్వామికి చెప్పుకున్నాడు. స్వామి "ఏమీ అవదులే" అని అభయమిచ్చారు. ఆ పరమాన్నం పులుపు లేక ఎంతో రుచిగా ఉంది.

స్వామి దగ్గర జరిగే ఉత్సవాలు ఎవరికివారు చూడవలసిందే. చాలామంది ఎన్నో సంవత్సరాలు నుండి వచ్చేవారే. వారంతా ఒక కుటుంబంలాగా ఉంటారు. ఎవరికి తగ్గ పనులు వారు చేస్తుంటారు. ఎవరికీ పని శ్రమ తెలియదు. అన్ని పండుగలలో కుల, మత, భాష, ధనిక, బీద తేడాలు లేకుండా భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఏ మత, వర్ణ వివక్షణ లేకుండా ఒకే పంక్తిలో భోజనం చేస్తారు.




దర్గాలో ఈ పై అయిదు చోట్ల ప్రతిరోజు నెయ్యి దీపం పెడతారు.

శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయినాథాయ నమః

# దైవం మానుష రూపేణ

## అధ్యాయము - 18

## ఉపసంహారము

ఈ గ్రంథ ముద్రణకు మొదట గొలగమూడి శ్రీ పెసల సుబ్బరామయ్యగారు, స్వామి స్వయంగా చెప్పిన విషయాలు సేకరించి పెట్టుకున్నారు. స్వామి ఆశీస్సులతో కొంతమంది భక్తుల అనుభవాలతో చిన్న గ్రంధాన్ని 2005లో ముద్రించారు. తరువాత 2011లో మరికొంతమంది భక్తుల అనుభవాలతో గ్రంథాన్ని విస్తరించి పున:ముద్రించాలనుకున్నారు. బెంగుళూరు ప్రసాద్‌ని లీలలు సేకరించమని ప్రోత్సహించారు.

మొదట చాలా మంది భక్తులు స్వామి అనుభవాలు పంచుకోవటానికి ఉత్సాహం చూపలేదు. ప్రసాద్ శ్రీ సుబ్బరామయ్యగారితో విషయం చెపితే అప్పుడు వారు "స్వామిని అడిగితే వ్రాయమని చెప్పరు. మనమే మన సాధనకోసం లీలలు సేకరించాలి, ఈ పని ఎంతో పుణ్యకార్యము" అని చెప్పటం వలన ప్రసాద్ మరలా ప్రయత్నం చేసాడు. దానితో పాటు ప్రతిరోజూ పూజలో స్వామిఫొటోకి వారి భక్తులు తనతో లీలలు పంచుకునేటట్లు ప్రేరణ చేయమని విన్నవించేవాడు. చాలా చిత్రంగా రెండు వారాల తర్వాత చెన్నై శ్రీకాంత్‌గారితో, మరికొంతమంది భక్తులతో స్వామి "నాయనా! చరిత్ర వ్రాస్తున్నారు, మీకు జరిగిన 2,3 లీలలు చెప్పండి" అని చెప్పారు. అప్పటినుండి భక్తులు స్వామిలీలలు చెప్పటానికి ముందుకొచ్చారు. ఈ అనుభవం ద్వారా స్వామిచరిత్ర ముద్రణకు ఆయన పూర్ణమైన కృప, ఆశీస్సులు ఉన్నాయనే విశ్వాసం దృఢపడింది.

స్వామి లీలలు సేకరించిన ప్రసాద్‌కి ఒక సందేహముండేది. 'ఇంద్రియలోలుడనైన నాలాంటివాడు పరిశ్రమ చేసి ముద్రించే గ్రంథము వల్ల ఉపయోగమేముంటుందనే' సందేహం వుండేది. గుంటూరు సౌజన్యగారి బంధువు ఒకమ్మాయి పెళ్ళికావట్లేదని బాధతో

అమ్మయ్య్య సమాధి వద్ద ప్రార్థించారు. అమ్మయ్య్య సమాధినుండి ప్రత్యక్షమై ముందరకొచ్చి "ఎందుకేడుస్తావు? దర్గాస్వామి చరిత్ర మూడుసార్లు పారాయణ చెయ్యి, పెళ్ళి ఎందుకు కాదో చూస్తాము" అని అన్నారు. అలానే చేసిన సౌజన్యగారి బంధువు పెళ్ళి నెలలోపు అయినది.

గుంటూరు జిల్లా, అచ్చంపేట వాస్తవ్యులు రజని గారి భర్త సాంబశివరావుగారు. రజనిగారు మొదటిసారి స్వామివారి దైవం మానుషరూపేణ అనే గ్రంథము చదివి మనస్సులో "స్వామీ! మీరు నేను కొలిచే సాయిబాబానే అయితే నా భర్త కూడా మీ చరిత్ర చదివి నన్ను మీ దగ్గరకి తీసుకువెళ్ళాలి" అని చెప్పుకున్నారు. అనుకున్న కొద్దిరోజులకి సాంబశివరావుగారు ఆ పుస్తకం చదివి ఆశ్రమానికి వెళ్ళి నిద్ర చేద్దాము అని చెప్పి ఆవిడను స్వామి దర్శనానికి తీసుకువెళ్ళారు.

ఈ పై రెండు అనుభవాల ద్వారా స్వామి అనుమతితో, తన ద్వారా పరిశ్రమ చేయించి ముద్రించిన స్వామి చరిత్ర భక్తులకు పారాయణ యోగ్యమైందని తెలుసుకుని ప్రసాద్‌కి ఆనందం కలిగింది. స్వామి లీలా సేకరణ, పారాయణ, మననము మనలోని బలహీనతలను అధిగమించటానికి శక్తివంతములవైన సాధనా మార్గములు. శ్రీ షిర్డీసాయినాథుని హేమాద్పంతు అను భక్తుడు వారి దివ్యచరిత్ర వ్రాయడానికి అనుమతి కోరినప్పుడు ఆ సద్గురుమూర్తి అతనిని ఆశీర్వదించి "**తమ లీలలను శ్రద్ధగా పారాయణ చేసి, వాటిని గూర్చి మననం చేసిన వారికి జ్ఞానధనం లభించగలదని**" హామి ఇచ్చారు. ఈ విషయం స్వామి లీలలకు గూడా వర్తిస్తుంది.

మనము గురుభక్తిని నిలుపుకొని పెంపొందించటానికి సద్గురు చరిత్ర పారాయణ, మననము, సత్సాంగత్యము బలమైన సాధనాలు. వీటిని మన దైనందిక జీవితంలో భాగం చేసుకుని వ్యక్తిగత, ఆధ్యాత్మిక సాధనలో పురోగతి సాధించాలని మా ఆకాంక్ష.

**ఓం తత్ సత్! ఓం తత్ సత్!! ఓం తత్ సత్ !!!**

**సర్వే జనా: సుఖినో భవన్తు**

**లోకా సమస్తా సుఖినో భవన్తు**

శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయినాథాయ నమః

# దైవం మానుష రూపేణ

## అనుబంధం

స్వామి ఎప్పుడన్నా హాస్యంగా శంకరయ్యతో నవ్వుతూ "నిన్ను సి.ఎమ్‌ని చేస్తాను" అని చెప్పేవారు. స్వామి వెంటనే "కుకింగ్ మాస్టర్‌ని చేస్తాంరా!" అనేవారు. శంకరయ్యగారు 1998 ప్రాంతాల్లో అన్నీ వదిలివేసి ఆశ్రమానికి వచ్చి స్వామి శరణాగతిలో స్థిరపడినారు. అప్పటినుండి 2002లో స్కూలు ప్రారంభించేదాకా ఆశ్రమ మంచిచెడ్డలు గమనించుకుంటూ స్వామికి సేవ చేసుకునేవారు. 2002లో ఆశ్రమంలో స్కూలు ప్రారంభించినాక స్కూలు పిల్లలకు, ఆశ్రమానికి వచ్చి వెళ్ళే భక్తులకు రోజూ మధ్యాహ్న భోజనం వండిపెట్టే బాధ్యత చూసేవారు.

ఆశ్రమంలో కాలానుగుణంగా చాలా ఎలుకలు సంచరిస్తూంటాయి. ఆశ్రమ ధర్మం ప్రకారం వాటిని మందు పెట్టి చంపటానికి కానీ, బోను పెట్టి పట్టుకోవటం కానీ చేయకూడదు. అదే సమయంలో ఆశ్రమ స్టోరుగదిలో ఎప్పుడూ కొన్ని బస్తాల బియ్యం నిల్వ ఉండేది. కానీ ఏనాడూ ఆ ఎలుకలు ఒక్క బియ్యం బస్తాకు కూడా కన్నం వేయలేదు.

ఒక రాత్రి బెంగుళూరు సుధాకర్ గమనిస్తూండగా ఒక పక్షి చాలా శబ్దం చేస్తోంది. చాలా కొద్దిమంది మందిరంలో వున్నారు. స్వామి "ఇక చాలు" అన్నారు. అంతే ఆ పక్షి శబ్దం చేయటం ఆపింది. స్వామి అన్నమాట ఆ పక్షికి వినపడి వుండదు. మరి పక్షి ఎందుకు అరవటం ఆపింది? స్వామి చెప్పిన మాట పక్షి భాషలో మారి ఆ పక్షికి అర్థమైందా? లేక స్వామి చెప్పగానే ఆ పక్షికి మనస్సులో అరవకూడదని అర్థమైందా?

కడప జిల్లా పులివెందుల నుండి డా॥ ఆర్. సుబ్బారెడ్డిగారు 1972లో విద్యానగర్ (వాకాడులో) ఇంటర్‌మీడియెట్ చదువుతున్న రోజుల్లో శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టారుగారి ద్వారా శ్రీ దర్గాస్వామి, శ్రీ దర్గామాతల గురించి విన్నారు. ఆ తర్వాత చాలాకాలం ఆయనకు స్వామివారి విషయం గుర్తులేదు. చదువు పూర్తి చేసుకుని ఉద్యోగంలో చేరిన తర్వాత ఒక స్నేహితుని సూచన మేరకు మొదటిసారిగా దర్గాస్వామిని దర్శించుకున్నారు. ఆ తర్వాత కుటుంబ

సమేతంగా అనేకసార్లు శ్రీ దర్గాస్వామివారిని, శ్రీ దర్గా మాతాజీని దర్శిస్తూ ఉండేవారు.

2001వ సంవత్సరంలో ఒక పర్యాయం ఆయన అలవాటు ప్రకారం ధ్యానం చేసుకుంటూ ఉండగా, ధ్యానంలో ఇల్లు కట్టు అని పదే పదే అంతర్వాణి చెప్పింది. ఆ సమయానికి ఆయన చేతిలో 5000 రూపాయలు మాత్రమే వున్నాయి. ఈ భావన గురించి స్వామికి చెపుదామని ఆశ్రమానికి వెళితే, ఆ సమయానికి స్వామి సమక్షంలో చాలామంది భక్తులు మాట్లాడుతూ ఉండటం వల్ల ఆయనేమి చెప్పలేదు. స్వామి ఆయనను చూసి అమ్మయ్యతో "అమ్మయ్యా! సుబ్బారెడ్డికి అన్నం పెట్టాల" అని స్వామి తన అమృతహస్తాలతో విస్తరి వేసి అమ్మయ్య వండిన అన్నం వడ్డించారు. తరువాత ఆయనేమి చెప్పకుండానే స్వామి "**నీ ముందర వుండి ఇల్లు కట్టిస్తా**" అన్నారు. ఆ అభయంతో గృహనిర్మాణం మొదలుపెడితే స్నేహితుల ద్వారా డబ్బు సమకూరి 5 నెలల్లో ఇల్లు పూర్తయింది. స్వామి,అమ్మయ్యలు ఇరువురూ వారి నూతన గృహప్రవేశానికి వెళ్ళి ఆ దంపతులిద్దరినీ ఆశీర్వదించారు.

కడప జిల్లాలోని పెళ్ళిమర్రి మండలం తుమ్మలూరు గ్రామం నుండి చాలామంది భక్తులు స్వామి దర్శనం చేసుకునేవారు. వారి ప్రార్థన మీద స్వామి వారి గ్రామం వెళ్ళి ఒక చోట జెండా ప్రతిష్ఠ చేసి "ప్రతిరోజు ఇక్కడ దీపం పెట్టండి. ఏ ఇబ్బందులు ఉన్నా తీరుతాయి" అని అభయమిచ్చారు. ఇప్పడు శివకోటిరెడ్డి, సుబ్బమ్మలు ప్రతిరోజు దీప, నైవేద్యాలు సమర్పిస్తున్నారు. చాలాకాలంగా పూర్వ కక్ష్యల వలన ఇంకొక వర్గం వారు స్వామిని నమ్మిన భక్తులతో ఘర్షణ పడుతుండేవారు. అవకాశం దొరికితే అవతలి వర్గం వారిని చంపటానికి కూడా వెనకాడేవారు కాదు. ఈ క్రమంలో ఒకసారి స్వామిని నమ్ముకున్న వారి మీద ప్రత్యర్థి వర్గంవారు అదను చూచుకుని తరుముకుంటూ వచ్చారు. వారు పరిగెడుతూ ఊరి మధ్యలో ఉన్న ఒక చెట్టుక్రిందకు చేరుకున్నారు. అక్కడినుండి పారిపోటానికి మార్గం లేదు. అటువంటి సమయంలో వారిని చంపటానికి ఆ చుట్టుముట్టినవారు బాంబులు వేసారు. వారు ప్రాణభయంతో 'సద్గురుదేవా, సద్గురుదేవా' అని స్వామిని తలుచుకున్నారు. ఆ బాంబులు వారి ప్రక్కనే పడినా అవి పేలలేదు.

వారికి అనుమానం వచ్చి వాటిని తీసి దూరంగా విసిరేస్తే అవి అక్కడ పేలాయి. అంతా స్వామి దయ! ఇటువంటి సంఘటనలు రాయలసీమ ప్రాంతంలో సాధారణం. అందునా కడప జిల్లాలో సర్వ సామాన్యంగా జరుగుతాయి.

చాలాకాలం క్రితం ఒకప్పుడు భార్యాభర్తలు దర్గాకు వచ్చి స్వామిని సంతానం కొరకు ప్రార్థించారు. కొంతకాలానికి వారికి ఒక బిడ్డ జన్మించిన కొద్ది రోజులకే మరణించింది. వారి దు:ఖం పట్టలేక, మనస్సు సమాధాన పడక ఆ చనిపోయిన బిడ్డను దర్గాకు తీసుకువచ్చారు. వారు స్వామితో 'స్వామీ! బిడ్డనిమ్మంటే ఇలా చనిపోయిన బిడ్డను ఇచ్చారేమీ!' అని విన్నవించుకున్నారు. స్వామి ఆ బిడ్డ కాళ్ళను ఒక చేత్తో పట్టుకొని దర్గాల దగ్గర గిరగిరా గాలిలో త్రిప్పారు. అంతే! ఆ బిడ్డ గుక్కపట్టి ఏడవడం మొదలుపెట్టింది. అంతటితో స్వామి సమర్థత తెలిసి ఆ దంపతులు స్వామికి ప్రణమిల్లారు.

ఒకరోజు దర్గాకు మొదటిసారి వచ్చిన కొందరు భక్తులు దర్గాలో వెలిగించటానికి సాంబ్రాణీ కడ్డీలు తెచ్చుకున్నారు. వాటిని ఎక్కడ వెలిగించాలో తెలియక చూస్తుంటే, దర్గా పడమర వాకిలి బయట వెలిగించమని దర్గాలో ఉన్న ఇతర భక్తులు వారికి చెప్పారు. వచ్చిన వారిలో ఒక వ్యక్తి వెలిగించిన కడ్డీలు, దర్గా లోపల సమాధుల వద్ద దీపం పెట్టే దిన్నెపై పెట్టి నమస్కరించుకున్నాడు. కొంతసేపు అయ్యాక శ్రీ స్వామివారు దీపం పెట్టటానికి దర్గా లోపలికి వెళ్ళారు. ఆ కడ్డీలు చూచి ఉగ్రులైపోయి "ఇక్కడ కడ్డీలు వెలిగించి పెట్టిన లంజకొడుకు ఎవరు?" అని అరిచారు. అక్కడున్న ఆరు మందిలో ఎవ్వరూ సమాధానం చెప్పలేదు. అంతమందిలో శ్రీస్వామివారు ఒకతని వైపు చూపిస్తూ "ఒరేయ్ బుద్ధిలేనివాడా! అక్కడ వెలిగే సాంబ్రాణీ కడ్డీలు పెట్టింది నీవేనా?" అని గట్టిగా అరిచారు. వెంటనే అతను 'నేను కాదు స్వామి' అన్నాడు. "ఈ సమాధులలో వున్న స్వాములు సత్యమైనవారు. నీవు అబద్ధం చెపుతున్నావు. సాయంకాలానికి నీ అంతు తేల్చుకుంటారు" అనేసరికి బిక్క చచ్చిపోయాడు. రెండు గంటలసేపు గుంజాటన పడి 'స్వామీ! నేనే కడ్డీలు వెలిగించాను, క్షమించండి' అని కాళ్ళ మీద పడ్డాడు.

ఒక చర్మవ్యాధి వున్న భక్తుడు వచ్చి స్వామిని శరణు వేడితే స్వామి "నా దగ్గరేముంది, ఆ సరస్సు దగ్గర మట్టి వుంది అది పూసుకొని చావు అని" అన్నారు. అతడు అలానే రాసుకుంటే ఆ చర్మవ్యాధి తగ్గిపోయింది.

హైదరాబాద్ వాస్తవ్యులు కృష్ణమోహన్‌రెడ్డిగారు 2009 - 2010 ప్రాంతాలలో స్వామి చిదాత్మగారి సాంగత్యంలో దర్గాస్వామిని దర్శించుకున్నారు. కృష్ణమోహన్ రెడ్డిగారికి హైదరాబాద్‌లో ఒక చిన్న ఫ్యాక్టరీ ఉంది. వీరు స్థితిమంతులు. స్వామిని మొదటిసారి దర్శించుకున్నప్పటికి వీరికి ఒక మగపిల్లవాడు సంతానం. అప్పటికి ఆయన భార్య గర్భవతి. సాధారణంగా గర్భం ధరించిన ఐదవ నెలలో డాక్టర్లు గర్భంలో ఉన్న పిండానికి విస్తృతమైన పరీక్షలు జరిపి పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉందో లేదో నిర్ధారిస్తారు. పరీక్షలలో ఏదైనా తేడా కనిపిస్తే బిడ్డను అబార్షన్ చేసుకోమని సలహా ఇస్తారు. కృష్ణమోహన్‌గారి భార్యకు కూడా ఈ వైద్య పరీక్షలు చేయించుకోగా లోపల బిడ్డ ఎదుగుదల సరిగ్గా లేదని అబార్షన్ చేయించుకోమన్నారు. కృష్ణమోహన్ దంపతులు స్వామివారిని ఆశ్రయించి ప్రార్థించగా స్వామి "బిడ్డకు ఏ ప్రమాదమూ లేదు. మంచి కొడుకు పుడతాడు. ధైర్యంగా ఉండండి" అని చెప్పారు. వారు స్వామి మాటను విశ్వసించి ప్రసవం చేయించుకున్నారు. వారికి ఒక మగ పిల్లవాడు పుట్టాడు. పిల్లవాడు మంచి హుషారుగా ఉండి సాధారణ పిల్లల కంటే కూడా తెలివితేటలు గలవాడై ఎదుగుతూ కృష్ణమోహన్ దంపతులకు ఆనందాన్ని చేకూరుస్తున్నాడు.

2011-2012 ప్రాంతంలో జరిగిన లీల: స్వామి ఆశీస్సుల వలన మడికేడు గ్రామంలో పుట్టిన ఒక బిడ్డకు 'దర్బార్' అని పేరు పెట్టుకున్నారు. అతనికి 2011-2012కి 33 సంవత్సరాలు. అతను కువైట్‌లో ఉద్యోగం చేసి వచ్చాడు. ఒకరోజు రాత్రి భోజనం చేస్తుంటే గొంతు పట్టుకుపోయింది. చాలా ఇబ్బంది పడ్డాడు. డాక్టరు చూపిస్తే పెద్దాసుపత్రికి వెళ్ళమని చెప్పాడు. వారు ఇక ఏదీ దారిలేక దర్గాల దగ్గరకి అర్ధరాత్రి 12గంటలకు వచ్చారు. స్వామిని దర్శనం చేసుకోవాలని శంకరయ్యకు అడిగితే 'స్వామి నిద్ర

పోతున్నారు. ఇప్పుడు స్వామిని కలవటం వీలుకాదు. మీరు దర్గాల దగ్గరకి వెళ్ళి ప్రార్థన చేసుకుని అక్కడే పడుకోండి. స్వామి రేపు ఉదయం తీర్థం ఇవ్వటానికి దర్గాల దగ్గరకి వస్తారు. అప్పుడు స్వామి దర్శనం చేసుకోవచ్చు' అని చెప్పారు. వారు దర్గాల దగ్గరకి వెళ్ళారు. శంకరయ్య తెల్లవారిన తర్వాత దర్గాల దగ్గరకి వెళ్ళి చూస్తే అక్కడ ఎవ్వరూ లేరు. తర్వాత 15 రోజుల తర్వాత మడికేడు నుండి దర్బార్, అతని బంధువులు స్వామి దర్శనానికి వచ్చినప్పుడు శంకరయ్య వారితో 'గొంతు పట్టుకు పోయినతనివే కదా!' అని అడిగి 'ఆ రోజు ఏమైపోయారు, ఎందుకు వెళ్ళిపోయారు?' అని అడిగాడు. అప్పుడు వారు 'ఆ రోజు రాత్రి మేము దర్గాల దగ్గరకి వెళ్ళి ప్రదక్షిణలు చేసి, అక్కడ ఉన్న తీర్థం త్రాగంగానే గొంతు మాములుగా అయిపోయింధి. అందువలన మేము ఆ రోజు రాత్రి మా ఊరు వెళ్ళిపోయాము' అని చెప్పారు.

శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయినాథాయ నమః

# దైవం మానుష రూపేణ

## దర్బార్ నగరంలో ఉత్సవాలు

| | |
|---|---|
| 1. శ్రీ రామ నవమి | : చైత్ర శుద్ధ నవమి |
| 2. గ్యార్మి శ్రీ దస్తగిరిస్వామి జెండా ఉత్సవం | : వైశాఖం (ఉర్దూనెలల ప్రకారం) |
| 3. దర్బార్ సాయి మందిర ప్రతిష్ఠాపన వార్షికోత్సవం | : జ్యేష్ఠ బహుళ పాడ్యమి |
| 4. గురు పౌర్ణమి | : ఆషాఢ పౌర్ణమి |
| 5. శ్రీ సద్గురు దర్గాస్వామి జయంతి | : ఆషాఢ బహుళ షష్ఠి |
| 6. శ్రీ సమర్థ సద్గురు దర్గామాతాజీ (అమ్మయ్య) ఆరాధన | : శ్రావణ మాసం ఆఖరి శనివారం |
| 7. స్వాతంత్ర దినోత్సవం (ఆగష్టు 15) | : భాద్రపద మాసం |
| 8. శరన్నవ రాత్రులు (దసరాలు) | : ఆశ్వయుజ మాసం |
| 10. శ్రీ సాయిబాబా మహా సమాధి | : ఆశ్వయుజ విజయదశమి |
| 11. దత్త జయంతి | : మార్గశిర పౌర్ణమి |
| 12. ఇంగ్లీషు నూతన సంవత్సరము (జనవరి 1 వ తేదీ) | : పుష్యమాసం |
| 13. శ్రీ సద్గురు దర్బార్ సాయి మందిర విద్యామందిర వార్షికోత్సవం | : మాఘమాసం |
| 14. శ్రీ సద్గురు దర్బార్ అలీషావలి, శ్రీ సద్గురు జలీల్ మస్తాన్‌వలీ గార్ల గంధోత్సవం ఉరుసు | : ఫాల్గుణ పౌర్ణమి |

ఉరుసు ఉత్సవం:

దర్గాలో ప్రతి సంవత్సరం ఫాల్గుణ పౌర్ణమినాడు ఇద్దరు బాబాలకు మూడురోజుల పాటు ఉరుసు ఉత్సవం జరుగుతుంది.

మొదటి రోజు : గంధము ఉత్సవము

రెండవ రోజు : జండా మెరవణి (ఉరుసు)

మూడవ రోజు : ప్రసాద వితరణ

ఈ ఉత్సవంలో ఖవ్వాలీ పాట కచ్చేరీ జరుగుతుంది.

దర్బార్ సాయి మందిరము

పరిపూర్ణావతారుడు, పరబ్రహ్మస్వరూపుడు, పరమాత్ముడు, రాజాధిరాజ, యోగిరాజ, షిర్డీ సాయినాథుడు 16-6-1998 న హజరత్ దర్బారు కోరికపై దర్బారు నగరములో భక్తులచేత నిర్మించిన సమర్థ సద్గురు దర్బారు సాయి మందిరములో ప్రతిష్ఠింపబడినారు. అప్పటినుండి తనవద్దకు వచ్చు భక్తులకు, శరణార్థులకు వారి వారి మనోభీష్టములు నెరవేర్చి, స్వప్నదర్శనమిచ్చి తరింపజేయుచున్న శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయిని దర్శించి పూజించి వారి తీర్థ ప్రసాదములు తీసుకొని వారి కృపకు పాత్రులు కావలెనని మా మనవి.

ఈ మందిర ప్రతిష్ఠ వార్షికోత్సవమునాడు షోడశ పూజలు, హోమము, పల్లకి ఉత్సవము జరుపబడును.

గ్యార్మీ పండుగ ముస్లిం క్యాలెండర్ దస్తగిరి నెలలో వస్తుంది. ఆ రోజు శ్రీ మెహబూబ్ సుభాన్ సాహెబ్ (దస్తగిరి స్వామికి) సాయంత్రం 5 గంటలకు జెండా ఎత్తుతారు.

మాఘశుద్ధ సప్తమి (రథసప్తమి) రోజున సూర్యునికి పొంగుపాలు (ఐదుపాళ్ళు బియ్యం, ఐదుపాళ్ళు బెల్లం వేసి చక్రపొంగలి) నైవేద్యం పెడతారు. సూర్యకిరణాలు పడేచోట అలికి పసుపు, కుంకుమతో చలిముగ్గు వేసి వండిన చక్రపొంగలి పెట్టి, బత్తీలు వెలిగించి, టెంకాయ కొట్టి, కర్పూరహారతి ఇచ్చి సూర్యునికి నమస్కారం చేస్తారు. తర్వాత భక్తులందరికీ ప్రసాదం పంచుతారు. ఈ సందర్భంగా వండే చక్రపొంగలిలో బాదంపప్పుగానీ, ఎండుద్రాక్షగానీ వేయకూడదని స్వామి చెప్పేవారు. సూర్యనారాయణస్వామికి పళ్ళు లేవు కనుక ఆయన తింటానికి ఇబ్బంది పడతాడు అని చెప్పేవారు.



శ్రీ సమర్థ సద్గురు సాయినాథుని ప్రథమ వార్షికోత్సవ ఆహ్వాన పత్రిక.

శ్లో॥ సదానింబ వృక్షస్యమూలాధి వాసాత్,
సుధాస్రావిణం తిక్తమప్యప్రియంతం॥
తరుంకల్ప వృక్షాధికం సాధయంతం॥
నమామీశ్వరం సద్గురుం సాయినాథం॥

పరిపూర్ణావతారుడు, పరబ్రహ్మ స్వరూపుడు, పరమాత్ముడు, రాజాధి రాజయోగిరాజు షిర్డీసాయినాథుడు ఒక సంవత్సరము క్రితము హజరత్ దర్బారు కోరికపై దర్బారునగరములో భక్తులచేత నిర్మించిన సమర్థ సద్గురు దర్బారు సాయి మందిరములో ప్రతిష్ఠింపబడినారు. అప్పటినుంచి తనవద్దకు వచ్చు భక్తులకు, శరణార్థులకు వారివారి మనోభీష్టములు నెరవేర్చి స్వప్న దర్శనమిచ్చి సర్వులను తరింపజేయుచున్న శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయిని దర్శించి పూజించి వారి తీర్థ-ప్రసాదములు తీసుకొని వారి కృపకు పాత్రులు కావలయునని మా మనవి.

23-6-99 వ తేది బుధవారము 9.00 గం॥ నుండి
ప్రాతః పూజలు. పంచామృత అభిషేకము.

12.00 గం॥ నుండి హోమము బెంగుళూరు నుండి ఆచార్యులు వచ్చి పై కార్యక్రమములు హోమములు జరుపుదురు.

సాయంత్రం 7.00 గం॥ నుండి 8.00 గం॥ పల్లకి ఉత్సవము కలదు.

కావున సర్వులు భక్తులు వచ్చి పూజలు, హోమము, పల్లకి ఉత్సవము తిలకించి శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయి కృపకు పాత్రులయ్యేది.

ఇట్లు,
శ్రీ సమర్థ సద్గురు దర్బారు సాయి భక్తులు,
దర్బారు నగరము, (నీలకంఠరావుపేట)
రామాపురం మం॥ కడపజిల్లా.

ప్రభాత్ ప్రింటర్స్, కడప.

దర్బార్ సాయినాథ మందిర ప్రథమ వార్షికోత్సవ ఆహ్వాన పత్రిక



శ్రీ సద్గురు హజరత్ దర్బార్ అలీషావలి
రహమతుల్లా అలైబాబా శ్రీ జలీల్ మస్తాన్‌వలీ
బాబా గార్ల ఉరుసు ఆహ్వాన పత్రిక

19-3-2011 తేది శనివారం గంధము ఉత్సవము
20-3-2011 తేది ఆదివారం జండా మెరవణి ఉరుసు
21-3-2011 తేది సోమవారం ప్రసాదము బిస్మిలా

[illegible]

20-3-2011 తేది ఆదివారం రాత్రి [illegible]

ఖవ్వాలి పోటీ [illegible]

శ్రీ పద్మావతి కళ్యాణ మంటపము,

[illegible] ఫోన్ : 273798, సెల్ : 9849059813

[illegible]

శ్రీ సద్గురు దర్బార్ అలీ షావలి బాబా భక్తులు

దర్గాలోని మహనీయుల ఉరుసు ఆహ్వాన పత్రిక

## గమనిక

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కడప జిల్లా, కడప నుండి రాయచోటి వెళ్ళే ఈ మార్గంలో వెళ్ళే ఆర్. టి.సి. వారి సూపర్ ఎక్స్‌ప్రెస్, నాన్‌స్టాప్ బళ్ళు కూడా ఈ ఒక్క రామాపురం మండలంలో మాత్రమే ఆగుతాయి. బస్సు ఎక్కి రామాపురం మండలం అని చెప్పి టికెట్ తీసుకోవచ్చు. ఇక్కడ నుండి నీలకంఠరావుపేట దర్గాలకి 2 కి.మీ.ల దూరం. రామాపురం నుండి ఆటో సౌకర్యం కలదు. 50-60 రూపాయలు రుసుము చెల్లించవచ్చు.

దర్గాస్వామివారి దర్శనం గురు, శుక్ర వారాలు, పండగ రోజులు కాకుండా మిగిలిన అన్ని రోజులు ఉదయం 11 గం॥ నుండి 12 గం॥ల మధ్య చేసుకోవచ్చు. స్వామివారు భక్తులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తారు.

స్వామి దర్శనం అయినాక దర్బార్ సాయినాథుని మందిరంలో మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్న ఆరతిలో పాల్గొనవచ్చు. మధ్యాహ్న ఆరతిలో దర్శనం చేసుకున్న భక్తులందరూ ఆశ్రమంలో భోజనం చేసి వెళ్ళవచ్చు. దూరప్రాంతాల నుండి వచ్చేవారు రాత్రికి ఆశ్రమంలో నిద్ర చేయవచ్చు. అధిక వివరాల కొరకు ఆశ్రమంలోని శంకరయ్యగారిని సంప్రదించగలరు.

ఆశ్రమానికి అనుబంధంగా దర్బార్ సాయి ఉన్నత పాఠశాల నడుపబడుతున్నది. ఈ పాఠశాలలో సుమారు 150 నుండి 200 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పాఠశాలలో నిశ్శుల్కంగా చదువు చెపుతారు. అదనంగా విద్యార్థులకు ఉచితంగా స్కూలు పుస్తకాలు, యూనిఫారం ప్రతి సంవత్సరం ఇవ్వబడుతున్నాయి. చుట్టుప్రక్కల గ్రామాల నుండి స్కూలుకి వచ్చే పిల్లలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఇవ్వబడుతున్నాయి. ఈ పాఠశాల విద్యార్థులందరికీ ఉచిత మధ్యాహ్న భోజన సౌకర్యం కలదు. 2003/2004 నుండి ఈ స్కూలు నడుపబడుతున్నది. 10వ తరగతిలో మెరిట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు పై చదువులకు స్కాలర్‌షిప్‌లు కూడా ఇస్తున్నారు.

ఆశ్రమానికి అనుబంధంగా శ్రీ దర్గామాతాజీ పేరిట ఒక ట్రస్టు నడపబడుతున్నది. ఈ ట్రస్టుద్వారా ఇంటర్మీడియట్ అయినాక ఇంజనీరింగ్, మెడికల్ ఎంట్రన్సు పరీక్షలలో ఉత్తీర్ణులై ప్రతిభ గల విద్యార్థులకు ప్రతి సంవత్సరము పదివేల రూపాయల రుసుము కోర్సు అయ్యేదాకా ప్రతి సంవత్సరము ఇవ్వబడుతుంది. ఈ ట్రస్టుకి ఇచ్చిన విరాళముల మీద ఇన్‌కమ్‌టాక్సు మినహాయింపు కూడా కలదు.

అధిక సమాచారం కొరకు అంతర్జాలంలో **https:\\tsrk76.blogspot.in** అను వెబ్‌సైట్‌ను దర్శించగలరు.

భక్తులవరైనా తమ అనుభవాలను పంచుకోదలిస్తే ఈ క్రింది నంబర్లలో సంప్రదించగలరు

రాజీవ్ : 99638 53330

ప్రసాద్ : 93430 97603

# మా యితర ప్రచురణలు

| | |
|---|---|
| 1 అవధూత లీల- (భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారి జీవిత చరిత్ర) | 40 రూ॥ |
| 2 అవధూత బోధామృతం - శ్రీవారి బోధలు | 15 రూ॥ |
| 3 శ్రీ స్వామి సన్నిధి - శ్రీ వారితో వారి సేవకులఅనుభవాలు | 15 రూ॥ |
| 4 అవధూత లీల(ఇంగ్లీషు) | 30 రూ॥ |
| 5 భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి (ఇంగ్లీషు, చిన్నది) | 5 రూ॥ |
| 6 వార్తాలాపము | 150 రూ॥ |
| 7 అవధూత లీల(తమిళం) | 50 రూ॥ |
| 8 శ్రీ వెంకయ్యస్వామి (తమిళం, చిన్నది) | 5 రూ॥ |
| 9 చూచి నేర్చుకో | 8 రూ॥ |
| 10 శ్రీ ధునివాలాదాదా చరిత్ర | 15 రూ॥ |
| 11 శ్రీ వెంకయ్యస్వామి పూజ | 1 రూ॥ |
| 12 వెన్నెలపూలు - శ్రీ వెంకయ్యస్వామి దివ్యత్వం | 1 రూ॥ |
| 13 దివ్యలీలలు | 1 రూ॥ |
| 14 బోధ యజ్ఞాయనము: | 1 రూ॥ |
| 15 ధర్మమూర్తి | 1 రూ॥ |
| 16 పిలిచిన పలికే దైవం | 1 రూ॥ |
| 17 శ్రీ శివనేశన్ స్వామీజీ దివ్యచరితము | 12 రూ॥ |
| 18 శ్రీ స్వామికృప | 1 రూ॥ |
| 19 మౌనబోధ | 1 రూ॥ |
| 20 గురుస్తుతి | 7 రూ॥ |
| 21 శ్రీ బూర్లె రంగన్నబాబుగారి దివ్యచరితము | 6 రూ॥ |
| 22 శ్రీమాధవదాసుగారి దివ్యచరిత్ర | 4 రూ॥ |
| 23 శ్రీ పూండీ స్వామి వారి దివ్యచరిత్ర | 2 రూ॥ |
| 24 శ్రీ యర్ర దర్గాస్వామి వారి దివ్యచరిత్ర | 5 రూ॥ |
| 25 నమ్మలేని పచ్చి సత్యాలు | 1 రూ॥ |
| 26 శ్రీ స్వామివారి భజన పాటలు | 1 రూ॥ |
| 27 శ్రీ నరోపా గారి జీవిత చరిత్ర | 2 రూ॥ |

## 1 రూపాయి పుస్తకములు

1. మాస్టరుగారి సత్సంగము
2. శ్రీ మాస్టారి మంచి మాట
3. అమృత వాక్కులు
4. మృత్యువుపై ఘన విజయము
5. స్మృతిమాత్ర ప్రసన్నాయ నమః
6. స్మృతి రహిత ప్రసన్నాయ నమః
7. సర్వ సమర్థుడు
8. శ్రీ భరద్వాజగారితో భక్తులఅనుభవాలు
9. శ్రీ కృష్ణయ్య స్వామి దివ్య చరిత్ర
10. శ్రీ వెంకయ్యస్వామి (హిందీ)
11. చూచి నేర్చుకో
12. ఊర్ధ్వ చైతన్యమే తానైన పూజ్య శ్రీ భరద్వాజ మాస్టారు గారు
13. శ్రీ మాస్టరు చూపిన సాయి మార్గం